అమ్మ జీవిత మహోదధి



విశ్వజనని ట్రస్టు, హైదరాబాద్

అమ్మ జీవిత మహోదధి

(జిల్లెళ్ళమూడి అమ్మ పరమాత్మకథ)

ప్రకాశకులు

విశ్వజననీ ట్రస్టు, హైదరాబాదు



యార్లగడ్డ భాస్కరరావు

2, ఫిబ్రవరి.1994

అమ్మ చరిత్రను కంప్యూటర్ మూలకంగా ముద్రణ చేస్తున్నారనే విషయం తెలిసి నాకు ఆనందం కలిగింది.

అమ్మ చరిత్ర షుమారు 15 నోటు బుక్కులతో వ్రాసాను. అన్నీ నేనె వ్రాశాను. వీటిలో అక్కడక్కడ షుమారు 4 చోట్ల అరపేజీ ఒక అమె వ్రాసినారు. ఒకసారి అమ్మ నాతో "నాన్నా మేము రాస్తామని పుస్తకం తీసుకున్నారు. కొంచెం చెప్పిన తరువాత నాకు చెప్పటానికి రాలేదు. అయినా ఒకచేతిమీదుగా జరగాలి" అన్నారు.

నేను అమ్మ దగ్గరకు వచ్చి 35 సంవత్సరాలయింది. అమ్మ చరిత్ర అమ్మచెపితే నేను వ్రాసాను. నా భావాలు యేమి వ్రాయలేదు. వ్రాసేటప్పుడు భావం అర్ధగతం అవుతూ వుండేది. తరువాత నేను చదువుతుంటె ఆనందం పరవశం దుఃఖం యిలాంటివి కలుగుతుండేవి.

అమ్మ జిల్లెళ్లమూడిలో అక్కడ వున్న వారితో 'యిపుడు భాస్కర్ వస్తే బాగుండు' అనేదట. నాకు సింగుపాలెంలో అమ్మ దగ్గరకు వెళ్లాలని అనిపించి వచ్చే వాణ్ణి. కొన్నాళ్ళు వ్రాసి వెళ్ళేవాణ్ణి. యిట్లా కొన్ని సంవత్సరాలు జరిగినాక జిల్లెళ్ళమూడిలోనే ఉండి పోయాను. వీలయినప్పుడల్లా వ్రాశేవాడిని.

అమ్మ ఇతరుల మనస్సులలో జరిగే ఆలోచనలు వ్రాయించేటప్పుడు అమ్మ మాటలే నాకు వినిపించేవి వారి మనసులు నాకు తెలియవు. ఇతరుల సంభాషణ, ఉః చిదంబరరావుగారి సంభాషణ లాంటివి, అమ్మగొంతుకాకుండ ఇతరుల వారివారి పరస్పర ధ్వనులతో వినపడేవి. అమ్మ ఇప్పుడు శరీరంతో లేకున్నా 'అమ్మ వున్నది యెప్పుడూ వుంది' అనే నమ్మకం నాకు వున్నది.

అమ్మ నిర్యాణం రోజున విమానం అమ్మ మేడమీద ఆగినట్లు ధ్వని విన్నాను. అమ్మ ఇది జరిగే 25 సంవత్సరాలు ముందే "నాన్నా నేను వెళ్ళేటప్పుడు విమానం వస్తుంది" అని చెప్పింది.

- యార్లగడ్డ భాష్కరరావు వ్రాలు

మన్నవ బుచ్చిరాజు శర్మ

2.10.1994

అమ్మను అనేక మంది అనేక విధాలుగా దర్శించి ఆమె గుణగణాలను కీర్తించారు, రచనలు చేశారు, ఆమె భవ్యతత్వాన్ని గానాలాపనం చేశారు. కాని ఆమెను, ఆమెలో ఒక భాగమై అతి దగ్గర నుండి అతి సూక్ష్మంగా ఆమె జీవితాన్ని గమనించి, ఆమె జీవిత మహోదధిలోని తరంగాలలో తనూ తేలుతూ మునుగుతూ, ఆ అటుపోట్లకు తనూ స్పందిస్తూ. ఆమె పవిత్ర చరిత్రను కొంతవరకైనను మనకందించిన మహానుభావుడు కారణజన్ముడు శ్రీ "రహి". శ్రీ "రహి", నిజానికి ఒక ప్రత్యేక వ్యక్తి అని నాకనిపించదు. ఎందుకంటే అంత సూక్ష్మ వివరణ చేయాలంటే 'రహి' కూడా అమ్మ కాకుండా, వేరుగా ఉండటానికి వీలులేదు. అందుచేత అమ్మే రహి అయి ఉండాలి. కాని, నా అనుభవం వివరిస్తాను. ఒక రోజు నేను నాన్నగారి కరణీకపు లెక్కలు పూర్తిచేసి కరణీకపు దస్తరము వ్రాతబల్ల మీదపెట్టి, దూరంగా కూచున్న అమ్మ వద్దకు వచ్చాను. ఆమె ఎవరితోనో విషయాలు, ముచ్చటిస్తూ ఉంటే వింటూ కూచున్నాను.

సమయం సాయంత్రం గం. 6 - 6.30 అయి ఉంటుంది. అప్పుడు, వ్రాతబల్ల వద్ద నుంచి ఒక వ్యక్తి బయటకు వెళ్తున్నాడు. అతనిని చూపిస్తూ ఆ వ్యక్తే "రహి" అంది. పైగా అతనిని గుర్తు పెట్టుకోమని కూడా నాతో చెప్పింది. అతని వివరాలు అడిగినా అమ్మ చెప్పలేదు. మరల అతనిని నేను చూడలేదు. ఇది జరిగింది 1956 అక్టోబర్ - నవంబర్‌లో ఈ చరిత్రలోని అనేక ఘట్టాలు, విషయాలు చాలా హృదయ విదారకంగా ఉంటాయి. కొన్ని ఇట్లా జరగటానికి అవకాశం, ఆస్కారం ఉందా? అని కూడా అనిపిస్తుంది. కాని అవి నిజంగానే జరిగినవి అని నమ్మకం కలగటానికి నాకున్న కొద్ది అనుభవాలలో ఒకటి మనవి చేస్తాను. నాన్నగారు పొగాకు పండించేవారు. పొగాకు రైతులు పొగాకును బ్యారన్లలో "క్యూరు" చేసేవారు. నాన్నగారికి కూడా ఇంటి ఆవరణలోనే బేరన్ ఉండేది. నేను పొగాకు కంపెనీలో (ఐ.యల్.టి.డి. కొవ్వూరులో) పనిచేస్తుండేవాడిని. జిల్లెళ్ళమూడి అమ్మ వద్దకు వచ్చినప్పుడల్లా బేరన్ క్యూరింగ్ చూడటం, పొగాకు గ్రేడింగు చూడటం జరుగుతుండేది. 1957 ఫిబ్రవరి - మార్చి సమయంలో ఒక ఆదివారం నేను అక్కడ ఉండటం తటస్థించింది. అమ్మ ఇంట్లో లేరు, ఎక్కడకు వెళ్ళిందో తెలియదు. బహుశః మరుగుదొడ్డికి వెళ్ళిందని అనుకున్నాను. ఆమె వచ్చేలోపల, కుతూహలం కొద్దీ బేరన్ బాగా రైజింగ్‌లో

అంటే 140 డిగ్రీల సెం.లో ఉంది. బేరన్ తలుపు తీశాను. అమ్మ బేరన్ మధ్యలో పడి ఉండటం చూసి, నిశ్చేష్టుడనయ్యాను. కొద్దిసేపటికి అమ్మ మెల్లిగాలేచి జోగుకుంటూ బయటకు వచ్చింది. అమ్మ ముఖం బాగా కమిలి నల్లబడి ఉండటం చూశాను. బేరన్ తలుపులు మూసి నేను అమ్మను అనుసరించి, ఇంట్లోకి వచ్చాను. ఆమె చెప్పిన దానినిబట్టి, దానికర్తలు ఎవరో నాకు తెలిసింది. ఈ చరిత్ర చదువబోతున్న, చదివినవారికి వారు ఎవరో ఈపాటికి అర్థమయి ఉంటుంది.

ఈ చరిత్ర చాలాభాగం అమ్మ, స్వయంగా నాకు (వినిపించి) చెప్పి ఉండటం చేతనూ, సంధ్య వెలుగులో శ్రీ 'రహి'ని, లీలగా నేను గమనించటంవల్లనూ ఈ చరిత్రలోని కొన్ని ఘట్టాల వంటివాటితో నాకు ప్రత్యక్ష అనుభవం ఉండటం వల్లనూ, ఈ చరిత్రలో మనకు కనిపించే వ్యక్తులలో అమ్మ వద్దకు వచ్చే చాలా మంది బిడ్డలకు వలె, నాకు కూడా దగ్గరగా గమనించే అనుబంధం ఉండటం వల్లా, ఈ చరిత్ర గ్రంథస్థం కాకమునుపు, అమ్మ సహజ సహనానికి మెరుగుపెట్టే సంఘటనలను 'రాజా' అనే అమ్మ చేత పిలవబడుతూ ఆ పేరుతోటే వాటిని "అనుభవసారం"లో గ్రంథస్థం చేసే మహద్భాగ్యం నాకు కలగటం వల్లా ఈ గ్రంథంలోని ప్రతి సంఘటన ప్రతి అక్షరం కూడా నిత్యసత్యం అని నేను మనవి చేసుకుంటున్నాను.

"అం ఆ".

- మన్నవ బుచ్చిరాజు శర్మ

మన్నవ కామేశ్వరమ్మ

తేది 26.9.1994

మన్నవ గ్రామం, గుంటూరు జిల్లా

అమ్మ - జిల్లెళ్ళ మూడి, ఆత్మకథ, తానే స్వయంగ శ్రీ యార్లగడ్డ భాస్కరరావు గారిచే వ్రాయించిన పదిహేను పుస్తకాలను, యధాతథంగా కంప్యూటరు ద్వారా ముద్రించ నున్నారని తెలిసి నాకు చాలా సంతోషం కలిగింది.

అమ్మకు నేను సవతి తల్లినైనా, అమ్మను సుమారు ఏడు, ఎనిమిది సం॥ వయస్సు నుండి నాకు స్వంత కూతురుగానె పెండ్లి వరకు చూచుకున్నాను. మొదట్లో నేను అమ్మను తెలుసుకోలేకపోకున్నా కొంతకాలం తరువాత నా తప్పులను తెలుసుకుని అమ్మ అతి మానవ మాధవ స్థితులను మనసార స్తుతించె సదవకాశము నాకు కల్పించినందుకు నేనెంతో గర్విస్తున్నాను. అమ్మ పరమాత్మ స్వరూపంగానె, అకారణ కరుణామయిగా, అవతరించిన మాతృమూర్తిగా, మరియొకసారి పరమాత్మ స్వరూపిణిగా, ఆమె అనంత సహనము, మూర్తీభవించిన విశ్వమాతృక స్థితులను నేను అంచలంచెలుగా అర్థం చేసుకున్నాను. కాని కొన్ని సమయాలలో అమ్మ మాయగప్పి అతి సాధారణ వ్యక్తిగా నాతో మాట్లాడేది. అమ్మ అనుభవించిన బాధలు, సహించిన జీవన జీవితాల ఒడిదుడుకులు అనూహ్యాములు.

ఈ చరిత్రలో నాపాత్ర యధాతథంగా వ్రాయించింది. తెలిసీ తెలియని మూఢత్వంలో అమ్మపట్ల నా ప్రవర్తనల వివరాలు సత్యములు. నేను అమ్మను పూజించి తరించాను. ఈ జన్మకు ఇది చాలు.

- మన్నవ కామేశ్వరమ్మ

కె.బి.జి. కృష్ణమూర్తి

19.09.1994

జిల్లెళ్ళమూడి, బాపట్ల

అమ్మ జీవిత చరిత్ర పదిహేను నోటు బుక్కులలో, అమ్మే స్వయంగ తన వాఙ్మూలంగా వ్రాయించిన విషయం అందరికీ తెలిసినదే. ఈ చరిత్రంతా అమ్మ శ్రీ యార్లగడ్డ భాస్కరరావు అన్నయ్యగారికి చెపుతుంటే నా సమక్షంలో మరియు అప్పుడప్పుడు ఇతరుల సమక్షంలో వ్రాయిస్తున్నప్పుడు నాకు ఆశ్చర్యాన్ని కలుగచేసేది. అమ్మ చెప్పేమాటల శబ్దము మేము మంచం దగ్గర అంటే అమ్మ పాదాలవైపు కూర్చున్నప్పుడు మరియు పండుకుని చెప్పేటప్పుడు అమ్మ తల దగ్గరే వున్నా మాకు సరిగా వినిపించకపోవడం, అక్కడ కూర్చున్న భాస్కరరావు అన్నయ్యకు మాత్రం వినిపించడం ఒక అత్యద్భుత సంఘటన నేను అమ్మను ఒకసారి 'ఇది ఎట్లా వ్రాస్తున్నారు అన్నయ్య' అని అడిగితె 'వాడికి అందరి సంభాషణ చెవుల్లో మాట్లాడుతున్నట్లు, వాడి చెవుల్లో వినిపించి వ్రాస్తున్నాడని సమాధానం యివ్వడం జరిగింది. నీవు ఎట్లా చెప్పగలుగు తున్నావంటె ''నాకు తెరపై ఇప్పుడు జరుగుతున్నట్లుగా కన్పిస్తున్నది. వినిపిస్తున్నది. మనసుకు అవగతమవుతున్నదని' ' చెప్పడం జరిగింది. సుమారు అమ్మ గర్భంలో వున్నప్పటి నుండి, అమ్మ పద్దెనిమిదవ సంవత్సరం వయస్సు వరకు జరిగిన చరిత్ర అంచలంచలుగా వ్రాయించడం, ఒక్కొక్క సమయాల్లో, ఆయన (భాస్కరరావుగారు) ఆ సంఘటనల తీవ్రతకు మనస్సు చలించగా వ్రాయలేక ఏడుస్తుండటం చూచి నాకు దిగ్భ్రమ కలిగేది. ఎప్పుడో జరిగిన సంఘటనలు అప్పుడు ఆ వ్యక్తుల మనస్సులలో నుండి వెలువడిన భావాలు, స్ఫురించిన విషయాలు, అమ్మ సమక్షంలో లేకుండా అమ్మను గూర్చి వాళ్లు పరస్పర సంభాషణ చేయటం, సంభాషణే కాకుండా అమ్మను గూర్చి ఉద్భవించిన ఆలోచనలు నీకు ఎట్లా ఇప్పుడు వారి వారి మాటల యాసలతో, వారి వారి మాటల ధ్వనులలో ఎలా చెపుతున్నావు భాస్కరరావు అన్నయ్యకు, వారి మాటలే ఎలా వినిపిస్తున్నవి అని ప్రశ్నించగా, అమ్మ అన్నారు. ''నేను అదంతా ఇప్పుడే జరుగుతన్నట్లు నేను చూస్తున్నాను వింటున్నాను''. భాస్కరరావు వింటున్నాడు అని అన్నారు. అమ్మ మాటలు గూడ వ్యవహారిక శైలిలో, గ్రామ్యంలో వుండటం బహుశః పామరులకై వ్రాయించింది కాబోలు అని ఇప్పుడనిపిస్తున్నది.

నేను ఆగష్టు 15, 1960లో అమ్మను జిల్లెళ్లమూడిలో దర్శనం చేసుకున్నా 1963లో అమ్మ దగ్గరే నివాసం ఏర్పరుచుకుని అమ్మకు ఒక అంగరక్షకుడిగా ఉండాలనే కోర్కెతో సాధ్యమైనంత వరకు అమ్మ సమక్షంలో ఉంటూ ఉన్నాను. ఆ సమయంలో ఎన్నో అద్భుత దర్శనాలు, విశ్వరూప దర్శనాలు బహుశః నాకేగాక అక్కడికి వచ్చిన ఇతర భక్తులకు కూడా కల్గటం ఒక అసాధారణ సంఘటనలుగా నిలిచిపోయినాయి. "ఈ దర్శనాలు నాకు ఎందుకిచ్చావు అని అడిగితే" అది 'అకారణం" అని అమ్మ శలవిచ్చారు. నేను ఒక దాస్యభావంతో అమ్మ వద్ద గడుపుతున్నప్పుడు నా సోదరతుల్యుడైన కొండముది రామకృష్ణ నాకంటే మొదలే అమ్మ వాత్సల్యపాత్రుడై వుండటం, అమ్మ మాతృత్వాన్ని సర్వాణిగ గుర్తించిన అనుభవాలను ప్రచారం చేయాలనే భావన మాలో ఉద్భవించి ఎన్నో విషయాలను తెలుగులో వ్యాసాల రూపంగ రామకృష్ణ వ్రాయటం, నేను ప్రచురించడం మొదలైంది. సంస్థాపరంగ అమ్మను సామాన్య జనసమూహానికి అందుబాటులో వుండేట్టు చేసే ఏర్పాటు ప్రయత్నాలు సాగించాము. నేను, రామకృష్ణ పరస్పర అవగాహనలతో అమ్మ సేవలో నిమగ్నమయ్యే సౌభాగ్యాన్ని అమ్మనే మాకు కల్పించినందుకు ఈరోజు వరకు చెదరని భక్తి భావనతో నన్ను ఉంచిందని, సర్వకాల సర్వావస్థలందు అమ్మ 'కరుణారసాన్ని" అస్వాదించే స్థితి ప్రసాదించిందని, ముందు గూడ ఇలాగే వుంచుతుందనే విశ్వాసంతో కాలం గడుపుతున్నాను. ఇలాంటి సౌభాగ్యమే బుచ్చిరాజు శర్మ గారికి, వారి సతీమణికి, అధరాపురపు శేషగిరిరావు గారికి మరెందరికో కల్గింది.

మరియొక విచిత్ర మేమంటె, అమ్మ భౌతికకాయాన్ని చాలించిన తరువాత కూడా అమ్మను గూర్చి ప్రారంభించిన ఒక మహాయజ్ఞంలో నన్ను నిమగ్నుణ్ణి చేయడం, యార్లగడ్డ భాస్కరరావుగారు వ్రాలుచే గ్రంధస్థం చేయబడ్డ ఈ మహాచరిత్ర ఆ చరిత్రలో ఎందరో మహర్షులు, మహర్షిణులు అమ్మను సృష్టికర్తగా, సర్వాణిగ, పరబ్రహ్మగ, బ్రహ్మపదార్ధం, బ్రహ్మతత్వంగా, అన్ని రూపాలు, అన్ని గుణాలు అమ్మవే అని గుర్తించే దివ్యజ్ఞానాన్ని పొందే స్థితిని అమ్మ నుండె పొంది, ఈ చరిత్రలో భాగంగ వున్నారనే విషయం నాకు ఇప్పుడే తెలిసింది. నాకు కలిగిన అనుభవాలు ఎన్నడో అమ్మ బాల్య స్వరూపిణిగా ఉన్నప్పుడే ఇతరులకు కూడ అమ్మే యిచ్చిందని ఈ ప్రూఫులు దిద్దటం ద్వారా నాకు ఆశ్చర్యాన్ని కల్గించింది. అన్నింటికీ 'తరుణమే' కావాలనే అమ్మ వాక్యము - బ్రహ్మవాక్యము నా అనుభవంలో నాకు నిర్ధారణైంది. పద్దెనిమిది వందల (ఎ-ఫోర్) పేజీల ఈ ఉద్గ్రంధం. ఆధునిక

వైజ్ఞానిక పరికరాలను ఉపయోగిస్తూ కంప్యూటరు ద్వారా వీటిని డిస్కులలో నిల్వచేసి వాటిలోని అమ్మ జ్ఞానకణికలను, ఆధ్యాత్మిక విషయాలను మాత్రం ప్రజలకు, ప్రాజ్ఞులకు, విజ్ఞులకు, జిజ్ఞాసువులకు అందింపచేసి ఆ ఖర్చును తామే స్వయం కష్టార్జితం నుండి ఖర్చుచేసిన ఒక అజ్ఞాత భక్తుడు నన్ను ప్రూఫులు దిద్దటానికి ఎన్నుకున్నందుకు నాపై అమ్మ కరుణ యింకా వుందనే భావనే సూచిస్తున్నది. ఈ జ్ఞానకణికలను ప్రపంచవ్యాప్తంగా కొన్ని అంతర్జాతీయ సెమినార్లద్వారా విజ్ఞులకేగాక పామరులకు గూడ అందుబాట్లో ఉండేట్టు పెక్కు దేశభాషలలో తర్జుమా చేయించి కంప్యూటర్ల డిస్కులలో పదిలపరిచే మహాయజ్ఞ ప్రారంభంలో ప్రజ్వరిల్లబోయే పవిత్ర జ్వాలలో ఆహుతయ్యే ఆజ్య బిందువుగానైన ఉపయోగపడే అవకాశం కల్గించిన అమ్మకు నేనేమి 'నివాళ్ళు' అర్పించుకోగలను? ఈ విశ్వమే తానైన 'అమ్మ' దృష్టిలో నేను ఏమిలెక్క? అగణిత అయిన అమ్మ నన్ను గణితుణ్ణి చేస్తుందా? చేయకపోయినా ఏమిలే? ఈ జన్మకు ఇది చాలు - భావి జన్మ చింత లేదు. ఈ ''తృప్తే'' నాకు ''ముక్తి'' అని అనిపిస్తున్నది.

- కె.బి.జి. కృష్ణమూర్తి



ముందు మాట

పరమహంస రామకృష్ణుల జీవితం పసందుగా రాసిన క్రిష్టఫర్ ఇషర్‌వుడ్ "అవతారమూర్తులు తమ కథల్ని తామే రాస్తే ఎంత బాగుండును!" అని దిగులుపడి, ఒకింత విచారం వ్యక్తం చేశారు. అయితే దీనికి మినహాయింపులు లేకపోలేదు. వాటిలో అద్భుతమైనది ఈ 'అమ్మ జీవిత మహోదధి'. ఎన్నో దిశల అపూర్వత వున్న అమ్మ కథ దీనికి ఇదే సాటి అని తోస్తుంది. పురాణ ఫక్కీలో చెప్పాలంటే, అమ్మ అనసూయా దేవి స్వయంగా చెప్పి తన కథని మనకు ప్రసాదించిన సమకాలీన 'దేవీ భాగవతం' ఇది.

విశ్వ జనని తన జీవిత మహోదధి లోంచి కొన్ని కథల్ని చిలికి తన వాణి ద్వారానే మనకు వినిపించటం, అది ఈ పుస్తక రూపం పొందటం భక్తులకు, సాధకులకు కల్ప తరువు, కామధేనువు. జిజ్ఞాసులకు పసిడి పంట; పరిశోధకులకు మేధస్సుకు పదును పెట్టే "క్షురస్య ధారా". వేదరూపిణి అమ్మ శ్రుతులలో సత్యాలకి చైతన్య దర్పణం. తన స్మృతిని ప్రజ్వలింప చేసి విశదంగా, వివరంగా చెప్పటం వల్ల ఈ మహోదధి శ్రుతి, స్మృతుల తరంగాలను సొగసుగా మేళవించిన అఖండ, అంతర్ముఖ చైతన్య సాగరం అయింది.

శ్రుతి అంటే శ్రవణం కనుక ఈ పుస్తకానికి సామ్యం కనిపించే ఇటువంటి ఇతర గ్రంథాలకన్నా దీనికి మరింత అపూర్వత చేకూరింది. వ్రాయసకాడు యార్లగడ్డ భాస్కరరావు వివరణ ప్రకారం "అమ్మ చరిత్ర సుమారు 15 నోటు బుక్కులలో వ్రాసాను. అన్నీ నేనే వ్రాసాను. నేను అమ్మ దగ్గరకు వచ్చి 35 సంవత్సరాలయింది. అమ్మ చరిత్ర అమ్మ చెబితే నేనే వ్రాసాను. నా భావాలు ఏమీ వ్రాయలేదు."

ఆ విధంగా శ్రవణ మాధ్యమం ద్వారా మనకి లభించిన విశ్వజనని కథామృతం ఇది. రామకృష్ణ కథామృతాన్ని మహేంద్రనాధ్ గుప్త తన దినచర్యలో నమోదు చేసుకొన్న అంశాల ద్వారా రూపొందించారు. పరమహంస భాషని, భావాలని యధాతథంగా వ్యక్తం చేశారు. మరి అమ్మ స్వయంగా వివరించటం వల్ల సందిగ్ధత పోయి. వారి భాష, భావాల సొగసు, సూక్ష్మం ఎవరి ప్రమేయం లేకుండా మనకి అందాయి. శబ్దాలకి అర్థాలు, టీకా టిప్పణులు, తాత్పర్యాలు, వివరణలు : ఎవరి స్థాయిని బట్టి, అవసరాలను బట్టి వాళ్ళు సమకూర్చుకుంటారు - సాధన ద్వారా. ఎవరి చెంబు పరిమాణం వాళ్ళది. "ఇదంతా మాకు జీర్ణం కాదు స్వామీ!" అని అనుకునే వాళ్ళు కూడా ఇది రోమాంచితం. ఆశ్చర్యం కలిగించే కథ కింద చదివినా. పుణ్యం-పురుషార్థం అలవోకగా వస్తాయి.

అమ్మ కథన రీతి, ధ్వని అసంకల్పితంగా ఆకట్టుకుంటాయి. తెలుగు భాషలో - ఏ భాషాభిషక్కుల భేషజం కనిపించని అమ్మ భాషలో - ఎంత మాధుర్యం ఉన్నదో తిరిగి మాటల్లో చెప్పటం కూడా కుదరదు. మాటలని విరిచి, మాటలలో లేని మర్మాలని ఆ మాటల ద్వారానే వ్యక్త పరచి, మాటలకి అందని, లొంగని చైతన్యంలో ముంచటం, తన ఒడిలో మనల్ని తేల్చటం, అమ్మ "మేజిక్". రోజూ మన నోళ్ళలో నానే శబ్దాలకి ఇన్ని మతలబులు ఉన్నాయా అని ఆశ్చర్యపోతాం. అమ్మ కాపీరైటు అమ్మదే. అది కాపీ చేసే రైటు ఆమె భాస్కరరావు గారి ద్వారా మనకి ఇవ్వటం మనందరి అదృష్టం. అమ్మ చెప్పినది వింటూ శ్రద్ధగా "వ్రాసేటప్పుడు భావం అవగతమవుతూ ఉండేది - తరువాత నేను చదువుతుంటే ఆనందం, పరవశం, దుఃఖం లాంటివి కలుగుతుండేవి" అని తన అనుభవాన్ని చెప్పారు భాస్కరరావు గారు. ఈ మహత్కార్యానికి అమ్మకి చిక్కటం భాస్కరరావు గారికి చిదానందం అయితే, దానివల్ల మనకి చిక్కిన ఈ మహోదధి మనకి చిరంతనానందం!

"వినటం ద్వారా వ్రాస్తే శాస్త్రం: కనటం ద్వారా వ్రాస్తే అనుభవం". "వినటం" పరిధిలో ఈ గ్రంథానికి మరొక అపూర్వత వున్నది. ఇది రోమాంచితం కలిగించే అద్భుత చమత్కారం, అమ్మ లీలా వినోదంలో ఒక "ఝలక్"! "ఇతరుల మనస్సులలో జరిగే ఆలోచనలు వ్రాయించేటప్పుడు అమ్మ మాటలే నాకు వినిపించేవి. వారి మనస్సులు నాకు తెలియవు". అయితే ఆ ఇతర "పాత్రల" మాటలు వాళ్ళ గొంతుకలతోనే వినటం ఒక అపూర్వ అనుభవం. ఇది ఊహాతీతమైన అద్భుతం. విశ్వం విశ్వజనని వినోద సృష్టి కనుక అన్ని రూపాలూ ఆమెవే, అన్ని గొంతులూ ఆమెవే. ఇతరుల "సొంత" గొంతుకలు, వ్రాస్తున్న భాస్కరరావు గారికి వినిపిస్తే ఆ గొంతుకల ఆసాముల రూపాలు అమ్మకి కనిపించి ఉండవా? "ఒకటే అనేకమైంది" "యెట్లా చూచేవారికి అట్లా కన్పడ్డాను" అన్నారు అమ్మ.

ఒక సామ్యం తోస్తోంది. ఒక మహనీయుడి సాంగత్యం నాకు లభించింది. వారి అభిమానులు ఒకరు ఒక రచన చేశారు. ఆ రచనని ఏ విధంగా ముగించాలి అన్న శంకతో ఆ అభిమాని వీరిని అడిగారు. "ఆ రచనలో పాత్రల్ని పిలుస్తా. మీరే మాట్లాడి తేల్చుకోండి" అన్నారు నవ్వుతూ ఆ మహాత్ములు. ఏది మహానుభావులకు సాధ్యం కాదు అని అనుకున్నా.

ఈ సంపుటాల్లో ప్రతీ అక్షరం, ప్రతీ సంఘటన, సన్నివేశం మాతృత్వాన్ని సూచిస్తూ, శక్తి స్వరూపిణి అయిన అమ్మ దివ్య వ్యక్తిత్వాన్ని ఆవిష్కరిస్తాయి. అమ్మ సర్వ దేవదేవీ స్వరూపిణి అన్న అనుభూతి కలిగిన ఘట్టాలు ఎన్నో ఉన్నాయి. ఒక

పూజారి "లలితా సహస్ర నామము చేత పట్టుకొని తను అమ్మకు చేస్తున్నట్లుగా నామాలు చెపుతారు. ఒక్కొక్క పువ్వు పట్టుకొని నామాలు చెపుతూ అమ్మ వంకనే చూస్తూ తను అమ్మకే చేస్తున్నట్లు" చేయటం. నారికేళం వారికే సమర్పించటం!

సమస్త సృష్టి కర్త్రిణి తన అభయ హస్తాన్ని అన్ని జీవులకీ విస్తరించటం సాధారణంగా కనిపించినా, అసాధారణ వ్యక్తీకరణ. పసితనంలోనే విషజీవి తేలుపై అమృత హస్తం. ఇంతేకాదు చెట్టు, చేమ చిన్మయ రూపాలు కాని మానవీయ స్పందనలతో సామ్యం ఉన్న స్పందనలు. పూలు కొయ్యటానికి కొమ్మ ఒంచితే అమ్మతో గుసగుసల ధ్వని. ఇది మనసు కలిగించే భ్రమ అని అమ్మ మనకి భ్రమ కలింగించేటట్లు తలిస్తే "కాదు సుమా!" అన్నట్లు "పువ్వు కోస్తే చెమ్మ!" కొమ్మ వేదన కారణంగా. వేదనా? కాదేమో! అమ్మ స్పర్శకి పెల్లుబికిన "హసిత భాష్పాలు" ఇవి అనిపిస్తుంది.

నాకు గిలిగింతలు పెట్టి, సగటు ఆలోచనా పరిధుల్ని గిరగిరా త్రిప్పి ఒక నూతన ధృక్పథం కలిగించినది అమ్మ. సున్నితం-తరచు సునిశితం అయిన హాస్యం. ఎన్నో సూక్ష్మాలు దీని ద్వారా దర్శిస్తాం. ఒక్కొక్కసారి ఇది శబ్ద చమత్కారం అనిపిస్తుంది. ఆ విధంగా తట్టాలనే ఆమె తలపు, సంకల్పం అయి ఉండచ్చు. అమ్మ మహా మాయకి ఆలంబనం శబ్దార్థాలు "వైఖరి" స్థాయి దగ్గర ఆగిపోవటం. ఆ వైఖరి దాటి వెళ్ళనివ్వరు అమ్మ! పరా శబ్దం "పరిధి"లో మాట్లాడినా సంబంధిత అర్థాన్ని శబ్దాలని విరిచి, విస్తరిస్తుంది అమ్మ. చిదంబరరావు గారు కొరుకుడు పడని "బ్రహ్మ సత్యం జగత్తు మిథ్య" అన్న విషయాన్ని లేవదీస్తారు. "మీరు ఆత్మబోధ" అంటూ వ్రాశారుగా? ఆత్మకే బోధ చేసేవారు మీకేమిటి అర్థం కాకపోవటం?" అని మందంగా మొదలెడుతుంది మాతృమూర్తి.

ఒకింత చురుక్కుమనే వైఖరి. కాని అమ్మ హాస్యం వెటకారం కాదు. ప్రయోజనకరమైన వ్యంగ్యం. "ఆత్మబోధ చదవటం, వ్రాయటం వరకు బాగానే ఉన్నది. కాని అతి ముఖ్యమైనది ఆ బోధ యొక్క సారాంశానుభవం - అది ప్రత్యేకించి అమ్మ రూపంలో ఎట్టఎదుట కనిపిస్తుంటే - దాన్ని "కని" చైతన్యంలో పెట్టటం: "కనిపెట్టటం" - ఇదీ అమ్మ సూచన. అయితే సూచనతో ఆగరు: "నాకు మాటలతో చెప్పటం చేతకాదు తాతగారు" అని ప్రారంభించి ఆ చిదంబరరావు గారిని ఒక కుదుపు కుదిపి ఆయన రచన అనుభవం నుంచే సూక్ష్మం వెలికి తీస్తారు: "మీరు ఆత్మను కలంగా, కాగితంగా, సిరాగా, పాళీగా, అక్షరాలుగా పంచారన్నమాట. పంచబద్ధాయంటారా? అప్పుడు ఆత్మకు ఆత్మతో, ఆత్మకు బోధ చేశారు. బోధ అనేది ఇవన్నీ "అంటుంది". బాధ గురువు కాక బోధ గురువు" అయిన అమ్మ.

రచన అంటే (ఏ రకమైనదైనా) ఆత్మ బోధే కదా! సూక్ష్మం గ్రహిస్తారు చిదంబరరావు గారు. కానిది లేదనేగా. అమ్మా నువ్వు చెప్పింది" అంటారు. అమ్మ అంత చప్పున ఒప్పుకుంటుందా? ఎందుకంటే కానిది లేదని అంటే "లేనిది కాదని" కూడా ఒప్పుకోవాలి. ద్వంద్వ ప్రపంచం. ఔననక, కాదనక అమ్మ "ఆ అంతే అనుకుంటా. మాటలతో చెప్పటం చాత కాదు".

"మాటలతో చెప్పలేక పోవటం" ఉత్ప్రేక్ష కాదు. ఎందుకంటే "చెప్పలేక పోవటం" అన్న అశక్తతని కూడా మాటలే చెపుతాయి! పరమహంస రామకృష్ణులు చెప్పినట్లు ఒక్క బ్రహ్మ జ్ఞానానుభవం తప్ప మిగతావన్నీ శబ్దాల పాలబడి ఉచ్ఛిష్టం అయినవే. భాష, దాని స్వరూప స్వభావాలు, ప్రయోజనం: ఈ విషయం గురించి అనితరసాధ్యమైన విషయాలు వెల్లడించిన పాశ్చాత్య తత్వవేత్త, గణిత శాస్త్రజ్ఞుడు అయిన Wittgenstein అంటాడు "There are, indeed, things that cannot be put into words. They make themselves manifest. They are what is mystical". "నిజానికి శబ్దాల ద్వారా వ్యక్తం చేయలేని విషయాలు ఉన్నాయి. అవి స్వయంగా వ్యక్త మవుతాయి. ఆధ్యాత్మికం/ఆముష్మికం అయినవి అవే". ఎంతో మేధో మధనం తర్వాత చెప్పిన ఈ మాటలు జిల్లెళ్ళమూడి గ్రామంలో అమ్మ అనుభవంలో పండినవి. క్షరమైన అక్షరాలకు లొంగనివి.

ఇదంతా ఒక ప్రక్క. మరో ప్రక్క లౌకిక జీవితంలో ఎన్ని మెళకువలు అమ్మ చూపుతుందో అంచనా వెయ్యటం మన తరం కాదు. అన్నీ చేసి చూపటం, చూపించి చెప్పటం. చాలాసార్లు ఎదురుగా ఈ సూక్ష్మాలని దర్శింప జేసి "మీ ఇష్టం! ఏది కావాలో అది ఎంచుకోండి!" అంటుంది అమ్మ. "పెళ్ళిలో పెద్దపులి వున్నదని భయపడే మీ భయాన్ని పోగొట్టటానికే నా పెళ్ళి!" అని వివాహానికి ఒక ఒరవడి, ఒక నమూనా పెడుతుంది విశ్వజనని.

ఎడ్లబండి ఎక్కటం సాకుగా పెట్టి అమ్మ జీవితానికి "నడకల" సూక్ష్మాలని విశదపరుస్తుంది : తాను అనుకున్న దాన్ని బట్టి ఇతరుల ఉద్దేశాన్ని నిర్ణయిస్తారు. ప్రపంచంలో ఈ రెండే నడకకు ఆధారం. వాదనకు కాని వ్యవహారికంగా కాని తాను అనుకున్నది ఒకటి, అక్కడ వుండేది ఇంకొకటి. అట్లా లేకపోతే ఇది ప్రపంచమనే పేరు రాదు. ఒకరికి కాదు ప్రతి ఒక్కరికి వున్న స్థితే యిది. అంటే భార్య భర్తకేమి, తల్లి బిడ్డకేమి. కనీసం మార్గదర్శకులు అయినామని గురువులుగా బోధ చేసే వారికి కూడా మనస్సును గుర్తించ లేని స్థితి వుంటూనే వుంది. యిదే భిన్నత్వం అంటే. మనస్సు తెలిసినపుడు బోధే లేదు."

ఆ బోధ లేకుండా - దాని అవసరం తొలగిపోయిన స్థితి కలగాలంటే - మన మనస్సు కాదు. అమ్మ మనస్సు పట్టాలి. అమ్మ మనస్సు తెలిసినపుడు బాధా

ఉండదు, బోధా ఉండదు. ఆ ఫల శ్రుతి కోసమే విశ్వజనని తన కథని తామే చెప్పారేమో!

ఆధ్యాత్మిక సాధన సూక్ష్మాలని నిత్యజీవితాన్ని ఆలంబనగా చేసుకొని విడమరిచే గ్రంథాలలో ఈ గ్రంథం లాంటిది ఈ శతాబ్దంలో చాలా అరుదుగా కనిపిస్తుంది. పరమహంస "కథామృతం", "అమ్మ జీవిత మహోదధి" రెండూ ఆధునిక అంతరంగ జీవితానికి అపురూపమైన రెండు దివ్య కానుకలు. చమత్కరిస్తూనే చక్కటి చెరుకు రసం అందించటం; అందించినా తాగటానికి బద్ధకిస్తే మృదువుగా మందలించటం. అదీ పనికిరాకపోతే తానే/తామే బలవంతంగా నోట ఉంచి, త్రాగే దాకా తొలగకుండా ఉండటం. ఇది అమ్మ చేసే "పని" తీరు. ఆలోచన, ఆస్వాదన పడుగూ పేకల్లా సమాంతరంగా స్పందింప చేసే ఈ "అమ్మ జీవిత మహోదధి" ప్రచురణ నిస్సందేహంగా ఒక గొప్ప సంఘటన. ఆ సంఘటన సాధ్యం చేసిన అందరికీ నా కృతజ్ఞతలు ఎంత వ్యక్తం చేసినా సరిపోవేమో!

చివరగా, "అసలు భగవంతుడంటే ఏమిటమ్మా?" అని రాజమ్మ గారిని అడుగుతుంది అమ్మ. కొంత వెంపర్లాట "...మాటల గారడీ..." అయిన తర్వాత రాజమ్మ గారు విషయం గ్రహిస్తుంది. "ఒక్కసారి నా తల నీ హృదయానికి హత్తుకో అమ్మా!... దైవమే యిట్లా బోధ చేయించుకోవటానికి, బోధ చేయటానికీ, రూపం చూపించటానికి వచ్చింది..." నా కనిపిస్తుంది. అమ్మని మనల్ని హత్తుకోమని అడగాలా? "అడక్కుండా అన్నీ అమర్చేదే అమ్మ". ఆ వాస్తవం యొక్క సూక్ష్మమే ఈ గ్రంథం ప్రతీ అక్షరం వ్యక్తం చేసేది. గ్రంథాన్ని హత్తుకున్నా, అమ్మ మనల్ని హత్తుకున్నది అన్న "మాంత్రిక" అనుభవాన్ని ఇచ్చే ఈ పుస్తకానికి స్వాగతం!

యం. శివరామకృష్ణ

అమ్మకు నచ్చిన భాస్కరరావన్నయ్య

ముని, ఋషి శబ్దాలు జిల్లెళ్ళమూడి సోదరులలో బాగా అతికిపోయే వ్యక్తి భాస్కర రావన్నయ్య. రైతు కుటుంబంలో పుట్టి సేద్యం చేసి జీవించటమే జీవనాధారమైనా, జీవనధారమాత్రం దేవాలయాలవెంట, దేవతలవెంట, దైవజ్ఞులైన మహనీయులవెంట, ఆధ్యాత్మ సంపన్నులవెంట పరువెత్తింది. చిన్నతనం నుండి అబ్బిన ఈ ఆస్తిక భావనా సంపదకు సోదరులు యార్లగడ్డ రాఘవయ్యగారు మార్గదర్శకులైనారు. అంధులైన రాఘవయ్యగారి చెయ్యిపట్టుకొని లోకంలో భాస్కరరావుగారు నడిపిస్తే వీరి మనసు పట్టుకొని రాఘవయ్యగారు నడిపించారు.

వారి స్వగ్రామమైన సింగుపాలెం వచ్చిన అమృతానందస్వామి అమ్మను గూర్చి మొదటిసారిగా చెప్పినప్పుడు అమ్మను చూచివస్తే బాగుండును అనుకున్నారు. ఆ తర్వాత కొద్ది కాలానికే 1959లో జిల్లెళ్ళమూడి వచ్చి అమ్మలో నుండి ప్రవహించే దివ్యదీధితులకు పరవసించి తిరిగి వెళ్ళుతూ అమ్మకు మరొకసారి నమస్కరిస్తూ పాదాలుపట్టుకున్నారు. అమ్మ భాస్కరావన్నయ్య శిరోపరిభాగాన్ని స్పృశించి దీవించింది. అంతే, అన్నయ్యకు జిల్లెళ్ళమూడి సొంత ఊరైపోయింది. తర్వాత నెత్తిన మూటపెట్టుకొని పూళ్ళదాకా వెళ్ళింతర్వాత ప్రతివారు నీ తల పసుపు పచ్చగా ఉన్నదేమిటంటే ఒకప్పుడు కలలో అమ్మ తన తలపై పసుపు చల్లిన విషయం జ్ఞప్తికి వచ్చింది. తలపై పసుపు ఉండటానికి ఏ మాత్రం అవకాశం లేనప్పుడు ఇలా జరగటం అమ్మ మహిమగా భావించారు.

ఒకసారి భాస్కరరావుగారు, రాఘవయ్యగారు అమ్మవద్ద సెలవు తీసుకొని సింగుపాలెం పోవాలని ఒక బస్సువస్తే దానిలో ఎక్కబోయారు. ఖాళీ లేదు దిగిపొండని అన్నాడు కండక్టరు. అమ్మ ఇలా ఎందుకు చేసిందో? అనుకుంటూ అక్కడే నిలబడ్డారు. మరొక బస్సువస్తే ఎక్కారు. ముందు వీరిని ఎక్కనివ్వని బస్సు మధ్యలో చెడిపోయి ఆగిపోయి ఉంది. వీరెక్కిన బస్సు గమ్యాన్ని హాయిగా చేర్చింది. అమ్మ లీలలు అద్భుతాలు. మధ్యలో వీళ్ళు ఇబ్బంది పడకుండా చేసింది అమ్మ.

భాస్కరరావన్నయ్య యాగాలు చెయ్యలేదు, యోగాలు అభ్యసించలేదు. కాని ఆధ్యాత్మిక మార్గంలో తలలు పండిన వారికి కూడా అబ్బని ఏకాత్మ మానవతాస్థితి అవగతమైందనిపిస్తుంది. సింగుపాలెం నుండి వచ్చే సత్యవతక్కయ్య, చంద్రమ్మక్కయ్య వంటివారు ఆయనకు అమ్మలాగేదర్శనమిచ్చేవారు. కొంతకాలం ఇతరులు కూడా అమ్మలాగే కనబడేవారు. ఆ అనుభూతి మాధుర్యం సౌమ్యుడు, సౌజన్యహృదయుడు అయిన ఆయనకు అమ్మ ప్రసాదించటంలో ఆశ్చర్యంలేదు.

భ్యాసరరావుగారికి సింగుపాలెంలో ఉండగా టైఫాయిడ్ జ్వరం తగిలింది. "నా బిడ్డ ఎంత బాధపడుతున్నాడో? వాడికి ఏమిపెడుతున్నదో? ఏమో!" అని సింగుపాలెం మనిషిని పంపి తనవద్దకు పిలిపించుకొని సేవలు చేసింది. అమ్మతో పరిచయమున్న మూల్పూరి సుబ్రహ్మణ్యశాస్త్రిగారు అమ్మను గూర్చి భాస్కరరావు గారితో చెపుతుంటే అమ్మవారి ప్రక్కనే దర్శనమిచ్చింది. అమ్మ దేవతాలయంలో చేరిన తర్వాత కూడా గర్భగుడి ముందు కూర్చుని చూస్తుంటే పూలలో అమ్మ పాదాలు కదులుతున్నట్లు అనుభవమైంది.

"నా చరిత్ర పండితుడైన పామరుడు వ్రాయడు పామరుడైన పండితుడు వ్రాస్తాడు" అన్న అమ్మ మాటలోని పైపై అర్థం తీసుకుంటే భ్రష్టుడైన పండితుడు వ్రాస్తాడు అని అర్థం స్ఫురిస్తుంది. కొన్త లోతులలోకి పోయి ఆలోచిస్తే మహోన్నతమైన వేదాంత వాక్యార్థం అంతరార్థం అవగతమవుతుంది. పామరుడు అంటే అజ్ఞుడు, వీరుడు అని అర్థాలు. పండితుడు అంటే తలపండిన జ్ఞాని అర్థం. ఇప్పుడు "పామరుడైన పండితుడి'ని గూర్చి ఆలోచించండి. అజ్ఞుడైన పండితుడు అన్నమాట. అలాటివాడెవడైనా ఉంటాడా? ఉంటాడు. ఎందుకంటే పండితుడు, అన్నీ తెలుసుకున్న స్థితి ఏదంటే తెలిసిందే. తెలుసుకోవలసింది ఏదీ లేదు. తెలుసుకున్న దేదీ లేదు, అని తెలివిడియై ఉండటమే. అందుకే అమ్మ నాడి తెలిసీ తెలియని స్థితి అంటుంది. మిట్ట పల్లాలుకాని స్థితి నాది అంటుంది. అలాగే భాస్కర రావన్నయ్య స్థితి పామరుడైన పండితుని స్థితి అయింది.

వ్యాసుడు భారతం చెపుతుంటే గణపతి వ్రాశాడంటారు. వాళ్ళ నియమాలు వాళ్ళకున్నాయి. అవి ఇప్పుడు అనవసరం. కాని భాస్కరరావన్నయ్య వ్రాస్తుంటే అమ్మ అనుగ్రహంతో పాత్రలు వారి వారి కంఠాలలో వచ్చి పలుకుతన్నట్లుగా శబ్దాలు వినిపంచేవి. ఆ సన్నివేశాలు వారికి కళ్ళవెంటనీళ్ళు తెప్పిస్తుండేవి. అమ్మ చరిత్ర చెపుతుంటే మామూలుగా ప్రక్క వాడికి వినబడేది కాదు, ఒక్క భాస్కరావుగారికి తప్ప. చరిత్ర వ్రాసి సింగుపాలెం వెళ్ళితే కొన్ని రోజులకు అమ్మ జిల్లెళ్ళమూడిలో "భాస్కరుడు వస్తే బాగుండును" అనేదట. భాసర్రావుగారు సింగులపాలెంలో అమ్మ దగ్గరకు పోవాలని పించి వచ్చేసేవాడు. చరిత్ర మొత్తం 15 నోటు పుస్తకాలలో వారు వ్రాసినవే. ఎక్కడన్నా ఒకచోట అరచోట ఎవరన్నా వ్రాయటానికి కూర్చుంటే అమ్మ చెప్పలేక ఆపివేసేది. అంతా భాస్కరరావన్నయ్య చేతి మీదుగా జరగాలనేది అమ్మ ఆకాంక్ష. అలాగే జరిగింది. తొలిరోజులలో ఒకసారి భాస్కరరావన్నయ్య అమ్మ వద్దకు వెళ్ళగా ఒకరు పుస్తకం అటకమీద పెట్టి కూర్చున్నారు. తర్వాత అతనే రహి అని అమ్మ చెప్పింది అన్నయ్యతో. ఈ రహి మీ అమ్మ చరిత్ర మొదట

వ్రాసినవాడు. అదిశిథిలమైపోగా తిరిగి అమ్మ భాస్కరరావు అన్నయ్యచే వ్రాయించింది.

ఇలా అమ్మ చరిత్ర వ్రాసే రోజుల్లోనే అమ్మ శరీరం సర్వమయి అయిన రోజున దివ్య విమానం మేడమీద ఆగిన శబ్దం వినిపిస్తుంది అని చెప్పిందిట. అలాగే ఆ శబ్దం వినే భాగ్యం భాస్కరరావన్నయ్యకు కలిగించింది. దివ్య శబ్దం, దివ్యవాణి, దూరశ్రవణం, దూరదర్శనం భాస్కరావన్నయ్యకు అబ్బినవి అమ్మ అనుగ్రహం వల్ల.

హైమకు భాస్కరరావుగారంటే ఎంతో ఇష్టం. హైమ జబ్బుగా ఉన్న రోజుల్లో అమ్మ దగ్గరకు వెళ్ళాలని హైమ అనుకుంటుంటే భాస్కరరావన్నయ్య ఎత్తుకుని అమ్మ దగ్గరకు తీసుకెళ్ళి పడుకోబెట్టాడు. భాస్కరరావన్నయ్యను శ్రమపెట్టినందుకు హైమ కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి. కాని ఎంతమందికి హైమను ఎత్తుకొనే అదృష్టం లభిస్తుంది.

జిల్లెళ్ళమూడి వచ్చిన రోజుల్లో లలితా సహస్రనామాలు చదవటం వచ్చేదికాదు. తర్వాత అమ్మ దయవల్ల చాల స్పష్టంగా చదవగలుగుతున్నారు. పురుషసూక్త, శ్రీసూక్త పూజా విధానాలు, సుప్రభాత సంధ్యావందనాలు భాస్కరరావన్నయ్య పలికినంత స్పష్టంగా రాగయుక్తంగా మనం పలుకలేం. ఒక రకంగా ఆయన బ్రాహ్మణుడు, విప్రుడు, పురోహితుడు, పరుష వాక్కెరుగని పరమహంస, సత్వగుణ ప్రధానుడు, అంతరంగ పరిపక్వత కల్గిన పరమ పురుషుడు, అమ్మ చెక్కిన అపురూప శిల్పం, ఆటుపోటులకు తొణకని మహాసముద్రం. అర్కపురేశ్వరి అయిన అమ్మకు నచ్చిన అమ్మ మెచ్చిన అపర భాస్కరుడు భక్తికి విశ్వాసానికి మరోపేరు భాస్కరరావన్నయ్య. మనమధ్య ఒక మహాఋషి సంచరిస్తున్నాడు. మన మెంత అదృష్టవంతులమో!

- పి.యస్.ఆర్. ఆంజనేయప్రసాద్

కృతజ్ఞతా కుసుమాలు

నిరుపమానము, మంగళప్రదము అత్యంత మహిమాన్వితమునైన 'జిల్లెళ్ళమూడి అమ్మ పరమాత్మకథ' అనబడు విశ్వజనని చరిత్ర విశ్వజనీనమై విలసిల్లాలనే ఆకాంక్షతో అమ్మ ప్రసాదించిన సంకల్పబలంతో ఈ పవిత్ర కార్యాన్ని తన జీవిత ధ్యేయంగా భావించి ఎన్నో ఆర్థిక పరమైన ఇబ్బందులను అమ్మ అనుగ్రహంతో అధిగమించి మొదటి భాగాన్ని ముద్రణకు పూనుకున్న భక్తి భావనా తత్పరుడైన సోదరుడు సింహాద్రికి విశ్వజననీ ట్రస్టు అర్పించే ప్రథమ కృతజ్ఞతా కుసుమం.

పరమోత్కృష్టము, సర్వశిరోధార్యము అయిన యీ చరిత్రను బహుళజన ప్రచారములోకి తీసుకురావాలన్న ప్రకాశకుల పవిత్ర లక్ష్యాన్ని, అభ్యర్థనను మన్నించి ఈ చరిత్రలోని మొదటి భాగమును ముద్రించటానికి ప్రేమతో అనుమతినొసంగిన అందరి ప్రియ సోదరుడు, అమ్మ ద్వితీయ కుమారుడైన బ్రహ్మాండం రవీంద్రరావుకు మా కృతజ్ఞతా సుమములు.

ఇంతటి మహోన్నత గ్రంథమునకు ముందుమాట వ్రాయటానికి అనువైన వ్యక్తుల గురించిన మా వెతుకులాటకు తెరవేస్తూ, కోరిన వెంటనే ఇది తన మహద్భాగ్యంగా భావిస్తూ మాకు వెన్నుదట్టిన, ఆధ్యాత్మిక రంగంలో అత్యంత అనుభవశాలి, తాత్త్వికులు, ఉస్మానియా విశ్వవిద్యాలయం ఆంగ్ల భాషా శాఖాధ్యక్షులుగా పదవీ విరమణ చేసిన ప్రొఫెసర్ మలపాక శివరామకృష్ణగారి ఔదార్యానికి మా కృతజ్ఞతా కుసుమాలు సమర్పించు కుంటున్నాము.

ఈ పరమాత్మ కథకు లేఖకుడు, 'పామరుడైన పండితుడు' శ్రీ యార్లగడ్డ భాస్కర రావన్నయ్య గురించిన పరిచయ వాక్యాలు, శ్రీ శివరామకృష్ణగారి సలహాననుసరించి మేము చేసుకున్న అభ్యర్థనకు సత్వరమే స్పందించి మాకు అందించిన, సాహిత్యరంగంలో అత్యంత ప్రతిభాశాలి అచిరకాలంగా అమ్మసేవలో పునీతమైన సహృదయుడు, స్నేహశీలి శ్రీ పి.యస్.ఆర్. ఆంజనేయప్రసాద్‌గారికి కృతజ్ఞతా సుమాహారము.

ఈ ముద్రణా కార్యక్రమాన్ని 'మదర్ ఆఫ్ ఆల్' పత్రిక ద్వారా తెలుసుకొని దీనికి అవసరమైన ఆర్థిక వనరుల గురించి స్వయముగా విచారించి తనవంతు భాగ్యంగా భావించి సహకారాన్ని అందించిన, అమ్మ అనుంగుబిడ్డయై అందరికీ ప్రీతిపాత్రుడైన సోదరుడు జేమ్సుకు. విన్న వెంటనే ఈ పవిత్ర కార్యంలో

తమవంతుకూడా వుండాలన్న ఆకాంక్షతో ఉడతాభక్తిగా ధనసహాయమునందించిన సోదరీ సోదరులకు మా కృతజ్ఞతా సుమాంజలి.

ఈ గ్రంథ ముద్రణ సంకల్పించిన నాటి నుండి ఈ మహత్కార్యాచరణకు అమ్మ తనను ఎన్నుకొన్నందుకు ఒక వరంగా భావించి ముద్రణకు అవసరమైన రీతిలో అధ్యాయములుగా విభజించి వాటి నామకరణం దగ్గరనుంచి అనవరతమూ ఎంతో కృషిచేసి, మాకు అన్ని విధాలా చేదోడు వాదోడుగా సహకరించిన స్నేహశీలి, ప్రేమపాత్రుడైన సోదరుడు తంగిరాల సింహాద్రిశాస్త్రికి కృతజ్ఞతా సుమమాల.

ఈ గ్రంథ ముద్రణా లక్ష్యాన్ని అవగతం చేసుకొని తదనుగుణంగా కవరుపేజీని అత్యంత రమణీయంగాను, సుందరంగాను చిత్రీకరించి ఈ కార్యాన్ని తనవంతు సేవగా భావించి ఈ చిత్రాన్ని గ్రంథములో ప్రచురించిన చిత్రాలను కంప్యూటరు ద్వారా పరిష్కరించి మాకందించిన సౌహార్ద్రశీలి, గత నాలుగు సంవత్సరాలుగా 'మదర్ ఆఫ్ ఆల్' త్రైమాస పత్రికకు ఫోటోలనందిస్తూ వస్తున్న సోదరుడు శ్రీ షెనాయ్‌కి కృతజ్ఞతా సుమాళి.

గ్రంథముద్రణకు వర్తమాన కాలంలో అత్యంతావశ్యకమైన డి.టి.పి.ని ఈ గ్రంథం విషయంలో మాకు తనకాలాన్ని, నైపుణ్యాన్ని వెచ్చించి పఠనా సౌలభ్య పరమైన పుటలను మాకందించిన సుగుణాన్విత, సౌహార్ద్రహృదయ 'మదర్ ఆఫ్ ఆల్' పత్రికకు ప్రారంభం నుండి డి.టి.పి.ని చేస్తున్న సోదరి వసంతకు ఆమెకు నిరంతరం చేదోడుగా నిలిచిన పతిదేవులు రాజ్‌కుమార్‌కు కృతజ్ఞతా కుసుమ గుచ్ఛములు


అలాగే వయసులో చిన్నవాడైనా ముద్రణారంగంలో తనకంటూ ఒక విశిష్ఠ స్థానాన్ని యేర్పరచుకొని యెన్నో వైవిధ్యమైన ముద్రణలు అందిస్తూ 'మదర్ ఆఫ్ ఆల్' పత్రికకు ఆది నుండి సేవలందిస్తున్న సోదరుడు చి. శ్రీవర్ధన్‌కు ఈ గ్రంథ ముద్రణలో అతను అందిస్తున్న సహకారానికి కృతజ్ఞతా ఆశీఃకుసుమాలు.

ఈ గ్రంథముద్రణ సంకల్పించిన ప్రారంభదశనుండి గ్రంథము రూపుదిద్దుకొనే వరకు మాకు తగిన సలహాలను సూచనలనందించి, మాతో సహకరించిన సోదరీ, సోదరులందరికి కృతజ్ఞతా కుసుమ పరంపర.



మాతుఃపవిత్రచరణౌ శరణం ప్రపద్యే

విషయసూచిక



అమ్మ తండ్రి కీ.శే. మన్నవ సీతాపతిశర్మగారు, అమ్మ

1. అవతరణ

అమ్మ జననము :

చైత్ర శుద్ధ యేకాదశి తెల్లవారుఝామున శీర్షోదయకాలము గం. 4.30 లకు. జననకాలము (అరుణోదయము) గం. 4.30. పుట్టిన ఆకృతి - చేతులు కాళ్లు మెలిక వేసుకొని తెల్లగా, తెలుపులో గోధుమ రంగుగా, పొడవయిన ఆకృతిగా కనపడుతూ (+) క్రాస్‌గా ముడుచుకుని కనురెప్ప కూడా (సర్వాంగములు) కదలిక లేకుండా, అరమోడ్పు కన్ను (చేప నిద్ర మాదిరిగా), యేడ్పు లేకుండా, ప్రాణమున్నదా లేదాయనే అనుమానంతో వుండగా, పిచ్చికోటి - కదిలించి కంటివంక చూస్తూ 'పాపం యీ పిల్లకూడా పోయిందేమో, ఈ రంగమ్మ తల్లి దురదృష్టవంతురాలు. ఈ సంవత్సరంలో నలుగురు బిడ్డలను పాతర పెట్టినది' యీ మాట అనగానే (తల్లి) చివాలున లేచి అమ్మ ముఖము వంక చూస్తూ వున్నది అమ్మమ్మ. అమ్మ ప్రాణములేని కళలు కాక తను పడుతున్న బాధ అంతా అమ్మ ముఖంలో చూచింది అమ్మమ్మ. అమ్మను చేతికి తీసుకుని 'నా మనస్సులో వున్న బాధ అంతా బిడ్డ ముఖంలో చూస్తున్నానా లేక నా మనస్సులో వున్న దానినిబట్టి కనబడుతున్నదా? యీ పట్టి నాకు దక్కేదేనా?' - అని ఆవేదనతో లోగడ పడ్డ బాధను మరచి, యదాగుండెపడి ఆ మూర్తినే చూస్తూ మూర్తీభవించిన మాతృప్రేమతో అమ్మమ్మ, హృదయంలో యేవో సముద్రపు అలలు, మోతగా వినపడుతూ, శరీరము కొయ్యబారి అమ్మను చేతిలో పెట్టుకుని కూర్చుంటుంది. ఇది మంత్రసాని చూచి పెద్దగా కేకవేసి "నాయనా పిల్లలే కాక నీ భార్యకూ నీకు రుణం తీరింది. పాపం ధర్మరాజువి", అని ఆదుర్దాతో అమ్మమ్మకు మంత్రసాని చికిత్స జరిపి, అమ్మవంక చూచి "ఏమమ్మా మా అమ్మ ప్రాణాలు తీయటానికి

పుట్టా''. అని చేతులలోకి తీసుకో పోగా అమ్మ నవ్వు ముఖంతో యేడుపు సాగించింది. అమ్మమ్మకు ప్రాణాలొచ్చినయి.

ఇంతలో తాతగారు ఇంతకూ నక్షత్రం ఏమిటో చూద్దామని పంచాంగం దగ్గరకు పరుగెత్తి పంచాంగం పట్టుకుని తెరవగానే అదే పేజీలో ఆశ్లేషా నక్షత్రం, నాల్గో పాదం, వర్జ్యం, చైత్రశుద్ధ ఏకాదశి, బుధవారం, వృశ్చికలగ్నం కనుపించగానే తాతగారు తలవూపి 'కానియ్యి వాళ్ల (అమ్మ) తాతగారికి జాబు వ్రాద్దాం. నాకు శాంతి వున్నట్లు కనపడుతున్నది. పెద్దవాడు ఆయన అభిప్రాయమును తీసుకుందాం' అని తనలోతాను మాట్లాడుకుంటూ అటూ ఇటూ పచారు చేస్తూ వుండగా ఇంతలో అమ్మ యేడ్పు తాతగారికి వినపడుతుంది. ఫరవాలేదు ధ్వని బాగానే వున్నది. వీళ్లు చెప్పినంత భయం యేమీ వున్నట్లు లేదేయని అనుకుంటూ గడియారము వంక చూడగానే గడియారము ఆగిపోయి వుంటుంది గం. 4.30 లకు. ''అయినా ఇది యేమిటి పుట్టేటప్పటికి వున్న గంట యిదేనా! - నా బ్రతుకు చక్రము కూడా యింతేనా'' అని తాతగారు అనుకుంటారు.

అమ్మ భూమిమీద పడిన వెంటనే మంత్రసాని బొడ్డు కోయుటకు చాకు పట్టుకోగానే దారము లేదని గుర్తు వచ్చి మంత్రసానికి ఎలాగో దారము తెచ్చి యిస్తారు. ఆ దారము చేతబూని బొడ్డుకు యెన్ని చుట్లు చుట్టినా మామూలు దారము మిగిలి వుంటుంది. ఇంత పెద్ద దారమా అని విసుక్కుని మంత్రసాని బొడ్డు కోయుటకు చాకు పట్టుకుంటుంది. చాకు అతి పొడవుగా మెరుస్తూ త్రిశూలము మాదిరిగా కనపడుతూ చేతికి మరకుండా వుంటుంది. బొడ్డు వంక చూడగానే బొడ్డులోని బుడుపు శంఖము వలె కనుపిస్తుంది. యేపని తోచక, కొయ్యలేక తడబడి ఇది ఏదో జబ్బో, గాలి చేష్టో అనుకుంటుంది. కాని ఒక గంట తరిచి చూడగానే బొడ్డు కమలముగా అతి కోమలముగా అందులో ఎవరో ఒక అమ్మ అలంకారముతో నిలబడినట్లు కనబడుతుంది. అట్లా పదిహేను నిముషములు విభ్రమముతో చూచి యీ పిల్ల పుటకే గాలితో పుట్టింది. ఈ పిల్లకు ఎన్నాళ్లకు నయమవుతుందో ఏమో అని అనుకొనుచుండగానే కమలములో వున్న రేకులు వూగుతూ వుంటాయి. కమలములో వున్న బొమ్మ గిర గిర తిరుగుతూ వుంటుంది. కళ్లు తిరుగుతున్నవేమోనని మంత్రసాని కళ్లు మూసుకుని కూర్చుంటుంది. కొంత సేపటికి కళ్లు తెరవగా కొద్ది దారము మామూలు చాకు కనిపించుతాయి. పక్కవారు బొడ్డు కోయుట ఇంత ఆలస్యమేమని అడుగగా నా కళ్లు తిరిగినవని చెప్పి పని పూర్తిచేస్తుంది

కాని ఆమె మనస్సు మాత్రము ఆదృశ్యము అయిన ఆ దృశ్యము మీద లగ్నము అయినది.

యింతలో మంత్రసాని 'అయ్యా దండమండీ! యీ పూట కదృష్టవంతుడవే.'

తాతగారు : అదే నేను అనుకొంటున్నా, మరోపూటను గురించే. నా బ్రతుకే సమస్య అయికూర్చున్నది. (అని కంటినీరు రెండు బొట్లు తాతగారి పాదాల మీద పడ్డవి). ఆ నీరు పడేటప్పుడు మనస్సులో యీసారి పిల్లలదే కాక పెద్ద ప్రాణాన్ని గురించే ఆలోచనగా వుంది అని నీటిబొట్ల వంక తలవంచి చూడగానే పురిటింట్లో వున్న బిడ్డ ఆ నీటిబొట్టులో కనపడుతుంది. ఆశ్చర్యపడి కళ్లు పెద్దవి చేసి తరచి చూచును. ఇది అసాధారణం. ఇది అంతా నా మనోభ్రమా... నిశ్చేష్టుడయి చాలా వరకు తోచనివాడై అమ్మమ్మ దగ్గరకు వెళ్లి చూస్తూ నుంచుంటారు. అమ్మమ్మ నిద్రపోతున్నట్లు కళ్లు మూసుకొని పడుకొనెను. కాని ఆమె మనస్సులో యేదో ఒక బరువైనది, తనకు మించినది, పక్కలో నున్నట్లు తోచి తాతగారు వస్తే బాగుండును. ఈ సంగతి వారికి చెప్పు కుందామని కళ్లు తెరవగానే తాతగారు యెదుటనే యుందురు. ఒకరినిచూచి ఒకరికి వుభయుల కండ్ల వెంట, ఒకేసారి బాష్పములు కారును. అట్లు అయిదు నిముషములు కాలము జరిగెను. అమ్మమ్మ తాతగారిని పిల్లను చూడమన్నట్లుగా తలవూపును. తాతగారు 'చూచాను' అన్నట్లుగా తల ఊపును. అదే సమయములో అమ్మ కదలి ఒకసారి తాతగారివైపు ఒకసారి అమ్మమ్మ వైపు తలతిప్పి చూచును. అది చూచి అమ్మమ్మ అమ్మను డొక్కలోకి లాగుకొని యిది యేమాత్రపు బాకీయో అని మనసులో యీ బిడ్డనైనా యెవరన్నా పెంచుకుంటే బాగుండును అని అనుకొని తాతగారివైపు చూచి "నక్షత్రం చూశారా? మా నాన్నగారికి జాబు వ్రాసారా?" అని అమ్మమ్మ అనును.

"జాబు వ్రాసినా, మన జాతకాలు మారుస్తారా !" అని నిట్టూర్పు విడిచి తాతగారు అన్నారు "అన్ని కాన్పులకు యీ సారికి తేడా కనపడుతున్నది."

యింతలో మంత్రసాని వచ్చి "రంగమ్మతల్లీ ! ఇంతకీ నోటిలో రొమ్ము పెట్టావా ?" అని అడిగింది.

అమ్మమ్మ : నా పాలు పాపాలు నాగాం అంటుంది.

నాగాం : యిప్పుడియ్యమ్మా తరువాత నే పెంచుతాను.

అమ్మమ్మ అమ్మ ముఖము వంక చూచి పాలివ్వ ప్రయత్నించగా...

తాతగారు : జాగ్రత్త. అతి సున్నితంగా వుంది పిల్ల. పోనీలే శరీరానికున్న సున్నితత్వం ఆయుర్దాయానికి లేకుండా వుంటే -

అమ్మ మెలిక పడ్డ కాళ్ళను కొంచెం పైకి యెత్తగానే గజం పొడుగు వున్న కాళ్ళలాగా కనిపించగా అమ్మమ్మకు 'బతకని బిడ్డ బారెడు' అని అమ్మ చేతులు తీసుకొని తన చేతిలో పెట్టుకుని చేతులు వంక చూడగానే అమ్మ చేతివేళ్ళు తళుక్కున సూర్యకిరణాల లాగ కనిపించును. వెంటనే అమ్మమ్మకు తనకు తెలియకుండానే ఏడుపు, నవ్వు పెద్దగా వచ్చెను. వెంటనే యిల్లంతా కాంతులతోను, అమ్మ (పిల్ల) మురికిగా కనపడును.

అమ్మమ్మ : నాగాం బిడ్డకింకా నీళ్ళు పోయ్యలేదేం ?

నాగాం : (మంత్రసాని) నీకు చీరే కట్టకపోతే బిడ్డకు నీళ్ళేమిటి ?

అమ్మమ్మ : యింతకూ అమ్మ పుట్టి అయిదు గంటలయినదా ? అని, యిది యేమిటి అమ్మ అంటున్నాను. అమ్మాయి పుట్టి.

నాగాం : కాకేమమ్మా, అయిదు గంటలు దాటి ఆరోగంట అవుతున్నది అని, అమ్మమ్మను లేవదీసి కూర్చోబెట్టి చీర కడుతూ అమ్మవంక చూస్తుంది.

అమ్మ నాగాం వంక చూచును.

నాగాం వెంటనే, "నీబిడ్డ కళ్ళు తెరిచింది. యెండ తీక్షణంగా వుంది. నాకేదో తెలియని ఆనందంగా వుంది, యిందాక ఒకటి జరిగింది. అప్పటి నుంచి నాకు భలే సంతోషంగా వుంది", అంటూ చీర కట్టి పడుకోబెట్టి, అమ్మను చేతులలో పెట్టుకుని దొడ్లోకి పోయి "మా అమ్మకు నీళ్ళు పోస్తారా?" అంటూ వంటయింటి వైపుకు వెళ్ళగా అమ్మ మేనత్త (బామ్మగారు) "పురిటి బిడ్డను వంటయింటి వైపుకు తీసుకొచ్చావు. యిదంతా మైల పడిపోదా?" అంటూ పెద్దగా అరుస్తూ "నీళ్ళు నేను తోడిస్తా పద" అని ఆవుపంచితం చల్లి అమ్మకు స్నానము చేయించి అమ్మను బామ్మ చేతుల్లోకి తీసుకుంటుంది.

బామ్మ : (అమ్మ వంక చూచి) అమ్మా ! మూడోతరం ఆడపిల్లవు పుట్టావా, వొళ్ళు తుడవాలంటే భయంగా వుంది. చేతులు కాళ్ళు ఎక్కడ వూడి వస్తాయో. అన్నయ్యా (అని తాతగారి వంక చూచి) "తెల్లగా ఏకులా ఉందిరా" అన్నది.

తాతగారు : వాళ్ళు దృఢంగా వుండి యేం వొరిగించారు. అంతా రుణ సంబంధమేగా (అని అనగానే) బామ్మ చేతిలో వున్న అమ్మ ప్రశాంతంగా నిద్రపోతూ

'బ్రతకటం రుణమేగా' అని అమ్మ అన్నట్టు తాతగారికి తోస్తుంది. 'కాని అమ్మ అన్నది కాదు నామనోభావము' అని అనుకుంటారు.

మధ్యాహ్నం 12 గంటలవుతుంది.

బామ్మ అమ్మను తీసుకొని వచ్చి అమ్మమ్మ పక్కలో పడుకో బెట్టగా యింతలో యిరుగు పొరుగు వారు వచ్చి, "ఏమమ్మా కోడలు పుట్టినదా !" అని అంటారు.

బామ్మ : ఎందుకులే అమ్మా ! యిది వరకు అనుకున్నది అయిందా ? యిది అవటానికి, యీ పిల్ల యీడు కూడా కాదు. (కృష్ణ శర్మ గారి భార్య వెంకట సుబ్బమ్మ గారు బామ్మగారికి ఆడబిడ్డ)

వెంకట సుబ్బమ్మ : తప్పకుండా యీ పిల్ల నీకోడలే అవుతుంది. పది సంవత్సరములతేడా ఎంత తేడా, వ్రాసి పెట్టి వుంటే తప్పక అవుతుంది.

బామ్మ : ప్రతీదీ అంతేగా ! బ్రహ్మండపు వారింటికి నేనొచ్చా చాలులే.

వెంకట సుబ్బమ్మ : ఉన్నన్నాళ్ళు వుండి తీరా గరుడ గుడ్డ కట్టేనాడు పురుడు వచ్చింది. యిద్దరం పీటలమీద కూర్చునే వాళ్లం. యీ సంవత్సరమే దేవాలయం ధర్మకర్త కావటం ప్రతిష్ట కావటం, రాజరాజేశ్వరి యంత్రం వేయటం. మౌనస్వామి 'మీ యిద్దరు పీటలమీద కూర్చో'మని చెప్పారు. (అని బాధ పడుతుంది).

బామ్మ : యివాళ కొత్త యేమున్నది ? మన్నవ వారికి యెప్పుడూ పురుళ్ళూ సూతకాలేగా (అంటూ) బిడ్డకు పాలు యింత వరకు యివ్వలేదు. (అని బామ్మ పాలిస్తుంది) నావి పత్యపు పాలే, జబ్బు చేయవుగదా ?

అమ్మమ్మ : నీపాలకేమమ్మా సత్యమైన పాలు నిత్యము నీపాలే యియ్యమ్మా.

అమ్మ : నా పిల్లవాడి పాలు తరిగిపోతయ్యిగా !

అమ్మమ్మ : నీ పిల్లవాడికి నేనిస్తాను. నా పిల్లకు నీవివ్వు.

బామ్మ : నా పాలు నీ పిల్ల భరించగలదు గాని నీ పాలు నాపిల్లవాడు భరిచలేడు. అనగా నీ పాలు పాతపు పాలు అని బామ్మ అమ్మకు పాలిస్తూ వుండగా తన పిల్ల యీ పిల్లేనని తోస్తుంది. అమ్మ తల వూపుతుంది. బలహీనం మీద మెడలు వూపుతున్నదని బామ్మ అనుకుంటుంది. బామ్మ అమ్మను అమ్మమ్మ పక్కలో పరుండబెట్టి, 'యింతకూ ఆముదం కుడిపారూ' అంటుంది. 'ఆముదం పోయలేదు కడుపులో మురికి పోలేదు. తలవూపుతూ ఉంది. ఒక గంట వుండి

కుడప వచ్చులే'యని పరుండబెట్టి పొట్ట తడిమి చెక్కిళ్ళు పట్టుకుని "పడుకో తల్లి పడుకో" అంటూ, "వొదినగారూ ! పిల్ల వైపు తిరిగి పడుకో".

అమ్మమ్మ : పిల్లల వైపు నేతిరిగిన వాళ్ళంతా పోయారు. పిల్ల నావైపు తిరిగితే బ్రతుకు తుందేమో.

బామ్మ "నీ వీపు పిల్లకు కనపడకూడదమ్మా. అసలే వెన్నెమ్మ కథ తెలుసు కదా" అని పిచ్చికోటిని "కాపలా వుండమ్మా" అని చెప్పి బామ్మ వెళ్ళిపోతుంది.

నామకరణం :

ఇదేమాదిరి సుఖంగా మూడు రోజులు గడిచి పోతాయి. నాల్గవ రోజు పుట్టిన వేళకు అమ్మ కాళ్లు చేతులు బంధించి, కొయ్యబారి పోయి నల్లకప్పవేసి నిద్రలో వుంటుంది. ప్రాణం పోదు, మామూలు స్థితి లేదు. జబ్బు లేదు, అర్థం కాదు, వ్యర్థంగా లేదు. అట్లా నాలుగు రోజులు గడచెను. ఇంట్లో తల్లి, తండ్రి శరీరాలు మాత్రం శుష్కించినాయి. అమ్మను చూడటానికి వచ్చేవారికి విధి విరామము లేదు. యే రాముడూ అడ్డు రాలేదు. నా రాతకు రాముడేం చేస్తాడు అని అమ్మమ్మ దృఢమైనటువంటి దుఃఖములోనుంచి "యేమీ ఫర్వాలేదు" అని నిశ్చలత. పదోరోజు ఉదయం పది పదకొండు నిమిషాలకు దుఃఖానికి చరమ దశ సంతోషం అన్నట్లుగా యేర్పడి తాతగార్ని పిలిచి 'రేపు పురిటి చమురు పోయిస్తారా" అని అడుగగా.

తాతగారు : యింతకూ పిల్లకు ప్రాణముందా ?

అమ్మమ్మ : మన అమ్మకు ఏ ఆపద లేదులే అని తోస్తున్నది. నేను యేడుస్తూ వుంటే నాలోనుంచి యేవో ధ్వనులు వినపడుతున్నాయి ఫర్వాలేదని.

తాతగారు "సరే నీ ధైర్యం. యింతకంటే నాకు కావలసిన దేమున్నది !" అని పైకి అన్నారే కాని అసలు యేం జరుగుతుందోనని లోపల అధైర్యమే. పైకి 'సరే, రేపు కులాసాగా ఉంటే శాంతి చేసుకుందామా ?' అని సలహా అడుగుతారు తాతగారు.

అమ్మమ్మ : శాంతీ వద్దు, ఏమీ వద్దు. శాంతి తాత్కాలిక మనశ్శాంతి కోసమేగా, అసలు శాంతి కలుగదుగా.

తాతగారు : 'సరే! ఎట్లా అయితే అట్లా అవుతుంది. నక్షత్రం తిరిగేలోగా చేసుకుందాంలే'.

అమ్మకు పురిటి స్నానం చేయించేందుకు గ్రామంలో ఉన్న 500 ఇళ్ళకు చెప్పివస్తే అనుకోకుండా 108 మంది 108 బిందెల నీళ్లు తెచ్చారు. 108 బిందెలలోనించి 108 చెంబుల నీళ్లు తీసి అమ్మకు స్నానం చేయించారు.

అమ్మకు స్నానం చేయించి జల్లెడలో పరుండబెట్టి పిల్లలను కావలిబెట్టి, ఎవరి పనులమీద వారు వెళుతారు. పిల్లలు ఆడుకోను వెళ్లిపోతారు. ఒక పావుగంట అమ్మ దగ్గర యెవరూ ఉండరు. ఒక పెద్ద నల్లకుక్క అమ్మ తలవద్ద కూర్చొని అమ్మ చేయి, కాలు కదలినప్పుడు కొరుకుదామనుకుని సాహసించలేక, పాదములు కదలించగానె, పాదముల చెంతకు వచ్చి అమ్మ పాదములపై తన ముట్టిని పెట్టి పరుండును. అట్లే పది నిమిషములు హాయిగా నిద్రపోవును. ఇంతలో అందరు వచ్చి పెద్దగా అరిచి, కుక్కను ఎంత లేవకొట్టినా లేవదు. అమ్మకాలు కదిలించగానె, కుక్క లేచి జల్లెడ చుట్టు ప్రదక్షిణము చేసి వెళ్లిపోతుంది. అందరూ 'యీనకాచి నక్కలపాలన్నట్లు యెంతో అన్యాయమై పోయేవి'' అని అనుకొందురు. కుక్క పది నిమిషములలో తిరిగి అమ్మ మంచము వద్దకు వచ్చి అమ్మ కక్కిన పాలు నాకి మంచానికి అయిదు జానల దూరంలో పడుకుని కనులు తెరచి అమ్మ వంక చూస్తూ ప్రాణాలు వదులును. దాని ముఖంలో తేజస్సు తగ్గలేదు. దానికి అంతకుముందు ఏ జబ్బూ లేదు. పోయే జబ్బే.

జ్ఞానం కలగటానికి మనుష్య జన్మే కాదు, కుక్క దగ్గర నుంచి పిపీలికాది మనుష్య పర్యంతం, సంస్కరింప బడ్డప్పుడు ఒకే అర్హత వున్నదని యిది ప్రత్యక్ష ప్రమాణం.

అమ్మకు 26 రోజులు సుఖముగా గడిచిపోవును. 27వ రోజు గుణ్ణపు శాంతి జరుగును.

అన్ని దానములతో గం॥ 11.50 లకు నవగ్రహ జపాలతో శాంతి పూర్తియై నామకరణం నక్షత్రాన్ని బట్టి ఆశ్లేష గనుక, అమ్మ కరువు గనుక, పేరు బెడితే ఆ కరువు తీరుతుందని అందరూ ఆలోచించి 'అనసూయ' అను నామము తాతగారు బియ్యమునకు బదులు అనుకోకుండ కుంకుమ పళ్లెములో వ్రాయుదురు. అందరూ ఒకేసారి అమ్మపేరు అనుకోకుండ మన అమ్మ పేరు 'అనసూయ' అని పెద్దగా అంటారు. అనటం తాతగారు వ్రాయటం ఒకేసారి జరుగును. అమ్మపేరు యెల్లప్పుడూ ఇలాగే ప్రతిధ్వనిస్తే బాగుండునని తాత, అమ్మమ్మగార్లు యెవరికివారు అనుకుంటారు. అంతలో హారతి యివ్వమని పులిపాక చల్లమ్మగారు అంటారు. అనగా బామ్మగారు. అమ్మమ్మ అమ్మగారు. అమ్మ పెద్ద మేనత్త చంద్రమౌళి

పున్నమ్మగారు ముగ్గురూ హారతి యిస్తారు. ఆ సమయములో 13 సవర్ల బంగారము అమ్మకు వచ్చును. హారతి యిచ్చిన తరువాత అందరూ లేచి ఆశీర్వచన అక్షతలు అమ్మకు వేయుదురు. అందులో నాన్నగారు కూడా వుందురు.

అపుడు నాన్నగారి (నాగేశ్వరరావు) వయస్సు 10 సంవత్సరములు. పీటల మీదనుంచి లేచేటప్పుడు అమ్మకు బామ్మగారు ఎఱ్ఱనీళ్లు, కొబ్బరి కాయ దృష్టి తీసి వేస్తారు. కొబ్బరికాయ కొట్టగానే అందులో మొక్క మొలచి పైకి పచ్చగా కనిపించును. అది చూచి యేమి కీడో నని భయపడుదురు. భయపడి వెనక్కు తిరిగి చూడగానే ఒక పెద్ద మిడత హోమగుండంలో నుంచి లేచి అమ్మమీద వాలి తిరిగి అగ్నిగుండములో పడీ పడగానే పెద్ద మెరపు మెరసెను. అక్కడ మెరిసినా చుట్టూ వున్నవారి కళ్లల్లో దుమ్ముకొట్టినట్లవుతుంది.

28 రోజులు సుఖంగా గడుస్తుంది.

ఇంకా అనేక చిత్రములు జరుగును :

29వ రోజున సాయంత్రము 6 గంటలప్పుడు గ్రామ ముత్తైదువులను కలుపుకొని భజంత్రీలతో, కామేశ్వరమ్మ బావి దగ్గరకు జేరి నూతిలో చేదవేసి అమ్మమ్మ చేయవలసిన వేడుకలన్నీ చేసి బిందెతో నీళ్లు చంకబెట్టుకుని మేలిముసుగు వేసుకుని ఊరేగింపుతో తిరిగి వచ్చును. ఇంటి సామీప్యమునకు రాగానే తొట్టెలో నున్న అమ్మ, అమ్మమ్మను పిలచినట్లు పెద్దగా కేక అమ్మమ్మకు వినబడును. అమ్మమ్మ వెంటనే తొట్టెవద్దకు వచ్చి చూడగా అమ్మ నిద్రపోవు చుండును. ముత్తైదువులు ఎవరిండ్లకు వారు వెళ్లిన తర్వాత అమ్మమ్మ మరల తొట్టి దగ్గరకు వచ్చి అమ్మను చూడగా, అమ్మ ప్రక్కను డొక్క నానుకొని తేలు పడుకుని వుండును. అమ్మ చేయి, తల్లి బిడ్డమీద వేసినట్టుగా తేలు పొట్టమీద వేసి ఉండును. (అమ్మ అంటే తన కడుపున బుట్టిన వారికే గాదు, సర్వానికి అమ్మే ! అమ్మ అంటే అడ్డులేనిది, అంతులేనిది అనేదానికి ఇది ఆధారం).

అమ్మమ్మ : అమ్మో పిల్ల ప్రక్కలో తేలు. ఎవర్రా అక్కడ! తొందరగా రారేం? (తాతగారి నుద్దేశించి) వున్నారా మీరక్కడ ? ఇంకా యే పిల్ల అంటూ పిల్లను తేలును గుడ్డలు కలిపి తీసుకుని భుజాన వేసుకుంటుంది. అమ్మమ్మ చేతులు వణికి అమ్మ క్రింద పడుతుంది. తేలు, గుడ్డలూ చేతులలో వుంటాయి. అమ్మమ్మ, అమ్మమీద స్పృహతప్పి పడును. తేలు గుడ్డను కరుచుకొని వుండును. ఇంతలో అమ్మలక్కలందరు చుట్టూ తిరిగి ఇంట్లో ప్రవేశించి. 'అయ్యో! పిల్ల తల్లి

యిద్దరూ పోయారు' అని పెద్దగా కేకలు పెడుదురు. భజంత్రీలు లోపలకు ప్రవేశించి మంగలి వెంకాయ "యెవరని నిర్ణయించేదిరా" అనే కృతి పాడుతూ అమ్మమ్మ చెవులవద్ద వాయిస్తారు (అమ్మమ్మ సజీవముగానే వున్నదని భావము) సజీవముగానే వున్నది ! అమ్మమ్మ చివాలున లేచి కూర్చుని బిడ్డను తీసి (అమ్మ) చేతిలో పట్టుకొని పాత్తిగుడ్డలలో తేలును వెతుకుతూ చేస్తున్న వేడుకను మరచి తాతగారి కోసము బజారుకు పరుగెత్తుతుంది ! అమ్మతో ఆ గుడ్డలతో (దేహస్మృతి తప్పి) తాతగారు మన్నవకు సమీపమున వున్న దొప్పలపూడి అను గ్రామము వెళతారు. మన్నవ గ్రామ మునసబుగారు (పేరు పులిపాక నారాయణగారు) యింకా ఇతర పెద్దలు వచ్చి పిల్లపోయింది కామన్నా. పాపం కరణంగారి భార్యకు మతిపోయిందని కొందరు, అమ్మకు చిన్న బిడ్డనొప్పి వచ్చిందని కొందరు, ఒకరిది ఒకరికి తెలియకుండానే నానా రకముల చికిత్సలు చేయుదురు. ఇంతలో షేక్ నల్ల ఖాసిం సాహెబ్ వచ్చి అందరిని అవతలకు నెట్టి 'అయ్యా! మునసబుగారు" అని వారి చేతులో వున్న అమ్మను తీసుకొని ఇంటికి తీసుకు వచ్చును. మిగతావారు అమ్మమ్మను చేయి పుచ్చుకుని ఇంటికి తీసుకువత్తురు.

అమ్మమ్మ చేతిలో అమ్మను పెట్టి "పాలియ్యమ్మా" అంటాడు నల్ల ఖాసిం సాహెబు.

గుడ్డలలో తేలు గుడ్డలలోనే వుండును. తేలు మాట మరచిపోయి జరిగినదంతా మరచి, ఆ గుడ్డనే చేతికి తీసుకొని అమ్మను ఆ గుడ్డతోనే వొడిలో వుంచుకుని అమ్మమ్మ అమ్మకు పాలిచ్చు చుండును. తేలు మెల్లగా ప్రాకి అమ్మ పాదాల మీదకెక్కును. కొండి అడుగు పాదాలకు కరుచుకొని పడుకొనును. అమ్మమ్మ అమ్మకు పాలు ఇస్తూ చూడలేదు. పాలిచ్చి తొట్టెలో పరుండబెట్టును. పరుండబెట్టి గుడ్డ కప్పబోగా తెల్లని పాదముమీద నల్లని తేలు మెరుస్తూ కనుపించును. 'ఏదో పంపకము ఎవరో చేతబడి చేసారు' అని అమ్మమ్మ అంటూ బైటకు పరుగెత్తును. ఇంతలో అమ్మ తాతమ్మ మరిడమ్మగారు యాజలి నుంచి వచ్చి సరాసరి తొట్టి దగ్గరకు పరుగెత్తి అమ్మ కాలువంక చూచి చచ్చివున్న తేలును తీసివేస్తూ, 'ఇందుకేనా ఈ గందరగోళమంతా బిడ్డ (అమ్మ) కళ్లు తెరుచుకు చూస్తూ వుంటే అట్లా అరుస్తారేం, అమ్మా! అదేదో, అదెందుకొచ్చిందో పుట్టిన పదకొండోనాడే పెద తాతమ్మను పంపింది' అని అంటూ వుండగా గొల్ల నాగాము (మంత్రసాని) వచ్చి 'పుట్టినప్పటి నుంచి అన్నీ చావులుగానే వున్నాయి. ఆ చావులు గూడ

విచిత్రపు చావులు!' అని 'రంగమ్మ తల్లి ఏడ' అంటూ అమ్మమ్మ దగ్గరికి వెళ్లి, "నీపిల్ల బ్రతికున్నది, రా!" అని రెక్క పట్టుకుని ఇంట్లోకి తీసుకొస్తుంది.

మరిడమ్మ గారిని చూచి అమ్మమ్మ పెద్దగా ఏడుస్తుంది. మరిడమ్మగారు "ఏం పర్వాలేదమ్మా, నీ పిల్లకు ఏం పర్యాలేదు అని అనబోయి, నీ పిల్ల వంశపావని. లేకపోతే ఇన్ని చావులు రావు" అంటూ అమ్మమ్మను దగ్గరకు తీసుకొనును.

అమ్మమ్మ అమ్మను గర్భం ధరించినది లగాయతు పుట్టిన 29వ రోజు వరకు అనగా నాటి వరకు కుటుంబములో బంధువులతో సహా పదకొండుగురు మరణింతురు (జంతువులు కాక). ఆ రాత్రి గం. 7.50లకు తాతగారు తిరిగి ఇంటికి వత్తురు. విషయములన్నీ ముందే తెలియును. ఆదుర్దాగా వచ్చినప్పటికీ ఇంటిలో ప్రశాంతతను చూచి తను శాంతిపొందును. తాతగారి భోజన సమయమున రోజూ ఒక పిల్లికి భోజనము పెట్టుదురు. ఆ రోజు ఆ పిల్లి అన్నానికి రాదు. రాని విషయం మరచి తాతగారు భోజనం చేస్తారు. అమ్మమ్మ వచ్చి 'ఇదేమి కారణమో రోజూ వచ్చే పిల్లి రాలేదే' అని భయముతో అనును.

తాతగారు ఋణము తీరితే అన్నీ అంతేలే అంటూ అమ్మ తొట్టి దగ్గరకు వస్తారు.

సర్పాకృతిగా తోక పైకెత్తి గిలకలపైన వాల్చి, అమ్మ ముఖము వంక చూస్తూ తొట్టిలో పడుకొని వుంటుంది పిల్లి. పిల్లి అట్లు వుండుట యెవరూ చూడలేదు. షుమారు ఒక అరగంట అవుతుంది పిల్లి పడుకుని. యీలోగా అమ్మమ్మ వచ్చికూడా గుర్తించలేదు. తాతగారు అదిచూచి విభ్రాంతుడయి "అమ్మ పక్కలో పాముర్రా" అంటూ లైటు తీసుకొద్దామనుకుంటూ, పాము కరచివున్నఅమ్మ దీపము చూడకూడదనే సందేహముతో దీపము తీసుకురాలేక, సందేహము నివారణ చేసుకోలేక, తరచి తరచి చూడగా, పాముగానే పడగగానే ఆడినట్లే కనిపించి మళ్లా కట్లపురుగుగా తోచును. వెంటనే కొంచెము ధైర్యము వచ్చి తొట్టిలో చేయి పెడుతూవుండగా మెరుపు మెరియును. ఆ వెలుగులో అమ్మ, పిల్లి, వివరముగా కనిపించుదురు. తాతగారు యివిచూచి ప్రశాంతముగా అమ్మమ్మ దగ్గరకు వెళ్లి భోంచేస్తున్న అమ్మమ్మ (రంగమ్మ గారు)తో 'ఆదుర్దా లేదులే, తొందరగా భోంచేసిరా పిల్ల యేడుస్తుందేమో'. ఆ మాట అమ్మమ్మ సాంతము వినకుండానే చేతిలో ముద్ద తెలియకుండానే క్రింద పడిపోతుంది. తాతగారిని తదేక దృష్టితో చూస్తూ వుంటుంది. భోజనము చేస్తున్న మరిడమ్మగారు 'యెందుకురా నాయనా! కేకవేశావ' ంటూ చేయి కడుక్కొని అమ్మమ్మ దగ్గరకు వచ్చి కాసిని నీళ్లు ముఖముమీద

కొట్టి, కళ్లు మూసి, త్వరగా తాతగారి దగ్గరకు వెళ్లి 'యేమిటి యీ సంగతి' అని అడుగును.

తాతగారు జరిగినదంతా ఆమెతో చెపుతూ తొట్టిదగ్గరకు తీసుకువస్తారు.

తాతగారు, అంటే శ్రీ మన్నవ సీతాపతి శర్మగారు 'అమ్మకు నాన్నగారు'పిల్లిని చేతితో కొట్టుదురు. పిల్లి లేచి తొట్టి దిగి అరుస్తూ తొట్టిచుట్టూ ప్రదక్షిణము చేసి తోక తాతగార్కి ఆనించి అట్లా అరగంట అరచి మచ్చుమీద కెగిరి కళ్లు ముఖము అమ్మవైపు పెట్టి ఒకే అరుపు ఆపకుండా పావుగంట అరచి తొట్టెలోకి దూకి అమ్మ పాదములమీద తన ముక్కునాన్చి ఒకేసారి శ్వాసపైకిలాగి మరొకసారి వదలి రెండవసారి పెద్ద ధ్వనితో శ్వాసను లాగుతూ అమ్మ పాదములమీదనే ప్రాణము వదలును. చూచుచున్న తాతయ్య, మరిడమ్మగార్లు విభ్రాంతులౌతారు. తాతగారు, మరిడమ్మగారితో, "మన కొంపకు ఏదో ఆవరించినట్టే వున్నది. దీన్నిబట్టి చూస్తే వాళ్ల అమ్మగండము కూడా ఖాయమేనని తోస్తున్నది. నక్షత్రబలము దెబ్బతీసేటట్టుగా వున్నది. అందులో వర్జ్యము. అన్నీ విసర్జించుచున్నట్లుగా, అందరినీ విసర్జించేటట్టుగా వున్నది. కానీ ఏదైతే అది అవుతుంది" అని అంటూ, పంచలో మంచము మీద పడుకుంటారు. ఇంతలో ఇంటి కెదురుగా వున్న మంత్రిప్రగడ రాజమ్మగారు వచ్చి 'యేం సీతాపతీ అప్పుడే పడుకున్నావ'ని తాతగారిని అడుగును. 'ఇక ఇదే పడకేమో' అంటారు తాతగారు. ఆమె సరాసరి వంటయింట్లో విస్తరి ముందర గోడకానుకొని కూర్చున్న అమ్మమ్మ దగ్గరకు వెళ్లి 'జరిగిపోయిన దానికి బాధ ఎందుకు? ఇంతవరకు బాగున్నాం కదా!' అని చెమటలు కారిపోతున్న అమ్మమ్మగారి చేయి పట్టుకుని ఒక చేతితో మంచినీళ్ల చెంబు చేత పట్టుకుని, అమ్మమ్మను కదిలిస్తుంది. ఇవన్నీ వినబడవు. అమ్మమ్మకు, అమ్మ మాత్రమే కనుపించుచుండును. 'ఏమిటి మరిడమ్మక్కయ్యా ఇదంతా' అని రాజమ్మగారు తాతమ్మగార్ని అడుగగా ఇప్పుడు జరిగినదంతా తాతమ్మగారు సాయంత్రము జరిగినదంతా రాజమ్మగారు, ఒకరితో ఒకరు చెప్పుకుని అమ్మమ్మ వంక వుభయులు చూస్తూ ఆమె ముఖచిహ్నములు గమనిస్తూ మూర్ఛా, నిద్రా, అపస్మారకమా అని దీర్ఘముగా చూస్తూ వుండగా అమ్మమ్మ ముఖములో తొట్టిలో వున్న అమ్మ, అమ్మమ్మ వొడిలో వుండి పాలుతాగుతూ వున్నట్లు అమ్మమ్మ తల పడిగాకృతితో అమ్మకు గొడుగు పట్టినట్లుగా తాతమ్మ గారికి కనపడును. 'ఇంకా అనేక రకములయిన చిత్రములు జరుగును' అను శబ్దము తాతమ్మ గారికి వినబడును. రాజమ్మగార్కి మాత్రము ఇవి ఏమియు గోచరించవు. ఇంతలో అమ్మమ్మ కొంచెము కదలి 'అమ్మా !

అమ్మా ! ఎందుకు పుట్టావమ్మా' అంటూ ఇటూ అటూ కదులుతూ 'ఎక్కడున్నారు' అని తాతగారిని కేకవేస్తూ 'ఇందాక ఏదో చెప్పవచ్చారు వినపడలేదు', అంటూ కళ్లు తెరుచును.

రాత్రి గం. 11.50 ని.లకు

అమ్మమ్మ నెమ్మదిగా లేచి తాతగారి దగ్గరకు వెళ్లి 'ఇందాక చెప్పినది ఏమిట' ని అడుగుతుంది.

తాతగార్కి నిద్రపడుతూ పడుతూ పలుకరు. అమ్మమ్మ తాతగార్కి నమస్కారము చేసి, అమ్మ తొట్టి దగ్గరకు వస్తుంది. అమ్మ తొట్టిలో చచ్చిన పిల్లి అటులనే వుంది. అమ్మమ్మ దీపముతో రావటముచేత పిల్లిని చూచి భయపడక అయ్యో ఇది ఏమిటి పిల్ల పక్కలో పిల్లి అని తడుమును, తట్టును, పట్టుకుని పైకి లాగును. నిద్రపోతున్న పిల్లిలాగ తేలికగా చేతికి లేచును. తీసి క్రింద పడుకొనబెట్టి 'గాఢనిద్రలో వుంది' అనుకొనును. అమ్మమ్మకు లోగడ వున్న ఆదుర్దా, అశాంతి తగ్గి తెలియకుండా కూర్చున్న కాలము (సమాధి స్థితి)లో ప్రశాంతత ఏర్పడును. అమ్మమ్మ ఆశ్చర్యముగా "నాయనమ్మా ! ఈ విచిత్రము చూచావా మన పిల్లి, పిల్ల పక్కలో పడుకున్నది" అనును.

మరిడమ్మగారు అమ్మమ్మ కూర్చుని వున్నప్పుడు జరుగుచున్న చిత్ర విచిత్రాలన్నీ గమనిస్తూ అమ్మమ్మ లేచిన కాలాన్ని గుర్తించక గుర్తిస్తున్నది. ఇటు ఈ పిలుపు అటు ఆ చిత్రములు రెండూ గమనిస్తున్నది. ఇది వింటున్నది. అది కంటున్నది. ఈ స్థితినే సహజ సమాధి (సంధి) అంటారు. రాజమ్మగారు అక్కడే మామూలు నిద్రపోతూ వుంటుంది. అమ్మమ్మ రాజమ్మగార్ని పన్నెండున్నర అయిందని లేపుతుంది. ఆమె వులికిపడి లేచి నిద్రమత్తున తక్కిన వివరములు అడుగకుండా ఇంటికి వెళ్లిపోతుంది. అమ్మమ్మ అమ్మను మంచముమీద పెట్టుకుని పడుకుంటుంది. మరిడమ్మగారు లేచి ఇవన్నీ గమనించి మామూలు ధ్యానావస్థలో కూర్చుండును. ఆమెకు ఎప్పుడు రాత్రి అంతా అట్లా గడుపుటయే అలవాటు. తెల్లవారుఝామున నాలుగున్నరకు లేచి తాతమ్మగారు పిల్లిని తీసి చెంబుతో నీళ్లు పట్టుకుని వెళ్లి మురుగు కాలువ కట్టకింద పారవేయును. అమ్మమ్మకు పిల్లి పోయినట్లు తెలియదు. తెల్లవారాక మరిడమ్మగారు తాతగారితో 'నేను పారేశాను అమ్మాయికి (అమ్మమ్మ) చెప్పవద్దు' అని చెప్పుతుంది. తెల్లవారి అమ్మమ్మలేచి పిల్లి విషయము అడుగగా 'ఎటో వెళ్లిపోయింది, ఒకేచోట వుంటుందా' అని చెప్పుదురు వుభయులు.

అప్పగింత :

30వ రోజు తెల్లవారిన దగ్గర నుండి మరిడమ్మగారు మేలుకొలుపులతో లేపుతూ, జోలపాటలతో నిద్రపుచ్చుతూ, గొల్లనాగమ్మ వుగ్గుతో, గొల్ల నాగమ్మ పాలతో, రెండు నెలలు గడచి, మూడో నెల ప్రవేశించగానే, మరిడమ్మగారు వూరికి వెళుతూ 'అమ్మాయికి మూడో నెల వచ్చినది, ముద్ద కుడుములు పౌర్ణమినాడు ఇచ్చి వెళ్ళవచ్చును' అని బియ్యము నీళ్ళలో పోసి అమ్మ తొట్టి దగ్గరకు వచ్చి ముడుచుకున్న చేతులను చూచి 'ముత్తయిదువులకు ముద్దలు పెడతావా అమ్మా!' ముడతపడిన శరీరాన్ని చూచి 'అందరి పిల్లల మాదిరిగా శరీరము మూడో నెల వచ్చినా మార్పు రాలేదు. కాంతి తగ్గలేదు. లేతదనం పుట్టినరోజు యెట్లా వున్నదో అట్లాగే వున్నది' అని అనుకుంటూ అమ్మను చేతిలోకి తీసుకుని పాటలు పాడుకుంటూ తెల్లవారుఝామున నాలుగు గంటల ముప్పై నిమిషాల నుండి తెల్లవారి ఆరు గంటల ముప్పై నిముషముల వరకు అమ్మతో, పాటలతో. ఆటలతో, కాలము గడుపును. ఇంతలో గొల్ల నాగమ్మ వస్తుంది. నాగమ్మ చేతిలో అమ్మను పెట్టి "నేను రేపు వూరుకు వెళతాను. ఈరోజు ముద్ద కుడుములు వేడుకచేసి నీ చేతిలో పెడతాను". నాగమ్మను సంబోధిస్తూ "పిల్ల పుట్టినట్టే లేదు వారి అమ్మకు, నాయనకు" మనం పెంచవలసినదే. కొంత కాలం గడిస్తే ఏదైనా మార్పు వస్తుందేమో అందాక నీవే కనిపెట్టి వుండు. "పాలిస్తూ, నీళ్ళు పోస్తూ, రోజూ ఒకసారి తీసుకొచ్చి చూపించి వెళుతూ వుండమ్మా" అని తాతమ్మగారు చెప్పి ఇంట్లోకి వెళ్ళి నానబోసిన బియ్యం బుట్టకు వడవేసి, పనిచేసే ఖాదర్‌బీని పిలిచి బియ్యంలో పోటెయ్యమ్మా అని రోటిలో బియ్యం పోసి జల్లెడకోసం లోపలకు వెళుతుంది. తాతమ్మ చెప్పినమాట ఖాదర్‌బీకి వినపడక యేదో పని చేసుకుంటూ వుంటుంది. ఖాదర్‌బీకి వినపడక యేదో పనిచేసుకుంటూ ఉంటుంది. తాతమ్మకి యింట్లోకి దంపుడు పోటు వినపడుతుంది. ఖాదర్‌బీ కనపడదు. పోటు వినపడుతుంది. బియ్యం మెదిగి వుంటాయి. తాతమ్మగారు ఆశ్చర్యపడి ఎవరైనా యిటు వచ్చి వెళ్ళారా అని అక్కడ నిలబడి వున్న తాతగారిని చూచి అడుగుతుంది.

తాతగారు "నేను చూడలేదు, ఇప్పుడే వచ్చా" నంటారు. మామూలుగా వచ్చేపోయే వారిని అడుగగా మేమెవరిని చూడలే దంటారు. రోటిలో తలపెట్టి తాతమ్మగారు ఆ శబ్దాన్ని గమనిస్తుంది. నెమ్మదిగా శబ్దము వినపడుతూనే వుంటుంది. జల్లెడ పట్టనవసరము లేకుండా పిండి తయారై పోసిన బియ్యానికి మించిన పిండి వచ్చును. ఇదంతా చూచి తాతమ్మగారు తన శరీరములో

శక్తిలేదని తను చెయ్యక తప్పదని తన ఇష్టదైవమయిన గురువుగారు పాత గుంటూరు మల్లెల రత్తమ్మగారు తనకు సహాయపడ్డారని వారి ప్రార్థన చేస్తూ ఆనందపడుతూ అమ్మకు ఆ వేడుక చేయు పనులను ప్రారంభం చేస్తారు.

తెల్లవారి ఉదయం 8 గంటలకు అమ్మమ్మ ముఖము కడుక్కొని చల్లచేసి ఆ వెన్న చేయి అమ్మ పాదాలకు రాస్తుంది. అమ్మను పక్కకు తిప్పి వెన్నుకు రాస్తూ యికనైనా వెన్ను చలవ చేసుకో అమ్మా అంటూ ఆ చేయి అరికాలున రాచి తనకు తెలియకుండానే ఆ చేతులు తన కళ్ళవద్దకు పోతాయి. అమ్మను నాగమ్మ దొడ్లోకి తీసుకొని వెళ్ళి స్నానము చేయించి తీసుకు వస్తుంది. అమ్మమ్మ అమ్మకు బొట్టు పెట్టబోగా అమ్మ ముఖాన బొట్టు పెట్టే వుండును. బొట్టు యెర్రగా మెరుస్తూ వుండును. నాయనమ్మ పెట్టినదేమోనని అమ్మమ్మ తాతమ్మ (మరిడమ్మ)గారి నుద్దేశించి "నాయనమ్మా ! పిల్ల ముఖాన బొట్టు నీవు పెట్టావా" అని అడుగగా "నేనెరగనమ్మా నా పిండి క్షోభలో నేనున్నానమ్మా. నాకు ఎవరయిందీ తోచక ఆలోచిస్తున్నా అదీ అట్లాగె జరిగిందా ? వెనుకటికి సక్కుబాయికి కృష్ణపరమాత్మ సహాయము జరిగినట్లుగా మనకు మల్లెల రత్తమ్మ గారి సహాయమేమో" అని బెల్లం తరిగి పొయ్యిమీద పెట్టి కట్టెలు ఎంత విసిరినా మండదు. మండకపోవుటచే విసుగుతో పొయ్యిలో నీళ్ళు పోసి వెళ్ళిపోతూ అన్నీ ఆ తల్లే చేసుకుంటుందని మూతబెట్టి దొడ్లోకి వెళ్ళి తులసిదళాలు కోసి పువ్వులు ముత్తయిదువులకు పెట్టుకుని అక్షింతలు వేసుకుందాం రాజరాజేశ్వరి పేరుతో అంటారు తాతమ్మగారు. ముత్తయిదువుకు వచ్చినామె పేరు కాకమాను లక్ష్మాయమ్మగారు (అంధురాలు) 'పిల్లను చూద్దామంటే కళ్ళులేవుగా అమ్మా' చేతికన్నా ఇవ్వండి పట్టుకు చూస్తా. ఇంతలో అమ్మమ్మ అమ్మను ఆమె చేతిలో పెట్టను. ఆమె చేతికి తీసుకుని పిల్లను ముద్దు పెట్టుకోబోగా మెరుపు మెరిసినట్లు అమ్మ కళ్ళు రెండూ ఆమె కళ్ళల్లోకి కిరణములు గుచ్చుకు పోయినట్లుగా చేతిలో అమ్మ, అమ్మగానే వుండి వేరే ఒక అయిదు సంవత్సరాల పిల్లగా కనపడును. ఆమె "అమ్మా మరిడమ్మా" అని కేకవేసి, 'నీ సన్నిధికొచ్చిన వేళ ఎంత అదృష్టమమ్మా, ఏదో ఒక దివ్య దర్శనమైనది నీ శక్తివల్ల'.

మరిడమ్మగారు : ఇవాళ ప్రొద్దుటనుండి అన్నీ దివ్య దర్శనాలే, అమ్మ దయవల్ల అంతా చిత్రవిచిత్రాలుగానే జరుగుతోంది ఈ రోజల్లా.

లక్ష్మాయమ్మగారు : సిద్ధసంకల్పురాలివి మరిడమ్మా.

తాతమ్మగారు పొయ్యిమీద వున్న భాండము మీద మూత తీసి చూడగా పాకము వచ్చియే యుండును. పొయ్యి సన్నగా మండుచుండును. తల్లిదయ క్షణక్షణము పొంగిపొర్లుచూ వుంది అని తాతమ్మగారు అతి ఆనందముతో చలిమిడి చేసి వంటచేసి నివేదనకు పదార్థములన్నీ గురువుగారి పటము దగ్గరకు తెచ్చిపెట్టి 'పిల్లను కూడ తీసుకురండమ్మా యిటు' అంటుంది. అమ్మమ్మ, అమ్మను చేతిలో పెట్టుకుని దేవతార్చన దగ్గరకు రాగా కాకులు కావు కావు మంటూ పడిపోయిన గోడమీదుగా కట్టిన పట్టా మీదుగా దూరి లోపలకు వచ్చును. తాతమ్మ ముత్తయిదువులకు పసుపురాసి బొట్టుపెట్టి "ఇది నేనుకాదు. పిల్ల రాసిందనుకో పుట్టు దరిద్రురాలను నేను రాయకూడదు. ఆ తల్లి నాచేత రాయిస్తున్నది". చలిమిడి మీద, చేసిన పదార్థముల మీద మూతతీసి నెయ్యి వేసి, అభికరించి, అన్నము, నెయ్యి తీసుకుని అగ్నిహోత్రములో వెయ్యటానికి వెళ్లగా ఒక కాకి అన్నము, ఒక కాకి చలిమిడి ముట్టుకొనును. ఒడిలో అమ్మను పెట్టుకు కూర్చున్న అమ్మమ్మ కొట్టగా తడబడి బైటకుపోను దారిలేక, అమ్మమ్మ నెత్తిమీద ఒక కాకి తన్ని, కిందబడి అమ్మ పాదముల ముందర చావక, చచ్చిన మాదిరిగా పడివుండును. ప్రాణము పోలేదు. చలిమిడి ముట్టుకున్న కాకి రెండవ కాకి పైకెగిరి భోషాణము మీద కూర్చొని కళ్లు తెరచి తల పక్కకు తిప్పి అమ్మవంకనే చూచుచుండును. యింతలో తాతగారు వచ్చి పట్టాను విప్పి కాకులను బైటకు తోలును. ఒకటి పోవును, రెండవది అటులనే పడియుండును. దానిని తాతగారు తీసుకొనివెళ్లి గొడ్లచావడిలో పెట్టి బుట్టకప్పును. ఇంతలో అమ్మమ్మగారు లేచి మనకు అన్నీ అపశకునములే అంటూ అమ్మను ఎత్తుకుని గదిలోకి వెళ్లి తొట్టిలో పరుండ బెట్టును. తాతమ్మగారు అందరకూ భోజనములు పెట్టి సాయంత్రము వేడుకలకు కావలసిన పనులన్నీ చక్కబెట్టి ముత్తయిదువులను పిలుచుటకు ఇంటి ఎదురుగా వున్న మహాలక్ష్మమ్మను పిలచి వూళ్లోకి పంపగా ముత్తయిదువు లందరూ కలసి సాయంకాలము ఆరుగంటలకల్లా వేడుకలు చేయ ప్రారంభించిరి. అమ్మమ్మ మనస్సులో యేదో 'యిదే నా ఆఖరు వేడుక' అని తోస్తుంది. నేడే గద అని యేదో శబ్దము వినపడును. యిదే చివర వేడుకగా జరగబోయే కాలాన్ని అమ్మ ముఖతా తెలియకుండా సూచిస్తున్నది. యెవరన్నది తోచక యింటినిండా జనముండుటచేత వేడుక ప్రధానముగా పెట్టుకుని యే ఆలోచనా లేక వేడుక ప్రారంభించును అమ్మను వొడిలో పెట్టుకుని.

అమ్మమ్మ చెల్లెలు అప్పుడే బండి దిగివచ్చి అమ్మ నెత్తుకుని అమ్మమ్మను కుర్చీలో కూర్చోమని అమ్మమ్మ చేతిలో అమ్మను పెట్టును. భజంత్రీవారు పాడుకుంటూనే లోపలకు ప్రవేశించి అరగంటసేపు వాయించి చక్కని నాగస్వరము వేయుట ప్రారంభింతురు. పాములవాడు అడుక్కోనువచ్చి ఆ సమయముననే పాముల నాడించును. ముత్తయిదువులు పాటలు పాడుదురు. అమ్మమ్మ వొడిలో వున్న అమ్మ తల పాము పడగలాగ ఆడును. తెలిసినవారు పాటను గుర్తించి తలవూపినటుల వుండును. అమ్మమ్మ మాత్రము ఆనందాన్ని అనుభవించలేక ఆ వూపు, జబ్బు అనుకొని, బాధనే అనుభవించును. దూరముగా వున్న తాతగారు, మరిడమ్మ గారలు శాంతి కోసము వచ్చిన బంధువులందరూ తిరిగి ఈ సమయములో బామ్మగారితో సహా వచ్చి యుండిరి. తాతగారు, మరిడమ్మగారు, అమ్మమ్మ బంధువులు అందరికి ఒకేసారి తెలియని దుఃఖము పొంగిపొర్లును. అయిదు నిమిషములు అయినాక దుఃఖము ఆగును. కాని వేడుక ఆపకుండా జరుగుతూనే యున్నది. బామ్మగారు, అమ్మ చేతికి చలిమిడి ముద్ద యిచ్చి మొదటి ముద్దను తను తీసికొనును. రెండవ ముద్ద అమ్మ, అమ్మమ్మ గారికిచ్చును (అంటే చంద్రమౌళి జానకమ్మగారు) (అమ్మ అమ్మమ్మ గారికి అమ్మ స్వయముగా యిచ్చును). ఎవరో చేతిలో పెడితే యిచ్చినట్లుగా అందరకూ కనపడును. అమ్మమ్మకు మాత్రము అమ్మే యిచ్చినట్టు కనపడును. మూడో ముద్ద యెట్లా యిచ్చునాయని అమ్మమ్మ కనిపెట్టి చూచును. మూడవది చేతిలో ఒకరు పెట్టిస్తేనె పెట్టును. అమ్మమ్మ తన కన్ను చెదిరి అట్లు కనిపించినదని అనుకొనును. మూడవ ముద్ద అమ్మమ్మ చెల్లెలు సౌభాగ్యమ్మకు ఇచ్చును. నాలుగో ముద్ద బామ్మ ఆడబిడ్డ మన్నవ కృష్ణశర్మగారి భార్య వెంకట సుబ్బమ్మగార్కి ఇచ్చును. అయిదవ ముద్ద గంగరాజు జానికమ్మగార్కి యిచ్చును. అమ్మకు హారతిచ్చి అక్షతలు వేసి ఎర్రనీళ్ల తీసి లోపలకు తీసుకొని వెళ్లుదురు. తక్కిన వారందరకు బామ్మ అమ్మమ్మ వేడుకలు జరిపి యిళ్లకు పంపుదురు. ఆరాత్రి యేడున్నరకు గొల్ల నాగమ్మను పిలిచి 'ఈ రోజు మంచిది, పండు వెన్నెల నిండు తిథి. ఇంటికి తీసుకువెళ్లి రోజూ రెండుసార్లు తీసుకొచ్చి అమ్మాయి (అమ్మమ్మ)కి చూపించ'మని తాతమ్మగారు చెప్పి వొడిలో పెట్టును. అమ్మకు వేడుక సమయములో నల్లని గాజులు వేయింతురు. గొల్ల గాజులా అని అంతా నవ్వుదురు. 'గొల్ల యింటికే పోతున్నదమ్మా' అని అమ్మమ్మగారు అంటారు దుఃఖముతో. గొల్ల నాగమ్మ - లైటుతో, అమ్మను, బంధువులతో వేడుకగా యింటికి తీసుకువెళ్ళును. నాగమ్మ యింటిముందుకు పోగానే పెద్ద త్రాచు యింటిముందు ఆడుకుంటూ అమ్మ

ముందుకు వచ్చి (అమ్మ నెత్తుకుని వున్న నాగమ్మ ముందుకు వచ్చి) పడగను ముందుకు వంచి సాష్టాంగ నమస్కారము చేసినట్లుగా పడుకొనును.

కాని యిరుగు పొరుగు కర్రలతో కొట్టటానికి ప్రయత్నించగా తళుక్కున మెరసి అదృశ్యమయ్యెను. పాము తప్పించుకు పోయెనని, మంత్రకట్టు పాము అని యిదియేదో కొత్తరకము పాము అని, తలొక రకముగా భావింతురు. అమ్మను లోపలకు తీసుకొని వెళ్లి నులక మంచములో చిన్న పొత్తిగుడ్డలమీద పరుండ బెట్టును.

నులక అల్లిన వుయ్యాల మంచము చాకలి లక్ష్మయ్య తెచ్చి ఇచ్చును. ఈ మంచము మీద చాల మంది పడుకున్నారు. ఇది చలవ కలిగినది అని వుయ్యాల కట్టుదురు. అమ్మను వుయ్యాల మంచములో పడుకోబెట్టగా యేడ్చును. మంచము మీద పరుండబెట్టినా యేడ్చును. యెచ్చట పరుండబెట్టినా యేడ్చి. పోరుబెట్టును. గొల్ల నాగమ్మకు విసుగు బుట్టి గంగరావి చెట్టుకు తన చిరిగిపోయిన నీలిరంగు చీరను వుయ్యాల కట్టి దానిలో పరుండబెట్టును. రెండు నిమిషములకు యేడ్పు ఆపును. అమ్మకు నిద్రపట్టును. "యిన్నింట్లోకి, నా చిరిగిపోయిన కోకే సుఖంగా వుందామ్మా !" అని నవ్వుకొనును.

యింతలో వుయ్యాల తెచ్చియిచ్చిన లక్ష్మాయి మూడు సంవత్సరముల నుంచి బాధపడుతూ వుబ్బసముతో ఆరోజే దీర్ఘనిద్ర (చచ్చి) పోయెను.

అమ్మ నాగమ్మ యింటికి రాగానే యెంతో ఆనందముతో వున్న లక్ష్మయ్య పోయినాడని విచారపడుతుంది నాగమ్మ. నాగమ్మ యింటికి యెదురుగానే లక్ష్మయ్య ఇల్లు వుంటుంది. ఇంతకు ముందు అమ్మ యేడ్చునప్పుడు ఆ యేడ్పును లక్ష్మయ్య వింటూనే ప్రాణములను విడుచును. (ప్రాణము అమ్మ (యేడ్పు)లో కలిసి పోవును).

8వ మాసములో ఒకసారి కింద పారాడుతూ, పారాడుతూ నాగమ్మ తింటూ వున్న కంచములో మెతుకులను నోటిలో పెట్టుకొనును. యిదే అన్నప్రాశనము.

అమ్మ నాగమ్మ యింట్లో కులాసాగా యింటికి వస్తూపోతూ 14 మాసముల వరకూ పెరుగును.

మధ్యలో ఒకసారి పదిహేను రోజులు, మరొకసారి పదిహేను రోజులు గొల్ల నాగమ్మ కుమార్తె సుబ్బలక్ష్మమ్మను వెంటబెట్టుకుని అమ్మమ్మ, అమ్మ నెత్తుకుని,

తెనాలి తన పుట్టింటికి అనగా అమ్మమ్మ తండ్రిగారు చంద్రమౌళి వెంకట సుబ్బయ్య గారింటికి వెళ్లివచ్చెను.

అమ్మకు పదిహేనో నెల.

గొల్ల నాగమ్మ అమ్మను యింటికి తీసుకొస్తూ వుండగా మన్నవ మునసబు గారి భార్య పులిపాక సీతమ్మగారు; ఆమె "ఆ బిడ్డను యిటు తీసుకురావే నేను చూస్తాను" అంటుంది. దగ్గరకు తీసుకురాగానే చేతికి తీసుకుని యింట్లోకి తీసుకువెళ్లి మంచమువేసి పడుకొన బెట్టుకుని కాసేపు అమ్మతో ఆనందంగా కాలం గడుపుతుంది. నాగమ్మతో "రోజూ యిటు వెళ్లేటప్పుడల్లా నాకు చూపించు. నేనూ కాసేపు అట్టే పెట్టుకుని పంపిస్తా. మెతుకు కూడా నువ్వేనా ఏమిటి పెట్టటం ఖర్మ !"

నాగమ్మ : లేదమ్మా పాలయినా యిస్తేనే తాగుతుంది. అనిచెప్పి అమ్మను తీసుకు వెళ్లుతుంది. రోజూ యిట్లాగే జరుగుతూ వుంటుంది.

తరువాత మరిడమ్మగారు ఊరు నుంచి వచ్చి, నాగమ్మతో 'నేను వచ్చానుగా అమ్మను నేను అట్టే పెట్టుకుంటాను మరికొంచెము సేపు నీవు వుండి వెళుతూ వుంటే సరిపోతుంది' అని అమ్మను యింటికి తీసుకొని వస్తారు.

ప్రతిరోజూ నాగమ్మ యింటివద్ద కూడ అమ్మ కొంతసేపు ఉంటూనే వుంటుంది.

2. అమ్మమ్మ అంతిమ పర్వం

శాంభవీ ముద్ర :

అమ్మకు యిప్పటికి 17 నెలల 15 రోజులు.

అమ్మ యిప్పటికి ఒకసారి తనంతట తాను అన్నమును నోటిలో పెట్టుకున్నది. మరొకసారి తెనాలిలో అమ్మ మేనమామ శ్రీ చంద్రమౌళి సీతారామయ్యగారు అమ్మకు అన్నము పెట్టారు. యింత వరకు యీ రెండుసారులే.

మరిడమ్మగారు యింటిలో యెప్పుడూ సత్కాలక్షేపము చేస్తూ వుండేది. అమ్మకు ప్రతీదీ అర్థము అవుతూనే వుండేది. ఒకరోజున అమ్మ యేదో ఆలోచిస్తున్నట్లుగా తలకింద చెయ్యి పెట్టుకుని గుండెమీద చెయ్యి వేసుకొని వెల్లకిలా పడుకుంటుంది. బాపట్ల నుంచి అదే సమయములో చంద్రమౌళి చిదంబరరావుగారు (అమ్మకు చిన తాత, పెంచినవారు) వచ్చి అమ్మను చూచి, 'ఏమి యీమె దీర్ఘాలోచనా నిమగ్నురాలై వున్నదే!' అని అమ్మను పైకెత్తుకుని ముద్దు పెట్టుకుని 'చాలా ప్రశాంతం, చల్లనిమూర్తి మంచి యోచన' అని యంటారు. 'అయినా యెందుకు నేను యెత్తుకోవటం, లక్ష్మిని యెత్తుకునే చాల విచారపడ్డాను. యెవరినీ అలవాటు చేసుకోకూడదు'. (లక్ష్మి అనగా అమ్మకు గతించిపోయిన అక్కగారు. అమ్మకు రాఘవరావు అనే అన్నగారు గలరు). చిదంబరరావుగారు అమ్మను ముద్దుపెట్టుకుని దించివేస్తారు.

అమ్మకు 19 నెలల వయస్సు.

ఒక రోజు సాయంకాలము గం. 5.30 లకు యింటికి యెదురుగా వున్న రాజమ్మగారి యింటికి చిట్టి చిట్టి అడుగులు వేస్తూ వెళ్లి దానిమ్మ చెట్టుకింద

కూర్చుని నల్లగుడ్డు పైకి పోనిచ్చి అరమోడ్పు కన్నుతో పద్మాసనము వేసి కూర్చొనెను. యింతలో బావినీళ్లకు వెళ్లిన రాజమ్మగారు వచ్చి అమ్మ పద్మాసనము చూడక ముఖము వంక చూచి అమ్మో చిన్న బిడ్డ నెప్పి వచ్చినదని అమ్మపైన బిందెడు నీళ్లు కుమ్మరించును. అయినను అమ్మ కదలదు. వెంటనే బింది క్రింద పారవైచి రాజమ్మగారు నోరు నోరు కొట్టుకొని సమాధి స్థితిలో వున్న అమ్మను భుజముమీద వేసుకుని అమ్మ యింటికి తీసుకుని వెళ్లను. పద్మాసన మటులనే యుండును. యిది చూచి యింట్లోవారు వైద్యుల కోసము పరుగెత్తుదురు. మన్నవ కృష్ణశర్మగారు (వైద్యులు) వచ్చి ఆయనయు అమ్మకు జబ్బుగా భావించి ఉల్లిపాయలు, జిల్లేడు రసము ముక్కులలో పోయుట, యెగుర వేయుట మొదలగు చికిత్సలు చేయుదురు. చికిత్సలు చేసినప్పుడు జాగ్రత్త రాక తరువాత అరగంటకు అమ్మకు జాగ్రత్త వచ్చును. యిది వైద్య ప్రభావమని అందరు అనుకొందురు. రెండు రోజులు అయిన తర్వాత అమ్మమ్మ, అమ్మ తెనాలి వెళతారు. అక్కడ ఒక దానిమ్మ చెట్టుక్రింద నల్లగుడ్డు పైకి పోనిచ్చి అరమోడ్పు కన్నుతో చేపనిద్ర మాదిరిగా యెడమ కాలును చాచి కుడికాలును వెనక్కు పోనిచ్చి దానిమ్మ పువ్వును చేతిలో పట్టుకుని ఉచ్ఛ్వాస నిశ్వాసలాగిపోయి కూర్చుని వున్న అమ్మను, అమ్మ పెదతల్లి అన్నపూర్ణమ్మ అమ్మ లేవబోయె సమయమునకు వచ్చి 'ఎందుకమ్మా అట్లా కూర్చున్నావు' అనగా "శాంభవీ ముద్రలే" అంటుంది అమ్మ. 'నీకెవరు చెప్పారమ్మా!' అని అన్న పూర్ణమ్మగారు అడుగుతుంది.

అమ్మ : మరిడమ్మ తాతమ్మ చెప్పిందిలే.

అన్నపూర్ణమ్మ : చెప్పిందా ? చేస్తుంటే చూచావా !

అమ్మ : చేస్తుంటే చూచాను. అడగ్గా చెప్పింది. (అంటుంది అమ్మ)

అన్నపూర్ణమ్మగారు అమ్మను పిలిచి 'రంగమ్మ తల్లీ పోయిన పిల్లలు పోయినా, యింతవరకు అదృష్టవంతురాలవమ్మా ! యీ బిడ్డ చాలు !'

అమ్మమ్మ : తల్లి తెలివితేటలు మీదనే తృప్తి పడదుగా, పనికిమాలిన వాళ్లయినా బిడ్డలేగదా, యీ బిడ్డను చూచుకుని తృప్తి పడుతున్నా వాడిని (రాఘవరావు) చూచి దుఃఖపడవలసినదేగా!' అంటూ అమ్మను దగ్గరకు తీసుకుని ప్రొద్దుట నుండి పాలు అడగలేదు, తాగలేదు అని పాలిస్తుంది. అమ్మమ్మకు నాలుగో మాసం గర్భిణి.

అమ్మ పాలు తాగుతూ అమ్మమ్మ ముఖము వంక చూచి అయిదు నిమిషములు అయిన తరువాత 'నాకొద్దు యీ పాలు' అని అమ్మమ్మ పొట్టమీద చెయ్యిపెట్టి లేచి యిటు వచ్చును. మళ్లీ దానిమ్మ చెట్టుక్రిందకు వెళ్లును. దానిమ్మ చెట్టు క్రింద కూర్చుని వున్న అమ్మను చూచి అమ్మమ్మ దగ్గరకు వచ్చి 'యెందుకమ్మా పాలు వద్దన్నావు' అని అడుగుతుంది.

అమ్మ : 'యింకొక అబ్బాయికి యివ్వు' అనగానే, అమాంతం అమ్మ దగ్గరకు వచ్చి తలను గుండెకు హత్తుకుని రెండు ఆనంద భాష్పములు అమ్మ తలపై విడుచును.

అమ్మ, అమ్మమ్మ కళ్లు తుడిచి 'మళ్లీ వస్తావుండు' అని వెళ్లి వీధి అరుగుపై కూర్చుని వాకిట్లో వున్న రావిచెట్టును చూస్తూ దానిమీద వున్న గబ్బిళాలను వివరిస్తూ 'వాళ్లమ్మ వాటికి పాలిస్తుందా ? వాళ్లమ్మ వాటిని యెత్తుకుంటుందా ? మన అమ్మ యెత్తుకున్నట్లు', అని ఆలోచిస్తూ వుండగా బజారున ఒక పంది, పంది పిల్లలూ పరుగెత్తుతూ వుంటాయి. ముందు పంది పరిగెత్తుతూ వుంది, తల్లిని పిల్లలు వెంబడిస్తున్నాయి గాని తల్లి పిల్లలను వెంబడించటంలా. మన అమ్మ మనను వెంబడిస్తూ వుంది. యిదేనా మానవులకు, జంతువులకు వుండే తేడా, లేదు అన్నింటిలోను అన్ని రకాలు వుంటవి; సమయాన్ని బట్టి జరుగుతుంది. యిదే స్థితి మనుష్యులలో గూడ వుండవచ్చు. అన్నీ వొకటే.

మాతృత్వ ప్రకటన :

అమ్మ వయసు 20వ మాసము.

తిరిగి అమ్మమ్మ, అమ్మ మన్నవ గ్రామము ప్రయాణము. తెనాలి రైల్వే స్టేషనుకు ఒంటెద్దు బండియెక్కి ప్రయాణమయిరి. దారిలో కాషాయి గుడ్డలు కట్టుకున్న ఘోషాయి కనపడి అమ్మమ్మతో 'నీ బిడ్డ భగవంతుడు, నీకు జన్మలేద' ని అదృశ్య మాయెను.

యింతలో బండికి యెదురుగా వచ్చే బండి తగిలి, బండిలో మనిషి బండిలో లేక కొట్టువద్దకు పళ్లకోసరము వెళ్లగా, బండి కాడి పైకిలేచి, అమ్మమ్మ అమ్మ పడబోయినట్లుండి పడకుండానే వుందురు. కాడి మామూలుగా యెద్దు మెడపైననే వుండును. యింతలో బండివాడు వచ్చి బండిని తోలుకుని స్టేషనుకు తీసుకుని, వెళ్లి విడచును. తెచ్చిన పళ్లలో రెండు పళ్లు అమ్మ బండివాని చేతిలో పెట్టును.

బండివాడు అమ్మను ముద్దుపెట్టుకొని వెళ్లిపోవును. యింతలో సైకిలు వేసుకుని అమ్మ మేనమామ సీతారామయ్యగారు అమ్మను అమ్మమ్మను కలుసుకొనును. అమ్మమ్మ తమ్ముని చేతికి డబ్బులు యిచ్చి 'టిక్కెట్లు తీసుకో నాయనా', యని ముందు పంపుతుంది. అమ్మ చెయ్యి పట్టుకుని అమ్మమ్మ బ్రిడ్జి యెక్కిపోతూ సగము దూరము పోయిన తరువాత చేయి వదలిపెట్టి, అమ్మను మరచిపోయి ముందు వెళ్లను. తరువాత అమ్మ, కుంటి అబ్బాయి, గుడ్డి అమ్మాయి, యింకొక పాలిచ్చే తల్లీ, పిల్ల కూర్చుని అడుక్కొనుచుండగా వారి దగ్గర కూర్చొనును. అమ్మ తన చేతిలో డబ్బు వుంటే యెంతైనా వారికిద్దునే అనుకొని చేతి గాజు తీసి ఆమె చేతిలో (ముగ్గురు బిడ్డల తల్లి అడుక్కునే గుడ్డి ఆమె) పెట్టి అమ్మ బయలుదేరి యిక్కడే కూర్చుంటే గాజు కనపడకపోతే యీ అమ్మాయిని కొడతారేమోనని వూహిస్తూ వెళ్లు చుండెను. యింతలో, కంగారు పడుతూ అమ్మమ్మ యెదురువచ్చి అమ్మను యెత్తుకుని పోగానే రైలు ప్లాటుఫారం మీదకు వచ్చి వుంటుంది. వెంటనే వెళ్లి అమ్మమ్మ, అమ్మ రైలులో యెక్కుదురు. అమ్మను కూడా పెద్దమనిషిగానే భావించి, సీతారామయ్యగారు రెండు పెద్ద టిక్కెట్లు తెచ్చి అమ్మమ్మ చేతికి యిచ్చును. అమ్మమ్మ గమనించక రెండు టిక్కెట్లు తీసుకొనును. యింతలో రైలు కూతవేసి బండి సాగుతుండగా 'అక్కయ్యా ! రెండు టిక్కెట్లు యిచ్చా। వస్తాన'ని వెళ్లిపోతారు.

అప్పుడు అమ్మమ్మ రెండు టిక్కెట్లు చూచుకుని రెండు యెందుకని విసుగుతో నవ్వుకొంటుంది.

అమ్మతో "యేమమ్మా! నీవు పెద్దమనిషివా మామయ్య నీకు టిక్కెట్టు తెచ్చాడమ్మా" అంటూ అమ్మను పక్క కూర్చోబెట్టు కుంటుంది. యింతలో అమ్మ 'టిక్కెట్టు యెవరికన్న యివ్వరాదు !' అంటుంది.

రైలుబండి చుండూరు స్టేషను చేరుతుంది.

టిక్కెట్టు కలక్టరు అక్కడకు వచ్చును. అందరినీ వరసగా అడుగుతూ వుండగా బండి సాగి మోదుకూరు సమీపించును. యెవరో గొలుసు లాగి బండి ఆపుదురు. టిక్కెట్టు కలక్టరు యీ పెట్టెనుండి దిగిపోవును. యీ సమయములో 20 సంవత్సరములు గల ఒక స్త్రీ యీ పెట్టెలోకి వచ్చి కూర్చుండును. అమ్మ ఆమె వంక చూస్తూ, అమ్మమ్మతో 'ఆమెకు టిక్కట్టు వున్నదేమొ' అంటుంది. అమ్మమ్మ నవ్వుకుని ఆమెను పలకరించి యెందుకమ్మా యిట్లా వున్నావని సంగతులన్నీ అడుగగా ఆమె కష్టములను గురించి చెప్పి 'చివరకు టిక్కెట్టు గూడ

లేని స్థితి, వాడే రక్షకుడవుతాడని అనుకుంటున్నాను' అనగానే కొంగున వున్న ఒక టిక్కెట్టు ఆమె చేతికి యిచ్చి "పోనీ మా యింటికి రామ్మా శాంతమ్మా ! పదిరోజులు వుండి వొద్దువుగాని".

శాంతమ్మ : నాకు ముగ్గురు పిల్లలమ్మా వాళ్లకు అడుక్కొచ్చి అయినా పెట్టాలిగా. నా భర్తగారికి ఒక వూరిలో వుండే వుద్యోగము కాదుగా !

అమ్మమ్మ : సరే నీయిష్టము. నీ పరిస్థితిని బట్టి చెప్పానని తన పమిటి చెంగును తలక్రింద పెట్టుకుని నిద్రపోతుంది.

యింతలో అమ్మ తన రెండో చేతి గాజును తీసి శాంతమ్మ కిస్తుంది.

స్టేషన్ రాగానే శాంతమ్మ గబగబా దిగిపోవును.

అమ్మమ్మ : అయిదు నిముషములకు లేచి అమ్మను చంక బెట్టుకుని నిడుబ్రోలు స్టేషనులో దిగును. వెంటనే తాతగారు, వెట్టివాడు, మోతాదు, అందరూ కనపడతారు. దిగగానే అమ్మమ్మ అమ్మ చేతివంక చూడగా గాజులు కనపడవు. అమ్మమ్మ ఆదుర్దాగా తాతగారితో చెప్పి బాధపడుతుంది.

తాతగారు : పోతె పోనీలె యింకా నయం పిల్ల బాగా వుంది. వాటిని గురించి ఆలోచిస్తా వెందుకు? బండి యెక్కు అని అందరూ బండి యెక్కి వెళ్లుచుండగా (యిప్పుడు వెయ్యి లింగాల గుళ్లు వున్న ప్రదేశములో) అమ్మ అమ్మమ్మతో - 'బండి దిగి బయటకు వెళతా'నని అంటుంది. అమ్మమ్మ బండి దించి తీసుకునివెళ్లి యిప్పుడు దేవాలయములు వున్న ప్రదేశములో అమ్మను బైటకు కూర్చో బెట్టును. అచ్చట నీళ్లు లేవు. మర చెంబులో వున్న నీళ్లతో శుద్ధి పరచును. ఆ సమయములో అమ్మ 'యిచ్చట బాగా వుంది మనము యిచ్చట వుందామా' అని అమ్మమ్మతో అంటుంది.

అమ్మమ్మ : యిక్కడ యిల్లు లేదుగా అమ్మా ! మనం యెట్లా వుందాం ?

అమ్మ : మీరు వెళ్లండి నేను వుంటా.

అమ్మమ్మ : అమ్మ లేకుండా చిన్న పిల్లలు వుండొచ్చా ?

అమ్మ : నువ్వు లేనప్పుడు నేనే అమ్మనై వుంటాగా !

అమ్మమ్మ : (ముసి ముసి నవ్వులు నవ్వుకుంటూ) యేమి మాటలమ్మా తాలుమాట లేదు.

అమ్మ : "తోలు నోరు కాదు కదూ - అందుకని తాలు మాటలేదు".

అమ్మమ్మకు యీ సమాధానము ఆశ్చర్యముగా వుండును. అమ్మను బుజ్జగించి యెత్తుకుని అమ్మమ్మ బండిలో యింటికి చేరును. యింటికి చేరగానే అమ్మకు యెఱ్రనీళ్ల తీసి పోయుదురు.

యిట్లు కులాసాగా రెండు మాసములు గడుచును.

యిప్పటికి అమ్మ వయస్సు 22 మాసములు. ఏకాదశి, శుక్రవారు. రాత్రి గం. 10.30 లకు నిద్రపోతూ వుండగా (కొద్ది జాగ్రత్తలో) పెద్దవాండ్లు - మౌనస్వామి మనవూళ్ళో చేసిన రాజ్యలక్ష్మి ప్రతిష్ఠ చాలా గొప్పది అని చెప్పుకొనుచుండగా - అది అమ్మ చెవిన పడిన వెంటనే అప్పుడు మన్నవ దేవాలయములో జరిగిన రాజ్యలక్ష్మి ప్రతిష్ఠ కాలమున రాజ్యలక్ష్మీ యంత్రమునకు బదులు శ్రీ రాజరాజేశ్వరీ యంత్రము మౌనస్వామిచే వేయబడుట స్ఫురించును అమ్మకు.

(యిదే ప్రయత్నము లేని ధ్యానయోగము, సాకార సిద్ధి అనగా భక్తి సాధన అనగా అప్రయత్నముగా కలిగేదే).

అమ్మకు 2 సంవత్సరముల 9 మాసములు.

అమ్మమ్మకు మగపిల్లవాడు పుట్టి పోవును.

అమ్మ అమ్మమ్మను వదలి మరిడమ్మగారితో వుండుట అలవాటు అవుతుంది. మరిడమ్మ గారితో ప్రథమముగా వెళ్లినది గుంటూరు. రెండు అమరావతి. మూడు ఒంగోలు. యిట్లా ఆమె యెక్కడకు వెళితే అక్కడకల్లా వెళ్లుచుండును.

అమ్మకు 3 సంవత్సరముల 1 మాసం.

అమ్మమ్మకు పిల్లవాడు పుట్టి పోయిన 4 నెలలకు మళ్లీ గర్భవతి అగును. 4 మాసములు వచ్చిన తరువాత అమ్మమ్మకు ఆ గర్భము పోవును.

అమ్మ వయసు 3 సంవత్సరముల 5 మాసములు.

మరిడమ్మగారు రోజా అమ్మకు శ్రద్ధగా అన్నం పెట్టటం ప్రారంభిస్తారు. అన్నము సరిపడక రూపము మారకుండానే పెట్టిన అన్నము పెట్టినట్టు పోయేది. అప్పుడు తాతగారు తెనాలిలో ఖండ్రిగ సాంబయ్య డాక్టరు గారి దగ్గర హోమియో మందులు అమ్మకు యిప్పించెదరు. కాని తగ్గదు. ఎన్ని మందులు వాడినా తగ్గక అట్లా నాలుగు మాసములు గడిచిన తరువాత ఒక ఘోషాయివాడు వాకిట్లోకి

వచ్చి ఒక వనమూలికను అమ్మ మెడలో కట్టబోవును. అమ్మ నాకు వద్దని మూలికను తీసుకుని తినును. ఘోషాయి "యీ మూలిక తినవద్దు, తింటే చచ్చిపోతారు" అని అంటూ వుండగానే అమ్మ తినివేయును. 'నీవు చెప్పినట్టు చచ్చిపోతే నీ మూలిక పనిచేసినట్టు, లేకపోతే నీ మాట అబద్ధము. యివన్నీ ఆయుర్దాయము వుంటే చంపుతవా ? ఆయుర్దాయము లేనివాడికి యివి వేస్తే బ్రతుకుతాడా, ఆయుర్దాయము తీరినవాడు మందులతో యెట్లా బ్రతుకడో ఆయుర్దాయము వున్నవాడు అట్లే చావడు', అని మూడు సంవత్సరములు తొమ్మిది మాసములు గల అమ్మ ఆ ఘోషాయి వానితో సమాధానము చెప్పును. ఆ మూలిక అమ్మను యేమీ చేయదు. ఘోషాయివాడు ఆశ్చర్యపడి వెళ్లిపోవును.

అమ్మమ్మ, అమ్మకు 3 సం॥ 9 మాసముల వయస్సున అమ్మ తరువాత మూడవ గర్భము ధరించును. అమ్మ కులాసాగానే వుంటూ వుండును. అమ్మమ్మకు జ్వరము, దగ్గు ప్రారంభించును. అమ్మమ్మ మూడవ మాసములో గర్భవతిగా వున్నప్పుడు వంటయింటి మధ్యగోడ పడగొట్టి తాతగారికి యిష్టము లేకపోయినా అమ్మమ్మ రాతి గోడ కట్టించెను. అమ్మమ్మ నానాటికి క్షీణించిపోవుచుండును. వ్యాధి పెరుగుచుండును. అమ్మమ్మను చికిత్స కోసరము తెనాలి అయినా, బాపట్ల అయినా తీసుకొని వెళ్లాలని అమ్మ అమ్మమ్మగారికి తాతగారు కబురు చేస్తారు. అమ్మ, అమ్మమ్మగారు కబురు చేసిన వారము రోజులకు వచ్చి ప్రయాణము విషయము ఆలోచిస్తారు. బాపట్ల తీసుకు వెళ్లటానికి నిశ్చయిస్తారు.

రక్షణ శిక్షణ ఒకరిదే :

అమ్మకు 4వ సంవత్సరము.

అమ్మమ్మను తీసుకెళ్లటానికి మంచిరోజు చూచి మేనా పిలిపించుతారు. మేనా వచ్చి వాకిట్లో వుంటుంది. యింట్లో అన్నీ సర్ది తాతగారికి అప్పగించి అమ్మకు వస్తువులుగా చేయించదలచుకున్న బంగారమును యెక్కడ వున్నది, యే బత్తునికి యిచ్చిపది చెప్పి బయలుదేరేబోగా యెవరో తుమ్ముతారు. తాతగారు సందేహించి కాసేపుండి బయలు దేరవచ్చులే అంటారు. గ్రామ జనమంతా మూడు వంతులు అక్కడే వుంటారు. అందరూ తిరిగిరాదనే దృష్టితోనే, పాపం తల్లిలేని పిల్లలు అవుతారు అంటారు ప్రజలు, మరిడమ్మగారు. యిదికూడా నా మెడకు కట్టిపోతుందేమో అని ప్రతి తరానికి తప్పదు కాబోలు అని అందరూ

దుఃఖపడుచుందురు. అమ్మ మాత్రము యీ సంగతులన్నియు తెలియుచున్నను దుఃఖపడదు.

అట్లా రెండు గంటలు గడిచిన తరువాత అమ్మమ్మ మేనా యెక్కబోతూ గదిలోకి వచ్చి తాతగారికి నమస్కారము చేసి అమ్మను తాతగారి చేతికి అందిచ్చి పెద్దగా యేడ్చును. తాతగారు కూడ అమ్మమ్మ తలను గుండెలలో పెట్టుకుని కొంచెంసేపు యేడ్చి 'ఫర్వాలేదు తగ్గుతుంది. నీదేముంది నా కళత్ర యోగము మంచిదయితే తగ్గుతుంది' అని అందరూ కలిసి ఒకేసారి బయటకు వచ్చి అమ్మను, అమ్మమ్మను మేనాలో యెక్కించెదరు. కొబ్బరికాయ కొట్టి మేనా యెత్తుదురు. అమ్మమ్మ మేనా పోతూ వుండగా దారిలో అమ్మను పొట్టమీద పెట్టుకుని యేమమ్మా నేను పోతే వుంటావా ? యెవరి దగ్గర వుంటావో చెప్పు ?

అమ్మ : ఎవరి దగ్గర వుండవలసి వుంటె వారి దగ్గర వుంటా.

అమ్మమ్మ : 'లేకలేక యీ నలుసు బ్రతికితే చూచుకోటానికి లేకుండా యీ చావు యిప్పుడే వస్తుందా ?' అని యేడుస్తూ వుండగా మేనా బాపట్ల చేరుతుంది.

అమ్మ చిన తాత, చంద్రమౌళి చిదంబర్రావుగారి వాకిట్లో మేనా దింపుతారు. చిదంబర్రావుగారు యెదురుగుండా వొచ్చి అమ్మను యెత్తుకుని తీసుకువెళతారు.

రెండవ రోజు డాక్టరు శ్రీ దేశిరాజు అప్పారావు గారిని పిలిపించి చికిత్స ప్రారంభం చేతురు. చికిత్స ప్రారంభము చేసిన రెండు నెలలకు కొంచెము సుగుణము కనపడును.

అమ్మను మాత్రము గుర్తుపెట్టుకోక యెవరూ కూడ అమ్మ తిన్నది లేనిది తెలుసుకోకుండా అశ్రద్ధగా వుందురు. మరిడమ్మగారు వూర్లో లేరు. నిజామాబాదు వెళ్లారు. తాతగారు, అమ్మమ్మ దిగులుతో వుంటున్నారు.

అమ్మ 4 సంవత్సరముల 2 నెలలు.

అమ్మ ఒక రోజున వంటరిగా నడచి ముత్తాయిపాలెం రేవు సముద్రానికి వెళ్లుతుంది. ఒక రాత్రి సముద్రపు ఒడ్డున వుండగా ఒక పల్లెవాడు వచ్చి అమ్మను యెవరు నీవని అడుగగా అమ్మ పలుకదు. అమ్మ వొంటినున్న సొమ్ములన్నీ క్రమముగా వొలుస్తాడు. యెవరో సముద్రమునకు వచ్చి యీ పిల్లను మర్చిపోయి వుంటారు అని భావిస్తాడు. సొమ్ములు తీసుకుని అమ్మను సముద్రములో పడవేయ వలెనని విసిరివేయును. వేయగానే సముద్రములో యేదో మెరిసినట్లుండి

సముద్రమంతా కాంతిగా వుండును. అమ్మ కనపడదు. సముద్రములో అమ్మను పడవేయగానే మొదట అలకే (సముద్రపు అల) వచ్చి వొడ్డున పడును. పల్లెవాడు యేమీ తోచక యింకా లోతుకుపోయి దారి తెలియక అందులో పడి పోవును. పడి వుక్కిరి బిక్కిరై వూపిరాడక బాధపడుతున్న సమయములో తను పడవేసిన పిల్లే (అమ్మ) రెండు చేతులతో తను పడేసినట్లే తనను రెండు చేతులతో ఒడ్డుకు పడవేసినట్లుండును. వాడు ఒడ్డున వొచ్చి వుండును.

అమ్మ మాత్రము మామూలు చోటునే కూర్చుని వుండును. పల్లెవాడు అమ్మను సమీపించి అమ్మ ముఖమువంక చూడగా తనకు సముద్రములో కనపడ్డ కాంతి అమ్మ ముఖములో కనపడును అమ్మను పల్లెవాడు యింటికి తీసుకునివెళ్ళి అన్నము పెట్టి వొలచిన సొమ్మంతా వొంటికి పెట్టబోగా అమ్మ 'నీవొలిచింది నీ సొమ్మే నాయనా ! నీవు బ్రతికొచ్చావు అంతేచాలు. నాకదే సొమ్ము, నీకిదే సొమ్ము, తల్లికి బిడ్డ సొమ్ము, బిడ్డకు డబ్బు సొమ్ము'.

తెల్లవారింది గం. 5.30 లకు

పల్లెవాడు : అమ్మా నిన్ను తీసుకుని వెళ్లి యింటివద్ద దిగిడుస్తాను చెప్పు వొంటరిగా పోలేవు.

అమ్మ : వొచ్చేటప్పుడు నీవు వొచ్చావా వచ్చిన తరువాత నీవు రక్షించావా ! "యెప్పుడూ రక్షణ, శిక్షణ ఒకరిదే", నీ యింటిలో మాత్రము నాకు భక్షణ జరిగినది. నీవు నాతో వద్దు (అని ఒంటరిగా బయలుదేరి వెళ్లుతూ వుండును).

అతను వెనుక రెండు ఫర్లాంగుల దూరముగా వస్తూ వుంటాడు. అమ్మ యిల్లు చేరువరకు ఉదయము గం. 10.30 నిముషములగును. అమ్మ సరాసరి లోపలకు వెళ్లి మంచము మీద వున్న అమ్మమ్మను చూచి మేడమీదకు వెళ్లును.

పల్లెకారి నగలు తీసుకున్నను అమ్మకు యథాప్రకారము నగలు వుండును.

అమ్మమ్మ నిర్యాణం

చిదంబర్రావుగారు ఆపూట మద్రాసు నుండి వచ్చి భోజనము చేసి కోర్టుకు వెళతారు. యింట్లో యెవరూ లేరు.

అమ్మ మధ్యాహ్నము స్టేషను వద్ద వున్న నేరేడు చెట్ల వద్దకు వెళ్లి పళ్లు తెచ్చుకుని తినును. యిట్లాగే యింట్లోవారికి తెలియకుండా రోజూ యెటోకటు వెళ్లటం రావటం చేస్తూ కులాసాగా కాలం గడుపు చుండెను.

యింకొక రెండు నెలలు జరిగిన తరువాత అమ్మమ్మకు యింకా కొంత ఆరోగ్యము కలుగును.

ప్రతిరోజూ యిచ్చటకు మధ్యాహ్నమప్పుడు రాఘవయ్యగారు గారెలు అమ్మకోటానికి వచ్చేవాడు. అందరూ కొనుక్కుంటూ యెదురుగుండా వున్న అమ్మను మర్చేపోతారు.

తాతగారు యెందుకో మతి స్థిమితము లేక అటూ యిటూ తిరుగుతూ వుంటారు. (తాతగారంటే సీతాపతిగారు).

అమ్మమ్మయిది అంతా చూస్తూ పడుకొని వుంటుంది. తాతగారిని పిలిచి "అందరూ అట్లా తింటూ వుంటే పిల్లకు ఒకటి కొని పెట్టకూడదు ? నేను చూస్తూ వుండగానే యిట్లా వున్నదే, నేను పోతే యెట్లా వుంటుందో?" యని అమ్మమ్మ యేడుస్తుంది. అమ్మమ్మకు రోజురోజూ ఆరోగ్యము పెరుగుతున్నది. 9వ మాసము ప్రవేశిస్తుంది. ప్రవేశించిన వారము రోజులకు భాద్రపద బహుళ అమావాస్యనాడు ఉదయం గం. 7.00 లకు.

అమ్మమ్మ : నాకు కొంచెం తగ్గిందిగా యింటికి వెళదామా అంటుంది తాతగారితో.

తెనాలి నుంచి యింతలో అమ్మమ్మ తండ్రి వెంకట సుబ్బయ్యగారు 'అమ్మాయి (అమ్మమ్మ)కి యెట్లా వుంద'ని ఫోను చేస్తారు. తాతగారు కులాసాగానే వుందని సమాధాన మిస్తారు. మధ్యలో డాక్టరుగారు వచ్చి చూచి 'ఆరోగ్యముగానే వున్నది మందు పంపుతా'నని వెళ్లి ఒక మందు పంపబోయి మరొక మందు పంపుతారు. ఆ మందు తాగిన మరుక్షణము నుండి కడుపులో బాధ.

మధ్యాహ్నము గం. 1.30 ని.ల నుండి బాధ హెచ్చును. జానికమ్మ గారు లేదు. తాతగారు వెళ్లి కుమార్తె యింటివద్ద నున్న జానికమ్మగారిని తీసుకొని వస్తారు. సాయంత్రం గం. 3.50లకు బాధ హెచ్చిపోతుంది. యిక బ్రతకనని అమ్మమ్మ స్పష్టముగా చెపుతుంది. మరల తెనాలి, రంగమ్మగారు బ్రతికేటట్టు లేదని, కబురు చేస్తారు. చిదంబర్రావుగారు కోర్టు నుంచి వచ్చి అమ్మమ్మ పక్కలో కూర్చుని 'యేమమ్మా యేం చేస్తావ'ంటారు.

"నేను చేసేదేమున్నది ! బ్రతికిద్దామని తీసుకొచ్చారు. డాక్టర్లు మీరు కృషి చేసారు. నాకు రోజులు లేవు. ఆయన అమాయకుడు, ధర్మరాజు లాంటివారు. పిల్లవాడు అల్లరివాడు. పిల్లకేమో నోట్లో నాలుక లేదు. అందరితో మంచిగా వుండగలదు. యెవరైనా చేస్తారు. బ్రతికితె కూడు గుడ్డ వున్నచోట యివ్వండి. యింట్లో 50 సవరులు బంగారం వున్నది. వున్న బంగారమంతా పిల్లకే యివ్వండి.

యింతలో బాపట్ల వెంకట్రావుగారు లోకల్ ఫండు డాక్టరుగార్ని, దేశిరాజు అప్పారావు గార్ని తీసుకుని మందులతో సహా వస్తారు.

సాయంత్రం గం. 6.50 లు.

లోకలు ఫండు డాక్టరు గారు చూచి "వైద్యములో పొరపాటు జరిగింది" అంటారు. 'యిప్పుడు నిన్ను యే జైలుకైనా యీడ్చవచ్చు పట్టుపడితె. వుదయం కులాసాగా వున్న మనిషికి యింతలో ప్రాణమోసం రావటమేమిటి ?'

సీతాపతి తాతగారు : యెవరూ జైలుకు వెళ్ళవద్దు - ఇది నావిధి. పిల్ల పుట్టినప్పుడే అనుకున్నా.

జానికమ్మగారు : యిక్కడ డాక్టర్లు పనికిరారు, తెనాలి వెళ్లి తుమ్మలపల్లి హరినారాయణ డాక్టరు గారిని తీసుకొస్తే బాగుంటుంది అని అంటారు.

సీతాపతి తాతగారు బయలుదేరి స్టేషనుకు వెళ్లారు.

అమ్మమ్మ : చిదంబర్రావుగారిని పిలిచి అమ్మ చెయ్యి, మామయ్య (రాఘవరావు) చెయ్యి కలిపి వారి చేతిలో పెడుతుంది. రాఘవరావు మామయ్య గార్కి అప్పుడు 13 సంవత్సరములు. అమ్మకు అయిదవ యేడు.

అమ్మమ్మ : ఆయనగారు వున్నారా అని చిదంబర్రావు గారిని అడుగుతుంది.

చిదంబర్రావుగారు "లేరు. ఆ చెప్పేది యేమిటో మాకు చెప్పమ్మా' అంటారు.

"వారికి చెప్పే మాట మీకెట్లా చెప్పేది" అంటుంది అమ్మమ్మ. యింతలో అమ్మకు మామయ్యకు అన్నం పెడతారు.

రైలు కూతవేసి సాగుతుంది.

అమ్మమ్మ : లేరుగా ! లేరుగా! లేరుగా ! అని మూడుసార్లు అని ప్రాణం విడుస్తుంది.

సీతాపతి తాతగారు తెనాలి చేరకముందే అమ్మమ్మ పోయిందనే కబురు తంతి ద్వారా తెలుస్తుంది.

తాతగారు, వెంకటసుబ్బయ్యగారు, ఉదయం రైలుకు వస్తారు. వాకిట్లోకి రాగానే సీతాపతి తాతగారు చిట్టికేసరపు చెట్టు క్రింద పడిపోతారు. కాసిని మజ్జిగ బట్టి లేవదీసుకుని లోపలకు తీసుకొస్తారు.

అమ్మమ్మకు ప్రాణము పోయి కింద పెడతారు.


అంతటా రాజరాజేశ్వరి :

నిద్రపోతున్న అమ్మను లేవదీసి "యిదిగో అమ్మా మీ అమ్మ పోయింది. యిక కనపడదు బాగా చూడు" అని పెద్దవాండ్లు ఏడ్వగా ఆశ్చర్యముగా అమ్మ, అమ్మమ్మను చూస్తూ "మా అమ్మ పోలేదు. యెక్కడ నుంచి వచ్చింది, యెక్కడికి పోయింది, ఏమి పోయింది. ఎప్పుడు పోయింది" అని మనస్సులో అనేక రకాల వ్యూహాలు బయలు దేరినవి. 'అమ్మ నిద్రపోతున్నదిలే - నిద్ర అయితే రోజూ యేడ్వటము లేదుగా ? ఈ రోజున యెందుకు యేడుస్తున్నారు. నిద్ర కాదేమో? అమ్మ కనపడుతున్నది. నిద్రపోతున్నది. వినపడేది ఏడ్పు. చెప్పుకునేది పోయినదని.

అమ్మ : 'మా అమ్మ పోలేదులే' అని యెదురుగుండా వున్న రేగుపండ్ల చెట్టువంక చూస్తూ ఆలోచించు చుండగా యెక్కడనుండో ఒక శబ్దము - 'రంగమ్మ పోయినది'.

అమ్మకు వెంటనే 'రంగమ్మ అనేది అమ్మ పేరేగా ! పేరు పోయినది ? పుట్టిన తరువాతగా పేరు పెట్టేది ! పేరు పోతే అమ్మ వున్నదా ? పేరుకాని, కనపడని అమ్మకాని, ఈ అమ్మకాని అమ్మ మరొక అమ్మ పోయినది. అందరూ పోయిందనే అమ్మ నాకు కనపడుట లేదు. అందరూ గుర్తించగలిగినారా ? నేను గుర్తించలేదా ' - అని యీ విధముగా ఆలోచిస్తూ వుండగా బాహ్యస్మృతి తప్పినది. మనస్సుతో చూచుచున్నది కాని కంటితో చూచుటలేదు. ఈ తరుణములో మన్నవ రాఘవయ్యగారి భార్య 'రాజమ్మ'గారు మొండిమొలతో వున్న అమ్మను దగ్గరకు తీసుకుని ఒడిలో పరుండ పెట్టుకుని పమిట చెంగు కప్పినది. తరువాత అరగంటకు అమ్మకు స్మృతి వచ్చినది. రాగానే అమ్మ పరుండపెట్టుకున్న ఆమె ముఖము వంక చూచినది. చూడగానే యీమె ఆ రాజరాజేశ్వరి అని మనస్సుకు తట్టినది. వెంటనే లేచి అమ్మ మేడమీదకి పోవటానికి ప్రయత్నించగా ఎదురుగుండా రాజమ్మ, ప్రక్కన రాజమ్మ, కాళ్ళక్రింద రాజమ్మ, యెటు చూచినా రాజమ్మ నడక సాగదు. ఆగుతుంది. మరల అడుగు లేస్తుంది. సాహసించి అడుగు వేసినప్పుడు కాలు తడబడుచున్నది, మేడమెట్ల నిండా రాజమ్మ యెటు చూచినా అదే కావటంలో - (కాని అది రాజరాజేశ్వరి).

కాని "అదీ - నేను" - వేరా అని మనస్సులో తోచినందున నడక సాగుతున్నది. మేడమీదకు ఒక గంటకు చేరి, మేడమీద నిల్చొనగానే మేడంతా ఒకే రాజమ్మ పిట్టగోడ రంధ్రాలనిండా అన్నీ రాజమ్మ తలకాయలె. యిన్ని రాజమ్మలా అని మనస్సుకు తోస్తుంది. ఒక గోడకు యిన్ని రంధ్రాలు వున్నయ్యి గనుక యిన్ని



అమ్మ చినతాతగారు కీ.శే. చంద్రమౌళి చిదంబరరావుగారు

రాజమ్మలు వుండవచ్చునులె అని అమ్మ ఒక కిటికీ వైపు నడచి కిటికీలో వున్న చువ్వలు పట్టుకొనును. ఆ చువ్వలు చేతిక్రింద ఆమె గొంతు పట్టుకున్నట్టు తగులతవి; పట్టుకున్నానా అని అనుకుంటుంది. కాదు చువ్వలె అవి మెత్తగా తగులుచున్నవి. ఆమె ముఖాలు పైన కనపడుచున్నవి. చువ్వలె గొంతుగా తోచును. యింతలో కిటికీలో గుండా యెదురుగుండా వున్న స్టేషను వైపు చూస్తుంది. చూడగా స్టేషనులో ఒకే రైలు కూతవేసి ఆగును. ఆ కూత తన చేతికింద వున్న గొంతులలో గుండా - 'నే రాజరాజేశ్వరినమ్మా!' అని వినపడును. రైలు కూతను గుర్తిస్తూనే వున్నది. పట్టుకున్నది చువ్వలు అని తెలియును. స్పర్శ, రూపము, శబ్దము, రైలు యొక్క కూత - చేతి క్రింద స్పర్శ, కనపడుచున్న రూపము, ఒకటే - రాజరాజేశ్వరి - ఆ గొంతులోనే కేకగా వినబడును. జనులు రైలు దిగి వెళ్లుచుందురు.

ప్రథమము రాజరాజేశ్వరిగా కనపడి తరువాత మామూలుగా కనపడుదురు.

'వీళ్లందరూ ఒక రైలు యెక్కి వచ్చి యెవరి యిళ్లకు వారు వెళ్లుచున్నారా ! యెక్కటానికి, దిగటానికి స్టేషన్ ఒకటే కాని యిల్లు వేరు. అయినా వీళ్లనందరిని యెవరు పుట్టించారు. వీళ్లందరిని సరేలే - యీ రైలు యెవరు చేసారు. యెవరో ఫలానివాడా, వాడికి యెవరు చెప్పినారు. వాడి తాత - మొట్టమొదట యివన్నీ యేర్పడే వున్నవా. రైలు యిటీవల వచ్చినదటగా. రైలు కనిపెట్టటము యిప్పుడు కావచ్చుగాని, రైలు చేయు పదార్థములు, యెప్పుడూ వున్నవటగా? యివన్నీ యేమిటి - పోనీలె అని

అమ్మ : 'నేను యెవరు?' అని కేక వేయును. ఆ కేకనే వింటుంది. - యెవరికి వినపడదు. 'నేనె' వింటుంది - అని నేను అనుకున్నా యెందుకంటె యెవరు మేడమీదకు రాలేదు. కేక వేసినట్టు వినపడుతుంది, తెలుస్తుంది. నిజముగా కేక వేసినాను. వెంటనే 'నేనె యిదంతా' అని సమాధానము వస్తుంది. అందుకని నేనే విన్నానన్నా.

తరువాత యిట్లా మధ్యాహ్నం గం. 12.20ల వరకు అమ్మ మనస్సులో యిట్లా అనేక వూహలతో యింతకాలము గడచినది. కండ్లు తెరవగానె క్రింద యేడుస్తున్నట్లు శబ్దము వినపడుతుంది. అమ్మకు స్పృహ వచ్చినది.

యేడుపు వినగానే పోయిన అమ్మ యింకా రాలేదు కావలయును. పోయింది తెలిస్తేగా యింకా రాలేదను కోటానికి. నాకు తెలియక పోవచ్చుగాని ఏడ్చేవారికి వచ్చినది పోయినది రెండూ తెలిసే వుండాలి.

అమ్మకు యేడుపు రావటము లేదు. పోయినది యేమిటి అని ఆవేదన ఆలోచన మిగిలింది.

గం. 1.40 లకు అమ్మమ్మకు నీళ్లు పోస్తూ వుంటారు.

"అమ్మను తీసుకు పోతున్నారు రామ్మా" అని బాపట్ల వెంకట్రావు గారు అమ్మను యెత్తుకుని వచ్చి తాటిచెట్టు క్రింద నిలుచో పెడతారు. యింతలో తాటిమట్ట రాలి అమ్మ నెత్తిన పడును. పడగానే అమ్మ తలపైకెత్తి చూచి 'యెవరూ పైన లేరు, రాలవలసిన మట్టకాదు. యెండలేదు. పండలేదు. యెవడూ కొట్టలేదు. 'అకారణంగా - కారణమై, నానెత్తిన పడ్డదిలె' అని అమ్మ బాధను మరచి తృప్తి పడును. యింతలో అమ్మమ్మకు ఫొటో తీస్తారు. శవానికి తల నిలవదు కుర్చీ మీద - తాతయ్య, అమ్మమ్మ తల పట్టుకుని వెనకవైపు నిలబడతారు.

అమ్మ అన్నయ్య (రాఘవరావు) యీ ఫోటోకు కారకుడు. యీ ఫోటో తీస్తే కాని అమ్మను యెత్తనివ్వనని బొక్కబోర్ల పడుకుని నోరు నేలకేసి కొట్టుకుని యేడుస్తాడు.

అమ్మకు వెంటనే అమ్మ (రంగమ్మ) పోయిన దానికంటె అన్నయ్య యేడ్పు చూచి మనస్సు కరిగి పోయింది. ఫొటో తీసి అమ్మమ్మను కుర్చీనుండి తీస్తూ వుండగా యీ వెంకటరావుగారె 'పోదామురా అమ్మా' అని మేడమీదకు తీసుకుని వెళ్లి మామూలు కిటికీలో కూర్చుండబెట్టి దిగివస్తారు. ఒక అరగంట అమ్మ కండ్లు మూసుకు తెరవగానే స్టేషను వైపు చూచె కాలంలో అమ్మమ్మను నిచ్చెనమీద పండుకొన బెట్టుకుని అందరూ పూలు, పండ్లు, పసుపు కుంకుమ చల్లుకుంటూ, వెనుక వైపు తాతగారు వాండ్లతో కనపడతారు. కనపడగానే "యిదిగో యిప్పుడు అమ్మ పోవుచున్నది. అమ్మకాదులె, అందరూ పోతున్నారుగా. ఆమె పండుకొని, వీళ్లు నడిచి. కాదు తేడా వున్నదె. ఆమెను వీండ్లు మోయుచున్నారు. వీళ్లకై వీరు నడుచు చ్నున్నారు. అదే దాని తేడాయేమొ ! కాదు, నేనూ, అమ్మ, మొన్న మేనామీద వచ్చేటప్పుడు చాకళ్ళు మోసినారుగా ?

వాళ్లు అనే పోవటానికి - నేను అనుకొనే పోవటానికి యేదో నాకు తెలియని తేడా వుంది. వీళ్లందరికి తెలుసుగా, నాకు వివరిస్తారేమో ! అని 'రాజమ్మ గారిని అడుగుదాములే' అనుకుంటుంది అమ్మ. సాయంకాలం మళ్లీ యెక్కడ కూర్చున్నది మర్చిపోయి.

సాయంత్రం గం. 6.30లు అవుతుంది.

యెవరో తీసుకునివెళ్లి నీళ్లు పోస్తారు. యెవరో అనిపిస్తూ వుంటుంది. చేసేదంతా రాజమ్మగానే అనిపిస్తుంది. (కొండపాటూరి పాపయ్యగారి చెల్లెలు) దీపాలు పెట్టారు. స్నానం చేయించి లోపలకు తీసుకుని రాగా ఒక బుడ్డి వెలుగుతూ వుంటుంది. బుడ్డి వంక చూడగానే అమ్మకు యీ చీకటిలో వున్న వెలుతురులో అగపడుచున్న ఒక్కసారిగా మంచము చూడగానే 'అయ్యో అమ్మ యేది ?' అనిపించింది. దీపపు బుడ్డి వత్తి పైకి వచ్చి ఒక మూర పొడుగున వెలుగుచున్నట్లు కనపడుతుంది. ఆ మూర పొడుగు జ్యోతిలో ఆ రాజరాజేశ్వరి మామూలుగా మంచములో పడుకుని వుంది. అయ్యో అమ్మ కాలుతుందేమొ అనిపిస్తుంది. జ్యోతి ఆరిపోయి రెండు బొమ్మలు కనిపిస్తవి. 'అమ్మ యెట్లా బుడ్డిలో వున్నది!' అనిపిస్తుంది. బుడ్డి మూత దీపబుడ్డిలో తాకితే కిరసనాయిలు కారుతుంది. ఆ జ్యోతికి కిరసనాయిలు ఆధారము కదా అనిపిస్తుంది. కిరసనాయిలుకు వత్తి ఆధారమనిపిస్తుంది. చేతులు సంస్కార మనిపిస్తుంది. యెక్కడో కాలుతూ వున్న అమ్మ స్మశానము, నాన్న, కంటికి అద్దినట్టు కనపడతారు. అదివరకు ఆ ప్రదేశము అమ్మ యెరుగదు. ఇంతలో అమ్మకు అన్నము పెట్టి మేడమీదకు తీసుకు వెళతారు. అమ్మ తాతగారితో "తాతయ్యా! మా అమ్మయేది ?" తాతగారు (అంటే చిదంబర్రావుగారు) "మీ అమ్మ తెనాలి వెళ్లినది".

అమ్మ : తెనాలి వెళ్లేవాళ్లందరు యిలాగే పోతారా ?

తాతగారు : లేదులే అమ్మా పడుకో ! అతి సునిశితమైన ప్రశ్నలు. (అమ్మ పడుకొనును).

అవని కన్న పావని :

అమ్మమ్మ పోయిన నాల్గవ రోజున తాతయ్య పెంచిన పిల్లి కూడా పోతుంది. బాదము చెట్టుక్రింద పడి వుండగా ప్రాణము పోకుండా పోవటానికి సిద్ధపడుతుంది.

అమ్మ చంద్రమౌళి చిదంబర్రావుగారిని "తాతయ్యా! ఇది యేమిటి! పిల్లి యెందుకు యిట్లా పడుకున్నది ?"

చిదం : చావుకు సిద్ధమయినదమ్మా ! అని వెళ్లిపోతారు.

పిల్లి అంతా కదులుతుంది. పొట్ట యెగురుతుంది. 'యెందాక యిట్లే యెగురుతుందని తలవంచి చూడగా ముక్కులు యెగురుతూ వుంటవి. ముక్కులు

యెందుకు యిట్లా వున్నవని అమ్మ చేయిపెడుతుంది. తలవంచగానే అమ్మ బొమ్మ పిల్లికండ్లలో కనపడుతుంది. ఇది యేమిటి! నేను పిల్లికండ్లలో కనపడు చున్నాను. పిల్లి నాకండ్లలో కూడా కనపడుతుందా? పిల్లికండ్లలో నన్నుచూచుకున్నాను గాని నా కంటిలో నన్ను నేను చూచుకోలేనుగా ? లేకేమి నా కండ్లేగా పిల్లి కళ్లల్లో చూస్తున్నది! గుర్తించుచున్నది నేనేగా! చూచేది కండ్లు అయినా గుర్తించేది గుర్తుగా. ఆ గుర్తు నేను. కాని ఇట్లా నా బొమ్మ నా కండ్లలో ఎందుకు కనపడగూడదు, అని అనుకొంటూ పిల్లి ముక్కువద్దనున్న చెయ్యివంక చూడగానే శ్వాస ఆగిపోయినది. బొమ్మ లేదు. శ్వాస లేదు. 'ఇందాక ఉన్న నేను ఇప్పుడు దాని కండ్లలో కనపడుట లేదు'. తాతగారిని కేకవేసి "తాతయ్యా ఇప్పుడు పిల్లిని చూడు' ' అని అమ్మ అనగా తాతయ్య "పోయిందమ్మా! పిల్లి చచ్చిపోయింద"న్నారు.

అమ్మ ఇదా చచ్చిపోవటమంటే ! అని ముక్కు దగ్గర చెయ్యి పెట్టుకొని చూసుకొంటుంది. రెండు నిముషములలో ఏమి చేయుచున్నది అమ్మకు గుర్తు లేకుండాపోతుంది. తరువాత 12 గంటలకు అమ్మకు మెలకువ వస్తుంది. ఎప్పుడు మెలకువ వస్తే అప్పుడు ముక్కు దగ్గర వ్రేలు పెట్టుకొనటము, పెట్టుకొనగానే తన్ను మరవటము.

ఇదే ప్రాణాయామ సిద్ధి. దీనికే అప్రయత్నమైన హఠయోగమని పేరు. అమ్మ, అమ్మమ్మ కర్మాంతరములకు మన్నవబోయి బాపట్లకు వచ్చిన తరువాత ప్రతిరోజూ ఇద్దరు పిల్లలతో బాపట్ల భావన్నారాయణస్వామి దేవాలయానికి వెళ్లి పొగడచెట్టు క్రింద కూర్చుని కొన్ని గంటల కాలము గడిపి వచ్చేది. ఆ యిద్దరి పిల్లల పేర్లు (1) పంగులూరు శేషతల్పశాయి కూతురు అనసూ[illegible]. (2) మాధవపెద్ది కాళిదాసుగారి కూతురు నాగలక్ష్మమ్మ.

నెల రోజులు వెళ్లిన తరువాత ఒక రోజున స్నేహితులు 'ఎప్పుడూ ఒక్క టెంకాయన్నా తెచ్చుకోవే ! నీవు మట్టి తెచ్చావా' అని ఎగతాళి చేస్తారు.

అమ్మ 'ఏమి చేసేది మట్టికూడా లేదు' అని మనసులో అనుకొని ఎవరిని అడిగేది, ఇస్తారో ఇవ్వరో అని ఆలోచిస్తూ అరికాలు రుద్దుతూ ఒకసారి ఎందుకో చేతివంక చూచుకొంటుంది. చేతికి ఎందుకో ఎఱ్ఱ రంగు దుమ్ము అయి ఉంటుంది. యిందుకేనా వాళ్లు మట్టి తెచ్చావా అన్నది. కొబ్బరికాయ తెచ్చినవారికి యీ మట్టికాదా నాకు యెందుకయిందని, అమ్మ వారి పాదాలవంక చూస్తుంది. వారికీ యిలాగే వుంది. అసలు మట్టి ఎందుకు అవుతుంది ? క్రింద నడుస్తాము గనుక. నేల

యేరంగున వుంటే పాదమునకు ఆ రంగు అవును అని అమ్మ అనుకొని, నేలను నడువని వారు యెవరైనా వుంటారా అని అమ్మ ఆలోచించి గుడి ముందు వాకిట్లోకి వచ్చి నుంచుని పక్షులు మినహా అన్ని క్రిందనే నడుస్తున్నవి. పక్షులు కూడా కొన్ని క్రిందకు వ్రాలుతున్నవి. కొన్ని చెట్టుమీదకి వ్రాలినా ఆ చెట్టుకు నేలే ఆధారము. అమ్మ గుడి ప్రక్కకు వచ్చి పైకి చూడగా కొబ్బరి చెట్టు కొబ్బరి కాయలు కనపడును. అమ్మ ఆశ్చర్యముగా దృష్టి క్రిందికి త్రిప్పగానే అమ్మ వారికి పూజచేయు పూలు, తులసిదళములు నేలమీదనే మొలచి వుండును. అమ్మ పూలు తులసి దళములు కోసుకొని గుళ్లోకిపోయి అమ్మ నేలమీద పెట్టును. అర్చకుడు అమ్మను గదిమి పెద్దగా అరచి 'క్రింద పెడతావేం ? తప్పకాదూ, అమ్మవారి పూలు క్రింద పెట్టవచ్చునా' అంటారు.

అమ్మ : చెట్టు క్రిందనే మొలచింది కదా అని పెట్టాను. అది పెట్టటం తప్పు అని తెలియలేదు అనబోయి చెట్టు క్రింద మొలవటం తప్పా అని అన్నది.

అర్చకుడు "అదెవరన్నారు?" అంటూ చటారి (శఠగోపం) తీసుకొచ్చి పిల్లలిద్దరికి, అమ్మకు పెడతాడు. పిల్లలిద్దరు కొట్టిన కొబ్బరికాయలు నాలుగు చెక్కలవుతాయి. అమ్మ వాటిని చూచి రెండు కాయలు నాలుగు భాగాలయినాయని ఆలోచిస్తు మండపం మీదకు వెళ్లి 'మీరు వెళ్లండి నేను రాను' అంటుంది పిల్లలతో.

పిల్లలు ఒక చెక్క అమ్మకు యిచ్చి వెళ్లిపోతారు.

అమ్మ ఆ చెక్కను అనేక ముక్కలు చేసి, ముక్కలు చేతిలో పెట్టుకొని ఒకటే అనేక మయినవి అని అనుకొంటూ గుడిలోకి వచ్చే ప్రతి మనిషిని 'కొబ్బరికాయ అంటే ఏమిటి, కొబ్బరికాయ ఎందుకు కొట్టాలి ?' అని అడుగుతుంది. ప్రతి ఒక్కరు 'కుంటి ప్రశ్న, గుడ్డి ప్రశ్న' అనుకుంటూ సమాధానం చెప్పకుండా వెళ్లిపోతారు.

అమ్మ ఆ రోజంతా యింటికి వెళ్లక మండపములోనే కూర్చుని 'అసలు ప్రతి వస్తువు యెక్కడనుండి పుడుతున్నదో ! అనుకుంటూ ఆరాత్రంతా అక్కడే గడుపుతుంది.

రాత్రి 7 గంటలకు స్థానాచార్యులుగారు రామాయణం పురాణం చెపుతారు. ధర్మాలు చెప్పినట్టుగా ఉంటుంది.

అమ్మ : ధర్మమంటే యేమిటి? చేసేది ధర్మమా? చెప్పేది ధర్మమా? చూచేది ధర్మమా? ధర్మమంటే అర్థము కాలా. తాతగారిని (చిదంబర రావుగారు) అడుగుదాం.

ఇంతలో రుద్రాక్షలు, ముఖాన కణితి గల బాపట్ల సుబ్బారావుగారు (ధర్మకర్త దగ్గర గుమస్తా) గుడిలోకి వచ్చి "యేంమ్మా యింతసేపున్నావ్ రాత్రి 8 గంటలయినది. మీ యింట్లో నవరాత్రిళ్ల పూజకదా! మీ మేనత్తగారు కలశం పెట్టలా ?"

అమ్మ : కలశమంటే యేమిటో తెలియదు. నేను ఒకటి అడుగుతా, చెబుతారా తాతగారు?

సుబ్బా : అడుగు అమ్మా !

అమ్మ "యిద్దరం కలసి పొగడ చెట్టు క్రింద కూర్చుందాం పదండి", అని చెట్టు క్రిందకెళ్లి కూర్చుంటారు.

అమ్మ : దేముడుకు పూజ చేసే పసుపు, కుంకుమ, దేముడుకు పెట్టే సొమ్ములు, కట్టిన గుడ్డలు, పెట్టే నివేదనలు, యీ పాత్రలు, యీ పళ్లాలు వీటి పుట్టుక యెక్కడ ? యెక్కడ తయారయినాయి ?

సుబ్బా : చెట్టు క్రింద మొలచినవి కనబడుచున్నవి కదా. పసుపంటే అది క్రిందనే, కుంకుమ పసుపుతో తయారైనదే, అన్ని లోహములతో తయారైనవే.

అమ్మ : ఆ లోహములు యెక్కడ పుట్టినవి?

సుబ్బా : అవీ క్రిందనే పుట్టినయ్యమ్మా (అంటూ) 'ప్రొద్దు పోయింది వస్తా' నంటూ లేస్తారు.

అమ్మ : ఒక్కమాట వినిపొండి తాతగారు (అంటుంది అమ్మ). యింతకు ఆ పూజ చేయించుకొనే దేముడు యెక్కడ పుట్టాడు?

సుబ్బా : యెక్కడా గుళ్లో వున్న విగ్రహాలా ? అంటాడు.

అమ్మ : విగ్రహాలంటే దేముడు కాదా :

సుబ్బా : కాకేం, దేముడే

అమ్మ : మరి నేను దేముడు అంటే గుళ్లో వున్న విగ్రహాలా అంటారేం ?

సుబ్బా : పిచ్చి ప్రశ్నలు. నేను వొస్తా. ఫోఫో యింటికి ఫో. (అంటూ వెళ్లిపోతాడు).

అమ్మ మండపంలో పడుకుని యింకా యెవరన్నా వస్తే బాగుండును. యివన్నీ అడుగుదాం అనుకుంటుంది.

అమ్మ వయస్సు 4 సంవత్సరములు. యింతలో ముక్తినూతలపాటి శ్రీరాములు (ప్లీడరుగారి గుమాస్తా) గారు గుడిలోకి వచ్చి మండపం మీద స్నేహితులతో కూర్చోటానికి వస్తారు. అమ్మను చూచి నోటిమీద చేయి వేసుకొని 'యెందుకమ్మా యిక్కడున్నావు పోదాంపద' అని యెత్తుకొని ముద్దు పెట్టుకుంటారు. స్నేహితులతో 'ఈ బిడ్డకు తల్లి లేదు. చాలా బుద్ధిమంతురాలు, అల్లరి చేయదు' అంటారు. యింకాయేం నీకు పిల్లలు లేరుగా పెంచుకో ! అంటారు స్నేహితులు. 'యీ రాత్రి యింటికి వెళ్దాం అమ్మా ప్రొద్దుపోయిందిగా!' అంటారు. "బుద్ధిమంతురాలి నంటిరిగా యిక్కడుంటాలె. నీవు చెప్పినట్టు వినకపోయినా బుద్ధిమంతు రాలంటావా ? బుద్ధిమంతురాలంటే అసలు ఏమిటి బుద్ధి కలిగిందనా? బుద్ధిలేని వారుండరుగా, కుక్కకు కూడా బుద్ధి ఉన్నదిగా!'

శ్రీరా : బుద్ధి అంటే గుణమమ్మా.

అమ్మ : గుణము లేనివి వుండవుగా, అన్నిటికి గుణము లున్నవిగా.

పక్క స్నేహితులు : యీ అమ్మాయి చాలా అసాధ్యముగా వున్నదే !

శ్రీరా : నీకు కాని యిస్తాకాని, కొట్టు మూతవేయబోతున్నారు. యేమైనా కొనుక్కొచ్చుకో - ఫో అంటారు.

అమ్మ : నేను కానివ్వమనే అంటున్నా.

శ్రీరా : కవిగారి మనమరాలు గాదూ! అంటారు అందరూ కలసి. శ్రీరాములుగారు అమ్మ చిటికెన వ్రేలు పట్టుకుని బయలుదేరి పోతూ వుంటారు. మధ్యలో అమ్మ శ్రీరాములు గారికి కనపడదు. శ్రీరాములు గారు చేతిలో వేలు జారిపోయినట్లుండి పక్కకు చూచి స్నేహితులతో అమ్మాయేది ? అని అడుగుతారు. 'మేము చూడలేదండి' అని వారు సమాధానము చెవుతారు. అట్లా అనుకొని వారు వెళ్లిపోతారు.

అమ్మ తిరిగివచ్చి గర్భగుడి లోపలకు వెళ్లి ఒక మూల నుంచుంటుంది. అర్చకుడు అమ్మను చూడక తలుపులు వేసి వెళ్లిపోతాడు. అమ్మ ఆరాత్రంతా గుడిలోపల వుండి రాజ్యలక్ష్మి అమ్మవారి దగ్గరకు వెళ్లి 'ఆయన విగ్రహాలన్నాడే యేమిటో చూద్దాం. విగ్రహాలేనా దేముడంటే వేరే వుంటాడా?' అమ్మవారిని తాకి చూద్దాం అనుకొని జంకు లేకుండా ముందు కళ్లకు పెట్టిన డిప్పలను లాగివేసి వాటిలో కళ్లలాంటి గుడ్లు వున్నవేమోనని చూచును. యేమీ కనపడవు. క్రమంగా

అమ్మవారికి కట్టిన గుడ్డలు అన్నీ తీసి తరచి తరచి చూడగా అంతా రాయిగా కనపడును. రంగులు పూసినట్టుగా జిడ్డుగా చేతికి తగులును. పిలచినా పలుకదు, కదిలించినా కదలదు. 'యిదేనా దేముడంటే !' అనుకొని మళ్లీ అన్నీ పెడదా మనుకుంటే చేతగాక పోవుటచే ఒక పక్కను పెట్టి 'అమ్మవారు అన్నీ వున్నప్పుడు ఒకరకం, తీస్తే ఒకరకం, యీ అలంకారమేనా దేముడు !' అని తీసినవన్నీ దగ్గర పెట్టుకుంటూ వాటిని చూసుకుంటూ, "యీ సొమ్ములు చేసినవాడు దేముడా, యీ చీర దేముడా, ఆ రాయి చెక్కినవాడు దేముడా, వాటిని దేముడు అనుకొనేవాడు దేముడా, అసలీ పదార్థములన్నీ యిచ్చిన భూమి దేముడా, యీ భూమిని గూడా యెందుకు పూజ చేయకూడదు ! అన్నింటికి ఆధారము కదా ? అందులో పుట్టిన వస్తువులు పెట్టి ఆమెను కాదని దేనికో పూజచేస్తూ, అమ్మ (భూమి)ను నిరాకరిస్తూ అని అమ్మ మట్టి పట్టుకుని (మట్టిని) 'అమ్మా నీలో పుట్టి, నీలో పెరిగి, నీలో లయమయ్యే వస్తువు లన్నిటికీ పూజచేస్తూ నిన్ను గుర్తించ నివ్వకుండా చేస్తున్నావా?' అని మట్టితో మాట్లాడుతుంది అమ్మ. 'చైతన్యాలకు కూడా ఆధారంగా వున్న నీవు సర్వభూతాలకు యింత జడత్వంగా కనపడతావేఁ'.

(రాజుగారి పాట : హే అఖండ దివ్యజ్యోతి దారి జూపరావె - అను పాట).

అమ్మ (భూమిని) 'అమ్మా ! అమ్మ పోతూ అమ్మను చూపించి (మెల్లగా); అమ్మవు నీవె. అమ్మ అంటే అర్థం కాదు - ఎందుకు కాదంటే - తర్వాత చెప్పుతాలె' అని అనుకుంటుంది తనలో తానె.

'ప్రతి వస్తువును అన్వేషించి, విమర్శించి, వివరించి నీవెవరో నీతోనె చెపుతాలె' అని భూమితో అంటుంది. ఆ రాత్రి దేవాలయములో ఒక మూల నక్కి కూర్చుని ఉదయం గం. 8.30 లకు వాకిలి ముందరకు రాగా అదే సమయానికి అర్చకుడు తలుపులు తీసి యెదురుగా వున్న అమ్మను చూచి తను ఆరాధిస్తున్న రాజ్యలక్ష్మి అమ్మవారనుకొని సాష్టాంగ నమస్కారము చేసి వొళ్లు తెలియక ఒక అరగంట సేపు కదలక తరువాత కళ్లు తెరచి చూడగా అమ్మవారు కనపడదు.

మెల్లగా అమ్మ బైటకు వస్తుంది.

నేను చూచింది నిజమా, భ్రమా అనుకుంటాడు, రంగాచార్యులు గారు లోపలకు వెళ్లి రాజ్యలక్ష్మి అమ్మవారి వద్ద పడుకుని, నిజమైన దర్శనమిచ్చావు

తల్లీ అని సొమ్ములన్నీ వొలచిన విగ్రహము వంక చూడక, గుమ్మములో చూచిన అమ్మ రూపమునే మనసులో పెట్టుకుని నమస్కారము చేయును. ఆ రోజంతా యెక్కడ చూచినా ప్రతి వస్తువులోను అమ్మ రూపమే గోచరించును.

గుడి ధర్మకర్త దేశిరాజు రంగారావు గారు వచ్చి, 'యేం రంగాచార్యులుగారూ ! యీ రోజు అమ్మవారిని దిగంబరిగా వుంచారేం, దిగంబరోత్సవమా !' అంటారు.

రంగాచారి : 'లేదయ్యా వొంట్లో సరిగా లేదు. తిరువెంగళా చార్యులు గారు వస్తాడుగదా అనుకుంటే ఆయన కూడా రాలేదు' అంటూ లోపలకు వచ్చి అమ్మవారిని వివరంగా చూస్తాడు. గుడ్డలు లేవు. సొమ్ములు లేవు. పాపం ధర్మకర్తగారు మంచివాడు కనుక నన్ను ప్రాణాలతో వుంచాడు అనుకొని తహతహలాడుతూ వొళ్లు చెమటలు పట్టి నరములు వొణుకుతూ, ప్రొద్దున ఆయిన దర్శనముతో ఆనందపడుతూ, సొమ్ములన్నీ వెతికి కనపడక అమ్మవారికి వేరొక చీర కడుతూ 'యేంమ్మా రాయిలో నుంచి అలంకారముతో సహా నాలో ప్రవేశించావా? వొట్టి రాయే వుంచావా ? యీ సొమ్ములు దొరకక వుద్యోగము పోయినా నీవు నాలోనే వుంటావా ? నా కళంకము పోయేటట్టుగా అలంకారానికి సొమ్ములియ్యమ్మా' అంటూ వుండగా సొమ్ములున్నచోటు మనస్సుకు తట్టుతుంది. సరాసరి ఆమూలకు వెళ్లి సొమ్ములు తెచ్చి 'యెప్పుడూ సర్వకాలం యిట్లాగే కాపాడుతూ వుండుతల్లీ !'' కాని మనస్సులో అమ్మవారు విగ్రహములో లేదు. విగ్రహంలోని యంత్రబలము నాలో ప్రవేశించినది. యెక్కడున్నా కాపాడుతుంధీ అని దృఢవిశ్వాసంతో అలంకారము పూర్తవుతుండగా ధర్మకర్త ప్రవేశించి ''యేమోయ్ దొంగిలించింది తెచ్చిపెడుతున్నావు. నీకు రావలసినది లెక్కచూసుకో'' అంటారు.

రంగాచారి : నాకు రావలసినది తరువాత చూద్దాం, మీరు సొమ్ములు లెక్కచూసుకోండి.

ధర్మకర్త : అర్చకుడి దొంగతనాన్ని అమ్మవారు కూడ పట్టుకోలేదు. అందుకనే యింట్లో దొంగను యీశ్వరుడయినా పట్టలేడనే సామెత. యిది యీ దొంగతనానికి వర్తిస్తుంది అని అంటారు కోపంతో.

రంగాచారి : (ధర్మకర్తగారి మాటలు విని) 'నాకు యీ ఉద్యోగము పోయినా సరే. నీ రూపు మాత్రము మరపురాకుండా చేయమ్మా' అని అమ్మను ప్రార్థన చేసి, రంగారావుగారితో 'నేను చేసినా వొట్టి రాయికేగా !' అని నమస్కారము చేసి' బయటకు వెళతారు.

రంగారావు : యీ వెళ్లటము యిక యిట్లాగే వెళ్లవోయ్ ! అంటారు. రంగాచార్యులుగారికి అమ్మ దృశ్య రూపముతో స్పష్టముగా అనుక్షణమూ కనపడుతుంది. ఉద్యోగము దూరమవుతున్నకొద్దీ అమ్మ స్పష్టముగా కనపడుతున్న దనుకుంటూ వీధిలోకి వచ్చి నిలబడతాడు.

రంగాచార్యులు గారు నమస్కారము చేసేటప్పుడు బయటకు వెళ్లిన అమ్మ ఉదయం పదిగంటలయినా యింటికి జేరలేదు. చిదంబ రావుగారి యింట్లో నవరాత్రులు వుత్సవాలు జరుగుటచే అమ్మను గురించి ఆరా తెలుసుకోరు. అమ్మ రైలు అవతల వాడకు దగ్గరగా వున్న అద్దంకి వారి తోటనుండి సరాసరి గుడి దగ్గరకు వస్తుంది.

రంగాచారి గుడి వాకిట్లో నిలుచుని వుంటారు. వారికి అమ్మవారు కనుపించిన ముఖం యీ అమ్మలో కనుపించును. అమ్మవంక తదేక దృష్టితో చూస్తూ వుంటారు. ఒక పావుగంట జరిగిన తరువాత 'నీవు యెవరమ్మాయివమ్మా' అంటారు.

అమ్మ : యెప్పుడు యెక్కడ వుంటే వారి అమ్మాయిని.

రంగాచారి : అయితే యిప్పుడు నీవు మా అమ్మాయివా !

అమ్మ : అనుకుంటె కానా ?

రంగాచారి : 'మా అమ్మ వేరే వుంది. మా అమ్మ నీకు కనపడుతుందామ్మా మా అమ్మ సామాన్యము కాదు' అంటాడు.

అమ్మ ' ఏ అమ్మ మీ అమ్మ ? మాయమ్మా ! అని (అంటె మాయ అమ్మ) కనుపించకుండా పక్కకు పోవును.

రంగాచారి : యెదురుగుండా అమ్మ లేకపోవుటను గమనించి ' యీ అమ్మే దర్శనమిచ్చిన అమ్మేమో'నని అమ్మ కనుపించక పక్క బజారు శివాలయము మీదుగా పరుగెత్తుతారు. నోరి సుబ్రహ్మణ్య శాస్త్రి గారి యింటి వద్ద పది గజాల దూరములో అమ్మ మరల కనపడి రంగాచార్యులు నడుస్తున్న కొద్దీ అమ్మ పరుగెత్తి స్టేషను వైపుకు వెళ్లి నేరేడు చెట్టు క్రింద కూర్చొనును. నేరేడు చెట్టు క్రింద వున్న అమ్మ దగ్గరకు వెళ్లి 'అమ్మా ! నిన్న నాకు కనిపించినది నీవేనా ? నిజం చెప్పు' అని అడుగుతారు.

అమ్మ : నిన్నా, మొన్నా నీకు కనిపించినది ? నీవు నిజం చెప్పు ?

రంగాచారి : పొరపాటుబడ్డా, అమ్మా తెల్లవారు ఝామున.

అమ్మ : తెల్లవారుఝామున కనపడ్డానా, నిజం చెప్పు, అయితే నీవు నా సొమ్ములు కాజేయటానికొచ్చావా. గుళ్లో అమ్మవారివి కాజేసినట్టు.

రంగాచారి : (కళ్ళు పెద్ద కళ్లుచేసి) అమ్మా! అమ్మా! పొరపాటు పడ్డాను. యెనిమిది గంటలకమ్మా కనపడ్డది నీవేనా ? ఆ రాతిలో వున్న యంత్రం నీవేనా ! నిన్ను యెవరూ అర్థం చేసుకోలేరు (అంటూ పాదాల మీదపడి అర్ధగంట వరకు పడుకుని) 'మాయ కప్పకమ్మా, మాయ కప్పకమ్మా' అని యేడుస్తాడు. 'రోజూ వచ్చే అమ్మను గుర్తించలేక పోయాను. ఒకనాడు కొట్టటానికి చేయి కూడా యెత్తాను. ఎందుకిట్లా చేయిస్తున్నావు. అమ్మా నన్ను తొందరగా నీలో కలుపుకో తల్లీ' అని చెట్టుక్రిందనే వారుకూడా కూర్చుంటారు.

అమ్మ అదివరకున్న కవళికలు మారి సామాన్యమైన అమాయక పిల్లలా కనపడుతుంది. 'నాయనా ! నా కాళ్లమీద పడి నన్ను అమ్మా, అమ్మా అంటావేం? నేను చిన్నపిల్లను. చిదంబర్రావు గారి బావమర్ది కూతురును. మా అమ్మ పోతె యిక్కడ పెరుగు తున్నాను. నేనేదో గుడిలోకి అమ్మవారిని దర్శనము చేసుకుందామని అప్పుడప్పుడూ వస్తూ వుంటాను. నన్ను అమ్మాయి అను నాయనా! నేను నీవనుకున్న అమ్మను కాను'. అమ్మ చెప్పేటప్పుడు రంగాచార్యులు గారికి అది నిజమని తోచి 'సరేలే వెళ్లు నా మనోభ్రమేలే అమ్మా ! నీవు చెప్పినదిగానె కనపడుచున్నది'.

అమ్మ తిరిగి యింటికి వెళ్లిపోతూ వుంటుంది

రంగాచార్యులుగారు తిరిగి యింటికి వెళ్లిపోతారు.

'నీకేం ఫర్వాలేదు నీ వుద్యోగం నీకు వస్తుంది' అన్న మాటలు రంగాచార్యులు గారికి వినపడుతూ వుంటాయి. యింటికి వెళ్లి మంచము వేసుకుని పడుకుంటారు.

అమ్మ యింటికి వెళుతూ దారిలో ఆస్పత్రి వద్ద వున్న చెట్టు క్రింద పున్నాగ పూలు ఏరుకుని యింటికి వెళ్లి అమ్మవారి పూజా మందిరము దగ్గర 'అత్తయ్యా ! పూలు యివిగో' అని నేలమీద పెడుతుంది. అమ్మ మేనత్తగారు 'క్రింద పెడతావే' మని అమ్మ చెంపకు బెట్టి కొట్టబోతుంది. అమ్మ ఆ పూలు అక్కడ బెట్టి దొడ్లోకి వెళ్లి గులాబీ పూలు కోసుకొచ్చి 'యెక్కడ పెట్టమంటావ'ని అడుగుతుంది. (అమ్మ మేనత్త పేరు అన్నపూర్ణమ్మగారు)

అన్న : నీ నెత్తిన పెట్టుకో ! అంటుంది.

అమ్మ నెత్తిన పెట్టుకుంటుంది.

అన్న : (కళ్లు పెద్దవి చేసి) అందుకేనా పూలు తెమ్మన్నది.

అమ్మ : పెట్టుకోమంటేనేగా పెట్టుకున్నది ! పూలు తెమ్మంటే తెచ్చా, పెట్టుకోమంటే పెట్టుకున్నా, తెలియంది అడిగా, చెప్పింది చేసా.

పురోహితుడు ప్రఖ్యా సుబ్బయ్యగారు ఇంతలో వచ్చి 'ఆ అమ్మాయి నెత్తిన పెట్టుకున్నా దోషము లేదమ్మా. ఆ అమ్మాయి బాలగాదూ, పిల్లలకు దోషము లేదు. పూజ చేయవచ్చు'. అన్నపూర్ణమ్మ గారినుద్దేశించి. 'అమ్మగారూ నిన్న ఈ అమ్మాయి గుడి మండపం దగ్గర కనపడ్డదమ్మా. మీకు యేమవుతుంది ? యెవరో పెద్ద పెద్ద వాళ్ళతో మాట్లాడుతున్నదే !'

అన్నపూర్ణమ్మ : పెద్ద వాళ్ళ దాకానా ! అన్నం పెట్టమని అడగటమే రాదు. మీరు యెవరిని జూచి అనుకున్నారో ?

పురో : లేదమ్మా ఈ అమ్మాయేను ! స్పష్టంగా చూచాను. యేదో విశేషముందని చెప్పకుంటూంటే విన్నాను.

అన్న : అవన్నీ సరే, తిరిగి మీరు ముందు పూజ మొదలు పెట్టండి.

పురో : యేమోనమ్మా నాకు కూడా అమ్మాయి వంకనే చూడబుద్ధి పుడుతూంది. పూజ మొదలు పెట్టబుద్ధి పుట్టటం లేదు.

అన్న : మీరు కాకపోతే మరొకరు వస్తారు.

పురో : లలితా సహస్ర నామము చేత పట్టుకుని తను అమ్మకు చేస్తున్నట్లుగా నామాలు చెపుతాడు. ఒక్కొక్క పువ్వు చేతపట్టుకుని నామాలు చెపుతూ అమ్మ వంకనే చూస్తూ తను అమ్మకే చేసినట్లు భావిస్తూ - యిటు పూజ చేసుకున్నట్టూ, అటు నామాలు చెపుతున్నట్టూ ఒక గంటలో పూజ పూర్తి చేస్తాడు. తను ఒక కొబ్బరికాయ తీసుకుని అమ్మవంక చూస్తూ కాయ కొడతారు. అమ్మవారికి పూజ చేసినట్లుగా మానసికంగా అమ్మకు పూజ చేస్తారు. అమ్మ దేశిరాజు రంగారావు గారింటికి వెళ్లి వాకిట్లో అరుగు మీద కూర్చుంటుంది. రంగారావుగారు బజారు నుంచి అప్పుడే యింటికి వస్తూ అరుగుమీద కూర్చున్న అమ్మను చూచి 'నీవెవ రమ్మాయి వంటారు'. అమ్మ పెద్ద వయస్సుగా కనపడును.

అమ్మ : నేను రంగాచార్యులుగారి బంధువును.

రంగారావు : నీకేమవుతారమ్మా ?

అమ్మ : (వరసకు) కొడుకు అవుతాడు. అంటే - వాళ్ళ అమ్మ, నేను అప్పచెల్లెళ్ళ వరస.

అమ్మ : నీవు ఇప్పుడు వాళ్ల యింటి నుంచి వస్తూ వున్నావా అమ్మా ! అంటారు.

అమ్మ : లేదు. వాళ్ల ఇంటి నుంచి కాదు. వాళ్ల ఇంటికి వెళుతున్నా, యెవరో ఉద్యోగం తీసివేసారట రంగాచార్యులకు. చాలా మంచివాడు, యోగ్యుడు. ఆ గుడికి వాడిచేత అర్చన జరిగే యోగ్యత లేదు' అంటుంది అమ్మ. యీమె అంటూంటే ఎవరో దేవత పలికినట్టు, 'ఆకాశవాణి పలికినదా' అనిపిస్తుంది. వెంటనే గొడుగు వేసుకొని రంగారావుగారు యివ్వవలసిన జీతానికి పెచ్చుగా పది రూపాయలు తీసుకొని పువ్వులు, పళ్లు చేత బట్టుకొని స్వయముగా రంగాచార్యులు గారి యింటికి 'నైవేద్యము పెట్టు' అని జీతము కాక పది రూపాయలు పెచ్చుయిచ్చి 'యీ పది పెట్టి ధోవతి, వుత్తరీయం కొనుక్కో'మని చెప్పి రంగారావుగారు యింటికి వస్తారు. రంగాచార్యులు గారు వుద్యోగములో ప్రవేశిస్తారు. అరుగుల మీద కూర్చుని వున్న అమ్మ చిదంబరరావు గారి యింటికి వెళుతుంది.

అమ్మ వయస్సు 4 సంవత్సరముల 7 మాసములు.

పరిణామ విచారణ :

రెండవరోజు అమ్మ తెల్లవారు ఝామున గం. 4.30 లకు లేచి ముఖము కడుక్కుని పూజకు దొడ్లోకి పూలకు వెళుతుంది. పూలు కోయుటకు కొమ్మ వంచగా కొమ్మ అమ్మతో మాట్లాడినట్లుండును. 'కొమ్మలో నుంచి ధ్వని వచ్చిందా! నా మనస్సా' అని అమ్మ ఆలోచించగా పువ్వు కోసిన చోట చమ్మ వచ్చును. అమ్మ 'కొమ్మ ఏడుస్తున్నదేమో!' అనుకుంటుంది. చెట్టును వదిలేసి అమ్మ 'అసలు యేమిటి?' అనుకుంటుంది. మనస్సులో 'అసలు యేమిటి అంటే యిది యేమిటి అసలు యిది యేమిటి' అని అరటి చెట్ల దగ్గరకు వెళ్లి అరటి యాకు కోయబోగా అరటి పాదులో మురుగుడు వాసన వచ్చింది, ఆకులు సువాసన వచ్చును. 'చెట్టు పెరిగింది. ఆకు పెరిగింది. మురుగుడు వల్ల దానితో పెరిగిన ఆకు మంచివాసన. దీనికి దుర్వాసన కారణమేమిటి?' అని వేరుచోట పాడి మట్టిలో

నీరు పోసి బురద చేసి మరొకచోట గుంట తవ్వి (నీరు బయటకు వచ్చేదాక) వేరొకచోట మళ్లీ ఆ పూటనీరును పాడి మట్టిని కలిపి బురదచేసి రోజూ నీళ్లు పోయగా అదే మురుగు అయి ఒక నెల రోజులకు అందులో పచ్చి ఆకులు కలపగా మూడూ కలిసిన తరువాత కొన్ని రోజులకు లుకలుక లాడి పురుగు పుట్టును.

అమ్మ అది చూచి యేది జడత్వము, యేది చైతన్యము అని తోచక మళ్లా ఒక యెడారిలోకి వెళ్లి అమ్మ బైలికి కూర్చుని దానిమీద మట్టి కప్పి వచ్చును. మూడు రోజులకు వెళ్లి చూడగా రూపము మారి మరొక రూపము దాల్చెను. కొన్ని రోజులకు మట్టిలో మట్టి కలిసి పోయినది. అమ్మ 'అసలు దీని రూపం యెక్కడ, యిది రావడానికి కారణమేమిటి ?' అని ఆలోచించుతూ ఒక రోజు చలిది అన్నము భోంచేస్తూ వుండగా, అమ్మ పినతల్లి కుమార్డు మతుకుమల్లి శ్రీధరరావు రెండు సంవత్సరముల కుర్రవాడు అమ్మ కెదురుగా తులసికోట మీద బైలికి కూర్చుంటాడు. అమ్మ పినతల్లి శేషమ్మగారు ఆ పిల్లవానిని ముందుకు పడేటట్లుగా 'తులసికోట మీద కూర్చుంటావా తప్పుకాదా' యని వీపుమీద కొడుతుంది. అమ్మ ఆ దృశ్యము చూచి అన్నము తినలేక లేచిపోయి క్రిందపడ్డ పిల్లవానిని పైకి లేవదీస్తూ విరోచనము వంక చూడగా అమ్మ అన్నములో కలుపుకు తిన్న పదార్థము (దోస గింజ) దానిలో కనపడును. అమ్మ అది చూచి "నేను అన్నములో కలుపుకు తినేది ఇందులోకి వచ్చిందే !' అని వంట ఇంట్లోకి వెళ్లి వంట మనిషి తరిగి పెట్టిన కూరల వంక చూడగా, కొన్ని దోసకాయలు పచ్చడికి, కొన్ని కూరకు, కొన్ని పులుసుకు ఒకే రకము కాయలను ముక్కల తేడాతో తరిగి వుంచుతారు. తరిగి వుంచినవి చూచి గంపలో ఉన్న దోసకాయలను చూస్తూ ఒక కాయ చేతికి తీసుకొని కత్తిపీట పెట్టుకొని ఆ ముక్కలు చూస్తూ ఆ ఒక కాయనే వారు తరిగినట్టుగా అన్ని రకాల ముక్కలు తరుగును. ఒకే కాయను అనేక రకాల ముక్కలుగా తయారుచేసి పొయ్యిమీద వుడుకుతున్న పదార్థముల వంక చూచి ఒక పొయ్యిమీద చూచి వుడుకుతున్న పప్పును, మరొక కుంపటిమీద కాయలకు కాయలు కాలుతూ దానిలో నుంచి సుయ్యిమని వచ్చుచున్న శబ్దమును వింటూ మూడవ పొయ్యిమీద వున్న పులుసును చూచి అన్నము వండారా రాఘవమ్మగారూ! అని అడుగుతుంది.

రాఘవమ్మ : అన్నం వుడికిందమ్మా. కూర తిరగమాత వేసి అన్నం పెడతానమ్మా.

అమ్మ : నాకోసం కాదమ్మా, మీరు వంట చేసేటప్పుడల్లా నన్ను పిలవండి.

రాఘవమ్మ : యేం ? వంట చేస్తావా !

అమ్మ : లేదమ్మా పొయ్యి మంట చేయటం నేర్చుకుంటా.

రాఘవమ్మ : సరేలే ! 'యింత చిన్నపిల్ల యెన్ని మాటలు మాట్లాడుతుంది' అనుకుంటూ చీపురు పుచ్చుకు యిల్లు చిమ్ముతుంది. ఆ చీపురుతో యింటిలో ఉన్న తుక్కు అంతా ఒక మూలకు చేరుస్తుంది.

అమ్మ అది చూచి అమ్మ 'చీపురు తుక్కునంతా ఒక మూలకు చేరుస్తుందా!' అనుకొని అమ్మ చీపురు పట్టుకొని దొడ్లో బాదం చెట్టు క్రిందకు వెళ్లి రాలిన ఆకునంతా చిమ్ముతూ కొంత దూరము చిమ్మి చీపురు అక్కడ పడవేసి వంట అయిందేమో చూద్దాం అని అమ్మ ఇంట్లోకి పరుగెత్తుకుని వచ్చి యిందాక తరిగిపెట్టిన వాటికి, యిప్పుడు పక్వమైన వాటికి తేడా చూచి అమ్మ రోజా 'జరిగే ప్రతి ఒక్క వస్తువులో యీ మార్పు ఉంటుందేమో' అంటూ అమ్మ, 'రాఘవమ్మ గారూ ! నీకీ వంట యెవరైనా నేర్పారా, లేక మీరే నేర్చుకున్నారా? చేసేటప్పుడు వంటలో యేది ముఖ్యమనిపిస్తుంది ? పదార్థాలా, గిన్నా, పొయ్యా, నిప్పా, నీరా, విసినికర్రా, రోలా, రోకలా !' అని అంటూ 'తరువాత వివరిద్దాంలే అనుకొని యిందాక అన్నం తింటూ తింటూ లేచాను మళ్లా మీరు చేసినవి వేసి అన్నం పెడతారూ'.

రాఘవమ్మ : యిప్పుడేమి అన్నం అమ్మా ! ప్రొద్దుగూక వచ్చింది. ఒకసారే రాత్రికి తిందువుగానిలే' అంటూ ఆమె పని ఆమె చేసుకుంటుంది.

అమ్మ 'సమయము వచ్చినదాక అన్నం ఇంట్లో వున్నా తినే యోగ్యత వుండదు. అన్నం లేకగాదు, తినాలని ఉద్దేశ్యము లేకగాదు, పెట్టటానికి ఆమెకు యిష్టం లేకగాదు, ప్రతిపనికీ యింతేనా. అయినా చూద్దాం అవునో కాదో. కాలమనేది యెంత గొప్పదో' అనుకుని రోడ్డుమీద యింటికెదురుగా వున్న తాటిచెట్టు క్రింద కూర్చుని 'నేను రాత్రికి దోసకాయ లేసుకొని అన్నం తింటే అదే వస్తుందా ! అంటూ ఆ రూపమే వస్తుందా. యేది తింటే ఆ రూపానికి తగినట్టే రూపం మారి వస్తుందేమో! పసిపిల్లలు పాలు తాగుతుంటే పాలుగా కూర్చోవటం లేదుగా! పాలకు తగినట్టుగా పాలకు, అన్నానికి తగినట్టుగా అన్నానికి మార్పు అంటూ వున్నది. యీ మార్పు అయ్యేది పొట్టలోకి పోయిగా, పొట్టమీద పెడితే మార్పు

రావటం లేదుగా. పొట్టమీద గుడ్డగా పెడితే గుడ్డ గుడ్డగానే వుంటుంది. పొట్టలోకిపోయిన పదార్థమే మారుతుంది. అయితే గుడ్డను మింగగా పొట్టలోకి పోతే మారుతుందేమో !' అని తన వొంటిని ఉన్న గౌనును చింపి సన్నని పీలిక తీసి వుండచుట్టి అమ్మ మింగుతుంది. 'మార్పు అంటే నిద్రలేచాను, మంచం మీద కూర్చుని కళ్లు తెరచినప్పుడు ఒక రకంగా వుంది, ప్రొద్దు క్రమంగా మారిపోయింది. యిప్పుడు ఒక రకంగా వుంది, రాత్రికి ఒక రకంగా వుంటుంది. యిదేనా మార్పు అంటే, అసలు మార్పు అంటే అర్థం ఏమిటి ?' అని అమ్మ తలవంచుకొని యిసుక మీద చేతులు పెట్టి ఇసుకను కుప్పలు చేస్తూ, పిచ్చిక గూళ్లు కడుతూ, 'అబ్బా తోచటం లేదు. యివన్నీ యెప్పుడు తేలుతయ్యి, యిందాక భూమిగా వున్నది, ఒకచోట యిసుక కుప్పగా వున్నది, ఒక చోట గూడుగా వున్నది. ఆ యిసుకేగా అనుకుంటూ తల యెత్తగానే స్టేషనులోకి రైలు వస్తుంది. కూత వినపడుతుంది. ఆ కూత కూడ ప్రారంభించేటప్పుడు ఒక రకం, మధ్యలో ఒక రకం, ఆపేటప్పుడు ఒక రకం ప్రతీదీ యింతేనని స్టేషను వంక చూస్తూ వుంటుంది.

3. అందరికీ సుగతే

మారుమాట లేని మాట :

సాయం।తం 6 గంటలవుతుంది.

~ సాయంకాలం కోచీ.

రైలు దిగి నడిచి వచ్చేవారంతా స్టేషను దగ్గరే వున్నట్టు వుంటారు. పాదములు వంక చూస్తూ వుంటే ఒక పాదము ముందు, ఒక పాదము వెనుక వేసినట్లు వుంటుంది. 'ఈ హెచ్చు తగ్గులేనా నడక అంటే. యిది నడక, నడతకూడా యింతేనా! నడకకు నడతకు తేడా యేమిటి'? అని అమ్మ ప్రశ్న వేసుకొంటుంది. 'నడక అంటే నడవటమే. నడత అంటే నడకను నడిపించేది (అంటే మనస్సు సంబంధము). ప్రొద్దు గూకింది. ఒక పోలీసు బజారున పోతూ వుంటాడు. అమ్మ అక్కడనుంచి లేచి యూనియన్ ఆఫీసు దగ్గర ఒక మఱ్ఱిచెట్టు క్రింద కూచోగా ఆ పోలీసువాడు అమ్మతో గూడా వస్తాడు.

'యే అమ్మాయ్ నీ పేరేమిటి?'

అమ్మ పలుకదు పదిసార్లు పిలిచి, పదకొండవసారి పెద్దగా 'యే అమ్మాయ్' అంటాడు.

అమ్మ అతని ముఖము వంక చూస్తుంది.

పోలీసు (ముఖము వంక చూచి) ''నీ పేరేంటి ?'' అంటాడు.

అమ్మ ''పిలిచావుగా ! అదే నా పేరు (అని) అబ్బాయ్'' అని అంటుంది.

పోలీసు : అబ్బాయి యేమిటి ?

అమ్మ : అమ్మాయి ఏమిటి ?

పోలీసు : నీవు అమ్మాయివి గనుక.

అమ్మ : నీవు అబ్బాయి గనుక (మనస్సులో నేను అమ్మాయిని గనుక)

పోలీసు : ఏయ్ నేను పోలీసుని

అమ్మ : ఏయ్ నేను అనసూయను.

పోలీసు : ఏయ్ జాగ్రత్త, నిన్ను జైలులో పెడతా.

అమ్మ : జైలు కొడతావా నాకు. అమ్మ మాట అర్థం కాక పోలీసు 'ఆ' అంటాడు. అమ్మ వెంటనే మెల్లిగా 'ఈ' అంటుంది.

పోలీసు : యేమిటి అంటున్నావు. 'ఈ' అంటావేం.

అమ్మ : నీవు 'అ' అంటేను దాని తరువాత 'ఈ' కదా అని అన్నా.

పోలీసు : ఆ తరువాత 'ఈ' అని నీకెవరు చెప్పారు ?

అమ్మ : యెవరూ చెప్పలా ! శబ్దములు పుట్టినది పలకటానికే, యెవరైనా చెప్పినా అర్థం చేసుకొంటేగా ! తనంతట తను పలికినా యెవరైనా చెప్పితే పలికినా వీటినన్నింటినీ గ్రహించే శక్తి ఒకటే.

పోలీసు "ఒకటేనా చూద్దాం ఆ ఒకటేమిటో" అంటూ అమ్మ చేయి పట్టుకుని మెడలో వున్న పులిగోరు గట్టిగా లాగుతాడు. చెయ్యి నెప్పి పుట్టినా రాదు.

అమ్మ : నీ చెయ్యి నెప్పి పుట్టుతుంది, నేను ఇస్తాలే! నేను ఒక సంగతి అడుగుతాను చెప్తావా?

పోలీసు : ఆ చెప్తా. ఇస్తానంటే చెప్తా.

అమ్మ : యెందుకివ్వను! మాట అంటే యేమిటో యెపుడన్నా విన్నావా, అర్థం తెలుసునా. మాట అంటే మారు మాట లేనిమాట. ఆ మాటనేమంటారంటే మంత్రమంటారు. ఉత్తములకు మంత్రం మామూలు. వారికి మారు మాటలేని మాటకు సంఘంలో యేతంటా లేదు. చాలా తంటాలు పడుతున్నామంటారే నీలాంటి మారు మాట గలవారే. ఇంతకు చెప్తావా? (అని పులిగోరు తీసి చేతిలో పట్టుకుని) యిక చెప్పు.

పోలీసు : అడుగు.

అమ్మ : చెయ్యిపట్టు.

పోలీసు చెయ్యి పడతాడు.

అమ్మ అరిచేతిలో పులిగోరు పెట్టి, పులిగోరు మీద అమ్మ చెయ్యి పెట్టి 'ప్రమాణ పూర్తిగా చెప్పు. ప్రమాణమంటే భయము లేదులె ప్రమాణాలకు చాలా అర్థాలున్నాయి. ప్రస్తుతం ఇక్కడ మనస్ఫూర్తిగా అని నీకు ప్రమాణం నేనేలే' అని పోలీసు వంక చూడగా పోలీసు అమ్మ ముఖము వంక చూస్తూ ఆ ముఖములో వుండే మార్పులు గుర్తిస్తూ అడుగమ్మా అంటాడు. 'అసలు నీ వుద్యోగమేమిటి. అది వివరించి చెప్తావా నాయనా'.

పోలీసు : ఆ! యెవరు యే లోపాలు చేసినా కనిపెట్టి వారిని పట్టుకుని జైలులో పెట్టడం.

అమ్మ : లోపమంటే ?

పోలీసు : దొంగతనం చేసినా, యెవరినైనా చంపినా యింకా నీకర్థం కావు చాలా వున్నయ్యిలే !

అమ్మ "ఇపుడు నీవు చేసినదేమిటి, యిది దొంగతనం కాదా ? మీకు తప్పులేదా, నిన్నెవరు పట్టుకుంటారు, ఇంకొక పోలీసు పట్టుకుంటాడా లేక అందరూ ఇంతే చేస్తారా? ఒకరి నొకరు మీలో మీరు అరెస్టు చేయరా ? మీకు తప్పులేదని చెప్పిందా గవర్నమెంటు" అని పెద్దగా అంటూ పోలీసు ముఖము వంక చూడగా ఆ పోలీసునకు అమ్మ ముఖము వంక చూడగా ఆ పోలీసునకు అమ్మ ముఖములో అరుణోదయమైన కాంతి గోచరించి అమ్మ ముఖము కనుపించకుండాపోయి ఆకాంతే నిలబడును, 15 నిముషాల పాటు తన చేతిలోని పులిగోరు అమ్మ మెడలో వేసి సమాధానము చెప్పక అమ్మను యెత్తుకుని తన లైనుకు తీసుకుని వెళతాడు. (పోలీసులిళ్లకు) ఆ రాత్రి కొంతమంది పోలీసులు చేరి అమ్మను దగ్గర కూర్చో పెట్టుకుని అమ్మకు తెలియకుండా ఉర్దూ భాషలో అమ్మకు, అతనికి జరిగిన సంభాషణ పోలీసువారికి చెపుతాడు. ఆ చెప్పే దానిలో ఒక మాట తప్పు చెపుతాడు. అమ్మ అందుకుని 'నేనదేనా అన్నది? అబద్ధమాడతావేం? ఉన్నది వున్నట్లు చెప్పు. కాదు కాదు వున్నది చెప్పలేవు కూడా. జరిగింది జరిగినట్లు చెప్పు'. అమ్మను చూచి అందరూ బిత్తర పోతారు. అందులో ఒక పోలీసు చూచి 'యిదేదో ఒక మహత్తరమయిన శక్తిలా వుంది. జరిగింది నీవు చెప్పమ్మా' అంటాడు.

అమ్మ అన్నీ వివరించి చెప్పగా ఆ పోలీసు విని కొన్ని మాటలు గుర్తు రాసుకుంటాడు. రాత్రి 12 గంటలకు అమ్మను తిరిగి యింటికి తీసుకొచ్చి యిద్దరు పోలీసులు దిగిడ్చి పోతారు. అమ్మ అరుగుల మీద పడుకొని తెల్లవారి యింట్లోకి వెళుతుంది. యెవరూ పలుకరించరు. యెవరి పనులమీద వారు వుంటారు. తాతగారు మరిడమ్మగారు వూళ్లో లేరు. అమ్మ మామూలుగా నిత్య కృత్యములు తీర్చుకుని నిన్న జరిగిన సంగతి అనగా పిల్లవాని బైలికి విషయం ఆలోచనకు వచ్చి మేడమీదకు వెళ్లి కూర్చొని 'నిన్న మ్రింగిన గుడ్డ యింత వరకు బయటకు రాలేదు. లోపల యేమయి వుంటుందో, జీర్ణము కాలేదేమో? జీర్ణము కాకపోయినా బాధయేమీ లేదే!' అని కొంచెం దీర్ఘంగా ఆలోచించగా లోపల వున్న పేగులు, నరములు, కోశములు అన్నీ ఒకసారిగా చెప్పటానికి వీలులేనంత కాంతితో పై దేహము కనిపించినట్టుగా తేటతెల్లముగా కనపడును. లోపలకు పోయిన గుడ్డ జీర్ణకోశములో క్రింది భాగమున చుట్టిన వుండ విడబడి పొయ్యి మీద నీళ్లు తెర్లుతుండగా అందులో వేసిన పదార్థము తెర్లినట్టుగా, లాలాజాలంలో పడి తెర్లుతూ వుంటుంది. 'యింత వరకు గుడ్డ కరుగుదలకు రాలేదు. నిన్న సాయంత్రము 6 గంటలకు మింగిన గుడ్డ యింతవరకు కరుగుదలకు రాలేదు' అని కళ్లు మూసుకోగా విరోచనమునకు వెళ్లవలసి నట్లుండును. బయటకు వెళ్లగా మామూలు గుడ్డపీలిక వున్నట్లుగానే వుండును. 'అన్ని పదార్థముల లాగా గుడ్డను జీర్ణము చేయగల శక్తి జీర్ణకోశమునకు లేదు. అరిగిన పదార్థాలు భూమిలోనుంచే పుట్టినవి. గుడ్డపీలికా భూమిలో నుంచి పుట్టినదే. గుడ్డపీలిక యెట్లా పుట్టినదో అడుగుదాం తాతగార్ని' అని 'ఆఁ యెందుకులే, పత్తిగింజలేగా ఆధారం'.

చిదంబర్రావుగారు మేడమీదకు వచ్చి, 'అమ్మా! అనసూయా అన్నం తిందువుగాని రావూ!' అని అడుగుతారు.

అమ్మ : ఆ'కలి' లేదు.

తాతగారు : యే కలి లేదు ?

అమ్మ : యీ 'కలి'లో నాకా'కలి' లేదు.

తాతగారు : అతి సునిశితం (అనుకుంటూ దిగిపోతారు).

అమ్మ కిటికీవంక చూస్తూ కూర్చుండగా 'అమ్మా! మధూకరం' అంటూ బిచ్చగాడు వస్తాడు.

అమ్మ తనకని పెట్టించుకుని తాతకు పెడదామని వెళ్లి 'యెవరో ఒక ముసలి తాత మధూకరానికి వచ్చాడు కొంచెం అన్నం పెడతారా రాఘవమ్మగారూ' అని అడుగుతుంది.

రాఘవమ్మ : ఇది బ్రాహ్మణ యిల్లు. భోంచేస్తున్నారు. అటుపోయి రమ్మని చెప్పు అంటుంది.

అమ్మ : పోనీ నాకు పెడతారా ?

భోజనాల గదిలో కూర్చుని భోంచేస్తున్న తాతగారు 'యేమిటి అమ్మాయి అంటున్నది' అని అంటారు.

'నాకు కాస్త అన్నం పెడతారా' అని అడుగుతున్నది అని అంటుంది రాఘవమ్మగారు.

తాతగారు : యిప్పుడు ఆకలిలేదు అనెనే !

రాఘవమ్మ : యెవరో వచ్చాడట ముసలివాడు వాడికోసరం వంక పెట్టినట్టుంది.

తాతగారు : (చెయ్యి కడుక్కోబోతూ) వంక యెందుకు? ఒక ఆకులో పెట్టి యివ్వండి.

రాఘవమ్మ : రోజూ అంతే చేస్తుంది. పెట్టిన అన్నము తీసుకొనిపోయి కుక్కలకు, పందులకు, కాకులకు పెడుతుంది.

చెయ్యి కడుక్కొని ఆమాట వినిపించుకోకుండా వెళ్లిపోతారు తాతగారు.

దర్వాజా పట్టుకుని అమ్మ నిలబడే వుంటుంది. రాఘవమ్మగారు అన్నం పెట్టి యివ్వదు.

అమ్మ ఒక గంటసేపు చూచి వాకిట్లోకి వచ్చి చూస్తుంది. ముసలివాడు వుండడు. వాడిని వెతుకుతూ బజారునకు వెళుతుంది. యీలోగా పది యిళ్లు తిరిగినా ఆనాడు అన్నమే దొరకలేదు. అమ్మ అతనిని బజారుకు తీసుకుని వెళ్లి మెళ్లో వున్న బంగారపు తాడు, సిగ్గుబిళ్ల యిచ్చి అమ్మ కూడ వుండి బ్యాంక్‌లో పెట్టించి (అమ్మ కూడా వుండగా ముసలివాడే బ్యాంక్‌లో పెట్టును) డబ్బు తీసుకుని అతనికి కావలసిన పదార్థములు యిప్పించు చుండును. యింతలో ముసలివాడు పోమాకమ్మా! అని 'సరే' నీవు యింటికి వెళ్లు నేను కొనుక్కుంటాలే!' అంటాడు.

అమ్మ : ఆ డబ్బు యిచ్చి వెనుకకు తిరిగి వస్తూ ఆ డబ్బు యెందుకూ ఖర్చు పెట్టవద్దు బియ్యం కొనుక్కొని మూడు కలిపిన కూర చేసుకుని యెన్నాళ్లయినా తినవచ్చు".

బిచ్చగాడు 'యేముందమ్మా యేం డబ్బిచ్చారు కొద్దేగా?' అంటాడు.

అమ్మ : నీవు చెప్పకపోయినా బ్యాంక్‌వాళ్ళు చెపుతారు. సత్యంగా యిచ్చిన డబ్బంతా పెట్టి బియ్యము, పప్పు, మిరపకాయ, చింతపండు, కట్టెలు కొనుక్కో, నీకు చేసిపెట్టటానికెవరయినా వున్నారా?

బిచ్చగాడు : యెవరూ లేరమ్మా, నేనేదో వేదాంతములో పడిపోయి పిల్లలను, భార్యను వదిలేసి ఒక గురువుగారిని ఆశ్రయించాను.

అమ్మ "సరే అని అన్నీ రేపు చెపుదువుగానిలే! నీకిచ్చిన డబ్బుతో అబద్ధమాడకుండా అవసరమయిన వరకు వాడుకో. మరల నేనేమీ తీసుకోనులే, నీవద్ద నుండి" అని యింటికి వచ్చి కాసేపు (5 నిమిషములు) మేడమీద కూర్చుని మళ్లీ మర్రిచెట్టు క్రిందకు వెళ్లుచుండగా రైలు అవతల వున్న కొబ్బరితోటలో నుంచి తాతగారు వస్తూ అమ్మను 'యెక్కడికమ్మా పోతున్నావ'ని అడుగుతారు.

అమ్మ : ఐలూరు కాంతమ్మ గారి యింటికి.

తాతగారు : తొందరగా రామ్మా ! మీనాన్న మన్నవ నుంచి యీ బండికి యేమైనా దిగాడా ?

అమ్మ : దిగలేదు.

తాతగారు : నీ కోసరము నేను వచ్చేదా ? నీవే వస్తావా ?

అమ్మ "నాకోసరము నీవేమీ మానుకోవద్దు. నాకాకలయితే నేనే వస్తా" అంటూ కట్టుకుపోయిన జుట్టుతో అమ్మ మర్రిచెట్టు క్రిందకు వెళుతుంది.

పోలీసు లిద్దరూ మర్రిచెట్టు క్రిందకు వస్తారు. అమ్మ యిదివరకే, వారు అడుగగా - అమ్మ యిల్లు, వారు కలుసుకోటానికి యింకా గుర్తులు యిస్తుంది. ఒక పోలీసు పేరు అంకదాసు, కళావంతులు. రెండవవారు మస్తాన్ సాహెబ్. యిద్దరూ ప్రతిరోజూ అమ్మను సాయంకాలము ఆ మర్రిచెట్టు క్రిందో, లేక రైలు అవతల అద్దంకి వారి తోటలోనో బాపట్లలో వున్నప్పుడల్లా కలుసుకుంటారు. వారికి అమ్మ మొదట చెప్పిన 'మారుమాట లేనిమాట'. మహామంత్రంగా పాటించి

ధన్యులవుతారు. అంటే ఉద్యోగ ధర్మాన్ని సత్యంగా నెరవేర్చటం. 'మారుమాట లేనిమాట' అంటే తను యెందుకయితే వుగ్యోగము చేస్తున్నాడో సంఘములో దొంగలు లేకుండా శిక్షించటానికి, దొంగతనం చెయ్యకుండ చూడటానికి చూస్తానని వొప్పుకుని ఆ ముద్ర వేయించుకుని, ఆ గుడ్డలు, ఆ టోపి, ఆ నంబరు తీసుకుని పాలనకై వచ్చి అన్నీ మరచి తను దొంగై దొంగతనం చేస్తూ దొంగను పట్టుకోటానికి వచ్చేవాడుగా వేషము వేశాడు' అని అమ్మ ఒక రోజు యిద్దరు పోలీసులను కూర్చోబెట్టి ఒక కథగా చెపుతుంది. వెంటనే యిద్దరు పోలీసులు లేచి "అమ్మా! యీ వచ్చీరాని మాటలతో మాకు నీతి నిజాయితీని వ్యక్తపరచి బోధ చేస్తూ మమ్ములను తరింవ చేయటానికి వచ్చావా అమ్మా" అని మస్తాను 'అవతారమూర్తివమ్మా, మాకు సమయమొచ్చి నీ మెడలోని పులిగోరుమీద కోర్కె కలిగింది. మొదట కూడ నిన్ను జూచి ముద్దువచ్చి యే అమ్మాయ్! అని పలకరించాడట'.

అమ్మ : యిందాక మీరన్న నీతి నిజాయితీయే దేముడు.

ముగ్గురూ కలిసి బయలుదేరారు. అమ్మను యింటి వద్ద వదలి వారు వెళ్లిపోతారు.

తత్త్వ పరిశోధన :

అమ్మ వయస్సు 6వ సంవత్సరము ప్రారంభము.

రాత్రి 9 గంటల సమయము.

తాతగారు (చిదంబర్రావుగారు) భారతము చదువుతూ వుంటారు. అమ్మ యింటికి రావటం చూడరు. అమ్మ సరాసరి మేడమీదికి వెళ్లి తాటాకు చాపమీద పడుకుంటుంది. తాతగారు భారతం చదివిన తరువాత రాత్రి పది గంటలకు మేడమీదకు వచ్చి మూలనున్న బాదమాకులు దీపం ముందర పెట్టుకుని యిస్తళ్లు కుట్టడం ప్రారంభం చేస్తారు. యింతలో అమ్మ వచ్చి తొడిమలు తీసి తాతగారికి అందిస్తూ ఉంటుంది. ఆకుల్లో కూడా ఒక తేలు వచ్చి అమ్మను కుడుతుంది. అమ్మ దీపము కింద నీడలో నున్న దీపమునకు దగ్గరకు వెళితే యింకా వెలుతురు వస్తుందని భ్రమపడి దీపము దగ్గరకు పోగా నీడ వస్తుంది. కీనీడలో తేలు, కుడుతుంది. "తాతగారూ తేలు కుట్టింది" అని చెప్పగా తాతగారు గబగబా లేచి తేలును వెతుకుతారు. ఆకులలో వుంది.

అమ్మ : తాతగారూ నాకు తేలు కనపడలేదేం !

తాతగారు : అన్ని ఆకులలో తేలు యేమి కనపడుతుంది. అందులో కీనీడ.

అమ్మ : కీనీడ అంటే యేమిటి వెలుతురు కింద అనా లేక దీపం చుట్టూనా.

తాతగారు : దీపం చుట్టూ చీకటేగా అమ్మా.

అమ్మ 'చీకటి పోగొట్టిన దీపం చుట్టూ చీకటా? వెలుతురు కాధారం చీకటేనా' అని కాలు పట్టుకుని కూర్చుంటుంది అమ్మ. కూర్చున్న అమ్మకు ఆనాడు దేవాలయంలో కొబ్బరి చక్క ఒకటి, అనేకమయిన విషయం గుర్తుకు వస్తుంది. అది ఆలోచించుతూ కూర్చున్న అమ్మను చూచి వరండాలోకెళ్ళి పడుకో అమ్మా అని మంచం వేస్తారు.

అమ్మ పడుకుని, "తాతగారూ! చందమామ యెందుకో నాలుగు రోజులనాడు వున్నట్లు లేదేం ?"

తాతగారు : రాబోయేది అమావాస్య. పదిహేను రోజులేగా. చందమామగూడా అంతకుమించి వెలుతురివ్వటానికి అధికారము లేదు (పాడవేలనే ఓ హృదయవీణా అనే రాజుగారి పాట).

తాతగారు వచ్చి దగ్గర కూర్చొని అమ్మ కాళ్లు వొళ్ళో పెట్టుకుని, "అమ్మా, అన్నము తిన్నావా" అంటారు.

అమ్మ : అన్నము పుట్టినందుకు తింటాడా తినేందుకు పుడతాడా? అంటుంది.

తాత: పుట్టినందుకు తింతూండమ్మా. పుట్టినవాడల్లా తినాలిగా.

అమ్మ : మొన్న అమ్మ పోయినప్పుడు దాని అన్నం లేదు భూమిమీద పోయిదంటిరే. అన్నం వుంటేనేగా వచ్చినది. అన్నం వుండటమంటే యెక్కడ నుంచి తెచ్చుకుంటుంది?

తాతగారు : భగవంతుడు వారి ఖర్మకొద్ది పెడతాడమ్మా.

అమ్మ : వారికి ఖర్మ యెక్కడ నుంచి వస్తుంది.

తాతగారు : చేసినదాన్ని బట్టి.

అమ్మ : యెవరు చేసింది ?

తాతగారు : మనము చేసుకున్న దాన్నిబట్టే మనకు వస్తుంది.

అమ్మ : మనము చేసుకుంటే యింకా భగవంతుడెవరు ?

తాతగారు : భగవంతుడేమీ అంటనివాడు.

అమ్మ : అన్నీ చేసేవాడు, వాడి కంటకపోతే మనకేం అంటుతుంది?

తాతగారు : అన్నీ చేసేవాడు గనకనే అంటదు.

అమ్మ : అంటనట్టు రుజువు యేమిటి. అసలు వాడు యెట్లా వుంటాడు ?

తాతగారు : పకపకా నవ్వి యెట్లా వుంటాడా, నీవల్లె వుంటాడులే పడుకో !

అమ్మ : నావల్లె అంటే పొట్టిగానా, చిన్నగానా, గౌను వేసుకుంటాడా?

తాతగారు "అన్నీ రేపు చెబుతాలె నిద్ర బట్టించుకో అమా" అని వెళ్లిపోతారు. అమ్మకు నిద్ర పట్టదు.

మళ్లీ యీ సంభాషణ మరుసటి రాత్రికి.

అమ్మ : యీ విషయాలు తాతగారితో మాట్లాడకూడదూ? యేమైనా అనుకుంటారా? మాట్లాడొచ్చులే, తాతగారేగా కూడకపోతే వారే చెపుతారుగా, అదే, పెద్దవారు అంటే తెలియంది చెప్పటానికే.

రాత్రి గం. 12 అవుతుంది.

అందరూ పడుకుని నిద్రించుచుందురు.

అమ్మ ఆకాశము వంక చూచి చందమామ రంగు, నక్షత్రాల రంగు ఒకటిగానే వున్నాయి కాని చందమామ కాంతి యిస్తున్నది. వీటినన్నిటిని ఆకాశము భరిస్తున్నదా, ధరిస్తున్నదా? ఆకాశమంటె భూమికి తెరచాప లాంటిదా? అని కాదులె ఆకాశము అంటే పతాకము వంటిది. అదే ప్రొద్దున పూజలో బ్రాహ్మణుడు (ప్రఖ్యా సుబ్బయ్యగారు) "నీల పతాకాయ నమః" అంటారు. ఆ పతాకాన్ని పుచ్చుకున్న దెవరు లేక ధరించినదెవరు. భూమి, భూమి అంటే ప్రపంచము. ఆకాశమంటే అవకాశమా ? దేనికి అవకాశము. అవునో కాదో దాని దగ్గరకు వెళితేగా తెలిసేది అని కళ్లు మూసుకుని యిట్లా అనుకుంటూండగానే తను పైకి పోయినట్లు పోతున్నకొద్దీ యేమీ లేనట్టు సూర్య, చంద్ర మండలాల తరువాత కూడా ఆకాశమున్నట్టు దూరముగా వున్న ఆకృతిలేని ప్రదేశమంతా ఆకాశముగానే

కనపడుతున్నట్టు ఆకాశమంటే కంటికి కనపడేది చేతికి అందనిది యిదే ఆకాశమంటె అవకాశం ! ఆకాశానికి అవకాశం అమ్మ కల్పించింది (అంటే భూమి) అదే సమయములో మేఘములు పరుగెత్తుతున్నవి. అమ్మ మేఘము అంటే ఆకాశము అనుకుండేది. ఆకాశము ఆకాశముగానే వుండి మేఘములు నడుస్తున్నాయి. ఆకాశము వేరు మేఘము వేరు అనుకొని యీ మేఘము ఎట్లా తయారవుతుంది? అగ్నిలో నుంచి వచ్చే పొగ రూపంగా వుందే పోలిక. అగ్నికేనా పొగను రప్పించే స్వభావం? అగ్నిలోనే పొగ వున్నదా. అయితే పొయ్యి మండే అంతవరకు పొగ వచ్చి మండిన తరువాత పొగ పోతుందా? పచ్చి కట్టెలప్పుడు యెక్కువగా పొగ వస్తూ వుంటుంది. నీరు నిప్పు కలిస్తే పొగ వస్తుందేమో, కట్టె గూడ వుందిగా మధ్యలో, కట్టెవరు? పొగను బైటికి నడిపించేది యెవరు? వాయువా? వస్తున్న పొగ కూడ యెటు గాలి కొడితే అటు పోతుంది. గాలి లేకపోయినా పొగ పైకి నడుస్తూ వున్నదిగా. కట్టె భూమి కట్టెలో పచ్చిదనం జలం. జలతత్వం తగ్గిందాక నిప్పు అంటుకోదు గనుక పొగ యెక్కువగా వుంటుంది. పొగ బైటికి రావాలంటే నిప్పు అంటుకుంటే గాని రాదు. నిప్పు అంటుకోకపోతే పొగ ఎక్కడ నుంచి వస్తుంది? నిప్పు రాజేయటానికి తెచ్చినవాటిల్లోను అగ్ని తత్వముంటేనేగా అంటుకునేది. జలతత్వములేని అగ్నితత్వము లేదు. అని పడుకున్న అమ్మ లేచి మేడదిగి స్నానాల గదిలోకి వెళ్లి గూటిలో వున్న నిప్పు పెట్టి తీసుకుని రాత్రి రెండున్నర గంటలకు సరివి తుక్కు ముట్టించి చూస్తూ వుంటుంది. మంచులో వుండటం చేత కొంచెం ఆలస్యంగా అంటుకుని మండుతాయి. ఆ మండే సమయంలో పచ్చి కొమ్మ పడుతుంది. చిటపట మంట తగ్గి పొగ వస్తూ మంట తగ్గినది కాని నిప్పు వున్నది. అగ్ని వేరు అగ్ని తత్వము వేరు. కనపడే అగ్ని లేనంత మాత్రాన అగ్ని తత్వము లేనట్టు కాదు. తత్వతః తత్వంలో అన్ని తత్వములు వున్నాయి. యెందుకున్నాయి అంటే, వీటిని చూస్తూ వుంటె అసలు తత్వము గనుక, తత్వములో నుంచి పంచబడ్డయ్యి కనుక తత్వము అంటే తాతమ్మ పాడే పరతత్వమనే పాటా? ఆ పరతత్వమే యీ తత్వం, యీ తత్వమే ఆ పరతత్వం, చివరకు అపరతత్వం, అని అమ్మ ఆలోచిస్తూ వుండగా, యిందాక అంటించిన సరివి తుక్కులో పచ్చిపుల్ల మిగులుతుంది కాలకుండా. ఆ పుల్లను తీసి అమ్మ దగ్గర పెట్టుకుని తెల్లవారిన తరువాత ముఖము కడుగుకొని ఆ పుల్లను నీళ్ల పొయ్యి కింద మండుతూ వుండగా నీళ్లలో తడిపి తడిపినప్పుడు పై చర్మం తడిసినది గాని లోగర్భము తడవలేదు. గర్భము అంటే లోపలి భాగము.

గర్భము అంటే పొట్ట అనే కాదు. గర్భితంగా అని అంటారు. గర్భితమంటే అంతర్ముఖమేనా? అంతే పుల్లను తడిపి యిట్లా ఆలోచిస్తూ పొయ్యిలో వేస్తుంది. ఆ మంటలో జలతత్వ శక్తి తక్కువై వెంటనే మండిపోయెను. నిప్పు, నీళ్ళు చల్లితేగాని చల్లారదా? అనుకొని అమ్మ ఒక రోజు పొయ్యి చల్లార్చకుండావుంటే యేమవుతుందో చూద్దాం. యింట్లోవాళ్లు వూరుకోరుగా.

తెల్లవారిపోతుంది (తెల్లవారు ఝామును గం. 4.30లకు పొయ్యి వెలిగించారు).

నేను వేరే రేపు రాత్రికి పొయ్యి రాజేసుకుని నిప్పు ఆర్పకుండా వుంటే యేమవుతుందో చూద్దాం! అయినా రేపు రాజేయటమెందుకు కట్టె అయిపోతే మంట అదే చల్లారి పోతుంది. కట్టె పెట్టకుండ వుంటె బొగ్గలు కాలి నుసి అయ్యిపోతాయి. ఆ నుసి కొంచెంసేపు గాలి కొడితె యెగిరిపోతుంది. యెగిరినప్పుడు యెగిరించే గాలిని పట్టిపోయి పడి మట్టిలో కలిసిపోతుంది. పొయిలో వున్నప్పుడు నుశి రూపము వేరు. గాలిలో పైకి యెగిరినప్పుడు తుంపురులుగా వున్న రూపము వేరు. క్రింద పడ్డప్పుడు వున్న రూపము వేరు. పొయిలో నుంచి లేవకొట్టి కొంతదూరం పంపిన గాలికి రూపం కనపడదేం, గాలికి రూపం లేదా? నాకు గాలి కనపడకుండా వుండి అన్ని పనులూ చేయిస్తుంది. గాలికి రూపం స్పర్శ. అంటే మనస్సుకు తట్టేది. మనస్సూ గాలి ఒకే రూపమేమొ. మనస్సు యెట్లా వుంటుందంటే చెప్పలేం. గాలి యెట్లా వుంటుందంటే చెప్పలేం. గాలికి శబ్దమన్నా ఆధారముంది. కదలికన్నా కనపడుతుంది. ఆకృతుల కదలికను బట్టి గాలిని గుర్తించవచ్చు. మనస్సును వీటినన్నింటిని గుర్తించే గుర్తుతో గుర్తించవచ్చును. మనస్సుకూ రూపమున్నది. యెప్పుడు దేనిని జూచి గుర్తిస్తుంటే దాని రూపము. అన్ని రూపములు కలది గనుక దానికి ఒక రూపమంటూ లేదన్నారు. అని అమ్మకు తోచును (ఉదయం గం. 5.30 లకు)

6 సంవత్సరముల 2 మాసములు అమ్మ వయస్సు.

అమ్మ : మేడమీదకు వెళ్లి కూర్చుని మేడకు ప్రక్కగా వున్న ఐలూరు కాంతమ్మగారి దొడ్లో గేదెను పాలు పిండుతూ వుంటారు. చెంబులో నీళ్ల పారబోసి పాలల్లో నీళ్ల కలపకుండా పిండుతున్నా రనుకొని నీళ్లల్లో పాలుండవా? పాలల్లో నీళ్ల లేవా? అని ఆలోచించి తీస్తున్న పాలనే చూస్తూ, పాలు తెల్లగయ్యి, పాలు తెల్లగా వున్నయ్యి. చెంబులో పడగానే పాలధార ధ్వని వస్తుంది. అది అమ్మా అని వినపడుతుంది. పాలు నన్ను పిలుస్తున్నయ్యేమో నని చెవులు కళ్లు పాలవంకనే

తిరిగి మనస్సు అమ్మా అనే శబ్దాన్ని ఆలోచిస్తుంది. పాలకు అమ్మ యెవరు? పాలు తీసె చన్ను. చన్నుకు అమ్మ యెవరు? పొదుగు. పొదుగుకు అమ్మ పొట్ట. పొట్టకు అమ్మ చర్మము కండరాలు నరములు కోశములు ఒకదానికొకటి ఆధారమై అన్నీ కలిపి గేదై అన్నింటి రసం పాలుగా వచ్చి అన్నీ అమ్మా అని పిలిచినయి. పిలిచేది అమ్మ, పలికేది అమ్మ, ఉన్నది అమ్మ, అంతా అమ్మై 'మమ' అయింది. అంతా 'మమ'. యింతకూ పాలల్లో నీళ్ళు వుంటాయేమొ. రక్తంలో నుంచి తీసిన పాలు పాలుగా వుంచితె నీళ్లు వుండవేమొ. పాలు అంటె గన్నేరు చెట్టుకు పాలు వున్నాయి. కొన్ని జంతువులకు పాలు వున్నాయి. కొన్ని చెట్లలోను పాలు వున్నాయి. యీ పాలు అన్నీ తీసి కాచి చూస్తే ప్రతి పాలల్లోను నీళ్లు వుండేది వుండంది తెలుస్తుంది. అని పాలు అనే పేరుగల పాలు అన్నిటికి ఒకే గుణమా? పాలు అంటే భాగమని కాదు. వాటి శరీరంలోనుంచి వచ్చిన పాలు యింకొ అర్థం కూడా వుంది. పాలు అంటే శరీరములో ఒక భాగమేగా, పాలు యీ పాలన్నీ నాపాలబడ్డాయి అయినా చూద్దాం అని మేడదిగి ఐలూరు కాంతమ్మ గారింటికి వెళ్లి వాళ్ల మనమడు కృష్ణమూర్తిని జూచి స్నేహితుడయిన కృష్ణమూర్తిని పిలిచి (యెప్పుడయినా నేరేడు చెట్ల క్రింద నేరేడు పండ్ల పరిచయం) మీ యింట్లో నాకు కాసిని పాలు పోయిస్తా?

కృష్ణమూర్తి : యెన్ని కావాలి?

అమ్మ : గిద్దెడు చాలు. నీళ్లు కలపని చిక్కని పాలు కావాలి.

కృష్ణమూర్తి : మా నాయనమ్మ లేనప్పుడు మా అమ్మ నడగాలి. మా అమ్మ పోస్తే తీసుకొస్తాను. లేకపోతే చెప్పకుండా గ్లాసులో పోసుకొస్తాలే నీవు పో.

అమ్మ : చెప్పకుండా వద్దులే. మీ అమ్మతో "అమ్మా, యీ అమ్మాయికి కాసిని మన పాలు కావాలటే" అని చెప్పు. నేను వచ్చి నిలుచుంటాను. పోస్తే పోస్తారు లేకపోతే యింకోచోటకు పోతా, యిట్లా యెంతమంది పాలు నాపాల పడాలో.

కృష్ణమూర్తి అమ్మను తీసుకొని వెళ్లి దొడ్డి గడపలో నుంచోపెట్టి "అమ్మా, యీ అమ్మాయే అంటాడు".

వరలక్ష్మమ్మగారుః యింట్లో పొయ్యి రాజేసుకుంటున్నా. యెవర్రా ఆ అమ్మాయి?

కృష్ణమూర్తి : యెవరో రోజూ నేరేడు చెట్ల క్రింద కలుసుకుంటుంది. యీ ప్రక్క మేడవారి అమ్మాయి.

వరలక్ష్మమ్మగారు (విసినికర్ర పట్టుకుని బయటకు వచ్చి) నువ్వా అమ్మా. యెవరో అనుకున్నా. తల్లిలేని చిట్టి తల్లి పాపం, రామ్మా, రా, యేంటి, యేం కావాలమ్మా ?

అమ్మ మాట్లాడక తల వంచుకొని కాలి బొటనవ్రేలు నేల రాస్తూ చేతులు వెనక బెట్టుకుని నేల చూస్తూ పాదములు ముందుకు నెట్టి గోడకానుకొని నుంచుంటుంది.

వరలక్ష్మమ్మగారు దగ్గరకు వచ్చి గడ్డం పుచ్చుకొని "చెప్పమ్మా, చెప్పు నీకేం గావాలో చెప్పు".

అమ్మ : ఒక పావుగంట వూరుకుని, "మీ పాలే నాకు కాసిని పోస్తారూ".

వరలక్ష్మమ్మ : మా పాలంటె?

అమ్మ : అదే మీయింట్లో వున్న పాలు.

వరలక్ష్మమ్మ : మాయింట్లో ఆవుపాలు లేవమ్మా.

అమ్మ : ఆవు "మా" అనుకుని ఆవు పాలు కాదమ్మా (గేదె పాలె) మీకున్న పాలు.

వరలక్ష్మమ్మ : కాచి యివ్వమంటావా అమ్మా?

అమ్మ : కాయవద్దమ్మా, పచ్చిపాలు కావాలి.

వరలక్ష్మమ్మ గ్లాసులో కాసిని పచ్చిపాలు పోసి యిస్తుంది.

(ఉదయం గం. 9.30లు)

అమ్మ పాలు దెచ్చి మేడమీద కిటికీలో పెట్టుకుని తాతగారు కోర్టుకు వెళ్లిన తరువాత అందరు నిద్రపోయేటప్పుడు పాల పని చూద్దాంలే భోజనాల వేళ అయింది అని మేడదిగి వంట యింట్లోకి పోయి "వంట అయిందా రాఘవమ్మగారు?"

రాఘవమ్మ "అయిందమ్మా తాతగారికి పెట్టబోతున్నాను. మొన్ననంగా తిన్నావు. నీవు గూడ రామ్మా అన్నం పెడతాను". తాతగారికి (చిదంబర్రావుగారికి) మన తాత (సీతాపతి గారికి) గారికి బాపట్ల వెంకటరావు గారికి భోజనాలు పెడతారు. అమ్మ గూడా మడిగుడ్డ కట్టుకొని పెద్ద బాదమాకు పట్టుకొని (మడిగుడ్డ అంటే

తడిపిన తడిగుడ్డ మడితో ఆరేసిన గుడ్డలేదు కనుక) తాతగారి ప్రక్కన కూర్చొని, "తాతగారూ మడి కట్టుకున్నారా" అంటుంది.

తాతగారు : ఆఁ అని. నీవు తడిగుడ్డ కట్టుకున్నావా అమ్మా. పోనీ నా దగ్గర వద్దులే పోయి మైల పాడిగుడ్డ కట్టుకొని తిను. తడిగుడ్డ జబ్బు జేస్తుంది. రేపటినుంచి నాగుడ్డలతో పాటే నీ గుడ్డలు తడిపి ఆరేయించుతా.

అమ్మ : మడి అంటే తడిపి ఆరేయటమేగా మీరు అనే ఆ మైల గుడ్డ కూడా తడిపి ఆరేసిందేగా ?

తాతగారు : అరవకుండా అన్నం తిను. మాట్లాడొద్దు.

(అమ్మ ఆ రోజు మొదలు జేసుకుని యెంతో అవసరమయితే తప్ప యింట్లో మాత్రం మాట్లాడటం తగ్గిస్తుంది. దాదాపుగా 1947వ సంవత్సరము వరకు) తడిగుడ్డ విడిచి భోజనము జేసి మేడమీదకు వెళ్లి కూర్చుంటుంది.

సమయం గం. 10.30 లు.

తాతగారు కోర్టుకు వెళతారు. అమ్మ నాన్నగారు నిద్రపోతారు. అమ్మ మళ్లా మేడమీద కిటికీలో కూర్చుని దొడ్లో గోడకు కొట్టిన పిడకలను చూస్తూ యెండలో పిడకల మీద వున్న వరి పొట్టు బంగారంలా మెరవటం చూస్తుంది. యింకా పక్కకు చూడగా వుత్తి పొట్టు పోసి పేడలో పిసికి వుండలు చేసి నెట్టుతూ వుంటారు పక్కకు. అమ్మ తొందరగా మేడదిగి వచ్చి చేస్తున్న పేడ ముద్దను చూచి విడిపొట్టును పేడను చూచి పొట్టు పేడలో కలపగానే దాని స్వరూపం మారిపోయింది. పేడలో పడితే పొట్టుకు మారింది గాని పేడకు మారలేదు. అమ్మ పేడలో పోసిన పొట్టు కడిగితే మొదటి రకంగా వస్తుందేమోనని బొక్కెనలో నీళ్లు పోసి పేడ ముద్ద నీళ్లల్లో వేసి చాలా వొంపులు కడిగి మొదటి రూపం వచ్చునేమోయని కడుగగా యెంత కడిగినా మొదటి రూపం రాలేదు. పేడ పోయిందేకాని పచ్చరంగు రాలేదు. యెండితే వస్తుందేమోయని కడుగగా యెంత కడిగినా మొదటి రూపం రాలేదు. పేడ పోయిందేకాని పచ్చరంగు రాలేదు. యెండితే వస్తుందేమోనని యెండబెడితే మొదటి రకం రాలేదు. మొదట ఒక రకం తడిపినప్పుడు ఒక రకం, యెండ బెట్టినప్పుడు ఒక రకం, దేని రకం దానిదే. అమ్మ యెండిపోయిన పిడక దెచ్చి విరిచి అందులో వున్న పొట్టు తీయగా తుంపురు తుంపురులుగా విరిగినవిగా అయిపోతుంది. ఆ పిడకను, యింకా నాలుగు పిడకలను తెచ్చి అన్నీ బాదం చెట్టుక్రింద పెట్టి గిన్నె. పాలు అన్నీ చేర్చి అక్కడ

పెట్టుకుని యింట్లోకి వెళ్లి యెవరు యేమి చేస్తున్నారోనని చూడగా అందరు నిద్రపోతూ వుంటారు. వంటమనిషి యింటికి వెళుతుంది. అమ్మ పొయ్యి రాజేసి దాలివేసి కాసిని పాలు పొయ్యిమీద పెట్టి యింకొక కుంపటిమీద కాసిని బియ్యము కడిగిపెట్టి కాసిని పాలల్లో నీళ్లు వున్నదా లేదా అని చెక్క నిమ్మకాయ రసంపిండగా పాలు గడ్డకట్టి అడుగున నీరు తేరును.

ఒకదాని పదార్థములను మరొక పదార్థము చేత విడదీయవచ్చు. వేరు వేరుగా వున్న పదార్థములను మరొక పదార్థముచేత కలపవచ్చు. పాలల్లో నీరు వున్నవని తెలియలేదుగదా. యెట్లా యే పదార్థములో యేవే వున్నయ్యో పదార్థము చేత పదార్థమును గుర్తింపవచ్చు. విడదీయకుండా మిళితమై యుండుట చేతనే పదార్థముల మార్పును జూచి యేదో మార్పు వచ్చిందని మార్పు సహజమని గుర్తించక ఆ మార్పునే రూపాంతరమనిగాక దానిని కొందరు రూపనాశన మంటారు. రూప నాశనం లేదు. రూపాంతరమే. రూపము మారినప్పుడు మరొక రూపం వుంది యింకా చూద్దాం. ప్రతి వస్తువునూ విమర్శించి చూద్దామనుకొని పొయ్యిమీద వున్న పాలవంక చూచి పాలు పొయిమీద పెట్టినప్పటికంటె సన్నసన్నగా మీగడ కదులుతుంది. అందులోనుంచి సన్నని పొగ పైకి వస్తుంది. పాలవంకనే చూస్తూ అమ్మ జరుగుతున్న మార్పును గమనిస్తూ ప్రతిదానికి జీవితమున్నది. నిప్పుకు, నీరుకు, అగ్నికి, వాయువుకు ఒక్కొక్క తత్వములో అయిదు తత్వములు మిళితమై వున్నవి. యివే అయిదయిదు 25, కాని యీ 25 కూడా ఒక భూతమే మారినట్లు పంచ పడ్డవి గనుక పంచభూతాలయినవి. ఒకరకంగా దూరం పోకుండా పరిమితిగా ఆలోచిస్తే ఒక భూతములో వున్న గుణం మరొక భూతములో మారినట్లుంటుంది నాకు. వీటినిబట్టి చూస్తే యీ నాలుగు రోజులు నుంచి అన్నింట్లో అన్ని వున్నట్లే కనపడుతున్నయ్యి. పొయ్యిమీద పాలు పొంగుకు వస్తాయి. గిన్నె అడుగున పాలు లేకుండా మొత్తం పైకి వస్తాయి. వస్తువును బట్టి అట్లా జరుగును. పొయ్యిమీద పెట్టిన ప్రతి వస్తువు అట్లా జరుగదుగా. వాటి వాటి పరిస్థితినిబట్టి ఒకటి మాడిపోతుంది. ఒకటి పక్వమవుతుంది. అంటే పొయిమీద పెట్టిన గిన్నె మాడింది లోపల పోసిన బియ్యం నీరు రెండింటిని కలిపి పొయ్యిమీద పెడితే నీరు బియ్యంలో మిళితమై పోయి అన్నంగానే తయారై నీరు బియ్యమనేది పోయి అన్నము అనే ఒక పదార్థంగా తయారైంది.

రెండవ పోయ్యి మీద వున్న పాలు చూచి పైకి పొంగిన పాలు అడుగుకు పోయి పొర్లుతూ వుంటాయి. అమ్మ పాలల్లో చెయ్యి పెట్టి చూచి యీ పాలలో శగపెట్టిన కొద్దీ యింకా వేడెక్కుతాయని శగ తగ్గకుండా నాలుగు నాలుగు పిడకలు

వేస్తూ సాయంకాలం 4 గం. వరకు కాచి మళ్లీ మూత తీసి చెయ్యి పెట్టి చూడగా పాలు యింకిపోయి అంతా మీగడే. వేడి ప్రొద్దున యెంతో యిప్పుడు అంతే, శగ యెక్కువయినందువల్ల వేడి పెరగదు. దానికి యెంతవరకు వేడి రావాలో పాలల్లో యెంత అగ్నితత్వమున్నదో అంత యెక్కుతుంది. పైన పెరగదు. యేదైనా యింతే. ప్రతి పదార్థానికి జీవమున్నది. ప్రతి తత్వము జీవత్వమే. తత్వమే జీవత్వం. తత్వమంటే శరీరమని కాదు. తత్వమంటే మనస్సని కాదు. పదార్థమంటే తత్వమే. మిరపకాయకు ఆకృతి శరీరం, దానిలో వుండే గుణం జీవం. మిరపకాయ కాయటానికి చెట్టు జీవము అని దొడ్లో వున్న మిరపచెట్టు దగ్గరకు వెళ్లి పచ్చి మిరపకాయలు కోసుకొచ్చి యింట్లోకి వెళ్లి చింతపండు యెండు మిరపకాయలు తెచ్చి వుప్పు కోసము యింట్లోకి పోగా తాతగారు (చిదంబర్రావుగారు) చీరాల నుంచి వస్తారు. కూతురు గారింటికి వెళ్లిన అన్నపూర్ణమ్మగారు వస్తారు. వంటమనిషి వస్తుంది. అమ్మ ఉప్పు తీసుకుని దొడ్లోకి వస్తుండగా ఏమిటి యీ అల్లరి అని కసురుతుంది. ఉప్పు తీసుకుని దొడ్లోకి రాగానే వంటమనిషిని ఆధారము చూచుకుని అదివరకు మెదలకుండా వూరుకున్న పనిమనిషి కూడా అమ్మ మీద అరుస్తుంది. ''గిన్నెలు తోమి యిక్కడ పెట్టి పో యెందుకు యిట్లా మాడ్చావు యెవరు తోముతారు. (మెల్లిగా) యెవరు తోముతారు నీ తాతా'' అని నల్లి అంటుంది.

అమ్మ : నా తాత కోర్టుకెళ్ళాడు. వచ్చినాక చెపుతాలె అమ్మా. నల్లి అంట్లుతోమమన్నది నిన్ను అని.

నల్లి : యేమిటి అమ్మాయిగారు అంటున్నారు.

అమ్మ ''నువ్వు అన్నది అంటున్నా (మెల్లిగా అంటూ)'' ఆ ఉప్పు, మిరపకాయ అక్కడ పారబోసి, యెవరూ లేనప్పుడు రేపు మధ్యాహ్నము చూచుకుందాములే అని, ఆ వండిన పదార్థము, పాలు, మీగడ దొడ్లో యీనిన పందిని పిలిచి పెట్టును. ఆ పందికి లోగడ అన్నము వేసే అలవాటు వున్నది. మెల్లిగా ఆ పందిని అలవాటు చేసుకొని ఆ పంది దగ్గర పాలు తీయవలయునని దాన్ని అలవాటు చేసుకుంటుంది. ఆ అంట్లుంచిన దొడ్లో వేసుకొని అమ్మ తోముట ప్రారంభించును. యింతలో తాతగారు వచ్చి గులాబి మొగ్గలు యెన్ని వున్నయ్యో చూద్దామని దొడ్లోకి వచ్చి ''యిదేమిటమ్మా సూరమ్మ తల్లి (అంటె అమ్మను) నువ్వు తోముతున్నావెందుకమ్మా అంట్లు? (నిన్న తాతగారు మాట్లాడవద్దన్నమాట అమ్మకు గుర్తుకు వచ్చి నవ్వుకుంటూ అంట్లు యిసకలో కప్పిపెట్టి, నీళ్లు చల్లి యింట్లోకి వెళ్లి గడియారము వంక చూడగా సాయంకాలం 6 గంటలవుతుంది).

శిక్షణ కూడా రక్షణే :

అమ్మ మామూలుగా మఱ్ఱిచెట్టు క్రిందకు వెళుతుంది. మఱ్ఱిచెట్టు క్రింద పోలీసులు కనపడరు. అమ్మ పోలీసులు రాలేదనుకుని రైలు పట్టాలు దాటి అర్ధంకి వారి తోటలోకి పోవుచుండగా, తూర్పు దిక్కునుండి వారుకూడా వచ్చి అమ్మను కలుసుకొని ముగ్గురూ కలసి తోటలోకి వెళతారు. మస్తాన్ సాహెబ్ పై కండువా తీసి కింద పరచి అమ్మను కూర్చోబెట్టి మహమ్మదీయ ఆచారముతో నమస్కారము చేయును. అంకదాసు సాష్టాంగ నమస్కారము చేయును. వస్తూ వస్తూ అమ్మకు పీచు మిఠాయి, పంచదార బూంది తీసుకు వస్తారు. అమ్మ చేతిలో పెట్టగానే అమ్మ పొట్లాలిప్పి కాసేపు ముగ్గురు నిశ్శబ్దంగా కూర్చుంటారు (మౌనంగా). అరగంట అయిన తరువాత పొట్లాల వంక చూస్తే పదార్థములు అయిపోయి వుంటాయి. 5 నిమిషములు వారిద్దరు కళ్లు మూసుకుని కూర్చుంటారు. కళ్లు తెరచి అమ్మకు సాష్టాంగ నమస్కారము చేసి. "అమ్మా! నీ వెవరమ్మా తినేటప్పుడు నీవుగా లేవె తీసుకున్నది కనపడలేదు. నీవుగా లేవు ముసలి అమ్మలాగా కనపడ్డావెందుకు" అని వణుకుతూ, భయంతో యిద్దరూ పాదాలమీద పడి పెద్ద పెద్దగా అరుస్తూ, "చెప్పమ్మా, చెప్పు తల్లీ, ఓ తల్లీ !"

మస్తాన్ : భయమూ వస్తుంది. ఆనందమూ వస్తుంది. యేడుపూ వస్తుంది.

అందాసు : మాకు అడగటం చేతకాదు. నిన్ను తెలుసుకో లేము.

అమ్మ : నాకేం తెలియదు నాయనా. మీరు కళ్లు మూసుకున్నప్పుడు యెవరో ముసలమ్మ వచ్చి తిన్నదేమొ.

మస్తాన్ : నిజంగానే చూచాము నీవుగా లేవు. యెవరుగానో ఉన్నది అట్లా కనపడ్డావని అనలేను. ఆమె వచ్చి కూర్చోవటమూ చూడలేదు. తిన్నది మాత్రము నీవుకాదు.

అంకదాసు : మస్తాను నుద్దేశించి, కాదులేవోయ్, అమ్మ అట్లా కనపడ్డదని మాత్రము నమ్మక మేమిటి? వచ్చి కూర్చోవటము చూడలేదు. అమ్మ లేచిపోవటము చూడలేదు. తిన్నది మాత్రము ముసలమ్మే.

అంకదాసు : అమ్మకు ఆ శక్తి లేకపోతే అయిదేళ్ల పిల్లచుట్టూ మనమెందుకు తిరుగుతాం. లోగడ జరిగిన అనుభవాన్ని గుర్తు దెచ్చుకో. అమ్మ అన్నింట్లోను, ఒప్పించి, మెప్పించుతుంది.

మస్తాను : అమ్మమీద వున్న విశ్వాసం దొడ్డది. నేను యింతవరకు యెవరికి దణ్ణం పెట్టి యెరుగను. అమ్మను చూడక ముందు నేను చాలా తప్పులు చేసేవాడిని. అమ్మ తప్ప మరేమీ గుర్తుకు రావటము లేదు. యిల్లు వదిలిపెట్టి పోదామనిపిస్తున్నది. భార్యా, పిల్లలు యిసుగొస్తున్నది. వుద్యోగము వద్దనిపిస్తున్నది. అమ్మను చూస్తూ వుంటే చాలు. అమ్మ మనం యింటి వద్ద వున్నప్పుడు కూడా యిట్లాగే కనపడితే హాయిగా వుంఉటంది. అట్లా యేమిచేస్తే కనపడుతుందో.

అంకదాసు : మనమనేది పోయి, అంతా అమ్మయితే.

మస్తాను : అంతా అమ్మయితే అమ్మను చూడటమెదుకు ? అంతా అమ్మ అయితే ఆనందమేమున్నది. అమ్మ అమ్మగా వుండి మనం పిల్లలగా వున్నప్పుడే ఆనందం. యిదే పెద్దలు చెప్పే జీవన్ముక్తి లక్షణము, యిదే భక్తి అని.

అమ్మ యేమీ మాట్లాడకుండా దూరంగా కూర్చుని వుంటుంది. ప్రొద్దుగూకింది. మనం యింటి దగ్గర మాట్లాడుకుందాం లే అని అమ్మతో వెళ్లి అమ్మను యింటివద్ద వదిలి పెట్టి, వెళ్తూ రేపు మళ్లీ అమ్మ దర్శనమయినపుడు యింకా కొంత తెలుసుకుందాం. ముగ్గురూ కలసి వెళుతుండగా దారిలో రైలు పట్టాల కివతలగా పది గజాల దూరములో ఒక ముసలివాడు యెదురుపడి యెగాదిగా అమ్మ వంక, వారి వంక చూచి అమ్మను తేరిపారచూచి సాష్టాంగ నమస్కారము చేసి ప్రాణము వదులును.

అంకదాసు, మస్తాను, అతను యింకా నమస్కారము చేస్తున్నాడనుకొని యెంతసేపటికి లేవకపోతే మస్తాను లేవదీస్తాడు. తాత లేవక నోటివెంట నురుగు పడుతుంది. వొళ్లంతా పచ్చబడి వుంటుంది.

మస్తాను : యిదివరకు యెరుగుదువా అమ్మా?

అమ్మ : యిదివరకు ఒకప్పుడు బిక్షాటనకు వస్తే భిక్షము పెట్టలేక పోయాను. ఆ రోజు నేను అతను బజారుకు కలిసి వెళ్లినపుడు కొంత పరిచయం కలిగింది.

మస్తాను : ఆ పరిచయమే యీనాటి యీ ధన్యత్వము, యీ దివ్యదర్శనము. (మస్తాను అతన్ని తీసి, అమ్మ ఆజ్ఞ తీసుకుని పారవేసి వద్దామంటాడు)

అమ్మ : నాయనా యిప్పుడు రాత్రి గం. 7.30లు అయింది. తొందరగా పారేయగల్దురా. మీరిద్దరు వెళ్లి కట్టెలు కొనుక్కొని రండి నేను యింటికి వెళ్లి

కనపడి వస్తాను. రావటానికి యిబ్బంది అయి యెవరైనా ఆటంకపరిస్తే రాలేను. రాలేకపోయినా మీరు యేంచేచాలో అది చేసివేయండి.

అంకదాసు : అమ్మా ! యితని శరీము కూడా ముక్తిపొందింది. పూర్వం చరిత్రల్లో లేని విశేషాలు యీ అవతారములో కనపడాలమ్మా. కనపడుతూనే వున్నదనుకో, దుష్టశిక్షణలేని అవతారము. అంటే అందరికీ రక్షణే.

అమ్మ : శిక్షణ కూడా రక్షణే నాయనా. నేను వెళ్లి వస్తా!

మస్తాను : నీవు పోయి తొందరగా రామ్మా.

అమ్మ "పడుకున్న శవాన్ని ముద్దు పెట్టుకుని, నాయనా నీవు పోయినా నిన్ను గుర్తించటానికి నీవు ధరించిన యాకృతి వున్నది". (ముద్దు పెట్టుకుంటూ) అమ్మ యింటికి వెళుతుంది. యింటివద్ద (చిదంబర్రావు) తాతగారు వాళ్లు భోంచేస్తూ వుంటారు. అమ్మ వెళ్లి దర్వాజా పట్టుకుని నుంచుంటుంది.

తాతగారు : అమ్మా ! యెక్కడకు పోయావు. అన్నానికిరా అని, రాఘవమ్మగారూ అమ్మకు అన్నము పెట్టండి.

రాఘవమ్మ : కంచం పెట్టుకుంటావా, యిస్తరి వేసుకుంటావా ?

అమ్మ : (రెండు నిమిషాలు ఆలస్యము చేసి రెండు బాదమాకులు కోసుకొని) అన్నం పెట్టండి రాఘవమ్మగారూ.

రాఘవమ్మగారు "ఆఁపెడ్తా అమ్మా" అని అన్నం పెట్టిపోతారు. తాతగారు వాళ్లు భోంచేసి పోతారు. అమ్మ ఒక్కరు కూర్చుని వుంటారు.

అమ్మ రెండు మెతుకులు నోటిలో పెట్టుకుని, ఆకులో వున్న అన్నము మామూలుగా పెట్టే పందికి పెట్టి, అమ్మ తొందరగా దొడ్డి వాకిలిని పరుగెత్తుతుంది.

అనసూయ తత్వం :

శవము దగ్గర మస్తాను, అంకదాసు యిద్దరూ లేరు. అమ్మ వెళ్లి శవమును తడుముతూ కూర్చుంటుంది. యింతలో మస్తాను, అంకదాసు పుల్లలు తీసుకు వస్తారు. శవం కొంచెం కదిలినట్టు వుంటుంది.

మస్తాను : అమ్మా ! తాత కదిలినట్టున్నాడే !

అమ్మ : కదిలేది కదలదా నాయనా !

మస్తాను : యేమిటమ్మా! నిజము చెప్పు. పుల్లలు తెప్పించి మమ్ముల ఆడించి, చంపి బ్రతికించావా అమ్మా ! (అమ్మ మాట్లాడదు. శవము వంకనే చూస్తూ వుంటుంది)

అంకదాసు : చావటము కాదేమొ, సమాధి స్థితియేమొ !

మస్తాన్ : సమాధి అంటే నమాజా.

అంకదాసు : అంటె బాహ్యస్మృతులు తప్పి (అమ్మ) పరమాత్మలో లగ్నము కావటము.

మస్తాను : పరమాత్మలో కాదు, అమ్మలో లగ్నము చేసుకొని మళ్లీ అతనితో పనివుండి మళ్లీ స్మృతి తెప్పించింది.

మస్తాను : అమ్మ విధానవేు అదిగా. సచ్చాడు అంటే సచ్చాడంది. పారవేయాలంటె పారవెయ్యమంది. గుంట అంటే గుంట అంది. కాదు కట్టెలంటె కట్టెలంది.

అంకదాసు : విషయాన్ని మరుగు పెట్టి ప్రేమను చూపెట్టావమ్మా. నిన్ను గుర్తించేదెవరు ? యిదివరకు యెవరికయినా యిట్లా కనపడ్డావా అమ్మా?

మస్తాను : అతను యేమీ తెలియనివాడు కదా ముష్టికి వచ్చిన వాడు కదా, సాధన అంటే యేమిటో అమ్మ అంటే యేమిటో తెలియక తన ఉదరపోషణకు వచ్చిన వాడికి యింత మహాభాగ్యము, దీనికి యీ పేరు తగునో తగదో యింకా యేమైనా పేరు పెట్టాలో వర్ణించటానికి చేతకావటము లేదు. మనసుకు తడుతున్నది, నోటికి రావటం లేదు.

అంకదాసు : అమ్మవంక చూస్తున్నావా మస్తాను ? అమ్మ తేజస్సు రకరకాలుగా మారిపోతున్నది. యెనకటివారు దశావతారాలే చూపించారంటారు. అమ్మా అమ్మా! అని పెద్దగా అంటూ అమ్మవంక చూచి మనుష్యుల రూపంతో శరీరధారివై అయిన రూపాలే కాకుండా, కొండలు, నదులు, నిధులూ, కూడ యీ అరగంటలో రకరకాలుగా కనపడుతున్నవి. వొళ్లు పులకరిస్తున్నది. ఆనాడు కృష్ణుడు యశోదకు చూపించినది యిదేనేమొ. అది నిజమని వొప్పుకోవాలంటే, యీనాటి అమ్మే ఆనాటి కృష్ణుడుగా పుట్టి వుండాలి. యీ అదృష్టము ప్రతి ఒకరికి కలగాలి. కలగాలి (అని పెద్ద కేకలెడతాడు). అమ్మా అమ్మా! నీవెవరో చెప్పమ్మా. యెరుక

చెయ్యమ్మా. యెరకయింది. ఆ యెరుకయింది యెరుక చేశావు. యెరుక చేశావు. యెరుకే నీవు. నేను బాల్యంలో లక్ష్మీనరసింహ శతకము చదువుకొనే వాడిని. ఇంతకంటె నాకేమి దైవచింతన లేదు. నాకు భగవంతుడూ నేను భగవంతుణ్ని చూచానంటే నేను భగవంతుణ్ణి గుర్తు పట్టానంటే అమ్మ మనకొరకు, యేమీ చేయలేనివారికై, భక్తిలేనివారికి విముక్తి లేదంటున్నారు. భక్తి లేనివారికి ముక్తి వున్నదని, భక్తి తానని, ముక్తి తానని రుజువు చేస్తున్నది. లేకపోతే నేను చాలా దుర్మార్గుడను. సరియైన వృత్తులు లేవు. నాకు యిన్ని మాటలు యింత స్తోత్రము యిటువంటి దర్శనము - (అని అమ్మ పాదముల మీదపడి నమస్కారము చేస్తూ లేవలేడు).

ముసలివాడు బాగా పొర్లుతున్నాడు.

మస్తాన్ సాహెబ్ : కళ్లు మూసుకుని అంకదాసు అనేవి అన్నీ వింటూ యివన్నీ తనకూ కలిగితే యింతగా మాట్లాడలేడు. తనలో వున్న జీవం లేదు అమ్మలో ప్రవేశిస్తున్నట్లుగా భావించి తను లేను వున్నదంతా అమ్మే అనుకుంటాడు.

అంకదాసు అమ్మ పాదముల మీద నుంచి లేస్తాడు.

మస్తాను : అమ్మా !

అమ్మ : మస్తాను వంక చూస్తుంది.

మస్తాను : అజ్ఞానులకు జ్ఞానము యెట్లా కలుగుతుంది.

అమ్మ : మీకు కలిగినట్లుగా

మస్తాను : మాకు నీ దయవల్ల కలిగిందమ్మా.

అమ్మ : అందరికీ ఒకరి దయవల్లనే. అజ్ఞానం, జ్ఞానం ఒకరి దయవల్లనే కలుగుతుంది. (రాజుగారి పాట "పాడుచు పాడుచు నీ కథ చాటుచు"). యింతలో ముసలి తాత కదలి లేచి కూర్చుంటాడు.

అంకదాసు : తాతా నీకెవరయినా సంజీవి పోసారా ?

మస్తాను : సంజీవె 'అమ్మ'య్యా ! జీవులకు సంజీవి!

(రాజుగారి పాట "అమ్మా అమ్మా ఆది జననీ అవనికన్న పావనీ" - అనేపాట.)

అమ్మ : (తాత నుద్దేశించి) నాయినా మంచినీళ్లు తాగుతావా ?

తాత : (హీన స్వరముతో) యిక యేమీ వొద్దమ్మా. నీవిచ్చిన డబ్బుకూడా అవుసరం లేదు. కొంత ఖర్చు అయింది. ఒక తప్పు చేశాను. అది కూడా ఆ తప్పుకే ఖర్చు అయింది.

అమ్మ : యే తప్పు నాయనా !

తాత : నీకు తెలియదా అమ్మా! ఆ తప్పు కోసమేయిచ్చి వొచ్చావుగా.

అమ్మ : అప్పుడు నీకు తప్పులేదు, నేనే యిచ్చినప్పుడు.

తాత : నేను యింకొకటి చెప్పుకుంటా అమ్మా, తాగి మాంసం తినాలని కొనుక్కున్నా అమ్మా ! చేసుకోటం చేతగాక పారేసుకున్నా అమ్మా.

అమ్మ "నాయనా ! నా దగ్గరకు తెచ్చుకోలేక పోయినావా చేసి పెట్టేదాన్ని, పచ్చిది కూడా తినొచ్చు కదా, యెందుకు పారవేసుకున్నావు? నాకు తెచ్చిపెట్టక పోయావా? నేను తినేదాన్ని" అని అనగానే తాత వులిక్కిపడి (అమ్మ చేతిలో వున్న మాంసపుముక్కను చూచి) అమ్మ పాదముల మీద పడబోయి ఆ యిద్దరి మీద పడతాడు.

తాతకు యేదో మంచి దృశ్యం కనిపించినదని, ఆ యిద్దరూ "యెవరి అనుభవము వారిదేరా, ఒకరికి యిచ్చిన అనుభవము యింకొకరికి యివ్వదు. ఎదురుగుండా వున్నా కనుపించదు."

రాత్రి గం. 12 లు. ప్రొద్దు పోయింది.

అంకదాసు తాతతో "యిందాక అమ్మ పాదాలమీద ఎందుకు అట్టా పడ్డావు. కారణము ఏమిటి, ఏమన్నా కనపడ్డదా?"

తాత : లేదుబాబూ తాచుపాము కరిచింది. బ్రతకననుకుని స్టేషనుకు పోదామనుకుంటుండగా, అమ్మ ఫలానచోట వున్నట్లుగా శబ్దము వినపడుతుంది. దీపము చూడకూడదన్నారు. దీపము లేకుండా అమ్మ దారి చూపించింది. సరాసరి అమ్మ దగ్గరకు వచ్చాను. యేమీ తెలియలేదు. అమ్మ మొన్న కనపడ్డప్పుడె అయ్యా ! వినండి. యీ డబ్బు నీవు సొంతము వాడుకుంటావా అన్నది. యింకొక ముక్క కూడా అన్నది. పెద్దవాడివి పాములు, తేళ్లు జాగ్రత్త. యెన్నాళ్లనుంచి తిరగటంలేదు, యేమిటి యీ అమ్మాయి ఇట్లా అంటుంది అని అనుకున్నా. అప్పుడు డబ్బు దాహం తప్ప మరేమీ కనపడలా. ఆ రోజు నుంచి అమ్మ రోజుకొక రూపంతో

కనపడుతూ మాటలు వినపడుతూనే వున్నాయి. నిన్నరాత్రి నేను యేదో వొచ్చి చచ్చి పోయినట్లు అమ్మ మందు పోసితే బ్రతికినట్లు కలవొచ్చినది.

''ధన్యుడివి, ధన్యుడివి'' అని యిద్దరూ అందురు.

మస్తాను : యిది ఒక కలగానే వుంది. యీ చిన్నపిల్ల యేమిటో పెద్దగా వుండటమేమిటో, మనకీ అనుభవా లేమిటో? యిటువంటి నిర్భాగ్యులకు యెటువంటి సౌభాగ్యము లభ్యపడ్డది. అమ్మ చెప్పినట్లుగా రెండూ యిచ్చేది ఒకరే అనేమాట నిజం. మనం చేసిన ఖర్మకొద్దీ అనేది లేదు. మనచేత చేయించిన ఖర్మ అమ్మ తీసేస్తుంది. లేకపోతే యే సుకర్మలు చేస్తే అమ్మ కపపడ్డది. చేసుకున్న భార్యనా అగచాట్ల పాలు చేసాను. తమ్ముల నన్యాయము చేశాను. చెయ్యని దుర్వృత్తి లేదు అని మోకాటిమీద కూర్చుని అమ్మకు నమస్కారము చేస్తూ ఒక దండకం మాదిరిగా అమ్మకు తన జీవిత కథను వినిపిస్తాడు. యిది అంతా నీకెంత చెప్పినా పాపం తీరదు అనిపిస్తుంది. మళ్లీ నీవు కనపడ్డ తరువాత పాపమేమున్నదనిపిస్తుంది. అని పెద్దగా అరుస్తూ వొణుకుతూ అమ్మ పాదాలమీద పడిపోతాడు.

అంకదాసు లేచి పక్కకు నుంచుని, అమ్మను చూచి ''లీలావతీ లీలావతీ!'' అంటాడు. ''నీపేరు లీలావతా అమ్మా?''

అమ్మ : లేదు నాయనా, నాపేరు అనసూయ.

అంకదాసు : అనసూయ. అంటే సరియైన అర్థం చెప్పమ్మా. అనసూయ అంటే అసూయలేనిదంటారు అంతేనా? యింకేమైనా అర్థముందా నీవు చెప్పమ్మా.

అమ్మ : పదానికర్థము అదేనేమొ కాని నా వుద్దేశము చెపుతా నాయనా నాకు చదువు రాదుగా, అని అర్థము చెప్పేటప్పుడు అమ్మ ఆకారం 'తెల్లచీర, తెల్ల రవిక, సొమ్ములేమీ లేకుండా మొఖమున బొట్టు కూడా లేదు. తల విరబోసి, బాసీపీట వేసి కూర్చుని వుంటుంది. అమ్మ వయస్సు 20 వున్నట్లు కనిపించును''

అమ్మ ముగ్గురకు యీ రూపముతో ఒకేసారి దర్శనమిచ్చు చుండును. యీ మార్పును పోలీసు వుద్యోగమును గురించి అడిగి నప్పటినుంచి. ముగ్గురు అమ్మ ఏమి చెపుతుందోనని ముఖము వంక చూస్తూ వుంటారు.

అమ్మ : నాయనా ! ''అనసూయ అంటే నా వుద్దేశ్యం రాగ ద్వేష అసూయలను పారద్రోలేదే అనసూయ" అదే "అనసూయత్వం. ఈ అనసూయ తత్వం". మస్తాను ఒకడికే అర్థమవుతుంది. తక్కిన యిద్దరకు అర్థము కాదు.

అంకదాసు : నాకర్థం కాలేదమ్మా అంటాడు. తాత అది కూడా అడగడు.

మస్తాను : యింటికి పద తరువాత నేను చెప్తాను అంటాడు.

అంకదాసు : నీవు చెప్పినా యిట్లా వుండదు లేవోయి "ఆ ధ్వని మధురం. ఆ తత్వమే చెప్పేది కనుక ఆ తత్వమే అమ్మయి చెప్పేది కనుక కొంత అర్థమయింది. పూర్తిగా కాకపోలా".

మస్తాను : చాలా ఆనందంగా వున్నదమ్మా యీ భావం.

తాత : అర్థం కాలేదంటూ వెనక్కు తిరిగి చూస్తాడు (తన్ను యేదో కదిలించినట్టు వుంటె) తళ తళలాడుతూ తనను కరచిన సర్పం వెనుకకు వచ్చి నిలుచుంటుంది. ఆ పామును చూచి పెద్దగా అమ్మోయ్! అని అరుస్తాడు.

అమ్మ : నేనేలే నాయనా. యెవరూ లేరు (వారిద్దరకు కనిపించదు).

తాత : కాదమ్మా, పాము.

అమ్మ : యెక్కడ నాయనా ?

తాత : అదేం అమ్మా నీమీద పాకుతూ వుంటే లేదంటావేం. అమ్మో కరుస్తుంది. కరుస్తుంది.

వాళ్లిద్దరు : మనసు చెడిపోయింది. భయపడ్డాడు అదే కరిచింది కదూ అని అనుకుంటారు.

కాని అతనికి కనపడుతున్నది నిజమే.

అమ్మ వంటినిండ పాము చుట్టుకొని అమ్మ శరీరం కనపడకుండా పాము శరీరమే చుట్టినట్టుండి చివరకు పాము ఆకృతిగా వుండి పాము రూపమై అమ్మ ముఖము మాత్రము మామూలుగానే కనపడుతుంది తాతకు. భక్తి కలిగి, భయము తగ్గుతుంది. అమ్మ సాక్షాత్ భగవంతుడని ఆరూపంగా విశ్వసిస్తాడు. భక్తి ఒకటే, కలిగే సదుపాయాలు వారి వారి స్థితినిబట్టి కలుగుతున్నట్టుగా యిదంతా ఆలకించి మస్తాను అంకదాసుతో అంటాడు.

అంకదాసు : అతనికి కనుపించిన దృశ్యం మనకు కనుపించ లేదు. నీకు కలిగినవి నాకు లేదు. నాకు కలిగినవి నీకు లేవు. మొదటి రోజు వయసుకు మించిన చురుకుగా, తెలివి గలదానిలా కనుపించింది. రెండవ రోజున అసాధారణ

వ్యక్తి అనిపించింది. మూడవరోజు దైవత్వం ప్రబోధిస్తుంది. తాతతో సహా నాకేమనిపిస్తున్నదంటే, చెప్పటం చేతకావటం లేదు అమ్మ దగ్గరకు చేరిన వాళ్లమంతా తలా వొక రకంగా చేరాము, అనుభవాలు వేరుగా వున్నాయి. కలిగే ఫలితం ఒకటే. మనస్సుకు తడుతున్నయ్యి కాని యింతకన్న చెప్పలేను. మాటలు రావు.

మస్తాను : భేషు ! చక్కని మాటన్నావు. నా స్థితి అట్లాగే వున్నది. మనము చూడక పోయినా అమ్మను ముందు ముందు జరగబోయే రోజుల్లో అమ్మే దేముడని ప్రపంచమంతా గుర్తించాలని నా ఆశయం.

అంకదాసు : అమ్మ అనుకుంటే యెందుకు కాదు. మనం మాత్రము గుర్తించామా? అమ్మ దయేగా మనం గుర్తించటానికి.

మస్తాను : అమ్మను భగవంతుడు తప్ప గుర్తించలేడు. అమ్మే భగవంతుడుగా, యింకా గుర్తించేదెవరు?

అంకదాసు : యింకో తమాషా చూచావు. అమ్మ ఇదంతా ఒకసారిగానె చూపిస్తే మనం యేమయ్యేవాళ్లమొ. గుజ్జనగూళ్లు పెట్టినట్టు చేసింది.

మస్తాను : కాదు, కాదు. వేలు నోట్లో పెట్టి పుట్టగానే ఆముదం కుడపటం నేర్పుతారు. గుజ్జనగూళ్ల దాకా పోయావే ! అదే స్థితి మనస్థితి.

తాతకు యీలోపుగా అనేక ఆలోచనలు తట్టుతూ వుంటాయి. "అమ్మ డబ్బు యిచ్చేటప్పుడు అమ్మను గురించి సరిఅయిన ఆలోచనతో లేను. అమ్మను ఒంటరిగా పిలిచి ఒంటికున్న నగలన్నీ కాజేద్దామని అనుకున్నాను. అమ్మ నా బుద్ధి గ్రహించి తనే పాముగా వచ్చి కరిచి తనే నేను యిక్కడ వున్నానని చెప్పి రప్పించి నేను కనుక్కోనేమోనని నేనేరా అని చూపించింది" అని అనుకొని "అమ్మా! నేను ఒకటి అడుగుతా చెబుతావా ? నాకు యిందాకటి నుంచి అట్లాగే కనపడుతున్నావు. నాకు కనపడ్డట్టు వారికి కనపడటం లేదనుకుంటా. నేను అడుగుతున్నాను. వారు అడుగుట లేదు. నా భయం వారికి లేదు. నా ఆనందమూ లేదు. అమ్మా ! నేను అడగదలుచుకొన్నది అడుగుతున్నా చెప్తావా" అని పై సంగతులు అడుగుతాడు.

అమ్మ : నీకు యేది తోస్తే అది నిజం నాన్నా. నీకు కనపడ్డదాన్ని పట్టేగా నీకు తోచేది. నేను కనుపింపజేసేది. నీకు తోచేది. నీకు చెప్పేది నీవు చెప్పేది అన్నీ ఒకటే.

తాత : (తల వూపుకుంటూ) యిట్లా ఎపుడూ పాముగానే దర్శనమీయమ్మా మరొకటి మారితే గుర్తించ లేనేమొ.

యిది విని వెంటనే అంకదాసు, మస్తాను అందుకొని "అదేమిటోయ్ అప్పడు ఆ శక్తియిచ్చే ఆ దర్శనమిస్తుంది" అని యిద్దరూ ఒకేసారి అంటారు.

అంకదాసు : యిప్పుడు అమ్మ చెప్పింది అంటే యింతకు ముందు తాతకు చెప్పింది యేమిటి అంటే అన్నీ అమ్మేనని చెప్పేది, చేసేది, చూసేది.

మస్తాను : అదే యేదైనా అనుకోవచ్చు. అదే మనోవాక్కాయ కర్మలంటారు.

అమ్మ : దీన్ని గురించి మొన్న స్థానాచార్యులుగారు యీ మూడు వివరణలు చాలాసేపు చెప్పారట.

మస్తాను : అవి యింత వివరంగా ఎందుకుంటయ్యమ్మా. నీవు మూడు మూడు చేసి, మూడూ ఒకటి చేసి ఆ ఒకటి నీవైన అమ్మవు నీవొక్కమ్మవే. నీవు చెపితేనే సరిపోతుంది. ఒకటి మూడుగా చెపుతావు. మూడు ఒకటిగా చెపుతావు. అది నీ సొమ్ము.

అంకదాసు : సొమ్ము యేమిటయ్యా మల్లా, సొమ్ము అమ్మ కాదూ !

మస్తాను : అవును మాటల్లోకి వచ్చేటప్పటికి తొట్రుపాటు వస్తూనే వుంటుంది.

అంకదాసు : నిజమే

అమ్మ : నాయనా తెల్లవారొచ్చింది. యింటికెళ్దాం. నేను రేపు మన్నవ వెళతాను. యెప్పుడు వొస్తానో - నేను యెక్కడున్నా మీయమ్మ మీకే వుంది. లేద్దామా ? తాతను చేయిపట్టుకోండి.

అంకదాసు : యికను కనపడవా అమ్మా అని యేడుస్తాడు.

మస్తాను : యేడుపెందుకు ? ఎక్కడున్నా వున్నదిగా.

అంకదాసు : ఎక్కడ వున్నా వున్నమ్మ వెళ్లి వస్తానన్నదిగా.

మస్తాను : రూపం పరిమితి. శక్తి అనంతం. యీమాట అనగానే ఒకసారిగా అన్ని దిక్కులా అరుణోదయపు కాంతితో వెలిగిపోతుంది. ఈ దృశ్యం ముగ్గురకూ ఒకేసారి కనపడుతుంది.

అంకదాసు : ఇదే జీవన్ముక్తి అంటాడు. అంటే జీవముతోనే ముక్తి పొందటం.

మస్తాను : దీని వివరణ అమ్మ చెపుతుందిలే, కాదు కాదు వివరణ చెప్పేది కాదు అనుభవించేది. ఈ అనుభవం ఎంతమంది శాస్త్రుర్లు చెపితే తెలిసేది ! మనం అనుభవించిందే నోటితో చెప్పలేక పోతున్నాము కదా.

అమ్మ : చెప్పేది అంతా అనుభావం. తనలో వుద్భవించేది అనుభవం.

మస్తాను : అబ్బా! అర్థం చేసుకోవటం చాలా కష్టం.

అమ్మ : వెళ్లివద్దాం నాయినా తెల్లవారి నేను వూరికి వెళ్లాలి. మళ్లీ కలుసుకున్నప్పుడు - అని ముగ్గురు లేచి నుంచుంటారు.

తాత : యింతకు నాగతేమిటి ?

అమ్మ : "వాళ్ల గతే నీగతి. అందరికీ సుగతే !"

మస్తాను : జేబులో వున్న కాగితం కలం తీసుకొని "అందరికీ సుగతి" అని వ్రాసుకుంటాడు.

అంకదాసు : అమ్మ అన్నమాట విన్నారా, చూశారా (అమ్మను చూశారా, అమ్మ కనబడ్డ దృశ్యం, అందరిని వొడిలో వేసి దోపుకున్నట్టుగా కనపడ్డది).

మస్తాను "మాట వినపడ్డది కాని దృశ్యము చూడలేదు. మామూలుగా యిందాక వున్నట్టే వున్నది" అని "ఆశ్చర్యమేమున్నది. పడేసి లాగి వొడిలో నేను కుంటుంది. ప్రపంచమంతా ఆ వొడిలో వ్రాలాలి. తప్పదు తప్పదు. అమ్మా ! అమ్మా!" అంటూ "తెల్లవారకుండా వుంటే బాగుండును. అయినా యిందాకనే తెల్లవారొచ్చిందనుకొటె యింత ప్రొద్దున్నదేమిటి?"

అంకదాసు : మనకు యెంతవరకు చెప్పదలచుకొంటె అంతవరకు ప్రొద్దువుంటూనే వుంటుంది.

అమ్మ లేచి రెండడుగులు సాగి మామూలు చిన్న పరికిణీ చొక్కాతో మామూలు పిల్లగానే తాత చెయ్యి పుచ్చుకుని "మీరు ముగ్గురు అటు దగ్గర త్రోవను తిరిగి వెళ్లండి. నేను యిటు వెళతా" నంటుంది అమ్మ.

అంకదాసు : యెందుకమ్మా మాతోనేరా, లేదా మేము నీతో వస్తాము.

మస్తాను : మనంటివాళ్లు యింకా యెంతమంది వున్నారో మూలమూలలా.

అంకదాసు : అవును యీ మ్మూడు రోజులకే (యీ కొద్ది రోజులకే) యింత చరిత్ర జరిగెనే భూమి మీదకు వచ్చి 6 సంవత్సరములాయె యెంతమందిని తరింప జేసిందో.

మస్తాను : "పుట్టకముందు లేదూ? యిది తెలిసింది. అది తెలియంది".

అమ్మ : 'తెలియంది తెలియటానికే నాన్నా (అంటే) యీరాక"

వారి ముగ్గురూ వారి త్రోవన వారు వెళతారు.

4. నాగేంద్ర మయం

పంచామృతాలు :

అమ్మ ఐలూరు కాంతమ్మగారి ఇంటి మీదుగా వెళ్ళుచుండగా ఆస్పత్రి వద్ద కాంపౌండరు కృష్ణమాచారి కనబడి "ఏ అమ్మాయ్! ఎక్కడి నుంచి వస్తున్నావు?"

అమ్మ : యేదో, బైటకు వెళ్లి వస్తున్నా (అమ్మ చేతిలో చెంబు వుంటుంది).

కృష్ణమాచారి : యేదో బైటికంటె అతికించినట్టుగా వుంది. (యీ కాంపౌండరు లోగడ అమ్మమ్మకు జబ్బు వచ్చినప్పుడు మందు యిచ్చిన డాక్టరు గారి వద్ద నున్న కాంపౌండరు. ఆ పరిచయం)

కృష్ణమాచారి : మీరు యిక్కడే వున్నారా అప్పటి నుంచి. మన్నవ పోలా ?

అమ్మ : యీరోజు వెళతా మండి.

కృష్ణమాచారి : మీ నాయనగారు, మీరు అందరూ వెళతారా అంటూ మా డాక్టరింట్లో నిన్ను గురించి యేమిటో చెప్పుకుంటున్నా రమ్మా. అది విన్నప్పుడు నిన్ను చూడాలనిపించింది. అనుకోగానే కనపడ్డావు.

అమ్మ : యిప్పుడు ప్రొద్దున్నే యెందుకొచ్చారు ఆస్పత్రికి.

కృష్ణమాచారి : మీ అమ్మగారి లాంటి కేసు వచ్చింది రాత్రి. ఆ కేసు చేస్తున్నంతసేపు నీవే గుర్తుకొచ్చావు. అదీగాక డాక్టరు గారింట్లో నిన్ను గురించి విన్నప్పటి నుండి పిల్లలోకి అసాధారణమైన పిల్లవని అనుకుంటున్నారు. నాకు తెలియకుండానే రాత్రి ఆమెకు వైద్యం చేస్తూ వుంటే మిమ్ములు ధ్యానము చేసుకుందామనిపించింది. యింత చిన్నపిల్లను పట్టుకుని మిమ్ములను అని అనటం

యెట్లా జరిగిందో ధ్యానము కూడా అట్లాగే జరిగిందనుకుంటా. ధ్యానమే కాకుండా దర్శనము కూడా అయింది.

అమ్మ : అవును నాయనా ధ్యాసే ధ్యానము.

కృష్ణమాచారి : (వారి వయసు 30 సంవత్సరములు) నాకు ఆధ్యాత్మిక చింతన అంటే చాల యిష్టమమ్మా. ఈ వుదర నిమిత్తం, యీ వుద్యోగాలతో, ఆ యోగ్యత లేదు.

అమ్మ : ఆ యోగ్యత కలిగినప్పుడు, అవకాశం కలిగినప్పుడు, మీరు చేసే సాధన చతుష్టయ సంపత్తి వల్ల కలిగే ఫలితమే మన సంభాషణ.

కృష్ణమాచారి 'అయితే మీదేనా అమ్మా ! అయాచిత సంస్కారమమ్మా యిది' అంటూ కాళ్లమీద పడి, నమస్కారం చేసి "మళ్లీ వచ్చి కలుసుకుంటావా అమ్మా", అంటూ డొక్కశూల నొప్పితో బాధపడుతూ ఆ బాధతోనే విశ్రాంతి లేక దరిద్ర పీడితుడై "భావాద్వైతముతో" మునిగి తేలుతున్న కృష్ణమాచారి గారు తెల్లవారు ఝామున గం. 5.30లకు పరమాత్మలో కలిసిపోతారు.

అమ్మ ఇంటికి వచ్చేస్తుంది సరాసరి. యింట్లో అందరూ అప్పుడే నిద్రలు లేస్తూ వుంటారు.

పనిమనిషి వచ్చి వాకిలి చిమ్ముతూ వుంటుంది. అమ్మను చూచి "యెక్కడనుంచి అమ్మాయి వస్తున్నా" వంటుంది. అమ్మ మాట్లాడకుండా, ఊఁ అని లోపలకు వెళ్లగానే తాతగారు వచ్చి మేడ దిగివస్తూ "యెక్కడమ్మా నిన్న సాయంకాలము నుండి కనపడలేదు".

అమ్మ : ఐలూరు కృష్ణమూర్తితో ఆడుకుంటూ, వారింట్లో నిద్రవస్తే పడుకున్నా.

తాతగారు : రాత్రి అన్నము తిన్నావా ?

అమ్మ : ఆకలిగా లేదు.

తాతగారు : యిదేంటి యెప్పుడు ఆకలిగా లేదు ఆకలిగా లేదంటావు?

అమ్మ మాట్లాడకుండా యింట్లోకి వెళ్లి వంట యింట్లో అంట్లు సరిచేస్తున్న వంటమనిషిని చూచి 'రాఘవమ్మగారూ మీకు పనికిరాని అన్నముంటే కాస్త పెడతారూ?'

రాఘవమ్మ : పెడతావమ్మా. ఆ గిన్నెలో వున్నది తీసుకో, పెట్టేదేమున్నది?

అమ్మ బాధమాకు తెచ్చి అన్నము పెట్టుకుని దొడ్లో వున్న పంది కోసము పోగా పంది లేదు. 5 నిముషాలు నుంచోగానే పిలిచినట్టుగా పంది వస్తుంది. పంది నిన్నటి నుంచి అన్నం పెట్టలేదుగా, రాత్రి పెట్టలేదుగా, అన్నట్టు దీనంగా వుంటయి కళ్లు. ఆర్తితో ముందు పాదాల దగ్గరకు వచ్చి, ముట్టి పాదాలమీద ఆనించి ఆ అన్నము తింటుండగా యెక్కడికో పోయిన పిల్లలన్నీ వచ్చి తల్లి పొదుగులోకి దూరి ఒకదాని నొకటి తరుముకుంటూ నెరుముకుంటూ ఆడుకొంటూ వుంటాయి. అందుల్లో ఒక పిల్ల అమ్మ దగ్గరకు వచ్చి అమ్మ వొడిలో యెగిరి కూర్చుంటుంది. తాతగారు చెంబు దీసుకొని అటువచ్చి కేకలు వేసి యేమిటి ఆ పందులతో, పాకీదొడ్లోపడి ఆడుకుంటున్నావా? నిన్ను కూడా పందిపిల్ల అంటారు.

అమ్మ : అంటే తప్పులేదు. మనం వంటయింట్లో వున్నాం. అవి పాకీదొడ్లో వున్నాయి. మనకు వంటయిల్లు యెంతో వాటికి పాకీ దొడ్డి అంతే, దొడ్లోకి వెళ్లిన తాతగారు వచ్చేలోగా యింట్లోకి వెళ్లి, తాతగారు వెళ్లిన తరువాత మళ్లీ వద్దాము గదా అని యింట్లోకి వెళుతుంది. మన్నవ నుంచి తాత (సీతాపతి)గారు వుదయం పాసింజరుకు అప్పుడే దిగి వస్తారు.

అమ్మను చూచి తాతగారు చేతులు చాస్తారు యెత్తుకొనటానికి. అమ్మ తాతగారి చేతుల్లో వాల్తుంది. తాతగారు అమ్మను పైకెత్తుకుంటూ అమ్మా! మన్నవ పోదాం వస్తావా!

అమ్మ : మన్నవలో యెవరున్నారు ?

తాత : మనమే వుందామమ్మా, యెవరెందుకు?

అమ్మ : అన్నము యెవరొండిపెడతారు?

తాత : యెవరెందుకమ్మా మనమే వొండుకుందాం.

అమ్మ : తాతమ్మ రాదా? (మరిడమ్మ)

తాత : నీకెందుకమ్మా యివన్నీ!

అమ్మ : నాకు తాతమ్మ కావాలిగా.

తాత : పోనీలే! నీవు మీ తాతమ్మ దగ్గరుండు.

అమ్మమ్మ (రంగమ్మ) సంవత్సరీకాల కొరకై నిజామాబాదు నుండి తాతమ్మ వస్తుంది.

తాతగారు (సీతాపతి) "యీమె (అమ్మ) నీవు వస్తే కాని రాదట. నీవు వస్తావా అత్తయ్యా" అంటారు.

తాతమ్మ (మరిడమ్మ) : సంవత్సరీకాల కొస్తా. బారుకువుండి వొండిపెట్టలేను. (తాతగారి నుద్దేశించి), నీకు నిండా 40 సంవత్సరాలు లేవు. నీవు పెళ్లి చేసుకుంటే పిల్ల కాపరానికి వచ్చేదాకా వండిపెడతాను. చేసుకోకపోతే యిప్పుడెరాను. యేడేళ్లకు ముండమోసి యీ కాపురాలన్నిటికి యెందాక చేస్తాను నాయనా మూడు తరాలకు చేసా.

తాత : యేమైనా సరే నేను చేసుకోను.

అమ్మ : యేమైనా సరే, తాతమ్మ లేనిది నేను రాను.

చిదంబర్రావుగారు : పదవమ్మా ప్రస్తుతం పద అందరం వెళదాం. మన కళ్లయెదుట పుట్టి పెరిగిన దాని ఖర్మ కూడ మనమే చూడాలిసొచ్చె.

సీతాపతి తాతగారు : ఈ యేడూరు కాస్తా అయిపోతే, పిల్లల నిద్దరిని తెనాలి పంపేస్తా.

యింతలో అమ్మ మరిడమ్మగారి కంఠం కరుచుకొని, "నేను తెనాలి పోను".

మరిడమ్మగారు : యేంచేసేదమ్మా మన యిద్దరకు యెడబాసే రోజులొచ్చినాయి.

సీతాపతి తాతగారు : ముందు నేను, మా అక్కయ్య (బామ్మగారి అక్కగారు) వెళతాం. మీరంతా కలసి రెండు రోజులలో రండి అని వాద్దరు కలసి వెళ్లిపోతారు.

చిదంబర్రావు తాతగారు భోంచేసి కోర్టుకు వెళతారు. అమ్మ వంట యింట్లోకి వచ్చి "రాఘవమ్మ గారూ! కొంచెం అన్నం పెడతారూ?"

రాఘవమ్మ : ఆఁ పెడతా, ఆకులు తెచ్చుకో.

అమ్మ పోయి ఆకులు తెచ్చుకోగానే.

రాఘవమ్మగారు : నేను భోంచేస్తున్నా, అమ్మా ! నీవే పెట్టుకో అంటుంది.

అందరూ నిద్రలు పోతున్నారు. రాఘవమ్మగారు భోంచేస్తూ వున్నారు. మధ్యాహ్నము 12 గంటలవుతుంది. "అమ్మా నేను యిల్లు కడిగి వెళతాను. తలుపులు తీసి వదిలిపెట్టి వెళ్లబోకు" అంటుంది రాఘవమ్మగారు.

అమ్మ : ఆఁ అంటూ అన్నము తీసుకుని దొడ్లోకి పంది దగ్గరకు పరుగెత్తుతుంది.

పడుకున్న పంది అమ్మను చూచి (యెవరైనా యింటికి వస్తే ప్రేమగలవారు, ఆదరణగా పలకరించినట్లు) దగ్గరకు వస్తుంది పంది.

అమ్మ అన్నం పందికి పెట్టగానే, అన్నం తినకుండా అమ్మ నానుకొని పడుకుంటుంది. పిల్లలు వచ్చి తల్లిదగ్గర పాలు తాగుతూ వుంటాయి. అమ్మ పంది వెన్ను రాస్తూ అమ్మ అరిచేతిలో అన్నం పెట్టుకుని పందికి తినిపిస్తుంది. అది తిని నిద్రపోతుంది. 9 పిల్లల్లో 5 నిద్రపోతున్నై, 4 పాలు తాగుతున్నై. అమ్మ లేచి వెళ్లి చిన్న గ్లాసు తీసుకొనివచ్చి దాని పాలు పిండుతుంది. 4 పిల్లలు పాలు తాగుతుండగా, తక్కిన రొమ్ములకు పాలు చేపుకొని వుంటాయి. అమ్మ రెండు రొమ్ములు పాలు పిండితె గిద్దెడు వస్తాయి. అమ్మ పాలు తీయపోగా పంది కళ్లు తెరచి తీసుకోమన్నట్టు అమ్మవంక చూస్తుంది. వెంటనే రొమ్ముల్లోకి పాలువచ్చి పైకి ఒక్కొక్క చుక్క కనపడుతూ వుంటాయి. అమ్మ గ్లాసు బెట్టి చెయ్యి తగలగానే గ్లాసు నిండుతుంది. అమ్మ గ్లాసు తీసినా పాలు యింకా వున్నట్లే వుంటుంది. అమ్మ నోరుపట్టి యీ రొమ్మున ఒక గుటక, ఆ రొమ్మున ఒక గుటక వేస్తుంది. పాలుతాగి పాలు తీసుకుని నిప్పు రాజేసి పాలు పొయ్యి మీద పెట్టగానే పచ్చగా కొద్ది వాసనతో పచ్చ గన్నేరు కాడలో వున్న వాసనతో పాలు కాగును. అన్ని పాలకు మల్లేనే మీగడ కట్టును. చల్లార్చిన తరువాత తోడు వేయగా రెండవరోజు వుదయానికి పెరుగై వుండును. పెరుగును చిన్న కవ్వముతో మేడమీద పెట్టుకుని చిలుకుతుంది. పాలు కాచేటప్పుడు పొంగుతయ్యేమోనని 4 బొగ్గులు తక్కువ వేస్తే కాగలేదు. యెక్కువ వేస్తే పొంగిపోయినాయి. సమంగా వేయటం ఆ సమయానికి తోచలేదు. గరిట తీసుకుని పాలు కాగేటప్పుడు మీగడ అందులోనె కలిపి వేస్తుంది. మీగడ పైకి కనపడకుండా పోయింది కాని పాలల్లోనుంచి తొలగలేదు. మీగడే నెయ్యి కాధారమనుకొని మీగడ లేకుండా చేస్తే నెయ్యి రాదేమో చూద్దాము అని కలిపినా, మీగడ కంటికి కనపడలేదే కాని పాలల్లో కలిసే వున్నది కనపడక పోవటం చేత నెయ్యి రాదుకదా అని అమ్మకవ్వం తీసుకుని

చిలుకగా, పాలల్లో లిప్తమై వున్న మీగడ వెన్నగా మారింది. వెన్నలో లిప్తమై వున్న నెయ్యి యెందుకు కాదో చూద్దాం. ఒక రూపంలో నుంచి మరొక రూపం రావటానికి అగ్ని తత్వం కలిస్తేనేగా? కవ్వం యిన్ని రూపాలు తీసుకొని వచ్చినప్పుడు నెయ్యిని మాత్రము యెందుకు తేలేదు. అని అయిదు గంటలసేపు తరచగా చల్లలో నుంచే నెయ్యి అయినది. అగ్నితత్వము వొరిపిడి వల్ల బయట పడుతుంది. తత్వం లేక కాదు అన్ని తత్వములు అన్నింట్లో యిమిడే వున్నాయి. ఒక ప్రకోపము వల్ల మరొక ప్రకోపము బయట పడుతుంది. యీరోజు పాలు కాచి తీసాను. రేపు పచ్చి పాలల్లో నుంచి తీద్దాం. పచ్చిపాలు తోడుకోవా? అని మరునాడు మళ్లీ పందిపాలు తీసి పచ్చివి తోడు వేయగా తోడుకొనును. అందులో నుంచి నెయ్యి వస్తుంది.

మూడోరోజు పంది పాలే తీసి సన్నని శగ పెట్టి సాయంకాలం దాకా కాయగా పాలు యిగిరిపోయి మీగడ మాత్రము మిగులును. (పాల భాగము పాలదే, మీగడ భాగము మీగడదే, పాలు మీగడ కాదు, పాలు మీగడయితే, మీగడపైకి తేలవలసిన అవసరము లేదు). ఆ మీగడను తీసి చల్లారబెట్టి పిండగా మీగడ పిప్పి పిప్పై నెయ్యి బయటపడుతుంది. యిదే పంచామృత తత్వం.

ఒక అమృతములో నుంచి పంచబడ్డవి గనుకనే పంచామృతాలు. 1. పాలు, 2. మీగడ, 3. పెరుగు, 4. వెన్న, 5. నెయ్యి. యివే పంచామృతాలు.

ఒక పాలైనను పంచామృతములుగా వుపయోగించ వచ్చును. ఈ మూడు రోజులు యీ పరిశోధనతో గడచిపోయినవి.

4వ రోజు వుదయం నిద్రలేచి వాకిట్లోకి రాగా ఆంధ్రపత్రిక వాకిట్లో పడవేసి వుంటుంది. ఆ పత్రిక పుచ్చుకొని "తాతగారూ పత్రిక వచ్చింది. వాకిట్లో వేసి వుంది" అని తెచ్చి యివ్వగా, కాశీనాధుని నాగేశ్వరరావుగారు వ్రాసిన సంపాదకీయం చదువుతూ వుంటారు.

అమ్మ : తాతగారూ అది యెవరు వ్రాసారు. తాత పలకరు. తాతయ్యా దాని పేరేమిటి?

తాత : ఆంధ్రపత్రిక.

అమ్మ : అంటే ?

తాత : ఆంధ్ర అంటే దేశం.

అమ్మ : అంటే దేశ పత్రికా, పత్రికంటే చెప్పు.

తాత : పత్రం అమ్మా.

అమ్మ : అంటే పచ్చడి నూరుకొనేదా ?

తాత : ఊఁ

అమ్మ : అది అక్కడే ఉన్నదిగా, చిన్నగా అది అక్కడే వున్నది. నీవిక్కడే వున్నావు.

తాతగారు యీమాట వినిపించుకోకుండా చదువుకుంటేనే వుంటారు.

అమ్మ : ఒక పావుగంట వూరుకుని, ఆ పెద్ద పెద్ద అక్షరాలు యేమిటి తాతగారూ.

తాత : అదే ఆంధ్రపత్రిక.

అమ్మ : ఆ అక్షరాలేనా ఆంధ్రపత్రిక అంటే?

తాత : నీకూ మీ తాత వెంకయ్యగారిలా వేపకాయంత వెర్రి వున్నది.

అమ్మ : మీరు కొలిచారా? అని దొడ్లోకి పరిగెత్తి వేపకాయ తెచ్చి యిట్లాగే వుంటుందా. యింత వున్నదా. వెర్రి అంటే యిదేనా?

తాతగారు : వెర్రి అంటే నీ మాటలల్లె వుంటుంది. యెంత అంటే వేపకాయంత.

అమ్మ : వెర్రిని గుర్తు పట్టాలంటే మన దగ్గర యేముండాలి ?

తాతయ్య : తెలివుండాలి.

అమ్మ : యేది తెలుసుకోవలెననుకున్నా తెలివేగా. తెలివితో తెలిసికొండేది తెలివి. వెర్రితో - అని అమ్మ మెట్లు దిగిపోయి బాదం చెట్టుకింద కూర్చుంటుంది

తాతగారు పేపరు ముడుచుకుని ముసిముసి నవ్వులు నవ్వుకుంటూ వెళ్లిపోతారు. పావుగంటలో వచ్చి తాతగారు అమ్మ నుద్దేశించి "ఏం అమ్మా మొఖము కడుక్కో యేడు గంటలయిపోయింది".

యింతలో తాతమ్మ (మరిడమ్మ) గారు వచ్చి "అమ్మాయి. తలనొప్పి వచ్చింది, కొంచెం అమృతాంజనం భోషాణం మీద వున్నది తెచ్చి పెట్టమ్మా" అంటుంది.

తాతమ్మగారు అంటూ వుండగానే దొడ్లో నైట్ క్వీన్ చెట్టు క్రింద పెద్ద త్రాచు వచ్చి ఆడుతూ వుంటుంది. అమ్మ అక్కడే నిలుచుని వుంటుంది. చెట్లకు నీళ్లుపోసే నారాయణ పామును కొట్టవస్తాడు. అమ్మ యేమీ మాట్లాడకుండా తాతమ్మ చెప్పినట్లుగా అమృతాంజనం తీసుకురావటానికి పోతుంది. నారాయణ చిదంబర్రావు గారిని పెద్దగా కేకవేసి కర్ర తీసుకుని పరుగెత్తుతాడు. తాతగారు వచ్చి కొట్టమని సలహా యిస్తారు. పాము కనపడకుండా పోతుంది.

యెవరో నాగేంద్రుడు, మామూలు పాము కాదని తాతమ్మతో చెపుతారు.

అమ్మ అమృతాంజనం డబ్బాచేత బట్టుకొని కొంచెం తీసుకొని యెట్లా వుంటుందోనని కణతలకు రాసుకోగా మంటలెత్తి కళ్లవెంట నీరు కారుతుంది. అదే సమయంలో రాఘవరావు (మామయ్య) నాన్నగారు (నాగేశ్వర్రావుగారు) వస్తారు.

అమ్మ కళ్ల మంటలతో తాతగారి దగ్గరకు వెళ్లి యీ మందు యెవరు చేసారు? యెందుకు?

తాతయ్య : తలనొప్పి తగ్గిస్తుందమ్మా.

అమ్మ : కళ్లు మంటలు పుడితేగాని తలనొప్పి తగ్గదా? ఒకటి తగ్గాలంటే మరొకటి బాధ రావలెనా? చేసిందెవరు?

తాతయ్య : నాగేశ్వర్రావు.

అమ్మ : అమృతాంజనం తెచ్చి తాతమ్మకిస్తూ, తాతమ్మా! యిందాక వొచ్చిన పాము పేరేమిటి అన్నావు ?

తాతమ్మ : నేను కాదమ్మా మీ తాతయ్య అన్నారు నాగేంద్రుడని. అని తాతమ్మ నాన్నగారిని "నాగేంద్రా" అని పిలుస్తుంది.

అమ్మ : (తనలో తాను) అంతా నాగేంద్రమయం. నిద్రలేస్తూనే బావ (నాన్నగారు) ఆంధ్రపత్రిక, నాగేంద్రుడు, అమృతాంజనం, బావ (బావ అంటే నాన్నగారు) నాలుగు దిక్కులా నాగేంద్రమయం. నాకు దిక్కు.

అర్ధం, ప్రాణం :

అమ్మ బొగ్గుతో ముఖము కడుక్కుని యివాళ మన్నవ ప్రయాణ మెుస్తుందేమోనని లోపలకు రాగానే మన్నవ నుంచి నల్ల ఖాసీం సాహెబ్ అనేవాడు

వచ్చివుంటాడు. అమ్మను చూడగానే అమాంతం యెత్తుకుని 'మన వూరు రావామ్మా? నీకోసం గొల్లనాగమ్మ యేడుస్తున్నది. వూరు చిన్నపోయింది. నాలుగు బజార్లకు యిల్లు మధ్య కావటంతో యిల్లు తాళం పెట్టి దీపం పెట్టక పోవటం చేత వూరు పాడుపెట్టినట్లు వుంది. మీ నాన్నగారు రేపు ఉదయం తీసుకురమ్మన్నారు'

.

సరేనని అమ్మ చంకదిగి దొడ్లో అరిటాకు కోసుకుని పందికి అన్నం తీసుకుని పోగా యింతలో పాకీమనిషి పక్కసందు తలుపు తీసి దొడ్లోకి ప్రవేశిస్తుంది.

వంటమనిషి రాఘవమ్మగారు చూచి పాకీ మనిషి నుద్దేశించి "అక్కడ గుడ్డలు ఆరవేసి వున్నాయి. అవి విప్పిందాక దొడ్లోకి రామాకమని చెప్పండి". అది విని పాకీ మనిషి వెనక్కు తగ్గుతుంది.

అమ్మ : గుడ్డలకు పాకీ వచ్చే మార్గానికి చాలా దూరం వున్నదని మనస్సులో అనుకొని చూస్తూ వుంటుంది. (యేమి జరుగునోయని)

గుడ్డలు విప్పగానే యికను రమ్మనండి. అని అనగానే పాకీది లోపలికి ఒక రెక్క నెట్టుకుని రాగా తట్టలో వున్న చీపురు తలుపుకు తగులుతుంది.

రాఘవమ్మగారు ఆ చప్పుడు విని, "యేమిటి ఆ శబ్దం, పాకీది లోపలకు వచ్చిందా? వచ్చింది యెందుకు అంత శబ్దమయింది" అని బయటకు వచ్చి ఒక రెక్క తీయుట చూచి 'తట్ట తగల్లా తలుపుకి' అని అనుకొని మడి ధోవతి వదలి యింకొక చీర కట్టుకొని వచ్చి "నీకోసం మైలపడి వచ్చానే పాకీ! యెక్కడ నువ్వు?"

అమ్మ : పాకీదెందుకొచ్చిందో ఆపనే చేస్తున్నది.

వంటమనిషి : అంటే?

అమ్మ : వచ్చిన పని చేస్తున్నది.

వంటమనిషి : అంతేకదా, పాకీదొచ్చిన పని అది చేస్తున్నది, నీవొచ్చిన పని నీవు చేసుకోమన్నావేమొనని అనుకొన్నాను. అయినా చిన్నపిల్లవు నీకేమి తెలుసు?

అమ్మ : మీరన్నవి అన్నీ నిజమే.

వంటమనిషి : అన్నీ నిజమంటే ?

అమ్మ : చిన్నపిల్ల అన్నది నిజమే. వచ్చిన పని చేసుకోవాలన్నది నిజమే.

కోపంగా నుంచుంటుంది రాఘవమ్మగారు. యింతలో దొడ్డి చిమ్మి పాకీ మనిషి బైటకు వస్తుంది.

రాఘవమ్మగారు (వంట మనిషి) : నీకు కళ్లు పోయినయ్యా పాకీ. కనపట్టల్లా అన్నిచోట్ల చిమ్మవచ్చిన చీపురు తలుపుకేసి కొట్టావా? ఇంకా యేవేవో చాలా తిడుతుంది.

అమ్మ : యిక్కడ చిమ్మినదైతే తగిలినా ఫరవాలేదా?

రాఘవమ్మగారుః తెలియని దానివి తెలియనట్టుండమ్మాయి.

అమ్మ : తెలియనట్లే వుందిగా.

రాఘవమ్మగారు : యెవరికి?

అమ్మ : తెలియందానికి తెలియకపోవటమే వృత్తి. తెలుసుకుండే దానికి ప్రతీదీ తెలుసుకోవటమే.

పాకీది : (యదా గుండె పడి నుంచుని). నేనేమీ చేయలేదు దొరసాని. ఒక అరగంట నుంచుని యిద్దరూ తరుజుమా చేసుకుంటారు. పాకీది వెళ్లిపోతుంది. రాఘవమ్మగారు వచ్చి అది నడచినంత లెక్క పసుపు నీళ్లు చల్లి తలుపులు కడుగుతుంది.

పాకీది మరునాడు, మూడవరోజు మధ్యాహ్నము వరకు రాదు. యిల్లంతా పాకీదాన్ని గురించి ఆందోళన, ఆదుర్దా బయలు దేరుతుంది. పాకీది పనికిమాలిన దయినా, దాన్ని గురించి ఆందోళన మాత్రం మహా పవిత్రంగా వుందని అమ్మ అనుకుంటుంది.

తాతగారు వచ్చి పాకీదానికి నలుగురు మనుషులను కబురు పంపి యిప్పుడు యింతకంటె అవుసరము మరొకటి కనపడనట్లు తాతగారు, రాఘవమ్మగారు తదితరులు ఆలోచిస్తుంటారు. అమ్మ ఒక చీపురు తీసుకుని దొడ్డి చిమ్మి, ఒక సీనారేకు డబ్బాలోకి యెత్తి వస్తుంది, యింతలో,

ఆ రాఘవమ్మగారికి దొడ్లోకి వెళ్లవలసిన అవుసరం కలుగుతుంది. దొడ్లోకి పోక తప్పదు. మామూలుగా బాగుచేస్తున్నా పోవటానికి అసహ్యించుకునే వ్యక్తి. మూడు పూటల నుంచి బాగుచేయని దొడ్లోకి వెళ్లవలసిన అవుసరం కలుగుతుంది. దొడ్లోకి వెళ్లి ఆశ్చర్యంతో "బాబుగారు పాకీది వచ్చి చిమ్మిందండీ, మనం చూడలేదు".

తాతగారు : ఓహో అట్లాగా, రాలేను జ్వరం వచ్చిందని కబురు పంపింది. యెప్పుడు వచ్చి చిమ్మింది. యెవరు వచ్చారు.

రాఘవమ్మగారు : యేమొ యెవరు చిమ్మారో, శుభ్రంగా వుంది. పాకీది చిమ్మినదానికంటె బాగా వుంది.

అమ్మ "అంటే పాకీది కాదనా ? చిమ్మేది పాకీదేగా?" తాతగారు నుంచుని వుంటే, "తాతగారూ! చిమ్మేది పాకా, పాకీది చిమ్ముతుందా?" అసలు పాకీ అంటే యేమిటి?

తాతగారు : చిమ్మేదే పాకీ అమ్మా. యానాదివాళ్లు, వృత్తివల్లనే ఆపేరు వచ్చింది.

అమ్మ : మరి రాఘవమ్మగారు యెందుకు అట్లా అంటుంది? పాకీది చిమ్మిన దానికంటే అని?

తాతగారు : పెద్దదికాదు, యేదో తెలియక అట్లా అంటుందిలె.

అమ్మ : పెద్దవాళ్లు మాట్లాడినప్పుడు పెద్దవాళ్లు అంటారు. చిన్నవాళ్లు మాట్లాడినప్పుడు చిన్నపిల్లంటారు. మరి తెలిసేది యెప్పుడు? తెలిసేది యెవరికి, యెవరు చిన్న, యెవరు పెద్ద?

తాతగారు: నేను పెద్ద, నీవు చిన్న అంటారు తాతగారు.

అమ్మ : మరి తెలిపేది యెవరికి?

తాతగారు: వున్నారు కొంతమంది తెలిసినవాళ్లు, మధ్యరకం.

అమ్మ : నాకంటె చిన్న, నీకంటె పెద్ద వుండొచ్చుగా.

తాతగారు : వుండొచ్చు!

అమ్మ : అప్పుడు మనమేమవుతాము?

తాతగారు : ఊఁ

అమ్మ : మధ్యరకమా?

తాతగారు : అంతే! అంతే!

అమ్మ : మరి మనకు తెలుసుగా, మరి యెందుకు అట్లా చెబుతారు. ప్రతి మనిషికి తనకంటె పెద్ద తనకంటె చిన్న యెప్పుడూ వుంటారుగా.

యిన్ని మాట్లాడుతున్నా, చిమ్మింది యెవరా అని ఆలోచిస్తూనే వుంటారు తాతగారు.

ఆలోచిస్తున్న తాతగారిని చూచి అమ్మ : భగవంతుడు యెట్లా వుంటాడండి?

తాతగారు : చూస్తేగా తెలిసేది. నేను చూడలా.

అమ్మ : చూస్తే తెలియదేమొ. తెలిసుంటే తెలుస్తాడు. వాడన్నీ తేలుస్తాడా?

తాతయ్య : నీముఖం.

అమ్మ : అంటే, భగవంతుడంటేనా?

తాతయ్య : ఊఁ అంటారు.

అమ్మ : యెందుకు మీరు ఊఁ అన్నారు వొప్పుకున్నారా, నేనేనా.

తాతయ్య : ఊఁ

అమ్మ : మరియెందుకు మీరు రోజూ గుళ్ళోకి పోతారు?

తాతయ్య : అక్కడ కూడా నిన్నే చూద్దామని.

అమ్మ : అప్పుడు గుళ్లోవాణ్ణి యిక్కడే చూడొచ్చుగా.

తాతయ్య : (పకపకా నవ్వి) మన్నవ వారి తెలివి అంతా నీకే వొచ్చిందమ్మా.

అమ్మ : యిప్పుడు మన్నవ వారికెవరికి తెలివి లేకుండా పోయిందా?

తాతయ్య : మరి వాళ్లకు తెలివేముంది?

అమ్మ : తెలివంటే ?

తాతయ్య : తెలివంటే పైన చెపుతావా (అని యెత్తుకుని మేడమీదకు తీసుకొని వెళతారు)

అమ్మ : యేం తాతగారు చెప్పరు తెలివంటే యేమిటో?

తాతగారు : (విసుగుతో) తెలివంటే నువ్వే (అమ్మను వొళ్లో పెట్టుకుని ఆ పాకీదొడ్డి యెవరు చిమ్మారని ఆలోచిస్తూ ఆలోచిస్తూ పైకి అప్రయత్నంగా) యెవరు చిమ్మారు అంటారు.

అమ్మ : (అది విని) యెవరు చిమ్మితే యేం, చిమ్మేది పాకీ అన్నారుగా.

తాతయ్య : అవునమ్మా, యెవరయినది తేలొద్దూ, డబ్బు లివ్వొద్దూ మనం.

అమ్మ : అంటే, మనమంటే, నేను కుడాయిస్తానా?

తాతయ్య : లేదమ్మా నేనెయిస్తా.

అమ్మ : చిమ్మిన మనిషొచ్చి యెవరు చిమ్మారని అడిగితే నేనె అంటే ఆలోచించకుండా యిస్తారా?

తాతయ్య : ఆఁ

అమ్మ : నేనె, చిమ్మినది!

తాతగారుః నమ్మక 'ఆ' అన్నందుకు ఒక రూపయివ్వబోతారు.

అమ్మ : నమ్మి యిస్తున్నారా, ఆమాట అన్నాను కదా అని యిస్తున్నారా?

తాతగారు : నమ్మలేదమ్మా.

అమ్మ : నేను నమ్మలేని అమ్మనా? (అని పెద్దగా అని) అమ్మలేని అమ్మనా, (అని మెల్లగా అనును).

మెల్లగా అన్నమాట కూడ తాతగారు విని, అమ్మను దగ్గరకు లాగుకొని, గుండెలకు హత్తుకొని, పందిరి మంచము మీదకు యెత్తుకొని వెళ్లి పొట్టమీద పడుకొనబెట్టుకుంటారు. అట్లా ఒక పావుగంట పడుకో బెట్టుకొని, కళ్లవెంట నీళ్లు బెట్టి, అమ్మను క్రిందకు దించి రెండు రూపాయలు తీసి చేతిలో పెట్టబోతారు.

అమ్మ : నాకొద్దుకాని, పాకీది ఆ ఒకపూట చిమ్మితే యెంత యిస్తారు?

తాతయ్య : అది నెల లెక్కమ్మా.

అమ్మ : నెలలో పూటను విడదీయండి.

తాతయ్య : (విసుగుపుట్టి) అర్ధనా అంటారు.

అమ్మ : యిదేనా మొన్న లక్ష్మణాచార్యులుగారు వచ్చినప్పుడు మాట్లాడుతూ, అర్థం ప్రాణం అంటున్నారు యీ అర్ధమేనా?

తాతయ్య : అబ్బా! నీకెక్కడ దొరుకుతయ్యమ్మా యీ పదాలు. 'ఆ' యిదే అంటారు.

అమ్మ : ప్రాణమంటే కూడా యిదేనా?

తాతయ్య : 'అ' యిదే.

అమ్మ : మొన్న అమ్మ చచ్చిపోయినప్పుడు ప్రాణం పోయిందంటిరే, యిదే పోయిందా?

తాల్బయ్య : కాదమ్మా! ప్రాణమంటే యెంతతీపో డబ్బు అంటే అంతే. అదే దాని అర్థం.

అమ్మ : అంటే ప్రాణమున్నంతవరకు డబ్బు అవుసరమనేమొ.

తాత : యిది యింకా బాగుంది (తనలో తను సాత్విక స్వభావము అని అనుకుంటారు)

అమ్మ : నీ భావమా ? (మనస్సులో వున్నది గుర్తించి)

తాతయ్య : కాదమ్మా.

అమ్మ : మొన్న "స్వా" అంటే తనే, నేనే, నని భారతి పిన్నికి పాఠం చెప్పటంలా, స్వభావమంటే మీ భావం, "సాత్వికం వున్నదని గుర్తించింది మీ భావం, అదే సాత్విక స్వభావం".

తాతయ్య : మా అమ్మ వ్యాసుడంటి దవుతుందా? అనుకుంటారు (మంచము మీద నుంచి దిగి) కోర్టు వేళయిందమ్మా, రేపు మధ్యాహ్నము వూరు (మన్నవ) కెళ్లొద్దూ? అన్నీ నాలుగు రోజులు దాకా వాయిదాలు వేయించి వస్తాను, ఆడుకో.

నల్ల ఖాసిం సాహెబ్ వచ్చి "యీపూటె తీసుకు రమ్మన్నారండి" అని అంటాడు (అతను వచ్చిన మూడవపూట)

5. ఆపద్బాంధవి

మధ్యాహ్నము 12 గంటలకు.

యింట్లో వారందరు ప్రయాణమై స్టేషనుకు వెళతారు. దారిలో ఒకరు తిని పారవేసిన విస్తళ్లను వెతుకుతూ కనిపిస్తారు. యిద్దరు అమ్మను చూచి, అమ్మాయి నీకు ఎక్కడయినా తినిపారవేసిన యిస్తరి తటస్థపడ్డదా?

అమ్మ : మా దొడ్లో పాకీదొడ్డికి పక్కగా కసువు పోగుమీద పడవేసి వున్నాయి.

మనిషి : నువ్వు వచ్చి చూపిస్తావా?

అమ్మ : నేను వూరుకెళుతున్నాను, మా వాళ్లు నాకంటె ముందు నడిచి పోతున్నారు. ఆలస్యమైతే రైలు పోతుంది. అవకాశముంటె మళ్లీ వచ్చి యిస్తాను. యిచ్చేది ఏముంది చూపిస్తాను. ఈ (ఆస్పత్రి వద్ద గేటు ముందర సంభాషణ) వాకిలి ముందర నుంచోండి. వాళ్లు తిని పారవేసేవేళ అయింది. దొరికితె దొరక వచ్చు అంటూ వుండగానే యింట్లో నుండి యిస్తరి బైటకు వేస్తారు. వాళ్లు చాలా ఆదుర్దాగా దానికొరకు పరుగెత్తుతారు.

అమ్మ : (వారి దగ్గరకు వెళ్లి) అసలు విస్తరి యెందుకు, పనికి రాదని పారవేసినది గదా? మీ రేపనికి వాడతారు.

వాళ్లు : మా పిల్లలు బ్రతక్కపోతే పుల్లాకులో పార్లిస్తే బతుకుతారంటేను దీనికోసము వెతుకుతున్నాము.

అమ్మ : మీరు అన్నాలు తినరా? మీది పనికిరాదా? "అసలు పుల్లాకు అంటే అప్పుడు తిని పారేసింది కాదు. పులిసిపోయిన ఆకు. పులసిరి వాసన వచ్చేది".

వాళ్లు : ఓహో అదా! చిన్నపిల్లవయినా నీవే నయం అంటూ వాళ్ల దారిన వాళ్లు ఆకు పట్టుకెళ్లకుండా వెళ్లిపోతారు.

అమ్మ : మీయిల్లు యెక్కడ?

వాళ్లు : యిక్కడెక్కడమ్మా ఆంజనేయులు వారి గుడిదగ్గర రామాయణం వారి యిల్లు అంటే చెపుతారు.

అమ్మ తొందరగా స్టేషను పరుగెత్తి అడుగగా యింకా గంట ఆలస్యముందని తాతగారు చెప్తారు. త్వరగా పరుగెత్తుకొచ్చి దొడ్డి తలుపు తీసి దొడ్లో చీకిపోయిన యిస్తరి తీసుకొచ్చి బజారులో వెతుకుతూన్న పాతూరు శివరామయ్యగారి యింటి వద్ద దొరుకుతారు.

అమ్మ వారి దగ్గరకు పరుగెత్తి వారి చేతిలో పెట్టి, "ఈ ఇస్తరి మా యింటికి కుష్టురోగివాడు వస్తే వాడికి అన్నము పెట్టితే గుర్తుగా పడవేసాడు. యిది పనికి వస్తుందా?"

వాళ్లు : యేదయితే యేం. అయినా నీకు గుర్తు వున్నదా అది యెటు కొట్టుకుపోయిందో.

అమ్మ : అయినా అది నిజమేననుకోండి. యిదేనని నాగుర్తు.

వాళ్లు : యేదో ఒకటిలే అమ్మా అయితే మాల్లే బిడ్డ బ్రతికితె చాలు ఇస్తరి తీసుకొని వాళ్లు వెళ్లిపోతారు. అమ్మ స్టేషనుకు వస్తారు.

అమ్మ మనస్సులో నిన్నటి పాకీ మనిషి విషయం, ఈ పుల్లాకు విషయం తర్జుమా చేసుకుంటూ స్టేషనులో అటూ యిటూ తిరుగుతూ వుండగా చేపలు ఎగుమతి కోసం స్టేషనులో పడవేసి వుంటాయి. చేపలు అనే కేకగాని, వాటి వాసనగాని, సహించలేని తాతమ్మగారు (మరిడమ్మ) తాతగారు (చిదంబర్రావు) వాటికి దగ్గరలోనే కూర్చుంటారు. అది చూచి

అమ్మ: తాతగారూ ఒకప్పుడు అసహ్యించుకొన్నది మరొకప్పుడు యేమవుతుందది?

తాతగారు : యెప్పుడూ అసహ్యమే. అవసరాన్ని బట్టి.

అమ్మ : అవసరమంటె యెటువంటిది?

తాతగారుః ముఖ్యమయింది.

అమ్మ : ముఖ్యమంటే, తను అనుకున్నదా? జరిగినదా?

తాతగారు : తప్పనిసరి అయినది.

అమ్మ : అది నాకు చాలటం లేదు. యెందుకంటే మీరు నాకు జ్వరం వచ్చినప్పుడు వాయిదాకు ఒంగోలు వెళ్లవలసి వచ్చినప్పుడు డాక్టరు ముఖ్యంగా యీపూట యింజక్షను ఇవ్వాలి అన్నాడు. అప్పుడు మీరు తప్పనిసరిగా ఒంగోలు పోవలసి వచ్చెను. యేది ముఖ్యం? యేది తప్పనిసరి? ముఖ్యానికి, తప్పనిసరికి తేడా వున్నదిగా, ముఖ్యం నా యింజక్షను అయింది. తప్పనిసరి ఒంగోలు అయింది. కనుక ముఖ్యం అంటే తప్పనిసరి కాదు. ఆ అర్థం చాలదు. అవసరమంటే ముఖ్యమయిన అర్థం కూడా చాలదు.

తాత : పోనీయేది చాలుతుందో నీవు చెప్పు.

అమ్మ : నాకు తోచింది కాని యిప్పుడు చెప్పను. తెలియ వలసింది చాలా వున్నది నాకు.

తాత : పోనీ యిప్పుడు తోచినంతవరకు చెప్పు.

అమ్మ : నాకసలలా పనికిరాదు. పూర్తిగా తేల్చుకుని తరవాత.

యింతలో బండి వస్తుంది గం. 1.30లు. గంట కొడ్తారు.

అమ్మ : తాతగారూ చెక్క వంగింది. అది యెంతవంచినా అరగంటకు కాని రైలు రాదు. అదీ ఒకడు నడిపితేనె వస్తుందనుకోండి. వాడు మాత్రం అనుకున్నట్లు నడపగలడూ !

తాతగారు : పకపకా నవ్వి, నీకెవరు చెప్పారు నడపలేడని.

అమ్మ : "ప్రతి పనిలోనూ తెలుస్తూనే వున్నది అనుకున్నది జరుగదని".

తాతగారు : మరియేమి జరుగుతుందంటావు.

అమ్మ : "తనకున్నదే జరిగేది".

తాతగారు : అమ్మను దగ్గరకు తీసుకుని, నేననుకున్న మాట ఖాయం చేస్తావా అమ్మా (వ్యాసుడు అంతటి దానవు అవుతావు అని).

జీడిపప్పు అమ్మి, కేక వేసుకుంటూ అమ్మ ముందుకు వస్తుంది.

తాతగారు : ఏం అమ్మా నీకు తినాలనిపిస్తున్నదా?

అమ్మ : తినాలని అనిపించదు. తినవలసి వస్తే వద్దనిపించదు.

తాతగారు : ధ్వనిలోనె తేడా వుంది. శబ్దమంజరివా?

యింతలో రైలు కూత వస్తుంది హడావుడిగా. "ఒక గిద్దెడు పప్పు యివ్వు అమ్మీ" అంటూ, జేబులోనుంచి అణా తీసి, కానీ యివ్వు అమ్మా అంటారు.

అమ్మ : ఒక కానీ జీడిపప్పు మాకిచ్చి, ఒక కానీ జీడిపప్పు నువ్వు ఉంచుకో. అమ్మా! కానీ పప్పు నీకు కొనిపెట్టాననుకో!

తాతగారు : ఆ అమ్మాయికి యెందుకు అన్ని పప్పులుంటే.

అమ్మ : ఆ అమ్మాయి అమ్ముకోటానికి గాని తినటానికి గాదుగా. అమ్మేవాళ్లు అసలు తినలేరు.

రైలు ఫ్లాటుఫారం మీదకు వచ్చి ఆగుతుంది. (అరగంటకు) గబగబా అందరూ రైలు యెక్కుతారు. అమ్మ పెట్టె వాకిట్లో నుంచి లోపలకు పోదు. తాతగారు చూచి అమ్మ ముందుకు పడతావమ్మా.

అమ్మ : చాలా మంది అట్లా నుంచుంటారుగా పడటం లేదుగా?

తాతగారు : అన్నీ పిచ్చి ప్రశ్నలు వేయక లోపలికిరా.

అమ్మ : పిచ్చి ప్రశ్నలు వేయక లోపలికిరా (అంటూ లోపలికి వెళుతుంది) అప్పికట్ల స్టేషను దాటగానే నిడుబ్రోలుకు ముందుగా ఒక ముసలి తాత, మనుమడు బండిలో అమ్మ కెదురుగా కూర్చుని వుంటారు. పిల్లవాడు పక్కచెట్లు చూస్తూ తలకాయి కిటికీలో పెట్టి, అదుగో తాతా! అని చెయ్యిబైటికి చాచి ముఖము లోపలికి తిప్పి అదుగో తాతా! అని తాతకు చెపుతూ అమ్మవంక చూస్తాడు. ఆ సమయంలో పైన చెక్క చేతిమీద పడుతుంది. 'అమ్మా!' అని కేకవేసి ప్రాణం విడుస్తాడు.

ఆ పెట్టెలో వున్నవారంతా చెక్క పైకి తీసి ఆ రెక్కను తీసి యీరెక్కను ఇవతలకు తీస్తారు. 'చేతికి దెబ్బకూడా తగలలేదు. ప్రాణము పోవలసిన దెబ్బకాదు. తలమీద పడి బ్రతికినవారు కూడా వున్నారు' అంటూ ఆదుర్దాగా రైలు ఆపిదించుదామా' అంటారు.

పిల్లవాడి తాత : యెందుకు నాయనా! దగ్గర కొచ్చాముగా స్టేషనులోనె దించండి.

అమ్మ : మీది యేవూరు తాతా?

పిల్లవాడి తాత : మాది యెక్కడో దక్షిణాదమ్మా. యేదో అడుక్కొని పిల్లవాడిని పెంచుతున్నాను. తల్లిలేదు. కూతురు బిడ్డ, నాకు భార్య లేదు అని యేడుస్తూ చెపుతాడు.

పక్కను యెవరో వుండి 'నీబాధ తీర్చిపోయినాడులే నాయనా'.

అమ్మ : యిప్పుడు యిది బాధకాదా? బాధను తీర్చటానికి బాధ అవసరమయినదా? దెబ్బ పడ్డప్పుడు పిల్లవాడి బాధ, తరువాత తాతబాధ, యీ బాధల్లో యేబాధ యెక్కువ? అన్ని బాధలు ఒకటేనా? ఆ స్థితిని చూడలేక జనం బాధపడుతూనే వున్నారు. బాధలో పిల్లవాడి కోసం తాత బాధ, పిల్లవాడిని తాతను చూచి జనం బాధ, యీ స్థితిని చూచినా బాధకలగటం లేదు నాకు! అసలు బాధ అంటే యేమిటి తాతగారు (అని చిదంబర్రావుగారి నుద్దేశించి అడుగుతుంది అమ్మ).

తాతగారు : యిందాకటి నుంచి కనపడేదంతా బాధేగా.

అమ్మ : యెవరికి బాధ?

తాతగారు : అదే, ఆ పిల్లవాడికి, ఆ తాతకు.

అమ్మ : మీరందరు కూడా బాధపడ్డారుగా.

తాతగారు : అంత బాధపడలేదుగా అమ్మా !

అమ్మ : నేను వాకిట్లో నుంచున్నప్పుడు మీరు పడిన బాధ, ఆ అబ్బాయికి దెబ్బ తగిలినప్పుడు మీరు పడలేదుగా? అయినా వాకిట్లో వుంటే పడతానని భయపడ్డారు. లోపలవున్నా తప్పలేదుగా.

తాతగారు : నిజమేనమ్మా. అట్లా అని మనసు వూరుకోదు.

అమ్మ : వూరుకోక పోవటమే దాని (మనసు) గుణమా?

తాతగారు : అవును అంతే!

నిడుబ్రోలు రాగానే అందరూ దిగుతారు. పెట్టెలో వున్న వారందరూ దిగుతారు, ఎవరి దారి వారిది. ఆ తాతకెవ్వరూ ఏమీ సహాయపడరు.

తాతగారితో (చిదంబర్రావుగారితో) అది చూచి

అమ్మ : తాతగారూ ! ఆ పిల్లవాడిని మనం పారేయించుదామా?

తాతగారు : మనకెందుకమ్మా? మనకు ప్రొద్దుగూకుతున్నది మనం వెళదాం.

అమ్మ : మన యిద్దరి మనసు ఒకటి కాలేదుగా? నాకు వుందామనిపిస్తున్నది. మీకు వెళదామనిపిస్తున్నది. యిద్దరి మనసూ ఒకటయితే మిమ్ములను నేను పారేద్దామా అని అడుగవలసిన అవుసరము లేదు. నాకు తోచగానే మీకూ తోచేది. మరి మనస్సందరిది ఒకటేనంటారుగా?

తాతగారు మరిడమ్మగారి నుద్దేశించి : అట్టె యీ మరిడమ్మగారి పెంపకం వల్ల ఆ సంభాషణె అతికిపోయింది.

మరిడమ్మగారు : నేను చెప్పనురా నాయనా; నేను మాట్లాడేటప్పుడు యెప్పుడైనా దగ్గర కూర్చుంటుంది. ఎప్పుడూ ఎక్కడో ఆడుకొంటూనే వుంటుంది.

తాతగారు : (విసుగుతో) బయలుదేరండమ్మా. ప్రొద్దుగూకు తున్నది. రైలు (బండి) అక్కడే ఆలస్యమయినది. వర్షాకాలము, దొప్పలపూడి నుండి నడవ వలసినదే.

అంతా తన తృప్తి కోసమే :

యింతలో నల్ల ఖాసి ఒంటెద్దు బండి మాట్లాడుకొని వస్తాడు.

తాతగారు : పెట్టెలు సామాను బండిలో పెట్టించి మీరు యెక్కండి నేను అటు వెళ్ళి వస్తా అని వెళ్ళుతారు.

అమ్మ : తాతగారు వెళ్ళివచ్చేలోగా నేను ఆ తాత దగ్గరకు వెళ్ళి వస్తా అని ఆ తాతదగ్గరకు వెళుతుంది.

తాత పిల్లవాడిని పెట్టుకుని యేడుస్తూ కూర్చుంటాడు. ఇంతలో పోలీసులు వాళ్లు ముట్టడించి వుంటారు.

తాత : (అంతమందిలో అమ్మను చూచి) యేం అమ్మా రైల్లో మాకెదురుగా కూర్చున్న తల్లివిగాదూ? నువ్వేనమ్మా నువ్వే. చూడు తల్లీ చూడు. చిన్నపిల్లవైనా

నిన్ను చూస్తే అన్నీ తెలిసిన పెద్దమ్మ మాదిరిగా కనపడుతున్నావు. యేడుపు మాని అమ్మతో అట్లా అనటం విని, అందరూ అమ్మవంక చూస్తారు.

అమ్మ : (తాత దగ్గరకు వెళ్లి పైన చేయివేసి నిమురుతూ), యెందుకు నాయనా యేడుస్తున్నావు. పిల్లవాడు పోయినాడనా! యిప్పుడు ఖర్చులకు డబ్బులు లేవనా, నిన్ను చూచేవాళ్లు యెవరూ లేరనా నీవు యేడవటం.

తాత : పిల్లవాడు యింత గంజి పోస్తాడు (పిల్లవాడి వయస్సు 8 సంవత్సరములు) అనుకున్నా అమ్మా. ఒకప్పుడు జర్వము వచ్చి పడుకుంటే అడుక్కొచ్చి పెట్టాడు తల్లీ.

అమ్మ : అలా అయితే యేడిచేది నీ కొరకేగా? పెంచింది నీ కొరకు, నీ తృప్తి, నీకు హాయిగా వుండి పెంచావు, చస్తే నీకు కష్టమని యేడుస్తున్నావు. ఏదన్నా వాడిచేతిలో పెడితే వాడు తింటే నీకు తృప్తి గనుక పెడుతున్నావు. వాడల్లరి చేస్తుంటె కొట్టి అల్లరి మాన్పించి తృప్తి పడుతున్నావు. ప్రాణం పోయిన శవాన్ని దగ్గర బెట్టుకుని యేడుస్తున్నావంటె డబ్బు లేదని, పారేసేవాళ్లు లేరని, నీ బాధ్యత తప్పిపోతున్నదని, అదీ నీ కొరకే!

అందరూ ఆశ్చర్యంగా అమ్మవంక చూస్తూ వుంటారు. నల్ల ఖాసిం అమ్మను వెతుక్కుంటూ వస్తాడు. రామ్మా అంటాడు. "తాతగారు నీకోసం యెతుకుతున్నారు. ఆయన నిన్ను యిట్లాపోతె యెట్లా అని కోప్పడుతున్నారు. చిన్నప్లిలలను యెవరైనా యెత్తుకుపోరూ?"

అమ్మ : అదీ ఆయన తృప్తికే. ఖాసిం ఈ తాతకు యేం కావాలో అడిగి చేస్తావా తరువాత వెళదాం.

నల్ల ఖాసిం : తాతగారు కోప్పడతారమ్మా.

అమ్మ : తొందరగా వెళ్లటం తాతగారి తృప్తి, యీ తాత పని చూట్టం నా తృప్తి.

తాతగారు బయలుదేరి ఖాసిం, అమ్మ యిద్దరూ రాలేదని వస్తారు.

సాయంత్రం 4 గంటలు అవుతుంది.

తాతగారు దూరంగా వుండగానే అమ్మ తాతను చూస్తుంది.

ఖాసిం సాహెబుతో అమ్మ తాతగారు వస్తున్నారు. "నీవుపోయి తాతగారిని కలుసుకో, నేను వస్తున్నానని" అంటుంది అమ్మ.

ఖాసిం సాహెబు : నువ్వు కనపడకపోతె ఇబ్బంది. నీవు వెళ్లు ఆ అబ్బాయికి యేదో ఒకటి నేను చేసివస్తా అంటాడు ఖాసిం.

అమ్మ : సరేలే, అని చేతి వుంగరం తీసి చేతిలో పెట్టుకొని, ఖాసిం, ఆ కొట్టుకు పెళ్లి ఒక పంపర పనసపండు కొనుక్కురా.

కాసిం : నా దగ్గర డబ్బుల్లేవమ్మా.

అమ్మ : అసలు ఎంత అవుతుందో కనుక్కురా, ఫో!

ఖాసిం : డబ్బులేని బేరమెందుకమ్మా.

అమ్మ : అదే వస్తుందిలే.

ఖాసిం తాతగారు సమీపించబోగా, ఖాసిం పండు కనుక్కురాటానికి వెళతాడు. అమ్మ వుంగరం తీసి తాత చేతిలో పెట్టి, "నాయనా నీకు కావలసిందేదో యిది మార్చి నాడుకో, నా చేతిలో వున్నదిది".

పిల్లవాని తాత : చిన్నపిల్లవు, యెందుకమ్మా యీపని.

అమ్మ : నా కొరకే, నా తృప్తి నాయనా !

పిల్లవాని తాత : నాకివ్వటం నీ తృప్తి యేమిటమ్మా ?

అమ్మ : ప్రపంచంలో ప్రతిపని తనకోసరమే చేసుకుంటున్నాడు అని నాకు తోస్తున్నది.

పిల్లవాడి తాత : నవ్వి, యేంమాటలమ్మా నీకు?

అమ్మ : నాకా, నావా అని, చెప్పు నాకు మాట్లాడే మాటలున్నయ్యా, నామాటలు గొప్పవా?

పిల్లవాని తాత అర్థం చేసుకోడు. "వద్దమ్మా" అని చెయ్యి పుచ్చుకుని లాగి అమ్మచేతికి పెట్టబోతాడు.

అమ్మ : ఒక వేళ నీ మనవడు దెబ్బతగిలి ప్రాణం కడబట్టిం దంటారే. అట్లాగే, అట్లా కడబట్టి మళ్లీ లేస్తే యీ వుంగరం అబ్బాయి చేతికి బెట్టు.

పిల్లవాని తాత : యింకా యేం బ్రతుకుతాడమ్మా పోయిన బిడ్డ?

అమ్మ : పోతే సరే, ప్రాణం కడబట్టి బ్రతికితె. లేకపోతె మరొకదాని కుపయోగించుకో అని అమ్మ అతని చేతిలో పెట్టి వెళ్లిపోతుంది.

చిదంబర్రావు తాతగారు ఖాసిం కొట్టువద్ద నిలబడి వుంటారు.

అమ్మ వారి దగ్గరకు వెళ్లి "తాతగారూ నేను బయటకు వెళ్లాలి".

ఖాసిం : యిక లాభం లేదు. మీరు ముందు బయలుదేరండి. ప్రొద్దులేదు. మీరు దొప్పలపూడి దగ్గరకు వెళ్లేటప్పటికి నేను వెనక యెత్తుకొస్తాను.

తాతగారు : జాగ్రత్తగా రండి, ప్రొద్దుగూకి పోయింది అని తాతగారు వెళ్లిపోతారు.

ఖాసింతో వారి బంధువులు యెవరో మాట్లాడుతూ వుంటారు.

భ్రాంతి లేనిదే బ్రహ్మ :

అమ్మ బైటకు వెళతానని చెప్పి, తాత, పిల్లవాడు, వున్నచోటకు వస్తుంది.

తాతకు కొద్దిగా పిల్లవాడి చెయ్యి కదిలినట్లుగా కనుపిస్తుంది. అది భ్రమగా అనిపిస్తుంది.

పిల్లవాడు అమ్మ దగ్గరకు పోగానే రెండవ చెయ్యి కూడా కదిలిస్తాడు.

పిల్లవాని తాత పిల్లవాని కదలిక చూచి లేచి కూర్చోక పోయినా బ్రతికినట్లుగానే భావించి అమ్మవంక చూచి అమ్మకు నమస్కారము చేసి, "యిందుకే పెద్దలు బాలవాక్యము; బ్రహ్మవాక్యము అంటారు".

అమ్మ : బాలవాక్యము కాదు, బ్రహ్మవాక్యము అంటే, "భ్రాంతి లేనివాక్యము, బ్రహ్మవాక్యము".

పిల్లవాని తాత : యేమి చెపుతున్నావమ్మా, మాటలు. 'ఆ బ్రహ్మవు నీవేనేమొ!'

అమ్మ : నేనుకాదు. "భ్రాంతి లేనివాడు, బ్రహ్మ". నేను వెళతాను. ప్రొద్దుకూకు తున్నది. ఆ అబ్బాయి లేస్తే యిది పెట్టు.

పిల్లవాని తాత "నీవూరు చెప్పమ్మా నేను వస్తాను" అంటాడు. దూరంగా నుంచున్న పోలీసులు యితన్ని కనిపెట్టుకొనే, తక్కిన పనులు చూచుకుంటున్నారు. అంతకుముందు పోలీసులకు యిది నేరంగా తీసుకుని తాతను అరెస్టు చేసినట్టుగా వాళ్ల దృష్టిలో తన స్వాధీనము చేసుకున్నట్టుగా పైయెత్తున కనిపెట్టుకొనే తిరుగుతున్నారు.

అమ్మ తాత దగ్గర నుంచున్నప్పుడు పోలీసులు తాత దగ్గరకు వస్తున్నారు.

అమ్మ : నా దారితో నీకు పనేమిటి నాయనా, నీ బిడ్డలేస్తే -

తాత : లేచినా లేవకపోయినా నీదగ్గరకు వస్తా, అమ్మా నీవే రక్షించాలి.

అమ్మ : అందరిని రక్షించేవాడు ఒకడే నాయనా, నీ మనమడికి దెబ్బ తగిలించినవాడు, పోయినాడని భ్రమను కలిగించినవాడు, కదిలించినవాడు, లేవదీసేవాడు అంతా ఒకడే నాయనా !

తాత : వాడేనా అమ్మాయిందాక నీవు చెప్పిన బ్రహ్మ. భ్రాంతి లేనివాడు. వాడికి యివి అన్నీ యెందుకో అని నా గురువుగారు 'అహం బ్రహ్మాస్మి'' అని చెప్పాడమ్మా నేను వుపదేశమయ్యాను. నా గురువుగారు ఖాదరు మస్తాను గారు. ఆయన బదులు యిపుడు చక్రపాణి అనే ఆయన చెపుతున్నాడు. ఆయన అహం బ్రహ్మాస్మి అనే చెపుతున్నాడు.

అమ్మ : అహం అంటే నేను, బ్రహ్మ. నేను అంటే బ్రహ్మ అయిన నేను. నేను నేనుగానే వున్న నేను, అహం బ్రహ్మాస్మి. నేను నీవుగా నున్న నేను "అహంకార బ్రహ్మ". అంటే రెండుగా వున్న స్థితి "అహంకార బ్రహ్మ". యిక్కడ బ్రహ్మత్వము లేకపోలేదు.

నేను నేనుగానే వున్న నేను అనే స్థితి అహం బ్రహ్మాస్మి.

పిల్లవాని తాత : భ్రాంతి లేనిదే, బ్రహ్మ అన్నావు. ఆమాట యెంత బాగున్నది మళ్లీ వివరించి చెప్పమ్మా. నా గురువుగారు నాకు తారకం చెప్పారు. నేను పరిపూర్ణమయ్యా. మా గురువుగారు భ్రాంతిపోవాలని చెప్పేవాడు గాని భ్రాంతిలేనివాడు బ్రహ్మము అని చెప్పేవాడుగాదు. భ్రాంతి దేనితో పోతుందో చెప్పమ్మా.

అమ్మ : చెప్పేదేముంది నాయనా, సమయమొచ్చినప్పుడు భ్రాంతి చేతనే భ్రాంతి పోతుంది.

పిల్లవాని తాత : అది యెట్లాగో చెప్పమ్మా.

ఖాసిం అమ్మ దగ్గరకు వచ్చి యెవరో బంధువు చచ్చిపోయారు చూచి వస్తానని చెప్పి వెళతాడు. పోలీసులు యీ పిల్లవాని తాత బంధువా కాదా అని అనుమానిస్తూ యెడంగానే వుంటారు.

అమ్మ : నీ మనమడు శరీమును యిందాకటి నుంచి గుడ్డల్లో పడుకోపెట్టావు. లోగడ వాడు బ్రతికి వున్నాడు, ప్రాణము వుందని అనుకున్నప్పుడు శరీరాన్ని ఎంత

చక్కగా పోషించావు, శరీరము అనిత్యమని తెలుసుగా. మీ గురువులు నీకు చెప్పింది అదేగా. యిందాకటి నుంచి ఏడ్చింది అదేగా.

పిల్లవాని తాత : అమ్మా! నేను శరీరం కోసం యేడ్చానా ?

అమ్మ : మరి దేనికొరకు యేడ్చావు ?

తాత : విడదీస్తే కారణం చెప్పలేనమ్మా

అమ్మ : యిప్పుడు చెప్పు. ఎందుకు యేడుపొచ్చిందో యిప్పుడు చెప్పు అన్న సమయంలో తాతకు గండుచీమలు ముసురుకుంటాయి. వాటిని దులిపి పక్కకు నిలబడతాడు.

అమ్మ : యిప్పుడు దేనికోసము జరిగావు నాయనా.

తాత : కాళ్లకు కుడతాయని జరిగా.

అమ్మ : అది శరీరమేనా ?

తాత : శరీరమే అమ్మా

అమ్మ : అనిత్యమైన దాన్ని కదా కుట్టినది. బాధ యెందుకు బడ్డావు. బాధపడ్డది యెవరు? అనిత్యమైందా, నిత్యమైందా?

తాత : ఆత్మ నిత్యమైంది.

అమ్మ : ఆత్మ నాకెందుకయ్యా, తెలిసేది కాదు. నాకు కనపడేది, మాట్లాడేది శరీరం.

తాత : నీతో శరీరం యెందుకు మాట్లాడుతున్నది. మాట్లాడేది మనస్సు.

అమ్మ : అది యెట్లా వుంటుంది.

తాత : నీవు కారణమైతే నీకు తెలుస్తుందిలే అమ్మా.

అమ్మ : యేమిటి కారణమంటె, మనసుకు కారణమైతేనా ?

తాత : కాదు కాదు. నీకు కారణమంటేనే తెలియ లేదమ్మా. ఇన్ని జెప్పావు కారణమంటే మా గురువుల దగ్గరకు రా, నే చెప్పిస్తా.

అమ్మ : నేను నువ్వే గురువనుకుంటాలే చెప్పు.

తాత : నాకు ఆ హక్కు యివ్వలా నా గురువు. అయినా చిన్నపిల్లవు దక్షణ లేదు.

అమ్మ : దక్షణ అంటే ?

తాత : ఆమాట తాత వినుపించుకోకుండా, చిన్నపిల్లవు చిన్న పిల్లమాటలు కావు.

అమ్మ : నీవు పెద్దవాడివి. చిన్నవాడి మాటలు, మన పెద్దరికం చిన్నరికం మాటలేనా? సరి మా ఖాసిం వస్తున్నాడు. యీరాత్రల్లా యిక్కడే వుంటా మాట్లాడుకుందాంలే తాతా.

తాత : నీకు లోచూపు చెప్పేదా!

అమ్మ : చూచేది వున్నది వున్నట్లుగా కనపడితే చాలు. లోచూపువొద్దు. కనపడేది కనపడుతున్నది కనపడుతున్నట్లుగానే చెప్పు. వున్నది వున్నట్లుగా కనపడటమే లోచూపేమొ. వున్నది ఉన్నట్లు అంటే ఎక్కడ ఏది వుంటే అది. అదే లోచూపు అంటారు.

తాత : కాదమ్మా అంతరయోగము అని వున్నది. ఆ దృష్టి వేరే వున్నది. నల్లగడ్డులోనికి పోనిచ్చి చూస్తారు.

యింతలో ఖాసిం వస్తాడు.

పిల్లవాడు లేచి నెమ్మదిగా కూర్చుంటాడు.

అమ్మ : తాతా పిల్లవానిని యెత్తుకో. ఈ రాత్రికి భావనారాయణస్వామి దేవాలయములో పడుకుని ఎవరి దారిన వాళ్లము వెళ్లిపోదాము రేపు పొద్దున.

ప్రొద్దుపోయి దొప్పలపూడి దగ్గర నుంచి తాతయ్య, తాతమ్మ మన్నవ చేరతారు. తీసుకువెళ్ళిన మూటలన్నీ దొప్పలపూడి కరణంగారి ఇంట్లో పడవేసి నానా అవస్థలుపడి వెళతారు.

నల్లఖాసిం : (అమ్మ వున్నచోటికి వచ్చి) అమ్మా ప్రొద్దు పోయింది ఆకలి కావటంలా. అక్కడ అంతా చేసి వచ్చాను. అన్నం తినమన్నా తిన్లా. చచ్చిఏడ్చేచోట అన్నమెందుకు. నీవు ఎట్లా వున్నావోనని భయమేసి తొందరగా వచ్చానమ్మా.

అమ్మ : నాకు అన్నము వద్దుగాని, తాతను తీసుకుని పిల్లవాడికి ఈ రాత్రికి కాసిని పాలు యిప్పించి ఎక్కడయినా పడుకుందాం.

నల్లఖాసిం : గుళ్లో పడుకుందామా అమ్మా.

అమ్మ : ఎక్కడయినా సరే నీ యిష్టం.

తాత అందుకొని ఇందాకనే అన్నావుగా అమ్మా గుళ్ళో పడుకుందామని.

అమ్మ : ఏదో అనేకం అనుకుంటాం. అనుకున్నవల్లా జరుగుతయ్యా. శరీరాన్ని పారెయ్యాలని నీవు ఎంత ప్రయత్నము చేసినా ఆ వసతి దొరకలేదు. నీకు ఇందాక ఆ వసతి దొరక్క పోవటం మంచిదేగా? అయినా ఎవరయినా డాక్టర్లు చూస్తే పారవేయనిచ్చే వాళ్లు కాదేమొలె, ప్రాణమున్నదిగా అని.

తాత : అందరూ పోయినాడు అన్నారుగా అమ్మా ఇందాక. నాకూ అట్లాగే వుంది. శ్వాస లేదు.

అమ్మ : ప్రాణమంటే శ్వాసేకాదు, శ్వాస ఆగికూడా బ్రతకవచ్చు.

తాత : అది ఒక యోగులకే సాధ్యమన్నారు మా గురువుగారు.

అమ్మ : మీ గురువుగారు ప్రాణమంటే ఎక్కడ వుండేది చెప్పారా ?

తాత : నాకు చెప్పలేదుగాని నాకు ఒకటి తోస్తున్నదమ్మా.

ఖాసిం : ప్రొద్దుపోయిందమ్మా అక్కడ మాట్లాడుకోవచ్చు వెళదాం పదండి అని అమ్మను ఎత్తుకోబోతాడు.

అమ్మ : నన్ను వొద్దులే, ఆ అబ్బాయిని ఎత్తుకో.

ఖాసిం : ఏ అబ్బాయి అమ్మా.

అమ్మ : ఇందాక చచ్చిపోయాడు అనుకోలా ఆ అబ్బాయి. పోలేదు, ప్రాణం దిమ్మ పట్టింది.

ఖాసిం : కాదమ్మా నేను చూచాను. పోయినట్టే వుంది.

అమ్మ : అదేగా "వున్నది లేనట్టు కనపడటమే భ్రాంతి" అంటారు.

తాత : ఏదోలే అమ్మా తరువాత మాట్లాడదాం. నీకు చాలా చెప్పాలనిపిస్తున్నది. భక్తిగల పిల్లవయ్యేట్టున్నావు.

తన మూల మిదం జగత్తు :

పిల్లవాణ్ణి ఖాసి భుజాన వేసుకుంటాడు. అందరూ కలసి బయలుదేరి గుడికి వెళుతుండగా హోటలు కనపడుతుంది. యెవరికి కావలిసినవి వారు తీసుకుంటారు. పిల్లవానికి పాలు యిప్పిస్తారు. అందరూ కలసి భావనారాయణ

గుడి దగ్గరకు చేర్తారు. గుళ్లోకి వెళ్లి ఖాసిం, పిల్లవాడు నిద్రపోతారు. అమ్మ ముసలితాత మెళుకువగా వుంటారు.

తాత : అమ్మా నీకు ఇందాక చెప్పిన 'అంతర యోగమంటె' అర్థం కాలా?

అమ్మ : కాలేదు నాయనా.

తాత : బయలులో బయలు ఇది. వుత్త బట్టబయలు అను భావమే పరిపూర్ణము అని మా గురువుగారు చెప్పారు. రెండు రూపాయలతో పరిపూర్ణము చేసారమ్మా ఆ నాయన.

అమ్మ : యింతకు నాకేమి చెపుతావు?

తాత : యిందాక నాకు చెప్పేటప్పుడు అన్నీ నీకోసమే నన్నావు. అదేమిటమ్మా చెప్పు నీ భావము.

అమ్మ : తాతా నీవు అన్నము యెవరికోసము తింటున్నావు?

తాత : నేను లోగడ అన్నం మానేస్తే మా ముసిలిది ఏడ్చింది. అందుకని తింటున్నా. గుణములు చస్తయిగదా అని అన్నం మానేద్దామనుకున్నా.

అమ్మ : లోగడ అన్నము తింటూ మానేశావు గనుక యేడిచింది.

తాత : తల్లి, తండ్రి అలవాటు చేశారు గనుక తింటున్నా.

అమ్మ : నీవు ఆమె చేత పెట్టించుకు తినటము అలవాటు చేశావు కనుక యేడ్చింది. అన్నము సంగతి సరేలే, పెళ్లి యెవరికోసము చేసుకున్నావు?

తాత : అదీ తల్లీ తండ్రీ చేసారమ్మా.

అమ్మ : ఆ చేసింది వొప్పుకోవటము నీ తృప్తేగా?

తాత : ఆఁ

అమ్మ : తరువాత భార్యతో అవుసరాలు నీ అవుసరమా వాళ్ల అవుసరమా ?

తాత : చిన్నపిల్లకు యేం మాటలమ్మా.

అమ్మ : పెద్దవాడికి చిన్నపిల్లతో యేమి ఆలోచనలు నాయనా.

తాత : నీవు చిన్నపిల్లవుగా లేవమ్మా !

అమ్మ : నీకు పెద్దరికముందా ?

తాత : సరేలే నీకు నేనేదో భక్తి మాటలు చెపుదామనుకున్నా.

అమ్మ : భక్తి లేని భక్తిమాటలిట్లాగే వుంటయి.

తాత : సరేలే అమ్మాయోయ్ అసలు మాట పోగొట్టావే. నిన్న పిల్లోడి దగ్గర చెప్పిన మాటలు చెప్పు బాగుండయ్యి.

అమ్మ : అదేగా చెప్పేది. యింత చిన్నపిల్లకెందుకని కోప్పడితివే.

తాత : నేను వాటికి కోప్పడ్డానా నిన్ను, నీ మాటలకుగాని యేదైనా జన్మ కడతేరే మాటలు చెప్పు.

అమ్మ : కడతేరేవి మాటలు కావు.

తాత : తత్వాలు చెప్పుతావా చెప్పు.

అమ్మ : నీదో తత్వం, నాదో తత్వం.

తాత : ఆ మాట చెప్పమ్మా, సాయంకాలం చెప్పినవి.

అమ్మ : యేంలేదు నాయనా, ఏది చేసినా తన తృప్తికొరకే చేస్తాడు. నీకు నచ్చితే విను లేకపోతే లేదు, నా అభిప్రాయం చెపుతాను.

తాత : చెప్పమ్మా, చెప్పు నా బిడ్డకు ఆపదొస్తే కనిపెట్టుకు కూర్చున్నావు. మర్చేపోయినా ఆ వుంగరమియ్యమంటావా?

అమ్మ : యివ్వటానికివ్వలా. అది ఆ యివ్వటం నా తృప్తి. యేది చేసినా ఆఖరుకు మేలు చేసినా, కీడు చేసినా; దగ్గరకు తీసినా, ముద్దు పెట్టుకున్నా, తిన్నా, తినకపోయినా, అలిగి పడుకున్నా అన్నీ తన తృప్తికే చేస్తాడు. ప్రేమించినా, ద్వేషించినా ప్రతీదీ తనుతప్ప మరొకటి లేదు 'పెద్దలు ధన మూలం మిదం జగత్తు అన్నారు కాని. కాదు - తన మూల మిదం జగత్తు. అంటే తనే ధనమనేమొ' . ధనమంటే డబ్బులే కాదు నా వుద్దేశం. తను వుండి కొన్ని వస్తువులు కావాలంటె డబ్బు అవసరమయింది. తను వుండి వస్తువులుంటె ధనముతో పని లేకుండా సరిపోతుంది. ధనముండి వస్తువులు లేకపోతే జరుగదు. లక్షరూపాయలు జేబులో పెట్టుకుని బజారుకు వెళ్లినా కావలసిన వస్తువు లేనప్పుడు లక్ష రూపాయలకు విలువలేదు. నా దృష్టిలో వస్తువే ధనం కాని. అనగా మనకు కావలసినదే. వస్తువే ధనం, ధనమే వస్తువు. వాటికి భిన్నం లేదు. ''ధనమూల మిదం జగత్తనే'' శృతి ప్రమాణం మాత్రం కాదు. యెవరో అవసరానికి డబ్బు లేనివాడు వాడిన మాట అది.

రజ్జు సర్ప భ్రాంతి :

తాత : నీమాటలు చాల బాగున్నయ్యమ్మాయి.

అమ్మ : అన్నీ బాగున్నయ్యి కాని బాగుండందేదో చూపిచ్చు. ఇందాక ఏం మాటలు ఆ మాట అన్నావుగా.

తాత : మాటలు కాదమ్మా. చిన్నపిల్లకు పెద్దమాటలు ఎందుకన్నా.

అమ్మ : యిప్పుడు యీ మాటలన్నీ చిన్నపిల్లకు తగినవేనా ?

తాత : కాదు, అదీ ఆలోచనగానే వుంది. ఇవన్నీ విన్న తరువాత నీవేమిటో అనిపిస్తున్నది. మా గురువుగారు వాడిన మాట ఒక మాట వాడావు.

అమ్మ : యేమిటా మాట ?

తాత : 'శృతి' అనేమాట. వారు ప్రతి ఒకసారి వాడేవారు. యింకో రెండో ముక్క వుందమ్మా 'రజ్జు సర్ప భ్రాంతి' అనేవారు. అంటే నీకు అర్థమయిందా అమ్మా?

అమ్మ : కాలేదు నాయనాః

తాత : అంటే తాడును చూచి పామనుకోవటము.

అమ్మ : పామును చూచి తాడనుకోరు? భ్రమనేది రెండువైపులా కలిగించొచ్చుగా?

తాత : కాదమ్మా మా గురువుగారు చెప్పింది. (అదేననుకో) తాడును చూచి పామనే ననుకో. యీ ప్రపంచం అంటే యీ జగత్తు ఒకటయితే, ఒకటిగా చూస్తున్నామన్నాడు. యిది యెప్పుడూ వుండేది కాదు, లేనిది. లేనిదాన్ని వున్నదనుకోవటము స్వప్నం మాదిరి.

అమ్మ : నాకు అర్థం కావటంలేదు తాతా వివరించి చెప్పు.

తాత : చిన్నపిల్లవుకాదు. నీకర్థం కాదులే అమ్మా.

అమ్మా : పోనీ అర్థం అయ్యేటట్లు చెప్పు.

తాత : చీకట్లో తాడుందనుకో. దాని మెలికలు మెలికలు చూచి పామని భ్రమ పడతాడు. చీకటి భ్రమ లాంటిది.

అమ్మ : దీపం తెస్తే యేమయింది ?

తాత : అది జ్ఞానం లాంటిది. భ్రమ పోయిందిగా.

అమ్మ : అసలు భ్రమ తాడు పాము రెండూ తెలిసినవాడికేగా కలిగేది. అచ్చగా తాడు తెలిసినా లేదు. అచ్చంగా పాము ఒకటే తెలిసినా లేదు. పసిపిల్లవాని ముందు పాము పరుగెత్తుకొచ్చింది. వాడు పామును పెట్టి ఆడుకుంటున్నాడు. వాడే తాడు పట్టి ఆడుకుంటాడు. యేమీ తెలియదనుకుందామా వస్తువు కనపడితే చేత్తో పట్టుకోవటము తెలుసు. అది యెటు పోతుంటే అటు పారాడటం తెలుసు. కరుస్తుంది అపాయమని మాత్రం తెలియదు. అప్పుడు వాడికి తెలివి ఉన్నదా లేదా? పెద్దవారిలో కూడా కొన్ని జంతువుల యొక్క వుపయోగం. వాటి లక్షణం తెలియనివారున్నారు. వారికి భయం కాని, భ్రాంతి కాని లేదు. భ్రాంతి అంటే మమకారము. భ్రమ అంటే వూహించటం. అది యెట్లా అంటే తాడును చూచి పాము అనుకోవటం అన్నారే అది భ్రమేగా, భ్రమ అంటే ప్రేమించటమా ? వూహించటమా? లేక భ్రమ ఆనేదానికి మాయ అనికూడా వస్తుందా? లేకపోతే తాడు యందు పామును ఆరోపించినట్టుగా జగత్తు సత్యమనుకుంటున్నాము. "బ్రహ్మ సత్యముగాని జగత్తుమిథ్య" అను యీ వాక్యమునాధారము చేసుకుని అంటున్నారు. రెంటికి ఒకదాని కొకటి సంబంధమున్నదల్లా "అవినాభావ" సంబంధమంటారు. పైన చెప్పిన "రజ్జువును సర్పముగా చూచింది నా భావం". భయపడ్డది నా భావం. దీపం తెచ్చింది నా భావం. కాదనుకొన్నది నా భావం (నా భావం) సర్వం నాభావం. అంతా నాభావం అంటే అంతా ఆభావం లోదే. ఆ భావమే భావాని కాధారమై భావా భావ సహితమే యీ ప్రభావమంతా. దీనికి రహితము లేదు అంతా సహితమే. అందుకే అవినాభావ సంబంధము అంటే : అని నా భావ సంబంధం అవి - అంటే కనపడేవి. నా భావమంటే - కనపడే వాటిని వూహించేది. వూహను బట్టి సంబంధం. తను చూసేదాన్ని బట్టి కనపడుతుంది.

తాత : నా కర్థం కాలేదమ్మా. యీ గొడవలు తెలియవు. ఆ గురువు చెప్పిన ముక్కలే కాని. మహా వాక్యాలు చెప్పారు.

అమ్మ : యేమిటి ఆ మహావాక్యాలు ?

తాత : అంటే వాక్యార్థం అంటారు.

అమ్మ : వాక్యార్థము అంటే వాక్యాలకర్థమా? ప్రతి వాక్యానికి వుందిగా అర్థం.

తాత : లేదమ్మా మహావాక్యాలకర్థం. యివన్నీ అయినాకనే పరిపూర్ణం చెప్పేది. ముందు తారకం, సాంఖ్యం, అమనస్కస్థితి.

అమ్మ : అమనస్కస్థితే పరిపూర్ణమా?

తాత : కాదు కాదు దేనికదే.

అమ్మ : దేనికదే అయినప్పుడు అది పరిపూర్ణం యెట్లా అయింది?

తాత : నీకు చెప్పినా తెలియదమ్మా. యెందుకు నీతో. మా గురువుగారి దగ్గరకు తీసికెళ్లి చెప్పిస్తా.

అమ్మ : నేనిప్పుడు నిన్నడిగానా? నీకేదో చెప్పబుద్ధి పుడుతున్న దమ్మా భక్తిగల పిల్లవన్నావు.

తాత : నీవు శ్రద్ధగా వింటంలేదు. అర్థం కావటంలేదు. నీకు తలకాయ లేదు.

యింతలో పిల్లవాడు లేచి "నేను అమ్మ దగ్గరకు పోతా" అని యేడుస్తాడు. యింతలో

తాత : నాయనా మీ అమ్మలేదుగా చచ్చిపోయింది.

పిల్లవాడు బాగా మెలుకువ రాగా, కళ్లు నలుచుకుంటూ, వుంగరం యిచ్చిన అమ్మ కావాలి అంటాడు.

తాత : ఆ అమ్మాయి యిక్కడే వుంది నాయనా.

తాత యీమాట అనేలోగానే పిల్లవాడు లేచివచ్చి అమ్మ గొంతు వాటేసుకుని, అమ్మా అని పెద్దగా అరచి, ప్రాణం విడుస్తాడు.

తాత : యిదేమి అన్యాయము తల్లీ. యిదేమయినా ప్రయోగమా. రైల్లో కూడా నీవు యెక్కినప్పటి నుంచి అన్నీ ఆపదలే. పోయినవాడు మళ్లీ బ్రతకటమేమిటి! యేదో భక్తి గల పిల్లవు అన్నీ బోధ చేదామని కూడా బెట్టుకొచ్చా, నీవు అసలు యెవరమ్మా?

అమ్మ : నేను వాడమ్మనే (వాడమ్మ అంటే అందరికీ అమ్మ) అని గొంతు వాటేసుకొని వున్న చేతులు విడదీసి పిల్లవాడిని తీసి కాళ్లమీద పడుకోబెట్టుకుంటే అమ్మ కాళ్లకంటే పిల్లవాని కాళ్లు పెద్దగా వుంటాయి. (అమ్మకన్న పిల్లవాడిది పెద్ద వయస్సు).

లయ కారిణి :

తాత పెద్దగా యేడ్వటం విని ఖాసిం లేస్తాడు.

ఖాసిం నిప్పుపెట్టె గీసి అమ్మ కాళ్లమీద వున్న పిల్లవాణ్ణి చూచి వాణ్ణి లేవదీయబోగా అమ్మ కాళ్లకు కరుచుకుని శవంపైకి లేవదు. ఖాసిం బాధపడుతూ "యిదేమి అన్యాయం. యీ పిల్లవాణ్ణి తీసుకొచ్చి యెందుకయ్యా తాత అమ్మ కాళ్లమీద పడవేసావు. చిన్నపిల్ల అని తెలియదు. బుద్ధిలేదు. అసలే వాళ్లు అన్నీ దెబ్బలు తిని వున్నారు".

జరిగినదంతా నల్ల ఖాసింతో తాత చెపుతాడు.

ఖాసిం : యిదంతా యేదో మాయగా వున్నది. అమ్మను వదిలిపెట్టకుండా నీవొస్తున్నావా? నిన్ను అమ్మ వదిలిపెట్టకుండా వస్తున్నదా? రైలులో పరిచయమేనా? అదివరకు యేమైనా పరిచయ మున్నదా? యీ వుంగరం చూస్తుంటే నాకు అనుమానముగా వున్నది. లోగడ అమ్మది చాలా సొమ్ము పోయినట్టుగా విన్నాను. యిట్లా నీకు లోగడ యేమైనా వస్తువులు యిచ్చినదా?

తాత : సరే బాగా వుంది. ఆ అమ్మాయి ముఖం నేను యిదే చూట్టం. రైలులో మీరు యెక్కింది కూడా చూడలా, నా గొడవలో నేనున్నా.

ఖాసిం : సరే అయిందేమొ అయింది. యిపుడేం జరగాలి. యెందుకమ్మా నీకీ పంపకం? తెల్లవారొచ్చింది.

అమ్మ : అది నా పెంపకం.

ఖాసిం : యీ పిల్లవాడి సంగతి యేం చెయ్యాలి. తెల్లవారొచ్చింది. అర్చకులొస్తే వూరుకోరు. యిక్కడ పీనుగులను పెట్టగూడదు.

అమ్మ : పీనుగులను పెట్టవలసినది యిక్కడే. వాడెంత ధన్యుడో దేముడులో లయమయిపోయాడు. లేకపోతే దేవాలయంలో పోడు.

తాత : ప్రాణం పోవటమే లయం కావటమా? యింకా నయం నీ వొళ్లో పోయినాడు గనుక నీలో లయమయిపోయినాడలా.

అమ్మ : కాలేదని యెవరన్నారు? (అంటే నాలో లయం)

తాత : అయితే నువ్వే ప్రాణం తీశావా?

అమ్మ : యెందుకు తీయకూడదు? యిచ్చినవాడు తీస్తాడు.

తాత : నీవు యివ్వలేదుగా?

అమ్మ : నేను తీయలేదుగా!

తాత : నీవే తీసావు.

అమ్మ : నేనే యిచ్చా. రెండూ మనంకాదు. యిన్ని మహావాక్యాలు నేర్చుకొని పరిపూర్ణమైన అమ్మాయిగా తోచాను. వాడికి అమ్మగా తోచాను. నీకు యిట్లా తోచటానికి యేది కారణమో. మొదట రైల్లో పిల్లవానికి తగిలిన దెబ్బకు, తరువాత రక్షణకు, యిప్పుడు అమ్మగా గుర్తించి ప్రాణము విడవటానికి, ఆ శక్తే కారణము.

తాత : సరేలే అమ్మా, మాదారేదో చెయ్యి.

అమ్మ : నేనేం చేస్తాను అమ్మాయిని. మా ఖాసింను అడుగు.

చుట్ట తాగబోయిన ఖాసిం లోనికి వస్తాడు. బండి మాట్లాడదామనుకుంటే దొరకలేదు. యెత్తుకెళతా పదమ్మా.

అమ్మ : యీ పిల్లవాడిని, తాతను యిక్కడ నుంచి దాటవేసి వెళదాము.

ఖాసిం : నీకెందుకమ్మా యీ తాతతో పిల్లవాడితో యేమి సంబంధమో.

అమ్మ : నీతో నాకేమి సంబంధమో, వాళ్లతో అదే సంబంధం. పిల్లవాణ్ణి లేవదీసి భుజాన వేసుకుంటుంది.

ఖాసిం : (ఆశ్చర్యపడి) పిల్లవాణ్ణి యింతసేపు కాళ్లమీద యెట్లా పెట్టుకున్నావమ్మా? బరువు బుట్టలా, నేను తీస్తే రాలేదే. నీకెట్లా లేచాడు. భుజము మీద వున్న పిల్లవాణ్ణి తీసి. (అమ్మకు బరువు లేనట్టె తేలిగ్గా వుంటుంది. ప్రాణము వున్న పిల్లవాడిలా) క్రింద పడుకోపెట్టబోగా.

అమ్మ ఖాసిం చేతిలోని పిల్లవాణ్ణి లాక్కొని, అమ్మ భుజాన వేసుకొని "ఆలస్యం చేయకుండా నా వెనుకనే రండి" అని గబగబా వెళుతుండగా ఖాసింకు, అమ్మ (రంగమ్మ) పోలికలు కనుపిన్తయ్యి. (మననులో) సంవత్సరీకాలని యింటికొస్తున్నావా అనుకొని, మళ్లీ, అమ్మాయి రంగమ్మ తల్లిగా కనపట్టం యేమిటి, నా భ్రమా, నిజంగా కనపడుతున్నదా, అని అనుకొని "తాతా! బయలుదేరు అమ్మాయిగారు ముందు వెళుతున్నారు. చేతులో పారగూడా లేదు యేం చేస్తుందో, చూద్దాం పద, యింటికెళితె యేమంటారో, తాతగారికి చెపుదామా, అన్న రాఘవరావుగారులా చాలా అల్లరిపని చేస్తూ వుంది" అని యివన్నీ తాతకు వినపడేటట్టు అని. "తాతా! యింకనన్నా అమ్మాయిగారిని వదలిపెడతావా?"

తాత : అసలు యిదేంటో, నాకంతా భయంగా వున్నదయ్యా. ఒకదాని కొకటి సంబంధం లేని పనులు జరుగుతున్నయ్యి. యీ మధ్య బాపట్లలో మా యన్న బావమరిది బావమరిదికి యిట్లాగే ఒక అమ్మాయి కనపడి ఆ అమ్మాయి ద్వారా కొంత రక్షణ జరిగినట్టు. ఒకరిద్దరితో అతను చెప్పి గోప్యంగా వుంచినట్టు తెలిసింది. ఆ కథ వినేటపుడు మాత్రం నేను కూడా అట్లా జరిగితే బాగుండు ననుకున్నా. యీ అమ్మాయె ఆ అమ్మాయని మాత్రము చెప్పలేను. యిందాక నీవు అన్నావె లోగడ నీకేమయినా పరిచయమున్నదా చాలా బంగారం పోయిందని. యీ వుంగరం మాదిరిగానే అని, వుంగరం చూస్తే అనుమానమేస్తున్నదని అన్నావు. ఆ వస్తువులు యెక్కడికి పోయినయ్యో, ఆ తాత యెవరో అది కూడా విచారించుకో.

ఖాసిం : కానియ్యి అవన్నీ తరువాత చూద్దాం. ఇది గడిచి ముందు మన్నవ వెళ్లితె తరువాత ఆలోచిద్దాం. ఆ పిల్లవాణ్ణి యేం చేస్తుందో తీసుకెళ్లి తన్ను ఎత్తుకుండే యీడులో తను అందరినీ యెత్తుకుంటానంటుంది. అందరినీ కాకుండా పీనుగలను యెత్తు కుంటుంది. అమ్మాయి గారి జన్మే వేరుగా ఉంది. ఆ తండ్రి అసలు ధర్మరాజు లాంటివాడు; తల్లి మహా యిల్లాలు. అంటూ గబగబా నడుస్తారు. దూరంగా కనపడుతున్న అమ్మ కనపడదు. చెట్ల చాటేమొలే అనుకుంటారు.

అమ్మ ముందు వెళ్లి, వెయ్యి లింగాల కట్టిన చోట్లోకి (మొదట అమ్మ తెనాలి నుంచి వెళ్లేటప్పుడు యెక్కడ దిగిందో అక్కడ, అప్పుడు అక్కడ దేవస్థానము లేదు అంతా పొలం) పిల్లవాణ్ణి తీసుకెళ్లి పడుకోబెట్టి వెనక్కు తిరిగి యెవరైనా పార తీసుకొస్తున్నారేమోనని చూడగా అక్కడే పార వుండును. యెవరో ఒక మనిషి అక్కడ పాలబెట్టి పోతాడు.

ఆ పార తీసుకొని అమ్మ గుంట తీయటం ప్రారంభం చేస్తుంది. మూడు పారలు వేసి పిల్లవాని వంక చూస్తూ కూర్చుంటుంది. ఖాసిం, తాతగార్ల మాటలు అమ్మకు వినిపిస్తూనే వుంటాయి కాని వాళ్లు అమ్మవంక చూడరు. కనపడలేదని తహతహలాడుతారు.

అమ్మ ఆ మూడు పారల పొడుగునా పిల్లవానిని పడుకో బెడుతుంది. ఆ పొడుగు పిల్లవానికి సరిపోయి వుంటుంది. ఆ చోటున ప్రస్తుతం ఇప్పుడు భ్రమరాంబాలయములో అమ్మవారి విగ్రహమున్నది. అమ్మ వాళ్ల దగ్గరకు వచ్చి, "ఖాసిం నేను యిక్కడ వుంటా, పిల్లవాణ్ణి యేంచేయాలో అది చేసి రండి".

తాత : వుంగరం తీసావా అమ్మా?

అమ్మ : ఆ వుంగరం తీయను కావాలంటే అడుగు నీకేదైనా యిస్తా.

తాత : వుంగరం వృధా పోవటమెందుకు. మట్టిలో కలిసి పోయేదేగా.

అమ్మ : మీకెందుకు మీరు పొండి. అంత అల్లారుముద్దుగా పెంచిన శరీరం మట్టిలో కలిస్తే లేనిబాధ వుంగరానికే వొచ్చింది. ఆ రకం వుంగరాన్ని చేయించగలం. ఆ రకం అబ్బాయిని చేయించలేం. మాటేకాని ఆరకం వుంగరం మాత్రం చేయించగలమా? పొండి ముందు పిల్లవాడి దగ్గరకు. ఖాసిం పిల్లవాడిపై మట్టి కప్పుతారా? యేం చేస్తారో అది చేసిరండి. ఇద్దరూ వెళ్లి.

ఖాసి : ఎందుకో ఆ పిల్లవాడిమీద మట్టి కప్పవలెనంటె భయంగా వున్నది. నిన్ను చూచినా నీతో మాట్లాడాలన్నా భీతిగానే వుంది.

అమ్మ : నీకెట్లా కనపడుతున్నాను ఖాసిం?

ఖాసిం : యెట్లా లేదమ్మా : అమ్మాయిగానే వున్నావు.

అమ్మ : మరి భయమెందుకు ?

ఖాసి : నీ పనులు చూస్తే భయంగా వున్నయ్యి.

అమ్మ : యింతకు నాతో మాట్లాడుతారా, అక్కడకు పోతారా, తాతా నీమాట చెప్పు?

తాత : నేను పోతానమ్మా, నీవు కూడా వుండు. (బయలుదేరి తాత, అమ్మ, ఖాసిం వెళతారు).

పిల్లవానికి పది గజాల దూరంలో వుండగానే తాతకు పెద్ద వాంతి, విరోచనము అయి స్పృహతప్పి పడిపోతాడు.

నల్ల ఖాసిం భయపడి, రానే వచ్చిందమ్మా కలరా. ఆ పిల్లవాణ్ణి కూడా అదే యెత్తికెళ్లిందేమో.

అమ్మ : యేదో ఒకటి యెత్తికెళ్లిందిలే. అమ్మ తాతా, తాతా, అని పిలుస్తుంది.

అమ్మ గొంతుకు తాతకెక్కడో వినపడ్డట్టుంది. వోపికలేని చేతులు రెండు ఒకచోట కలుపుతాడు. అదే నమస్కారము. పెదిమలు కదిలించి మూడుసారులు అమ్మా, అమ్మా, అమ్మా అని కళ్లు తెరచి మా గురువు చెప్పిన ఆ మనస్కం నువ్వేనా. ముందు గుర్తించక పొరపడ్డా అని ప్రాణములు విడచును. చేతులు దణ్ణం పెట్టినట్టే వుంటాయి. కన్నులు అమ్మవంకే చూస్తూ వుంటాయి. మనస్సే కాకుండా, శరీరముకూడా అమ్మలో లయమయినట్టు వుంటుంది.

ఖాసిం యిదిచూచి, "అమ్మా నీవు గుంటూరు మస్తానయ్య అని అనుకొని దగ్గరకు వచ్చి మస్తానయ్య అద్దం విసిరేస్తే చుక్కాని అయినట్టు, నడకంతా చుక్కానిగా వున్నదమ్మా" అని మస్తాను అంటూ ధ్యానం చేసి "ధైర్యమియ్యయ్యా యీ ముసిలోణ్ణి యీపిల్లోణ్ణి యేం చేయ్యమంటావు. చిన్నపిల్లైనా అమ్మాయి గారిని గురించి యేం భయం లేదులే. పెద్దవారికంటే ధైర్యమున్నది". అమ్మాయినే మస్తానయ్య అనుకుంటూ - మళ్లీ యిట్లా అనుకుంటానేమిటి?

అమ్మ : ఖాసిం యేమిటి ఆలోచిస్తున్నావు. మనం యిందులో యిరుక్కున్నాం ధైర్యమున్నా లేకపోయినా యిక్కడ వున్న పనిచేసే వెళదాం.

ఖాసిం : "ధైర్యం" అనేమాట అంటున్నావు నేను నీతో యేమైనా అన్నానా, నాలోనేగా అనుకొన్నది.

అమ్మ : నీవు అనుకున్నావని నేననలా, నాకు తోచి నేనంటున్నా. యింతకూ వీళ్లను యేదో ఒకటిచేసి వెళదాము. నేను పిల్లవాడికి మట్టి కప్పి వస్తాను. నీవు తాతకు మట్టి వేసెయ్యి. తాతకు కూడా నేను కాస్త మట్టి వేస్తాలే! అని గుప్పెడు మట్టి తాత మీద వేసి, పోదాం రా యిద్దరం కలిసి పోదాం. ఇద్దరూ పిల్లవాని దగ్గరకు వెళతారు.

కరణీకం :

ఖాసింకు ఆ పిల్లవానిని సమీపించగానే ఆ పిల్లవాడు యెక్కడో వుయ్యాల వూగుతున్నట్లు ఒక చక్కని ముత్తయిదువు వుయ్యాల వూపుతున్నట్టు కనపడుతుంది. ఖాసిం వులిక్కిపడి పరిశలించి చూస్తాడు; ఆ దృశ్యము పోయి మామూలుగానే వుంటుంది. యీ పిల్లవాడు అప్పుడే అటువంటిచోట పుట్టాడా అమ్మా, పుడతాడా?

అమ్మ : యేమొ. నాకేమి తెలుసును.

ఖాసిం : యేమొ యిన్ని చేస్తున్నావు. పాడుముకాయల్లే.

అమ్మ పార తీసి ఖాసింతో "పార తీసుకో మట్టిపోద్దాం".

ఖాసిం : నువ్వే పోయమ్మా.

అమ్మ : చిన్నపిల్లలు పోయొచ్చా?

ఖాసిం : నువ్వు యిన్ని యెట్టా చేసావు? చిన్నపిల్లలు చేసే పనేనా?

అమ్మ : యిప్పుడు తెలుసుకున్నా చెయ్య కూడదని పాడుము కాయల్లే!

ఖాసిం : కోపమొచ్చిందామ్మా ! వొద్దులే అమ్మా యెట్టా చేస్తావో చూద్దామని అన్నాలె. అంటూ పారతీసుకొని పిల్లవాడి మీద మట్టి పోస్తుండగానే నుంచున్న అమ్మ నుంచున్నట్టుగా రోడ్డుమీదకు వస్తుంది. ఖాసిం అమ్మ వెనుక నుంచున్నదని అనుకుంటాడు. మట్టిపోసి వెనక్కు తిరిగి చూడగానే అమ్మ కనపడదు. ఖాసింకు అంతకు ముందువున్న భయముపోయి పిల్లవాడు పోయాడు, మట్టి కప్పుతున్నాననుకోడు, యేదో పొలం వెళ్లి వస్తున్నా ననుకుంటాడు. అతనికేమీ తోచదు. తలవంచుకుని అమ్మ నుంచున్న ప్రదేశము వద్దకు వచ్చి అమ్మను యదా గుండెపడి చూస్తూ నుంచుంటాడు.

అమ్మ : వెళదామా యింటికి అంటుంది.

ఖాసిం : మరిచే పోయినా తాత వున్నాడుగా మట్టి కప్పివస్తా.

అమ్మ : యేం ధైర్యంగా మట్టి కప్పుతావా, నే లేకపోయినా?

ఖాసిం : ఆ యెంతమందినైనా ఈ రోజు నుండి కప్పివేస్తా: నీ దయవుంటె అని తలవని తలంపుగా అనును.

అమ్మ : నా దయ, యేమిటి? నీకు ధైర్యము వచ్చేరోజు వచ్చింది.

ఖాసిం : నాకు ధైర్యము కొరకేగా అమ్మా, నాకు యీ పనిచేసి వదిలి పెట్టేవు.

అమ్మ : యెక్కడ వదిలిపెట్టాను?

ఖాసిం : మీ నాన్నగారు యెప్పుడూ, నట్టింట పుట్టి ముంచటం అంటారు. అట్లాగె నీవు నన్ను చేసావుగా!

అమ్మ : మళ్లీ అను.

ఖాసం : యేదోలే అమ్మా యెందుకు?

అమ్మ : ఆ ముచ్చట నీకెందుకుపయోగపడ్డది?

ఖాసిం : పార చేతికిచ్చి తప్పించుకుంటేను.

అమ్మ : అదేనా నీ ధైర్యానికి కారణం. యే ఆధారం లేనప్పుడు ధైర్యము దానంతటదే వస్తుందిరా. అధైర్యమే ధైర్యానికాధారం ! నేనిక్కడ కూర్చుంటాను. ఆపనికూడా పూర్తిచేసిరా పోదాం.

ఖాసిం : తెల్లవారి పోయింది. మనుషులు తిరుగుతున్నారు. మట్టిపోసి త్వరగా వెళ్లిపోదాం.

అమ్మ : ఆ పొలాల్లో యెవరో మనిషి కనపడుతున్నాడు పిలువు. పిలిచి ఒక రూపాయిచ్చి మట్టి పొయ్యమని చెప్పు. మనం పోదాం.

ఖాసిం : నా దగ్గర రూపాయిన్నరే వుంది, రెండు రూపాయలకు కూడా పోస్తాడో పొయ్యడో.

అమ్మ : అయినా పిలిచిరా.

ఖాసిం : చేతులతో చప్పట్లుకొట్టి పిలుస్తాడు.

ఆ అబ్బాయి చేలో నుంచి చెయ్యి ఎత్తుతాడు.

ఖాసిం చెయ్యి వూపగానే ఆ అబ్బాయి వస్తాడు.

అమ్మ 'ఖాసింతో, ఆ అబ్బాయి రైతల్లే వున్నాడు 'మట్టి నువ్వు పొయ్యి' అని చెప్పకు, పోయించమని చెప్పు'' అని చెపుతుంది. ఆ అబ్బాయి దగ్గరకు వస్తాడు.

ఖాసిం పకపకా నవ్వి, 'సరేలే అమ్మ, మా అమ్మ కరిణీకం చేస్తే బాగుండును' అని అంటారు.

అమ్మ : యెటూ చేస్తాగా.

ఖాసిం : నువ్వు కాదుగా అమ్మ, అన్నయ్య చేసేది.

అమ్మ : నేనే చేస్తాలె. కరణాన్ని అనిపించుకోనుగాని, కరణీకం చేస్తా.

ఖాసిం: చెయ్యమ్మా చెయ్యి. రంగమ్మ తల్లి కడుపు చల్లగా, భూమిమీద పది కాలాలపాటు చల్లగా వుంటే అంతేచాలు.

అమ్మ : నా పుటకే ఆవిరి, చల్లదనమేముంది?

ఖాసిం : నీ పుటకేనా ? అందరి పుటక ఆవిరేనా?

అమ్మ : పుట్టటానికి కారణం, అకారణం. కారణాలు చూస్తే మాత్రం ప్రతి జన్మకు ఆవిరే కనపడుతుంది.

ఖాసిం : అంతేగా అమ్మా. మా అమ్మ హనుమంతయ్యగారు మాదిరిగా ఆయన పెద్దవాడయ్యేసరికి తయారవుతుంది. (భుజము మీద కర్ర బెట్టుకొని చేలో వున్న రైతు దగ్గరకు వస్తాడు) ఖాసిం యెరిగినవాడే.

ఖాసిం : అమ్మాయికి రాత్రికూడ అన్నం పెట్టించలేదు. ప్రొద్దెక్కుతున్నది, నాకు ఒక సహాయం చెయ్యి.

రైతు : యేమిటి అన్నం పెట్టించమంటావా?

ఖాసిం : యెబ్బే కాదు. రాత్రి యెవరో ముసలివాడు యిక్కడ పోయాడు. అమ్మాయిని తీసుకుని నేను త్వరగా వెళ్లాలి. ఆ ముసలివాడిమీద దోసెడు మట్టి పోయించు నాయనా, అని ఒక రూపాయి తీసి చేతిలో పెట్టబోతాడు.

ఆ అర్థరూపాయి కూడా యివ్వు అని అమ్మ అంటుంది. అసలు యేమీ వొద్దంటాడు, ఆ రైతు.

అమ్మ : నాకు పోయించవలసిన బాద్యత వున్నది తీసుకో నాయనా. అయితే యింకొకటి, అది నీకు కాదు, యిది నాకు కాదు. నాకున్నది మట్టే అనుకో ముసలివాడెంతో నీవు అంతే!

రైతు : పకపకా నవ్వి, నాపనికూడా అంతేనా యేంటి?

అమ్మ : కాదు నాయనా ! ప్రేమకు యిద్దరూ ఒకటే అన్నా. అతని పేరుతో యీ రూపాయిన్నరకు యేదన్నా చేయించు. యిచ్చేసెయ్యి ఖాసిం నీ దగ్గర వున్నదదేగా.

రైతు సరేనని ఆ రూపాయిన్నర తీసుకొని, "పోయి రండమ్మా" అని అమ్మ చెక్కిళ్లు పుచ్చుకుని ముద్దు పెట్టుకుంటాడు.

అమ్మ, ఖాసిం పది గజాలు దూరము పోగానే రైతు పరుగెత్తుకొని వచ్చి ఒక పావలా తీసి ఖాసిం చేతికి యిచ్చి, 'అమ్మాయికి దొప్పలపూడిలో యేదైనా కొనిపెట్టు' అంటాడు. ఆ ముసలితాత వున్నచోటు యిప్పుడు గరుత్మంతుడు వున్నచోటు.

సరేనని ఖాసిం తీసుకొని జేబులో వేసుకుంటాడు. 'కొనుక్కు తింటమేకాదు నాయనా యేది బుద్ధిపుడితే అది చేస్తా. మీరు చేసినపనే నేను చేయొచ్చు' అని అమ్మ అంటుంది.

రైతు నవ్వు ముఖముతో మహా 'చురుకయిన పిల్ల' అంటూ, అమ్మ వీపు తట్టుతాడు. (ఆ రైతుపేరు దేగల కోటయ్య) రైతు వెళ్లిపోతాడు.

ఖాసిం అమ్మను యెత్తుకుని రామచంద్రపురం మీదుగా దొప్పలపూడి వెళతాడు. దొప్పలపూడిలో చాలా మంది ఖాసింను యెరిగినవాళ్లే.

చిగురుపాటి నరసయ్యగారు ఖాసింతో - యెవరా అమ్మాయి?

ఖాసిం : మన్నవ కరణంగారి అమ్మాయి.

నర : ఆమెగారు (అమ్మమ్మ) పోయిందన్నారే?

ఖాసిం : ఆఁపోయింది. సంవత్సరీకాలకు అందరూ యిక్కడకు వచ్చారు. యింకా పది గజాలు దాటిన తరువాత 7 సంవత్సరముల పిల్ల 2 సంవత్సరముల పిల్లను పొట్టకు కరచుకొని చీమిడి ముక్కతో యేడుస్తూ వస్తుంది.

అమ్మ ఖాసిం భుజము మీద నుంచి కిందికి దిగి వంటినున్న చొక్కా విప్పి, ఖాసిం జేబులో వున్న పావలా తీసుకుని ఆ పిల్లల కిచ్చేస్తుంది.

ఖాసిం : వుత్త వంటితో యెట్లా వస్తా చొక్కా యిచ్చేస్తే యెట్లా, అంతకంటె అనలేక, గట్టిగా అంటాడు.

అమ్మ : నిన్న తాతగారు మూటలన్నీ తీసుకెళ్లారో ఒకటో అరో యేమైనా అట్టేపెట్టి యెళ్లారో కనుక్కో. నాన్నగారు యెక్కువగా వస్తూపోతూ వుండే యిళ్లల్లో పెడతారు.

ఖాసిం : లేదులే అమ్మా పోదాంపా (అని విసుగుతో)

అమ్మ : యీ లాగు కూడా యిప్పి యిస్తే అప్పుడు యేంచేస్తా?

ఖాసిం : అబ్బబ్బా యెల్లివస్తా వుండు తల్లీ అని వెళతాడు.

రావూరి వెంకయ్యగారి యింటికి వెల్లి మూటలు యేమైనా వుండయ్యా అంటాడు.

వెంక : మూటలన్నీ యిక్కడే వున్నయ్యి ఒకమూటే వారు తీసుకెల్లారు.

ఖాసిం : అందులో గుడ్డలమూట ఉంటె ఇయ్యండని అంటాడు.

వెంక : నువ్వే వచ్చి చూచుకో నాయనా, ఆ గదిలో వున్నయ్యి.

ఖాసిం గదిలోకి వెల్లి గుడ్డలమూట తీసి, మూట యెత్తుకెళితే అమ్మాయిని తీసుకెళ్లలేను అనుకొని గౌను తీసుకొని లాగు కూడా యిచ్చిందేమోనని లాగు కూడా తీసుకొని వెల్లేవరకు అమ్మ లాగు యిచ్చే వుంటుంది. 'నేననుకున్నంత చేసావమ్మా' అని, 'మా అమ్మకు అన్నీ తెలుస్తాయల్లే వుంది' అని లాగు, గౌను అమ్మకు తొడిగి అమ్మను భుజాన ఎక్కించుకొని పొట్ట వత్తుతూ, ముద్దులు పెట్టుకుంటూ మన్నవ తీసుకుని వెళతాడు.

6. సంవత్సరీకాలు

పునర్వివాహము చర్చ :

అమ్మ అమ్మ వయస్సు 5 సంవత్సరముల ఆరు మాసములు.

మన్నవ చేరే వరకు ఉదయం గం. 9.30లు అవుతుంది.

వూళ్లోకి వెళ్లగానే అమ్మకు యెదురుపడిన వాళ్లంతా అమ్మతోపాటు యింటికి వస్తారు. యింటికి వచ్చి తలా కాసేపు అమ్మను యెత్తుకుని 'లేకలేక బ్రతికితే చూచుకునేందుకు లేకుండా తల్లి పోయింది' అని ఆబాలగోపాలం కంటనీరు పెడతారు. పోయినరోజు యెలా వుందో యీ రోజు కూడా అలాగే వుంది. ప్రతివారు మా యింటికి పోదాం. రా, మాయింటికి పోదాంరా, అని అమ్మను పిలుస్తారు.

అమ్మ యెవరి యింటికి వెళ్లక అరుగుమీద కూర్చుని వుంటుంది. యింతలో గొల్ల నాగమ్మ వచ్చి "మన యింటికి పోదాం రామ్మా" అంటుంది. అమ్మ లేచి చివాలున నుంచుని అందరూ మా యింటికి అన్నారు. నాగమ్మ మన యింటికి అంది అని అనుకొని అమ్మ నాగమ్మకు రెక్కలు పైకెత్తి నాగమ్మ ముఖము వంక చూడగా నాగమ్మ అమ్మ ముఖము వంక చూస్తూ వుంటుంది. అమ్మ యెత్తిన చేతులు యెత్తినట్టే వుంచి దృష్టి నిలిపి దీర్ఘంగా చూచు చుండును. నాగమ్మకు రెక్కలు పై కెత్తి నాగమ్మ ముఖము చూడగా నాగమ్మ తను యెక్కడ నుంచున్నది తను చేతులు చాచినది - అమ్మను చూస్తున్నా అమ్మ చేతులెత్తింది గుర్తించక పావుగంటసేపు సూర్యకిరణాలలాగా అమ్మ నేత్రంలో నుంచి కిరణం నాగమ్మ నేత్రాల్లో గుచ్చుకుపోతుండగా నాగమ్మకు తెలియకుండానే (అమ్మ నడిజామున సూర్యుని చూచినట్లు) మిట్ట మధ్యాహ్నము సూర్యునిలాగా వున్నావు తల్లీ! ఆ

"సూర్యుని చూస్తూ వుంటే కళ్లు తెరవలేము, నిన్ను చూస్తువుంటే మూయలేము" అని అంటుంది.

చుట్టుప్రక్కల జనం 'పెంచిన మమకారం కాదూ! పురిట్లో పిల్ల దగ్గరనుంచి పెంచినదికదా ఆ మమకారం, యీ దుఃఖం, కనపడ్డదనే ఆనందంతో అనేక రకాలుగా కనపడుతున్నది ఆ ముండకు'. ఆ తరువాత నాగమ్మ యెత్తుకొని వాకిట్లోకి రాగానే తెనాలి తాతగారు, అమ్మమ్మగారు తెనాలినుండి అప్పుడే వాకిట్లోకి వచ్చి, 'పిల్లను యిప్పుడెక్కడికి? మేము పిల్లకోసము వస్తేను. దించమ్మా' అంటూ అమ్మ అమ్మమ్మగారు వచ్చి నాగమ్మ చంకలో వున్న అమ్మను యెత్తుకోపోతారు. నాగమ్మ దించబోతూ యెంత పెంచినా వారిపిల్ల గనుక గదా దించు అన్నారు. మా రంగమ్మ తల్లి అయితె అంటుంది. అని మెల్లగా అనుకుంటూ కంటివెంట నీరు పెడుతుంది.

జానకమ్మ (అమ్మ అమ్మమ్మగారు) అమ్మ నెత్తుకోబోగా, నాగమ్మ దించుతున్నా దిగక అమ్మ ఆమె దగ్గరకుబోదు.

తాతగారు వచ్చి (వెంకట సుబ్బయ్యగారు) అదే పనిచేస్తారు కాని అమ్మ వారి దగ్గరకు వెళ్లదు.

నాగమ్మ యెత్తుకొని "యిప్పుడే తీసుకొస్తా" అంటుంది.

తాత, అమ్మమ్మ : సరే తీసుకుపో, కాసేపు వుంచి తీసుకురా అంటారు.

నాగమ్మ : దారిపొడుగునా అడ్డే. యింటికి వచ్చేటప్పటికి రెండు గంటలు గడుస్తుంది.

ఖాసిం అమ్మను దించి, దొప్పలపూడి వెళ్లి సామాను కూడా తీసుకొని వస్తాడు.

లోపల పనిమీద వున్న చిదంబర్రావు తాతగారు బయటకు వచ్చి "ఖాసిం యెంత సేపయింది వచ్చి? అమ్మాయి రెండు గంటలయింది వచ్చి" అన్నారు. యింకా కనిపించలేదేం?

ఖాసిం : అమ్మాయిని వాకిట్లో దించి సామాను కోసం దొప్పలపూడి వెళ్లి తీసుకొని వచ్చానని చెపుతుండగా.

తాతగారు అడిగారేగాని ఖాసిం చెప్పే సమాధానం ఆలకించ కుండా లోపల తొందర పనిమీద వారు వెళ్లిపోతారు.

అన్నపూర్ణమ్మగారు సీతాపతి తాతగారితో "అబ్బాయి, పిల్ల వచ్చిందట చూచావా?"

సీతాపతిగారు : ఆఁ దూరంగా చూచా. అందరూ వచ్చారు. నేను దగ్గరకు పోలేకపోయినా.

యింతలో జానకమ్మగారు అందుకొని "మేము పిలిస్తే రాలేదు. మేము గొల్ల నాగాం మాత్రంగా లేము".

ఆమె తోడికోడలు అన్నపూర్ణమ్మగారు అందుకొని "అబద్ధమే ముంది దానిమాత్రంగా మనము చేయలేదుగా".

సీతాపతిగారు : (తాత) నాకు యెవరు యెక్కువ చేసారు, యెవరు తక్కువ చేసారు అనేది తెలిసి పోయిందా? నాగమ్మ రమ్మనంగానే, పెంచింది గనుక, బుద్ధి పుట్టి వెళ్లిందేమో?

జానకమ్మగారు : అది మాత్రము యెట్లా తెలిసిందయ్యా !

సీతాపతిగారు : యిప్పుడు అది అంతా ఎందుకు రేపటి నుంచి పెంచవలసినది మీరేగా. ఆ పిల్లని తల్లి సొమ్ముని మీరే తీసుకెళ్లండి. యిక్కడైనా యెవరైనా చూడవలసిందేగా !

తాత సుబ్బయ్య గారందుకొని : అసలే మంట పుడుతుంటే యిప్పుడెందుకు గొడవ. కావాలని మేనమామ కొడుక్కి అందరితో విరోధం పెట్టుకుని యిచ్చి చేస్తే కాలసినది అయిపోయినది. యెవరం పెంచినా తల్లి కాదుగదా. అందులో ఆ పిల్లమీద నాకు చేసి దాటిస్తుంది అని ప్రేమ పెట్టుకున్నా. అందరితో విరోధం, పిల్లమీద ప్రేమ.

(తాతయ్యను) సీతాపతిగారిని చూచి. నీ సంగతి అట్టేపెట్టు, ముందు వీడి పరిస్థితి యేమిటి?

తాతగారు (సీతాపతి) కళ్లనీళ్లు కారుస్తూ : పిల్లకేం పరవాలేదు. నాకు పెళ్లి అవసరం లేదు. రాఘవరావుదే బాధగా వున్నది. బుద్ధి మంతుడుగా వుంటె యే అమ్మన్నా అన్నం పెడుతుంది. అల్లరి భరించవలసిన అవసరం లేదుగా.

జానకమ్మ : సామాన్యమైన అల్లరి కాదుకదా, అది ఆ తల్లికే సరిపోయింది.

జానకమ్మ : వాళ్లమ్మ, 'నేను చస్తేగాని నీకు బుద్ధిరాదురా' అంటూ వుండేది. యికను బుద్ధి వస్తుందేమొ.

తాతగారు అందుకొని "యెందుకమ్మా వచ్చిన పని నెరవేర్చుకోండి. పిల్లల సంగతి యిప్పుడెందుకు అది వచ్చిన పని నెరవేర్చుకుని పోయింది. ముప్ఫై సంవత్సరాల కల్లా 8 మంది సంతానము కని యిద్దరిని భూమి మీద వుంచి వాళ్లను నాచేతిలో పెట్టి పోయింది".

సీతాపతి : యెవరి పిల్లలు వారికి బరువులేదు. యింకొకరు పెంచవలసి వస్తే పిల్లల గుణగణాలు ఆలోచనకు వస్తాయి.

జానికమ్మ : నాకు వేరే భయం లేదు. వీణ్ణి తీసుకెళ్లి పెట్టుకుంటే రాముడు చెడిపోతాడని భయం.

తాతగారు : నేను చెప్పింది అర్థం చేసుకోండి వొదినగారూ. పిల్లను గురించి భయం లేదు. యెవరయినా పెంచగలరు. ఈపాటున వదిలిపెడితె నాగమ్మయినా పెంచుతుంది. యెవరి మాట యెందుకు పోతూ పోతూ తల్లే చెప్పిపోయిందిగా వాడిదే బాధ అని పిల్లవాడు మీకెవరికీ అక్కర్లేదు, యెందుకీ రభస. నేనే పెంచుతా!

సీతాపతిగారు అందుకుని, "వాడేం చిన్నపిల్లవాడా, జడెయ్యాలా, నీళ్లు పొయ్యాలా. మా తిప్పలు మేం పడతాంలే".

మరిడమ్మగారు అందుకొని : నాయనా చిదంబరా జరిగేది జరుగుతుండగా, అంతల్లా యింతయింది. నాయనమ్మా నీకు నే చేస్తానే చిన్నప్పటి నుంచి చేసి చేసి రెక్కలు అరిగిపోయినయి అన్నది. దాటిపోయింది. ఒక సంవత్సరం కష్టపడితె యేతల్లో ఒక తల్లి వచ్చి కాచి పోస్తుంది.

సీతాపతిగారు కింద కూర్చున్న తుండుగుడ్డ విదిలించి వేసుకుంటూ, "వేసా యెత్తు ఆ పప్పులేం వుడకవు. 39 ఏళ్లు వచ్చినా యింకా యేం పెళ్లి?" అంటూ బయటకు వెళ్లిపోతాడు.

వాళ్ల కర్మకలాపంలో వాళ్లు వుంటారు.

మమకారం :

అమ్మ నాగమ్మగారి యింటివద్ద కూర్చుని చిన్నప్పటి విషయాలు గుర్తు వున్నదానిలాగా ఆచోట్లన్నీ వెతుక్కుంటూ నాగమ్మతో మీ అమ్మాయి యేది? అంటుంది.

నాగమ్మ : నవ్వి మా అమ్మాయి యెవరో నీకు తెలుసా!

అమ్మ : నాకు అప్పుడు పాలు యివ్వలా, సుబ్బలక్ష్మి అటగా పేరు.

నాగమ్మ : నీతో యెవరు చెప్పారమ్మా?

అమ్మ : యెవరో చెపితే విన్నా.

చాకలి సుబ్బాము అందుకుని : అందరూ చెప్పుకుంటూవింటే విన్నదికామన్నులె దాంట్లో యేముంది?

నాగమ్మ : నేను అంత తేలిగ్గా అనలేకపోతున్నా. చెప్పుకుంటే మాత్రం గుర్తుపెట్టుకుని నన్నే అడగటం గుర్తు వుండొద్దు.

కాట్రపాటి లక్ష్మీనారాయణ గారి భార్య, సుబ్బమ్మ గారు : చిన్నప్పటి నుంచి చురుకైన పిల్లలే !

పొలం నుంచి నాగమ్మ కూతురు వస్తుంది.

యింతలో అమ్మను చూడగానే ఆనందంతో యెదురుగుండా వున్న మండిగం కూడా కనపడక "మాయమ్మ వచ్చిందే" అని అరుస్తూ మండిగం తగిలి ముందుకు పడుతుంది. చేతులు అమ్మ పాదాలకు తగుల్తాయి. లేవబోయేటప్పుడు పాదాలకు చేతులు వత్తిడి తగిలి కందుతాయి.

నాగమ్మ : పిల్ల కాళ్లు చూడు కనపట్టల్లా?

సుబ్బలక్ష్మి : (నాగమ్మ కూతురు) యేమీ కనపడలేదమ్మా పాదాలే కాదు యేంటో మాయ కప్పినట్టు అయిపోయింది చూడగానె. పాదాలు చేతికి తగలంగానే యేంటో లాగినట్టయింది.

సుబ్బమ్మగారు : నీ కడుపులో వుండే ప్రేమే లాగింది.

అమ్మను సుబ్బలక్ష్మి చేతిలోకి తీసుకుని అమ్మా పాలు తాగుతావా?

అమ్మ : ఆకలి లేదు. యిక్కడ నా పాలు లేవుగా.

సుబ్బలక్ష్మి : రోజూ యేపాలు తాగుతా ?

అమ్మ : యెప్పుడన్నా కాచిన పాలిస్తారు గేదెపాలు.

సుబ్బలక్ష్మి : అదేనా నీ పాలంటే ? నీపాలు నా దగ్గరున్నయ్యి తాగమ్మా. ఒక్కసారి యిస్తేగాని తృప్తి వుండదు.

అమ్మ : నీకోసమేగా యివ్వటం. నాకోసం కాదుగా?

సుబ్బలక్ష్మి : నీకొరకేగా యివ్వటం.

అమ్మ : నేనెక్కడున్నా వచ్చి యిస్తావా? యిన్నాళ్లనుంచి రాలేదేం?

నాగమ్మ : మా అమ్మ దెప్పుతున్నది, పోట్లాడుతున్నది.

సుబ్బలక్ష్మి : నేను వొచ్చా అమ్మా ఒక రోజున బాపట్ల. నాన్న వూళ్లో లేడు. తాతమ్మ నిజామాబాదు వెళ్లింది. నీవు యెక్కడో ఆడుకోబోయినావని చెప్పారు. తెల్లవారే పాటికి నిద్రపోతున్నావు. చూచి వచ్చానమ్మా. లేవకొట్టకుండా.

అమ్మ : నిన్ను కాదమ్మా పాలిచ్చే ఆమెని.

సుబ్బలక్ష్మి : నేను రోజూ అనుకుంటా తల్లీ, యీ కాపురములో బయటకు వచ్చేటందుకు లేదు. యేరోజు కూలి ఆరోజు తెచ్చుకోవాలి. రోజూ పిల్లకు పాలిస్తూ నీవే తాగుతున్నా వనుకుంటా, "యాద్నర్థము పిల్లను చూపించి" యీ పిల్లకు నీపేరు పెట్టుకున్నా.

అమ్మ : అప్పుడు యింక నాకు పాలు యివ్వటమెందుకు ?

సుబ్బలక్ష్మి : లేనప్పుడు వున్నట్టుగా చూసుకోటానికమ్మా.

అమ్మ : వున్నప్పుడు కూడా లేనట్టుగా చూసుకో.

సుబ్బలక్ష్మి : ఆమాట అనబోకు అమ్మా. వున్నప్పుడు కూడా లేనట్టు చూసుకోలేనమ్మా. ఆమాట బాధగా వున్నదమ్మా. (రెవిక తీసి) పాలు తాగు, నీవు పాలు తాక్కపోతే నేను అన్నం తినను అని బలవంతంగా నోట్లో పెడుతుంది.

అమ్మ : మెల్లిగా రెండు గుటకలు వేస్తూ నా పాల భాగము సుబ్బలక్ష్మి గామాలు, అని తాగుతూ వుంటుంది.

సుబ్బలక్ష్మి : (యీ వయస్సుకు) పోయిన పిల్లల అందరి తెలివి, రంగమ్మ తల్లి తెలివి అన్నీ యీ అమ్మకు వొచ్చాయి. పోయిన పిల్లకూడా తెలివిగలదే. ఆ పిల్లపేరు లక్ష్మి. యిట్లాగే మాట్లాడేది.

పాలు తాగేటప్పుడు సుబ్బలక్ష్మి లోగడ మామూలుగ తన పిల్ల తాగుతున్న దానికంటే యెక్కువ హాయిని అనుభవించును. పాలు పళ్లు వచ్చిన పిల్ల తాగుతున్నట్టుగా వుండదు. ఇది నా మమకార మేమోలే అని సుబ్బలక్ష్మి తృప్తి పడుతుంది.

పాలు తాగుతూ వుండగా అమ్మ సుబ్బలక్ష్మి ముఖం వంక చూస్తూ తాగుతుంది. సుబ్బలక్ష్మి, అమ్మ పాలు తాగేటప్పుడు ముద్దు పెట్టుకోటానికి మెడ వంగడు. అది అమ్మ గుర్తించి చెయ్యి అందించినట్లు, మూతిమీద పెడుతుంది. ప్రపంచంలో యింతకంటె సుఖమేముందని పాలు తాగుతూ తాగుతూ వున్న అమ్మను పొట్టకు హత్తుకుంటుంది.

అమ్మ సుబ్బలక్ష్మి ముఖము వంక చూచి, చాలు పాలు అని వొళ్లోనుంచి కిందకు దిగి నాగమ్మ వంక చూచి 'పాలు చాల్లె, నాకు కాసిని నీళ్లు పొయ్యి' అని అంటుంది.

నాగమ్మ : యివాళ నీళ్లు కావాలని అడుగుతున్నావా? యిది వరకు పోసిన నీళ్లు గుర్తున్నయ్యా.

అమ్మ : గంగరావి చెట్టుక్రింద నీళ్లు పోసుకున్నట్టు గుర్తు.

నాగమ్మ : గుర్తెందుకుండదులే, సంవత్సరం నాలుగు మాసాలేగా.

సుబ్బలక్ష్మి : అయినా యింత చిన్నపిల్లకు యింత గుర్తేమిటో అంతా ఆశ్చర్యం కలిగించే లక్షణాలే. యిదేముంది పాలు తాగేటప్పుడు నేను అనుభవించేది యింకెవరయినా అనుభవించితే బాగుండు ననిపించింది.

యింతలో అమ్మను తీసుకెళ్లటానికి నల్ల ఖాసిం వస్తాడు.

ఖాసిం : అమ్మా, నిన్ను, నాన్నగారు తీసుకురమ్మంటున్నారు.

అమ్మ : నువ్వు నిజంగా చెప్పు. నాన్నగారా, తాతమ్మా (మరిడమ్మ)

ఖాసిం : నవ్వుతూ, మీ నాన్నగారే.

అమ్మ : అబద్ధ మాడకుండా అంటున్నాను అను.

ఖాసిం : అబద్ధమాడకుండా తాతమ్మ రమ్మన్నది.

అమ్మ : నాన్న అక్కడే నుంచున్నారా? తాతగారు చూస్తూ తొందరగా తొందరగా అనలా.

ఖాసిం : నేను వచ్చేలోగా అక్కడ నుంచి యెవరయినా వచ్చి పోయారా. నాకెవరూ యెదురు కాలేదు.

సుబ్బలక్ష్మి : యెందుకు యెదురు రావటం. అక్కడ అట్లాగే జరిగి వుంటుందా? అమ్మాయిగారి లక్షణాలన్నీ విశేషంగానే వుంటాయి. కనుక్కునే వుండొచ్చు.

ఖాసిం : అమ్మ ముఖము వంక కన్ను ఆర్పకుండా చూస్తూ వుంటాడు.

సుబ్బలక్ష్మి : ఖాసిం యెందుకు అట్లా నించున్నావు? (వినపడదు. ఖాసిం, ఖాసిం అని రెండుసారులు పిలిచినా అతను మాట్లాడడు. అక్కడ జరిగిందే అమ్మ అని వుంటుంది. అందువల్ల ఆశ్చర్యపడి అమ్మలో అక్కడ జరిగినవన్నీ చూస్తున్నాడు. అందువల్ల పిలిచినా పలకటం లేదు.)

నాగమ్మ : యేమో యేమైపోతాడో ఖాసింకు బుంగెడు నీళ్లు తెచ్చి నెత్తిన పోయవే. యేం జబ్బో, చాకలి లక్ష్మాయల్లె అయిపోతాడేమొ.

అమ్మ : చాకలి లక్ష్మాయిని గురించి యేమిటి నీ వుద్దేశ్యం. నీకు జబ్బుగాదు యిది. అని అమ్మ ఖాసిం చెయ్యి పట్టుకుని వెళదాం రా యింటికి అనగానే అతనికి స్పృహ వస్తుంది. నిద్రపోయి లేచినవాడి మాదిరిగా వుంటాడు. "ఇదేనా జబ్బు, దొంగజబ్బులు" అని అమ్మ చెయ్యి పట్టుకుని యింటికి తీసుకెళుతూ వుంటుంది. ఖాసిం దారి తెలిసిన వాడిమాదిరిగా వుండడు.

అపరిమిత సంతోషం :

దారిలో మన్నవ చన్నయ్యగారు కనపడి, "యేం ఖాసిం అట్లా వున్నావు".

ఖాసిం మాట్లాడకుండా అమ్మవెంట వెళుతూ వుంటాడు.

చన్నయ్యగారు ఖాసిం నుద్దేశించి "నీకెంత గర్వంరా", అమ్మకే వినపడుతుంది. ఖాసింకు వినపడదు.

అమ్మ : యిటువంటి రోజు నీకూ వున్నదిలే అందరూ నిన్నూ అట్లాగే అనుకుంటారులే అని చన్నయ్యగారిని అమ్మ మెల్లగా అంటుంది.

చన్నయ్యగారు : (వినపడక), యేమిటమ్మా నీవు అన్నది, మళ్లీ అను.

అమ్మ : ఖాసింను అన్నది నీవు మళ్లీ అను.

చన్నయ్యగారు నవ్వి. చేతిలో చుట్ట అరుగుమీద పెట్టి అమ్మ దగ్గరకు వచ్చి, రెక్క పట్టుకుని అమ్మను తీసుకెళ్లి అరుగుమీద కూర్చోపెట్టుకుని (ఖాసింతో) రావోయి, రా, వస్తుందిలే, రా.

ఖాసిం మయికంలో వుండి, రాకుండా అక్కడే నిలబడతాడు.

చన్నయ్యగారు : అమ్మా యింతకూ నీవెవరమ్మాయివి?

అమ్మ : నేనెవరమ్మాయినని తీసుకొచ్చావు?

చన్నయ్యగారు : అమ్మాయివని ముద్దొచ్చి తీసుకొచ్చా.

అమ్మ : యింకా యేం నేను ముద్దు అమ్మాయిని.

చన్నయ్యగారు : యింకా నయం. ముద్దు అమ్మాయి అన్నావు. మొద్దు అమ్మాయి అనలా అని వీపుమీద తట్టును.

అమ్మ : అవును మొద్దు అమ్మాయినే నేను మొద్దు అమ్మాయిని నీవు ముద్దు మొద్దుగా పెట్టుకున్న అబ్బాయివి.

చన్నయ్యగారు అరుగుమీద కూర్చున్న అమ్మను వొళ్లో కూర్చోబెట్టుకుని, "నీవు మా సీతతో ఆడుకుంటావా?"

అమ్మ : సీత అంటే రాములువారి భార్య సీతా? నీవు జనక మహారాజువా?

చన్నయ్యగారు : చిదంబరరావుగారి పెంపక మనిపిస్తున్నది. యింత చురుకేమిటి? పెంచినా ఆయన కూతురుకు రాలేదుగా యీ తెలివి!

అమ్మ : తెలివంటే పెంచినవాళ్లను బట్టి వుంటుందా? వాళ్లిస్తారా? తెలివి యెక్కడ వుంటుంది? యెట్లా వుంటుంది? తెచ్చుకోవాలంటే తెచ్చుకోగలిగింది, యివ్వాలంటే యివ్వగలిగిందేనా తెలివి. లేక బజారులో దొరుకుతుందా?

చన్నయ్యగారు అమ్మను వొళ్లో కూర్చోబెట్టుకున్నప్పుడు చెన్నయ్యగారు అమ్మ పొట్టమీద చెయ్యి పెట్టుకుని వుంటారు. అది అట్లాగే వుంటుంది. అమ్మ ముఖము వంక అయిదు నిమిషములు చూసి కళ్లవెంట బొటబొట నీళ్లు కారుస్తూ

ఆ మహాతల్లి చూచుకో కుండా దాటిపోయింది. అన్నం పెట్టిద్దామంటే అందరి భోజనాలు అక్కడే కదా? అమ్మా నువ్వు వొడ్డిస్తావా?

అమ్మ : యింతసేపటి నుంచి వడ్డించినవి చాలలా? అవే తిను!

చన్నయ్యగారు : (నవ్వుచూ), యింకా పెట్టమ్మా!

అమ్మ : అవసరమైతే నువ్వు ఆడక్కుండానే యింకా యింకా పెడతా.

ఖాసిం నేలవంకచూస్తూ నిలబడి వుంటాడు. అదిచూచి చన్నయ్యగారు.

చన్నయ్యగారు : (ఖాసిం విషయం అమ్మ నుద్దేశించి) యేమిటి యితని పరిస్థితి?

అమ్మ : యీ గంటనుండి మీరు నాతో కాలం గడపటానికి యేస్థితో అతనిది అదే స్థితి.

చన్నయ్యగారు : నాకు ముద్దువొచ్చి తీసుకొచ్చుకున్నాను.

అమ్మ : నీకు వచ్చిన సంతోషం పరిమితిగా వుండి ముద్దు పెట్టుకున్నావు. అతనికి అపరిమితమయిన సంతోషం కలిగి అట్లా వున్నాడు.

చన్నయ్యగారు : మా దొడ్లో చిన్న బాదం కాయంత లేవు, యెన్నిమాట్లో!

అమ్మ : అన్నీ మాటలే. మాటాడేవన్నీ మాటలే.

చన్నయ్యగారు : అవునులేవమ్మా మనవూళ్లో చలమరాజు వుండేవాడు. వాడు పోతూ నిన్ను పెట్టి పోయాడు. వాడికీ యింత తెలివి లేదు.

అమ్మ : యింత తెలివి అంటున్నారు. తెలివి అంటే యెంతెంత వుంటుంది? యెట్లా వుంటుంది? నీవు వొడ్లు కొలుస్తూ వుంటావె, ఆ మానికతో కొలవటానికి అందుతుందా తెలివి?

చన్నయ్యగారు : అట్లా అందేది కాదమ్మా.

అమ్మ : మరి చలమరాజుకు కూడా యింత లేదన్నావుగా. నాదెంత వున్నది ఆయనకెంత తక్కువుంది, షుమారు చెప్పులే. నీవు వొడ్లు కొలిచినాక క్రింద మిగిలిన పోగు సోలెడో, తవ్వెడో వుంటాయని చెపుతుంటావుగా? అట్లాగే చెప్పు యింత అని. లేకపోతే తెలియని వాడివి యెందుకు అన్నావో అదయినా చెప్పు!

చన్నయ్యగారుః నేను ప్లీడరును కాదమ్మా.

అమ్మ ః మాట్లాడేటప్పుడు ప్లీడరు ననుకొని మాట్లాడావా? యిందాక అవుననుకొని, యిప్పుడు కాదనుకొని తెలుసుకొనిన నీ తెలివేనా నీవు అనే తెలివి?

చన్నయ్య ః దెబ్బ కొట్టావే.

అమ్మ ః ఎక్కడ తగిలంది నాయనా.

చన్నయ్య ః నీ దెబ్బ వొళ్లంతా తగులుతుంది. యెవరయినా కొడితే ఒకచోటే తగులుతుంది.

తాతగారి యింటినుండి చన్నయ్యగారిని మడికట్టుకొని భోజనమునకు రమ్మని కబురు వస్తుంది.

అమ్మ అరుగుదిగి ఖాసిం దగ్గరకు వెళుతుంది.

చన్నయ్యగారు ః మనమిద్దరం కలసి పోదాం వుండమ్మా నేనూ వస్తాను.

అమ్మ ః మేము యిద్దరమే కలిసి పోతున్నాము. మేము యిద్దరము వస్తే మనము యిద్దరము అంటావు యేమిటయ్యా, మనము ముగ్గురమూ అనలేవు. (అంటూ ఖాసిం చెయ్యి పట్టుకుని అమ్మ వెళుతుంది).

చన్నయ్యగారు లోపలకు వెళతారు.

అమ్మ యింటికి వెళ్లంగానే, అమ్మకు, (రాఘవరావు) మామయ్యకు పురోహితుడు అక్షితలు తీసుకుని వచ్చి ఆశీర్వచనము చేస్తాడు.

తాతయ్య ః అమ్మా! నీవు ఈ మూడు రోజులు యెక్కడికి వెళ్లమాక అంటాడు.

అమ్మ ః నేను వెళ్లలా, నన్ను తీసుకువెళ్లారు.

సాయంత్రం నాలుగు గంటలు అవుతుంది.

ఈ మూడురోజులు మామూలుగా గడిచిపోవును. నాల్గవరోజు ఎక్కడివారక్కడ వూళ్లకు వెళ్లిపోతూ వుంటారు. తెనాలి తాతగారు అమ్మమ్మగారు అమ్మను మాదగ్గరకు పంపమని అడుగుతారు సీతాపతి గారిని.

సీతాపతితాత ః నా అభ్యంతరము లేదు తీసుకెళ్లండి.

మరిడమ్మ ః పిల్లల్నిగూడ వదిలిపెట్టి వుండొద్దు నేనున్నానుగా యీలోగా నీవు ముడిపెట్టుకుందువుగాని.

సీతాపతి : ఆ మాటలు అనవసరముగా మాట్లాడబోకు పంపించేస్తే బాధ్యత తీరిపోతుంది.

మరిడమ్మ : ఎక్కడున్నా నీకున్న బాధ్యత నీకున్నది. నీవనుకుంటున్నావు కాబోలు, పిల్లను పంపించేస్తాను, పిల్లవాడికి పెళ్లి చేస్తానని నీనోటి మాటలేనా, కాలం రావొద్దు!

జానకమ్మ : (తెనాలి అమ్మమ్మ) ఇంతకూ సంగతేమిటో తేల్చండి. మీ యిరువురు తరువాత పోట్లాడుకుందురుగాని.

తెనాలి తాతగారు : అవన్నీ తరువాత చూద్దాం నీవుకూడా వచ్చి పిల్లని అలవాటుచేసి వద్దువుగాని, రారా.

సీతాపతి తాతగారు : నేను యెక్కడికి రానండి. పిల్లను అంతా తీసుకెళతామంటారు, వాడి సంగతే అర్థంకాకుండా వుంది. అటువంటి దుడుకు పిల్లవాడిని యెవరు భరిస్తారు, నాకే విసుగు తల్లికి మినహా తల్లికి తప్పదు.

అమ్మ : (తలవంచుకుని) తల్లికి తప్పదు కాదు, తల్లికి తప్పే కనపడదు.

చిదంబర్రావుగారు : అమ్మ వంచిన ముఖము పైకెత్తి మళ్లీ అనమ్మా.

అమ్మ : మీరు ఎంతవరకూ విన్నారో అది అనండి తరువాత అంటా.

చిదంబర్రావు : మా అమ్మ "లా" చదువుకుంటె బాగుండేది.

అమ్మ : అసలే చదువులేని దానికి 'లా' చదువు యేమిటి. మీరేమి చదువుకున్నారు?

చిదంబర్రావుగారు : అదేలే "లా".

అమ్మ : నన్నెందుకు 'లా' చదువుకోమన్నారు ?

చిదంబర్రావుగారు : అబ్బబ్బా వదిలిపెట్టదు యిదే 'లా' అంటే.

అమ్మ : యిదేనా మీరు చదువుకోమంది. యింకా చదువుకోవటమెందుకు?

తెనాలి తాత : యేమిటి తాత మనుమరాలి సంభాషణ, ఈమె మీతో బాపట్ల వస్తానంటున్నదా? (వారు మాట్లాడిన మాటలు వినిపించుకోక అడుగుతాడు)

చిదంబర్రావుగారు : లేదు లేదు మా గొడవ వేరులే. అయినా యింతవరకూ యేమి తేల్చారు. రైళ్లు అందవు, త్వరగా వెళ్లాలి. సరే నేను చెపుతా వినండి. ప్రస్తుతం అందరం బాపట్ల పోదాం. అన్నీ తీసుకువెళదాం. గొడ్లు, వడ్లు వడుగు అయిన తరువాత యెవరు యెక్కడ వుండవలసినది ఆలోచిద్దాం.

సీతాపతిగారు : మీరంతా వెళ్లండి. నేను తరువాత వస్తా.

అమ్మ : నేను మా నాన్నదగ్గరే వుంటా.

సీతాపతిగారు : మీ నాన్నా! నీవు యిక్కడ వుంటే అన్నం యెవరు పెడ్తారు తల్లీ?

అమ్మ : నీకు పెట్టేవారే నాకూ పెడతారు. పోనీ నేనె వండుతాలె.

చిదంబర్రావుగారు : వండక్కర్లేదు. తింటేచాలు, వండినంత పుణ్యం. నిన్ను వదిలిపెట్టి నేనుండలేనమ్మా.

అమ్మ : నన్ను వదిలిపెట్టి నీవుండొద్దు, నాన్నను వొదిలిపెట్టి నేనుండొద్దు అందరమూ ఒకేచోట వుందాము.

సీతాపతి తాతగారు : యేది యెట్లా మారుతుందో చెప్పలేను.

చిదంబర్రావుగారు : నీవు చెప్పవద్దులే. నేను చెప్పినట్టు చెయ్యి.

సీతాపతి తాతగారు : సరే ఒక వారము ఉండి నేను ఇంటికి తిరిగి వస్తా.

అన్నీ సర్దుకుని ఉదయం గం. 9.00 భోజనాలు చేసి బయలు దేరుతారు.

చింతల తోపు :

అమ్మ ముందుగా బయలుదేరి మురుగు కాలవ కట్టమీద కూర్చుని వీళ్ల రాకకై యెదురుచూస్తూ "నన్ను వదలిపెట్టి వెళితే బాగుండు వీళ్లు" అనుకుని చింత చెట్టెక్కి యెత్తుగా కూర్చుంటె అందరిళ్లూ కనపడుతున్నాయి. అమ్మ మనస్సులో యీతోపంతా చింతలతోపె. యీవూరు చుట్టూ చింతలే చింతల్లో చాల రుచులు కూడా వున్నయ్యి, అని ముదిరిపోయిన కాయ నవులుతూ ఒకే చెట్టుకు ఒకసారిగానే చిన్న చిన్నకాయలూ, పెద్ద కాయలూ, పూలూ చిగురూ దానికున్న లక్షణాలన్నీ బయటపడితే దీని స్థితి యెట్లా వుంటుంది. అన్ని లక్షణాలు కలిగిన చెట్టయినా ఒకేసారి చూపించలేక పోతున్నది. ఆ లక్షణాలు, గుణములు కూడా కాలానికి

కట్టుపడుతున్నాయి. అనుకుంటూ యింకా చివర కొమ్మకు వెళ్లి నుంచోగానే కొమ్మ చిటుక్కున విరుగుతుంది. విరిగినదాని పక్క కొమ్మను పట్టుకుని, విరిగింది మధ్యకొమ్మ నాకు ఆధారమైంది పక్కకొమ్మ విరిగినదానికంటె సన్నని కొమ్మ విరగటానికి కారణం యేమిటో, అని యింటివైపు చూస్తూ యిదే మొదలు చింత చెట్టు యెక్కటం, యెక్కిన కొమ్మ విరగటం. లోగడ చిట్టి కేసరవు చెట్టు, బాదం చెట్టు, కొబ్బరి, తాడి చెట్లు యెక్కటం జరిగింది గాని యే ప్రమాదము జరుగలేదు. బాదము చెట్టు పెళుసు అంటారు గాని విరగలేదు. పాల మనిషి చిట్టి కేసరపు కొమ్మలు కావాలమ్మా, బర్రెకు మేత లేదు. ఆపాలు అమ్ముకుంటే గాని అన్నంలేదు అని యేడిస్తే అప్పుడు ఆ చెట్టు యెక్కినప్పుడు గూడా ప్రమాదం జరగలేదు. చాలా పెళుసు అంటారు. యింతకూ అన్నింటికీ కాలమే ఆధారం. కొబ్బరిచెట్లు తాడిచెట్లు కారణం కాదు; అనుకుంటూ మళ్లీ విరిగిన కొమ్మనే పట్టుకుని యింకా పైన జానపాడుగు వున్న చిటారుకొమ్మ యెక్కి యేదీ పట్టుకోకుండా నిలబడి వూరు నాలుగు వైపులా చూచి యీ కొమ్మ యిప్పుడు విరగదేం, వూరంతా చూపిస్తున్నది పైగా కొమ్మ చూపిస్తున్నదా, వూరు కనపడుతున్నదా దానికై అది నేనే చూడగలుగుతున్నానా? మూడు వున్నయ్యిలె, మూడూ నేనేగా, చెట్టు ఉన్నదని గుర్తించింది నేను, మరొక కొమ్మ నాధారము చేసుకొంది నేను. చిటారు కొమ్మ కెక్కింది నేను, వూరు నాలుగు వైపులా చూచింది నేను. యిదంతా నేనేనని అనుకున్నది నేను.

యింతలో ఒక ముసలి ఆయన కనపడి 'యీ చెట్లు వేసింది నేను' అని అనుకుంటూ అమ్మను చూడకుండా చెట్టుకిందగా నడచి వెళతాడు.

అమ్మ : అదుగో అదే నేననుకున్న నేను అదే యెవరికివారు నేను అనుకుండే నేనే నేననే నేను. అంతా నేనైన నేను, నీవుగా చూడాలంటే నేను నీవై చూస్తాడు. నేను నీవు వేరుగా చూడలేడు. అదే నేననే నేను. యిదే నేతి నేతి మహావాక్యాలు మా తాతమ్మ మరిడమ్మగారు మొన్న యెవరికో చెపుతుంటే విని "నేతి నేతి" అంటే యేమిటి అని అడిగితే చెప్పలేదు. దాని సారం యిదే. పక్కచెట్టు క్రింద వున్న తాతగార్ని చిటారు కొమ్మమీద వున్న అమ్మ "తాతగారూ తాతగారూ" అని పిలవగా పున్నయ్య తాతగారు నాలుగు మూలలా జూచి కేక యెక్కడో అంతుపట్టక చివరకు చిటారు కొమ్మవంక జూచి అదిరిపోయి అమ్మో! పొన్నచెట్టుమీద కృష్ణుడు కనపడుతున్నాడు, నుంచున్నాడు రండర్రో! అని పెద్దగా కేకవేసి అనుకోకుండా నమస్కారము చేసి. చెట్టు క్రిందకు పరుగెత్తుకు వస్తారు. యీ కేక వూరంతా

వినపడ్డది అని అనుకుంటాడు. (అమ్మ నుంచున్న కొమ్మకు పైన యింకా యే కొమ్మలు లేవు అనగా వృక్షాగ్ర భాగాన పక్క ఆధారము లేకుండా నిలబడి వుంటుంది)

అమ్మకు వయస్సు 5 సంవత్సరముల 6 మాసములు.

చెట్టు క్రిందకు వచ్చి తలయెత్తి పైకిజూచి కనపడక అయ్యో అయ్యో కృష్ణుడేడి? కృష్ణుడేడి? అని పక్కరోడ్డు మీదకు పరుగెత్తుతాడు.

అమ్మ అట్లాగే వృక్షాగ్రాన నిలబడి అమ్మ చూస్తూ వుంటుంది. పున్నయ్యగారు వెళ్లినచోటు నుండి తిరిగి చూస్తాడు. యిందాక కనపరిచిన దృశ్యానికి కృష్ణునికి తలకు వెనుక భాగమున ఒక చక్ర మున్నట్లుగా కనపడును. అదుగో కృష్ణుడు, చక్రధారి వస్తున్నాడని పాడుకొనుచు నృత్యము చేస్తాడు.

(పున్నయ్యగారు కృష్ణ భక్తుడు. అమ్మ కృష్ణుడుగా దర్శన మిచ్చు చుండును).

అమ్మ మెల్లగా చెట్టుదిగి, నృత్యము చేయుచున్న పున్నయ్యగారి దగ్గరకు వెళ్లి "తాతయ్యా యేమిటి ఆడుకుంటున్నావు. నేను గూడా వచ్చేదా ఆడుకోటానికి? యీ ఆట పేరేమిటి? పలుకు? వచ్చాడా, వస్తున్నాడా? అనగానే నృత్యము చేస్తున్న పున్నయ్యగారు అమ్మను కౌగలించుకుని యెత్తుకుని భుజము మీద పడుకోబెట్టుకుని వూళ్లోకి పరుగెత్తుతాడు. (అమ్మ యిప్పటికి కృష్ణుడుగానే దర్శనమిచ్చు చుండును). వూళ్లోకి రాగానే యిల్లు గుర్తించక వూరంతా తిరుగుతూ వుంటాడు.

వూరు ప్రజలంతా కృష్ణభక్తుడుగాదు! - తల్లిలేని పిల్లను జూచేవరకు ఆవేశముతో ఆమెను యెత్తుకుని నామము చేసుకుంటూ వూరువెంట తిరుగుతున్నాడు అని అనుకుంటారు. మరియు ఎప్పుడూ బజార్ల వెంట తిరగనివాడు యిప్పుడు యిలా తిరుగుతున్నాడు, పిచ్చిగూడ ఎక్కుతుందేమొ ననుకుంటారు. ఆయన తమ్ముడు గంగరాజు రామసుబ్బయ్యగారు అన్నగార్ని వెంబడిస్తాడు, పిచ్చి యెక్కిందేమోనని భయపడి.

గంగరాజు పున్నయ్యగారు తన యిల్లు గూడ గుర్తించనివాడు, వూరుచుట్టూ మూడుసారులు ప్రదక్షిణము జేసి మూడోసారి సీతాపతి తాతగారి యింట్లో ప్రవేశించగానే నామము ఆగిపోయి నిశ్చేష్టుడై వసారాలో అలాగే నిలబడి వుంటాడు. అమ్మ దిగటానికి కూడా వీలులేని స్థితిలో పున్నయ్యగారు చేతులతో గట్టిగా బిగించి వుంటారు.

మరిడమ్మ తాతమ్మగారు : (లోపల నుండి బయటకు వచ్చి) యిదేమిటిరా పున్నయ్యా, అమ్మాయి నెత్తుకొచ్చావు. మీ యింటి కొచ్చిందా! పోతూ వాళ్లమ్మ చెప్పిపోయిందేమొ నీదగ్గరకు వెళ్లమని, నీ దగ్గర కృష్ణమూర్తి వుంటాడుగాదూ!

గంగరాజు పున్నయ్యగారు : వుంటాడేమిటి? వున్నాడు. యిదిగో వున్నాడని పెద్దగా అరుస్తాడు. ఈ అరుపు విని ప్రయాణాలై అపశకునమని ఆగిన ఇంట్లో వున్నవారంతా 'ఆయన చూడు ఎంత ఆనందంగా కాలం గడుపుతున్నాడో,'' అని వచ్చిచూడగా అమ్మ ఆయన భుజాన వుంటుంది. చేతులు వదిలి నృత్యము చేయుట ప్రారంభం చేస్తాడు. అమ్మ పడుతుందేమోనని చిదంబర్రావుగారు తీయబోతే అమ్మ భుజము మీద కరుచుకుని రాదు. యేంబెట్టి కరిపించాడీయన? అని గట్టిగా లాగబోతె.

అమ్మ : ''ఆయనలో వున్న నేను, నాలో వున్న నేను బెట్టి అతికించాడు''.

చిదంబర్రావుగారు : అయితే ఆత్మ పెట్టియా?

అమ్మ : ఆత్మ పెట్టేది గాదు ఆవరించేది. ఆవరించే వున్నది.

చిదంబర్రావుగారు : ఆ మాటకు అర్థము వివరంగా జెప్పు.

పున్నయ్యగారు : నృత్యము ఆపి అమ్మను మామూలుగా యెత్తుకుని వింటూ వుంటాడు. తెలిసీ తెలియని స్థితిలో

అమ్మ : ఆత్మఅంటే నేచెపుతా. నాకు తెలియదు యెవరన్నా చెప్పకుండేవి చెపుతా, దానికి చెప్పాలంటే చాలా అర్థముంది. ఒక్క మాటలో చెప్పాలా? అమ్మ బుజము మీదనుండి క్రిందికి జారి గుండ్రని సున్నా నేలమీద చుట్టి, ''యీ సున్నాలో ముఖ్యమైన ప్రదేశమేది?''

చిదంబర్రావు : సున్నా లోపల చెప్పమంటావా? సున్నాకు చుట్టటానికి ఆధారం చెప్పమంటావా?

అమ్మ : సున్నాలో తెలిస్తే యిది చెప్పినట్టే.

చిదంబర్రావు : గీటు కాకుండానా ?

అమ్మ : లోపల వున్న ప్రదేశము.

చిదంబర్రావు తాతగారు : అంతా ముఖ్యమే.

అమ్మ : గీటు మీద యేది ముఖ్యము ?

చిదంబర్రావు తాతగారు : బయలుదేరించి ముఖ్యము.

అమ్మ : బయలుదేరటానికి యేది ముఖ్యము ?

తాతగారు : సంకల్పము.

అమ్మ : వేలు, గోరు, బూమి యీ మూడు ముఖ్యము కావా? సంకల్పము దాకా పోయారు.

చిదంబర్రావు గారు : యీమూడు సంకల్పానికి సంబంధించినవేగా !

అమ్మ : సంకల్పము ఆకృతి లేనిది. యీమూడు ఆకృతి కలిగినవి. సంకల్పము కాదని కాదు, యీ మూడు చెప్పి సంకల్పం దగ్గరకు వెళ్లాలి.

తాతగారు : (నవ్వుతూ) అక్కడ యెందుకెళ్ల గూడదు?

అమ్మ : వెళ్లగూడదని కాదు. క్రమంగా వస్తే, కానిదేమిటో తేలుతుంది అని.

తాతగారు : "యింత తలకాయెక్కడిదో" అని అనుకుంటారు.

అమ్మ : మీ అందరికి యెక్కడదో నాకు అక్కడదే మీ అందరూ యెక్కడ తెచ్చుకుంటే నేను అక్కడే తెచ్చుకున్నా. అయితే మీరు యెక్కడ తెచ్చుకున్నారు?

తాతగారు : అబ్బబ్బా జీడి.

అమ్మ : నీవు కొనిపెట్టే జీడిపప్పా? అదే అనుకుంటే నన్ను అంతా తింటారేమొ! అట్లా నన్ను చూస్తేగా తింటానికి.

తెనాలి తాత వెంకట సుబ్బయ్యగారు : నేను తింటా రా అని కొరుకుతారు.

అమ్మ : తినటమంటే కొరకటమా ?

వెంకట : సీతాపతీ యెందుకు? యిచ్చేదేముడు మర్చేపోతే, నీ కూతురు బ్రహ్మాండమే !

అమ్మ : "నేను బ్రహ్మాండం, మీరు బ్రహ్మాండంలోని వాళ్లు"

చిదంబర్రావు తాతగారు : యెట్లా నీవు బ్రహ్మాండానివి?

అమ్మ : మీ అన్నగారేగా అన్నది.

చిదంబర్రావుగారు : అన్నదల్లా వొప్పుకుంటావా?

అమ్మ : జరుగుతున్నది అదే. ముందు జరగబోయేది అదే. వచ్చింది అందుకే, యెవరేది చేసినా, యెవరేదన్నా వొప్పుకుండేందుకే.

చిదంబర్రావుగారు : అయితే ఆ స్థితినేమంటారు?

అమ్మ : అనేవాళ్ల స్థితినేమంటారో చెప్పండి?

వెంకట సుబ్బయ్యగారు : చిదంబరం యెందుకురా, దానివన్నీ మొండి ప్రశ్నలు.

అమ్మ : నాకు మొండితనం తప్ప, గండుతనం తెలియదు. (యిద్దరు తాతయ్యలూ స్థూలకాయులు).

అందరూ పకపకా నవ్వుతారు.

మరిడమ్మగారు : మీ గొడవే మీదా, పున్నయ్య సంగతేమైనా ఆలకించారా?

అమ్మ : ఆలకించలా, లాలించా.

చిదంబర్రావు : లాలించటమేమి బ్రహ్మాండ మయినప్పుడు పాలించదు?

అమ్మ : బ్రహ్మాండమైనప్పుడు పాలించే తీరుతుంది !

వెంకట సుబ్బయ్యగారు : అయితే నిన్ను యిప్పుడు యే లెక్కలో యేసుకోవాలమ్మా.

అమ్మ : యే సంఖ్యకందితే అది.

చిదంబర్రావు : (నవ్వి) యేది మాట్లాడినా అసాధ్యము.

అమ్మ : అసాధ్యమయితే మాట్లాడలేనుగా. సాధ్యమయితేనే!

చిదంబర్రావుగారు : సాధ్యా అసాధ్యాలకు యేమిటో తేడా మహలావు మాట్లాడుతున్నది.

అమ్మ : నేను కాదయ్యో మహలావు! అడుగో (వెంకట సుబ్బయ్య గారి వంక చూపుతూ).

మరోసారి పున్నయ్యగారితో సహా అందరూ నవ్వుతారు.

పున్నయ్య వంక అందరూ ఆశ్చర్యంగా చూస్తారు. యెందుకంటె కొన్ని గంటల నుండి తన్మయావస్థలో వున్న పున్నయ్యగారు యిప్పుడు మామూలు పరిస్థితిని జూచి.

పున్నయ్యగారు నవ్వుతూ అమ్మను వొడిలోకి లాక్కొని ''అమ్మా! తల్లిలేని తల్లీ'' అంటూ అమ్మను చెక్కిళ్లు పట్టుకుని ముద్దు పెట్టుకుంటారు.

అమ్మ : తల్లిలేని తల్లి అంటే తొలి నేనేనా?

చిదంబర్రావుగారు : ఆ అర్థం వచ్చే మాట యేముంది అందులో.

అమ్మ : పోనీ అందులో లేకపోతెమాల్లె, తల్లిలేని తల్లి అంటే యేమిటో మీరు చెప్పండి, నా అభిప్రాయం తరువాత చెపుతా.

చిదంబర్రావుగారు : తల్లిలేని తల్లి అంటే మీ అమ్మ పోయింది గాదు; అందుకని అన్నారు, వారి వుద్దేశ్యము అది.

అమ్మ : నేను వుద్దేశ్యాలను గుర్తించలేనుగా, మాటలో వున్న అర్థాన్ని చెప్పా.

చిదంబర్రావు తాతగారు : కూర్చున్న అమ్మ పొట్టలోకి వంగి తలకాయ బెట్టి పొట్ట ముద్దు పెట్టుకుని, ''నేను వుద్దేశాన్ని గ్రహిస్తానని కాదు నేనన్నది. చంపుతున్నావు. మీ అమ్మ చచ్చిపోయిందని, తల్లిలేని పిల్లవని, అందుకనే తల్లిలేని తల్లివని అన్నాడు కాని మరొక వుద్దేశంతో అనలా ఆయన'' (గట్టిగా) ఆయన వుద్దేశం అదే.

అమ్మ : దొరికావులే!

చిదంబర్రావుగారు : యెక్కడ దొరికాను ?

అమ్మ : మీరున్న చోటె దొరికారు.

యింతలో పున్నయ్యగారు నవ్వి, 'ఆ కృష్ణ పరమాత్మ స్థితి మనకు లేదు గనుక, ఆ తల్లికి వున్నది గనుక. ఆ అర్థము వచ్చింది'.

అమ్మ : యింతకు మీరన్న వుద్దేశం యేమిటి, తల్లిలేని తల్లి అనటంలో?

పున్నయ్యగారు : అదేనమ్మా నీ దగ్గర యెట్లా అబద్ధమాడేది తాతగారన్న మాటే!

చిదంబర్రావుగారు ''ఒకమ్మాయి ఓడిపోయిందే'' అని అంటారు.

అమ్మ : నేను ఓడింది లేదు, పోయింది లేదు. సరే యీ మాటల కేమిలే (అని పున్నయ్య గారితో) కృష్ణ పరమాత్మ స్థితికి కృష్ణుడికి తేడా వుంటుందా?

పున్నయ్యగారు : యేమో అమ్మా అంతగా చెప్పలేను. నీవంక చూడగా చూడగా కిష్టప్పేమోనని అనుమాన మొస్తోంది.

అమ్మ : అనుమానమేగా, అవున్లే అనుమానమే లేకపోతే కిష్టప్పా అని పిలచేవాడివిగా.

వెంకట సుబ్బయ్యగారు : కృష్ణునికీ, కృష్ణ తత్వానికి తేడా అనే ప్రశ్న మేము వేసామని నీవు చెప్పు సమాధానం.

అమ్మ : కృష్ణ తత్వమంటే కృష్ణుడి లక్షణాలు కలిగింది కృష్ణ తత్వం. కృష్ణుడంటే కృష్ణుడే. కృష్ణుని గురించి చెప్పుకోటానికి పురాణాలే ఆధారమయినవి. ఆ పురాణాలు చెప్పిన లక్షణాలు యెక్కడ వుంటే వాటిని కృష్ణ తత్వాలు అంటున్నాము మనము, అంటుండగానే పున్నయ్యగారు "వాడే వీడు, వీడేవాడు అప్పుడు ఆ ఆకారముతో వచ్చాడు వప్పుడు యీ ఆకారముతో వచ్చాడు" అని పడి పోతాడు. ప్రొద్దుట మాదిరిగా తన్మయావస్థతో వున్నాడని అందరూ లేచి నుంచుని వారివంక చూస్తూ వుంటారు.

యింతలో మూతి, చెయ్యి, కాలు పక్షవాత మాకారముగా మారి వుంటుంది.

యింతకూ యీ ప్రయాణ మాగటానికి కారణం యిదిరా కొంపతీసి అని మరిడమ్మగారు దగ్గరకు వచ్చి నాడి చూస్తుంది. ప్రాణము పోయినట్టున్నదే అని అంటుంది. కాని ప్రాణం పోలేదు, కొద్దిగా కొనవూపిరి వుండును. పున్నయ్యగారిని అందరూ వారి యింటికి తీసుకెళతారు. (అంటే పున్నయ్య గారికి రాత్రి యేడు గంటల వరకు ప్రాణము పోదు).

అమ్మ పున్నయ్య గారిని చూడటం కొరకు వారింటికి వెళుతుంది. అమ్మ పోయినుంచోగానే కన్నెత్తి అమ్మవంక జూచి, కదలని చెయ్యి కదలించి అమ్మకు నమస్కారము జేసి, నంగి మాటతో "చెట్టుమీద నుంచుంది నువ్వే నీవే"నని తలపై కెత్తి కళ్లు పెద్దవిజేసి లేవబోయి "నీవె నీవె" అని వెనక్కు పడి పరమాత్మలో ఐక్యమవును. (అమ్మలో)

ఇష్టాగోష్టి :

చిదంబర్రావు : మెల్లగా అమ్మ చెయ్యి పుచ్చుకుని యింటికి తీసుకొచ్చి ప్రొద్దున నిన్ను ఆయన బుజాన యెత్తుకుని తీసుకు రావటానికి అసలు కారణమేమిటి?

అమ్మ : అసలు కారణము యెవ్వరికి తెలియదు. అది అసలుకే తెలియాలి.

చిదంబర్అవు గారు : అసలంటే ?

అమ్మ : అసలంటే శక్తి.

చిదంబర్రావుగారు : శక్తి అంటే ?

అమ్మ : ప్రతిదానిలో వుండే శక్తి.

చిదంబర్రావుగారు : ప్రతి దానిలో యేమి శక్తి వున్నది. యెట్లా వుంటుందో వివరించు.

అమ్మ : చిదంబర్రావుగారి చేతిలో కలము, జేబులోని కాగితము తీసి అమ్మ దానిమీద యేవేవో పిచ్చి గీతలు వ్రాసి యీ కలానికి సిరాను ధరించే శక్తి, పాళీకి వ్రాసే శక్తి, చేతికి కలాన్ని పట్టుకునే శక్తి, కాగితానికి అక్షరాలను ధరించే శక్తి, యీ శక్తులన్నీ ఆ అసలే, ఆ అసలే యీ శక్తి.

చిదంబర్రావుగారు : అప్పుడు ఆ శక్తి అన్నింటిలో వున్న శక్తులు అసలయినప్పుడు, ఆ అసలుకు స్పెషలు యేమిటి?

అమ్మ : స్పెషలంటే ?

చిదంబర్రావుగారు : ప్రత్యేకత.

అమ్మ : నేను మాత్రము ప్రత్యేకత అన్నానా? అన్నింటిలో వుండే శక్తి తన శక్తి తను అయినప్పుడు ప్రత్యేకత లేదు.

చిదంబర్రావుగారు : ఆ స్థితి యెట్లా వుంటుంది?

అమ్మ : అది చెప్పేది కాదు. చెప్పేది కాని దానిని చెప్పవలసి వచ్చింది గనుకనే చెప్పటానికి ప్రత్యేకత అవసరమయినది. ఆ అవసరమే విలువయినది. ఆ విలువే అసలయినది.

చిదంబర్రావుగారు : అబ్బా యింత గంభీరమైన భావాలు యెక్కడ నుంచి వచ్చినయ్యో, నేను వ్రాసిన ఆత్మబోధ చదువుతా? చదువు రాదుగా అమ్మా?

అమ్మ : చదువుకోలేదు గనుక చదువురాలా.

చిదంబర్రావుగారు : (ఆనందభాష్పాలు కారుస్తూ) యివన్నీ నీకు యెట్లా తెలిపినయ్యమ్మా ?

అమ్మ : తెలుసుకుండేదేదో అదే తెలుసుకుంది.

చిదంబర్రావుగారు : తెలుసుకుండేది తెలివేగా.

అమ్మ : ఆ తెలివికి ప్రతిదానిని తెలుసుకోవటమేగా దాని వృత్తి. తెలివికి తెలుసుకోవటమే వృత్తి అయినప్పుడు అది సహజమేగా, విశేషమేమున్నది?

చిదంబర్రావుగారు : వేరే విశేషమేమున్నదమ్మా. నీవే విశేషము.

యింతలో వెంకటసుబ్బయ్యగారు తక్కినవారు అందరూ వస్తారు.

వెంకసుబ్బయ్యగారు : యీపూట పున్నయ్య గారిని తీసుకెళ్లే ప్రమేయమేమీ లేదు. మనం తెల్లవారుఝామున వెళ్లవచ్చు.

తెల్లవారు ఝామున 4 గంటలకు నల్ల ఖాసిం బండి కట్టుకు వెళదామనుకుంటారు. అనుకుంటూ వుండగానే ఖాసిం వస్తాడు.

మరిడమ్మ తాతమ్మగారు : నీవు దీర్ఘాయుష్ మంతుడివిరా, నీమాట యిప్పుడే అనుకుంటున్నాం.

ఖాసిం : యింకా యెందుకమ్మా, యిప్పటికే బరువుగా వుంది రంగమ్మ తల్లి పోయిన తర్వాత యీ వూళ్లో వుండలేకపోతున్నా. బిడ్డలూ, మీరన్నా యిక్కడ వుంటే కొంత తృప్తిగా వుండును.

తాతమ్మ గారు : ఆ గీత లేదు నాయనా, మీ అయ్యగారికి చెప్పు, పెళ్లి చేసుకుంటానంటే యిక్కడ వుంటా.

ఖాసిం : అయ్యగారికి చెప్పేమాత్రపువాడినా, అయినా చెప్పిచూస్తా (అని దగ్గరకు పోతాడు. సీతాపతి తాతగారితో), అయ్యా నాకు ఒక కోరిక, కోప్పడకుండా వుంటారా?

సీతాపతిగారు : యేంటిరా చెప్పు నీమొఖం కోప్పడే దేముంది?

ఖాసిం : నేను యీ కొంపవేపు రాకుండా వుండలేనయ్యా. మండోదరి లాంటి అమ్మ గుర్తుకు వస్తూ వుంటుంది. ఆమె లేకపోయినా - మిమ్మల్ని, పిల్లల్ని చూచుకుని అయినా బతుకుతా అయ్యా, అన్నం నీళ్లు లేకపోయినా మిమ్మల్ని చూచుకుని అయినా బతుకుతా అమ్మాయిగారిని చూస్తే అసలే వొదిలి పెట్టబుద్ధి పుట్టటంలా.

సీతాపతిగారు : అయితే యేమిటిరా నీ క్షోభ, చెప్పి పంపిందిలే వూరుకోదు.

ఖాసిం : మీరు, పిల్లలు, తాతమ్మగారు యిక్కడ వుంటే చూసుకుంటూ వుంటా.

సీతాపతిగారు : చూసుకో, ఆవిడ గారు వుండదట.

ఖాసిం : వుండేట్టు చెయ్యండయ్యా.

సీతాపతిగారు : యేడ్చినట్టే వుంది. ఉత్తరీయం విదిలించి పైన వేసుకుని మరిడమ్మగారితో "యేం, నీవు చెప్పటం చాల్లా! దానివల్ల జరిగే ప్రమాదాలు చాలా వున్నయ్యి".

తాతమ్మగారు : కోప్పడకుండా వినరా నాయనా చెపుతా, నీవా జబ్బువాడివి . యెంత మంది చెల్లెళ్లు, అక్కలు వున్నా ఆస్తిజూచి కొన్నాళ్లు జేసినా - కాస్త జబ్బు చేస్తే యెంతగానో బాధ పడతావు.

సీతాపతిగారు : అక్కడొక మాట అక్కడొక మాట యెందుకమ్మా పూర్తి వుద్దేశం యిది అని చెప్పేసెయ్యి.

తాతమ్మగారు : యేమీ లేదు నాయనా, నీవు చేసుకుంటావంటె యీ నాలుగు రోజులు నేను చేసిపెడతా, రేపు వస్తుంది దాని కాపురము అద ఇచేసుకుంటుంది అనే ఆశతో. యిప్పటికే చేసి చేసి నా చేతులు కడుక్కున్నట్లు అయింది. ఆరేండ్లకు ముండమోసింది యీ తల్లి తండ్రి లేని పిల్లల్ని పెంచటానికేనేమొ. దీనికి యే ఒడ్డూ లేదా? అని దుఃఖపడును.

తాతగారు : (సీతాపతి) నీవు అనవసరంగా నా గొంతుకు వురి పొయ్యద్దు.

చిదంబర్రావుగారు : యిప్పుడెందుకు యీగోల. ఆ సమయమొస్తే తప్పించుకోలేడుగా - యెందుకురా! ఆ పెద్దదానిమీద అంత పెద్ద పెద్దగా

మాట్లాడుతున్నావు? అంతా మనమీద ప్రేమకొద్దేగా! యిక్కడికి యిది మూడో తరం తల్లి తండ్రి లేనివాళ్లను పెంచటం.

అమ్మ : ఆమెది ఆమెకు వేరేలేదు గనుక అందరూ పిల్లలే.

వెంకటసుబ్బయ్య గారు : పాపం పెద్ద యిల్లాలు మాట్లాడు తున్నది.

చిదంబర్రావుగారు : వూహకు మనకందరికంటే పెద్దదే!

సీతాపతితాతగారు : అమ్మను బుజాన వేసుకుని చాటుకు తీసుకెళ్లి రెండు వేళ్లు చూపించి యే వేలు పట్టుకుంటా (ప్రశ్న)?

అమ్మ : నీవు యేవేలు పట్టుకోమంటే ఆవేలు పట్టుకుంటా నాన్నా.

సీతాపతి : నేను చెప్పటం గాదమ్మా, నీ యిష్టం వచ్చిన వేలు పట్టుకో!

అమ్మ : నాకు అవుసరం రాలేదుగా, యిష్టమనేది యేమున్నదీ?

సీతాపతిగారు : నేను అడిగినప్పుడు యేది బుద్ధి పుడితె అది పట్టుకో అని రెండు గడ్డి పరకలు చేత పట్టుకొచ్చి యీ రెండింటిలో యేదో ఒకటి పట్టుకో అమ్మా.

అమ్మ : నేను అది పట్టుకోనుగాని, నీవు యెందుకడిగేది చెప్పు?

సీతాపతి తాతగారు : అది నీకెందుకమ్మా, నేనడిగానుగా?

అమ్మ : నేనడిగానుగా ? పెళ్లి చేసుకోవటం తప్పదా అని అడుగుతున్నావా?

సీతాపతి తాతగారు అమ్మను చప్పున దగ్గరకు లాక్కొని టపటపా కళ్లవెంట నీళ్లు కారుస్తారు.

అమ్మ తాతగారు నీళ్లు కార్చటం చూచి చప్పున గడ్డి పరక పుచ్చుకుని "పట్టుకున్నాలే యేడవకు".

సీతాపతి గారు : పిచ్చితల్లి, అందుకని యేడుస్తున్నావా?

అమ్మ : నీవు అందుకేడవటంలా, నేననుకున్నాలె నేను పట్టుకున్న గడ్డిపరక ఫలితమేమిటో చెప్పు?

సీతాపతిగారు : చెప్పేదేముంది తప్పనిసరేగా.

అమ్మః అయితే తాతమ్మ చెప్పినమాట వింటావన్నమాట (అంటూ) నాకెందుకులే నేను బాపట్ల పోతున్నాగా.

సీతాపతి గారు : అయితే నీవు తాతమ్మ మాట వింటావా, నామాట వింటావా?

అమ్మ : నాకు తాతమ్మ మాటే కావాలి నాన్నా.

సీతాపతి తాతగారు : రేపు వచ్చే మనిషి నిన్ను సరిగా చూడదు. నీ సొమ్ములన్నీ యిప్పుడు ఖర్చు పెట్టాలి, అందుకు నీకు యిష్టమేనా?

అమ్మ : జరిగేది మంచిపని అయినప్పుడు ఖర్చుపడ్డా యిష్టమే, మాట తప్పినా యిష్టమే.

సీతాపతి తాతగారు : 'వైద్యుడు పాలే కోరాడు, రోగి పాలే కోరాడు' అన్నట్టు వున్నది నాగతి.

వెంకట సుబ్బయ్య తాతగారు అక్కడకు వచ్చి "అబ్బా, కూతురు సంభాషణ యేమిటి?"

అమ్మ : అబ్బా కూతురు యిష్టాగోష్టి.

వెంకట సుబ్బయ్యగారు : నీవు యెక్కడ విన్నావమ్మా యీమాట.

అమ్మ : యెక్కడో మీరు అంటూ వుంటే విన్నా.

వెంకట సుబ్బయ్యగారు : నాకు ఆ పదము అలవాటు లేదె.

అమ్మ : తాతగారు మీరు మాట్లాడుతుండగా మా పెద్దత్తయ్య వచ్చియేమిటి అన్నాదమ్ములు మాట్లాడు తున్నారంటే, నీ మాటగాదు మా అన్నాదమ్ముల యిష్టాగోష్టి అంటిరే దొడ్డి వాకిట్లో.

వెంకట సుబ్బయ్యగారు : ఓహో, యెక్కడ జ్ఞాపకశక్తే తల్లి ! సరే యిక భోజనాలకు పోదాము రండి. తరువాత మాట్లాడుకోవచ్చు. మీతో మాట్లాడలేనులే!

సీతాపతి తాతగారు : (అమ్మను యెత్తుకుని) పోదాం పదమ్మా అన్నం తిందాం అని తీసుకు వెళతారు.

మైమరపు :

అందరూ భోజనాల దగ్గర కూర్చుంటారు. అమ్మ గూడా మడి కట్టుకుని తాతగారి దగ్గర అన్నానికి కూర్చుంటుంది. తాతగారు (సీతాపతి) అవుపోసన బట్టి కందిపచ్చడి కలుపుతూ, నీకేది యిష్టం యేది కలపమంటావు?

అమ్మ : యిస్తరిలో వున్నవాటిల్లోనా నాయిష్టం; అసలు నీకేది యిష్టమనా అడిగింది?

చిదంబర్రావుగారు : (నవ్వి) చెప్పవయ్యా సీతాపతి చెప్పు సమాధానం.

అమ్మ : చెప్పేదేముంది మీయిష్టమొచ్చినట్టు చేయటమే.

చిదంబర్రావుగారు : నాతో తరువాత పోట్లాడుదువుగాని, మీ నాయనను అడిగి ఆ సమాధానం ముందు చెప్పించుకో.

అమ్మ : నాన్నే మీరనుకొని మీరు చెప్పండి ఆ సమాధానం? మొన్న మీరు ఆ ప్రశ్న మేము యేశామని సమాధానము చెప్పమంటిరే?

చిదంబర్రావుగారు : అడుగడుగునా అడుగు తీసి అడుగు పెట్టటం మహా కష్టంగా వుంది, యీ అనసూయా మహాదేవిగారితో.

వెంకట సుబ్బయ్యగారు : ఆహా! యీ అనసూయా మహాదేవిగారే కారణం.

అమ్మ : సమస్త కార్యాలకూ కారణమేనా?

వెంకట సుబ్బయ్య : ఆ యిప్పుడు జరిగిన విషాద ఘట్టానికి నీవే కారణం.

చిదంబర్రావు : అట్లా అనబోకన్నయ్యా, శాస్త్రరీత్యా శాంతి జేయించావుగా అట్లా యెందుకు జరగాలి.

అమ్మ : వాళ్లకు అట్లా జరిగే యోగ్యత వుంటే పుడతారా, పుట్టినందువల్ల యిట్లా జరుగుతుందా? అసలు యివి రెండూ కాకపోయినా అనుకోవటము అట్లా అనుకుంటారా?

చిదంబర్రావుగారు : నీవు జెప్పు?

అమ్మ : నేను జెప్పే స్థితి వుంటే యీమెగారే కారణమనిపించు కుంటానా, నేను కారణమని మీకు తోస్తే నన్ను నీవె కారణమని అంటారా? కారణానికి అసలు అర్థం యేమిటి. కారణానికి అర్థం తెలిస్తే కార్యాలన్నీ తనే అవుతాడా, చెప్పండి? తాతగారు తొదరగా చెప్పండి. (ఆ అడిగేటప్పుడు అమ్మ కొంచెం వుద్రేకంగా వున్నట్టు కనపడుతుంది)

చిదంబర్రావుగారు అన్నములో చెయ్యిపెట్టి అమ్మ చెప్పే మాటను శ్రద్ధగా వింటూ కన్నార్పకుండా అమ్మవంకనే చూస్తూ వుంటారు. అందరూ చిదంబర్రావుగారి వంక చూస్తూ, భోజనములు మాని నిశ్శబ్దంగా వుంటారు.

అట్లా అరగంట గడుస్తుంది. అందరూ మౌనముగానే వున్నారు. అమ్మ మెల్లిగా లేచి చెయ్యి కడుక్కుంటుంది. యెవ్వరూ అమ్మ వెళ్లటం గమనించరు. అమ్మ చెయ్యి కడుక్కుని వాకిట్లో వున్న నులక మంచం మీద పడుకుంటుంది.

ఒక అరగంట అయిన తరువాత యీ కాసేపు యెక్కడికో పోయి వచ్చిన వాళ్ల మాదిరిగా అందరూ యే లోకంనుండో దిగి వచ్చినట్టుగా మీరు యెప్పుడు వచ్చారంటే మీరు యెప్పుడు వచ్చారన్నట్టు వుంటుంది వారి స్థితి. భోజనాలు సాగిస్తారు. సగము అన్నము తిన్నాక చిదంబర్రావు తాతగారికి జ్ఞాపకము వచ్చి, పిల్లేది యెప్పుడు లేచిపోయింది. ఆ క్షణాన లోగడ సంభాషణ మర్చిపోయి మరల మరుక్షణం నుంచి జ్ఞాపకం వస్తూ వుంటుంది. అన్నం సగపడి తిని చిదంబర్రావుగ్గారు వాకిట్లోకి వస్తారు. అమ్మ దగ్గరకు వచ్చి మంచము మీద పడుకున్న అమ్మను చూడగానే యెవరో ఒక పెద్దమనిషి పడుకున్నట్టుగా కనపడుతుంది. మంచము దగ్గరకు రాను రాను అమ్మమ్మ రంగమ్మగారి మాదిరిగా కనపడి, వెంటనే మామూలు అమ్మగా కనపడుతుంది. యెంత భ్రమపడ్డయ్యామ్మా కళ్లు, అని యెంగిలి చేత్తోనే అమ్మను నిమురుతారు. నిమురుతూ యేం సూరమ్మతల్లీ!

అమ్మ : నన్ను సురమ్మ అంటారేం, ఆదెమ్మను. యేం పేర్లు యీపేర్లు: నేను సూరమ్మను గాదు ఆదెమ్మను గాదు.

చిదంబర్రావుగారు : సోదమ్మవులె. అదిసరేగాని, యెందుకు అట్లా కనపడ్డావు?

అమ్మ : యెట్లా చూచేవారికి అట్లా కనపడతాను.

తక్కినవారు కూడా అన్నాలు తిని బయటకు వస్తారు.

వెంకట సుబ్బయ్యగారు : మాయ నీకే కప్పటమే అందరికి కప్పిందిగా!

అమ్మ అక్కడ నుండి లేచి, ''ప్రయాణము యెప్పుడు నిశ్చయించారు తాతగారు'' అని అడుగుతూ బయటకు వెళ్లిపోతుంది.

చిదంబర్రావు తాతగారు : యెక్కడికో బోతున్నదే మళ్లీ అని యీ రోజు అన్నాల దగ్గర నుండి యేమిటి అసలు యిదంతా అని ఆలోచన కలుగుతుంది. అన్నయ్యా మీరంతా రెండెడ్ల బండిలో రండి. నేను పిల్లను (అమ్మను) యెత్తుకొని నడిచి వస్తాను అని అంటూ చేతితో మొఖము తుడుచుకోగా యెంగిలిచేయి గుర్తుకు వస్తుంది. (మంచము ప్రక్కన కూర్చుని వున్న తాతగారు వెంటనే లేచి చెయ్యి మొఖము కడుక్కుని తడిగుడ్డతో వొళ్లంతా తుడుచు కుంటారు. కాని

శరీరమంతా మంట పుడుతూ వుంటుంది. శరీరమంతా చెయ్యి పూనుకున్నాను కాబోలు. యీస్థితి యెప్పుడూ రాలేదు. మరుపు అంటే యేమిటో యెరగను అని స్నానము చేస్తూ అనుకుంటారు. దీనిని బట్టి గంగరాజు పున్నయ్యగారి స్థితి యేమిటో, అయినా అమ్మాయిని ఒంటరిగా కూర్చోబెట్టుకుని అడుగుదాం అనుకుంటూ స్నానంచేసి లోపలకు వచ్చి పెద్ద అత్తగారితో అన్నీ సిద్ధము చేసుకొని వుండండి తెల్లవారుగట్ట ప్రయాణానికి అని చెప్పి, పాడిగుడ్డలు కట్టుకుని, వీధిలో అరుగుమీద కూర్చున్న అమ్మ దగ్గరకు పిల్ల యేమిచేస్తున్నదో అని వచ్చి "చీకట్లో యెందుకమ్మా ఒంటరిగా కూర్చున్నావు?" అని అంటారు.

అమ్మ మాట్లాడదు. చిదంబరావుగారు మాట్లాడని అమ్మను కదిలించడానికి సందేహిస్తూ 'మా అమ్మ ధృవుడల్లే కనపడుతూ వుంది' అనుకుంటారు. ఒక పావుగంట అయిన తరువాత అమ్మ కదిలినట్టు తోస్తుంది. కాని కదలలేదు. అమ్మను కదిలించి "యేం అమ్మా యేం చేస్తున్నా. అందరూ పడుకొని నిద్రలు పోతున్నారు. నీవుకూడ పడుకుందువుగాని రా".

అమ్మ : నేను వస్తా మీరు వెళ్లి పడుకోండి.

చిదంబరావు : నిన్ను అర్థం చేసుకోవటం కష్టమమ్మా. యెట్లా జరగవలసి వుందో ముందు రోజులు (అని తనుకూడ అరుగుమీద కూర్చుని అమ్మను వొళ్లో కూర్చోబెటుకుంటారు). "అమ్మా పలుకమ్మా" అంటారు. (గడ్డం పట్టుకుని మొఖము పరికిస్తూ), "నీ సంగతేమిటో చెప్పమ్మా వినాలని వుంది".

అమ్మ : వింటమెందుకు కంటున్నారుగా

చిదంబరావు : (బుగ్గమీద ముద్దు పెట్టుకుంటూ కొంతసేపు అలాగే వుంచి ఆనంద భాష్పాలు కారుస్తూ) అమ్మా అనసూయా నువ్వు యేమిటో చెప్పు.

అమ్మ : నేను యేమిటి లేదు, అందరంటి దానినే, యెందుకు అలా యేడుస్తావు?

చిదంబరావు : అందరంటిదానివేగాని చిన్నతనంలో యీ ప్రసంగాలన్నీ ఆలోచన కలిగిస్తున్నాయి.

అమ్మ, తాతగారు, యిద్దరూ ఆ మాట అన్నాక ఒక అరగంట కూర్చుంటారు.

తరువాత లేచి "పున్నయ్యగారి సంగతి అడుగుతా నిజం చెపుతా?"

అమ్మ : యిప్పుడు నీ సంగతేమిటా నిన్న పున్నయ్యగారి సంగతి గూడ అదే. యిప్పుడే నీ స్థితి నీకు తెలుస్తోంది? ఆయన సంగతీ అంతే. నా సంగతీ అంతే చెప్పేదేమీ లేదు.

చిదంబర్రావుగారు : యింతకూ బాపట్ల వస్తావా?

అమ్మ : నాకు అంతకూ రావాలనే వుంది.

చిదంబర్రావు : అంతకూ అంటే, అంతటా అనా, అంతటా వున్నాననా?

అమ్మ : యింతకూ అంటే యే అర్థముందో, అంతకూ అంటే ఆ అర్థమే వుంది.

చిదంబర్రావుగారు : యింతకూ చెప్పవూ

అమ్మ : చెప్పితే అర్థం కాదు.

చిదంబ్రఆరవుగారు : అర్థం అయ్యేటట్టు చెప్పమనేగా అడగటం.

అమ్మ : చెపితే అర్థం కాదు తాతయ్యా, యింత తాపత్రయం నిన్న ప్రొద్దున లేదుగా, పున్నయ్యగారిని జూచినపుడు పున్నయ్యగారిని గురించి ఆలోచన లేదుగా. మీకు కలిగిన అనుభవాన్ని పురస్కరించుకొని పున్నయ్యగార్ని గురించి ఆలోచన వచ్చింది.

చిదంబర్రావు : అవును నిజమే ! నీవు అట్లా మాట్లాడుతూ వుంటే ఆనందంగా వుండి అడుగుతా అమ్మా.

అమ్మ : అవును నిజమే మీకు అర్థముకాక గాదుగా! (అంటూ గోడనున్న మట్టి గడ్డలు నల్చుకుని తింటుంది)

చిదంబర్రావుగారు : అదేమి పనమ్మా. మట్టి తినబోకు కడుపులో బల్లలు పెరుగుతాయి.

అమ్మ : ఆమె మా అమ్మండి తాతగారు.

చిదంబర్రావుగారు : మీ అమ్మ రంగమ్మ అయితే యీామె యెందుకు అవుతుంది?

అమ్మ : ఆ అమ్మ బోతూ యీ అమ్మను చూపించింది. ఆ అమ్మల్లే యీ అమ్మ పొయ్యేది కాదు. ఎన్నిబళ్లు మీదుగా పోయినా, ఎన్ని కార్లు మీదుగా పోయినా సమస్త జనానికి పండితుడికి పామరుడికి అన్నివేళలా అన్ని వస్తువులకు

ఆధారమయింది యీమె. యీ అమ్మను నేను ప్రత్యక్ష ప్రమాణమైన మాతృదేవిగా భావిస్తా.

చిదంబర్రావు : దాని వివరం చెప్పమ్మా.

అమ్మ : యిప్పుడు చెప్పమంటారా?

సర్వానికి ఆధారము :

చిదంబర్రావుగారు యింట్లోకి వెళ్లి అందర్ని లేపి ప్రయాణాలై బయలుదేరే సమయానికి గం. 3.30లు అవుతుంది. అందరూ ఒకే బండిలో వెళతారు. రెండో ఒంటెద్దుబండి దొరకలేదు. అనుకున్నట్లుగా యీ సంభాషణకు అవకాశము దొరకదు.

అమ్మ బండిలో "తాట్లో కూర్చుని, తాతగారూ; నేను బండి తొట్లో కూర్చోనా?"

చిదంబర్రావుగారు : కూర్చొని కూర్చోనా అని అడుగుతా వేమమ్మా.

అమ్మ : కూర్చోలేదు తాతగారు అటుగుండా యెక్కాను. మీకు కూర్చున్నట్లుగా కనపడుతున్నానా?

చిదం : పొట్టిదానివిగాదు జల్లకు తక్కువగా, భూమికి జానెడు యెత్తున వుంటావు.

అమ్మ : భూమికి జానెడెత్తున లోపలగాన, పై గాన ?

చిదంబరం : లోపల యెట్లా వుంటావమ్మా పైనే.

అమ్మ : భూమిమీద జానెడెత్తు అనలేదుగా, భూమికి జానెడెత్తు అన్నారు. నామీద భూమి వున్నట్లుగా వుంది మీమాట.

చిదంబర్రావుగారు : ప్రతి అక్షరంలో నుంచి అర్థం తీస్తావమ్మా.

అమ్మ : వ్యర్థమయిన అర్థాలు కావుగదా నేను తీసేవి తాతగారు?

చిదం : నీమాట యేదీ వ్యర్థం కాదమ్మా అంతా సార్థకం.

అమ్మ : యెవరికి సార్థకం అంటారూ? సాధకులకా? అయినా నాదృష్టిలో సాధకులే లేరు.

చిదం : సామానంతా సర్దటం అయింది. సరిగా కూర్చో అమ్మా (అందరూ యెక్కారు)

అమ్మ : నేను బండి నడిపేవాడుగా కూర్చునేదా?

చిదం : బండే నడపటం కాదు అంతా నడుపుతావు.

అమ్మ : నడిపేవాడిని బట్టి అంతా నడుస్తుందా తాతగారూ?

యీ మాట అంటూ వుండగానె నల్ల ఖాసిం వచ్చి బండి కదిలిస్తాడు. ఒక యెద్దు తొందరగా కదులుతుంది, ఒక యెద్దు కదలదు. గట్టిగా కొట్టగానే దెబ్బతిన్న యెద్దు త్వరగా కదులుతుంది, రెండవది తగ్గుతుంది. అది కదిలినంత త్వరగా రెండవ యెద్దు కదలలేకపోతుంది.

అమ్మ : తాతగారూ నా దగ్గరగా కూర్చుంటే చాలా సంగతులు అడగాలె తొట్లో కూర్చుంటారూ.

చిదం : తోలేవాడు కూర్చోవద్దా అమ్మా.

అమ్మ : వాడికీ చోటున్నది.

ఖాసిం : అక్కర్లేదు. నేను యెడ్ల తాళ్లు పట్టుకు నడుస్తాను.

అమ్మ : తాతగారూ ఖాసిం అన్నమట వినపడ్డదా?

చిదం : నడవలేడమ్మా అంతసేపు.

అమ్మ : తాళ్లు పుచ్చుకుని నడపించగలవాడు నడవలేకపోవట మేమిటి ?

చిదం : దొప్పల పూడి దాటిన తరువాత యెక్కుతాలె.

దొప్పలపూడి వూరు దాటగానే బండి బోల్తా పడుతుంది. యెవరికి దెబ్బలు తగలకుండానే ఖాసిం కాపాడుతాడు. అన్నీ సర్దుకుని మరల బండి యెక్కిన తరువాత.

అమ్మ : తాతగారూ ! మనం బండిలో అన్ని సంగతులూ మాట్లాడుకుందాం అనుకున్నాంగాదూ?

తాత : యింకా పొన్నూరు చాలా దూరం వుందిగా మాట్లాడుకుందాం. అయినా యీ బండి బోల్తాపడి యెవరికి దెబ్బలు తగలకుండా వుండి ఒడ్డున పడటానికి యెవరున్నారో యిందులో అదృష్టవంతులు.

అమ్మ : పడటానికి యే అదృష్టవంతులున్నారో. రెండింటికి ఒకళ్లేనా? పడటానికి, పడకుండా వుండటానికి. పడ్డా దెబ్బలు తగలకుండా వుండటానికి మూడిటికి కారణం ఒకటేగా?

రామచంద్రపురం రోడ్డుకు తిన్నగా వచ్చినాక యెడ్లు రెండూ (బండి నడుస్తూ వున్నది) పొడుచుకుంటాయి. బండి కదలి కాడితాళ్లు తెగి సుడి బడుతుంది. అమ్మ పైతొట్టిలోనుంచి కిందికి దూకుతుంది. ఆదూకే సమయములో పడిపోయినట్టుగా కనపడుతుంది అందరికి. అమ్మో! బిడ్డ పడ్డదని బండిలోని వారంతా అనుకుంటూ వుండగా వారు గూడా వెనుకకు పడిపోతారు. అమ్మ నవ్వుతూ వెనుకకు వచ్చి "నేను ముందు పడ్డాను మీరు వెనుక పడ్డారు. ముందు నేపడ్డాను, నా వెనుక మీరు పడ్డారు. నే చిన్నమ్మాయను ముందు పడ్డాను, పెద్దవారంతా నావెంట పడ్డారు".

చిదం : యెన్ని అర్థాలుగా అన్నావమ్మా !

అందరూ బండి పడిలేచి సర్దుకుంటూ వుండగా తాతగారు అంటారు. (అందరకూ కొద్దిగా దెబ్బలు తగులుతాయి. అమ్మకు, తాతయ్యకు దెబ్బలు తగలవు).

అమ్మ : అర్థాల కోసము అనలేదు. జరుగుతున్నవి అంటున్నా.

వెంకట సుబ్బయ్యగారు : అర్థాల కోసము అనలేదు సరే జరుగుతున్నది సరాసరి చెపితే సరిపోదు. యిన్ని రకాలుగా యెందుకు. ఇంతకూ యేమిటిరా చిదంబరం, అమ్మాయి అనేది!

చిదం : చాలా వున్నది అర్థం, యిప్పుడప్పుడె తేలేటట్టుగా లేదు. యెప్పుడో యింటికెళ్లిన తరువాత కూర్చోబెట్టుకుని తీరిగ్గా చాలావున్నయి యీ బుడ్డమ్మాయి నడుగవలసినవి.

(బండి కదులుతుంది. అమ్మ, చిదంబరావు తాతగారు, తొట్లో కూర్చుని వుంటారు)

అమ్మ : తాతగారు మీరు యిప్పుడు తెనాలి తాతగారితో యేమిటి అన్నది?

చిదం : పట్టుకున్నా పీక.

అమ్మ : నేనేం పట్టుకోలా. మీరే అనారు యింటికెళ్ళిందాకా పీక యెత్తవద్దని.

చిదం : యేదీ చెప్పకుండా తప్పుకోటానికా యీ యెత్తు?

అమ్మ : అందుకే రెండెద్దులు యీ యెత్తు యెత్తినయి. యింతకూ "అనుకున్నది జరుగదు తనకున్నది తప్పదు" (మహా వాక్యము)

చిదం : పకపకా నవ్వి, అన్నయ్యా విన్నావా!

వెంకట సుబ్బయ్య : యేమిటి ! వినపడలేదు నాయనా.

వెంకట సుబ్బయ్యగారు అన్నమాట మరిడమ్మగారు అన్నట్టుగా వినపడుతుంది. (మరిడమ్మ తాతమ్మ నుద్దేశించి) అన్నయ్య నిద్రపోతున్నాడా, పలక లేదు పిన్నీ అని అంటారు.

వెంకట సుబ్బయ్య తాతగారు : పలికింది నేనేరా అంటారు. దానిని గురించి యిరువురూ 10 నిమిషాలు తర్జన చేసుకుంటారు. యింతలో మరిడమ్మగారు 'నేను కాదు నాయనా' అంటుంది.

అమ్మ : యిందాకటి నుంచి అరుచుకున్నారుగాని, దేనినిబట్టి మీకీ అనుమానం వచ్చిందో చెప్పండి (చిదంబర్రావు) తాతగారూ!

చిదం : గొంతును బట్టి.

అమ్మ : గొంతు మీ కంటికి కనపడలేదుగా.

చిదం : ధ్వనిని బట్టి.

అమ్మ : ధ్వని కూడా కాదు, నిజం చెప్పండి.

చిదం : పోనీ నేను చెప్పినవి చాలటం లేదుగా నీవు చెప్పమ్మా !

అమ్మ : మీరు నాకు చాలేటట్టు చెప్పకపోవటం కాదు. చిన్నపిల్లకు నిజం చెప్పటమేమిటిలే అని.

చిదం : పోనీ నిజం నీవె చెప్పమ్మా.

అమ్మ : తాతగారు మిమ్మల్ని ''యేమిరా'' అనేవారు. 'యేమి నాయనా' అని తాతమ్మ అనేది. తాతగారు మర్చిపోయి పొరపాటున నాయనా అంటే అది విని మాటనుబట్టి మోసపోయి తాతమ్మ అనుకున్నారు. పలికింది తాతగారె. గొంతులో వుండె ధ్వని కూడ కాగు మీ అనుమానము, యేదో ఆలోచించేటప్పుడు

ఆలోచనలో యీమాటను గుర్తించింది భావమయింది గాని శబ్దం కాలా. అప్పుడు శబ్దానికి కూడా ఆధారం భావమే అయింది.

వెంకట సుబ్బయ్య : యేమిటో మహారాణిగారు తీర్మానం చేస్తున్నారె !

అమ్మ : నేను మహారాణిని కాదు తాతగారు. "సర్వసృష్టికారిణిని".

చిదం : బండి ఆపు ఖాసిం. మళ్లీ అనమ్మా!

అమ్మ : అవసరం కలగలేదుగా.

చిదం : యిందాక "భూమి తల్లి" అన్నావు. ఆమె 'అన్నింటికి ఆధారమన్నావు' . యిప్పుడు "సర్వానికి నేనే ఆధారమన్నావు".

అమ్మ : "సర్వానికి సర్వము ఆధారమే" (మహావాక్యము)

బండి పొన్నూరు సమీపిస్తుంది.

చిదం : మొత్తం మీద నీవన్నట్లుగా మాట్లాడాలనుకొన్నవి యేవీ జరగలేదు.

అమ్మ : తాతగారు నాకు మరలా మన్నవ పోదామని వుంది.

చిదం : బాపట్ల పోయి నాలుగు రోజులుండి వద్దాములే.

వెంకట సుబ్బయ్యగారు : మేము యిటునుంచి అటు తెనాలి వెళతాం. మీరు బాపట్ల వెళ్లండి. వస్తే అమ్మాయిని తీసుకెళతాం.

అమ్మ : మన్నవలో అనుకున్న మాటలు మరపు వచ్చినయ్యా. బాపట్ల వెళదామని అనుకుంటిరిగా అందరూ.

వెంకట సుబ్బయ్యగారు : మరుపు కాదమ్మా. పరిస్థితులట్లా వున్నాయి.

అమ్మ : అందరమూ కలసి బాపట్ల పోదాం. నాలుగు రోజులు వున్న తరువా తనేను తెనాలి వస్తా.

వెంకట సుబ్బయ్యగారు : అయితే తప్పకుండా పోదాం.

అమ్మ : అప్పుడేమవుతాయి ఆ పరిస్థితులు.

వెంకట : యేమయితే నీకెందుకు, తప్పకుండా వస్తా, నీవు వస్తానంటె.

అమ్మ : అప్పటికి నా పరిస్తితులెట్లా వుంటాయొ.

వెంకట : నీకు కూడా పరిస్థితులున్నాయి?

అమ్మ : పరిస్థితులందరికీ ఒకటిగానే వుంటాయి.

వెంకట : నీవు వస్తానంటేనె వస్తాము.

అమ్మ : మీరు వస్తే, నాకు వీలుగా వుంటే వస్తా.

వెంకట : మీ నాన్న బలవంతముగా తీసుకెళ్లమని చెప్పారు.

అమ్మ : ఆ సంగతి నాకు చెప్పేదేముంది. అది మీ బలము మీద ఆధారపడి వుంది. యెవరి బలంకొద్ది వాళ్లు జూసుకోవచ్చు.

వెంకట : యింతా మేము తీసుకెళితే చెప్పకుండా వస్తావా?

అమ్మ : మీరు ఎంతగా తీసుకు వెళితే (అంటే బలాత్కారంగా) తీరుగా (అంటే రావలసిన రీతిగా) వస్తా.

జానకమ్మ : యెందుకు లాభం లేదు. దానికి యింత యిష్టం లేనిది యెందుకు. యింతమంది మనవరాళ్లు వుండగా యేమబ్బా అది రాకపోతె!

అమ్మ : అందుకనే రాను.

చిదం : యెందుకని ?

అమ్మ : యెందరో వున్నారుగా !

చిదంబర్రావుగారు : (వొదినగారి నుద్దేశించి) ఆమెకు మాట్లాడడం చేతగాదు.

అమ్మ : మాట్లాడ్డం చేతగాక మాట్లాడితే బాధలేదు.

చిదం : నీకు యెప్పుడూ బాధలేదులే అమ్మా.

అమ్మ : యీమాట నాకు ఆశీర్వచనంగా వుండాలి. "భరించలేని స్థితి అంటూ నాకు రాకూడదు".

చిదం : అనిర్వచనీయమైన శక్తి గలదానికి, నా ఆశీర్వచన మెందుకమ్మా?

అమ్మ : "నిర్వచనాలతో" వున్నాను గనుక.

చిదం : చప్పున అమ్మను తొడమీద పడుకోబెట్టుకుని యేమి పిల్లవమ్మా, పులి పిల్లవు!

అమ్మ : మీకు పులి అంటే భయం లేదా? అయినా నేను పులి పిల్లనయిననాడు మీరు పెద్దపులా? గంగరాజు పున్నయ్యగారు తల్లి లేని తల్లి అన్నారు. మీరు పులిపిల్ల అన్నారు. చదువుకున్న సంస్కారానికి, జ్ఞానానికి యింత తేడా వుంటుంది.

చిదం : అయితే నేను యేమంటే బాగుండేదమ్మా ?

అమ్మ : నేను యేదనమంటే అది అంటారా ? మీరు తోచింది అంటారా? "తొలి" మీ నోట యేది పలికిస్తే అది పలుకుతారు.

చిదం : నాదేముందంటే నాదే ముందనా? "తొలి" నేనే నన్నావుగా. ఆ తొలే నీ ముందుగానే వుందనా నీ అర్థం.

బండి స్టేషనులోకి వస్తుంది. అందరూ బాపట్లకు టిక్కట్లు తీసుకుని రైలు యెక్కుతారు.

7. శేముషీ వైభవం

వాడూ బిడ్డేగా :

అమ్మ, తాతగారు ఒక పెట్టెలోనూ, తక్కినవారంతా యింకొక పెట్టెలోనూ యెక్కుతారు.

చిదం : అమ్మా ! అనసూయా మనం బాపట్లలో దిగేలోగా వున్నయ్య గారిని గురించి క్లుప్తంగా జరిగిందంతా చెప్పమ్మా.

అమ్మ : అసలు మీకు యీ ఆలోచన యెందుకొచ్చింది తాతగారూ?

చిదం : నాకు నీయందు నీకు చెప్పటానికి చేతకానిది, నేనానందపడే అభిప్రాయము నాకు వున్నది. నీవు చిన్నపిల్లవని ఒక్కొక్కప్పుడు తోచదు. మరొకప్పుడు పసిపిల్లవుగా తోస్తావు. అసలు నీలో గొప్పతనమున్నా, లేకపోయినా ఒకే పిల్లను గురించి ఒకసారి ఒక అభిప్రాయం మరొకసారి యింకొక అభిప్రాయం సాధారణంగా తోచదుగా. పిల్లలయందు తోచదు. పెద్దలయందు తోచదు. యెవరి నైనా అర్థం చేసుకోలేకపోవటమో, తన శక్త్యానుసారము చేసుకోవటమో, జరుగుతుందిగాని ఒకే వ్యక్తిని గురించి అనేక రకాల భావాలు పోవు. అదే నీ అసాధారణ స్థితి. సాధారణంగా నాకు యెంత గొప్ప వారి యందు సదభిప్రాయము కలుగదు. నేనేమీ నీమాట బయటపెట్టను. విశ్వసించి, నా వికారములు పోగొట్టుకుంటా.

అమ్మ : ఆకారమే వికారంతో వచ్చింది తాతగారూ.

చిదం : అమ్మ తల గుండెలకు హత్తుకుని - అమ్మా ! లోకజనని. మాతా యీస్థితి ఎప్పుడూ వుంచమ్మా. అమ్మా, అమ్మోయ్ రంగమ్మ తల్లి గర్భాన రత్నగర్భ

ఆవిర్భవించింది. అని కాసేపు కనులు మూసుకుని, అమ్మలో కలిసిపోతాడు. తనంటే యేమిటో మరచి అమ్మే అయిపోతారు (యిది అమ్మమయావస్థ) బాపట్ల స్టేషనులోకి బండి వస్తుంది. తాతగారికి మామూలు స్థితి వస్తుంది. కాని మనిషి మైకంగా వుంటారు, కలత నిద్రలో వున్నవాడి మాదిరిగా, యెదురుగుండా యెవరు కనపడ్డా అమ్మా అమ్మా అంటూ "రత్నగర్భ" యేది? అంటారు.

అమ్మ : తాతగారూ రత్నగర్భ అంటే సముద్రమా? భూమా?

చిదం : రెండూనూ, అని డగ్గుత్తికతో అంటారు.

రైలు దిగి అందరూ సామాను అదీ సర్దుకుని వస్తూ వుంటారు.

అమ్మ, తాతగారు ముందువెళ్లి టిక్కట్లు తీసి గేటు దగ్గర ఆయనకు యిస్తూ, "అమ్మా యివిగో టిక్కట్లు" అంటారు.

టిక్కట్టు మాష్టారు గారు : తాతగారివంక యెగాదిగా చూస్తూ - నీకేమయినా మతిపోయిందటయ్యా?

అమ్మ : ఆ - ఆ - పోలా - మతి నీకు ?

మాష్టారు : యెవరినమ్మాయి నీవన్నది?

అమ్మ : యెవరికి మతిబోతే వారిని. అమ్మా అంటే అంత నామర్దాగా వున్నదా - అమ్మా

స్టేషన్ మాష్టారు : అట్లా అయితే నన్నేనా అమ్మాయి నీవన్నది. రైలుకు దిగి వచ్చినవారు అందరూ చూస్తూ వుంటారు. యెక్కువగా తాతగారిని యెరిగిన వారు వుంటారు.

వడ్లమూడి శ్రీరాములు గారు : (తాతగారితో) యీ అమ్మాయి యెవరండి?

చిదం : నా మనుమరాలు.

స్టేషను మాష్టారు : నన్నేనా అమ్మాయి నీవన్నది నేనడిగిన దానికి సమాధానం చెప్పవేం?

అమ్మ : అసలు జరిగిందేమిటో వీరందరికీ తెలిసేటట్టు వివరంగా చెప్పబ్బాయి శ్రీరాములు తాతగారూ నేను చెప్పేదా. తాతగారు టిక్కట్లు యివిగో అమ్మా అన్నారు. అప్పుడు నా చేతికిస్తున్నారేమోనని నేను చూచాను కాని చెయ్యి మాత్రము

ఆయనవైపే వున్నది. నన్ను కాదులే అని నేననుకున్నాను. వెంటనే ఆయన నీమతిపోయిందా యేం? అన్నారు. ఆయన నన్నన్నట్లా తాతగారినన్నట్లా?

శ్రీరాములు తాతగారు పకపకా నవ్వి - అమ్మ నెత్తుకుని ముద్దు పెట్టుకుంటూ, వీపు నిమురుతూ భుజము మీద వేసుకు వెళుతూ వుంటాడు. టిక్కట్టు మాష్టారు గుడ్లు తేలవేసి చూస్తూ వుంటాడు. యీలోగా టిక్కట్టు యిచ్చినవాళ్లు యివ్వనివాళ్లు అంతా గేటుదాటి వచ్చేస్తారు. ఆ రోజు టిక్కట్టు కొనుక్కోనివారు చాలా సుఖంగా, సంతోషంతో బీదలందరూ అమ్మకు మనస్సులో నమస్కారము చేస్తూ వెళ్లిపోతారు. యిదంతా చూచి స్టేషను మాష్టారు 'యీసారి స్టేషనుకు రానీయి చెపుతా!' అని అనుకుంటారు తలవూపుతూ.

శ్రీరాములుగారు అమ్మను యింటి ముందరకు తీసుకుకొచ్చి దింపి, "నిజం చెప్పమ్మా. యేం జరిగిందమ్మా అక్కడ. నీవు చెప్పటం విని సంతోషమాగక యెత్తు కొచ్చానమ్మా".

అమ్మ : యింకా నయం మీరు యెత్తుకొచ్చారు గనుక అంతటితో పోయింది.

శ్రీరాములు : లేకపోతే వాడినే భుజాన వేసుకుపోవలసి వొచ్చేదా?

అమ్మ : ఎబ్బే, అట్లా యెందుకులెండి వాడూ బిడ్డేగా?

శ్రీరాములు : ఓహో! యింతలావు అమ్మవారివా నీవు!

అమ్మ : నేను యెంత చిన్నమ్మనైనా యింతలావు తాతగార్లకు తగాదాబెట్టా! అమ్మా అంటమేగా కారణం - అంతేలే, అన్నింటికి అమ్మే కారణం!

శ్రీరాములు : యెంత బాగున్నయ్యమ్మా నీమాటలు. నీతో పోట్లాట పెట్టుకుంటె యెంత బాగుంటుంది?

అమ్మ : అని మాట్లాడితే పోట్లాట యేమెుస్తుంది? మాట్లాడడమేనా పోట్లాడడమంటే?

శ్రీరాములు : యిట్లాగే మాట్లాడుతూ వుండమ్మా.

అమ్మ : యెందుకూ, పోట్లాడుతూ వుంటారు నాతో.

శ్రీరాములు : కాదమ్మా కాదు, నీ ధ్వని విందామని.

అందరికీ అమ్మ :

యింతలో సామాన్లతో సహా అందరూ యింటికి వస్తారు. అమ్మ మేడమీద మూలగదిలో కూర్చుంటుంది. తాతగారు వెళ్లి వారి గదిలో వారు పడుకుంటారు. వంటమనిషి (అద్దేపల్లి చెంచమ్మగారు) అందరకూ కాళ్లకు నీళ్లు యిచ్చి. "అమ్మాయిగారు యేది" అంటుంది?

అన్నపూర్ణమ్మ : యేమోనమ్మా, మాకంటే ముందే వచ్చింది ఆమెగారు. ఆమె తాతగారి దగ్గిర వుందేమొ.

చెంచమ్మ : ఆ అమ్మాయిని చూడాలనిపిస్తున్నదమ్మా ! ఒకసారి మేడమీదికి వెళ్లి చూసి రమ్మంటారూ?

అన్నపూర్ణమ్మ గారు : చూసి రామ్మా, పో! అంటారు.

వెంకట సుబ్బయ్య తాతగారు దక్షిణపు వైపున వున్న అరుగుమీద కూర్చుని తన బిడ్డ రంగమ్మగారు జ్ఞాపకం వచ్చి యేడుస్తూ వుంటారు. జానికమ్మ వూళ్లో వున్న కుమార్తె గారింటికి (అంటే యెల్లంరాజు హరినారాయణగారి భార్య వరలక్ష్మమ్మగారు) వెళుతుంది.

మరిడమ్మ తాతమ్మగారు బాదమాకులు ముందర పోసుకుని విస్తళ్లు కుడుతూ వుంటారు. అన్నపూర్ణమ్మగారు స్నానము జేసి దేవతార్చన గదిలోకి వెళతారు.

వంటమనిషి మేడమీదకు వచ్చి గదిలో కిటికీలో వున్న అమ్మను చూచి "మా అమ్మా, యెప్పుడొచ్చావు! మా అమ్మ వొచ్చిందే!" అని యెత్తుకుంటుంది. యెత్తుకుని మేడమీద నుండి కిందికి తీసుకొస్తుంది. నీళ్లుపోసి "అమ్మా నేను పీట వేస్తాను కూర్చుని వంట చేస్తూ వుంటే చూస్తూ వుంటావా?" అమ్మ మాట్లాడకుండా సరేనన్నట్టుగా తలవూపుతుంది. పీట మీద కూర్చుని చూస్తూ వుంటుంది.

వంట పూర్తి కాగానే అమ్మకు విస్తరి వేసి అన్నం పెట్టి తినమ్మా అంటుంది.

అమ్మ : మా తాతగారు రానిదే నేను తినను.

చెంచమ్మ : వారు వచ్చేటప్పటికి ప్రొద్దెక్కి పోతుంది.

యింతలో తాతగారు దిగి వస్తారు. మామూలు స్థితిలో వుంటారు. "అందరూ స్నానాలు చేసి భోజనాలకు రావచ్చు". అని చెంచమ్మగారు అంటారు.

చిదం : మా అన్నగారు యేరి ?

చెంచమ్మ : కనపడలేదండి !

చిదంబర్రావుగారు వెంకట సుబ్బయ్య తాతగారు వున్నచోటికి వచ్చి, "స్నానం చెయ్యి అన్నయ్యా" అంటారు. అందరూ స్నానాలు చేసి భోజనాలు పూర్తి చేస్తారు. అమ్మ, చిదంబర్రావుగారి ప్రక్కన బాదమాకులో భోంచేస్తుంది. తాతగారు కోర్టుకు వెళ్లబోయే సమయములో లోగడ వంటమనిషి రాఘవమ్మగారి దగ్గర నుండి వుత్తరం వస్తుంది.

'మీరు లేనప్పుడు అత్యవసరం కలిగి నేను వెళుతూ చెంచమ్మగారిని నా స్థానంలో యేర్పాటు చేసి వెళ్లాను. లోగడ మీకు పరిచయం వున్న వ్యక్తే కదా అని వుంచాను. క్షమించండి' అని రాస్తుంది.

అమ్మ అన్నయ్య రాఘవరావుగారు సైకిలు వేసుకుని యెటో వెళతాడు. అన్నానికి రాలేదు. అమ్మ తాతమ్మగారి దగ్గరకు వెళ్లి, "మా అన్నయ్య యింకా అన్నానికి రాలేదె, అందరం తిన్నాం, తల్లికి ఒక బిడ్డ రాకపోయినా దిగులే".

మరిడమ్మ తాతమ్మ : అదేమిటమ్మా అన్నయ్యను పట్టుకుని బిడ్డ అంటావు. అయినా వాడు అన్నం తినకపోతే బాధపడే తల్లికాస్తా దాటిపోయింది గదా!

అమ్మ : వాడు అన్నం తినకపోతే బాధపడే తల్లి పోయిందిగాని యెవరు అన్నం తినకపోయినా బాధపడే తల్లి వున్నది.

మరిడమ్మగారు : యెవరు ఆమె ?

అమ్మ : 'యెవరు ఆమె' అనే ఆమెకు పెంచిన మమకారము వున్నది, యీమాట చెప్పే అమ్మ అమ్మగా అర్థం కాకుండా వుంది. అంతే -

మరిడమ్మగారు : అయితే పెంచిన మమకారము నాకు. అమ్మవై అమ్మగా గుర్తించకుండా వున్న అమ్మవు నీవనా - అర్థం ?

అమ్మ : తీసుకోగలిగిన వారికి తీసుకో గలిగినంత.

మరిడమ్మగారు : అందరికీ అమ్మ అయిన అమ్మ రప్పించుకోవచ్చు, సరి అయిన దారిలో పెట్టుకోవచ్చు.

అమ్మ : చెయ్యటం చేతుల్లో వున్నప్పుడు బాధవుండదు. మాట వుండదు. ప్రతీదీ ఒకేసారి నిర్ణయమయి వుంటుందిగా. మారేదయితే మారటానికి వీలున్నదయినా ఆ స్థితిని నిర్ణయమని అనరు. నిర్ణయమంటే తప్పనిసరిగా జరిగేది. నేను అమ్మగా నిర్ణయించబడ్డా, అమ్మ అమ్మగా కనుపించకపోయినా అన్నీ తను యేర్పరచుకున్నవయినా, ఆ యేర్పాటు సక్రమంగా నెరవేర్చవలసిందే. ప్రథమంలో స్పందనం కలిగేటప్పుడే యెవరెవరి పడకలు వారికి యేర్పడ్డయి, యీ సంగతి ఆ స్పందనాన్ని అడుగుదాం. నీటికి (చెమ్మ) తడి యెట్లా స్వభావమో, ఆ స్పందనం అనేక రూపాలై కూర్చుంది. నీటికి తడి స్వభావం, నామాటకాదు ఒకప్పుడు నీవు చెపుతున్నమాటె. నీవు మాట్లాడింది నీభావనేనా? నీ భావానికి తగినట్లు చెపితే నీకు అర్థమవుతుంది అని చెప్పాను ఆ వుదాహరణ.

మరిడమ్మ తాతమ్మ మాట్లాడటం మానేసి అమ్మ ముఖము వంక కన్ను ఆర్పకుండా మాట్లాడుతున్న విషయాన్ని మర్చిపోయి తన గురువు గారయిన మల్లెల రత్తమ్మగారిని అమ్మ ముఖములో చూస్తూ పాత గుంటూరులో తన గురువు గారి దగ్గరకు వెళ్లటం, ఆమె చేసిన బోధ అమ్మ ముఖంలో పునశ్చరణ చేస్తుంది. అది అనుభవించేటప్పుడు అది పునశ్చరణగా తోచదు. అప్పుడు జరుగుతున్నట్టే వుంటుంది. యిదంతా ఒక అరగంట కాలంలో జరిగిపోతుంది. తాతమ్మ గారికి తన గురువుగారే యీ రూపంలో వచ్చి దర్శనమిచ్చిపోయినట్లుగా, యిదే నిదర్శనంగా భావిస్తుంది. అందులో అమ్మాయి ముఖములోనె కనపడటంలోనె విశేషమేమిటి. యే సందర్భములో నయినా యెవరి దగ్గరయినా రాగూడదా? లేక ప్రత్యేకం కనపడగూడదా? అని అనుకుంటుంది. చిన్నపిల్ల పవిత్రమైన మనస్సు యే కల్మషాలు వుండని హృదయం అని తను ప్రత్యేకం కనపడితే మా గురువుగారు నన్ను గుర్తించి వచ్చారనే గర్వం వస్తుందని, "బాల" బ్రహ్మతో సమానం గనుక యీ బ్రహ్మానందాన్ని కలుగజేసింది.

తాతగారు కోర్టునుండి వెళ్లిన వెంటనే తిరిగి వస్తారు.

అమ్మ : యెప్పుడు వెళ్లారు, చూడనేలేదే. వెళ్లటానికి, రావటానికి వ్యవధి లేదే. అన్నయ్య అన్నానికి రాలేదు. మీకెక్కడయినా కనిపించాడా?

చిదం : లేదమ్మా !

అమ్మ : అన్నయ్యను గురించే నేను, తాతమ్మ మాట్లాడుతున్నాము.

చిదం : యేం మాట్లాడుతున్నావు అమ్మా?

అమ్మ : అన్నయ్య రాలేదనే చింత తాతమ్మతో చెపుతున్నా. చింతక్కారణం "నా సొంతం అనుకోవటమేగా" తాతగారూ? సొంతం అనుకోకపోతే సౌఖ్యానికి దారి లేదు. సౌఖ్యం గలదారిగా కనపడుతూ దుఃఖాన్ని రుజువు చేస్తుంది నాది అనేది.

చిదంబర్రావుతాతగారు (మరిడమ్మగారి నుద్దేశించి) "వీలు కలిగినప్పుడల్లా అమ్మాయితో ఏకాంతంగా సంభాషణ చేస్తే చాలా హాయిగా కాలం గడుస్తుంది ఏన్నీ".

అమ్మ : ఏకాంతంగా అంటే సంభాషణ పోతుందండీ తాతగారు.

తాతగారు : వీళ్ళందరూ యెక్కడికి పోయినారు?

మరిడమ్మ : అందరూ ప్రయాణ బడలికతో పడుకున్నారు. చెంచమ్మ యిల్లు కడుగుతున్నది. రాఘవుడు అన్నానికి రాలేదు యింకా. అయితే చిదంబరా నాతో యీమాట అనటానికి నీకు యేదైనా అనుభవం కలిగిందా?

ఆ అడిగేటప్పుడు అమ్మ దొడ్లోకి వెళుతుంది.

చిదంబర్రావు తాతగారు : మొత్తం మీద మన ఆవరణంలో బ్రహ్మాండం నిండి వున్నది. అంటే నిండింది కనపడేది కాదు. పరిమితంగా కనపడేది. అది నిండి వుంటే అందరికీ అర్థమయ్యేది కాదు. చాలా పరిమితంగా వుంది. అర్థమయినట్టు వుండి అయోమయంగా వుంటుంది. అర్థం కాకుండా వుండి అయోమయంగా వుంటుంది. అర్థం కాకుండా వుండివారి వారి సంస్కారాన్ని బట్టి అర్థమవుతుంది. అర్థమయినట్లు వుండే అయోమయ మవుతుంది. అసలు ఆ స్థితి అంతేనేమొ. ఆ రంగమ్మతల్లి పోతూపోతూ మనచేతుల్లో పెట్టినందుకు జాగర్తగా ఆ బిడ్డను బైట పెట్టకుండా, భగవంతుడు మనకొక వరమిచ్చినట్లుగా యే వ్రతమూ చేయకుండా లభ్యపడ్డది గనుక ఆయాచితంగా కలిగిన ఫలం భగవంతుడే యీ రూపంగా వచ్చినట్లు యీభావం నిలిస్తే లోగడ మన ప్రయత్నాలన్నీ; మన అంటే నేను అని కాదు లోగడ అమ్మమ్మ అనగా అమ్మాయమ్మగారు (మరిడమ్మగారి తల్లి) నాకు మేనమామ అయిన చలపతిరావుగారు, (అనగా సీతాపతి తాతగారికి పినతండ్రి. అమ్మాయమ్మ గారనగా సీతాపతి తాతగారికి నాయనమ్మగారు) బ్రహ్మచారియై అందరికీ సేవచేసి కడతేర్చిన నీవు. మీ ముగ్గురి యొక్క సాధన చతుష్టయ సంపత్తి సారం అమ్మగా అవతరించింది.

మరిడమ్మ తాతమ్మగారు ఆనందంతో కంటివెంట నీరుపెట్టి యీ క్షణాన వున్నట్టి వుద్దేశాలు సర్వవేళలా చెదరకుండా నీలో చేర్చుకో తల్లీ! అని అమ్మ కూర్చుని లేచిపోయిన పీటమీద తలపెట్టి మళ్లీ మాయను కప్పకమ్మా: అని తాతమ్మగారు స్తోత్రం చేస్తారు. యీ సమయంలో అమ్మ దొడ్లోనుంచి లోపలికి వస్తుంది.

చిదంబర్రావు తాతగారు : (తాతమ్మ తల దగ్గర కూర్చుని) పిన్నీ మనస్సులో అనుకోవలసిందే కాని బైటికి పెద్దగా రానీయ వద్దు.

మరిడమ్మ తాతమ్మ : అసలు పుట్టిననాటి లక్షణాలే ఒకరకంగా వున్నయిరా నాయనా. నేను మాత్రం కనుక్కోలేక పోయినాను! నేను అక్కడ లేననుకో. విన్న స్థితినిబట్టి చూస్తే కడుపులో పడ్డప్పటినుంచీ జరిగిన పరిస్థితులన్నీ ఒక మహాపురుషుడు పుట్టేటప్పటి లక్షణాలుగానే వున్నాయి.

చిదం : జరిగిపోయినవి వదిలేసెయ్యి, యిప్పుడు మనకు కలిగిన యీ అనుభవాలను మాయ కప్పకుండా వుంచితే చాలు.

అమ్మ ! వీళ్లమాటలు విననట్టుగా పక్కకు పోతూ తనలో తను అనుకుంటూ వున్నట్లుగా "నాటకంలో వేషాలు వేసుకు రావటానికి తెరలు అవసర మయినట్లుగా", అని అనుకుంటూ వెళుతూ వుంటుంది.

చిదం : యెక్కడ నుంచి వస్తున్నావమ్మా నాకేనా యీ సమాధానం.

అమ్మ : అనుకుండేది నాకోసమే యీమాట అందరకూ వుపయోగపడవచ్చు.

చిదం : (నవ్వుకుని ముసి ముసి నవ్వులతో) యింకా వేరే అనుభవాలు యెందుకమ్మా పిన్నీ, యీ చిన్న వయస్సులో యీ రకమయినటువంటి సమాధానాలు ఆలోచనా కలుగుతుందీ? మాటలు కూడా రాని వయస్సు కదా!

మరిడమ్మ తాతమ్మ : పీటమీద వున్న తలపైకెత్తి, యీ అనుభవాలు మన యిద్దరికే కాదుగా. యీ మాటలు, యీ సమాధానాలు అందరూ వింటున్నవేగా. నీవొక్కడికే యిలా తోచింది!

చిదం : నేను నీకొక్కదానికే చెప్పగలిగా. నాకు మాత్రం యీ సంపూర్ణమైన వుద్దేశం నిలుస్తుందనే నమ్మకం మాత్రం యేముంది?

అమ్మ : (లోపల నుంచి తాతగారి దగ్గరకు వస్తూ) సంపూర్ణమైనప్పుడు తొలిగేదేంటి?

తాతగారు, తాతమ్మ యిద్దరూ ఒకేసారి అమ్మ ముఖము వంకజూచి మనకు యిక యేమీ తరుగులేదు! (యిద్దరూ ఒకేసారి) తాతయ్య : ఒకవేళ నీవు మాయను కప్పినా ఒకసారి తెలియపరచి పూర్తిగా అసలు నీ రూపమేమిటో చూపించి, తరవాత వేసుకో తెర.

అమ్మ : తెర లోపల తెర యెప్పుడూ వుంది. నాకూ తెర వుంది. నేను వేషమేసుకోటానికి నాకు తెర, నా వేషం మీకు చూపటానికి మరొక తెర, మాటలతో తొలగని తెరలు, మూటలతో లోపలకు రాలేరు. (మూటలు అంటే ధనము)

మరిడమ్మ గారు : మాకేమీ వద్దులే అమ్మా. యిప్పుడున్న అభిప్రాయాన్ని మార్చకుండా చెయ్యి.

చిదంబర్రావు తాతగారు : నమ్మక వేమున్నది నాకూ మారుతూనె వుంటుందమ్మా. నాకీ అభిప్రాయం పున్నయ్య గారికి కలిగిన స్థితి దగ్గరి నుంచి ఆలోచన పూర్తిగా కలిగింది. నేను అడిగేవి తను నోటితో చెప్పకపోయినా మనస్సుకు మాత్రము తగిలేట్టు చేస్తున్నది. పున్నయ్య గారికిచ్చిన అనుభవాల కంటే యెక్కువే వున్నవేమొ? ఆయన అనుభవాలు నాకు తెలియవనుకో! అయినా ఆయన భక్తుడు. ఆయనకు కలగటంలో విశేషం లేదు. నాలాంటివాడికి కలిగే అనుభవాలు కేవలం అనుగ్రహం! మనస్సులో పవిత్రత లేదు. అపవిత్రుడికి పవిత్రతను ప్రసాదించింది అమ్మ.

మరిడమ్మ : యీక్షణం మళ్లీ రాదురా నాయనా! అమ్మవంక తాతమ్మగారు ఆనందంతో తీక్షణంగా చూస్తుంది. అది కోపమో, ఆనందమో తెలియదు.

అమ్మ : తాతమ్మ వంక చూచి. తాతమ్మా మీ అమ్మ అమ్మాయమ్మగారి సంగతి చెప్పవమ్మా వింటాను.

మరిడమ్మ తాతమ్మ : మా అమ్మ అమ్మాయమ్మే యీ అమ్మ అయితే యింకా చెప్పేదేముంది? నీకు తెలియందే ముందమ్మా?

అమ్మ : పెద్దవాళ్లు అంటూ వుంటారె తెలిసీ తెలియని స్థితి అని, అదీ నాది.

మరిడమ్మ : అది నీవంటివాళ్లకు వర్తిస్తుందటమ్మా ! అది చిన్న పిల్లల్ని అనే మాట.

అమ్మ : ఆ మాట చిన్నపిల్లల్ని అనవచ్చుగాని ఆ మాట అర్థం యిదే. తెలిసి కూడా తెలియనట్టుండేవారికి చెప్పటం కష్టం కాదు మరి.

చిదంబర్రావు తాతగారు : యెంత చక్కగా విడదీసావమ్మా! యిట్లాగే వివరించు తల్లీ. కాళిదాసుకు వరమిచ్చిన కాళి నీ దగ్గర నేర్చుకున్నట్లు వున్నది. కాళి మొక్కిన వాళ్లకు వరమిస్తుంది. నీవు మ్రొక్కనివాడికి మ్రొక్కినవాడికి.

అమ్మ : వరాలివ్వటమా నా దగ్గర నేర్చుకున్నది?

చిదంబర్రావు : కాదు కాదమ్మా. ఒక్క కాళే కాదు అవతారాలనే దేవుళ్లంతా అవతరించిన సర్వ దేవదేవీ స్వరూపిణివై సర్వ కార్యాలకు కారణమై, అకారణంగా సకల కార్యాలు నడుపుతున్న సగుణమూర్తి వమ్మా.

మరపులేని మరుగు :

మేడమీద నుండి యెవరో వస్తున్నట్లు శబ్దమవుతుంది.

చిదంబర్రావు : యెవరో వస్తున్నారు పిన్నీ.

యీ మాట అనగానే అమ్మలేచి బాదము చెట్టు క్రిందకు వెళుతుంది.

వెంకట సుబ్బయ్య గారు నిద్రలేనివచ్చి చిదంబర్రావుగారితో "యీ రాత్రి వెళతా నాయనా".

చిదంబర్రావు : వెళితే వెళుదువుగానిలే. అమ్మాయిని కాసేపు దగ్గరకు తీసుకో.

వెంక సుబ్బయ్య : యెందుకు నాయనా, నామాట వినదుగా దగ్గర కూర్చుంటే ఆవేదన మంట యెక్కువ. నిద్రపోతుంటే కల వచ్చింది. రంగమ్మ కనపడి నాన్నా పిల్లని తీసుకెళతావా? అన్నట్టుగా.

ఆ మాట వినగానే చిదంబర్రావు తాతయ్యకు కళ్లవెంట నీళ్లు వస్తాయి.

యిద్దరు తాతయ్యలు బాదము చెట్టు క్రింద వున్న అమ్మ దగ్గరకు ఒకేసారి వస్తారు.

(బాదము చెట్టు వయస్సు 1961 సం॥ నవంబరు 16 తేదీ నాటికి ప్లవ సంవత్సర కార్తీక శుద్ధ ఏకాదశీ శనివారము రాత్రి గం. 2 లు అమ్మ యిది వ్రాయించే రోజుకు ఆ చెట్టు వయస్సు 48 సంవత్సరములు).

తెనాలి తాతగారు అమ్మను లేవదీసి భుజము మీద పడుకోబెట్టుకుని తెనాలి పోదాము వస్తావా అమ్మా! మీ అమ్మ తీసుకెళ్లమన్నది.

అమ్మ : ఎప్పుడు చెప్పింది?

వెంకట : కలొచ్చిందమ్మా. నిద్రపోతూ వుంటె వచ్చి చెప్పింది.

అమ్మ : పొమ్మని నాకు చెప్పదేం. తెనాలి పొమ్మనీ నాకు చెప్పితే వస్తా! తీసుకెళ్లమని పెద్దవాడివని చెప్పిందిగాని చిన్నపిల్లనని నాకు చెప్పకూడదూ తెనాలి వెళ్లమని.

వెంకట : చెప్పితే గాని రావటమ్మా?

అమ్మ : మీరు రమ్మని అనలేదుగా! మీరు రమ్మనటం నేను రావటం తరువాత. మీ అమ్మ తీసుకెళ్లమంది వస్తావా అన్నారు. మా అమ్మ పొమ్మంటే వస్తాను అన్నా.

చిదంబర్రావు తాతగారు : వాళ్ల అమ్మ చెప్పిన పనులన్నీ చేస్తున్నామా అన్నయ్యా. మనం పదిసార్లుగా వాళ్ల అమ్మను జ్ఞాపకం చేయటమెందుకు?

అమ్మ : అమ్మను ఒకరు జ్ఞాపకం చెయ్యటమేమిటిలెండి తాతగారు. "మరపురానిది అమ్మ, మరువలేంది అమ్మ, మరొకరడ్డు లేనిది, యెవ్వరూ తీసివేయలేనిది".

వెంకట సుబ్బయ్య : ఆ కరువు యెవరూ తీర్చలేరు!

అమ్మ : యింకా నన్ను మీరు తీసుకెళ్లటం యెందుకు తాతగారు. కరువు తీర్చలేనిది.

చిదం : నీ కరువు తీర్చటానికి కాదమ్మా! ఆయన కరువు తీర్చుకుంటాడు. యీ రూపంగా.

అమ్మ : నాతో ఆయన కరువులేమి తీరతయి తాతగారు. ఆయనతో నా కరవు తీరదు, నాతో ఆయన కరవు తీరదు!

చిదం : మేము తీర్చలేముగాని, నీవు తీర్చగలవమ్మా !

అమ్మ : యెవరూ తీర్చలేరు. యెవరికీ తీరని వ్యథలే. నేను ఆయన కూతురునై కనపడలేను. ఆయన నాకు అమ్మై కనపడలేరు. ఆయన తాతగాలే. నేను మనుమరాలినె.

వెంక సుబ్బయ్య : పూర్తిగా నీ వుద్దేశం చెప్పమ్మా.

అమ్మ : నేనందుకు రాలా.

చిదంబర్రావు : అంతా మరుగేనా?

అమ్మ : "మరపు లేదుగాని మరుగువున్నది మరుగే నా గురువు!"

చిదంబర్రావుగారు : అంటే నీ లక్ష్యం అదన్నమాట.

అమ్మ : అదేగా యీ లక్షణమంతా.

చిదంబర్రావు : పోనీ, యిదయినా తక్షణం చెప్పావు.

అమ్మ : అదయినా నీ సమక్షంలోనే.

చిదంబర్రావు : యెంత ప్రత్యక్షంగా వినిపిస్తున్నదో చూడు. యింకా నీకు దిగులెందుకు ఆ మంట మంటె. అందులో అతి వినయం గల బిడ్డ. యెవరి మనస్సు నొచ్చకుండా, యెవరికి యేబాధ పెట్టకుండా దాటి పోయింది.

అమ్మ : మీరంతా యిప్పుడు పడేది బాధగాదూ తాతగారు. యిప్పుడు పోవటం అవివేకం కాదూ? బ్రతికివుంటే ఒకరిద్దరినే బాధ పెట్టేది. యిప్పుడు అందరినీ బాధ పెడుతున్నది.

వెంకట : అబ్బబ్బా యేం చంపుతుందిరా, నోరు యెత్త నివ్వదు.

అమ్మ : మీ అమ్మాయిని చంపావన్నావు యిది వరకు. యిప్పుడు అందరినీ చంపుతున్నానంటున్నావు. యిదేగా బాధ పెట్టటమంటే?

చిదంబర్రావు : తప్పేముందమ్మా "లయ కారిణివి" అన్నీ నీవేగా?

మరిడమ్మగారు వచ్చి, "యేమిటో వాడి సంగతి అందరూ కలసి ఆలోచించండి నాయనా" (అంటే సీతాపతి గారు)

వెంకట : యింకా ఆలోచించేదేముంది పిల్లల్ని తెనాలి తీసుకు వెళతాను. వాడి సంగతి మీరు ఆలోచించండి. రాఘవుడిని భరించటం కష్టం. వీడిని తీసుకెళితే వాడిని సీతారాముణ్ణి పాడుజేసినట్టు అవుతుంది. వీడికి తోడు వాడు అవుతాడు (సీతారామయ్యగారు అమ్మ మేనమామ)

మన్నవ నుంచి సీతాపతి తాతగారు వస్తున్నారు. "అరుగో మా నాన్న వస్తున్నా"రంటూ పరుగెత్తుకెళుతుంది. సీతాపతి తాతగారు అమ్మను భుజము మీద యెత్తుకుని దొడ్లోకి వస్తారు.

చిదంబర్రావు : అదుగోనయ్యా రానే వచ్చాడు. తేల్చేసెయ్యి.

అమ్మ : (నాన్న చంకలో వుండి) యిది సమయం కాదు.

చిదంబర్రావు : పోదాం పదండి. పనులు వున్నాయి. నేను వెళ్లాలి. అన్నయ్యా పని వున్నది అటు వస్తావూ.

వెంకట : యిప్పుడు కాదులె మళ్లీ వస్తావుగా. నాకు పెళ్లితో యేమీ సంబంధం లేదు. నేను పెట్టిందేదో పిల్లకుంచండి.

అమ్మ నాన్నగారి చంకలో నుండి జారి పరుగెత్తుకొచ్చి "నీవు పెట్టిందంటూ లేదు. నీవు పెట్టింది అంటుకొని లేదు".

సీతాపతి తాతగారు తల వూపుకుంటూ, బావి దగ్గరకు వచ్చి కాళ్లు కడుక్కుంటారు.

చిదంబర్రావు : అంటకున్నదేదో వదిలే పోయింది. యీ పిల్లలున్నారు గనుక యీ ఆలోచన.

అమ్మ : యివే చిక్కుడు కాయలు (చిక్కొచ్చిన పిల్లలు)

చిదంబర్రావు : నవ్వి, మీతో వచ్చిన చిక్కేముందమ్మా. వాళ్ల గీతలో వున్న చిక్కుగాని, అయినా ఆ చిక్కుడు కాయల మాట యెట్లా తోచింది. చక్కగా వుంది.

అమ్మ : అది మీ పెంపకం. కాయలంటే పిల్లలుగా తోచింది. కాడ చిక్కురొక్కురుగా అల్లుకుపోయింది. యిప్పుడు పరిస్థితులట్లాగే వున్నాయిగా. అందుకని చిక్కుడుకాయలన్నా.

చిదం : అందుకేగా కాళికి కూడా నీవే నేర్పింది అన్నది.

అమ్మ : ఈ మాట అనకముందే అన్నారుగా.

చిదం : అబ్బా ! అబ్బా ! యిదే కాదమ్మా. నీ నోటివెంట, యేది వచ్చినా అట్లాగే వుంది.

అమ్మ : ఒక సంగతి అడుగుతా కోప్పడకుండా వుంటారూ ! అబ్బబ్బా ! అంటే యేమిటి? మీ నాన్నగారిని తలుచుకోవటమా, విసుగుబుట్టి యేమీ చేయలేక నాన్నకు చెప్పుకోవటమా ?

చిదం ! (పకపకా నవ్వి) మేమనేది, ఆ అర్థంతో కాదుగాని, నీవన్నదానికీ వర్తిస్తుంది. అని అమ్మచేతి బొటనవ్రేలు తీసుకెళ్లి నోటిలో పెట్టుకుంటారు. యేంటో తీయగా వస్తుందమ్మా నోట్లోకి, ఆ తీపి యింతపని చేస్తూ వుంది.

అమ్మ : ఆ తీపి అంతా మీనోట్లో వుందా? నా చేతిలో వుందా? శరీరమంతా వుందా? వుభయులకూ వున్నదా తీపి, వున్న స్థితి యెటువంటిదో గ్రహించే స్థితికూడా అటువంటిదే.

చిదంబర్రావు : నీవు యెట్లా చేస్తే అట్లా అవుతుందమ్మా.

అమ్మ : యిదొక వాడుక పదం (అనుకోకుండా నోటివేంబడి) "అభ్యాసయోగ యుక్తేన"

చిదంబర్రావు : (వులిక్కిపడి ఆశ్చర్యముగా) యెక్కడిదమ్మా, మళ్లీ చదువు, మళ్లీ చదువు.

అమ్మ : నాదగ్గర కాగితాలున్నయ్యా, పుస్తకాలున్నయ్యా మళ్లీ చదవడానికి.

చిదంబర్రావు : యిందాక యెట్లా చదివావో అట్లా చదువమ్మా !

అమ్మ : యిందాకటి ఆ మూడ్ (స్థితి)లో అన్నాను.

చిదంబర్రావు : యిది యెక్కడ విన్నానమ్మా.

అమ్మ : కన్నానయ్యా ?

చిదంబర్రావు : యేవమ్మా యేమమ్మవమ్మా, యేమమ్మ యేమిటి, కమ్మనమ్మ! అనుకుని ముద్దు బెట్టుకోబోతారు. వెంటనే మధ్యాహ్నం జరిగిన సంభాషణ గుర్తుకొచ్చి 'యిట్లాగే తెరవేస్తుంది. మోసపోతాం.'

సాయంకాలం ఆరుగంటలు అవుతుంది.

ముద్దుపెట్టుకోబోయినప్పుడు అమ్మ కనిపించదు. వెంటనే తాతగారు యిదుగో యిట్లాగే తెరవేస్తుంది. కాసేపు చిన్నపిల్లగా కనపడి ముద్దులు మూట గడుతుంటె మోసపోతాం, యేమిటి అమ్మా అదృశ్యమయిపోయావు.

అమ్మ : అదే మీకు సాదృశ్యం!

చిదంబర్రావు : రూపం చూపించి తెరవెయ్యమ్మా అని లోగడ అడిగాను. యిదేనా చూపించి తెరవేయటం?

అమ్మ : రూపంలేనిది రూపం వొచ్చింది. వొచ్చిన రూపం పోయింది. నా రూపం చూపించమని అడిగారు. వున్నది గనుక లేకపోవటం అంటూ వచ్చింది. లేదు. గనుక రూపం వున్నదంటూ వచ్చింది. లేని రూపం నిర్గుణం. వున్న రూపం సగుణం. అదే నిర్వికారం, సాకారం, నిర్వికారానికి ఆకారముంది. సాకారానికి వుంది. వున్నదేదో వున్నది. ఈ వున్నదే అది! అది నేను!

జానికమ్మ అమ్మమ్మగారు, కూతురు గారి యింటివద్ద నుంచి అమ్మ వున్నచోటకు (చిదంబర్రావు గారింటికి) వస్తుంది.

విధే విధానం :

వెంకట సుబ్బయ్య తాతగారు, జానికమ్మ అమ్మమ్మగారు, తెనాలి ప్రయాణం అవుతూ, సీతాపతి తాతగారి దగ్గరకు వెంకట సుబ్బయ్యగారు వచ్చి - "నాయనా సీతాపతీ! తెనాలిలో నాలుగు రోజులు వుండి పిల్లలు నువ్వు వద్దురు గాని, ఆశీర్వచనం బట్టలు కట్టుకుని, నీవు ఒక యింటివాడవు కావద్దూ!"

సీతాపతిగారు : నాలుగు రోజులలో వస్తాలెండి! యింకా బట్టల ఖర్చు తప్ప నాకెందుకు బట్టలు ? నాకాశీర్వచనం భగవంతుడెప్పుడో ఆశీర్వదించాడు. నన్ను మీరు ఒక యింటివాడిని కాదు చేసేది, బజారుపాలు చేస్తారు. కళత్ర యోగం బాగుండొద్దూ? బాగుంటె అట్లా జరిగేది కాదు. నాకా బిడ్డ పోయిందనే బాధ, కొరత రెండూ లేవు. యెప్పుడూ దగ్గరే వుంది. (రంగమ్మ గారు యెప్పుడూ శరీరము వదిలినప్పటికి సన్నిహితములో వున్నట్టే కనపడుతూ వుండేది) మీరు పెళ్లి చేసినా దాంపత్యం రాదుగా, నన్ను లౌకిక మార్గాలలో బెట్టి కొన్ని పద్ధతులు నేర్పి కీర్తితెచ్చి నన్ను ప్రస్తుతం కృశింపజేస్తున్నది. దగ్గిర వున్నట్టుగా వున్నా యేదో కొరత కనపడటం చేత బాధ తప్పటం లేదు. దగ్గర వుండటమనేది స్వప్నావస్థగా వుంటుంది. యిదమిత్థమని చెప్పలేను. యీ స్థితిలో యేదీ నిర్ణయించుకోలేను. పిల్ల బాధ మరీ తీవ్రంగా వుంది. పిల్లను యెవరయినా చూస్తారు. చూడకపోయినా యిది కావాలి. వద్దనేది లేదు గనుక బాధలేదు. యీ అల్లరివాడిని (రాఘవరావు మామయ్యను) యెవరు భరిస్తారు?

జానికమ్మగారు వచ్చి "యెందుకు అట్లా బాధ పడతారు (సీతాపతి తాతగారితో) వాళ్ల అమ్మ పోయిందిగా యిక బుద్ధిగలవాడు అవుతాడులే. వున్న నాలుగు రోజులు యేడిపించుకు తిన్నాడు."

సీతాపతి తాతగారు : యేది యెట్లా వున్నా ఆరోగ్యమయినా వుంటే యీ పిల్లకు - ఆ సమయములో అమ్మ పరుగెత్తుకొని వెళ్లి సీతాపతి తాతగారి చెంగులు పట్టుకొని 'ఆరోగ్యం లేదుకాని ఆయుర్దాయం వుంది నాన్న!'

యెంతకాలమమ్మా నీ నోటిమీదుగా చెప్పు, బాలవాక్యం

అమ్మ : వున్నంత కాలం.

సీతాపతి : (వెంకటసుబ్బయ్యగారితో) చాలా కష్టజాతకంగా వుంది బావా! దీనిది! (మేనత్త కుమారుడు గనుక, బావా అంటారు).

వెంకట : చాల గొప్ప జాతకంగా గూడా వుంది.

సీతాపతి గారు : యీ రెండు యెట్లా కలుస్తయి బావా ?

వెంకట : గ్రహ లక్షణాలని బట్టేగా మనుమనుకోవటం. రేపు యెట్లా మారుతుందో. నడకమీద తెలియవలసిందే !

సీతాపతి : బ్రతికి బాగుంటే జాతకాల మాట తరువాత ఆలోచిద్దాం!

జానికమ్మగారు : అందరి శని ఆమె మీదుగా బోయిందిగా యిక బాగుండక యేం జేస్తారు.

వెంకట : యేమిటా మాట? నీకు నీ కడుపెంతో ? యెవరి కడుపు వారికి అంతే!

సీతాపతి గారు: యింతకూ వాళ్లమ్మ లేకపోవటమే దురదృష్టము. తక్కిన అదృష్టములను గురించి ఆలోచన యేమిటి? దానికి తోడు ప్రాణము పోయేటప్పుడు లేని కొరత - అని కాసేపు ఆగి కంట నీరు పెడతారు. పిల్లకు వున్న బంగారం, తల్లికి మీరు పెట్టిన బంగారం, మూడు యెకరాల పొలము యిచ్చి నాలుగు రోజులుండి పిల్లను మీకు వొప్పగించి అలవాటు జేసి వస్తాను. చెవులు, ముక్కులు మాత్రం కుట్టించబోకండి యిప్పుడప్పుడే! వాళ్లమ్మ యెప్పుడో ఒకసారి నా యెదుట అన్నది.

జానికమ్మ : ఆమె వచ్చినట్టే, మా దగ్గరే వున్నట్టే మాట్లాడుతున్నారే! ఆ మరిడమ్మ గారిని వదిలిపెట్టి వుంటుందా? మరిడమ్మ గారి మెడ కరుచుకుని వదలదేమో?

అమ్మ అన్నీ వింటూ, విననట్టుగా కూర్చుంటుంది.

సీతాపతిగారు : యేది యెట్లా వున్నా సంవత్సరీకాలయినా రాఘవుడిచేత పెట్టిద్దామనుకున్నా, అదీ తప్పిపోయింది, వొడుగు చెయ్యని కారణం చేత, యీ సంవత్సరం అదయినా చెయ్యాలి. ఒకవేళ నేను చేస్తే బాపట్లలోనే చేస్తాను. మీరు తప్పకుండా పోయింది నేను, వున్నది మీ అమ్మాయి అనుకొని ఆ కార్యం (వుపనయనం) నెరవేర్చండి.

వెంకటసుబ్బయ్యగారు : అదేమిటిరా, ఆ మాట! నీవెవరబ్బాయివి? నీవు మాత్రము మా వాడివి కాదు?

సీతాపతి గారు : మీ సంగతి సరేలే జానికమ్మక్కయ్యకు పాపం నాకివ్వటం యిష్టం లేకపోయినా పట్టుదలగా మీరిచ్చి చేసినందుకు అక్కయ్య మీకంటే యెక్కువగానే చూచింది.

వెంకటసుబ్బయ్య గారు : అసలు ఆమెకు చెయ్యకముందు యిష్టం లేకపోయినా అయిన తరువాత అందరల్లుళ్లకంటే మిమ్మల్ని యెక్కువగా చూసేది. సరే నాలుగు రోజులలో తప్పకుండా రండి మేము వెళతాం. రైలు వేళ అయింది.

యింతలో చిదంబర్రావు తాతయ్య గారు వస్తారు.

వెంకట : నాయనా వెళ్లి వస్తాముర !

యింట్లోకి వెళ్లి అందరకూ చెప్పి వెంకట సుబ్బయ్య గారు జానికమ్మ గారు భోజనాలు చేసి స్టేషనుకు వెళతారు.

వాళ్లకంటే ముందు బోయి అమ్మ ప్లాటుఫారం మీద కూర్చుంటుంది. టిక్కట్లు కొనుక్కొని తాతగారు బైటికి వస్తారు. రైలు కూత వేసి స్టేషనులోకి వచ్చి ఆగుతుంది. పరుగెత్తి రైలులో యెక్కబోతారు. వాళ్లతో కూడ కలిసి అమ్మ రైలు పెట్టె దగ్గరకు వెళ్లి నుంచుంటుంది. ఆ చీకట్లో అమ్మను గుర్తించక అమ్మ యెవరో అడిగినట్లుగా 'తాతయ్యా! నాకొక కానియ్యి అంటుంది.' 'తాత' అనే ముక్క తాతగార్కి వినపడక అయ్యా అన్నట్టు వినపడుతుంది. వినపడి 'యిప్పుడు గాదు, పో! బండి సాగుతుంది. బండి కింద పడతావు పో, అమ్మాయి పో!" అంటారు.

అమ్మ : (జానికమ్మగారితో) 'అమ్మా! ఒక కానీ ఇయ్యి' అంటుంది.

జానికమ్మ : చెప్పేది నీకు కాదమ్మాయి, యెన్నిసార్లు చెప్పాలి నీకు.

వెంకట : వాగివాగి అదే పోతుందిలే. నీవు వూరుకో!

జనమంతా యెక్కటమవుతుంది. జనం వత్తిడి తగ్గిపోతుంది. గూడ్సు కోసం రైలు ఆగుతుంది. యింతలో చిదంబర్రావు తాతగారు అన్నగారు మర్చిపోయిన పర్సు తీసుకొని వస్తారు. వారు రైల్లో కూర్చుంటారు. అమ్మ కిందనుంచుని వుంటుంది.

చిదంబర్రావు తాతయ్య అమ్మను జూచి యెవరో అనుకొని ఆయనగూడ పెట్టెలో వున్న అన్నగారిని చూడకుండా పక్కపెట్టి దగ్గరకు వెళతారు. అందులో కనపడక యింకా పైకి వెళతారు.

అమ్మ : వెనక్కుండా వెళ్లి 'అయ్యా, నాకో కాని యివ్వండి' అంటుంది.

చిదంబర్రావు గారు మాట వినిపించుకోకుండా తురతురా నడిచిపోతారు.

అమ్మ : తురతురా బోతున్న తాతగారి దగ్గరికి వెళ్లి, వెనుక నుంచుని చెయ్యి ముందుకు జాచి, 'అయ్యా! కాని' అంటుంది.

చిదంబర్రావు గారు : అబ్బబ్బా వుండు, బండి పోతూంది అని చెయ్యి విదిలిస్తారు. ఆ చెయ్యి అమ్మకు బాగా చేతికి దెబ్బ తగులుతుంది. యింకా ఆయన పైకి వెళ్లి తిరిగి వచ్చే సమయంలో అమ్మ, తాత, అమ్మమ్మ వున్న పెట్టి దగ్గరకు వచ్చి నుంచుంటుంది. చిదంబర్రావు తాతయ్య తిరిగి అమ్మ సామీప్యములోకి వచ్చి పెట్టి వంక తొంగి చూస్తారు. వాళ్ళు వున్నా కనుపించరు. యింకా పైకి వెళుతూవుంటారు.

అమ్మ : (తల వంచుకు కూర్చుని) ముందర వున్నది కూడా కనపడదు. అయ్యా నేను చూపిస్తా రండి.

చిదంబర్రావు గారు : "యెందుకు నీకు కాని డబ్బుల కోసరమా?" అని అంటూ లెక్క చెయ్యక ముందుకు నడుస్తారు. నాలుగు వైపులా జూచి విసుగుపుట్టి, అయినా యెందుకన్నదో ఆ అమ్మాయికి కానో, అర్ధనో యిద్దాము, చూపిస్తుందేమో.

అమ్మ ముందుకు వచ్చి (నల్లని పాత పట్టుచీర కప్పుకుని వచ్చి కూర్చుంటుంది) (ముసుగుదొంగ) నేలమీద గీతలు గీస్తూ కూర్చుని వున్న అమ్మ ముందరకు వచ్చి 'యే అమ్మాయి యిదిగో నీవు కానీ అడిగావుగా నేను అణా యిస్తా. యిందాక చూపిస్తానంటివే వాళ్లను చూపించు."

అమ్మ చెయ్యి చాచి తాతగారు అణా యివ్వబోయే సమయంలో 'యిదిగో ముసుగుదొంగ' అని లేచి నుంచుంటుంది. చేతికి ఆనించిన అణా పైకి తీసి వులిక్కిపడి వొళ్లు జల్లుమన్నట్లు గొంతులో ధ్వని మారి, అన్నయ్యా ! అంటాడు పెద్దగా.

అమ్మ : "యేం కన్నయ్యా" అంటుంది.

లోపల వున్న తాతగారు 'యెవరో తమ్ముడు గొంతల్లే వినపడ్డదే' అని లేచి లోపలే అటూ యిటూ చూస్తారు, చూస్తే కనపడరు.

చిదంబర్రావు గారు : అమ్మ నుద్దేశించి కన్నయ్యా అంటే చూచానయ్యా, చూచిన అయ్యా అనా, కన్నానయ్యా అనా, నన్ను కన్నాననా, అని అంటూ అనందభాష్పాలు కారుస్తారు.

అమ్మ : అదంతా నాకు తెలియదు. ''నేను కన్నా'' నన్నమాట; నీవు విన్నానన్నావుగా, మీకు యెట్లా తోస్తే అట్లా.

చిదంబర్రావు గారు చెమటలు పోస్తూ అయోమయంగా యేదో తప్పుచేసిన మాదిరిగా వుంటారు.

వెంకట సుబ్బయ్య గారు బండి ఆలస్యానికి కారణమేమిటో తెలసుకుందామని బయటికి వస్తారు.

చిదంబర్రావు గారు తన కేక విని వచ్చారనుకుంటారు. ''పిల్చిన తరువాత యింతసేపటికి వచ్చావేం, పలకలేదేం?''

వెంకట సుబ్బయ్య గారు : నాకు నీ పిలపు వినబడలేదు.

అమ్మ : మీ తమ్ముడు యివ్వనేలా, యిందాక లేదంటే లేదన్నావు పో పో అంటే అన్నారులే నీకు బుద్ధిలేదు అని అంటే అన్నారులే డబ్బిచ్చి యెన్ని అన్నా ఫరవాలా! యిప్పుడయినా యివ్వు ఒక కాని ఒక్క కాని కోనరవు యిన్నిమాటన్నారంటే యీ మాటలకంటె ఆ కాని యెంత విలువయిందో ఆలోచించండి!

చిదంబర్రావుగారు : నిర్ఘాంతపోయి, పెద్ద పెద్ద కళ్లు చేసి చూస్తూ నేనూ అంతే! నేను అంతే! అంటారు.

వెంకట సుబ్బయ్య గారు : గుండెలు కొట్టుకొనుచు నీవా! నీవా! నీవా! నీవా! నీవా! నీవా! నీవా! నీవా! అంటారు.

యిలోగా జానికమ్మగారు యేమిటర్రా గోల? ఆ పిల్ల యెవరు? యెవరన్నా మారుపడ్డారా యేం? అంటూ వస్తుంది.

అమ్మ : మారు పడేగా, యిందాక మాట్లాడినవన్నీ !

జానికమ్మ : యెవరు? యేమిటి?

అమ్మ : యెవరు యేమిటి? అనేగా యీ పాపిష్టి గోల అన్నావు. వందలూ వేలూ యెవరడిగారు! కానేగా అడిగింది నీ మెళ్లో అన్ని కట్టలున్నయ్యే ఆ మెడ నెప్పి పుట్టేను, మెడ తిరక్కుండా పెట్టుకున్నావే. నీ బొడ్డు చుట్టూ వున్న డబ్బు అడిగానా, నీ మెళ్లో వున్న బంగారపు కట్టలడిగానా. ఒక్క కానీ, ఒక కాని, కాని యివ్వలేకపోతే మాల్లె యీ ఒక్కసారికేగా నేనడిగేది. యెన్నటికి మీరు నాకు ఒక కాని యివ్వలేరు. నేను పట్టుకోలేను. సరేకాని, సరే కానివ్వండి. యెందుకాలస్యం? కానీతో కాలం వెళ్లిపోతుంది. కాని కాని తాతగారు కానివ్వండి కాలం వెళ్లిపోతుంది.

చిదంబర్రావు గారు : పెద్ద సమస్య తెచ్చిపెట్టావమ్మా !

అమ్మ : మీకేమండి కవులు. సమస్యలు పరిష్కారము చేస్తారు. పైగా ప్లీడరుగారు.

చిదంబర్రావు గారు : యేం ప్లీడరుగారో అయోమయావస్థగా వుంది.

అమ్మ : అయోమయావస్థ అంటే యీ స్థితి మాయ అనా?

చిదంబర్రావుగారు : కృష్ణుడు గోపికలను యేడ్పించినట్టుగా వేదిస్తున్నావు. వాడే నయం ప్రత్యక్షంగా యేడ్పించాడు.

అమ్మ : కృష్ణుడు చేసింది వేధించడమేనా? వేధించటమంటే యేమిటి తాతగారు?

అమ్మ : దేనితో కొలిచుంటాడో?

చిదంబర్రావుగారు : దేనితో కొలుస్తాడు. భక్తితోనేగా!

అమ్మ ! కృష్ణుడికి గోపికల మీద భక్తి యెక్కవా? గోపికలకు కృష్ణుడిపైన భక్తి యెక్కువా?

చిదంబర్రావుగారు : యిది నీవు చెప్పవలసిందేనమ్మా!

అమ్మ : నన్నే చెప్పమనేట్టయితే గోపిక అనే పేరు యెందుకొచ్చిందో ముందు చెప్పండి? గోపిక కృష్ణుల యొక్క ఆ నామధేయంలో వున్న అర్థం చెపితే తరువాత చెపుతా!

చిదంబర్రావుగారు : అది నీవు చెప్పవలసిందే. యిదివరకు యెవరికి యీ సందేహం కలగదేమో!

అమ్మ : పోనీ కృష్ణుడికి చెప్పండి.

చిదంబర్రావుగారు : పూర్తిగా తెలియని స్థితి తల్లీ (చిదంబర్రావుగారు పండితులు. అష్టావధాని, శతావధాని, ప్లీడరు గారు)

అమ్మ : సందేహం లేకుండానా? కొద్దిగా తెలిసిన స్థితి యేమైన, యెక్కడయినా అంటుకుని వున్నదా? యేమీ తెలియని స్థితి సంపూర్ణంగా వుందా?

చిదంబర్రావుగారు : అదేమిటమ్మ ముందరకాళ్లకు బంధాలు వేస్తావు. ప్రతి విషయం కాదమ్మా యీ ఒక విషయమే నేనన్నది.

అమ్మ : మీకే తెలియకపోతే, నాకేమి తెలుస్తుంది?

చిదంబర్రావు : మాది చదవుకున్న తల్లీ! నీవు చెప్పమ్మా, పూర్తిగా 'అన్యధా శరణం నాస్తి' అంటే గాని చెప్పేట్టు లేవు.

అమ్మ : పోని అది పూర్తిగా నమ్మకమేనా మీకు?

చిదంబర్రావు గారు గడగడా వణుకుతూ వుంటారు.

వెంకటసుబ్బయ్య గారు : నన్ను చెప్పమంటారా?

అమ్మ : చెప్పండి తాతగారూ! మీరెక్కడ మతుకుమల్లి రఘోత్తమ శాస్త్రుర్లు గారికి అల్లుడు గారు గాదు? మీకెందుకు తెలియదు?

వెంకటసుబ్బయ్య గారు : మా మేనమామగారి పేరు నీకెట్లా తెలుసు? అయినా ఆయన పండితులని నీకెట్లా తెలుసు? ఆ కృష్ణుడే యీ కృష్ణుడేమోరా చిదంబరం!

అమ్మ : ఆ కృష్ణుడంటే యేమిటో చెప్పలేదు గాని, యీ కృష్ణుడికి పోలుస్తున్నారు మహా! యిద్దరూ మహా కాకపోవటమేమిటిలే యిద్దరూ మహా, మహా, మహా, మహా.

జానికమ్మ : పెట్టి లోపలికెళ్లి కూర్చుందాం రండి మాట్లాడుకోవచ్చు.

చిదంబర్రావు గారు : రైలు కాలస్యముంది స్టేషనులోకి వెళ్లి కూర్చుందాం. నలుగురూ కలిసి స్టేషను దగ్గర పక్క గదిలో కూర్చుంటారు.

అమ్మ : యింతకూ చెప్పరేం తాతగారూ?

యింతలో ఒక ముసలి తాత యశోద కృష్ణుల పాట పాడుకుంటూ వస్తాడు.

అమ్మ : మనుషులకు పెట్టే పేర్లు అర్థం కావాలంటే చాలా కష్టం తాతగారు. మనుషులంటే మనుష్యులే కాదు. దేముళ్ల పేర్లు కూడా. శివుడు అన్నారు. ఆ పేరు యెందుకొచ్చింది ? దాని అర్థం యేమిటి? లోగడ కృష్ణుడు గోపికలకే అర్థం చెప్పవలసి వచ్చింది. యిప్పుడు యశోద అని కూడ కలిసింది. యిట్లాగే ప్రతి దేవుళ్లకు వున్న నామాలకు, దేవుడు అనే మాటకు అర్థం తేలాలి. యెందుకొచ్చిందో అసలు. దేవుడనే మాటకు అర్థం తెలిస్తే దేవుడెవరో వెతకొచ్చు!

వెంకటసుబ్బయ్య గారు త్వరగా అందుకుని దేవుడంటే భగవంతుడు!

అమ్మ : చోర్ చోర్ అని, యెంత చెప్పారండి! భగవంతుడంటే?

చిదంబర్రావుగారు : భగ, భగ, భగ మూడుసార్లు అని దీర్ఘంగా ఆలోచిస్తారు.

అమ్మ : (మనస్సులో) ప్రస్తుతం వారికి తెలియక కాదు గాని చెప్పటానికి తపటాయిస్తున్నారు. చిన్న పిల్లనని గాని, లోగడ జరిగిందాన్ని బట్టి శరీరం పులంకరించి

గగుర్పాటుతో అమ్మ ముఖము చూడలేక తలవంచుకునే మాట్లాడుతూ వుంటారు. కాని అన్నింటిని మించింది సమయంలే.

యీ సంభాషణలోనే కూర్చుంటారు నలుగురూ. రైలు కదులుతుంది. ద్రవ్యం మూట కూడా అందులోనే వుంటాయి.

రైలు పోయినా రైలు పోయిందని గుర్తించరు. ముగ్గురూ మాట్లాడుతూ వుంటారు. అమ్మమ్మ గారు నిద్రపోతుంటారు.

అమ్మ : అసలు యీ సంభాషణంతా యెందుకొచ్చింది తాతగారు ?

చిదంబర్రావు గారు : నాకు గుర్తు రావటం లేదమ్మా ! రైలు దగ్గర - అని అనగానే నిద్రపోతున్న జానికమ్మ గారు లేచి - జానికమ్మ గారు, వెంకటసుబ్బయ్య గారు బయటకు వచ్చి చూసి యిద్దరూ ఒక్కసారిగా పెద్దగా, 'అయ్యో రైలు పోనే పోయిందిరా' అంటారు.

జానికమ్మ గారు : రైలు కాదు అన్నీ పోయినయి !

అమ్మ : కాని - పోనీ యేం చేస్తాం.

చిదంబర్రావు గారు : నీ కానే, యింతదూరం తెచ్చింది.

జానికమ్మ : యింతకూ యేం చేద్దాం ?

అమ్మ : యేం చేసేదేముంది ! మీరు చేసిన పనే - రైలులో కాలుపెడుతూ ఫో ఫో నీకేం బుద్దిలేదు అని అన్నారు రైలుని. అందుకని అదికాస్తా పోయింది. యిందాక చిదంబర్రావు తాతగారు అన్నారు చూసారూ ! కృష్ణుడు గోపికలను వేధించినట్టుగా అని. నా ఉద్దేశం వేధించటం అంటే విధించటమే.

చిదంబర్రావు గారు : విధించటమంటే శిక్షా?

అమ్మ : ఆ అర్థం అవునో కాదో గాని, నా వుద్దేశం అదే - ఇంకొకకటి గూడా వుంది తాతగారూ ! 'విధి' అంటే 'బ్రహ్మ' అని గూడా నా వుద్దేశం. యెందుకన్నానంటే 'విధి' అంటే తప్పనిసరి. 'నిర్ణయ'మంటే చేసి తీరవలసింది. అందుకే యేదైనా పనిని 'నిర్ణయించారా' అంటారు. నిర్ణయమనే మాటకు 'గుర్తు' అని కూడా వుంది. వీడు ఫలానా అని, ఆ రూఢత కలిగించేది 'నిర్ణయం'.

చిదంబర్రావు గారు : అవునవును. త్యాగయ్యకూడా అన్నాడు యీ మాట.

అమ్మ : యేమని?

చిదంబర్రావు గారు : ఒక కృతి వుందిలే అమ్మా నీకెందుకు, తెలియనట్టు అడుగుతావు?

అమ్మ : మొన్న ధేనువుకొండ చిన్నయ్య గారు నన్ను వాళ్లో కూర్చోబెట్టుకుని పాడిన కృతా(అంటే యెవరని నిర్ణయించేదిరా? అనేదేగా)

తాతగారు : "విధి'కిదేనా యింకా వున్నయ్యా అమ్మా అర్థాలు?

అమ్మ : అర్థాలు యెన్నివున్నా రెండు మాటలు మీద ఆధారపడి వుంది 'విధిని' గురించి చెప్పాలంటే.

చిదంబర్రావు గారు : యేమిటమ్మా ఆ రెండు మాటలు చెప్పు.

అమ్మ : "విధే విధానం" 'విధి' అంటే 'బ్రహ్మ, పరమాత్మ, చైతన్య స్వరూపం, చైతన్యం', అదే స్పందనం, ఆ స్పందనంచేత కలిగే పరిణామము సృష్టి అది అనుక్షణం జరుగుతూనే వున్నది. ఆ జరిగేది విధానము, యిదే 'విధే విధానము'.

చిదంబర్రావు గారు : విధికి చెప్పావు, గోపికలకు కూడా చెప్పమ్మా!

అమ్మ : అది అక్షరాల మీద వ్యాకరణ యుక్తంగా చెప్పాలంటే కృష్ణుడు గాదు, 'గృష్ణుడు', సర్వోత్కృష్టుడు.

చిదంబర్రావుగారు : యీ సంస్కృత పదాలెక్కడివమ్మా! కేవలం యీ సంస్కృతం చాలదే యీ అక్షరాల యెందుకు పుట్టినయ్యి అనే లెక్కలోకి వచ్చింది. దీనికి చాలా తేల్చి చెప్పవలసింది.

అమ్మ : యిది తరువాత చెపుతాను. సామాన్యమైన అర్థం నాకు తోచింది చెప్పమంటారా? 'భక్తి' అంటే మనోవాక్కాయ, కర్మలు అని మీరంటారే, వాటికి అతీతమైన స్థితి వారి భక్తి, ఆ భక్తే గోపిక.

చిదంబర్రావు గారు : యీ మాట అనగానే తలకాయ వూపి ఆ స్థితి వాళ్లందరి దగ్గర వున్నట్టు లేదే.

అమ్మ : దేవతలలో ముక్కోటి దేవతలు వున్నారని చెపుతున్నారె అట్లాగే గోపికలలో గూడ అనేకమంది అనేక రకాల స్థితులతో వున్నారేమొ? గోపికల ఆరాధన యెట్లా వుంటుందంటే ఒక ఆమె ముఖాన్ని ఆరాధిస్తుంది. ఒక ఆమె శబ్దాన్ని ఆరాధిస్తుంది, ఒక ఆమె చెవులు, ఒక ఆమె లలాటం, ఒక ఆమె నేత్రాలు, ఒక ఆమె లలాట మందున్న తిలకాన్నె ఆరాధిస్తుంది. ఒక ఆమె దేహము, ఒక ఆమె కాంతి యిట్లా రకరకాలుగా ఆరాధించి అందులో ఒకామె యిన్ని రకాలు కలిపి

కృష్ణుడిలో వున్న "ధారణాశక్తియై" ధారణ అంటే "ఉచ్ఛ్వాస నిశ్వాసలు" గూడా ఆరాధించి రాధ అయింది.

చిదంబర్రావు గారు : అమ్మా! ఆ కృష్ణుడు, ఆ రాధ, ఆ రాముడు, సీత అందరూ నీవై చెపుతున్నావా?

అమ్మ : నేనెట్లా చెప్పినా మీరు దాన్ని యెంతగానో తీసుకోగలిగారు. మీరు వివేకులు గనుక.

చిదంబర్రావుగారు: నవ్వి, తల్లి చిన్నపిల్లవాడికి బోధించినట్లుగా వుంది "వివేకమంటే" యేమిటి?

అమ్మ : తన్ను తాను వివరించుకోవటం వివేకం.యితరులను విమర్శించటం అవివేకం!

చిదంబర్రావు గారు : యిదేనా యింకా యేమయినా అర్థమున్నదా అమ్మా !

అమ్మ : పనికిమాలిన గుణములను విడిచినవాడే వివేకుడు. అని చాలామంది చెపుతుంటే విన్నా.

చిదంబర్రావు గారు : యెవ్వరూ చెప్పలేదమ్మా యీ మాట.

అమ్మ : "మమేకుడే" వివేకుడు, అంటే మంచి చెడు మనస్సుకు తోచకుండ వుండటమే 'మమేకం'. అదే 'వివేకం'.

చిదంబర్రావు గారు : అన్నయ్యా యిప్పుడు ట్రయిను వస్తుంది బయలు దేరుతాం?

వెంకటసుబ్బయ్య గారు : బయలుదేరతాం. మరి పెట్టె సంగతి యేమిటి?

చిదంబర్రావు గారు : యేం చేద్దాం! ప్రాప్తముంటే దొరకుతాయి. బయలుదేరండి.

జానికమ్మగారు : అందులో చాలా వున్నాయి. దాదాపుగా రెండు వేల రూపాయలు విలువగల గుడ్డలు బంగారం కూడా వుంది. యేం జేసేటట్టు.

అమ్మ : చేసేదేముంది! ప్రాప్తముంటే వస్తుంది. లేకపోతే లేదు.

జానికమ్మ గారు : ఓయబ్బో! పెద్ద నాపసాని. మాటలు చాలా నేర్చుకుంది.

అమ్మ : (తెనాలి తాతతో) తాతగారూ నేను ఒక సంగతి అడుగుతా చెపుతారూ?

చిదంబర్రావు గారు : అందుకుని, అడుగమ్మా, అడుగు?

వెంకట సుబ్బయ్య గారు : ఆ తాతయ్యనే అడుగమ్మా !

అమ్మ : సరే చెపుతారా తాతగారూ?

చిదంబర్రావు గారు : మమ్మల్ని అడుగుతావు గాని, చివరకు నీవే చెపుతావు.

అమ్మ : సరే చెపుతున్నా. ఒకరికి ఒక పదివేల రూపాయలు ఉన్నయ్యనుకోండి. అందులో నాలుగువేలు పోయినయ్యి అనుకోండి. మరొకరికి ఆకలవుతున్నది. కానీ లేదు. యీ రెండింటిలో యెవరికెక్కువ బాధ?

జానికమ్మ గారు అందుకొని : లేనివాడికొకటే బాధ. కష్టార్జితం పోతే బాధగాదు?

అమ్మ : ఈ బాధలో తేడా యెప్పుడు తెలుస్తుందంటే అన్ని రకాల బాధలు ఒకరే అనుభవిస్తే గాని ఆ తేడాలు తెలియవు.

జానికమ్మ : మాకు ఆ దరిద్రం రావాలంటావేమిటి?

అమ్మ : నా వుద్దేశం అది కాదమ్మా !

వెంకటసుబ్బయ్యగారు : ఆమెతో యెందుకులే అమ్మా !

చిదంబర్రావు గారు : నా దగ్గర వున్న పర్సు తీసుకుని వెళ్లండి. అవి ప్రాప్తముంటే దొరుకుతయ్యి.

బండి వస్తుంది. యిద్దరూ బయలు దేరి వెళ్లిపోతారు. లోగడ బండిలో వున్న వస్తువులు యెరిగిన వాళ్లు వుండి యింటికి చేరుస్తారు.

8. అవతార వివరణ

సాంఖ్య విచారణ :

వీరు యిద్దరూ యింటికి వెళ్లేసరికి అవి యింటికి చేరి వుంటాయి.

అమ్మ, చిదంబర్రావు తాతగారు యింటికి వెళతారు. మేడమీద గదిలో యిద్దరూ ఒకే మంచం మీద పడుకుని

చిదంబర్రావుగారు : చెప్పమ్మా యిందాక గృష్ణుడు అంటే యెట్లా అయిందమ్మా!

అమ్మ : గృష్ణుడంటే గుణములన్నింటికి ఆధారమయిన వాడని.

చిదంబర్రావు గారు : అంటే గణితమా? అంటే లెక్కలా?

అమ్మ : అంతా గణితమే. దీని తరువాత అది అన్నా గణితమే. ప్రతీదీ ఒకటి, రెండు, మూడు అనేకాదు ప్రతీది గణితమే.

చిదంబర్రావు గారు : ఓహో యిదా గణితమంటే! సృష్టిగూడ గణితమేగా.

అమ్మ : గణితమంటే - రూపమే గణితము. ఒక చెట్టు వున్నదనుకోండి. ఆ చెట్టు యెంత యెత్తు వున్నదీ అన్నారు. గజమనో, అర్ధ గజమనో ఒక లెక్క. యెన్ని చెట్లు, యెంత పొడవు, యెన్ని కొమ్మలు, యెన్ని మైళ్లో, యిక్కడ యే మూలలో యెంత లోతున, యెన్ని గంటలలో అని అన్ని రకాలుగా ఆలోచించినా అక్షరాలతో, మాటలతో, అంకెలతో గజమును గజములలో, బెత్తలతో, అంగుళములతో, 1, 2, 3, అనే అంకెలతో దీని తరువాత అది, దాని తరువాత యిది మాటలతో అన్నదే అంతా గణితమే. మనిషిని తీసుకుందాము. మనిషిమీద రెండు చేతులు, రెండు కాళ్లు, రెండు ముక్కులు, ముక్కు ఒకటయి రెండు భాగాలయి భాగమన్నా లెక్కే. పంచభూతములతో కూడిన శరీరమును తీసుకున్నా. అయిదు భూతములను కూడా

ఒకదాని తరువాత ఒకటని ఒక భూతమే పంచబడ్డది గనుక, పంచభూతములయినవి. పంచ అంటే అయిదని. ఆ అయిదు అంకె వేసిన అయిదే. పంచ అన్నా అయిదే. అక్షరాలు వ్రాసినా అయిదే. అయిదే అనేది గణితమే. జగత్తే గణింపబడ్డది. అన్ని రకాలలో గణితమే గనుక. యింకా యింత అని వివరించలేను కదలిక, పరిణామం, అన్నా ఒకదానిలోనుంచి మరొక దానిలోకి పోవటం అంతా గణితమే. అంతా ఆ గణితం లెక్కకు అందంది, అంటే అతీతమయింది, అని అంటే రూపం లేనిది. రూపం వచ్చేటప్పటికి ఒక యిల్లో ఒక వాకిలో ఒక దర్వాజ దర్వాజ రెండు పక్కలు, రెండు నిట్టాళ్లని, రెండు తలుపులని. యేదైనా తూకంగాని సవాశేర్లను అర వీశలను, వీశలను, కట్టులను, మణుగులను, పుట్లను, బస్తాలను, మానికలను, సోలలను, గిద్దలను, నాలుగు గిద్దలొక సోల, కొన్ని మానికలు ఒక బస్తా, కొన్ని బస్తాలు ఒక పుట్టి, యిట్లా ప్రతీదీ గణింపబడ్డది. యిట్లా యేర్పాటు చేయబడ్డది. యీ యేర్పాటు కంతకూ కర్త ఆ కృష్ణుడనే. ఆ కృష్ణుడు కూడా యి లెక్కలో ఒక్కడని; యివన్నీ సృష్టించుకుని అందులో తను ఒకడయి నడకను నడిపిస్తున్నాడు గనుక ఆ నడకకు కూడ ఒక పాదము ముందు, ఒక పాదము వెనుక ద్వంద్వాలె సృష్టి కాధారమనుకుంటున్నాం. సర్వం సర్వానికి ఆధారమే అ - ఇ - రాయాలంటున్నారు గదూ, అ - ఆ - ఇ ఈ - అం - అః అది గూడ ఒక గణితమే అది ఒక మహా మంత్రం. సంగీతం తీసుకున్నా, మంత్రశాస్త్రం తీసుకున్నా, వాస్తు శాస్త్రం తీసుకున్నా, జ్యోతిష్కం తీసుకున్నా, వైద్య శాస్త్రం, వేదాంత శాస్త్రం తీసుకున్నా షట్ శాస్త్రములన్నా షట్శాస్త్రములంటె ఆరె. అక్షరాలతో వ్రాసినా, సంఖ్యతో వేసినా, భాగాలు పంచినా గుర్తించటం సంఖ్యమీదనే ఆధారపడ్డది. యి సంఖ్యే కృష్ణుడు - సాంఖ్య విచారణ అని గీతలో చెప్పాడు. సాంఖ్య విచారణ అంటే యిదే - కనపడుతున్నదాన్ని వివరించటమే సాంఖ్య విచారణ. తారకము అంటే మనస్సుతో మంత్రంతో - అంటే కొన్ని అక్షరములు కూర్చి ఒక వాక్యము చేసి, ఒక భావాన్నిచ్చి భావించేది తారకం, భావం తనయ్యేది అమనస్కం. యీ మూడింటి స్థితి - చెప్పేది, చేసేది, చూసేది. చెప్పేది సాంఖ్యం, చేసేది తారకం, చూచేది అమనస్కం. యిన్ని మాటలు యిన్ని స్థితులు చెప్పుకున్న ఇన్నీ అన్ని అంతా, ఇంత, ఎంత, అంతా తానైన ప్రత్యేకించి ఒక రూపంగా వచ్చినవాడె కృష్ణుడు. ఆ కృష్ణుడిలో ఉండే సర్వసాధారణ ఆరాధన ధారణాశక్తే యీ రాధ. ఆరాధన అంటే తను ఎప్పుడూ తన శక్తిని ఉపయోగపరచటమే ఆరాధన. యివే ప్రకృతి పురుషులు - రూపం పురుషుడు, రూపంలో వుండే శక్తి ప్రకృతి, యీ రెండూ ఒకటి విడచి ఒకటి లేవు. మాటలతో చెప్పవలసి వస్తే ఒకటి ఒకటి అనో రెండూ ఒకటనో యేదో ఒకటి గణితంతో చెప్పవలసిందే. అందుకే అగణితుడు గణితుడయినాడు సామాన్యంగా గొప్ప స్థితికి అంత ఘనస్తుడా అంటారు.

గ - అనే అక్షరం మీద నాకు పోయిన అర్థం యిదే. అంతకూ కర్త గనుక గృష్ణుడు అన్నాను. గణితం కూడా ఆయనే అనే దృష్టితో అన్నాను. యిదంతా నాకు తెలసి చెప్పటం కాదు. యెప్పుడు యేది మనసుకు తడితే అది చెపుతున్నా. అసలు వీటికన్నింటికి కదలిక - శబ్దమే ఆధారము. యిట్లా లక్షణాలకు చెప్పుకోవటం ప్రారంభిస్తే యెంతయినా విరామం లేకుండా ఆ రాముణ్ణి చూడొచ్చు.

చిదంబర్రావు గారు : అంటే?

అమ్మ : విరామం లేంది రామం. నిద్దరొస్తున్నది రేపు చెప్పుకుందాం. పడుకుందామా? తాతగారు!

చిదంబర్రావు గారు : నీకు నిద్దరేమిటమ్మా. కృష్ణుణ్ణి గురించి చెప్పావుగా, రాముణ్ణి గురించి కూడా చెప్పు. రామం అంటే విరామం లేనిది అన్నావు. దేనికి విరామం లేదు.

అమ్మ : సృష్టికి లేదు. కదలికకు లేదు. యిప్పుడు జరుగుతున్న పనల్లా. విరామం లేకుండా జరుగున్న పనల్లా రాముడే! మనలో నడిపించే ఉచ్ఛ్వాస నిశ్వాసలు విరామం లేకుండా వున్నాయి. వ్యష్టిలో గాని, సమిష్ఠిలోగాని విరామం లేకుండా వుండే ప్రతి ఒక్కటీ రామమే!

చిదంబర్రావు గారు : నీవు చెప్పే ప్రతి ఒక్కటి అద్వైత స్తితికి తీసుకెళుతున్నదమ్మా!

అమ్మ : నేను తీసుకెళ్ళేదేముంది? అది అయ్యే ఉంది.

చిదంబర్రావు గారు : సామాన్యంగా బయలుదేరి ప్రతిదానిని ఆ పాయింటు దగ్గరకు తీసుకెళ్లగలగటం యిది యేమి విశేషమమ్మా. విశేషమేమిటిలే, విశేషమే నీవు. దశరథుడి కొడుకు రాముణ్ణి గురించి చెప్పమ్మా.

అమ్మ : ఆయన ఆ సమయానికి ఆ అవతారం అవసరమై ఆ రాముడు పరిమితి గల్గి రాముడుగా, విరామం లేని దానిలోనుంచి రాముడుగా అవతరించాడు. తనలో వుండే ఉచ్ఛ్వాస నిశ్వాసాలు, తనలో వుండే శక్తి సీతై ఆ సీతే లోకమాతై, ప్రకృతై, వికృతై, సర్వసాక్షై, సర్వం ఆరామమై విరామం లేనివారుగా ప్రపంచానికి వారి ధర్మాన్ని పంచిపెట్టారు. వారే సీతారాములు.

చిదంబర్రావుగారు : యిట్లా అంతకూ చెప్పుతావటమ్మా !

అమ్మ : అంతకంతకూ అనంతమేగా, అంతకు యేదో అనంతానికి అందే ఎంతెంతలైనా అనంతమ్ము లోనివారే, అంత అంటే పరిమితి, ఎంత అన్నా పరిమితే అమ్మ అంటే మళ్ళ పరిమితి వచ్చింది. అంతా 'మమ' అనుకొండి. యీ పరిమితులన్నీ అపరిమితంలోవి కనుక ఆ అపరిమితం, పరిమితంగా వచ్చే పరిమితాలన్నీ కలుపుకోవాలి.

చిదంబర్రావు : యెన్ని రకాలుగా చెప్పినా అన్నీ, అందరూ ఒకటేనని అంతా అద్వైతమేనని, వస్తువులు, మనుషులు, మహాపురుషులు అవతారాలను అన్ని రకాలు కలిపి గొడ్లను, గోదను కూడా కలిపి ఒకటేమిటిలే ప్రపంచంలో వున్న ప్రతిదానిని గురించి ఒకేదానికి సమన్వయం చేసి చెప్పావమ్మా, అని యెక్కి యెక్కి యేడుస్తూ, సమన్వయం చేసేదేమిటిలే, ఆ సమన్వయమే నీవు కదా లేకపోతే యిట్లా సాధ్యం కాదు. నీవు అసాధ్యం కనుక నీకంతా సాధ్యమేనమ్మా యీనా మాటలు కూడా నీవె. 'నీరుకారుతూనే వుంటుంది. పక్క తడిసిపోతూ వుంటుంది.' యే పండితులన్నా వచ్చి వ్రాస్తే బాగుండు తల్లీ అంటారు.

అమ్మ : పండితుడయిన పామరుడు వ్రాయడు. పామరుడు అయిన పండితుడు వ్రాస్తాడు.

యెందుకు తాతగారు, బ్రహ్మాండం పక్కలో పెట్టుకుని యేడుస్తారు?

చిదంబర్రావుగారు : (అంతలోనే నవ్వి) నిన్ను బ్రహ్మాండం అని యెవరన్నారు. నీవు బ్రహ్మాండానివా?

అమ్మ : ఒకప్పుడు మీరే అన్నారు. అయినా మీరు ఈ పేరుతో యెప్పుడో ఒకప్పుడు బ్రహ్మాండమని సంతకం చేయక తప్పదు. బ్రహ్మాండమంతా నీ చేతిలో, నీ కలంలో, నీ కలంలోని సిరాలో,పాళీలో, కాగితంలో, అక్షరాలలో, నీ భావంలో నిండిపోయింది. బ్రహ్మాండమంతా.

చిదంబర్రావు గారు : తెలిసేదేముంది. యిప్పుడు తెలియకపోతేగా చెప్పు.

అమ్మ : నాకు తెలయంది లేదని మీకు ఆ రూఢతేనా? ఆ రూఢత పూర్ణముగా వున్ననాడు మీరే చెప్పగలుగుతారు.

చిదంబర్రావు : పూర్ణంగా యెక్కడ వుంటుందమ్మా. వెలితిగానే వుంటుంది. నీవు మాట్లాడేటప్పుడు. వినేటప్పుడు ఉన్న అభిప్రాయం తరువాత మారిపోతుంది. ఆ మారకుండా చేయవలసింది నీవేనమ్మా. సరే వీళ్లందరిని గురించి చెప్పావు గాని, నీవు యెందుకొచ్చావో చెప్పమ్మా. నీ అవతారమేమిటో?

అమ్మ : "నాది అవతారమని యెవరు చెప్పారు? నేనేది పెట్టుకు రాలేదు. నాకేమి తెలియదు. ప్రత్యేకించి ఒక పని అంటూ లేదు. సృష్టి యే వుద్దేశంతో జరుగుతున్నదో.. అని ఆపేస్తుంది".

చిదంబర్రావు : అంటే సృష్టికాధారమనా?

అమ్మ : అనేమున్నది?

చిదంబర్రావుగారు : అదే. అర్థం కాకేముంది తప్పనిసరిగా సృష్టికాధారమనే వున్నది. వున్నదీ అదే, నేననుకున్నది అదే. జరిగేది అదే. జరుగబోయేది అదే.

అమ్మ : లోగడ జరిగింది అది గాదా? మా తాతగారు గడగడలాడిస్తున్నారె.

చిదంబర్రావుగారు : నేనాడించేదేముంది? అంతా ఆడించటమే.

అమ్మ : ఒక్కొక్క పనికి ఒక్కొక్కళ్లను నిర్ణయించి, రైలు చక్రాలు రైలు పట్టాలు తప్పకుండా డ్రైవరు నడిపిస్తున్నట్టుగా, అది గవర్నమెంటు నిర్ణయించినట్టుగా, యీ దిక్చక్రం తిరుగుతున్నది.

చిదంబర్రావు తాతగారు : తెల్లవారొచ్చింది. నాలుగున్నర అయింది. మొఖము కడుక్కుందామా అమ్మా?

మరియాకు అమ్మ :

అమ్మ, తాతగారు లేచి మొఖము కడుక్కుంటారు.

పనిచేసే ఎరుకల నల్లి సరివి తుక్కు తీసుకుని పొయ్యి రాజేస్తుంది స్నానాల గదిలో.

అమ్మ : (ఆ గడిముందుకు వచ్చి) - నల్లీ, స్నానానికి నీళ్లు యిస్తా ?

నల్లి : కాగలేదమ్మా యింకా, నేను కాచి యిస్తా.

అమ్మ : నీవు కాచి యిస్తావా. కట్టెలు కాచి యిస్తాయా.

నల్లి : నేనే కాస్తా.

అమ్మ : నువ్వే కాస్తే కట్టెలెందుకు?

నల్లి : కట్టెలు, నేను రెండూ కావాలమ్మా. సరేగాని అమ్మాయిగారు. నీవు యీ ఆవరణలో తిరుగుంటే యిదంతా నెత్తినేసుకుని, అంటే చెప్పటం చేతకావటంలా - ఇంటి యజమాని వుంటాడె. యజమాని కాదమ్మా అదీ చాలదు. అంటే నేను చదువుకొనే రోజుల్లో మా స్కూలు మానేజరు గారు వుండేవారు. ఆ స్కూలు బాధ్యత ఆయన నెత్తిన యెంతవుందో, తమ నెత్తిన ప్రపంచమంతా వున్నట్లు కనపడుతోందమ్మా. చూడటానికి చిన్న పాపాయిలా కనపడతావుగాని, ప్రపంచానికే పెద్దవా అనిపిస్తుంది.

అమ్మ : యేం చూచి అనిపిస్తుంది నల్లి నీకు?

నల్లి : ప్రతి యిళ్లలో వుండే చిన్నపిల్ల మాదిరిగా వుండవుగా అమ్మా. పిల్లలంతా అదీ, యిదీ కావాలని యేడవటం అదీ యిదీ పెట్టమంటం ఒక లక్షణమేమిటి అన్నీ విశేషంగానే వున్నాయి చెప్పటానికి చేతగాని విశేసం. ఇంతలో మొగలిపువ్వు వాసన వస్తుంది. మరుక్షణానికే రకరకాల పూల వాసన వస్తుంది.

చూచావా! నీవు గొప్పదానివని రుజువయిందమ్మా. (క్రైస్తవ మతస్తురాలే) మా బోధకులు మంచి వారియొక్క విశేషాలు చెప్పుకుంటున్నప్పుడు వారిని గురించి ఆ తండ్రి సువార్త చేస్తాడు, (అంటే యీ వాసన) అట్లాగే నీ విషయాలు చెప్పుకుంటుంటె యెటువంటి వాసనలు వచ్చినయ్యో చూసారా?

అమ్మ ం నాకు రాలేదమ్మా !

నల్లి : నీ సంగతి నీకు రాదుగా అమ్మా. ఆ పరలోకంలో వున్న ఆ తండ్రి యెట్లాంటివాడో కనపడుతున్న నీవు అంతే అమ్మా.

అమ్మ : నేను అంతే?

నల్లి : నేను అంతే? అంటే - నేను అంతుకాననా? అమ్మా నేను యేమొ ఫలానా అని నిర్ణయించలేను. నాకు తెలియని దైవత్వం నీలో యేదో మూర్తీభవించింది.

అమ్మ : అని తెలుసా?

నల్లి : దాదాపుగా యింతమందిలో నీ మీదనే యిటువంటి వుద్దేశం కలగటం. మిమ్మల్ని నీ, నీ అంటున్నానంటే సాక్షాత్ ఆ "తండ్రి" అనుకుంటేనే, తండ్రిని, కూడా కాదమ్మా నీవు. 'మరియా' అనుకుంటా.

అమ్మ : చాల మరియాదగా గుర్తించావు. మరియాకు పదియేళ్ల పిల్లప్పుడు యేసు పుట్టాడు. నాకు యెవరు పుట్టారు?

నల్లి : నీకు పదియేళ్ళు వచ్చేటప్పటికి పుడతాడేమొలే.

అమ్మ : ఆమెకు పెళ్లి కాకుండా పుట్టాడు.

నల్లి : పకపకా నవ్వి, మా బంగారు తల్లికి అన్నీ తెలుసే. నీవు మరియాకు కూడా అమ్మవమ్మా! లేకపోతే యీ పసికూనకు యిన్ని విషయాలు యెట్లా తెలుస్తాయి. యేదోలె పనిచేసే ముండలే అనుకోక వున్న యధార్థము చెప్పు తల్లీ అంటూ నుంచున్న అమ్మను యెత్తుకుని వీపుమీద (వుప్పువుప్పుగా) పడుకోబెట్టుకుని, చీపురు తీసుకుని దొడ్డి చిమ్మటం ప్రారంభిస్తుంది.

అమ్మ : నల్లీ ! అందరికి తల్లినంటినే. ప్రపంచానికంతా నీవె నంటివే నన్ను నీవు మోస్తున్నావుగా. నీవు యెవరివి?

నల్లి : నాపేరే నల్లి కాదూ. నిజముగా నల్లి పుటకే నీ మంచానికి పట్టి నీమీద యెక్కించుకుని, నీ నెత్తురు తాగుతూ, నీ రక్తం తాగిన బలంతో నిన్నెత్తుకున్నా అంటూ నీవిచ్చిన శక్తి కాకపోతే నీవు దైవంగా నాకు తోచదుగా అమ్మా. నీవు దైవంగా తోచటానికి నీవె ఆధారం, దైవంగా తోస్తూ చిన్నపిల్లగా కనపడుతూ ముద్దులు మూటగడుతూ, యీ చిన్నపిల్ల అని అనే మాటే తోచకపోతే చిన్నపిల్లగా కనపడే మాయే లేకపోతే యెత్తుకు ఆనందం పడలేముగా. నా పెనిమిటి పోయింది యిందుకే. పనికి వచ్చిన కారణం యీ అదృష్టమే అనుకుంటే దురదృష్టంలో అదృష్టం.

అమ్మ : దూరదృష్టి కలగటమే అదృష్టం. దురదృష్టి కాదు. దూరదృష్టి అంటే దూరానున్నవి కనపడటం కాదు. అంటే నేను చిన్నపిల్లగా వున్నాననుకో నాలో యేదో దైవత్వం, సామాన్యముకంటే యేదో విశేషం. నేను సామాన్యమైనా నీకు కనుపించిన లేక నీకు తోచిన స్థితియే దూరదృష్టి.

నల్లి : పకపకా నవ్వి, అసలు దురదృష్టం అనేదానికి అర్థం యీ రకమైన దూరదృష్టి కలగకపోవటమేనేమోనమ్మా.

అమ్మ : వీపు మీద నుంచి కిందికి జారుతుంది.

నల్లి : (జారగానె) నాకేదో అండ వుండి జారిపోయినట్లు వుందమ్మా !

అన్నపూర్ణమ్మ గారు వచ్చి : యేం నల్లీ. నీళ్లు కాగినయ్యా?

నల్లి : నేను చూడలేదమ్మా. చూడండి కొంచెం.

అన్నపూర్ణమ్మగారు : (దీని పనిగూడ అయిపోయినట్టుందే, సమాధానం యెట్లా చెపుతున్నదో చూడు, అని మనసులో అనుకొని కొంచెం చురుకుగా) యేమిటే నీవన్నది? మళ్లీ అను!

నల్లి : యేం లేదు తల్లీ. పొయ్యికింద నిప్పు లేసొచ్చాను. మళ్లీ చూడలేదు. కాగితే పోసుకుందురుగాని లేకపోతే వచ్చి మంట చేస్తాను.

అమ్మ యీలోగా పరుగెత్తుకుని వచ్చి నీళ్లు జూచి చెంబుతో నీళ్లు తీసుకుని వెళ్లి అన్నపూర్ణమ్మ గారికి యిస్తుంది నీళ్లు చూడమని.

అన్నపూర్ణమ్మ గారు : నిన్నడగలా, యెందుకు పెద్ద నాపసానల్లే నీవొచ్చావు. నీవు నల్లివా?

అమ్మ : నేను నల్లిని గాదు. తల్లిని!

చిదంబర్రావు గారు : యింతలో ఆంధ్రపత్రిక చేత పట్టుకుని వున్నమ్మ గారి నుద్దేశించి, యేమే యెక్కడున్నావు అంటూ దొడ్లోకి వస్తారు. అమ్మను జూచి 'యేమంటున్నది యీమెగారు' అని అంటారు.

జరిగింది చెపుతుంది పున్నమ్మ గారు.

చిదంబర్రావుగారు నవ్వి, అంతేగా మరి తల్లేగా అని ముసిముసి నవ్వులు నవ్వుకుంటూ, రామ్మా! రా! పేపరు చదువుతావా?

అమ్మ : చదవటమెందుకు?

చిదంబర్రావు గారు : సంగతులు తెలుసుకో గలందులకు.

అమ్మ : తెలుసుకుని యేం జేస్తారు? మనకు తెలిసిన విషయాలె తెలుస్తయ్యా. తెలియని విషయాలు తెలుస్తయ్యా ?

యింతలో (యెవరో) వచ్చి తాతగారికి యెదురుగుండా నుంచుని పిలుస్తారు. ఆ పేపరు చదివి చెప్పండి అని అడుగుతారు.

చిదంబర్రావు తాతగారు చదువుతారు. ఇటలీని గురించి. వారు 'మా కర్థం కాలేదండి' అంటారు.

అమ్మ : పేపరు చదువుకుంటే సంగతులు తెలుసుకోవచ్చంటిరే మీరు. చదివినా ఆయనకు తెలియ లేదేం? తెలుసుకున్న వాడికి తెలుస్తుందన్నమాట. తెలియనివాడికి తెలియదు.

యెదురుగుండా వున్న మనిషి చదువొచ్చుగాని పేపరు విషయాలు అర్థం కావండి అని అంటారు.

చిదంబర్రావు గారు : ఆ మాట అనేసరికి తాతగారికి యెదురుగండా వున్న మనిషి, అమ్మ ఒకటిగా తోస్తాడు. కనపడతాడు. అమ్మకంటె యెత్తుగా వుంటాడు. అమ్మ గొంతులో ధ్వనిగా వుంటుంది. యింత చిన్న పిల్లవాడు అడిగాడని యిందాక నాకెందుకు తోచగూడదు అని తల పక్కకు తిప్పి అమ్మవైపు చూచి, తరువాత అమ్మవంక చూస్తారు. అమ్మవంక జూచి యెదురుగుండా వున్న అబ్బాయి వంక జూస్తారు. అబ్బాయి కనుపించడు. యింతను యింతలోనే యెక్కడికి పోయాడు. ఒక్క క్షణము ముందు వుండి యింతలో యెక్కడికి పోయాడు. ఆశ్చర్యంగా వుందే అని మొఖము ఒక వింతగా పెట్టి నాలుగు మూలలా చూస్తారు.

అమ్మ తాతగారు యీ అబ్బాయిని యింతకు ముందు యెప్పుడయినా జూచారా?

చిదంబర్రావు గారు : చూడలేదు గాని ఆ సమయంలో యిట్లా తోచలేదు. పాతవాడిలా అనిపించింది. యిట్లా అనుకుంటే అప్పుడే విమర్శించి చూచేవాడిని.

అమ్మ : పోనీ యెవరోలె, మీ మనుమడనుకుందాం.

చిదంబర్రావుగారు : నే తాతనైనప్పుడు అందరూ మనుమలే ననుకో!

అమ్మ : నీవు ప్రపపంచానికంతకు తాతవా? మన యింట్లోనే అందరూ తాతవని పిలవటం లేదె. తల వొక రకంగా పిలుస్తున్నారు. చిన్న పిల్లలకు తాతవనుకుందామా, చిన్న పిల్లలు కూడా అందరూ తాత అనటంలేదుగా, సుందరి, ఆదిలక్ష్మి (అన్నపూర్ణమ్మ గారి చెల్లెలి పిల్లలు) పెదనాన్న అని పిలుస్తున్నారుగా.

చిదంబర్రావు గారు : అబ్బబ్బా నీ క్రాసుకు తట్టుకోలేను తల్లీ!

అమ్మ : మీ దగ్గర పెరగటమే కారణం.

చిదంబర్రావుగారు : అవును మరి యెవరి మెడకయినా వెయ్యటమేగా!

అమ్మ : నేను వెయ్యలా, వెయ్యటానికి సిద్ధమయినవి తీసా.

చిదంబర్రావు గారు : యెవరికి తీశావు?

అమ్మ : యెవరన్నవారికే.

చిదంబర్రావుగారు : అప్పుడు నీవు యే రూపముతో వున్నావు.

అమ్మ : యెప్పుడు అసలు యేమైనా జరిగిందేమిటి? యెవరో వుక్కటి పురాణంగా చెప్పుకుంటుంటే విన్నా!

చిదంబర్రావుగారు : నన్నెట్లా అడగ గలిగావు? యెవరన్న వారే నన్నావుగా, చెప్పుకుంటుంటే విన్న మాటలుగా లేవు. అంత స్పష్టంగా అడగలేదమ్మా విన్న మాటలకు, కన్న మాటలకు తేడా వుంది.

అమ్మ : పోనీ మీ సంగతి మీరే చెప్పండి.

చిదంబర్రావుగారు : యేమున్నదని చెప్పేది. నువ్వన్నదే!

అమ్మ : తాతగారు మీరు నిజంగా చేశారా?

చిదంబర్రావుగారు : జరిగిందంతా సంగ్రహంగా చెపుతాలె!

అమ్మ : సరేలెండి, నాకేమొద్దుగాని అసలు మీరేమి యెరుగరా? ఆ ఒక్క ముక్క చాలు!

చిదంబర్రావుగారు : అవతలాయన పోయినాడని బాధపడ్డాను గాని మొత్తము మీద నానడకే నా మీదనేరాన్ని రుజువు చేసింది. నేను కాశి వెళ్లటం.

అమ్మ : అసలు యెందుకొచ్చింది తాతగారు యిది?

చిదంబర్రావుగారు : నేను పొన్నూరులో వుండి ప్లీడరు చేస్తున్నాను. ఆ సమయంలో ఆలూరు గోపాలరావు గారని గుడి ధర్మకర్త మన కుటుంబానికి పెద్దవాడు. నేనంటే చాలా ప్రేమ అతను వస్తుతా చాలా పెద్దమనిషి. మంచివాడు, అతనిలో వ్యవహారికంగా కూడా నీతి నిజాయితీలు యెక్కువ వున్నాయి. గుడి ధర్మకర్త పొన్నూరు కరణం. వస్తుతా నాకు పెద్దవాళ్లతో స్నేహమెక్కువ. అందులో మన్నవ కరణం గారి అల్లుడనేది ఒక ప్రత్యేకత. యిందువల్ల నన్ను దగ్గరకు తీసి, 'నాయనా! నాకీ దేవాలయం విషయంలో కొంచెం సహాయం చేసిపెట్టు యెంత పంట పండినా రక్తికి రావటం లేదు. దుబారా ఖర్చు చేస్తున్నారు. ధనవ్యయం. చిన్నవాడివి చురుకయిన వాడివి యీ పనిచేసి పెట్టమ'ని కోరారు. మనవాళ్లంతా వద్దనే చెప్పారు. కాని చెయ్యబోయే పని మంచిది గదా అని దిగాను కాని నేను దిగినందువల్ల ఆ గుడికి సంబంధించిన జనానికి బాధ కలిగింది. అందువల్ల దానికి సంబంధించిన జనమే వుభయులను చంపాలని చూచారు. కాని ఆయనకు పోయే సమయం, నాకు జైలులో బడే సమయము వచ్చినది. ఉరిశిక్ష కూడా నిర్ణయించారు. మీ అత్తయ్య కర్లపాలెం పిచ్చయ్య శాస్తుర్లు గారిని పెట్టి బాలాత్రిపుర సుందరి పూజ చేస్తుండేది. కోర్టులో యేది జరిగితే అదల్లా మీ అత్తయ్యకు ప్రత్యక్షంగానే తెలుస్తూ వుండేది (అత్తయ్య అంటే అన్నపూర్ణమ్మ గారు) చివర దశలో కేసు కొట్టివేయటం కూడా తెలిసింది. ఆనాడు రాజ్యలక్ష్మి అమ్మవారికి వున్నమాను రథం చేయించాను. ధనం నాది కాకపోయినా ఆనాటి రాజ్యలక్ష్మి యింకొకప్పుడు బాలాత్రిపుర సుందరి అయి కేసు కొట్టించింది. ఆనాడు రాజ్యలక్ష్మి ఒకప్పుడు బాలాత్రిపుర సుందరి యిప్పుడు అనసూయవై గుర్తుకు తెచ్చావు. వాళ్లిద్దరికంటే కూడ గొప్ప స్థితి, అనసూయదే. (యిది కథ. కేసు జరిగిన 7 సంవత్సరములకు అమ్మ జన్మించింది.)

ఈ సంభాషణ జరుగుతుండగానే పార్టీలు వస్తారు.

అమ్మను బల్ల దించి యింట్లోకి వెళ్లి స్నానం చెయ్యమ్మా అంటారు.

అమ్మ దొడ్లోకి వెళ్లి స్నానానికి నీళ్లు తోడుకోబోతుంది.

నల్లి వచ్చి నేను తోడి పోస్తా బంగారు తల్లీ అంటుంది.

అమ్మ యెప్పుడు కనపడ్డా తనలో తను నమస్కారం చేసుకుంటూ వుంటుంది నల్లి.

నల్లికి యేవో అనుభవాలు అనుక్షణం కలుగుతున్నట్టుగానే వుంటుంది. (నల్లి యెరుకుల మనిషి). ఒక రోజున యీ పని వొద్దు యేమీ వొద్దు యెక్కడ వుంటే అక్కడ అమ్మే వుంటుంది. రక్షిస్తుంది అనుకొని యీ వుద్దేశం కలిగిన నాలుగు నెలలకు దాని దారిన అది వెళ్లిపోయి నెల్లూరు దగ్గర ఆకులల్లూరులో తోటల్లో వుంటుంది. (22-11-61 యిప్పటికి వున్నది) యీమె థర్డు ఫారం వరకు చదివింది. తెలుగు కావ్యాలు చెప్పకుంది. మామూలుగా దినచర్యలు 15 రోజులు జరుగుతాయి. తరువాత అమ్మ, సీతాపతి తాతగారు, రాఘవరావు మామయ్యగారు తెనాలి ప్రయాణము. మధ్యాహ్నము తిరుగు కోచీలో అమ్మ, మామయ్య, సీతాపతి తాతయ్యా తెనాలి వెళతారు.

ప్రతి పని వాడి కరుణే :

స్టేషను దిగగానే టిక్కట్టు యిచ్చేలోగా అమ్మ ముందు బ్రిడ్జి యెక్కుతుంది.

ఆనాడు స్టేషను బ్రిడ్జి గూడ యిట్లా వుండదు అది ఒక రకంగా వుంటుంది. అమ్మ స్టేషను నుంచి బయటకు ముందుగానే వెళ్లి ఒంటెద్దు బళ్లు, గుర్రపు బళ్లు వున్నచోట నుంచుంటుంది. అమ్మ నుంచున్న బండి యెద్దుకు జబ్బుగా వుంటుంది. 'బండి యెంతకు కడతాపబ్బాయి' అని యెద్దును సవరిస్తుంది అమ్మ. దానిమీద చెయ్యి పెట్టగానే యెద్దు వులిక్కిపడి గజగజ వణుకుతుంది. 'యే అమ్మాయి, యెద్దు జోలికి రాబాకు' అంటాడు. అన్నా అమ్మ యెద్దును సవరదీస్తూనే వుంటుంది. 'నీకు కాదా చెప్పింది' అని కొరడా తీసుకుని వేస్తాడు. కొరడా దెబ్బ అమ్మకు తగిలి యెద్దుకు తగులుతుంది. యెద్దు వులిక్కిపడి కాడి వదిలిపెట్టి అమ్మ కాళ్లమీద ముట్టిబెట్టి కింద పడుతుంది. అమ్మను చూస్తూ కంటితో - ఆ బండి మనిషి యెద్దు దగ్గరకు వచ్చి అమ్మ పాదాలవంక యెద్దు ముఖము వంక చూస్తాడు. చూని 'యిదేమిటమ్మాయి యెద్దును కాస్తా బెదురు పెట్టావు. అసలే చావుకు సిద్ధమయినది. వారము రోజులనాడు చచ్చిపోయిందనే అనుకున్నా కాని యెందుకు బ్రతికిందో బ్రతికింది. అవస్థ పడి పడి ఆశ వదులుకుని సర్వం భగవంతుని మీదనే భారము వేసి యెద్దుకు మేతవేసి పడుకున్నా. మళ్లీ నే లేచేటప్పటికి మేత కొరికింది. యెప్పుడూ తాడూ తెంచటం కాని, వేసిన గడ్డి తినకపోవటం గాని యెంత దూరం బండి కట్టినా యెదరు తిరగటం గాని యెరుగదు. ఆ రోజు జబ్బు చేస్తే దేముడికి మొక్కుకున్నా నయము చేస్తే యేమన్నా యిస్తావనే బదులు నయము జేస్తే యెద్దు నిస్తానని,

యివాళె బండి కట్టాను.' యీ మాట అనే సమయంలో తాతగారు, మామయ్య యెవరో తెలిసిన మనిషితో మాట్లాడుతూ వస్తూ వుంటారు. మామయ్య ముందు వెళతారు యింటికి. యెద్దు రెండు కళ్లు తెరిచి అమ్మ వంక చూసి "అమ్మా" అన్నట్లుగా అరిచి ప్రాణము విడుస్తుంది. యెద్దు వర్చస్సు యిన్నాళ్లనుంచి అమ్మ కోసమనే ఆగి వున్నానన్నట్లుగా వుంటుంది. జ్ఞానం కలగటానికి మానవ జన్మే అక్కరలేదు.

సీతాపతి తాతగారు : అమ్మను సమీపిస్తారు. అమ్మ దగ్గరకు వచ్చి నీ వంటినిండా బంగారం. నువ్వు యెందుకమ్మా ఒంటరిగా వచ్చావు. యీ సొమ్ము పాపిష్టిది, ప్రాణం తీస్తుంది. అన్నయ్య యేడి? ముందు వెళ్లాడా?

అమ్మ : యేమో నాకు తెలియదు. నాకు యెదురుగానే నడిచి వెళ్లాడు.

యెద్దు ప్రాణము పోయే సమయానికి అమ్మకు బరువు లేకుండా రెండు పాదాల సందున తలపెడుతుంది. తన ప్రాణం పోతూ కూడా అమ్మకు బాధ లేకుండా వుండాలనే ఆలోచిస్తుంది. ఆ సమయంలోనే యెవరో కుక్క మీద రాయి విసిరేస్తే అది అమ్మకు వచ్చి తగులుతుంది. యెద్దు ఆశయం అమ్మ బాధ లేకుండా వుండాలన్నా వాళ్లు అమ్మను కొట్టాలని కొట్టకపోయినా 'బాధ పడవలసిన సమయంలో బాధ తప్పదు అనేది ప్రతి జీవి అనుక్షణం తన జీవితంలో జరుగుతున్న విధానాన్ని గుర్తిస్తూ వుంటే వేరే శాస్త్రాలతో పనిలేదు' అనుకుంటుంది అమ్మ మనస్సులో.

సీతాపతి తాతగారు : (అమ్మకు దెబ్బ తగిలి కారుతున్న నెత్తురు జూచి తొందరగా ఆదుర్దాతో) అమ్మా యేమిటి ఆ నెత్తురు (అని అమ్మను దగ్గరకు లాక్కుంటారు.) యిది యేమిటి? యీ యెద్దేమిటి యీ దెబ్బేమిటి? యేమిటి యీ క్షోభ అంటారు.

అమ్మ : యెద్దు చచ్చిపోయింది నాన్నా !

సీతాపతి తాతగారు : చచ్చిపోతే పోయింది. యివతలకిరా, యెందుకు అక్కడ నుంచున్నావు, నీవేమయినా బ్రతికిస్తావా?

అమ్మ : బ్రతికించలేను, చంపలేను.

సీతాపతి తాతగారు : (రెక్క పట్టుకుని) మాటలు కోటలు దాటుతున్నాయి, కాళ్లు గడపలు దాటవు అంటూ మనకు పోయిన పాడుగూతా చావులేనా పీడ, మన పొద్దు యిట్లా గూకాలిసందేనా చావులతో?

అమ్మ : అమ్మ చచ్చిపోతే అందరేడ్చారే, యెద్దు చచ్చిపోతే యెవరూ యేడవరేం?

సీతాపతి తాతగారు : అందరి సంగతి వదిలిపెట్టు, నీవు యేడవటం లేదేం?

అమ్మ : నేను ఆ రోజు యేడవలా; యీ రోజు యేడవటంలా, కనీసం నా దెబ్బ జూస్తె వున్నంత ఆదుర్దా, యెద్దు చచ్చిపోతే లేదుగదా!

సీతాపతి తాతగారు : చచ్చిపోయిన యెద్దు గురించి ఆదుర్దా పడితే యేమొస్తుందని ఏడ్వలా, నీకు దెబ్బ అంటే కట్టు కట్టవచ్చు నయం చేసుకోవచ్చు.

అమ్మ : అమ్మ కోసం ప్రాణం పోయిన తర్వాతనేగా అంత గోలగా ఏడ్చారు.

సీతాపతి తాతగారు : అబ్బబ్బా విసుగు పుడుతున్నది. యేమి ప్రశ్నలు, పిచ్చి ప్రశ్నలు, యింతకూ కూలివాడికి మూటలు యిచ్చి నడిచిపోదామా! బండి మాట్లాడమంటావా?

అమ్మ : మీ యిష్టం. యెట్లా తీసుకు వెళితే అట్లా వస్తా!

సీతాపతి తాతగారు : అట్లా కాదు. నీ యిష్టం వచ్చినట్టు చెప్పు యే బండి కావాలంటే ఆ బండి కట్టిస్తా. లేక నడుస్తానంటావా. అదయినా సరే.

అమ్మ : మాట్లాడకుండా నుంచుంటుంది.

సీతాపతి తాతగారు : నీ యిష్టమొచ్చిన బండి యేరుకో అమ్మా!

అమ్మ చచ్చిపోయిన యెద్దునే చూస్తూ వుంటే, బండికోసమె చూస్తూ వంది, బండి యెక్కాలని బళ్లవంక చూస్తూ వుందనుకుంటారు.

సీతాపతి తాతగారు : తేల్చి చెప్పరాదా, మనస్సులో ఒకటి, పైకి ఒకటి యెందుకు?

అమ్మ : తేల్చి చేపుతా. అదుగో ఆ బండి కావాలి, అని యెద్దు చచ్చిపోయిన బండిని చూపిస్తుంది. యెద్దును చూపించకుండా.

సీతాపతి తాతగారు : బండికోసము మనిషిని పంపుతారు.

బండిమనిషి : నీకు కనపడటం లేదటయ్యా, యెద్దు చచ్చిపోతే బండి కావాలని అడుగుతావు.

సీతాపతి తాతగారు : యేడ్చినట్టే వుంది. యేమి కోర్కెలమ్మా నీ కోర్కెలు. యెటువంటి కోర్కెలు కోరుతున్నావమ్మా.

అమ్మ : నాకు యేనాటికన్నా కోర్కెలంటూ వుంటే అట్లాగే వుంటాయి.

సీతాపతి తాతగారు : తీర్చుకోలేని కోర్కెలెందుకు ?

అమ్మ : నేనే గాదు మీరయినా అంతే యే బండి కావాలంటే ఆ బండి యెక్కిస్తానన్నారుగా, యేమి తీర్చగలిగారు. తీర్చకపోగా నా మనస్సులో వున్న వుద్దేశం కనుక్కున్న వారిలాగా నా మనస్సును గుర్తించినట్లుగా అన్నీ అర్థమయినట్టుగా యెటో చూస్తుంటే, యేదో చూచానని ఒకటుంటె ఒక అర్థము తీసుకుని, యెటో చూస్తూ వుంటే యెందుకో చూచానని పైగా మీరనుకున్నదిగా నేను జూచినట్లు, అది నిజం జేసుకుని సంభాషణ ప్రారంభిస్తారు. తన అనుకున్న దాన్ని బట్టి యితరుల వుద్దేశాన్ని నిర్ణయిస్తారు. ప్రపంచంలో యీ రెండే నడకకు ఆధారం. వాదనకు కాని వ్యవహారికంగా గాని తను అనుకున్నది ఒకటి, అక్కడ వుండేది యింకొకటి. అట్లా లేకపోతే యిది ప్రపంచమనే పేరు రాదు. ఒకరిని కాదు ప్రతి ఒకరికి వున్న స్థితే యిది. అంటే భార్య భర్తకేమి, తల్లి బిడ్డకేమి. కనీసం మార్గదర్శకులు అయినామని గురువులుగా బోధజేసే వారికి కూడా మనస్సును గుర్తించలేని స్థితి వుంటూనే వుంది. యిదే భిన్నత్వం అంటే, మనస్సు తెలిసినప్పుడు బోధే లేదు.

యీ మాటలు అమ్మ మాట్లాడేటప్పుడు తాతగారికంటె శ్రద్ధగా ప్రతి ఒక్కమాట ప్రక్కన ఒక సాహెబ్ ఖాదర్‌వల్లీ శ్రద్ధగా వింటాడు. ప్రతీది అర్థం చేసుకోగలందులకు ప్రయత్నిస్తాడు.

అమ్మ, తాతగారు నడిచే పోతూ వుంటారు.

ఖాదర్‌వల్లీ : అయ్యా, అమ్మాయిగారిని నేను యెత్తుకోనా, కాలికి దెబ్బ తగిలి నెత్తురు కారుతున్నది. పాపం కట్టయినా కట్టించక పోయినారా అని అమ్మను యెత్తుకోబోతాడు.

అమ్మ : వొద్దులే నాయనా నడుస్తాలె. ఆ మాట అన్నప్పుడు ఖాదర్‌వల్లీ గారికి అమ్మాయిగా తోచదు. అమ్మగా తోస్తుంది.

అమ్మకు అతని ముఖములో ప్రశాంతత కనపడుతుంది. 'చల్లనిమూర్తి' అనుకుంటుంది.

సీతాపతి తాతగారు: యితను వెంబడించటం చూచి యేదో పిల్ల దగ్గిరవున్న బంగారం కొట్టి వేయటానకి వచ్చాడని అనుకుంటారు. పైకి అనలేక నీవు యెవరబ్బాయివి, యెందుకు కూడా వస్తున్నావు.

ఖాదరువల్లీ : యేమీ లేదు నాయనా, ఆ అమ్మ నడుస్తుంటె యెత్తుకొద్దామనిపిస్తున్నది. పోనీ కొంచెంసేపు నుంచోండి, దగ్గరలో మా వాళ్ల బండి వున్నది తీసుకువస్తాను అని అంటూ వెళతాడు.

సీతాపతి తాతగారు : అతనిని నమ్మలేక, 'దొంగ ముండాకొడుకులు బంగారం కాజేయటానికి అనేక రకం యెత్తులు. అందులో సాయిబును నమ్మకూడదు. వాడు వచ్చేటప్పటికి మనం యిల్లు చేరుదాం' అంటారు.

అమ్మ : "వాడిది చాలా గొప్ప హృదయం నాన్నా. మంచి చెడ్డలు కులంమీద ఆధారపడి వున్నయ్యా, గుణహీనుడయినా మీరు చెప్పే పద్ధతిని బట్టి కులమును బట్టి గుణవంతుడేగా!"

సీతాపతి తాతగారు : అనవసరం మాటలెందుకు నీకు, చిన్నపిల్లవు.

అమ్మ : అవును నాన్నా అనవసరం మాటలు కావు. అవుసరం కలిగిన మాటలేగా?

సీతాపతి తాతగారు: అంతా చంద్రమౌళిగారి పోలికలు వచ్చినాయి. (చంద్రమౌళి వారంటే చిదంబర్రావు తాతగారి యింటిపేరు)

అమ్మ : వారికి కోపమొచ్చినప్పుడేమొ మన్నవ వారి పోలికలంటారు. మీకు కోపము వచ్చినప్పుడు చంద్రమౌళి వారి పోలికలంటారు. నాకు యెవరి పోలికలు కావు. "నా పోలికే మీ అందరికి వచ్చింది" అంటూ నడుస్తూనే వుంటారు.

యింతలో గుర్రపు బండి తోలుకుని ఖాదర్‌వల్లీ సమీపించి 'అయ్యా యెక్కండి' అని అమ్మను బండి యెక్కించుతాడు. తాతగారు కూడ యెక్కుతారు. యిందాకటికంటె ఖాదర్‌వల్లీ మీద తాతగారి అభిప్రాయం కొంతవరకు మారుతుంది. అయిదు నిమిషాల్లో యిల్లు చేరతారు.

మామయ్య పోయి ముందుగా వస్తున్నారని చెప్పటంతో యెదరుచూస్తూ వుంటారు. మామయ్య చెప్పి వెళ్లిపోతాడు. మళ్లీ యింటికి రాడు. వాకిట్లోకి బోయి బండి ఆగగానే అమ్మ పెదతల్లి అన్నపూర్ణమ్మగారు (ఆమెకు భర్తలేడు.) బయటకు వస్తుంది. బండి దగ్గరకు వచ్చి బండిలో నుంచి అమ్మను దించి యేడుస్తూ యింట్లోకి తీసుకు వెళుతుంది. యింట్లో వున్న అయిదుగురు పినతల్లులూ అమ్మను యెత్తుకోబోతారు. ఆ సమయంలో అక్కడ ఆ క్షణంలో అమ్మమ్మ పోయినట్టుగా వుంటుంది. బండి దించి ఖాదరువల్లీ అమ్మ వున్నన్నాళ్లూ దర్శనము చేసుకొని పోతూవుంటాడు.

వెంకటసుబ్బయ్య తాతగారు : అమ్మకంటె యెక్కువగా సీతాపతి తాతగారి మీద ఆదరణ చూపిస్తారు. నా దగ్గర యీడయిన పిల్ల కూడా లేదుగా నాయనా అంటారు.

సీతాపతి తాతగారు : ఒక పిల్లను యిస్తే యింతగా సంతోషపెట్టాను. యింకా నాకు ఆ పాతకం కూడా యెందుకు? నాకు అసలు ఆ కోరికే లేదు. పిల్లల బాధ్యత తీరిస్తే చాలు, పిల్లను యిచ్చినంత పుణ్యం.

వెంకట సుబ్బయ్య తాతగారు : నీకు యెట్లా తప్పుతుంది నాయనా రంగమ్మ తల్లి బాధ్యత కూడా నీ నెత్తినే వుంది. అంటే మాకు పిల్లలు బరువై కాదు. నీకు తప్పదు కదా నాయనా. యెంత మేము చూచినా నా బాధ్యత యెక్కడికి పోతుంది.

యింట్లో అమ్మను యెంతమంది పలకరించినా పలకదు. యేది పెట్టినా తినదు. 'యిటువంటి పిల్ల మనకేమి అలవాటు అవుతుంది. అయినా పదిరోజులు అట్టిపెట్టుకుని చూద్దాం' అని అమ్మ పెద్ద అమ్మ అన్నపూర్ణమ్మ గారు అంటుంది.

జానికమ్మ గారు : ఆస్తి వున్నది, మనం పెంచేదేమిటిలే. మొగుడు పిల్లలు లేని ముసలమ్మ వున్నది. యిక్కడికంటె గారాబంగానే పెరుగుతుందిది. (అమ్మను పెంచటం జానికమ్మ గారికి అంత యిష్టము వుండదు).

వెంకటసుబ్బయ్య తాతగారికి, అన్నపూర్ణమ్మ గారికి అట్లాగె పెంచాలని వుంటుంది. పదిరోజులు వుండి అమ్మ అక్కడ అలవాటు కాక పదకొండో రోజున రావాలని అనుకుంటారు.

పదకొండో రోజున. తాతగారికి అమ్మకు తలంటు పోసి గుడ్డలు తీసుకొని వచ్చి యిచ్చి 'తప్పకుండా యింటివాడిని' కా నాయనా అని ఆశీర్వదించి వెంకటసుబ్బయ్య తాతయ్య బట్టలు యిస్తారు.

అమ్మను యింతలో అన్నపూర్ణమ్మ గారు జానికమ్మ గారు అందుకుని 'మా దగ్గర ఉండమ్మా' అంటారు. 'మంచి పరికిణీ కుట్టిస్తాము. చాలా సొమ్ములు చేయిస్తాము' అంటారు.

అమ్మ : చాలా సొమ్ములు పరికిణీలు తాతమ్మ కావుగా అంటుంది.

యీ పదకొండు రోజుల్లో అమ్మ మాట్లాడిన మాట యిది ఒకటే.

జానికమ్మ గారు : సముద్రమంత గంభీరం అంటుంది.

అన్నపూర్ణమ్మ గారు : చాలా దూరపు ఆలోచనలు గల పిల్ల అనుకుని, సీతాపతి తాతగారిని పిలిచి తరచుగా యీ పిల్లను తీసుకొస్తూ, పోతూ వుండండి. క్రమంగా అలవాటు అవుతుందేమొ ప్రస్తుతం అలవాటు అయ్యేటట్టు లేదు.

వెంకట సుబ్బయ్య గారు : సరే యేం చేస్తాం. దాని యోగం యెట్లా వుందో అంటారు. పోతూ పోతూ చిదంబరం చేతిలో పెట్టి పోయిందిగా వాళ్ల తల్లి. అన్నీ వాడే జూచుకుంటాడు.

ఖాదర్‌వల్లీ క్రితం రోజే యీ కబురు విని బండి తీసుకొచ్చి వాకిట్లో నిలుపుతాడు.

సీతాపతి తాతగారు : గుఱ్ఱబ్బండి యేమయినా దొరుకుతుందేమోనని వీధిలోకి వస్తాడు. రాగానే ప్రక్కనున్న అరుగు దగ్గర గుఱ్ఱబ్బండి వదిలి వుంటుంది. ఆ బండి చూచి బండి సిద్ధంగానే వుంచాడె యితను అంటారు.

ఖాదర్‌వల్లి వెంటనే బండి దిగి 'యెక్కండి అయ్యా' అని బండి కట్టుకు వస్తాడు.

సీతాపతి తాతగారు, అమ్మ బండి యెక్కుతారు. బండి యెక్కుతూ యెక్కుతూ రాఘవుడు వస్తే బాపట్ల రమ్మని చెప్పండి అని తాతగారు బండి యెక్కి అమ్మను కూడా కూర్యోబెట్టుకుని స్టేషనుకు చేరతారు. బండి దిగి ఖాదరు వల్లీకి తాతగారు డబ్బు యివ్వబోతాడు.

ఖాదర్‌వల్లీ : వద్దయ్యా నీవు తండ్రివి, నేను బిడ్డను, అమ్మకు నేను కూలికి రాలేదు. నేను అమ్మ బిడ్డను.

సీతాపతి తాతగారు : చిన్నపిల్లని పట్టుకుని తల్లి అంటావేమిటిరా?

అమ్మ : నీ పిలుపులోనె అతన్ని యెంత స్వతంత్రంగా అన్నావు. అందర్ని యేమిరా అనలేదుగా.

సీతాపతి తాతగారు : స్వతంత్ర మేమిటి, చిన్నవాడు గనుక యేమిరా అన్నాను.

యీ సంభాషణ జరుగుచుండగానే రైలు వస్తుంటుంది.

ఖాదర్‌వల్లీ : అయ్యా నేను బాపట్ల వస్తా. నా అన్నం నే తిని అమ్మను చూస్తూ వుంటాను.

సీతాపతి తాతగారు : యెందుకు అనవసరం. బాపట్ల యెందుకోయ్.

ఖాదర్‌వల్లీ : బాపట్ల కోసం కాదు, అమ్మ కోసం.

అమ్మ : అమ్మను యిక్కడ చూచావుగా నాయనా. యీ పూట వద్దులే. నేను వెళ్లిన తరువాత రా అన్ని సంగతులు అక్కడ మాట్లాడుకుందాం, వివరంగా.

సీతాపతి తాతగారు : (యిది చెప్పడం వినడు) ఓ అబ్బాయ్ యీ సామాను మమ్మల్ని కాస్త రైల్లో యెక్కించిపో.

అమ్మ : యింత మాత్రం కరుణతో అతనితో నువ్వు మాట్లాడింది యిదేగా.

సీతాపతి తాత : యిదే కాదమ్మా. అసలు కరుణ అంటేనే నాకు లేదు.

అమ్మ : పోనీ కరుణ పొందుతావా?

సీతాపతి తాతగారు : అదీ లేదు.

అమ్మ : కరుణ లేకపోతే మనమేలేం. మనము చేసే పనులన్నీ కరణే. కరుణ అంటే నా దృష్టిలో కష్టసుఖాలు కూడా కరుణే. ప్రతి చిన్న పని మనం చేతులతో చేస్తున్నామనుకున్నా మనసుతో చేస్తున్నామనుకున్నా మనం యెట్లా చేసినా వాడి కర్మ కనపడకుండా మనచేత చేయించబడుతున్న ప్రతి చిన్నపని వాడి కరుణే. కనపడని కరుణ కనపడకుండా యేయే తరుణాల్లో ఆ పని చేయించటమే కరుణ. కరుణ సముద్రంలో అలలు లాంటిది. ఆ తరంగానికి తరుణ మొచ్చినప్పుడు నీటియొక్క రూపమె కొండలాదిగా యెక్కడో ఒకచోట పుట్టి, కొండ మాదిరిగా కనపడి నీరై పోతుంది. ఒక్కొక్క అల యెక్కడనుంచో వస్తున్నట్టు వుంటుంది. దగ్గరలోనే పుట్టినట్టు వుంటుంది. యింతకు నీటికి గాలి వొరిపిడేగా?

నీటికి గాలియొక్క ఒరిపిడి చిన్నదైనా పెద్దదయినా వస్తువు మరొక రూపంలో ప్రవేశించినప్పుడు అంటే కలిసినప్పుడు, శక్తి ఒకటయినా ఒక శక్తి రూపం యెక్కువగా కనపడటం చేత మరొక శక్తిని గర్తించలేం. శక్తికితరుగు వొరుగులు లేవు. రూపములకు భేదముంది గాని శక్తికి లేదు. యెంత గాలిచేత అలలు వచ్చినా నీటికి కదిలే శక్తి లేకపోతే కదిలించటేదు. 'ప్రవాహము అనగా బీజము, బీజము చైతన్యము చేతనే కలిగింది'.

సీతిపతి తాతగారు : వినరు.

ఖాదరువల్లీ : యిదంతా శ్రద్ధతో విని తప్పకుండా బాపట్ల వస్తా అమ్మా నే తెలుసుకోవాల్సినవి చాలా వున్నాయి. నేను రేపో యెల్లుండో వస్తాను. నేను యెక్కడయినా అడుక్కు తినయినా నా ప్రాణం నీ కాళ్లముందర యేనాటికయినా అంటే యెక్కడయినా పోయేదె ననుకోండి. అన్నీ తెలుసుకుని ఆనందపడి నీవు అసలు యెవరోనని అనుమానమొచ్చింది తల్లీ.

సీతాపతి తాతగారు. : ఆ వచ్చేది మన రైలే.

ముగ్గురు దగ్గరకు వెళతారు.

అమ్మ, తాతగారు రైలు యెక్కి బాపట్ల చేరుతారు.

ఖాదరు వల్లీ తిరిగి యింటికి చేరుతాడు.

బాపట్ల స్టేషనులో దిగి యింటికి రాగానే చిదంబర్రావు తాతగారు అమ్మను చూచి 'అమ్మా, రంగమ్మా వచ్చావా' అని నాలుక కరుచుకొని యేమి పొరపాటు అనుకుని అమ్మను యెత్తుకొని కంటివెంట నీరు కారుస్తూ లోపలకు యెత్తుకు వెళతారు.

సీతాపతి తాతగార్కి అమ్మమ్మ గారి గొంతు ధ్వనిగా వనిపిస్తుంది. 'పిల్లను యెక్కడా వదిలి పెట్టవద్దు. ఆ ప్రయత్నం కూడా చేయవద్దు మనకు బరువులేదు. మన బరువే ఆమె మోస్తుంది.' యేదో తన ఆలాపన, తనకు కలిగిన భ్రమా అని నాల్గువైపులా వెతికి చూచి నా మనస్సులో కలిగిన ఆలోచనలే నాకు ప్రతిధ్వనిస్తున్నై అని వాకిటి ముందున్న బల్లమీద కూర్చుని ఇట్లా ప్రతీదీ వినిపిస్తుండకూడదూ? మనిషి లేని కొరత వుండదు కదా? యెదురుగుండా అమ్మమ్మ గారు వున్నట్లుగానే చూస్తూ వుంటారు.

మరిడమ్మ గారు : యేమి నాయనా, పిల్లను తీసుకొచ్చావేం?

సీతాపతి తాతగారు తన ఆలోచనలోనే వుండి సమాధానమివ్వరు.

9. అమ్మ దివ్యత్వ ప్రాభవం

నృసింహస్వామిగా అమ్మ సాక్షాత్కారం

ఆ రోజే సాయంత్రం గం॥ 4 లకు ప్రతిరోజూ వచ్చే నృసింహోపాకులు లక్ష్మణాచార్యులు గారు వచ్చి అమ్మా బాలాత్రిపుర సుందరీ! యెక్కడ వున్నదని పున్నమ్మగారిని అడుగుతారు.

పున్నమ్మగారు : బాలత్రిపుర సుందరి అంటే యెవరు?

లక్ష్మణాచార్యులు గారు : మన బాలే అమ్మా !

పున్నమ్మ గారు : మాకు బాలలు యెవరూ లేరు.

ఇంతలో అమ్మ మేడమీద నుంచి కిందికి దిగి వస్తుంది. ఈ సంభాషణ వినకుండానే 'ఆబాల గోపాలం బాలలయ్యే వృద్ధులైనారు' అని అమ్మ అంటూ స్నానాల గదిలోకి వెళుతుంది.

లక్ష్మణాచార్యులు గారు : ఇదిగో అమ్మ ఈ బాలే అమ్మ చెప్పిన సమాధానం వినలేదా? వినపడలేదా?

పున్నమ్మ గారు : ఇటు వెళ్లిందా యేమిటి?

లక్ష్మణాచార్యులు గారు : ఇప్పుడు చూడలేదా? అమ్మను, మనము చూడకపోయినా మనలను చూస్తూనే వుంది.

అమ్మ : చూస్తున్నానని చూచేవారు యెంతటి వారో?

ఆచార్యులు : నీవెంతవార్ని చేస్తే అంతవారు.

అమ్మ : అంతా వారే, వారే వీరు.

కూర్చున్న ఆచార్యులు గారు గబగబా లేచి స్నానాల గదిలోకి వచ్చి కాళ్లు చేతులు కడుగుకొనుచున్న అమ్మను యెత్తుకొని తన కాషాయ గుడ్డలతో అమ్మ ముఖము, కాళ్లు చేతులు తుడిచి, 'ఈ తల్లి అర్థమయ్యే తల్లి కాదు చెప్పినా అర్థం కాదు. అమ్మా! నాకు మాత్రం యీ స్థితి మారకుండా చెయ్యి తల్లీ! నాకు 60 సంవత్సరాలు వెళ్ళిపోతున్నవి. నీ లీలలన్నీ చూస్తానో చూడనో? నిన్ను నేను మీ అమ్మ పోయిన రోజునుండి గమనిస్తూనే వున్నాను. ఒకరోజు స్వప్నములో నీ స్థితి అంతా కనపడి చెప్పినట్లు, చివరకు నీవు నా తండ్రి నరసింహ స్వామిగా కనిపించి ఇంతకు ముందు నీవు అన్నమాట 'అంతా వారే', 'వారే వీరు' అన్న శబ్దం ఆ కలలో కూడా వినిపించింది. ఆ రోజు నుండి కలిగిన ఆందోళన, ప్రేమ, భక్తి, ఈ రోజుకు దృఢపడ్డై, రూపము కూడా ఆనాడు చూచినదే.'

ఇంతలో పున్నమ్మగారు గదిలోకి వచ్చి 'యేమిటి మీ సంభాషణ?'

ఆచార్యులు గారు: యేముందమ్మా! తల్లిలేని తల్లి మాటలు ముద్దుగా వున్నై. కొన్ని మాటలు మనం మూటకట్టుకోటానికి అనుకూలంగా వున్నై. ఈ బంగారు మూట యెవరికి యిచ్చేది అంటూ తన పైన వున్న గుడ్డను వీపుకు కట్టుకుని, ఆ జోలెలో అమ్మను కూర్చోబెట్టుకుని దొడ్లోకి వస్తారు.

బజారునుండి చిదంబర్రావు తాతగారు, నిద్రలేచిన సీతాపతి తాతగారు ఒకేసారి దొడ్లో వున్న ఆచార్యులు గారి దగ్గరకు వచ్చి నమస్కరించి కూర్చుంటారు.

ఆచార్యులు గారు : ఈ నమస్కారం నా వీపున జోలెలో వున్న బాలకు మాత్రమే చెందుతుంది. (ఆ మాట నిజమేనన్నట్లు తల వూపి, చిదంబర్రావు గారు నవ్వుకుంటారు. సీతాపతి తాత గారు వారి ఆలోచనలో వారుంటారు. పున్నమ్మ గారు చాపలు తీసుకొచ్చి వేస్తుంది.)

విశ్రాంతిగా ఇంట్లో వున్నవారంతా దొడ్లో కూర్చుని మాట్లాడుతూ వుండగా, చిదంబర్రావు గారి తల్లి నరసమ్మ గారు మంచంలో పడుకుని మూలుగుతూ వుంటారు. 'అమ్మా అమ్మా' అని (కూర్చున్నవారి సామీప్యములో బాదము చెట్టు క్రింద)

ఆచార్యులు గారు : యెందుకో బామ్మ గారు మూలుగుతూ వున్నారే?

చిదంబర్రావు గారు : నిన్నటి నుండి ఆమెకు భోజనము లేదు.

ఆచార్యులుగారు : యేమి, జ్వరము వస్తున్నదా?

చిదంబర్రావు గారు : లేదు రంగమ్మ తల్లి పోయినప్పటినుండి యీ తల్లి గారు యిట్లాగే వున్నారు. జబ్బేమీ లేదు. మానసిక బాధే, చెప్పినమాట అర్థం చేసుకోలేదు, చెప్పిన మాటే చెపుతూ వుంటుంది. అన్నం రెండు రోజులకు మూడు రోజులకు తింటూ వుంటుంది.

ఆచార్యులు గారు : అయినా నేను లేపి చూస్తాను. అని మంచం దగ్గరకు వెళ్లి ఆమె వెన్ను రాస్తూ, అమ్మా! తల్లీ ! లే అన్నం పెడ్డువు గాని లే నాకు.

నరసమ్మ గారు : (వులిక్కిపడి లేచి) యెవరూ, ఎవరు రంగమ్మ తల్లీ, లేదుగా నాయనా అని వెంటనే కళ్లు మూసుకుంటుంది.

ఆచార్యులు గారు : అమ్మా! బాలత్రిపురసుందరీ! నీవొచ్చి లేపు లేస్తుంది.

అమ్మ లేచి వచ్చి 'తాతమ్మా' అని అనగానే లేచి కూర్చుంటుంది. అమ్మ పెద్దగా కూడా పిలవదు.

ఆచార్యులు గారు : చూసారా పున్నమ్మగారూ, బాల త్రిపుర సుందరి అంటే యెవరు లేరంటిరే. లక్షణాలు కనిపెడుతూ వుండండి.

అమ్మ : కనిపెడితే కనపడేవి కావు. కనపడితే కనిపెట్టేవి. నీ ప్రయత్నాలు లేవు.

అమ్మ : (తాతమ్మ గారి చేయి పట్టుకుని) తాతమ్మా స్నానం చేదువుగాని రా అని రెక్క పట్టుకోగానే లేచి వస్తారు.

మరిడమ్మ తాతమ్మ గారు : గబగబా వచ్చి నీవొద్దులే అమ్మా అని అమ్మతో అని, నరసమ్మ గారిని రా అక్కయ్యా నేను స్నానము చేయిస్తానని చెయ్యి పుచ్చుకుని బావి దగ్గర కూర్చోబెట్టి స్నానము చేయించును.

ఆచార్యులు గారు : (అమ్మను) అమ్మా ! తాతమ్మకు నీవు అన్నం పెడతావా?

అమ్మ : నేను పెట్టటం యేమిటి?

ఆచార్యులు నీవు అన్నం పెడితే ఆమె రోజూ అన్నం తింటుందమ్మా!

అమ్మ : నేను పెట్టనప్పుడూ ఆమె పుట్టినప్పటినుంచి అన్నం తింటూనే వున్నదిగా.

ఆచార్యులు గారు : చిదంబర్రావు పంతులుగారూ మీ బదులు అమ్మాయిని పంపండి కోర్టుకు.

చిదంబర్రావు గారు : ఆమె కోర్టుకు వెళితే, జడ్జి, మునసబు, ప్లీడరు, పార్టీ, అన్నీ ఆమె అయి హీరింగు చేయాలి తీర్పు చెప్పాలి.

ఆచార్యులు గారు : యిప్పుడు మాత్రము అన్నీ అయి చేయించడంలా!

అన్నపూర్ణమ్మగారు : వినడానికి విచిత్రంగా వుంటాయి యీ మాటలు.

ఆచార్యులు గారు : వినటానికి విచిత్రమే. అనుభవించే వారికి విచిత్రం లేదు.

ఇంతలో నరసమ్మ తాతమ్మ గార్కి స్నానం చేయించి లోపలకు తీసుకొచ్చి కూర్చోబెడతారు.

ఆచార్యులు గారు : అమ్మను చెయ్యి పుచ్చుకొని తీసుకొచ్చి యింట్లోకి తొందరగా విస్తరెయ్యమ్మా అంటారు.

అమ్మ : నాకు మడిగుడ్డ లేదుగా?

ఆచార్యులు గారు : నీకు మడేమిటమ్మా! నీవే మడి.

అమ్మ : నేనే మడయితే నన్ను కట్టుకోవటం లేదేం. గుడ్డలు కట్టుకుంటున్నారుగా!

ఆచార్యులు గారు : నిన్ను కట్టుకోవటం లేదుగాని నిన్ను చుట్టుకునే వున్నాం.

అన్నపూర్ణమ్మ గారు : మడికట్టుకొచ్చి అత్త నరసమ్మ గార్కి అన్నం పెడతారు.

ఆచార్యులు గారు : (అమ్మతో) పోనీ కలిపన్నా పెట్టమ్మా, కలపమంటే అన్నం అనే కాదు అన్నీ కలపమని (అంటే యేకత్వం చెయ్యమని)

అమ్మ : తొందరగా దొడ్లోకి పరిగెత్తి ఒక గుడ్డ తడుపుకుని కట్టుకువచ్చేలోగా ఆమే కలుపుకుంటుంది. అమ్మ వచ్చి కలుపుకుంటున్న అన్నమువంక చూస్తూ నుంచుంటుంది.

మరిడమ్మ తాతగారు : పెరుగు గిన్నె తీసుకుని యెందుకమ్మా! నీవెందుకు యీ తడిగుడ్డ? అంటూ అమ్మ ముఖము వంక తీక్షణంగా చూస్తుంది. ఆమెకు ఆ క్షణంలో అమ్మ ముఖం శాంభవీ ముద్రవేసిన ముఖంగా తన గురువుగారైన మల్లెల రత్తమ్మ గారి కవళికలు కనుపిస్తాయి. అయినా తనకు భ్రమేమోనని తరచి చూస్తారు. తరచి చూచిన కొలది సాక్షాత్ తన గురువు మాదిరే కనుపించును ఆ సమయంలోనే లక్షణాచార్యులు గారికి నృసింహ స్వామిగా కనుపించును. యీ దృశ్యం మరిడమ్మ గారు చూస్తున్న నరసమ్మ గారి కూరాన్నము పూర్తి కాకుండానే కూరాన్నములో గిన్నెలోని పెరుగు పోస్తుంది. వెంటనే ఆచార్యులు గారు పెరుగు అన్నము ముద్ద పెట్టమని చెయ్యి చాపుతాడు.

నరసమ్మ తాతమ్మ గారు : యెంగిలి అన్నము కదా అని పెట్టటానికి సందేహిస్తారు.

ఆచార్యులు గారు : పెట్టమ్మా! అని సింహగర్జనగా చెయ్యి చాపుతారు కళ్లు పెద్దవి చేసి, వెంటనే తాతమ్మ గారు అన్నము ముద్ద జేసి చేతిలో పెడతారు. చేతిలో పెట్టగానే నోరు తెరచి నాలుక జానెడు బైటకు వచ్చును నోరు యెటు జూచినా జానెడు వెడల్పున కనపడును. కన్నులు పెద్దవి, అందులో నల్లగుడ్డు పెద్దదిగా కనపడును. నల్లగుడ్లు రెండు కొలకులలోకి వచ్చి వుండును. ఆ దృశ్యము చూడగానే యేమీ తెలియని నరసమ్మగారు యింట్లోనుంచి కర్పూరం తెప్పించి హారతి యిచ్చును. వెంటనే రెండు బుంగ నీళ్లుగూడా తీసుకొచ్చినెత్తిన పోసి మరిడమ్మ గారు స్నానము చేయిస్తారు. వీరు అప్పటికీ కదలకుండానే కూర్చుంటారు. తరువాత అర్ధగంటకు మామూలు స్థితి కలుగుతుంది. లేచి అమ్మ చెయ్యి పట్టుకుని తడిగుడ్డ విప్పమ్మా మన యింటికి వెళదాం అంటారు. అమ్మ యింట్లోకి వెళ్లి తడిగుడ్డ విప్పి గౌను వేసుకు వస్తుంది. యింట్లో వున్నవారంతా లక్ష్మణాచార్యులు గారికి నమస్కారం చేస్తారు. కనకమ్మ బామ్మ గారు అక్కడే వుంటారు. బామ్మ కూడా నమస్కారం చేస్తుంది. (కనకమ్మ బామ్మ గారు అమ్మగారి అత్త) హాలులో వున్న చిదంబర్రావు తాతగారు వచ్చి నమస్కారం చేస్తారు. ఆ రోజు నుండి ఆచార్యులు గారిని యింటిలోని వారంతా గురుతుల్యులుగా చూస్తారు. ఆచార్యులు గారు అమ్మను చెయ్యిపుచ్చుకుని యింటికి తీసుకుని వెళతారు. రాత్రి యేడు గంటలవుతుంది.

ఆ రోజు తిథి యేకాదశి.

లక్ష్మణాచార్యులు అమ్మను యింట్లోకి తీసుకెళ్లి దేవతార్చన కెదురుగా కూర్చోబెట్టి యిద్దరూ మాట్లాడకుండా మూడు గంటలసేపు కూర్చుంటారు. తరువాత కళ్లు తెరచి, "తల్లీ యింతకు నీవెవరమ్మా చెప్పు. రెండు మూడు నెలల నుండి యీ ఆలోచన కలిగింది. యీ రోజుకు అడిగే అవకాశం కలిగింది. యేవమ్మా మాట్లాడవేం. యెవరమ్మా. పోనీ నేనెవరినో చెప్పు, పలుకమ్మా. పలుకగల తల్లీ, పలకని తల్లీ, పలకవేమి తల్లీ."

అమ్మ : నీవు పలికే పలుకే నేను నాయనా!

ఆచార్యులు గారు : వెంటనే అమ్మను కౌగిలించుకొని నేనే అమ్మ. అమ్మే నేను, నేనే అమ్మ. అమ్మే నేను. (అంతా అమ్మగా కనిపించును) అంతా అమ్మే అని వెంటనే లేచి 41 కొబ్బరికాయలు కొట్టి, నారింజకాయంత ముద్ద కర్పూరము వెలిగించి అమ్మ నీ చేతిమీదుగా అమ్మా అని వ్రాసియ్యమ్మా అని అడుగుతారు.

అమ్మ : చదువు రాదుగా నాయనా!

ఆచార్యులు : నీవు చదువుకోని చదువుతో వ్రాయి.

అమ్మ : పుస్తకము తీసుకని, యేమి రాయమంటారు.

ఆచార్యులు గారు : వెలితి లేనిదిగా నీ యిష్టమొచ్చిందిగా రాయమ్మా !

అమ్మ : పెద్ద సున్నా ఒకటి చుట్టుతుంది. అది జానెడు కైవారము గలదిగా వుండును.

ఆచార్యులు గారు : వెంటనే ఆ సున్నాను కళ్లకద్దుకొని, యెన్ని అర్థాలు గల అక్షరాన్ని యిచ్చావమ్మా !

అమ్మ : పక్కన యే అక్షరం లేనప్పుడు అది వట్టిదేగా !

ఆచార్యులుగారు : పక్క అక్షరం లేనప్పుడు ప్రపంచమంతా యిదేనని, నేనేనని చూపిస్తున్నావమ్మా. నా అనుభవాలన్నీ మన యింట్లో వాళ్లతో చెప్పమంటావా అమ్మా?

అమ్మ : చెప్పినా అది వారి అనుభవము కాదుగా నాయనా!

ఆచార్యులు గారు : చెప్పినా నమ్మరు.

రాత్రి 12 గంటలకు అమ్మ, ఆచార్యులు గారు చిదంబర్రావు గారి యింటికి వస్తూ వుండగా, త్రోవలో పెద్ద త్రాచు యిద్దరి మధ్యనా నుంచుని వున్నట్లు కనపడుతుంది. లక్ష్మణాచార్యులు గారు వులికిపడి, 'అమ్మా దూరంగాపో, కాటేస్తుంది.'

అమ్మ : ఆ కాటులో ఘాటులెందు లెండి.

ఆచార్యులు గారు : త్రాచుపాము అమ్మా, విషం.

అమ్మ : త్రాచుపామేనా?

లక్ష్మణాచార్యులు గారిని వారి యెత్తునా లేచి పాము సరాసరి వారివంకనే చూస్తూ వుంటుంది. ఆయన నిశ్చేష్టుడై నిలిచి చలనం లేనివాడై పోతాడు. ఒక అరగంటకు కళ్లు తెరుస్తాడు. పాము అమ్మను చుట్టుకొన్నట్లుగా ఆయనకు కనపడుతుంది. ఆయన వెంటనే అమ్మ పాదాలమీద పడి నేను పాము అంటే భయము లేనివాడిని యీ పామును చూస్తే యెందుకింత భయం కలిగింది. యిది పాము కాదేమో. అయినా నిన్ను చుట్ట వేసుకుందేమిటమ్మా?

అమ్మ : పాము కాదు నాయనా నాగేంద్రుడు ఆ నాగేంద్రుడే నన్ను చుట్టుకుని వున్నాడు. నేను నాగేంద్రుడ్ని చుట్టించుకున్నాను. ఆ నాగేంద్రుడే నాగేశ్వరుడై వస్తాడు. వాడే నాకాధారం, వాడాకారమే నేను.

ఆచార్యులు గారు : పెద్దపెద్దగా కేకలు వేసుకుంటూ, అమ్మా, అమ్మా, ముగురమ్మల మూలపుటమ్మా, నీ కాధారమేమిటమ్మా, నీవె ఆధారం అని కౌగిలించుకుని వదలడు. అర్థగంటసేపు అట్లాగే నిలుచుంటాడు.

అమ్మ : ''ముగురమ్మల మూలపుటమ్మ అంటే, ఆదియై, అనాదియై యీనాటికిది అయింది. ముగ్గురు మూర్తులకు తల్లి మూలపుటమ్మ, మూడు భాగాలై, అన్ని అవస్తలు మూడుగా చేసి, తను త్రిపుటియై, బాలై, బాలాత్రిపురసుందరై, మూడు గుణములు, మూడు కాలముములు, మూడు పూటలు, అవస్థలు మూడు, శరీర భాగాలు మూడు, మూడుమూర్తులై మూడు మూర్తులకు భార్యలై, ఆ మూడె సత్వ, రజో, తమో గుణములై, ప్రపంచమై ఒక భూతములో నుంచి అనేకంగా మారి పంచబడ్డది. అందుకూ నాకాధారం కావలసి వచ్చింది.

ఆచార్యులు గారు : అమ్మా ! లోకజననీ నరసింహ స్వామి తల్లివా అమ్మా ?

అమ్మ : మళ్లా అట్లా అంటారే!

ఆచార్యులు గారు : యేమీ లేదమ్మా, తృప్తిలేక ఆనందం పట్టలేక, అమ్మా యిప్పుడు చిన్నపిల్లవుగా కనపట్టల్లేదమ్మా సాక్షాత్ ఆకాశానికి, బూమికి నీవె అంటుకుపోయినట్టుగా కనపడుతున్నావు. బయుం పుడుతున్నది. ఆనందం కలుగుతున్నది (పెద్ద పెద్దగా) రండర్రా, చూడండర్రా, ఆదిమూర్తి, మా నరసింహస్వామిని. రండర్రా రండి అని పెద్ద పెద్దగా కేకలు పెట్టగా యిళ్లల్లో నిద్రలు పోయేవారంతా లేచివస్తారు.

అమ్మ వెంటనే జనమంతా బైటకు వచ్చేసరికి యింటికి వెళ్లిపోతుంది. నిద్రలేచినవారంతా లక్ష్మణాచార్యులు గారికి వళ్ళు పెరిగిందనుకుంటారు. యింతలో లేచివచ్చిన వారిలో పంగలూరి శేషతల్పశాయి గారి భార్య - ''ఆయన అమ్మా అమ్మా అని కేకపెడుతున్నాడు. లక్ష్మీనరసింహ స్వామి వారి భార్య ఆదిలక్ష్మి ప్రత్యక్షమయ్యిందేమొ'' అని అంటుందావె. వెంటనే తల్పశాయి గారు 'ఆదిలక్ష్మిలేదు. చెంచులక్ష్మి లేదు. అంతా భ్రమ. యేమి లేదక్కడ. యివన్నీ మన వికారాలేగా', యెక్కడి వారక్కడ యిళ్లకి వెళ్లిపోతారు.

ఆచార్యులు గారు తెల్లవారు ఝూము 2 గం॥ల వరకు అక్కడే వుండి తరువాత యింటికి వెళ్లిపోతారు.

అమ్మ యింటికి వెళ్లి అన్ని తలుపులు వేసి వుండటంతో అరుగు మీద పడుకుని వుంటుంది. తెల్లవారు ఝామున లేచి పనిమనిషి రాగానే తలుపు తీస్తారు. అమ్మ పనిమనిషికి కనపడకుండానే యింట్లోకి వెళ్లి ముఖము కడుక్కుని యెవరికి తెలియకుండానే అందరికీ యింట్లో లేని వెలితి లేకుండా కనపడుతూ వుంటుంది. ప్రతిరోజూ లక్ష్మణాచార్యులు గారు యిక్కడకు రావటం, అమ్మ అక్కడకు పోయి చూసి రావటం జరుగుతూ వుండేది. అమ్మను గురించి యింట్లో వారితో కొద్దికొద్దిగా

చెపుతూ వుండేవారు. ఒక చిదంబర్రావు గారు మాత్రం సంతోషించేవారు. చిదంబర్రావు గారికి అర్థమయింది కూడా బయటపెట్టేవారు కారు. నెల జరిగిన తరువాత ఒకరోజు సాయంకాలం యింట్లోని వారందరూ కూర్చుని ఉండగా ఆచార్యులు గారు యింతకూ యీ తల్లి యెవరి భార్య కావలసి వున్నదో, అయిన సంబంధాలేమయినా వున్నయ్యా? అని అడుగుతారు. యెవరూ మాట్లాడరు.

అమ్మ : ఆయనే సంబంధం, అయిన సంబంధాలేమున్నయ్యి, సంబంధమే ఆయన, బంధమే ఆయన.

ఆచార్యులు గారు : ఆయన యెవరని?

అమ్మ : మీరు గూడ అడుగుతారేం. మొన్ననే చెప్పనుగా, యెవరూ యీ మాటలు వినిపించుకోకుండా యెవరి మాటలలో వారు వుంటారు. చిదంబర్రావు గారు మాత్రం తల వూపుకుంటూ వింటారు.

ఆచార్యులు గారు : సీతాపతి నీది రత్నగర్భమయ్యా!

అమ్మ : అందరిదీ రక్త గర్భమే!

ఆచార్యులు గారు : పోనీ ఆ రక్తం కూడా అందరి రక్తం లాంటిది కాదమ్మా?

అమ్మ : అందరి రక్తం కలసిన రక్తం.

ఆచార్యులు గారు : అందరికీ అర్థం కావు తల్లీ!

అమ్మ : అందరి సంగతీ వదిలేసెయ్యి. నీకవుతున్నదా అర్థం?

ఆచార్యులు గారు : నాకయితే అందరికి అయినట్లు కనపడేదే. సరే సీతాపతీ! పిల్లవాడి ఉపనయనం చేసెయ్యి తొందరగా. వాళ్ల అమ్మ తద్దినమయినా తొందరగా పెట్టుకుంటాడు.

సీతాపతి తాతగారు : యీ కార్తీక మాసంలో చేద్దామనుకుంటున్నా!

అమ్మ వయస్సు 5 సంవత్సరములు 8 మాసములు.

ఆచార్యులు గారు : వొద్దులే మాఘమాసములో చెయ్యి.

సీతాపతి తాతగారు : యీలోగా మొక్కులున్నాయి. తిరువళ్లూరు రామస్వామి దగ్గరకు మొక్కుబళ్లకు వెళ్లిరావాలి. మీ యిష్టం వచ్చినప్పుడు లగ్నం పెట్టండి.

ఆచార్యులు గారు: మార్గశిర మాసములో వెళ్ళండి నాయనా. రేపు ఉదయం 4 గంIIలకు కార్తీక మాసం ప్రవేశిస్తుంది.

తాతగారు: అబ్బాయి వడుగు కాగానే మన్నవ వెళ్లవలసివస్తుంది. యింక ఆ వూరిలో వుండిపోతాం.

ఆచార్యులుగారు : సరే, మార్గశిర మాసం రేపు ప్రవేశిస్తుందనగా మెడ్రాసు చేరాలి. అన్నీ నిశ్చయించుకుని, సరే ఆ రోజు వెళదామంటే వెళదామనుకుంటారు.

ఆచార్యులు గారు యింటికి వెళ్లిపోతారు.

సర్వజ్ఞత్వం :

నరక చతుర్ధశి తెల్లవారు ఝామున అందరూ తలంట్లు పోసుకుని, మధురపేణి అనే పిండివంట అందరూ తింటారు.

అమ్మ నిద్రలేచి తలంటి పోసుకోదు.

చిదంబర్రావు గారు : యేం అమ్మా పండుగపూట తలంటి పోసుకోలేదేమిటి?

అమ్మ : పండగంటే యేమిటో అర్థము చెప్పి, యీ పండగ యొక్క వుద్దేశ్యమేమిటో చెప్పి తలంటు పొయ్యండి.

చిదంబర్రావు గారు : పండుగ అంటే వేడుక. అందరూ వుత్సాహంగా తమకున్న నూత్న వస్త్రములను ధరించి తలంట్లు పోసుకుని, తల మురికి, శరీరం మురికి వదిలించుకొని, తమకు వున్నంతలో పిండివంటలు చేసుకుని తృప్తిగా భోంచేసి ఆనందంతో కాలం గడుపుతారు. అందరూ సమానంగా, ఆనందంగా గడిపేదే పండుగ.

అమ్మ : అందరకూ సమానమైన ఆనందం లేనిది పండుగ కాదుగా?

చిదంబర్రావు గారు : అవును.

అమ్మ : అయితే నాకానందంలేదు. యిది పండుగ కాదా?

చిదంబర్రావు గారు : పండుగనే మాటకు అర్థం చెప్పాను కాని ప్రతివారు ఆనందంగా వుంటారు అని కాదు. ఆనందంగా లేనివారు కూడా వుంటారు.

అమ్మ : పండుగకు అర్థం చెప్పారు సరే. యీ పండుగయొక్క వుద్దేశం చెప్పండి.

చిదంబర్రావు గారు : దుర్మార్గుడైన రాక్షసుని వధించిన రోజు.

అమ్మ : యెవరు వధించారు ?

చిదంబర్రావు గారు : కృష్ణ పరమాత్మ.

అమ్మ : కృష్ణుడు పరమాత్మేనా ?

చిదంబర్రావు గారు : ఆఁ

అమ్మ : పరమాత్మ నామ రూపములు లేనిదనుకుంటిరిగా?

చిదంబర్రావు గారు : మేమనుకుంటున్నాములే నీవు చెప్పు.

అమ్మ : పరమాత్మ అనేది నామమేగా. అంతటా నిండి వున్నది అనే దానికి రూపమున్నదిగా, అంటే ఒకే రూపమై లేదు. అన్ని రూపాలై వున్నది. ప్రత్యేక రూపం లేదు గనుక రూపరహితుడు, అని నిజంగా కృష్ణుడేనా చంపింది?

చిదంబర్రావు గారు : అని శాస్త్రం చెపుతున్నది. నీతో ప్రతిదీ తంటా.

అమ్మ : కృష్ణుడు భగవంతుడేగా, తనకు గూడా దుర్మార్గులున్నారా? అన్నీ తనులో నుంచే వచ్చినవి గదా?

చిదంబర్రావు గారు : యేమిటో, పురాణాలు దుష్ట శిక్షణ, శిష్ట రక్షణ చెపుతూనే వున్నై, అదిగాక వాడిలీల అనే మాటను అడ్డమేసుకుని యేమేమొ చెపుతున్నారు.

అమ్మ : రాముడు గూడా అట్లాగే చెప్పాడా?

చిదంబర్రావు గారు : లేకేమమ్మా ఆయనకు దుష్టశిక్షణ, శిష్టరక్షణ రెండూ వున్నై.

అమ్మ : భగవంతుడనే పూజింపబడే వారిలో యింతకూ యెవరైనా ఆ ద్వంద్వం లేనివారున్నారా?

చిదంబర్రావు గారు : యిప్పటికి రాలేదు. యికను వస్తారేమో తెలియదు.

యింతలో ఒక పిచ్చి కుక్క అటు వస్తుంది. దాన్ని చంపటం కోసం మనుషులు వెంబడిస్తారు. ఆ కుక్క వారిని తప్పించుకుని చిదంబర్రావు గారి దొడ్లోకి వచ్చి దాక్కుంటుంది.

యిద్దరు మనుషులు లోపలకు వచ్చి 'పిచ్చి కుక్కు వచ్చిందా పంతులుగారూ?' అని అడుగుతారు.

చిదంబర్రావు గారు : కుక్క అయితే వచ్చింది గాని పిచ్చికుక్క అని తెలియదు. అయినా మీరు చూచుకోండి. యే మూలయినా వున్నదేమో.

వాళ్లు దొడ్డంతా వెతుకుతారు. యెక్కడా కనపడదు. కుక్క అరటి చెట్లలో నక్కికూర్చుంటుంది. కనపడలేదని చెప్పి వాళ్లు వెళ్లిపోతారు.

అమ్మ : తాతగారూ వీళ్లెందుకు కుక్క వెంట పరుగెత్తుకొచ్చారు.

చిదంబర్రావు గారు : అది పిచ్చికుక్క అని, యెవర్ని కరిస్తే వారికి పిచ్చెక్కుతుంది. అందుకని చంపి వెయ్యటానికి వచ్చారు. ఒకటి పోయినా పది ప్రాణాలు రక్షింపబడతాయి.

అమ్మ : వీళ్లు కూడా కృష్ణ పరమాత్మ వంటివాళ్లేనా? ఒకడితో పదిమంది బాధపడకుండా వుండటమేగా ఆయన చేసింది. కుక్క నరకాసురుడు వంటిది.

చిదంబర్రావు గారు : కృష్ణుడు చంపితె వాడికి జన్మరాహిత్యమైనది. వీళ్లు కుక్కను చంపితె ప్రజలకు ఉపయోగపడ్డది అంతె.

అమ్మ : దానికి నిజంగా పిచ్చేనా? దాన్ని కొడుతున్నారని తెలిసి దాక్కోటానికి వచ్చిందిగా? యితరులను బాధించటము పిచ్చా, తన రక్షణ కూడా తెలుసుకోలేకపోవటము పిచ్చా?

చిదంబర్రావు గారు : నిజమే. దాని రక్షణ కూడా దానికేమి తెలుస్తుంది, పిచ్చిదానికి.

అమ్మ : పదిమందిని బాధించే దానిని పిచ్చి అంటున్నాం. ఒకరిని బాధించే దానిని కక్ష అంటున్నాం.

చిదంబర్రావు గారు : పదిమందిని బాధించినంత మాత్రాన పిచ్చి అనరు. వాడు దుర్మార్గుడని అంటారు. ఒకళ్లను అయినా పరిమితి లేకుండా ఆకారణంగా బాధించినా దుర్మార్గుడనే అంటారు.

అమ్మ : ఆ బాధించే వాడి మనస్సుకు అక్కడ యేదో ఒక లోపము కాని కష్టము కాని కనపడితేనె బాధిస్తాడా? యేదీ కనపడక పోయినా బాధిస్తాడా?

చిదంబర్రావు గారు : వాడనుకన్నది కానప్పుడు కూడా కష్టంగా వుండొచ్చు.

అమ్మ : మనకిష్టంలేని పనిచేసినా దుర్మార్గుడనొచ్చు గాని మంచి చెడ్డలు రెండు యిష్టా అయిష్టాల మీద ఆధారపడి వుంటాయి.

చిదంబర్రావు గారు : పదిమందికి యిష్టమయింది. అసలు అది కాదమ్మా. సంఘంలో కొన్ని కట్టుబాట్లున్నాయి. ఆ కట్టుబాట్లకు బద్ధుడై వున్నవాడు సభ్యత కలవాడు.

అమ్మ : సభ్యత అంటే.

చిదంబర్రావు గారు : సంఘంలో, సంఘం - సభ్యత గుర్తించినవాడికి తనకొక స్థానమున్నదక్కడ మనిషిగా.

అమ్మ : సభ్యత అంటే యేమిటో చెప్పమంటే దాటేస్తారేం. సభ్యత అంటే మర్యాదా? సభ్యత లేనివాడు మనిషి కాదా. సభ్యత అంటే చెప్పటం కుదరలా!

చిదంబర్రావు గారు : సభ్యత అంటే తన వ్యక్తిత్వాన్ని తను పోషించుకోటం.

అమ్మ : పోషించుకోవటమంటే డబ్బు సంపాయించుకోవటమా, అన్నం తినటమా?

చిదంబర్రావు గారు : పకపకా నవ్వి, ఆ అన్నీ అయినా నీకెందుకీ ప్రశ్నలు. నీకు గాకపోతే మరి యెవరికమ్మా. ముద్దుకు చెప్పటం తప్ప నీకు తెలియందేముంది.

అమ్మ : నాకు తెలియంది లేదంటూ మీకు తెలిసిందిగా. నా స్థితంతా మీకు తెలుసన్న మాట. అయినా నేను రేపు ప్రొద్దున్న యేమి చేస్తానో చెప్పండి.

చిదంబర్రావు గారు : చిరునవ్వుతో, నేను చెప్పలేని వాణ్ణి అనుకొన్నావా? యేం నిద్ర లేస్తావ్, మొఖం కడుక్కుంటావు, తాతయ్యా అంటూ ధ్గరకొస్తావు, నేను యెత్తుకుంటాను. దొడ్లో చెట్ల చుట్టూర తిరుగుతుంటావు నాకేమె తెలియదనుకున్నావు. మహాలావు యీమె గారు యేమిటో అడుగుతున్నది.

అమ్మ : తాతగారు కుక్క దగ్గరకు వెళ్ళివద్దాం రండి.

చిదంబర్రావు గారు : యీ మాటలతో నరి పెడతావు తొందరగా తలంటుకుందువుగాని రా.

అమ్మ : కావలసినంత ఆముదం అంటుకొని వచ్చా.

చిదంబర్రావు గారు : యెక్కడున్నది, యెప్పుడంటుకున్నావు? అని తలమీద చెయ్యిపెట్టి చూస్తారు. చూచ అంటుకోలేదే.

అమ్మ : నా ఆముదం అందరికీ అర్థం కాదు. చూస్తే కనపడేది కాదు. చేతికి తగిలేది కాదు. అది నాకే కాదనుకొండి అందరికీ వున్నది. ఆముదమంటే చమురు. చమురంటే జిడ్డుగలది, నాలుగు పక్కలా కమ్మేది. ఆ జిడ్డే సంస్కారం. యీ సంస్కారాలకు ఆస్కారమైనా, తనూ సంస్కారాన్నే పెట్టకు రావాలి. అందరి సంస్కారాలు తనయందే వుంటాయి.

చిదంబర్రావు గారు : యేమోనమ్మా. యీ స్వల్పమైన తలకాయకు యేమర్థమవుతుంది?

అమ్మ : నేను చెప్పిన దానిలో స్వల్పం, అల్పం, గొప్ప యేమీ లేదు.

అన్నపూర్ణమ్మ గారు యింతలో అరచేతిలో ఆముదం వేసుకొని యింతసేపు తలంటుకోకుండా యెక్కడున్నావు? అని ఆముదం పెడుతూ, యీ స్నానమైతే నీవు

యెక్కడున్నా యేం పర్వాలేదు. నీవు చేయవలసిన పనులు యిక్కడేమయిపోతాయి, పోవటంలా, తాత మనుమరాలు ప్రొద్దుగూకులు కూర్చోవచ్చు.

అమ్మ : (అన్నపూర్ణమ్మ గారితో యేమీ మాట్లాడక) తాతగారూ స్నానానికి వెళ్దామంటారా?

చిదంబర్రావు గారు : పోయిరామ్మా, స్నానం చేసిరాపో

అమ్మ : మళ్లీ వచ్చిన తర్వాతైనా నాకీ సంశయం తీర్చాలి.

చిదంబర్రావు గారు : యేమిటది, యేమిటా సందేహం.

అమ్మ : యేమీలేదు, కృష్ణుడు పరమాత్మ అయినప్పుడు వాడికి రెండూ వుంటయ్యా, దుష్టశిక్షణ, శిష్టరక్షణ, యీ రెండూ యే పనిచేత కల్పింపబడ్డాయి.

చిదంబర్రావు గారు : యెవరిచేత కల్పింపబడ్డాయి. దుష్టత్వం వాడి ప్రారబ్ధం చేత వస్తుంది.

అమ్మ : వాడు వచ్చిన తర్వాత ప్రారబ్ధమా? ప్రారబ్ధం చేత వాడు వస్తాడా?

చిదంబర్రావు గారు : ప్రారబ్ధంతోనే వస్తాడు.

అమ్మ : ప్రారబ్ధం అప్పుడు యెవరు?

చిదంబర్రావు గారు : యిది చాలా చిక్కు సమస్య తల్లీ. నాకు తేలేది కాదు.

అమ్మ : పోనీ యిది చెప్పండి. సృష్టి యెవరిచేత యేర్పడ్డది?

చిదంబర్రావు గారు : అంతా లీల అంటున్నారమ్మా.

అమ్మ : అంటే ఒకడుగా వుండి, ఒకడు ఆడుకొంటున్నాడనా? వాడెవరు?

చిదంబర్రావు గారు వింటూ మాట్లాడకుండా ఉంటారు.

అమ్మ : కర్త, కర్మ, క్రియ, మూడూ ఒకటేగా? కర్మ, క్రియ, కర్తలోనె.

చిదంబర్రావు గారు : ఏమీ మాట్లాడరు. ముఖము వంక చూస్తూ ఉంటారు. అమ్మా, అనసూయా యిది చెప్పటానికి నా తాహతు చాలదనుకుని శాస్త్రాలు మాత్రం పరమాత్మ చేత కల్పింపబడ్డదంటున్నారు. మళ్లీ దానిలోనే కలిసిపోతుం దంటున్నారు.

అమ్మ : నాకదక్కర్లా. భగవంతుడంటే నామరూపాలున్నయ్యా? అతని సంకల్పాలున్నయ్యా, లేదా?

చిదంబర్రావు గారు : శాస్త్రాలు నామరూపరహితుడని, సంకల్ప రహితుడని అంటున్నాయి.

అమ్మ : అయితే నిన్న మీరు భారతం చదివేటప్పుడు అన్ని రూపాలు నావేనని కృష్ణుడన్నట్టు చదివారుగా? అన్ని రూపాలు ఆయన కావటంచేత, ఆయనకు వేరే రూపం లేదు గనుక రూపం లేనివాడనా? అందరి సంకల్పాలూ ఆయన సంకల్పమే గనుక ఆయనకు వేరే సంకల్పము లేదనా? అన్ని నామాలు ఆయన నామమే. ఆయన సంకల్ప రహితుడు కాడు. సంకల్ప సహితుడు. సంకల్ప రహితమైన సంకల్పం.

చిదంబర్రావు గారు : రహితమైన సంకల్పమేమిటి?

అమ్మ : రెండు లేనిది (ద్వంద్వం తానైంది) రెండూ తానైంది. రెండుగా తోచినప్పుడు వికారాలు కలుగుతాయి. రెండు ఒకటిగా తోచినప్పుడు రాగరహితుడై. అనురాగ సహితుడై ఉంటాడు.

ఛిదంబర్రావు గారు : "అందుకే మనవాళ్లు" అని... (చేతిలో ఉన్న కలం జారవిడుస్తారు).

అమ్మ : అసలు ముక్క తేలలేదు తాతగారు. యెన్ని అడిగినా యేమీ పలకరు. చెప్పరు.

చిదంబర్రావు గాఉ : నిన్నే చూడబుద్ధవుతుందమ్మా. నీ మాటలే వినబుద్ధవుతుందమ్మా. మాట్లాడబుద్ధి పుట్టడం లేదు, సమాధానం యేమి చెప్పాలో తెలియటం లేదు. (వీరు ఆంధ్ర, ఆంగ్ల, సంస్కృత పండితులు, మహాకవులు, అష్టావధాన శతావధానములు చేయగలరు. ప్లీడరు).

అమ్మ : సరే తలంటు పోసుకోస్తా !

చిదంబర్రావు గారు : యింకో పది నిమిషాలు వుండమ్మా !

యింతలో అన్నపూర్ణమ్మ గారు : యెంతసేపమ్మా అని పెద్దగా అరుస్తుంది.

అమ్మ 'వస్తున్నా' అంటూ తొందరగా వెళ్లిపోతుంది.

అమ్మ వెంట తాతగారు కూడా వస్తారు.

మరిడమ్మ గారు అమ్మ దొడ్లోకి పోగానే నూనెసీసా తీసుకుని తలంటుతూ కృష్ణుడి చుద్దులు పాడుతూ తలంటి పోస్తుంది.

అమ్మ : వినటానికి ముద్దుగా వున్నయ్యి తాతమ్మా, చూస్తే విసుగొచ్చేదెమొగాని కృష్ణుడి అల్లరి.

మరిడమ్మ గారు : అల్లరి చూసినా విసుగు రాదమ్మా.

అన్నపూర్ణమ్మ గారు : యింతలో అందుకుని, యెంత మొద్దుపిల్లవైనా నీవు ముద్ద రావటంలా? అట్లాగె ఆ కృష్ణుడూ ముద్దు వచ్చేవాడు.

చిదంబర్రావు గారు : తెలిసి అన్నా తెలియక అన్నా మంచిమాటే అన్నది, మన్నవ వెంకయ్య గారి కూతురు. మంచి మాటేమిటిలే, వున్నమాటె!

అమ్మ : వున్నదల్లా అంటూ వుంటుందా మా అత్తయ్యా?

చిదంబర్రావు గారు : వున్నది వున్నట్లు మాట్లాడినా, మాట్లాడకపోయినా వినేవారిని బట్టి అర్థమవుతుంది. యింతమందిలో ఆవిడన్న మాట వున్నదే అన్నదని తెలియలేదుగా, అంటూ దొడ్లో అరుగుమీద యెదురుగా కూర్చుంటారు.

అమ్మ : మీకేమి పనిలేదా తాతగారూ? కోర్టుకు వెళ్ళరూ?

చిదంబర్రావు గారు : యెక్కవ పనిలేదు, వెళ్లివస్తా!

అమ్మ : యీ రోజుగూడా కోర్టు వున్నదా?

చిదంబర్రావు గారు : పండుగ యెట్లా వున్నా, యిది మూడో శనివారం, శలవు రోజు, మర్చేపోయినా.

అన్నపూర్ణమ్మ గారు : (చిదంబర్రావు గారితో) మీరు కూడా తలంటి పోసుకోండి.

చిదంబర్రావు గారు : నాకు నా మనుమరాలు పోస్తుందిలే.

అన్నపూర్ణమ్మ గారు : మాట్లాడకుండా చమురు తీసుకొచ్చి తలను పెడుతుంది.

మరిడమ్మ గారు : చిదంబరం అమ్మాయి పొట్ట బొడ్డు చూచా యెట్లా వుంటుందో?

చిదంబర్రావు గారు : యేమోనమ్మా నాకేమి అర్థం కాలేదు. పొట్ట అర్థం కాలేదుగాని, అని ఆపుతారు.

మరిడమ్మ గారు : ఆఁ యేమీ లేదమ్మా. ఆమెగారి జన్మే యెట్లా వుందో చూడు అన్నట్లు వుంటుంది. యెప్పటికప్పుడు దేనికదే కొత్త అని గంభీరంగా అంటారు. నురుగు కంట్లో పడుతుందేమో, గుడ్డ కళ్లకు అడ్డమన్నా పెట్టండి.

అమ్మ : వెంటనే కళ్లు తెరుస్తుంది. నురుగు ధారగా కంట్లో పడుతుంది.

చిదంబర్రావు గారు : అయ్యో! అని పెద్దగా కేకవేసి, దగ్గరకొచ్చి నీళ్లు పొయ్యండి, తొందరగా అని నీళ్ళు తాతయ్య పొయ్య బోతారు.

అమ్మ : కళ్లలో బాగా నురుగు పడ్డా, యెక్కడో యేదో ఆశ్చర్యమయిన సంగతి జరిగితె చూస్తున్నట్లు కళ్లు తెరచి చూస్తూనే వుంటుంది.

చిదంబర్రావు గారు : అమ్మా ! అనసూయా !

అమ్మ : పలకదు.

చిదంబర్రావు గారు : యెక్కడ ఆలోచిస్తున్నావు? యేమిటా విశేషం?

అమ్మ : క్రమేపీ ఆ చూపులో అవాంతరం జరుగుతుంటే చూస్తున్నట్టుగా వుంటుంది. ఆ సమయంలో (1929 సం॥ 31 అక్టోబరు తారీఖున) రైలు అవతల మా యింటికి వచ్చిపోయే పీసపాటి సుబ్రహ్మణ్యం గారు తన భార్యను కోపంతో కత్తి తీసుకుని గుండెల్లో పొడుస్తారు. కొద్దిగా దిగబడినా గుండెలో అట్లాగె వుంటుంది. ఆమె అత్త మహాలక్షమ్మ గారు యేడుస్తూ చిదంబర్రావు తాతగారి పరుగెత్తుకొని వస్తుంది. ఆమెను మంచము మీద వేసుకుని చిదంబర్రావు గారి యింటికి యెదరుగా వున్న ఆస్పత్రకి తీసుకుని వస్తారు. మంచం ఆస్పత్రిలోకి పోతుంది. మహాలక్షమ్మ గారు తాతగార్ని తీసుకుపోవటానికి వస్తుంది.

అమ్మ : మహలక్ష్మమ్మ గారిని చూడగానే, మీ కోడలుకు యెట్లా వుంది అని అడుగుతుంది. (అంతవరకు యెవరికీ తెలియదు)

మరిడమ్మ గారు : వాకిట్లోకి రాగానే అదేమిటి అట్లా అడుగుతావు, జబ్బుగా వున్నదా యేమిటి?

మహలక్ష్మమ్మ గారు : పెద్దగా యేడుస్తూ, అమ్మ మాట వినిపించుకోకుండానె, కొంప మునిగింది మీరు కాస్త ఆస్పత్రికి రండి అని అంటుంది.

చిదంబర్రావు గారు : ఆమె మాట వినిపించుకోకుండా అమ్మ వంకనే చూస్తూ వుంటారు. యిందాకటి వర్చస్సుకు [illegible] చూస్తూ వస్తున్నా పదండి అంటూ, అమ్మాయికి తొందరగా నీళ్లు పోసి యింట్లోకి తీసుకురండి అని చెప్పి వుత్తరీయం తీసుకుని ఆస్పత్రికి వెళతారు. అమ్మ స్థితిని అంతవరకు యెవరూ అర్థం చేసుకోలేదు. తాతగారు మట్టుకు యిందాకటి స్థితికి కారణము యిదేనని నిశ్చయించుకుంటారు. అమ్మాయిని తీసుకెళ్ళి చూపిస్తే బ్రతుకు తుందేమోనని కొంతదూరము వెళ్లి తిరిగి వచ్చి అమ్మను అడగలేక, అమ్మా! అమ్మా! మాట తలతుడుచుకున్నా?

అమ్మ : తుడిచారు.

చిదంబర్రావు గారు : గౌను తొడుక్కో అమ్మా!

అమ్మ : తాతగారు యేమిటో ఆలోచిస్తునారే? యీ అమ్మాయి బాధను గురించేనా, వొచ్చిన తిప్పలు. యిట్లాంటివెన్ని జరుగుతయ్యో, మీరు వింటారు రేపు.

చిదంబర్రావు గారు : రేపు వినేదేముంది, యిప్పుడే చెప్పమ్మా!

అమ్మ : తమాషాగా మామూలుగా అన్నా, నాకేమి తెలుసు.

చిదంబర్రావు గారు : అర్థం కాని తల్లి, వ్యర్థం లేని పలుకులు! యెక్కడేమి జరుగుతున్నాయో! అని తిరిగివచ్చిన మాట మర్చేపోయి ఆలోచిస్తూ యే కబురు వింటామొ అంటారు.

మహాలక్ష్మమ్మ గారు : యింతలో మహాలక్ష్మమ్మ గారు మళ్లీ తిరిగి వచ్చి, ఏం నాయనా! యింతవరకు రాలేదు. మీ మనుమరాలు మీ ఆనందంతోనె సరా, మా ప్రాణం మీదకొచ్చి సహాయము కోరినా రాలేదు. పైగా వస్తున్నా పదమని వచ్చేవారిలాగ చెప్పి పంపారు.

చిదంబర్రావు గారు : నా మనుమరాలు, నా ఆనందమే నీ కోడలుకు ప్రాణము పోకుండా చేసింది.

మహాలక్ష్మమ్మ గారు : ప్రాణమెూనము లేదుగదా, అంత కన్నా కావలసిందేముంది.

చిదంబర్రావు గారు : యింతకూ ఆస్పత్రిలో యెంతవరకు జరిగింది వైద్యం ?

మహాలక్ష్మమ్మ గారు : కత్తి తీశారు, మందు పోసి కట్టారు. మాట్లాడటం లేదు.

చిదంబర్రావు గారు : అమ్మ ముఖము వంక చూస్తూ ఆమె చెప్పే మాటలు ఆలకిస్తారు. వారికి యేం పర్వాలేదు అన్నట్టు తోచింది. అయినా వెళ్లి పలకరించి వద్దామని ఆస్పత్రికి వెళతారు. ఆ సమయంలోనె కంకటపాలెంనుడి, నందాయపాలెంనుండి యింతకన్న యెక్కువ ప్రమాదము గల దెబ్బలు తగిలి, పొడుచుకున్నవారె వుంటారు యిందుకే యిటువంటి వారు యెందరున్నారో అని అంది అమ్మాయి. యింకా యెన్ని జరిగినయ్యో అనుకొని వాళ్ల దగ్గరకు వెళ్లి మీరు యెప్పుడు పొడుచుకున్నారని టయిము అడుగుతారు. వారు యిదే కాలం చెబుతారు. ఒహో! యిందాక అదే అంటే ఆమె కారణము అనిపించింది. యివి విన్న తరువాత యివే కారణాలనిపిస్తున్నాయి. యింతకూ అసలేవో మన అమ్మకు యెక్కడ యేవి జరిగినా తెలుస్తవి అనేది స్ఫురిస్తున్నది. దృఢం కాలేదు. కాని అని లోపలికి వెళ్లి అక్కడ వున్న కంపౌడర్ని 'ఈ అమ్మాయికి యెట్టా వున్నది' అని అడుగుతారు. 'వేడి వచ్చింది శరీరానికి, ఫర్వాలేదు.' ఆ కబురు విని వెంటనే అమ్మను యెప్పుడెప్పుడు కలుసుకుందామా అని తొందరగా వస్తూ వుంటారు. గేటు దగ్గరకు వచ్చేసరికి ఒక స్త్రీని మంచము మీద పెట్టుకుని నలుగురు తీసుకు వస్తూ వుంటారు. 'యేమిటి

యీ అమ్మాయికో అని అడుగుతారు తాతగారు. 'అయ్యా నేను గొల్ల అమ్మన్నను, మా అమ్మాయి ప్రొద్దున 9 గంటలనుండి నొప్పులతో బాధపడుతున్నది ఆ బాధతోనె గొడ్డుకు మేత వెయ్యబోతె ఆ గొడ్డు కొమ్ము పొట్టలో పొడుచుకుని లోపల వున్న బిడ్డ చెయ్యి, వేలు బయటకు వచ్చినది. కొమ్ములు నిన్ననే సన్నగా చెక్కించినాను.'

చిదంబర్రావు గారు : యెన్ని గంటలకమ్మన్నా ?

అమ్మ : 9.30, 10 గంటల నుండి.

చిదంబర్రావు గారు : యీ కారణం మాత్రము యెందుకయి వుండకూడదు. అమ్మను గురించి యేదీ నిశ్చయించకో లేకుండా వున్నము. అయినా అడుగుదాం అని గబగబా యింటికి వచ్చి మేడమీద కిటికీ వద్ద కూర్చున్న అమ్మ దగ్గరకు వెళ్లి యేవమ్మా ఒంటరిగా యేం చెస్తున్నావమ్మా?

అమ్మ : నేనెప్పుడూ ఒంటరిదాన్ని కాను. నాలో అందరూ వున్నారు.

చిదంబర్రావు గారు : అందరూ నీలో యెట్లా వున్నారు? వేరు గానె కనపడుతున్నారుగా?

అమ్మ : అంటే నా మనస్సులో అందరూ గుర్తు వస్తూనే వున్నారు. అనేకం, అనేకమంది, అనేక విషయాలు. ప్రపంచమంతా మననంతో నెమరు వేసుకుంటున్నాను. నా ఒక్క మనసు అనేకమయిందని గుర్తిస్తున్నా, అందువల్లనే నెనె అన్నీ అయినానని నేను ఒంటరిదాన్ని కాదన్నాను.

చిదంబర్రావు గారు : యీ రోజు ఆస్పత్రిలో 9 గంటలకు అవాంతరాలు జరిగిన దృశ్యాలు చాలా తటస్థ పడ్డాయి. మన అమ్మన్న వున్నాడె అతనింట్లో కూడా అతని కూతురుకేదో బాధ కలిగిందట. ఆస్పత్రి కేసు కొచ్చాడు. అమ్మా ! అనసూయా, నేనొక చిన్న సంగతి అడుగు చెపుతా?

అమ్మ : యేమిటో అడగండి. విషయం చిన్నదా? మాట చిన్నదా?

చిదంబర్రావు గారు : విషయం అనేది కూడా మాటేగా ?

అమ్మ : మాటలకు సంబంధించినంత వరకు మాటన్నీ మాటలే. చేసేది పని, చెప్పేది మాట. యెంత పెద్ద పని చేసినా, యెన్ని రోజులు పనైనా, యెంత శ్రమయినా, మాటలో చెప్పాలంటే "శ్రమ" అంటే రెండు అక్షరాలు గల మాటేగా. అక్షరాలు రెండైనా, ఆ అక్షరాల్లో వుండే భావం ప్రతి ఒక్కడూ అనుభవిస్తాడు గనుక. వెంటనే అక్షరాలు రెండయినా చెప్పగానే "శ్రమ" అంటే యేమిటో అర్థమవుతుంది.

చిదంబర్రావు గారు : యింతకూ నేనడిగింది పోగొట్టావా?

అమ్మ : మీరడగవలసింది మీ దగ్గరే వున్నది.

చిదంబర్రావు గారు : వేలికేస్తే కాలికి, కాలికేస్తే వేలికి. మన్నవ వారి పిల్ల అంటూ ముద్దుకు తల పట్టుకు వూపుతారు. తల వూపి ముద్దు పెట్టుకుంటారు. యెత్తుకుని చెవు దగ్గరగా నోరుబెట్టి అమ్మా ! నీకు యెక్కడ యేవి జరిగినా తెలుస్తయ్యా? నెనెవ్వరికి చెప్పనులే!

అమ్మ : చెప్పా! భలేవాడివి, మీకేమయినా తెలుసేమొ చెప్పు. నాకా గోప్యవతలదే తెలియదు. యెదురుగుండా వున్నదే అర్థం చేసుకోలేను. అయినా మీరెత్తుకు తిరిగే పిల్లను పట్టుకుని యిలా అడుగుతారేం. నున్న చూస్తే మీకు యెగతాళా? మీ స్థితి చాలా గొప్పది. సర్వం తెలుసు అనుకున్న అమ్మను మీ చంక బెట్టుకున్నారు. అమ్మ స్థితి అంతా మీరె చక్కబెడతారు.

చిదంబర్రావు గారు : నీ స్థితి చక్కబెట్టేవాడినా అమ్మా? అయినా చక్కబెట్టడం అంటే ఏమిటి?

అమ్మ : యేమిటనుకుని చక్కబెట్టేవాడినా అని అన్నారు!

చిదంబర్రావు గారు : నీవన్నావని అది యెంతమాటో అనుకొని నేను అంతవాడినా అని అన్నానమ్మా.

అమ్మ : నేను యెవరో అనుకుంటుంటే విని అన్నాను. యింతకూ మీరడిగేవి కూడా నేను అర్థం చేసుకోలేను తాతగారు.

చిదంబర్రావు గారు : పోనీలే అమ్మా ! అట్లాగె వుండు.

అన్నపూర్ణమ్మ గారు : మేడమీదకు వచ్చి యెంత సేపు, వంట అయింది. పండగపూట అన్నాలకు రారు.

అమ్మ : పండగ లేనినాడు అన్నం తినకుండా మానుకుంటున్నామా?

చిదంబర్రావు గారు : వస్తున్నాం పద. యేవమ్మా పోదామా?

అమ్మ : నేను రానులే, మీరు పొండి.

చిదంబర్రావు గారు : యెందుకమ్మా యిద్దరం కలిసి తిందాంరా? నా దగ్గరే తిందువుగాని.

అమ్మ : నేను రాను తాతగారు.

చిదంబర్రావు గారు అమాంతం యెత్తుకుని మేడమీద నుండి కిందకు తీసుకువెళతారు. వంట మనిషితో 'అమ్మాయికి కూడా మడి కొల్లాయి గుడ్డ యివ్వండి.'

అన్నపూర్ణమ్మ గారు : ఎందుకు, దానికి వేరే పెట్టరాదు?

చిదంబర్రావు గారు : యెందుకు నా దగ్గరే కూర్చుంటుంది.

అమ్మ : యెందుకు తాతగారూ, ఆకలి కాలేదని చెప్పాను గదా.

చిదంబర్రావు గారు : యెందుకు తినబోయె దానికి వేరే పెట్టమంటావు?

అమ్మ : నేను తినటానికి రాలేదుగా, మీరు యెత్తుకొచ్చారు.

చిదంబర్రావు గారు : తినటానికే గదమ్మ నే తీసుకొచ్చింది.

అమ్మ : మీరు తినటానికే తీసుకొచ్చారు. నేను తినకుండా వెళ్లటానికి వచ్చాను. తిన్నా, తినకపోయినా ఒకటిగానే వుంటుంది తాతగారు.

సీతాపతి తాతగారు యింతలో మడి కట్టుకొని భోజనానికి వస్తారు. యింట్లో వున్నవారంతా బంతులు దీర్చి భోజనాలకు కూర్చుంటారు. అందరివంక జూచి సీతాపతి తాతగారు అందులో రాఘవరావు మామయ్య లేడని, తాతగారు "వీడు రాలేదుగా రాఘవ, పండగపూట కూడ రాలేదు". కళ్లనిండా నీళ్లు తెచ్చుకుని నీవయినా రా అమ్మా అన్నానికి అని కంటి వెంట బొటబొట నీళ్లు కారుస్తారు. అది చూచి యింట్లో వున్నవారంతా కంట తడిపెడతారు.

అమ్మ ఆకలి కాలేదన్న అమ్మ "నేను వస్తున్నా యెక్కడ కూర్చోమంటారు." అన్నానికి? అంటుంది.

యిద్దరు తాతయ్యలు నా దగ్గర కూర్చోమంటే నా దగ్గర కూర్చోమంటారు.

భారతి పిన్ని వేరే కూర్చోమని గదుముతుంది, కంటితో

అమ్మ (యెవరి దగ్గర కూర్చోక వేరే ఆకు వేసుకుని) అందరూ యిందులో తలాకాస్త పెట్టండి.

చిదంబర్రావు గారు : కూర్చుంటే మా దగ్గర కూర్చో, తలాకాస్త యెందుకమ్మా?

అమ్మ : "నాపాలు అందరి పాలబడ్డది"

భారతి పిన్ని గారు : యేం మాటలు, పిచ్చి మాటలు అని జడ పట్టుకుని సౌజ్ఞ చేస్తుంది. మాట్లాడవద్దని.

చిదంబర్రావు తాతగారు : యెందుకమ్మా తల వెనక్కు విరుచుకున్నావు?

అమ్మ : మెడ నెప్పిగా వుంటే విరుచుకున్నా.

చిదంబర్రావు గారు : అయినా నీకై నీవు విరుచుకున్నట్టు లేదే?

అన్నపూర్ణమ్మగారు : యేమైతే యేంలే భోజనాలు తొందరగా కానీయండి.

సీతాపతి తాతగారు తల వూపుకుంటూ యేదో ఆలోచించుకుంటూ కంటివెంట నీరు కారుస్తూ అన్నం కలుపుకుంటారు.

అమ్మకు యెవరూ అన్నం పెట్టరు. వంటమనిషి తీసుకొచ్చి అన్నం వడ్డిస్తుంది. అందరూ బోజనాలు చేసి లేస్తారు.

అమ్మ ఆకు దగ్గరే కూర్చుంటుంది.

వంటమనిషి : యెందుకమ్మా అట్లా కూర్చున్నావు తినకుండా?

భారతాంబ గారు : తింటే తిను, లేకపోతే లేదు. యెందుకు అట్లా కూర్చుంటావు.

వంట మనిషి : ప్రొద్దున్నే యిడ్లి పెట్టారా?

భారతాంబ గారు : యిడ్లీ లేదు. దాని మొహమూ లేదు.

వంటమనిషి : పోనీ పరమాన్నము వేయించుకో అమ్మా !

అమ్మా : వద్దు (తలవంచుకుని పరమానందంగా వున్నది)

భారతాంబ గారు : యేమిటి నీవనేది? స్పష్టంగా చెప్పు. పలకవేం, మూగ మొద్దువా. నువ్వు అన్నమాట నీవు చెప్పటానికేం. గట్టిగా చెప్పు చెప్పవేం అని, నాలుక తిరగటంలేదా? మహా పెంకితనం (అని గట్టిగా తల మీద చెయ్యిపెట్టి మొట్టినట్లుగా చెయ్యి గుప్పిడల్లె బెట్టి ఒత్తుతుంది) యిహలే.

అమ్మ వెంటనే లేస్తుంది.

వంట మనిషి : అన్నం తినకుండానే పోతున్నావా అంటుంది.

భారతాంబ గారు : తిన్నంతవరకు చాల్లెండి. యింకా యెందుకు లేచిపో. లే?

అమ్మ దొడ్లోకి వచ్చి చెయ్యి కడుక్కొని, అటునుంచి అటే తాతగారి దగ్గరకు వెళ్లిపోతుంది.

చిదంబర్రావు గారు : యింతమందిలో జరిగిందాన్నే దాచిపెట్టావు, చాటున యెన్ని జరుగుతున్నాయొ్య తల్లి లేదనే జ్ఞానం యెవరికి లేదు, యేం చేసేది?

అమ్మ : యింకా మీరు యీ చిన్న చిన్న విషయాలకు బాధపడతారేమిటి?

చిదంబర్రావు గారు : చిన్నేముంది, పెద్దేముంది. పువ్వత్తులు వెలిగిస్తావా. అమ్మా?

అమ్మ : నేను వెలిగించలేనండి. అసలు వెలిగించటమెందుకు?

చిదంబర్రావు గారు : నిన్న చెపితిని, అటువంటి అసురుడు పోయాడని అంతా సుఖంగా వుందామని.

అమ్మ : అటువంటి సంతోషం నాకు లేదు. ఒక బిడ్డ తరిగాడని బాధేగాని, మరొక రకంగా బాధకూడా లేదులెండి. కృష్ణుడ్ని చూస్తే సంతోషం లేదు. నరకాసురుడు చస్తే బాధా లేదు. యెందుకంటే అంతా నేనే గనక. నేనంటే నేను అనసూయమ్మను అని కాదు. అందరిలో వున్న నేను.

యింతలో లక్ష్మణాచార్యులు గారు వస్తారు. వచ్చి అమ్మను యెత్తుకుని యీ రోజు వుదయం తొమ్మిదింటికి మా యింటికి వచ్చావటమ్మా ?

చిదంబర్రావు గారు : పకపకా నవ్వి, తొమ్మిదింటికి తలంటు పోసుకుంటున్నది.

లక్ష్మణాచార్యులు గారు : ఆశ్చర్యంతో, మా యింటికి వచ్చి చేతిలో మొక్కజొన్న కండె కూడా పట్టుకుని వున్నది చూచాను.

చిదంబర్రావు గారు : అవి అసలే లేవు మా యింట్లో. అయినా మన యిద్దరి సంభాషణ యెందుకు యెదురుగుండానే వున్నదిగా?

అమ్మ : నిజమే తాతగారు. మీరు ఆస్పత్రికి వెళ్లినప్పుడు తొందర తొందరగా వెళ్లివచ్చి కిటికీలో కూర్చున్నా.

చిదంబర్రావు గారు : అప్పుడు తొమ్మిది గంటలు కాదుగా పది అయింది.

ఆచార్యులు గారు : మా యింటికి వచ్చినప్పుడు తొమ్మిదే అయింది కరక్టుగా.

అమ్మ : మీ గడియారము ఆగిపోయింది.

ఆచార్యులు గారు : నాకేమి గడియారము తెలియదనుకున్నావటమ్మా. యెంత అయింది గుర్తించలేనటమ్మా.

చిదంబర్రావు గారు : జరిగింది జరిగినట్లు చెప్పు.

అమ్మ : విసుగుతో. అబ్బా! యెట్లయితేం వెళ్లివచ్చాను.

లక్ష్మణాచార్యులు గారు : యీ రోజు చాలా కాంతిగా కనపడుతున్నదే మొఖం.

అమ్మ : రోజూ లేదనేనా?

ఆచార్యులు గారు : రోజూకంటె మార్పుతో వుంది. నీవే కాంతి అనుకో.

అమ్మ : నేనే కాంతి అని అనుకోమంటారా?

చిదంబర్రావు గారు : యివన్నీ యెందుకు కాని రాత్రి నిద్రలో యేంటో కలవరించావమ్మా. అది కలవరింతగా మాత్రం లేదు. అదేదో యెవరితోనో సంభాషిస్తున్నట్టుగా వుంది. మాటన్నీ స్ఫుటంగా వున్నయ్యి. కలవరింతకు యింత స్ఫుటంగా వుండవు.

అమ్మ : కలవరింత కూడా యేదో ఒక దృశ్యం కనపడితే వారితో మాట్లాడటమేగా? చూచేవాళ్లకు కనపడరు. కలవరించేవాడి దృష్టిలో అది నిజమే. వాడికి ప్రత్యక్షమే. వీడికి వింతగానే వున్నది. వాడికి కలవరమే. వీడికి వింత, అదే కలవరింత.

సీతాపతి తాతగారు : (తనలో మాట్లాడుకుంటూ అటూ యిటూ తిరుగుతూ) యేంటది?

ఆచార్యులు గారు : యేమున్నదయ్యా? నీ గర్భము రత్నగర్భమో యే గర్భమో చెప్పటానికి వీలులేనిది. యివన్నీ యెందుకు గానీ నీ ప్రయాణము యేం జేసా?

చిదంబర్రావు గారు : (సీతాపతి తాతగారితో) మెడ్రాసు మీరు దిగేలోగానే కామేశ్వర్రావు గారికి కబురు చేస్తాను. స్టేషను దగ్గరకు వచ్చి వాళ్లింటికి తీసుకు వెళతారు. నీవెక్కడో ఆలోచిస్తూ వుంటావు. పిల్లలతో వెళ్లాలి. మీ అక్కయ్యతో చెప్పి అన్నీ సర్దుకోండి.

ఆచార్యులు గారు : యివాళ మీరు అందరూ రండి. నరసింహస్వామికి లక్షపత్రి పూజ తులసీ దళాలతో చేస్తాం.

అమ్మ : యెవరికి నాకా పూజ.

ఆచార్యులు గారు : అఁనీకూను.

అమ్మ : మాట మారిందే?

ఆచార్యులు గారు : నీకు చేస్తానన్నాగా

అమ్మ : అంతేలెండి. యిప్పుడెందుకు, తర్వాత చెపుతా.

చిదంబర్రావు గారు : మనము యెప్పుడిదప్పుడు మర్చేపోతామండి ఆమెకు గుర్తు వుండటమేమిటసలు. ఆమెను గురించిన అభిప్రాయం కూడా స్థిరంగా వుండదు. రకరకాలుగా వుంటుంది.

అమ్మ : ధృడమైన అభిప్రాయముంటె యింకా కావలసిందేముంది? వీరు వారు అంటు రెండు లేవు. వీరే వారు.

చిదంబర్రావు గారు : మాటలు తీయగా వుంటాయి కాని స్థాయి అందేది కాదు.

ఆచార్యులు గారు : నాకు పని వున్నది. నేను వెళ్లి వస్తా మీరు తప్పకుండా మాపటికి రండి. అని నేను మళ్లా వస్తానో రానో పంచమినాడు తప్పకుండా మెడ్రాసు వెళ్లండి. తిరిగి వచ్చినాక వుపనయనం చేయండి.

అమ్మ : వీర రాఘవస్వామికి అమావాస్యనాడు మొక్కుబడి తీర్చాలి పంచమినాడు చెపుతారేం?

ఆచార్యులు గారు : అట్టా అని మొక్కుకునే రోజు అనుకోవటంలో వుంటుంది. లేకపోతే యెప్పుడయినా తీర్చుకోవచ్చు.

అమ్మ : అది సరే, మీకు ప్రొద్దుగూకుతున్నది. మీరు పోయిరండి.

ఆచార్యులు గారు : నీవు తప్పకుండా రామ్మా.

అమ్మ : నేను రాకపోయినా వచ్చానన్నారుగా యిందాక. అట్లాగె వచ్చినా రాలేదంటారేమొ.

చిదంబర్రావు గారు : కళ్లకు యేమి మాయ కాటుక పెడతావు లేవమ్మా ?

అమ్మ : కాటుకే మాయ. యెందుకంటే నలుపు మాయగా వర్ణించారు. శాస్త్రాల్లో , అటువంటి మాయను ధరించేవి కళ్లే. కళ్లకు కాటుక అవసరమే.

ఆచార్యులు గారు వెళ్లిపోతారు.

చిదంబరరావుగారి దివ్యానుభవం :

ప్రొద్దుగూకింది. దీపాలు పెట్టారు.

చిదంబర్రావు గారు : (అమ్మతో) అందరం ఆచార్యుల వారింటికి వెళదాం. పూజకు ఆయన యింతగా వచ్చి పిలిచి వెళ్లారు.

అమ్మ : అందులో విశేషమేముంది లెంది. రోజూ వస్తూనే వున్నాడుగా అన్ని మాటలతో పాటు ఆ మాట కూడ అన్నాడు. వారందర్ని పంపండి మన మిద్దరము వెళదాము.

చిదంబర్రావు గారు : అంతేననుకో, వెళ్లవలసిన అవసరముందిగా.

అమ్మ : అవసరమేమిటి వెళ్లాలనుకుంటున్నాం. అంతె.

చిదంబర్రావు గారు : మా అమ్మ శబ్ద మంజరి. అని లోపలకు వెళ్ళి అందరూ ఒక పావు గంటలో లక్ష్మణాచార్యులు గారి యింటికి చేరండి అని అన్నపూర్ణమ్మ గారి నుద్దేశించి అంటారు.

అమ్మ మేడమీదకు వెళ్లి కూర్చుంటుంది.

చిదంబర్రావు గారు అందర్ని ఆచార్యులు గారి యింటికి పంపించి మేడమీదకు తిరిగి వస్తారు. చూడగానే రోజా చీర వూదా రవిక కట్టుకొని కాశీబోసి అంటే మడి కట్టుకొని బులాకి, ముంగిర చెవులకు నీలంబావిలీలు, పచ్చలు శిరమున తమలపాకు మొవ్వరేకు కొప్పుగొలుసు, తిరుగుడు పువ్వు, చెవులకు చెంప స్వరాలు, జూకాలు, పాపటి బొట్టు, చెంప బిందువులు, తలకు రాగిడి, నాగరం, చంద్రవంక, చేతికి బాదుబందులు, చేతి కడియం, ముంచేతికి మురిడీ గొలుసులు, పలక మురుగులు, మెడలోకి అడ్డిగలు, గజ్జెల జిగినీ గొలుసు, పలక సరిపట్టెడ, గుళ్లకంటె, కాసులపేరు, నడుముకు వడ్డాణం, అన్ని వేళ్లు వుంగరాలు, పగడాల హారము, ముత్యాల చంద్రహారము, సూర్యహారము., చేతికి (బంగారపు) గోట్లు, కాలికి కడియాలు, గొల్లెపు గొలుసులు, పావడాలు, తుమ్మకాయ బిళ్లలు, మొలకు జానెడు క్రిందనించి కాలుకు అంతా సొమ్ములతో కాలివేళ్ల, పిల్లివేళ్లు, గల సొమ్ములతో ఆనాటి భాగ్యవంతుల ముత్తయిదువలె శరీరము నిమ్మ పండు ఛాయతో మొఖమున రూపాయంత బొట్టు లలాటమందున రక్తపు రంగు బొట్టుతో దృశ్యము జూచి వారి అన్న అత్తగారు మతుకుమల్లి గారు అనుకొని (అంటే ఆమె మన అమ్మమ్మకు అమ్మమ్మ) "మీరు "యెప్పుడు వచ్చారు". అంటూ దగ్గరాకు రాబోతారు. అట్లా చూస్తూ వుండగానే రూపం మారి వీరాసనమేసి జుట్టు విరబోసి వరదా అభయహస్తంతో చేతిలో చెరుకుగడ పట్టుకుని యెడం కాలు కుడికాలు మీదకు వేసుకుని కిరీటధారిణియై ఫలాని అమ్మవారని గుర్తించలేకుండ ఒక లిప్తలో ఆ రూపం మారి జడకుప్పెలు నాగరం పరికిణీ చొక్కా పది ఏళ్ళ పిల్లల్లే వొళ్లంతా సొమ్ములతో అలంకరింపబడి బాలాత్రిపురసుందరి వలె కనపడును. మరొక నిమిషంలో కన్యాకుమారివలె, మరొకసారి అప్పటికప్పుడు కడుపులో నుండి పడ్డ బిడ్డలాగ బొడ్డుకోయక శరీరమంతా మాయను కప్పుకొని ఒకసారి, పక్కన తల్లి కనపడదు. వెంటనే పది ఏళ్లపిల్లవాడిగా గొడ్లను కాచుకొచ్చేలా చింపిరి గుడ్డలతో, చేతిలో కర్రపుల్ల, వెంటనే వృద్ధుడుగాను, వీభూది రేఖలు, చేతిలో పంచాంగం, చెంబు అడుక్కోటానికి వచ్చిన వాడులాగ మామూలుగా వచ్చే ప్రఖ్యా సుబ్బయ్య గారి వలె వాకిట్లో నిటబడి శ్రీరామచంద్ర పరబ్రహ్మణే నమః, వెంటనే కోర్టులో మునసబు వలె, పాకీ దొడ్డి

చిమ్మే వెంకన్న మాదిరిగా, దొడ్లో చెట్లకు నీళ్లు పోస్తున్న వీరాస్వామి మాదిరిగా, తన స్నేహితుడు బలాత్కారంగా, నంబేగుడి అర్చకుల చేత ధర్మకర్తగా చంపబడిన పొన్నూరు గోపాలరావు గారి వలెను కనుపించును. వెంటనే చిదంబర్రావు తాతగారి వొళ్లు జలదరించి పెద్ద పెద్ద కళ్లు చేసి చూస్తారు. మరొకసారి అమ్మ వేరుగా కనపడుతూ యింకా అయిదారు అమ్మలు కలసి వున్నట్టు కనపడుతుంది. వెంటనే తాతగారు కళ్లు మూసుకుని నమస్కారం చేస్తారు. తన వాకిట్లో వున్న కృష్ణుడి బొమ్మల్లె పొన్నచెట్టుమీద గోపికలు స్నానం చేస్తున్నప్పుడు కూర్చున్న బొమ్మ వలెను, పీసపాటి మహలక్ష్మమ్మ గారివలెను, మరుక్షణంలో కుగ్లర్ ఆస్పత్రిలో డాక్టరుగా, అక్కడ చిమ్మే మనిషిగాను రెండు ఒకేసారి కనపడుతుండి. పెమ్మరాజు సత్యనారాయణ, చెందుర్తి కరుణంగారు పిఠాపురం తాలూకా (ఆయనబాలోపాసకుడు) ఆయన్నెప్పుడు తాతగారు యెరుగరు. ఆయన, బాలవిగ్రహం దగ్గర పూజ చేస్తున్నట్టుగా కనపడును. అట్లా కనపడ్డ మరునాడే కరుణం గారు వస్తారు. అక్కడ లక్ష్మణాచార్యులు గారు చేస్తున్న క్రతువు అంతా యిక్కడే కనపడుతుంది. మూర్తీభవించిన శంకరాచార్యులు వలె ఒకసారి చివరకు యెక్కడో నానాబాధలతో వుండి ఒక యింట్లో సేవ చేస్తున్న స్త్రీ మాదిరిగా ఆ స్త్రీ చర్యలు బాధలు అన్నీ సినిమా తెరమీద బొమ్మలాగ రాను పోను అన్నీ ఒక అర్ధగంటసేపు చూచి.ఆ కష్టాలన్నీ చూడలేక యెవరమ్మా యీ సహనమూర్తి, యిది వరకటిదా? యిప్పటిదా. ముందు వుందా? సహనమనే దేవతను ఆరాధిస్తున్న తల్లి అని పెద్ద పెద్ద కేకలు పెడతారు. కళ్లుమూసుకుని కింద పడతారు. 'సహజ సహనం' అనే అక్షరాలు పెద్దవిగా బంగారపు రంగుతో రాసి వుంటాయి. వెంటనే ఆయన అవిగూడా చూసి ఉలిక్కిపడతారు. కళ్లు మూసుకుని కిందపడి ఉన్నా కనపడుతూనే వుంటుంది. ఆ అక్షరాల కింద అమ్మ యెత్తున బొడ్డు కిందకు జారిపోయిన, చొక్కాలేని పరికిణీ, చింపిరిజుట్టు, చీమిడితో పిల్ల కనపడుతుంది. యీ రూపం చెదరకుండా ఒక పావుగంట వుంటుంది. అన్ని రకాలు కలిపి మొత్తం గంటంపావు పట్టదు. తాతగారు పడుకుని లేవరు. అమ్మ యెరుగనట్టుగా లక్ష్మణాచార్యులు గారింటికి వెళ్లిపోతుంది. రాత్రి పదకొండున్నర పండ్రెండు గంటలకు తిరిగి అందరు వస్తారు. 'అమ్మ నేను రేపు ప్రొద్దున్న వస్తాలె' అని అక్కడ పడుకుంటుంది. వాళ్లందరు యింటికి వచ్చి అక్కడ ప్రసాదాలు జాస్తిగా తినడంతో పడుకుంటారు. అన్నపూర్ణమ్మ గారు మాత్రం మేడ మీదకు వస్తుంది. తాతగారు తెలియకుండా పడుకుని ఉంటారు నిద్రలో. ఆయన గుండెల్లో మొగలిపువ్వులా వాసన కదిలినట్టు వుంటుంది. యేమిటో అని గుండెలమీదనుంచి చేత్తో తీసివేయగా పాము జరజరా పాకిపోతుంది.

చిదంబర్రావు గారు : అదేనా గుండెల్లో యిందాకటి నుంచి బరువుగా వున్నది.

అన్నపూర్ణమ్మ గారు : యింటిచుట్టూ మంచి మంచి పూల చెట్లు వుంటాన ఆ సువాసనకు చేరుతున్నవి పాములు.

చేత్తో తీసివేసిన ఆ పాము కొంతదూరమే పోతున్నట్టు కనపడి, తర్వాత కనపడదు. తూములో చేరింది అనుకుంటారు.

పాము కనపడకుండానే పోగానే యిదేమిటి ఈయన్ను కాటు వేసిందా యిట్లా పడుకున్నారు. అని పెద్ద పెద్దగా కేకలు వేస్తుంది కాని తాతగారు చెయ్యి చాపి యేమీలేదు ఆగమని సౌంజ్ఞ చేస్తారు.

తెల్లవార్లూ అట్లాగే పడుకుంటారు.

అన్నపూర్ణమ్మ గారు : పాము కాటువేస్తే తెలివిలో వుండరు కదా? అయినా ఆ రంగమ్మ తల్లి పోయిన వేళావిశేషం యెట్లాంటిదో నట్టింటే ప్రాణం పోయింది అని మెల్ల మెల్లగా తాతగారికి వినపడేటట్లుగా విసుక్కుంటూ యేడుస్తూ దగ్గర కూర్చుంటుంది.

చిదంబర్రావు గారు : విసవిస యేమిటి అతినస అమ్మాయి అనసూయ యెక్కడుంది?

అన్నపూర్ణమ్మ గారు : రాత్రి లక్ష్మణాచార్యులు గారి యింటివద్ద పడుకుంది. యేమయిందో తెలియదు.

చిదంబర్రావు గారు : తెల్లవారొచ్చిందా?

అన్నపూర్ణమ్మ గారు : ఆ తెల్లవారొచ్చింది. అయిదయింది.

చిదంబర్రావు గారు : అయితే అమ్మాయి రాత్రి యింటికి తిరిగి రాలేదా?

అన్నపూర్ణమ్మ గారు : రాలేదు. నేను అక్కడే వుంటానన్నది.

చిదంబర్రావు గారు : అయితే అసలు రాత్రి అక్కడ యెన్ని గంటలకు వచ్చింది?

అన్నపూర్ణమ్మ గారు : మేము రాబోయే ముందర 12 గంటలకు వచ్చింది. తాతా మనుమరాలు ఒకర్ని వదిలిపెట్టి ఒకరు వుంటారేమిటి?

చిదంబర్రావు గారు : అవసరమయితే ఆమే వుంచుతుంది.

అన్నపూర్ణమ్మగారు : ఆమె అంటే ఎవరు? బాలాత్రిపుర సుందరా? చందలూరి మహాలక్ష్మమ్మా?

చిదంబర్రావు గారు : యెవరయినా ఆమేగా?

అన్నపూర్ణమ్మ గారు : యెవరయినా ఆమె అంటే అన్నీ ఒకటేనా?

యింతలో అమ్మ లక్ష్మణాచార్యులు గారి యింటి వద్దనుంచి వచ్చి వెనకగా నుంచుని

అమ్మ : ఆఁ అన్నీ ఒకటే అయింది అని అంటుంది.

చిదంబర్రావు గారు అమ్మ మాట విని వులిక్కిపడి లేచి కూర్చుంటారు.

అన్నపూర్ణమ్మ గారు : అప్పట్నించి పిలిచినా పలకలేక లేచి కూర్చోలేక పోయిరే, మనుమరాలు వచ్చేసరికి లేచి కూర్చున్నారు.

అమ్మ : తెల్లవారింది లేవండి మొఖాలు కడుక్కుందాం. పండగ.

అన్నపూర్ణమ్మ గారు ముందు దిగివెళ్లిపోతుంది.

అమ్మ : తాతగారూ! యేమిటి చాలా నీరసంగా వున్నారేం. పావం లక్ష్మణాచార్యులు గారు పిలిస్తే కాస్త రాకూడదూ. మనకేం ప్లీడర్లమనా యింత గర్వం.

తాతగారు : (మెల్లగా ముసిముసి నవ్వులు నవ్వుకుంటూ), నువ్వు వెండికొండనో, బంగారుకొండవో, గోలకొండవో అర్థం కావటంలా

అమ్మ : మీ పాలి గోలకొండనే!

తాతగారు : అమ్మా ఆ గదిలో ఆత్మబోధ అనే గ్రంథం వ్రాస్తున్నాను. కొన్ని పద్యాలు అయినాయి తతిమ్మావి నీవు చెపుతా, నే రాస్తాను.

అమ్మ : తాతగారూ పాచినోటితో ప్రొద్దునే పరిహాసమాడుతున్నారే. నాకేం చదువా; చట్టుబండలా, నేనేమి చెపుతాను. నన్ను చూస్తే మీకు భలే యెగతాళిగా వుందే.

తాతగారు నవ్వుమొఖంతో వుండరు. గంభీరమైన గౌరవంగా (పెద్దల యెదుట చరించనట్లు) వినయవిధేయతలతో ముఖమువంక చూస్తూ వుంటారు. రాత్రి జరిగిందంతా ఒక స్వప్నం మాదిరిగా వుంటుంది వారికి. అమ్మవల్ల జరిగినట్లు అనిపిస్తుంది. మళ్లీ అనిపించదు.

అడుగుదామనుకొని (తనలో) అమ్మతో "నా తల్లో నా మనస్సులో నాశరీరానికి వున్న బరువంతా యెంతో తేలికపడ్డట్టు అనిపిస్తున్నది. నాకీ రాత్రి కనపడ్డదంతా యేమిటమ్మా?"

అమ్మ : మీకు కనపడ్డది నాకేం తెలుస్తుంది? నేను ఆచార్యులు గారింటికి వెళ్లాను.

తాత గారు : మనమిద్దరం పోదాం వాళ్లను పంపించమని చెప్పావుగా అని మేడమీదకు వెళ్లి కూర్చున్నావు. యెందుకో నాకు యీసారి యిదంతా నీవేనని స్పష్టంగా తోచటంలా, పైన యింతకు ముందు లోగడ నాకున్నవి కనపడ్డంలో (అని ఆపును).

అమ్మ : మీకున్నవి యేమిటి?

తాత గారు : (తల వూపి) పొన్నూరు గోపాలరావు కనపడ్డాడు. చంపినవాళ్లు కూడా స్పష్టంగా కనపడ్డారు. నాకు అనుమానమున్నదిగాని చూడనిమాట యెందుకని పక్కనే వేధిస్తున్నది. నాకు వితంతు వివాహాలంటే చాలా యిష్టం. ఆ రోజుల్లో కొన్ని నే చేసేను. కందుకూరు వీరేశలింగం గారు బాపట్ల వస్తే మన యింటికి వచ్చేవారు. నన్ను వదిలిపెట్టారు యీ విషయంలో. యే మంచి నీళ్లకు కూడా రానిచ్చేవారు కాదు. మనకెవరయినా నీళ్లు పోసినా వారికి కూడా శిక్షే. మీ అత్తయ్యకు యిది మనసులో పెట్టుకొని హిస్టీరియా కూడా వచ్చేది. సరే గోపాలరావు విషయం అందరికి తెలిసిందే కదా! 18 నెలలు జైలు శిక్ష అనుభవించాను. మళ్లీ వచ్చాను గనుక సరిపోయింది. రాకపోతే నాతో పాటు మూడు కుటుంబాలు హతమయి పొయ్యేవి. ఆ రోజుల్లో యే శక్తి కాపాడిందో ఆ శక్తే యీనాటికి కాపాడుతునే వుంది. మీ అత్తయ్య గోల పెడుతున్నది. ఆ యింటికేవో కర్మలున్నయ్యని. అందువల్ల బిడ్డలు బ్రతకటల్లేదని, యెంత డబ్బు సంపాయించినా నిలవకుండా పోతున్నదని, మీ అత్తయ్య యీ మూడింటి మీదనే ఆధారం చేసుకుని యెవరు కనపడితే వారినల్లా సలహాలడుగుతున్నది. కర్లపాలెం బుచ్చయ్య గారు బాలపూజ కలశం పెట్టి నవరాత్రుల్లంటూ ఒకటి యేర్పాటు చేశాడు. నా కేసులో రోజుకు 400 మంది భోజనాలు, యీ పూజ చేయించేవాడు ఆయన. సరే తరువాత పెమ్మరాజు సత్యనారాయణమూర్తి గారు శ్రీ చక్రము వేసి యిచ్చాడు. మన లక్ష్మణాచార్యులు గారు కొంపే వూడబీకమన్నారు. మీ అత్తయ్య బాధపడలేక యెల్లుండి నిశ్చయించుకున్నాను. తెల్లవారు ఝామునుంచి వద్దనిపిస్తున్నది యెందువల్లో.

అమ్మ : యెందుకో చెప్పండి.

తాతగారు : యిది పది రోజుల నుంచి మనసులో బాధగానే వున్నది. యెక్కడ కూర్చున్నా యెక్కడ నుంచున్నా యిదే ఆలోచిస్తున్నాను. కల్లో నా ఆలోచనలన్నీ వొచ్చాయి అయినా కలగాను లేదు. చివరకు సహనమనే మూడక్షరాలు కనిపించినవి. పగలగొట్టటానికి సహనమో, పగలగొట్టకుండా వుండటానికో అర్థం కాలా.

అమ్మ : సహనమనే మూడక్షరాలేనా మీకు కనపడ్డది?

తాత గారు : ఆఁ అంతే అనుకుంటా.

అమ్మ : గట్టిగా అంతేనంటారా? గట్టిగా చెప్పండి ముమ్మాటికి.

తాత గారు : ఆఁ అంతే =స్= మర్చేపోయినా, "సహనశ్రీ" అని కనపడ్డది.

అమ్మ : యిదంతా మీ ఆలోచనకు సంబంధించిన దర్శనాలె అయితె యింకా నాలుగు రోజులు చూడండి.

చిదంబర్రావు గారు : కలలకు మనస్సే ప్రధానమంటారుగా?

అమ్మ : మేడమీదకు మెలకువతో వచ్చారా, నిద్రతో వచ్చారా? అవన్నీ మీలో చూచినట్టుగా వుందా?

చిదంబర్రావు గారు : యివన్నీ అడుగుతున్నావు నే చెప్పినవి రెండేగా. నాకు కనపడ్డవి నీకెట్లా తెలుసు?

అమ్మ : మీరు చెపితే నే విన్నా యెట్లాగో తెలుసులెండి.

చిదంబర్రావు గారు : నీకేమయినా భాగముందా యేం అందులో?

అమ్మ : భాగమేముంది? యిదేం వ్యాపారమా? నిజంగా అనుభవించింది. మీరు కల అనుకుంటున్నారో, అట్లాగె నేను మీరు చెబితె తెలిసిందంటున్నా, మొత్తంమీద యిల్లు మాత్రం పగలగొట్టించకుండా వుంటారా?

చిదంబర్రావు గారు : మీ అత్తయ్య యెంత గందరగోళం చేసినా యిక పగలగొట్టనమ్మా. ఈ యింట్లో బిడ్డలు బతకరనే వాదు వచ్చింది గదా.

అమ్మ : యేనాటికయినా ఆ వాదు పోతుందేమె లెండి. బ్రతికే పిల్లలుంటారేమొ. యింతకు ఆ కనపడ్డదెవరని తోస్తున్నది?

చిదంబర్రావు గారు : యేమొనమ్మా. నీవేనేమొ.

అన్నపూర్ణమ్మ గారు ''తెల్లవారి 9 అయిందా యింతవరకు మొఖాలు కడగకుండా కాఫీలు కూడా అక్కర్లేదా? యేమి ఆలోచన'' అంటూ పెద్ద పెద్దగా అరుస్తూ వస్తుంది.

అమ్మ అన్నపూర్ణమ్మగారి మాట వినగానే గబగబా దిగి వస్తుంది. ముఖము కడుక్కొని, అందరూ కాఫీలు తాగుతారు. అమ్మ తాగదు. బాదము చెట్టుకింద ఆడుకుంటూ వుంటుంది. పది రోజుల నాడు యెక్కడికో వెళ్లిన రాఘవరావు మామయ్య వస్తాడు.

అమ్మ : (మామయ్య నుద్దేశించి) నీకు మొక్కుబడి వున్నది. యెక్కడికి పోబాకు. మనం మెడ్రాసు వెళదాం అన్నయ్యా! నాన్నకు నీచేత మ్రొక్కుబడి తీర్చే పని వున్నది.

రాఘవరావు : నాకీ నమ్మకాలు లేవు.

అమ్మ : నీకు నమ్మకాలు లేకపోతే నీవు మొక్కబోకు, నాన్న అమ్మ వాళ్లకోసము వాళ్లు మ్రొక్కుకున్నారు. నీవు నీ పిల్లల కోసం మొక్కుకోకుండా వుందువుగాని, పంచమినాడు ప్రయాణమన్నయ్యా. పోనీ నీకిష్టం లేకపోతె మానెసెయ్యి. యివాళ అమావాస్య యీ రోజు అందరికి బెల్లం పంచేసెయ్యి స్వామి పేరుతో.

ఇంతలో సీతాపతి తాతగారు వచ్చి "యెట్లయినా పోక తప్పదు". మామయ్య ఆ మాట వినకుండానే పలకకుండా యెటో వెళ్లిపోతాడు. అందరూ భోజనాలు చేసి సహస్ర దీపాలు పెట్టి ఆ రోజంతా ఆనందంగా కాలం గడుపుతారు. మామయ్య యెక్కడికో వెళ్లినవాడల్లా ఆ రాత్రికే వచ్చి తూటాలు కాలుస్తాడు. నోట్లోపెట్టుకుని కాలుస్తూ వుండగా అంతా అయిపోయినా తీసివేయడు. నోరు కాలకుండా ఒక అంగుళముండగానే దానంతటదే చల్లారిపోతుంది.

రోజిట్లాగే గడుస్తుంది సుఖంగా.

10. నాగుల చవితి

పాడ్యమినాడు తెల్లవారు ఝామున అందరూ కార్తీక స్నానాలు చేస్తారు. పంచమి నాడు ప్రొద్దున్నే నాగుల చవితికి పుట్టలో పాలు పొయ్యటానికి వూరంతా కలసి రైలవతల అద్దంకి వారి తోటకు వెళతారు. ఇంతలో అన్నపూర్ణమ్మ గారు గూడ వెళుతుంది. అందరూ పుట్టలో పాలుపోసి వచ్చే సమయంలో అమ్మ వెళుతూ తాతగార్ని కూడా తీసుకువెళుతుంది.

'అయినా నేనెందుకమ్మా యీ పండక్కు' అంటూ వెళతారు.

అందరూ పాలుపోస్తే అమ్మ నీళ్లు పోయ్యటానికి పోతుంది. అట్లా నీళ్లు పోసే సమయంలో నాగేంద్రుడు బయటకు వస్తాడు. నాగేంద్రుడే కాక తతిమ్మా పురుగులన్నీ అమ్మ పోగానే బయటకు వచ్చి నుంచుంటాయి. శాస్త్రయుక్తంగా మంత్రాలతో పూజచేసే బ్రాహ్మడు భయపడి అవతలకు వెళ్లి 'యెవరో అమంగలంగా వుంటారు'. నాగేంద్రుడు బయటకు వచ్చేసరికి క్రితం రోజున తాతగారి గుండెల్లో పామును తీసివేసినప్పుడు వచ్చిన మొగలిపువ్వు వాసన వస్తుంది.

అన్నపూర్ణమ్మ గారు ఆదుర్దాతో ఆశ్చర్యంగా గమనిస్తుంది. పెద్దగా పురోహితుడు 'యెవరో అపవిత్రులు వచ్చార'ంటాడు.

చిదంబర్రావు గారు : అపవిత్రులే వచ్చినప్పుడు బయటకు రాదు గదండి. వాళ్ల వాళ్లు వస్తేనే అది వచ్చింది. అక్కడ నుంచోలేక పురోహితుడు భయపడి యింటికి వెళతాడు. 'అందరూ పాలు బోసినా బయటకు రాలేదు. ఆ అమ్మాయి నీళ్ళు పోస్తే బయటకు వచ్చింది. నీళ్లు పొయ్యకూడదేమొ' ననేవారు కొంతమంది. మైల సోకిందేమో నని కొంతమంది. అన్నపూర్ణమ్మ గారు మాత్రము యింటికి వెళ్లి లక్ష్మణాచార్యులు గారినడిగి తెలుసుకుందాములె అంటుంది. తాతగారు అమ్మ ముఖము వంకనే చూస్తు వుంటారు. యింతలో మబ్బు చినుకులు

ప్రారంభమవుతాయి గాలితో, పాము అలాగె అమ్మవంక చూస్తూ నిలబడి వుంటుంది. అందరూ యిళ్లకు బయలుదేరి దారి పొడుగూతా యెవరికి తోచింది వారు చెప్పుకుంటూ వానకు తొందర తొందరగా నడుస్తూ ఇళ్లకు జేరుతారు.

అమ్మ : (పాము దగ్గరకు వెళ్లి పాము మొఖములో ముఖము పెట్టి చిదంబర్రావు గారితో) తాతగారు భయము లేకుండా చూస్తున్నారుగా, పాము తలమీద చెయ్యి పెడతారా?

చిదంబర్రావు గారు : (నవ్వు మొఖముతో కంటివెంట నీరు కారుస్తూ, ఆనంద భాష్పములు కారుస్తూ) నువ్వు పెట్టిస్తావా?

అమ్మ : మీరు పెట్తే పెట్టిస్తా.

చిదంబర్రావు గారు : నాకై నేనే పెట్టే స్థితి వుంటే నీ మాదిరిగా నేనే నిన్నడిగే వాడినిగా?

అమ్మ తన అరచేతి మీద తాతగారి చేయి వేసుకుని 'యేమి నాయనా నాగేంద్రా' అని చేతితో సవరిస్తూ, 'నాకోసం బయటకు వచ్చావా. పాలుబోసే ప్రతి పుట్టలో నీవుంటావా. యీ పుట్టలోనే వున్నావా?'

నీవున్న చోటల్లా నేనున్నా నన్నట్లు యెగిరి అమ్మ భుజము మీద వాల్తుంది, పిల్లలు భుజము మీద పడుకున్నట్లుగా.

చిదంబర్రావు గారు కొయ్యబారిన శరీరం కలవాడై కళ్లు మూసుకుని అమ్మ రెండో భుజము మీద వాల్తారు. పది నిమిషాలకు కళ్లు తెరిచి "అమ్మా ! కనీవినీ యెరుగని కథమ్మా" అని 'యేమిటమ్మా! యిది' అని ఆనందంతో భాష్పములు కారుస్తూ "నన్ను కూడా ఇట్లా చెయ్యమ్మా యెవ్వరికీ అక్కర్లేకుండా యిట్లాగె వుంచెయ్యి. రూపం మార్పు కావటం చేత గదా అందరికీ భయం, అవసరం లేకపోవటం కలిగింది."

అమ్మ : అవసరం లేకపోతే యింత జనం రారుగా? ఆ రూపానికి భయం కలిగించే స్వభావమున్నది శక్తి గొప్పదయినా తుట్టెనాగు రూపం గనుక భక్తితో పాలు బొయ్యటానికి వచ్చిన వారంతా రూపాన్ని జూచి పారిపోయినారు. వీళ్లల్లో కూడా దీనికున్న పవిత్రత తెలియదు. తుట్టె పురుగు లక్షణాలు వారికి వుంటేనే భయం, అంటే భయం, క్రోధం, ద్వేషం, స్థాయిలు తేడా. వీరికి క్రోధం లేకపోతె బయానికి తావు లేదు. క్రోధానికి కోపానికి తేడా వుంది. క్రోధం యెట్లా అయినా సాధించాలనేది. కోపం తాత్కాలికంగా బెదురు పుట్టేది. ద్వేషం విషంతో సమానం. రాగం అమృతంతో

సమానం. రాగం అంటే కోర్కెలనుకున్నారు మనవాళ్ళు. అంటే లౌకిక సంబంధ వాంఛ తీసుకుని రాగాన్ని ద్వేషిస్తారు పెద్దలు.

చిదంబర్రావు గారు : రాగమంటె యీ వుద్దేశం రాలేదమ్మా లోగడ.

అమ్మ : మీకున్న వుద్దేశమేమిటో చెప్పండి.

చిదంబర్రావుగారు (మెల్లగా తలవూపుతూ) "చెపుతానమ్మా, చెపుతా" అంటూ వుండగానే పాముతో అమ్మ 'పోరా' అంటుంది. వెంటనే భుజము మీద లేచి పాదాలమీద వాలి పుట్టలోకి వెళ్ళిపోతుంది.

చిదంబర్రావు గారు : అమ్మా ! పాము యీ పుట్టలోనే వుంటుందా? నేనెప్పుడయినా వస్తే కనపడేటట్టు చూడు.

అమ్మ : యెవరన్నా రానీయండి తవ్వించి చూద్దాం.

చిదంబర్రావు గారు : అదెందుకు నీవు చెప్పితే చాలదు !

అమ్మ : పోనీలె ఆ పుట్టలో కాకపోతే నా పొట్టలో వున్నదనుకోండి. నా పొట్టలోనె కాదు. అందరి పొట్టలో తలా ఆరు పాములు వున్నాయి అవి బుస్సు బుస్సు మంటూ వుంటాయి.

చిదంబర్రావు గారు : యేమిటవి? అరిషడ్వర్గాలా?

అమ్మ : యేమొ నాకు తెలియదు అదంతా.

చిదంబర్రావు గారు : మధ్యలో యిదెందుకమ్మా ?

అమ్మ : అందరూ నవగ్రహాల మీద నడుస్తున్నది మానవుడి నడకంటె నాకు రెండే కనపడుతున్నై.

చిదంబర్రావుగారు : యేమిటి ఆ రెండు రాహు కేతువులా ?

అమ్మ : కాదు. రాగద్వేషాలు.

చిదంబర్రావుగారు : రాగద్వేషాలకు అతీతం లేదా ?

అమ్మ : రెండు నడక కాధారం. ఆ రెంటి కాధారం "నేను". పరిమితి గలవాడైతె విరాగం కోసం ప్రయత్నిస్తాడు. ఒక రూపంగా, రాగమంటె కావాలి అనేది. ద్వేషము కూడా రాగమే అవుతుంది. అప్పుడు పనులు మార్పుతో ఒకర్ని చంపాలి అనేది ద్వేషం. ఆ చంపటమనేది కోర్కెగా? ఆ చంపటం కోసం కత్తిని ప్రేమిస్తాడు. విషాన్ని ప్రేమిస్తాడు. దాని కోసం వెతుకుతాడు. దొరక్కపోతె యేడుస్తాడు. బాధపడతాడు. అన్నం తినడు. చంపాలనుకున్న మనిషి కనపడితే చూడలేడు.

చూచి సహించలేడు. వాడికి హింసే ఆరాధన. యిది చూడలేని వాడికిది హింస. వాడు యెవరిని చంపాలనుకున్నాడో మరొకడు దాన్ని పోషించాలనుకున్నాడు. వాడు దేన్ని కావాలనుకున్నాడో వీడు దాన్ని ద్వేషిస్తున్నాడు. దేన్ని ద్వేషించాడో మరొక పనికి అది అవుసరం. అక్కర్లేక పోవటం అవసరమయింది. ఒకప్పుడు అమృతం మరొకప్పుడు విషం దాని గుణం. రెండూ ఒకటే పరిస్థితులను బట్టి వుపయోగ పడుతుంది. పాము విషజంతువని పేరు. అది అమృత జంతువు కూడా పంటిలో నుంచి వచ్చింది విషం, గొంతులో నుంచి వచ్చింది అమృతం. మరొకటి గూడ వుంది. దాని వెనక పంటికి పిండేటప్పుడు తక్కిన పళ్లూడడం లేదు. గరళం ఒక సమయంలో వేస్తే చంపుతుంది. మరొక సమయంలో వేస్తే బ్రతికిస్తుంది.

చిదంబర్రావు గారు : (తల వూపుతూ) యీ స్థితి ప్రతి పాము విషానికి వున్నదా?

అమ్మ : ప్రతి పాములోను విషముంటుంది కాని త్రాచుపాముకే గరళం తీస్తారు. మనిషిని చంపగలిగిందానికే విషమని కాదుగా. ఒక్కొక్కటి యింకొక దాని ప్రాణం తీస్తున్నది.

చిదంబర్రావు గారు : ప్రాణము తీయటమే ప్రధానమా, విషముండటం.

అమ్మ : కాదు విషం బ్రతికించేప్పుడు విషమే ప్రధానమని యెందుకు అంటాను. మనిషి అన్నింటిని చంపగలవాడు. చంపలేడు. అందరు, అన్నీ కాలంమీదనే ఆధారపడ్డయ్.

చిదంబర్రావు గారు : సృష్టికి మానవులకు వ్యతిరేకమైన జంతువులతో నీకీ సాంగత్య మేమిటమ్మా ?

అమ్మ : చెప్తా! ప్రొద్దెక్కింది.

అమ్మ : యిక్కడకు రమ్మంటేనే ఆడవాళ్లకు కాని నాకెందు కంటిరిగా?

చిదంబర్రావుగారు : వచ్చేటపుడున్నట్టు లేవుగా నా అనుభవాలు. సరే. కాని ఒకప్పుడున్న అభిప్రాయాన్ని మరొకప్పుడు యెందుకమ్మా అంత త్వరగా మార్చేస్తావు?

అమ్మ : మనస్సు యొక్క లక్షణమే అది.

చిదంబర్రావు గారు : అది నాకు తెలుసు మహా, యెందుకు చేస్తావని అడిగానుగాని అడిగేది.

అమ్మ : అడిగేది చెప్పేదానికందేది కాదు. అడిగేదానికి చెప్పేదానికి అది అందంది. అడిగేది చెప్పేది కానిది, పొందేది. ఆ పొందింది మాటల్లో పెడితే ఆ

పొందింది చెప్పలేడు. కేవలం అది మనసుకు కంటికి సంబంధించింది. దాన్ని మాటల్లో పెట్టేటప్పటికి యదార్థం మరుగున పడి యేదో చెప్తాం. యేదో అర్థం తీసుకుంటారు.

చిదంబర్రావు గారు : మనస్సులో అనేకం తోస్తున్నవి. అడగటానికి నోరు రావటం లేదు.

అమ్మ : మాటలు లేకుండానె సందేహాలు తీరిపోతున్నై అంటారా ?

చిధంబర్రావుగారు : యిందాక నీవు చెప్పిన ద్వేషము, రాగము రెండూ కావాలన్న దానిమీదనే ఆధారపడ్డదన్నావు. యెవరికి కావాలి, యేంకావాలి?

అమ్మ : ప్రతివాళ్ళకు ప్రతీదీ కావాలి. ప్రతివాళ్లు ప్రతీదీ "వాడికి" కావాలి. యివి లేకపోతే "వాడు" లేడు. "వాడున్నా" వాడ్ని గుర్తించే వాళ్లు వుంటేనే 'వాడి' ఆట. వాడి ఆటలో వున్న మనం మనదేదో వుందని బాధపడుతూ వుంటాము. ఆశక్తి తత్వం యేమంటే శుద్ధంగా వుంటె తనే అవుతాం. తను మలినరూపుడై, అంటే తనకు లేకపోయినా మనందరకును మలినం పెట్టాలంటె వాడికి కావలసి వచ్చిందిగా? యీ కావలసి రావటం అంతా వాడిరూపమే. ఆ శక్తిరూపమే. ఒకే 'శక్తి' అది 'వాడు' అయింది. అది 'వాడే'. ఆ ఆది, యిదంతా కలిసి ఆ అనాదే కావాలి.

చిదంబర్రావు గారు : యిందాక "మలినం" "మలినం" అన్నావే యెట్లాగమ్మా ఆ "మలినం?" ఆధారపూర్వకంగా చెప్పు - అంటే వుదాహరణగా.

అమ్మ : మలినాన్ని గురించి చెప్పటానికి మలినమే ఆధారం. అద్దం మలినంతో చేసింది. మలినమంటె వస్తురూపాంతరం. రూపం మరుగుపడి మరొక రూపం రావటం. అద్దాన్ని శుద్ధంగా ఆధారం తీసుకున్నారు. అదీ కొన్ని పదార్థాల పరిణామంగా తయారైంది. శుద్ధమైన అద్దంలో మొఖం చూస్తే కనపడదు. ఆ అద్దానికి రంగు పూస్తేకాని ముఖం కనపడదు. "ఆత్మకు ప్రతిబింబం జగత్తు". జగత్తు ఆత్మ కాకపోలా?

చిదంబర్రావుగారు : "బ్రహ్మ సత్యం జగత్తు మిధ్య" అంటే యేమిటమ్మా ?

అమ్మ : యేది అనుభవిస్తుంటే అది సత్యం. కడుపు నొప్పి వచ్చినప్పుడు కడుపునొప్పి అసత్యం అనుకుంటాడా? బ్రహ్మ సత్యమైననాడు జగత్తు వేరుగాదుగా? నిత్యమైన దానిని తెలుసుకోవటమే సత్యం.

చిదంబర్రావుగారు : యెందుకో పెద్దలు అట్లా చెపుతున్నారు. యేమిటోలె అమ్మా అర్థం కాదు. మాటలు యెన్ని చెప్పినా ఆ భావాలు పోవటంలా, వట్టి మాటలేగా!

అమ్మ : మీరు "ఆత్మబోధ" అంటూ వ్రాసారుగా? ఆత్మకే బోధ చేసేవారు మీకేమిటి అర్థం కాకపోవటం?

చిదంబర్రావుగారు : యెక్కడికి లాగావమ్మా ?

అమ్మ : నాకు మాటలతో చెప్పటం చేతగాదు తాతగారు. మీరు ఆత్మను కలంగా, కాగితంగా, సిరాగా, పాళీగా, అక్షరాలుగా వంచారన్నవమాట. పంచబడ్డయ్యంటారా? అప్పుడు ఆత్మను, ఆత్మకు ఆత్మతో బోధ చేశారు. బోధ అనేది యివన్నీ.

చిదంబర్రావుగారు : (తలవూపుతూ) కానిది లేదనేగా అమ్మా నీవు చెప్పింది?

అమ్మ : ఆఁ అంతే అనుకుంటా. మాటలతో చెప్పటం చేతకాదు. యింటికి వెళదామా? యిప్పుడు 2 గంటలు అవుతుంది.

చిదంబర్రావుగారు : వెళుతూ మాట్లాడదామా?

అమ్మ : వెళుతూ మాట్లాడదామని అనుకొని ఆలోచించ అక్కర్లా. మాట్లాడటం అదే జరుగుతుంది. వూరుకోవాలన్నా వూరుకోలేం.

యిద్దరూ కలసి యింటికి వస్తారు.

అన్నపూర్ణమ్మ గారు భోజనం చెయ్యకుండా కూర్చుంటారు.

అన్నపూర్ణమ్మ గారు : మేము వున్నప్పుడు మబ్బు వాన పట్టింది మేమిటు రాగానే వాన తేలిపోయింది. మేముంటం నాగేంద్రుడికి యిష్టం లేదు గాబోలు. (తాతయ్యతో) యింతసేపు యేమి చేస్తున్నారు. యింటిదగ్గర వాళ్ళ ఆలోచన లేకుండా.

చిదంబర్రావు గారు : యివాళ నాగులచవితి కదా. వుపవాస ముంటారేమొ అనుకున్నా.

అన్నపూర్ణమ్మ గారు : బాగానే వున్నది. ఆమెగారేది?

చిదంబర్రావు గారు : నాతోకూడ వచ్చింది లోపలకు. యెటుబోయిందో.

అన్నపూర్ణమ్మ గారు : పిలవండి తిండికి (అని కోపంతో)

చిదంబర్రావు గారు : అది తింటుందో తినదో, మొన్న నాదగ్గర తింటుంటే వద్దంటివి.

అన్నపూర్ణమ్మ గారు : యెవరి కడుపులో కాలితే వారే తింటారు, నేను వద్దనేదేమిటి? వాడు (సీతాపతి) మరీ దిగులు పడుతున్నాడు. పిల్ల యీతీరు పిల్లవాడు ఆతీరు. వేళకు అన్నానికి రాదాయె.

చిదంబర్రావు గారు : పిల్ల జ్ఞాపకానికొచ్చినప్పుడు దిగులు పడుతూ వుంటా?

అన్నపూర్ణమ్మ గారు : యేమైనా వాడికున్నప్రేమ మీకు వుండదుగా?

చిదంబర్రావు గారు : అంతే అంతే

మళ్ళీ చినుకులు ప్రారంభం.

అన్నపూర్ణమ్మ గారు : యేమిటి తెరవాటుగా వస్తున్నది వర్షం అని విసుక్కుంటుంది.

చిదంబర్రావు గారు : స్వాతి విశాఖ కార్తెలు కావూ.

యింతలో యెవరో వీధి తలుపు నెడతారు.

మేడమీద నుంచి అమ్మ దిగి వస్తుంది.

చిదంబర్రావు గారు : మేడమీద వున్నావా? నే చూడలేదమ్మా. మీ అత్తయ్య అడుగుతున్నది నిన్ను.

అమ్మ : నన్నుకాదుగా అడిగింది. మిమ్మల్నేగా?

చిదంబర్రావు గారు : అడిగింది నన్నే, నీ సంగతమ్మా.

వీధి తలుపు మళ్లీ కొడతారు.

చిదంబర్రావు గారు : ఎవరో తలుపు కొడుతున్నారు. తలుపు తీసిరావమ్మా!

భారతాంబ గారు మధ్య హాలులో సంగీతం నేర్చుకుంటూ వుంటారు. మరిడమ్మ తాతమ్మ గారు తులసికోట దగ్గర కూర్చుని వత్తులు చేసుకుంటూ వుంటుంది. అమ్మ పోయి తలుపు తీస్తుంది. యింతలో తడి పొడి బట్టలతో మాధవపెద్ది కాళిదాసు గారి భార్య పుట్టలో పాలుబోసి వర్షానికి వచ్చి పంచలో నుంచుంటారు. అమ్మ గబగబా లోపలకు వెళ్ళి 'యెవరో వచ్చార'ంటుంది.

అన్నపూర్ణమ్మ గారు : (బయటకు వచ్చి), అయ్యో మీరా! యెవరో అనుకున్నా తలుపు కొడుతుంటె, రండి లోపలకు అంటుంది.

కాళిదాసు గారి భార్య : మేము కాదండి తలుపు కొట్టింది యెవరో కాషాయ గుడ్డలతో ఒక ముసలాయన, పిల్ల వచ్చారు. యిప్పుడు మాకు ముందట తలుపు తీసెనే ఆ అమ్మాయి పోలికగా వుంది.

తాతగారు : యెవరబ్బా! యిక్కడే వున్నదిగా.లక్ష్మణాచార్యులు గారనుకుంటే ఆయన యీ టయిములో రాడు. యెవరయ్యుంటారు!

కాళిదాసు గారి భార్య : యేమొనండి మేము గుర్తించలేక పోయినాం.

వాన మరీ పెద్దదవుతుంది.

దయామయి :

అడుక్కునే వాళ్లు కూడ వచ్చి పంచలో అన్నపు జోలెలు పెట్టుకుంటారు.

అన్నపూర్ణమ్మ గారు "అన్నపు సంచులు తీసివెయ్యండి" అని పెద్దగా "యెంగిలి మంగలం" అని కేకలేసి లోపలకు వెళ్లిపోతుంది. వాళ్లు సంచులు దీసి చేతులో పట్టుకుంటారు. అమ్మ వాళ్ళ చేతుల్లో వున్న సంచులు తీసుకుని గదిలో పెట్టి వంటమనిషి దగ్గరకు వెళ్ళి 'నాకు కొంచెం అన్నం పెడతారూ'.

వంటమనిషి : అయ్యో నాతల్లీ! యెందుకు బెట్టను అసలు అన్నమే అడగవు.

అమ్మ : ఆకలవుతున్నది. పెద్దవిస్తరి వేసి చాలా అన్నం పెట్టండేం తాతగారు భోంచేయరట. ఆ అన్నం కూడా నాకే పెట్టండి.

వంటమనిషి : యిదంతా తినటానికేనా?

అమ్మ : అడగక అడగక అడిగితె యిట్లా అంటారేమండి. యింకా రోజూ అడుగుతుంటె యెంత విసుక్కొనేవాళ్ళో.

వంటమనిషి : నీవు తినగలిగినంత పెట్టించుకో అమ్మా!

అమ్మ : యిన్నాళ్ల నుంచి తినని అన్నము అంతా కలిపి తొందరగా పెట్టండి. వాన వెలుస్తుంది.

వంటమనిషి : వాన వెలిస్తే నీవు తింటానికేమమ్మా?

అమ్మ : యెందుకా, యెత్తుకు తింటానికి.

యింతలో చిదంబర్రావు తాతగారు వస్తారు.

చిదంబర్రావు గారు : యెవరికమ్మా అన్నం?

అమ్మ గబగబా వచ్చి తాతగారి చెవిలో రహస్యం చెపుతుంది.

చిదంబర్రావు గారు "అట్లాగె తీసుకెళ్ళు" అని తాతగారంటారు.

తాతగారు ఆమాట అనటంతోనె వంటమనిషి మరికాస్త అన్నం పెడుతుంది.

అమ్మ ఆ అన్నం తీసుకెళ్ళి జోలెలో తడిసిపోయిన అన్నం కుక్కలకు, పందులకు వేసి ఈ అన్నం జోలెల్లో వేసి చెతికిస్తుంది. "నాయనా పులుసు యిస్తా వుండండి గిన్నెతో తీసుకెళుదురుగాని".యింట్లోకి వెళ్ళి గదిలో తీసీవేసిన ఒక సత్తుగిన్నె తీసుకుని సున్నిపిండి మాటుబెట్టి "అన్నానికి తగిన పులుసు వెయ్యండి దీని నిండా, యిందాక కూర పప్పు వేసారు నెయ్యి వేసినట్టు లేదె?"

వంటమనిషి : వెయ్యలేదమ్మా!

అమ్మ : అన్నము మీద వేసి యిస్తాను, ఆ నేతి గన్నె యివ్వండి.

అమ్మ : నెయ్యి, పులుసు తీసుకువెళ్ళి వారికిచ్చి, "నాయనా మీకు అమ్మాయిలున్నారూ, వాళ్లకు చొక్కాలున్నె?"

బిచ్చగాళ్ళు : కడుపులోకి తిండే లేకపోతె దోవతలు యెట్లా వస్తయ్యి తల్లీ!

అమ్మ గబగబా దొడ్లో బాదమాకులు ఏరుతున్న తాతగారి తగ్గరకు వెళ్ళి "యేమిటి తాతగారు వానలో బాదమాకులు యేరుతున్నారు?"

చిదంబర్రావు గారు : కొమ్మ విరిగిపడితేను మంచి ఆకులు కోసి మంచి ఆకులు రాలితేను యేరు తున్నానమ్మా !

అమ్మ : చిరిగిపోయిన తలగుడ్డలు గాని ధోవతలు గాని వుంటె నాకు యిస్తారూ.

చిదంబర్రావు గారు : యేమిజేసుకుంటావమ్మా?

అమ్మ : ఆ సంగతి తరువాత, మీరు యివ్వాలనుకుంటే యివ్వండి!

చిదంబర్రావు గారు : సరే పుస్తకాల బీరువా పైన పెట్టి వున్నయ్యి తీసు కో.

అమ్మ : బాగా చిరిగిపోయినవి అవసరం లేదు తాతగారు.

చిదంబర్రావు గారు : లేదమ్మా , బాగా చిరిగి పోయిందాకా నేను కట్టనుగా.

అమ్మ పరగెత్తుకొచ్చి బీరువా మీద వున్న 3 తలగుడ్డలు, 4 ధోవతులు, 1 కోటు, అమ్మవి 4 చొక్కాలు అన్ని తీసుకుని వాళ్ళ చేతులకిచ్చి "గబగబా పొండి యెవరన్నా చూస్తారు".

ఒకరు యివ్వగానె వెళతాడు.

బిచ్చగాడు : యెందుకమ్మా, నీవు అడక్కుండా యిచ్చావా. తెలిస్తే కొడతారేమొ?

అమ్మ : ఆఁ నేను కొట్టకుండా వుంటే చాలు వాళ్ళను, వాళ్ళు నన్ను కొట్టరు. వాన వెలుస్తున్నది. మేడమీద వాళ్ళు కిందికి వస్తున్నారు. మీరు తొందరగా వెళ్ళండి.

వాళ్ళు సంతోషంతో "మా బంగారు తల్లి. కడువెడు సంతానం కలిగి, ఆ తల్లి కడుపు చల్లగా పదికాలాల పాటు వర్ధిల్లాలి. మాకు కోమటి, బేమ్మల సావాసమమ్మా" అంటూ వెళ్ళిపోతారు.

అమ్మ : మేము కోమటి బ్రాహ్మలం కాము, వట్టి బ్రాహ్మలమేలే అంటూ లోపలకు వస్తుంది.

పుణ్యవతి : వాన వెలసింది. యిల్లంతా చూసాముగా, యిక వెడతామండి. రైలు అవతల పాము వెలసింది అంటున్నారు. అయితె రేవు వెళ్ళివద్దామనుకుంటున్నా. ప్రొద్దు వుంటె యివాళె వెళ్లి వద్దామనుకున్నా.

అన్నపూర్ణమ్మ గారు : పాము లేదు బండలూ లేదు. పుట్టలో యేదో వున్నది తలా కాసిని పాలుబోసి పెద్దపద్దగా మంత్రాలు తంత్రాలు జరిగేసరికి బయటకి వచ్చింది. యేంలేదక్కడ. మామూలు పాము.

పుణ్యవతమ్మ గారు : యేదోఒకటి లెండి. కనపడ్డా మన పాపిష్టి కళ్ళకు అర్థం కావద్దు? కనపడడానికి సుకృతం కావాలి కనపడి అర్థం చేసుకోవటానికి అంతకన్నా సుకృతం కావాలి.

తల్పశాయి గారి భార్య : అంతే అంతే అని వెళ్ళివస్తామండి అని బయలుదేర్తారు.

అమ్మ అన్నపూర్ణమ్మ గారి దగ్గరకు వచ్చి, "బొట్టు పెట్టి తలా ఒక పండు యివ్వత్తయ్యా" అని మెల్లగా అంటుంది. ఆమె వినిపించుకోనట్టు ఉంటుంది.

పుణ్యవతి : యెవరమ్మా యీ అమ్మాయి అప్పుడే మర్యాదలు గూడా.

హాలులో నుంచి భారతీదేవిగారు వస్తుంది.

భారతీదేవి : ఆమెగారా, మా పెద్ద మేనమామ గారి కూతురు. పెద్ద నాపసాని, ఆమెకు మర్యాదలు తెలుస్తాయి, అన్నీ తెలుస్తాయి.

యింతకూ బొట్టుపెట్టి పళ్ళు యివ్వరు యెవ్వరూ.

అమ్మ దొడ్లోకి పరుగెత్తి 2 నారింజ పళ్ళు, బాదం కాయలు తెచ్చి, బొట్టు పెట్టి "బాదం కాయలు మీ పిల్లలకు, నారింజ పళ్ళు మీకు" అని యిస్తుంది.

తల్పశాయి గారి భార్య: మాకు పిల్లలున్నారని నీకు తెలుసా అమ్మాయి?

అమ్మ : వాళ్ళ నాగలక్ష్మి, మీ అనసూయ నేను గుళ్ళోకెళ్ళి ఆడుకునేవాళ్లమండి.

తల్పశాయి గారి భార్య : యెప్పుడూ కనపడలేదేం. ఓసి బుజ్జితల్లి. మా యింటికి రా మా పిల్లలతో ఆడుకుందువుగాని.

భారతి నవ్వి, "యీమెకు తోడు ఆటలు కూడాను".

యెవరి యిళ్ళకు వారు వెళ్ళిపోతారు.

భారతీదేవి : అమ్మాయి, అనసూయా రాఘవరావు షాపుకు వెళ్ళి దారం, సూది తెచ్చిపెట్టు.

అమ్మ : డబ్బులివ్వు నాకు లెక్క తెలియదు. వాళ్ళు యిచ్చినట్లు తీసుకొస్తా.

భారతీదేవి ఒక చేతిలో మూడు అణాలు, ఒక చేతిలో అణా పెట్టి "అణాకి సూది, మూడణాలకు దారం తీసుకురా!"

అమ్మ సరేనని డబ్బులు తీసుకుని వెళుతూ వుంటుంది. ఇన్‌కమ్‌టాక్సు ఆఫీసు మీదుగా వెళుతూ వుండగా యింకా యెవరెవరో ముష్టివాళ్ళు కనపడతారు.

డబ్బాలు మోగించుకుంటూ కుంటివాళ్ళం,గుడ్డివాళ్ళం అమ్మా అంటూ యెదురొస్తారు. అమ్మ చేతిలో వున్నవికాస్త వాళ్లకు యిచ్చి వెళుతూ వుండగా, దోవలో బ్రహ్మాండం వారి సత్రము వుంటుంది. ఆ సత్రము వంక చూడగానే అమ్మ యిందాక అన్నము పెట్టినవాళ్ళు, యింకొందరు అన్నాలు తింటూ వుంటారు. స్వతంత్రంగా మన యింట్లో మనమున్నట్లుగా మీరు యిక్కడ వున్నారే. యిది మీయిల్లా?

ముష్టివాళ్ళు : మా యిల్లు కాదమ్మా. యిది సత్రం.

అమ్మ : సత్రం అంటే అందరికీ స్వతంత్రమనా?

పక్కన యెవరో ఒక కుర్రవాడు పోతూ "చక్కని నిర్వచనం. అంతేకాని అమ్మా, అధికార్లు వుంటారు వాటికి కొన్నింటికి. మొదట్లోనే యేర్పాట్లు వుంటాయి. వాటిలో కొన్ని బీదలకని కొన్ని, భాగ్యవంతులకని, నీవు యెవరమ్మాయివి?"

అమ్మ : యెవరు దగ్గరకు తీస్తే వారమ్మాయిని. ఈ యెదురుగా వున్నదేమిటి?

ఒక కుర్రవాడు : ఆంజనేయస్వామి దేవాలయం, దత్త మఠం.

అమ్మ : యివి యెవరివి?

కుర్రవాడు : యివి బ్రహ్మాండం వారివె.

అమ్మ దారపు వుండలెలా తేవాలా అని ఆలోచించు కుంటూ, యేదో ఆలోచనలో వున్నదానిలా వెళ్ళిపోతుంది. 'యెక్కడా దేవస్థానం లేని వూళ్ళో దేవస్థానం సత్రం లేనిచోట సత్రము కట్టిస్తే యెంత బాగుంటుందో,వాళ్ళంతా అడుక్కొచ్చుకున్నా అందరు కలిసి తింటుంటె చూడు యెంత బాగుందో యీ వూళ్ళో అందరు కలిసి అందరి ఆస్తి కలుపుకొని యెవరు చేసే వృత్తి వాళ్ళు చేస్తూ ఒకే యింట్లో వుంటే యెంత బాగుంటుందో. అయినా ఒకే యింట్లో వుంటే చోటు చాలదుగా.అందుకే తల్లి ఒకటయి భాగాలుగా యిచ్చి పంపిస్తుంది. ప్రపంచాని కంతటికి ఒకటే తల్లి అయి తల ఒక వృత్తి చూపించి యిచ్చి వేసింది తలొక చోటుని'.

ఆ అబ్బాయి కూడా వస్తాడు.

అమ్మ : యీ పిల్లలందర్ని నాయనా అని దగ్గరకు తీసుకొనే దెప్పుడో. ఆ-అబ్బాయి యింకా కాస్త దగ్గరకొచ్చి 'యేమిటమ్మా నీ వనుకుండేదేమిటి. నీలో నీవు మాట్లడుకుంటున్నావేమిటి?'

అమ్మ : యేమి లేదు నాయనా.

నాయనా అన్నప్పుడు యెన్ని యెళ్ళు నాటి మనిషా అన్నట్టు వుంటుంది. అబ్బాయికి యెట్లయినా యి అమ్మాయి పేరు, బంధువుల పేరు తెలుసుకోవాలని "నీ వుండమ్మాయి నేనిప్పడే యింటికి వెళ్ళి వస్తా". ఆ అబ్బాయి యిల్లు దగ్గరలోనే వుంటుంది. యేమీ మాట్లాడకుండా యేదో ఆలోచిస్తున్న దానివలె తలవంచుకుని కూచుని చూస్తూ బోటన వేలుతో గీస్తూ నుంచుంటుంది. ఆ అబ్బాయి దగ్గరకొచ్చి "యేమిటమ్మా ఆలోచిస్తున్నావు?"

అమ్మ : యేం లేదు షాపు కెళ్ళాలి.

అబ్బాయి : యేం తీసుకొస్తావమ్మా?

అమ్మ : అల్లిక సూది, దారం తీసుకురావాలి.

అబ్బాయి : దానికొసం ఆలోచన యెందుకు. నేను కూడా వస్తా.

(అమ్మ మాట్లాడకుండా తల వంచుకొని వెళుతూ వుంటుంది.) యింటికి వెళ్ళి జేబులో అయిదు రూపాయలు వేసుకు వస్తాడు. అమ్మ షాపు దగ్గరకు వెళ్ళి 'సూది దారం యివ్వండి' అని అడుగుతుంది. వాళ్ళు అమ్మ వంక చూస్తూ నుంచుంటారు.

'డబ్బు లియ్యమ్మాయి' అంటాడు ఒక గుమాస్తా.

అబ్బాయి : (యింతలో పై నుంచి వస్తాడు). నేనిస్తాలెండి అంటాడు.

అమ్మ (వెనక్కు తిరిగి చూచి), "యెందుకు నాయనా నీవు?"

అబ్బాయి : నా తల్లివని యిస్తున్నానమ్మా!

గుమాస్తా తీసుకుని చిల్లర యిచ్చేస్తాడు.

అమ్మ సూది, దారము తీసుకుని తొందర తొందరగా యింటికి వచ్చేస్తుంది. గబగబా వచ్చి భారతమ్మ గారి చేతిలో పెట్టి మళ్ళీ పరుగెత్తి యింటికి పది గజాల దూరంలో ఆస్పత్రి గోడదగ్గర ఆ అబ్బాయి యెదురు వస్తాడు. అమ్మకు యింకొకరి యిల్లు చూపించి, "యిదేనా మీ యిల్లు?" అని అడుగుతాడు.

అమ్మ : యిదికాదు. మా బంధువులిల్లు.

ఆ అబ్బాయి : మీ యిల్లెక్కడ?

అమ్మ : మా యిల్లు ఈ ఊళ్లో లేదు.

ఆ అబ్బాయి : యెందుకున్నావు?

అమ్మ : బంధువులింటికొచ్చా.

ఆ అబ్బాయి : ఆ వూరు యే వూరు.

అమ్మ : మా వూరుతో యెందుకులే నాయనా.

ఆ అబ్బాయి : నీతో అవసరమున్నప్పుడు మీ వూరుతో గూడ అవసరముంటుందమ్మా. అక్కడ యెవరెవరు వుంటారు ఆ యింట్లో.

అమ్మ : యెవరూ లేరు. అంతటా చూచేవాళ్ళు ఒకరె వుంటారు.

ఆ అభ్బాయి : ఆ ఒకరు యెట్లా వుంటారు?

అమ్మ : వాళ్ళు మానవులల్లేనే వుంటారు.

ఆ అభ్బాయి : నీకు మల్లేనే, నీ మాదిరి నడకతోనే వుంటారా?

అమ్మ : యెట్లా చూచేవాళ్ళకు అట్లా వుంటాడు. ఆ చూపు యివ్వవలసింది కూడ వాడే.

ఆ అబ్బాయి : అమ్మాయి. నీవెంత చిన్నపిల్లవయినా నీ భావాలు చాలా గొప్పగా వున్నయ్యమ్మా.యింతకంటె అనటం చేతగాక గొప్పగా వుంటయ్యన్నాను.నీ రూపం నీ మాటలు నీ గొంతులో నుంచి వచ్చే శబ్దాలు వాటిలో వుండే భావాలు అబ్బా అంతా కలపితే పంచదార చిలక గుర్తు వస్తుంది.ముక్కు కొరికినా కాలు కొరికినా

యే అవయవాలు కొరికినా యెక్కడ కొరికినా అదే తీపి. యింతకంటె వర్ణించటం చేతగావటం లేదమ్మా. నన్నిక్కడే వదిలి వేయక మీ యింటికి తీసుకెళ్ళమ్మా. నన్ను మర్చేపోకుండా వుంటావా?

అమ్మా : నన్ను మీరు మర్చేపోకుండా వుండాల్నా. మిమ్మల్ని నేను మరవకుండా వుండాల్నా?

ఆ అబ్బాయి తల పైకెత్తి "యెందుకమ్మా అట్లా అడిగావు"

అమ్మ : నీవన్నమాటేగా నేనన్నది. నేను చిల్లపిల్లను గాదు అందుకని నేను మర్చిపోతానని మీరా నేనా అన్నా? పెద్దవారు మీరు గుర్తుపెట్టుకోవాలిగా?

ఆ అబ్బాయి : అసలు నీ వెవరమ్మా?

అమ్మ మాట్లాడకుండా నుంచుంటుంది. ఆ అబ్బాయి అమ్మ చేయి తీసి తన అరిచేతిలో పెట్టుకుని ఆ చేతిలో వేళ్ళు సవరిస్తూ కంటివెంట నీరు కారుస్తూ అమ్మ వేళ్ళు నోట్లో పెట్టుకుని 'యీ వేళ్ళు యెంత తీపమ్మా. యెంత హాయిగా వున్నదమ్మా, నోట్లోకి అమృత మొస్తున్నది చీకుతుంటే బుజ్జితల్లి నీ పాడవు కూడ యిట్లా వున్నదేమమ్మా. పొన్నకాయంత వున్నావు. మర్చేపోయినా నీ పేరేమిటి?'

అమ్మ : నా పేరా? యెందుకు నా పేరు.

అబ్బాయి : నిన్ను పిలవటానికమ్మా.

అమ్మ : నీకు తెలియకపోయినా యిరోజల్లా మాట్లడుతూనే వున్నాముగా. అవ్వ అంటుంది.

అబ్బాయి : యివి యెక్కడ సమాధానాలమ్మా?

అమ్మ : యెక్కడివో ఒక అక్కడివిలే! నేను వెళతా ప్రొద్దుపోతున్నది. యింటి దగ్గర నన్ను కోప్పడతారు. నీకు నేను అయిదణాలు బాకీ వున్నా తెచ్చి యిస్తా.

అబ్బాయి : నీకు యిల్లే లేదంటివి యెక్కడ దెచ్చిస్తా?

అమ్మ : యెక్కడో అక్కడ అని వెళ్లబోగా

అబ్బాయి : (చెయ్యి గట్టిగా పట్టుకుని) ఒక్కసారి యిటురా అమ్మా యెత్తుకుంటాను.

అమ్మ : నీదగ్గరె వుంటే రా అంటావేం? నీ చేతిలోనే వున్నానుగా.. యింతలోనే గుఱ్ఱపు బండి వస్తుంది. అమ్మ మీదకు వస్తుందేమె అని అటు తిరిగి చూస్తాడు.

వెనక్కు తిరిగి చూస్తే వెనకనున్నట్టుంటుంది. అటు గోడ ముందున్నట్టుంటుంది. అటుచూస్తుండగానే అమ్మ చెయ్యి జార విడిచి నట్టుంటుంది. తిరిగి యిటు చూడగానే అమ్మ కనపడదు. ఆశ్చర్యంగా వెతుకుతూ వస్తాడు. అమ్మ యింటికి చేరి వుంటుంది.

ఒకసారి దూరంగా నలుగురు అమ్మాయిలుగా ఉంటుంది ఒకసారి కవళికలు తేడాగా వుంటాయి. గబగబా పరుగెత్తి యిదిగో అమ్మాయిలు అని వస్తాడు. వస్తున్నకొద్ది దూరమవుతున్నట్టు వుంది యిదియేదో యెండమావులు ఆకాశం మాదిరిగా వుంది, మొట్ట మొదట బ్రహ్మాండం వారి సత్రము దగ్గర ఆకారంగా కనపడుతుంది మళ్ళి తను అక్కడ వున్నట్టు మెదట అమ్మను చూచినట్టు, మాటాడినట్టు అమ్మ మాములుగా 'యేం చేస్తున్నా నాయనా' అని పై నుంచి వచ్చి పలకరిస్తుంది.

ఆ అబ్బాయి : యిప్పుడు నలుగురుగా అటు బోతిరే, యిటు యెటు వచ్చావమ్మా? యిదంతా గారడీగావుంది. ముద్దుతనం కంటె భయంగా వుంది నిన్ను చూస్తే.

అమ్మ : నేను వెళ్ళివస్తాను. పొద్దుపోతుంది. యీ వూళ్ళోవుంటె యెప్పుడయినా కలుసుకుని మాట్లాడుదాం.

ఆ అబ్బాయి : రోజూ కనపడతావా? నన్ను యెక్కడికి రమ్మంటావు?

అమ్మ : నీవు రావద్దు. వీలుగా వుంటె నీవున్న చోటికి నేనే వస్తా!

ఆ అబ్బాయి : సరేలే అమ్మా ! అమ్మ యింటికి వెళుతుంది. అతను యింటికి వెళ్ళి పోతాడు.

అమ్మ యింటికి వెళ్లేసరికి లక్ష్మణాచార్యులు గారు యింట్లో వాళ్ళు అంతా కూర్చుని ప్రయాణ సన్నాహాలు చేస్తున్నారు.

లక్ష్మణాచార్యులు గారు : (అమ్మను చూచి) యేవమ్మా యెంత మంది తలుపులు కొట్టివచ్చావు?

యింతలో భారతాంబ గారు "సాయంకాలం 6 గంటలకు పంపించాను. యిప్పుడొస్తున్నది. రాత్రి 9 గంటలయింది, దగ్గర ఉన్న కాఫీ హోటల్‌కు ఆమెను పంపిస్తే పోయిన అరగంటకు గాని రాదు."

లక్ష్మణాచార్యులు గారు : హోటల్లో వుడికే వుడికేవి తింటూ కూర్చుంటుందేమె బాలమ్మ

భారతాంబ గారు : ఆపని చేయదు లెండి. చేతిలో పెట్టినా తినదు అని అంటూ వెళ్ళిపోతుంది.

అమ్మ : నేను తినకపోవటం నిజమేకాని తాతగారు చేతిలో పెట్టటం యెంత నిజమో!

లక్ష్మణాచార్యులు గారు : దగ్గరకు తిసుకుని హ్మ్మ్: తల్లిలేని పిల్ల అని కూడ జ్ఞాపకముండదు కాబోలు. సీతాపతీ! రేపు ప్రొద్దున్నే ప్రయాణం కండి అందరు. అందరూ గుడ్డలూ అవీ సర్దుకున్నారా?

చిందబ్రావు గారు : భారతీ! అందరి గుడ్డలు సవరించు. నీవు, మీ అమ్మ రాఘవ, అమ్మాయి గుడ్డలు సవరించావా?

భారతాంబ గారు : యెక్కడున్నయ్యో అమ్మాయి గడ్డలు కనపడలా.

చిందబ్రావు గారు : యేమమ్మా యెక్కడున్నాయి.

అమ్మ : నాకేం తెలుసు. యెప్పుడూ ఒక చొక్కా యేగా ఒంటినుండేది తక్కినవి యెక్కడున్నయ్యో?

చిదంబ్రావు గారు : కాస్త అమ్మాయి గుడ్డలు కనిపెట్టి వుండగూడదటమ్మా భారతి?

భారతాంబ : యేం చేసిందో ఒకటి లేదు. నేను కనిపెట్టే వుంటున్నా.

చిదంబ్రావు గారు : పోనీలె ఒంటినున్నది కాక యింకొకటి వుంటే చూడు పట్నంలో దిగంగానే కుట్టించండి.

భారతాంబ గారు : కూడా తీసుకెళ్లటానికి రెండోది కూడాలేదు.

తాతగారు : పోనిలె లేకపోతె మానె.

సీతాపతి తాతగారు : పంచమి గడియలొస్తె యి రాత్రి బండెక్క వచ్చునా?

చిదంబ్రావు గారు : ఆఁ బళ్ళు టయిం ప్రకారం రావటంలా యే 12 గంటలకో వస్తుంది. అప్పటికి బయలు దేరవచ్చు.

సీతాపతి తాతగారు ప్రయాణం 12 గంటలకు నిశ్చయించుకొని 'యింతకు ఆ నిక్షేపరాయుడు యెక్కడున్నాడో?' యింతలా టిక్కట్లు కొనుక్కొనే వస్తాడు రాఘవరావు (మామయ్య) గారు.

సీతాపతి తాతగారు : నీకు డబ్బు యెవరిచ్చారురా. అక్కడ కూడా దొంగతనం చేశావా?

రాఘవరావు : లేదు తాతగారు కనుక్కొచ్చాను. తమాషాకి అన్నాలే!

చిదంబర్రావు గారు : యీ పూట ప్రయాణముందని నీకసలు యెవరు చెప్పారు?

రాఘవరావు : కిళ్లీ దుకాణం దగ్గర నుంచుంటె అమ్మాయి వచ్చి చెప్పింది యింతకుముందు.

చిదంబర్రావు గారు : యేవమ్మా, నీవు యిక్కడేవుంటివిగా?

అమ్మ : మీరు స్నానాలు చేసేటప్పుడు వెళ్ళి చెప్పి వచ్చా లెండి.

అందరూ బోజనాలు చేసి పదకొండున్నర గంటలకల్లా స్టేషనుకు వెళతారు. పన్నెండుంపావు గంటలకు రైలు యెక్కి మరునాడు వుదయం ఏడున్నర గంటలకల్లా మెద్రాసు చేరుతారు.

లీలా వినోదం :

స్టేషనులో దిగగానే కామరాజుగడ్డ కామేశ్వరరావు గారు వారి యింటికి తీసుకు వెళతారు. దేనికి యిబ్బంది పడకుండా చూస్తారు. 2 రోజులు మెద్రాసులొ వుండి. కావలసినవన్ని కొనుక్కుని, అమ్మకు మేజొళ్ళు, బూట్లు 4 గౌనులు తీసుకుని ఒక పట్టుపరికిణి కొని 7వ తారీఖు నుంచి బయలుదేరి తిరువళ్ళూరు వెళతారు.

సత్రంలొ దిగి సామాను అక్కడ పెట్టుకుని వీర రాఘవస్వామి దేవాలయానికి వెళ్ళి స్వామిని దర్శించి తిరిగివచ్చి కోనెటిలొ స్నానం చేసి బెల్లం వేసి స్వామి మ్రొక్కుబడి తీరుస్తారు. అమ్మ కోనేటిలొ ఈత కొట్టుకుంటూ మండపం మీదకు వెళ్ళి కూర్చుంటుంది. అయ్యో! యెందుకు అంతదూరం వెళ్తావని అరుస్తారు.

(అమ్మ ఇక్కడ మునిగి అక్కడ తేలినట్లవుతుంది. శబ్దము వినపడదు.) అందరూ బయటకి వచ్చినా అమ్మ మంటపం మీదనె అటు తిరిగి కూర్చుంటుంది. వీరివైపు ముఖము పెట్టకుండ మండపం స్తంభము అడ్డు వచ్చి ప్రక్కల వున్నవారికి తప్ప యెదురు వారికి కనవడదు. అప్పుడు అందరూ మండవంలొ లేదు దిగివచ్చిందనుకుంటారు. (ఆసమయంలో వచ్చినట్లు కనపడుతుంది.) అక్కడున్న జనంలో కాషాయాలు కట్టుకున్న మనిషి "యిందాక మండపంలోకి వచ్చినమ్మాయి ఎవరు" అని అడుగుతారు.

తాతగారు : మా అమ్మాయేనండి అంటారు.

సాధు : మీ అమ్మాయి అంటే మీ కుమార్తా?

తాతగారు : ఆఁ కుమార్తేనండి.

సాధు : ధన్యుడివి నాయనా, ధన్యుడివి, దేవతను కన్నావు. ఆమాట అని తొందరగా వెళ్ళి పోతారు.

సీతాపతి తాతగారు : ఆయన వెంబడి యేమిటి మీరన్నది,యేమిటి మీరన్నది అంటాడు. సాధువు కనపడడు. అదృశ్యమౌతాడు (సాధు గొంతు ఆడగొంతు ధ్వనిలా వుంటుంది)

సీతాపతి తాతగారు : (ఆశ్చర్యపడి) ఎమిటిదీ (అన్నపూర్ణమ్మ గారి దగ్గరకు వచ్చి) అక్కయ్యా ఎవరో ఒక సాధువు కనపడ్డాడు. ఎవరు ఆ అమ్మాయ్ అని అనసూయను గురించి అడిగాడు. మా అమ్మాయే నని చెప్పాను "దేవతను కన్నావు" అని కనపడకుండా పోయాడు.

అన్నపూర్ణమ్మ గారు : ఆఁ యేముందిలేరా,సాధువులు సంపాదన కోసం యిట్లాగే చెప్తుంటారు. యింకా నయం, యీ అమ్మాయికి గణ్డముంది, నేను నయం చేస్తానని చెప్పలా, వాళ్ళ దుంపలు తెగిరి. వాళ్లదంతా మోసమే. కూతురు దేవతని నమ్మావా?

సీతాపతి తాతగారు : నమ్మితే నిన్నడిగే పనే లేదుగా? తెలియక నిన్నడుగుతున్నా. అయినా నిన్నడిగేదేముందిలే, జరిగింది చెప్తున్నా.

అన్నపూర్ణమ్మ గారు : యేముందిలేరా, పిచ్చి నాయనా. యింతలో భారతమ్మ గారు అందుకుని "యేమిటో తమ్ముణ్ణి పిచ్చినాయనంటున్నావే".

సీతాపతి తాతగారు : నీసంగతి కాదులేవమ్మా? నీకెందుకు?

భారతి : నీవు నా సంగతి అంటున్నావు. ఏమిటి అని అడుగలేదుగా?

సీతాపతి దతాతగారు : యేం లేదమ్మా అని జరిగిందతా చెప్తారు.

భారతమ్మ గారు : ఓహొ, మన్నవ వారింట్లో దేవత పుట్టిందని పొంగుతున్నారా. కూతురుని దేవత అన్నాడనా. పొరపాటున కూడా అనుకోబోకండి మీ యిళ్ళల్లో దేవతలు పుడతారా? పుడితే చంద్రమౌళి గారింట్లో పుట్టాలి మామయ్యా. అని పకపకా నవ్వుతుంది.

(వెనక్కు విరుచుకుని) దేవత మాట తరువాత ఆలోచిద్దాం. యింతకూ నీ కూతురు యేదీ?

సీతాపతి తాతగారు : యిందాక మండపం మీద కూర్చుని వుంది. కనపడలేదు.

భారతమ్మ గారు : యే సాధువు వెంబడి పడిపోయిందో?

అన్నపూర్ణమ్మ గారు : అట్లా పోదులేవే తల్లీ. ఆ అమ్మాయి పోయేదేమిట్రా, వాడే యింత మత్తు చల్లి తీసుకుపోతాడు.

అందరూ స్నానాలు చేసి వంట చేసుకుని భోంచేస్తారు. యింకా రాలేదు? మధ్యాహ్నం 2 గంటలు అవుంతుంది. అమ్మ రాలేదు. ఆదుర్దా పడి తాతగారు వెతకటానికి బయలుదేరుతారు. "క్రొత్త వూరాయను మనకేం తెలుస్తుంది. యెక్కడకు పోయిందని వెతికేటట్టు? యెవరిని అడిగితే యెవరు గుర్తు చెబుతారు? యెవరు యెరుగరు. ఒరేయి, రాఘవా, కొంచెం వెతికిరారా, నేను వెతకలేను" అంటారు సీతాపతి తాతగారు. అంతవరకు వెతికి 3 గంటలు అయిన తరువాత యింటికి వస్తారు.

అమ్మ ఆ సత్రంలోనే వాకిట్లో గదిలో ఒక పయిల్‌మాన్ (అన్ని పనులు చేతనయివాడు) తో మాట్లాడుతూ కూర్చుంటుంది.

పయిల్‌మాన్ : (అమ్మను చూచి) యెక్కడనుంచి వచ్చా అమ్మాయి?

అమ్మ : యేమీ మాట్లాడదు.

పయిల్‌మాన్ : యేవమ్మా పలకవేం? గొలుసులు (యినపవి) తెంచుతావా?

అమ్మ : నేను యే గొలుసులూ తెంచలేను, ముడి వెయ్యలేను.

పయిల్‌మాన్ :యీ గొలుసులు గాక యింకా గొలుసు లున్నయ్యా?

అమ్మ : యెంతవారమైనా యీ గొలుసులు తెంచగలుదుము కాని యీ గొలుసు కాధారమైన గొలుసును తెంచలేం.

పయిల్‌మాన్ : అది యెక్కడుంటుందమ్మా?

అమ్మ : అన్నిట్లో వుండే అన్నీ కాకుండా వుంటుంది.

పయిల్‌మాన్ : మన యిద్దరి లాగానా?

అమ్మ : ఆఁ దాదాపుగా-నేనై- మనమయినట్లు.

పయిల్‌మాన్ : కొంచెం వివరించి చెప్పమ్మా.

అమ్మ : అది యిట్లా సవరిస్తే తెలిసేది కాదు సమయమొస్తే తెలిసేది.

పయిల్‌మాన్ : సమయమెప్పుడొస్తుందమ్మా?

అమ్మ : తెలిసి వచ్చేదికాదు. వస్తే తెలిసేది కాదు.

పయిల్‌మాన్ : నా దగ్గర నెమలి పింఛం వున్నది పెట్టుకుంటా?

అమ్మ : నెమలి పింఛం యెక్కడ పెట్టుకోవాలి?

పయిల్‌మాన్ : నీ ఆకారం నీ ముందరిజెడ అందు కనుకూలంగా వున్నదమ్మా.

అమ్మ : పింఛం నాకనుకూలమా? పింఛానికి నేననుకూలమా? రెండూవేరే యింకా యెందుకయినా అనుకూలమా?

పయిల్‌మాన్ : అదిగో వాడికనుకూలం (అని యెదురుగుండా వున్న కృష్ణుడి బొమ్మ చూపిస్తాడు. ఆ ఫోటో మురళీకృష్ణుడు).

అమ్మ : నేను వాడి కనుకూలము కావటానికి యెవరికి వ్యతిరేకం.

పయిల్‌మాన్ : యెవరికీ వ్యతిరేకం లేదంటున్నావు?నాకు అనుకూలమేనా?

అమ్మ : మీరు మాట్లాడిన భావం, అనుకూలమంటే మీ వుద్దేశ్యమేమిటో. మొదట్లో రూపానికనుకూలమన్నారు. యిప్పుడు మనస్సుకు సంబంధించినట్లు అంటున్నారు. అనుకూలమంటే మీ పూర్తి వుద్దేశ్యం చెప్పండి?

పయిల్‌మాన్ : చాలా లోతుగా మాట్లాడు తున్నావే?

అమ్మ : మీరు అడిగిన వాటికి సమాధానమేగా. మీరు యెంత లోతుకు తీసుకెళితే అంతలోతుకు వచ్చివుంటా.

పయిల్‌మాన్ కూర్చున్నవాడల్లా తొందరగా లేచి అమ్మను వొళ్లోకి లాక్కుని గడ్డంతో మొఖము తనవైపు తిప్పుకొని ముద్దు పెట్టుకుంటాడు. "నీవు నా యిష్టదైవానివా అమ్మా?"

అమ్మ : నీ యిష్టదైవమెవరో నాకేమి తెలుసు?

పయిల్‌మాన్ : యెవరో కాదు. అదుగో వారే (అని మురళీకృష్ణుని ఫోటో చూపించును). వారు యెప్పుడూ యెదురుగుండా వచ్చి మాటాడాలని ధ్యానం చేసుకునేవాణ్ణి.మీకు ఆ ఫోటో చూపించి నప్పుడు మీలో ఆ ఫోటోలో వున్నవైఖరి కనుపించింది. క్రమంగా మారిపోయి పూర్తిగా వారే అయినారు. మారకుండా యెప్పుడూ యీ వొడిలో యిట్లాగే వుండవా (అని యేడుస్తాడు). నాయనా! కృష్ణా, శక్తి స్వరూపం కూడా నీవేనా! పిల్లగా వచ్చావు. రాధవయి వచ్చావా (అంటూ కంటి నీరు కారుస్తూ) మొన్ననే అనుకున్నా. మరేమీ అక్కర్లేదు.

యిలాగే వొళ్లో కూర్చోమని తన గడ్డం అమ్మ ముఖం తన మూతి వైపు తిరిగినట్టు కనపడుతుంది. చప్పున తన మూతి అమ్మ ముఖం మీద పెట్టి ముద్దు పెట్టుకుని పెద్దగా అరచి పడిపోతాడు యెటు చూచినా కృష్ణుడే. ఒక అరగంట అన్నీ మరచి కృష్ణునితోనే కాలం గడుపుతాడు. అమ్మ తన తొడలమీదనే కూర్చుని వుంటుంది.

తర్వాత లేచి, అమ్మ వాళ్లా కూర్చున్న చోటు మర్చిపోయి, యేది చూచినా కృష్ణుడిగా కనపడి కృష్ణా కృష్ణా అంటూ లేచి నుంచుంటారు. తన వాడిలో నుంచి యేదో బరువుగా క్రింద పడినట్టు వుంటుంది. అమ్మ లేచి నుంటుంది. నిద్రలో నుంచి మెళుకువ వచ్చినట్టుగా అప్పుడు క్రిందకు చూస్తాడు. అంతవరకు జరిగినది కల అనుకొని యిందాక వచ్చిన అమ్మాయి యిక్కడ వున్నదనుకుని నిద్రబోయి లేచానని అనుకుంటాడు. కాని అమ్మలో కృష్ణుని పోలికలు చూస్తూ వుంటాడు. 'వీధి గుమ్మంలోకి వెళ్లి కూర్చుని మాట్లాడుకుందాం రా' అమ్మా అని చెయ్యి పట్టుకుని తీసుకెళ్లి కూర్చో బెట్టి లోపలకు వెళ్లి కెమేరా తీసుకొస్తాడు. నెమలి ఫించం తల్లోపెట్టి ఫ్లూటు చేతికిచ్చి ఫోటో తీస్తారు. యీ సమయంలో తాతగారు వెతుకుతూ అటూ యిటూ తిరుగుతుంటారు. గుర్తుపట్టరు. తాతగారిని చూపించి వారే మా నాన్నగారు, వెతకటానికి వచ్చి నన్ను గుర్తుపట్టలా.

వయిల్‌మాన్ : మీ నాన్నగారు గుర్తుపట్టలేని స్థితిలో కూడా నీవు వుంటుంటావా?

అమ్మ : నేను యెప్పుడూ ఒకటిగానే వుంటా. వారే యేదో ఆలోచిస్తూ వుంటారు. నన్నేకాదు యెదురుగుండా వచ్చిన కారు, గుర్రపుబండ్లు కూడా లెక్కచేయరు. లెక్క చెయ్యకపోవటమంటే గుర్తుపట్టక పోవటమే. అవే గుర్తించి పక్కకు పోతాయి.

యిట్లా మాట్లాడుతూనే పోటో తీస్తారు. నాలుగు కాపీలు తీసిన తర్వాత, అమ్మ చీర కట్టుకుని కొప్పు, పెద్ద బొట్టు పెట్టుకుని, అన్నపు పళ్లెము చేత పట్టుకుని అందరికి వడ్డిస్తున్నట్టుగా కనిపిస్తుంది. వెంటనే కెమేరా క్రిందబెట్టి "అమ్మా ఆదిలక్ష్మీ, జగజ్జననీ, యెక్కడ నుండి వచ్చావు. నాకీ రూపమంటే చాలా యిష్టం" అంటూ కౌగలించుకొని యెత్తుకుంటాడు. యెత్తుకోగానే మాములూ అమ్మ అయిపోతుంది. వెంటనే కిందకి దించి ఆయన లోపలకు వెళ్లిపోతాడు. అమ్మ వెంటనే బయలుదేరి తాతగారు వాళ్లు వున్న బసకు వచ్చేస్తుంది. వెతకటానికి వెళ్లిన తాతగారు, అమ్మ ఒకేసారి బస చేరారు. సాయం కాలం ఆరు గంటలవుతుంది.

భారతమ్మ "యేం యెక్కడ దొరికింది నీ కూతురు?" అని తాతగారి నడుగుతుంది.

సీతాపతి తాతగారు : యెక్కడా నాకు కనుపించనే లేదు. వచ్చింది? యెక్కడొచ్చింది? నాతో రాలేదే?

భారతమ్మ : నీ వెంటనే వస్తున్నది. నీవు ముందు, ఆమె వెనుక వస్తుంటే మేము చూశాం.

అన్నపూర్ణమ్మ గారు నిజమేనన్నట్లుగా నవ్వుతూ వుంటుంది.

సీతాపతి తాతగారు : యేదో రకంగా వచ్చిందిగా, ముందు దానికి కాస్త అన్నం పెట్టండి, ప్రొద్దుటనుంచి తిన్నదో లేదో?

భారతాంబ : తినకుండా యింతసేపు యెట్లా వుంటుంది? తినకపోతే నీ కూతురింతసేపు వుండొచ్చిందా?

సీతాపతి తాతగారు యేమీ మాట్లాడకుండా వాకిట్లోకి వెళ్లిపోతారు.

అమ్మ వెళ్లి ఒక ప్రక్క గదిలో కూర్చుంటుంది.

అందరూ భోజనాలు చేసి రాత్రి 7 గంటల బస్సులో శ్రీపురం పుత్తూరు ప్రయాణమై అప్పుడు అమ్మను వెతుకుతారు యెక్కడ వుందని వెతుకుతుండగానే అమ్మ గదిలో నుంచి బయటకు వచ్చి "యిక్కడే వున్నా".

గాలి దుమారము సాగుతూ వుంటుంది. ఉరుములు మెరుపులూ, సరిగ్గా అమ్మ పాదం బయట బెట్టేవేళకు యెక్కడో దగ్గరలోనే పిడుగు పడుతుంది.

అమ్మ వాకిట్లోకొచ్చిన తరువాత తాతయ్య 'ఇందాక భోం చేసిందా' అని అడుగుతారు.

భారతాంబ గారు : ఆఁ పెట్టినట్లే వుంది అమ్మ.

సీతాపతి తాతగారు : అమ్మా తిన్నావా?

అమ్మ : ఆఁ

యెవ్వరూ తినలేదని చెప్పరు.

తాతగారు దాన్ని గురించి అంత గట్టిగా మళ్లీ ఆలోచించరు. అందరూ ప్రయాణమై బస్సెక్కి రాత్రి పదిన్నర గంటలకు శ్రీపురం పుత్తూరు చేరి సత్రములో పడుకుని తెల్లవారి అంతా స్నానాలు చేసి సుబ్రహ్మణ్యేశ్వరాలయానికి వెళ్లి అందరూ కలసి ఆలయంలో చేయవలసిన క్రతువులన్నీ చేసి తీర్థ ప్రసాదాలు తీసుకుని బసకు వచ్చేస్తారు.

అమ్మ కోవెల్లోనె వుండి అక్కడ వారు పెట్టిన ప్రసాదము తిని 'మీరు యెప్పుడు వెళితే అప్పుడు వస్తాను నన్ను పిలవండి యిక్కడే వుంటాను' అని తాతగారితో అమ్మ చెపుతుంది.

సీతాపతి తాతగారు : ఆకలిగా లేదా?

అమ్మ : ఆఁ లేదు.

సీతాపతి తాతగారు కూడా వెళ్లిపోతారు.

అందరూ అన్నాలు తిని పడుకుంటారు.

అమ్మ సాయంకాలం మూడు కాగానే బసలోకి వచ్చేస్తుంది.

అదే సమయంలో అమ్మ తాతగారి దగ్గరకు వచ్చి కూర్చుంటుంది. తాతగారు కళ్లు తెరచి వీపుమీద చెయ్యివేసిరుద్దుతూ "యెంతసేపయిందమ్మా వచ్చి ?వళ్లు కాలిపోతున్నదే!"

అమ్మ : ఒక కాలు జాలుగా వుందినాన్నా.

సీతాపతి తాతగారు : వుడుకు జేసిందమ్మా, కాసిని మజ్జిగ తాగు (అని యింట్లోకి వెళ్లు ఒక గ్లాసుతో కాసిని మజ్జిగ తెచ్చి యిస్తారు).

ఇంతలో తెలుగు దేశస్తుడు ఒక డాక్టరు గారు వుంటారు అక్కడ.

డాక్టరు "యేమిటి నాయనా జ్వరము అంటున్నారు. ఆపాపను యిటు రమ్మను చేయి చూస్తాను(అని వారే వచ్చి చేయి చూచి)జ్వరమున్నది నాయనా" అంటూ అతని జేబులో నుంచి మందు తీసి యిస్తారు. మందు యిచ్చి 'రెండు రోజులు అన్నము పెట్టకండి" అని చెప్తారు. "యీ అమ్మాయికి ఎన్నో సంవత్సరం?"

సీతాపతి తాతగారు : ఆరు వెళ్లి యేడు వస్తాయి.

డాక్టరు గారు : జ్వరము తీవ్రముగానే వున్నది.తగ్గేటప్పటికి నాలుగు,అయిదు రోజులు పడుతుంది.

సీతాపతి తాతగారు : సరే యిల్లు చేరుదాం తొందరగా, నేను తిన్నవన్నీదెబ్బలే. అందరూ లేస్తారు.

అన్నపూర్ణమ్మ గారితో "సాయంకాలం నాలుగయింది. పెందలాడె వంటచేసుకు భోంచేయండి. యీ రాత్రికి మళ్లీ తిరువళ్లూరు చేరి తెల్లవారేటప్పటికి మెద్రాసు పోదాం."

రాత్రి పది అయేసరికి తిరువళ్లూరు వచ్చి అక్కడ సత్రములో వదిలిపెట్టిన సామాను తీసుకొని స్టేషనుకు వచ్చి బండెక్కి మెద్రాసు చేరుతారు. మెద్రాసులో కామేశ్వరరావు గారింటికి వచ్చి ఆరోజు అక్కడవుండి. తెల్లవారు ఝామున బండెక్కి సాయంకాలానికి బాపట్ల చేరుతారు.

ఉపనయన సంరంభం :

యింటికి రాగానే చిదంబర్రావు తాత గారు అమ్మను యెత్తుకుని. "అమ్మా మీ అన్నయ్య వుపనయనం యింకా వారము రోజులున్నది. తరువాతయినా యీ అల్లరి మానేయిస్తావా?"

అమ్మ : ఆయన అల్లరితో ఆయనే అల్లరయి పోతున్నాడు. మనకేమని.

సీతాపతి తాతగారు రాగానే చిదంబర్రావు తాతగారు సీతాపతి తాతగారితో వుపనయనం లగ్నం పెట్టించి అందరికీ వుత్తరాలు వ్రాస్తారు. లగ్నం వారం రోజులుందని చెప్తారు. సమారాధాన కూడా అందులోనె చేసుకోవచ్చు .

సీతాపతి తాతగారు : అయితే నేను మన్నవ వెళ్లి వస్తాను.

చిదంబర్రావు గారు : పెందలాడి భోంచేసి వెళుదువుగాని.

అందరూ స్నానాలూ అవీ చేసి భోంచేస్తారు.

సీతాపతి తాతగారు భోంచేసి మన్నవ వెళ్లిపోతారు.

అమ్మ : నేను కూడా వస్తా!

చిదంబర్రావు గారు : అన్నయ్య వడుగమ్మా వద్దంటారు.

అమ్మ : వారం రోజులుందిగా, అప్పుడు యిద్దరం కలిసి రావొచ్చు

సీతాపతి తాతగారు : నేను రేపే వస్తానమ్మా. జ్వరముతో ఉన్నావు. వద్దమ్మా.

అమ్మ : మెడ్రాసులో జ్వరముగా వుంటే యిక్కడికి రాలా?

సీతాపతి తాతగారు : అక్కడకు వెళ్లిన తర్వాత తగిలింది గనుక యింటికి రాక తప్పదు.

అమ్మ : యిదీ తప్పనిసరిగా వుంది నాకు.

సీతాపతి తాతగారు : సరే బయలుదేరు!

చిదంబర్రావు తాతగారు వచ్చి 'యిద్దరూ బయలుదేరు తున్నారెక్కడికి?'

సీతాపతి తాతగారు : నేను వెళ్లి రావాలి గదా, యెటూ నాతో గూడా అమ్మాయి వస్తానంటూంది.

చిదంబర్రావు తాతగారు : సరి తీసుకెళ్లు అక్కడ అన్నానికి యిబ్బంది గదా!

సీతాపతి తాతగారు : అంత పట్టుదలగా అడుగుతున్నప్పుడు యెందుకు హెూటల్లో భోంచేస్తాము.

చిదంబర్రావు గారు : సరే బయలుదేరండి 11 గంటలు అయింది కోచీకి వెళ్లండి.

మద్రాసు నుంచి వచ్చిన మరునాడు మన్నవ ప్రయాణము. సీతాపతి తాతగారు, అమ్మ రైలు స్టేషన్‌కు వెళతారు. టిక్కట్లు తీసుకోటానికి సీతాపతి తాతగారు వెళతారు. టిక్కట్లు తీసుకుని రైలు దగ్గరకు రాగానే మన్నవ మనిషి షేక్ మౌలాలి సాహెబ్ కనపడి "యిదిగో యీ డబ్బు మీరు వాడుకోండి" అని తాతగారి చేతికి పైకము యిస్తారు.

సీతాపతి తాతగారు : యేమిటి డబ్బు యేమిటి?

మౌలాలి : యెవరో నేను యింట్లో లేనప్పుడు వచ్చి మీరు చెప్పినట్లుగా వుపనయనానికి డబ్బు తెమ్మన్నట్లుగా చెప్పి వెళ్లారట యింటికి రాగానే చెప్పింది. ఆ మనిషి యెవరయింది తేలలేదు.చివరకు మీరు బాపట్లనుంచి పంపారేమోనని డబ్బు తీసుకొచ్చాను.

సీతాపతి తాతగారు : నేను యెవరిచేత కబురు చేయలేదె! అయినా యింటికి వెళ్లి అడుగుదాం రా. మాబావగారేమైనా కబురు చేసారేమొ. ముగ్గురూ కలిసి యింటికి వస్తారు.

సీతాపతి తాతగారు చిదంబర్రావు గారి నుద్దేశించి 'మన్నవ కేమైనా డబ్బు కావాలని కబురు చేశావా?'

చిదంబర్రావు గారు : అనుకున్నాను గాని చేయలేదు.

అమ్మ : యింకా నయం, తీసుకరమ్మని చెప్పాడు. నా చేతికి యిప్పించుకు తెమ్మన్నారని చెప్పినట్లయితె యిచ్చెవాడివేగా?

షేక్ మౌలా : ఆఁ యిచ్చేవాడినే. మీ నాన్నగారి మీద వున్న అభిమానం కొద్దీ.

చిదంబర్రావు గారు : యెంత తీసుకొచ్చావు యింతకూ?

షేక్ మౌలా : పది హేను వందలు తీసుకొచ్చానండి. అయ్యా చెప్పటం మర్చేపోయినా, మా ఆడదానికి రంగమ్మ గారు కనపడి తొందరగా పంపవే డబ్బు అన్నదట. అప్పటినుంచి ఆడది వూపిరాడ నీయటంలా, అందుకని తొందరపడ్డాను. దానికి అది కలగా లేదు. రంగమ్మగారు నిజంగా కనపడి చెప్పినట్టే వుందట. బ్రతకనీయలా.

చిదంబర్రావు తాతగారు (కంటివెంట నీరు కారుస్తూ) 'నీవు పోయినా యిక్కడే వున్నావా అమ్మా' అనుకుంటూ కళ్లు తుడుచుకుని డబ్బు చేతికి తీసుకుని లెక్కబెట్టుకోబోతారు.

అమ్మ : యివన్నీ చేస్తున్నారు. అతను అన్నము తిన్నాడేమొ కనుక్కున్నారా?

చిదంబర్రావు గారు : లేదు.

షేక్ మౌలా : తినలేదయ్యా బండి ఆలస్యంగా వచ్చింది. యీ పూటేగాదు అన్నం తిని నాలుగు పూటలైంది.

చిదంబర్రావు తాతగారు : అయితే నేను లగ్నం పెట్టించిన నాటినుండి నీకు అన్నం లేదన్నమాట. శరీరం పోయినా జీవుడు యిక్కడే వుంటున్నాడు అనే దృష్టాంతరం కోసం కాబోలు నాకు.

అమ్మ : అయితే అమ్మే పోయి చెప్పిందంటారా తాతగారు?

చిదంబర్రావు తాతగారు : చెప్పింది కుర్రవాడే అనుకో అమ్మా ఆ కుర్రవాడు యెవరో తేలలేదు గదా.పైగా యీ స్వప్నమొకటి తెలుస్తున్నదిగా.యీ రెండూ చూస్తే యేమీ అనటానికి చేతగాక తేల్చలేక అవి చెప్పతుంటె వింటున్న బాధకొద్ది ఆమె వుండి అన్నీ చేసుకున్నట్టుగా తోచింది అంతేగాని ఆమె వున్నదని కాదు. అమ్మ వుందనే పరిస్థితి అదికూడ మనశ్శాంతిలో ఒక భాగము.

షేక్ మౌలా డబ్బు యిచ్చి వెళ్లిపోతాడు.

చిదంబర్రావు గారు బజారుకు వెళ్లి వుపనయనానికి సంబంధించిన వస్తువులు తీసుకొచ్చి పనులన్నీ చూచు కుంటూ వుంటారు.

యిట్లాగె యీ పనులతో వారం రోజులు జరుగుతుంది బంధువు లందరూ పిల్ల పెళ్లికూడా చెయ్యకపోయినారా? అంటారు.

చిదంబర్రావు తాతగారు : పిల్ల పెళ్లి తరువాత చూద్దాం బ్రతుకు నిజం కానియ్యండి. విశాలమ్మ గారు, మన్నవ నుంచి వచ్చిన ఒక పెద్ద ముత్తయిదు. మొదటినుంచి తాతగారింటికి వస్తూ పోతూ వుండే ఆమె. యింట్లో వున్న సంబంధమేగా చేసేస్తె సరిపోతుంది. తరువాత పిల్లవాడు రాఘవుడికి చేసి తను (అంటే సీతాపతి తాతయ్య) చేసుకుంటే సరిపోతుంది.

చిదంబర్రావు గారు : ఆరేళ్ల పిల్లకు యేంపెళ్లమ్మా?

తరువాత యెవరి పనులమీద వారు వెళ్లిపోతారు.

తెల్లవారు ఝామున 5.30 ని లకు సీతాపతి తాతగారి తమ్ముడు దంపతులు అంబారావు కనకమ్మ గారలు పీటలమీద కూర్చుని వుపనయనం చేస్తారు.

ఒక ప్రక్కన మేళతాళాల ఆనందంతో ఒక ప్రక్కన అమ్మమ్మ లేదనే యేడ్పు పెడబొబ్బలతో వుపనయనం పూర్తి అవుతుంది.నాలుగు రోజులు వుపనయనం ఆనందంగా జరిగిపోతుంది. వెంటనే మన్నవ ప్రయాణము పెట్టుకుని కుటుంబంతో నాలుగు రోజలు వుండి వద్దామనుంటారు. అనుకుని "అన్నపూర్ణమ్మక్కయ్యా నాలుగు రోజులు మన్నవలో వుండి వస్తాము" అని సీతాపతి తాతగారంటారు.

అన్నపూర్ణమ్మ గారు : పదహారు రోజుల పండుగ వెళ్లంది యెక్కడికి వెళ్లకూడదు నాయనా.

సీతాపతి తాతగారు : సరే అంటూ లోపలకు వస్తారు.

సీతాపతి తాతగారి చెల్లెలు కనుకదుర్గమ్మ గారి ప్రథమ పుత్రులైన నాగేశ్వరరావు గారికి వుపనయనం లగ్నం పెట్టుకుని కనకదుర్గమ్మ గారు వారి భర్త బ్రహ్మాండం సుబ్బారావుగారు వుపనయునం లగ్నానికి పిలుపుకు వస్తారు. వడుగు ఆరు రోజులున్నది. వచ్చిన బంధువు లందరితో "మీరు అందరూ రేటూరు మా యింట్లో వుపనయనానికి రావలసింది" అని చెపుతారు. నాలుగు రోజులు యిక్కడ జరుపుకుని బంధువులందరూ రేటూరు వెళతారు. అమ్మ కూడా వెళుతుంది. అక్కడ వుపనయనమై అందరూ తిరిగి వచ్చేటప్పుడు అమ్మ మేనత్త కనకదుర్గమ్మ గారు అమ్మను నాలుగు రోజులు అట్టిపెట్టమని సీతాపతి తాతగారి నడుగుతుంది.

సీతాపతి తాతగారు : నాకు తెలియదు. చిదంబర్రావుగారిని అడుగమ్మా.

కనకదుర్గమ్మ : ఆయన ప్రొద్దునే వెళ్లాడు. యింకా యెవరి నడిగేది?

సీతాపతి తాతగారు : అక్కయ్య నడుగు ?

కనకమ్మగారు : యెవరి నడగడమెందుకులే? మీ పిల్లను మీరు తీసుకు వెళ్లండి. నీ పిల్లను నీ యిష్టం లేకుండా వారిని, వీరిని అడగేదేమిటి?

సీతాపతితాతగారు వినిపించుకోకుండా యేమీ మాట్లాడకుండా వెళ్లిపోతారు.

యింతలో అన్నపూర్ణమ్మగారు వస్తుంది. వెళ్లొస్తానమ్మా కనకం.

కనకం : నేను అమ్మాయి అనసూయ సంగతి అన్నయ్య నడిగితే నిన్ను అడగమన్నాడు. 4 రోజులు వుంచుకోమంటావా?

అన్నపూర్ణమ్మగారు : వాళ్ల అన్నయ్య పదహారు రోజుల పండుగ వస్తుందిగా?

కనకమ్మగారు : రెండు రోజులలో వాళ్ల మామయ్యో, బావో వస్తారుగా? అప్పుడు పంపిస్తా.

అన్నపూర్ణమ్మగారు : సరే దాని యిష్టమయితే వుంచుకో వాళ్ల తాతమ్మను వదిలిపెట్టి వుండాలిగా?

యింతలో బ్రహ్మాండం సుబ్బారావుగారు (అంటే నాగేశ్వరరావుగారి "నాన్నగారు" తండ్రి) వచ్చి వుండమ్మా రెండు రోజులుండు, నేను తీసుకెళ్లి పంపిస్తా.

యింతలో లోకనాధం వచ్చి - "వుండనసూయా వుండు, కలువపూలు కోసుకుందాం", చెరువుకెళ్లి.

సుబ్బారావుగారు : వుండమ్మా వుండు. యెక్కడయితే నీకేమి ? పాపం వీళ్లమ్మకు నేనంటే యెంతో ప్రేమ. ఎంతో మర్యాద, మన్నన. యింటికి కళే పోయింది. కళ అంటే ఆ అమ్మాయి అన్నట్లు వుండేది.

అన్నపూర్ణమ్మగారు : సరే వుంచుకోండి, రెండు రోజులు వుండి తీసుకురండి అని వెళ్లిపోతారు.

అక్కడ వున్నవారంతా కోడలిని అట్టే పెట్టుకున్నట్టున్నావే - అంటారు.

కనకమ్మగారు : తల్లిలేని పిల్ల నాతో కూడా కూడా తిరుగుతుంటుంది. నాలుగు రోజులు అట్టిపెట్టుకు పంపిద్దాం. ఆ దేశం తీసుకు వెళ్లలేం అని వుంచేసుకున్నాం? కోడలని కాదు.

సుబ్బారావుగారు : కోడలు అయినా కాకపోయినా మేన కోడలుగా. అయినా వారి స్థితికి మాకు యిస్తారా?

మన్నవ వెంకట సుబ్బమ్మగారు : (నాగేశ్వరరావుగారి మేనత్త) యేం అమ్మా మీ బావను చేసుకుంటావా?

అమ్మ యేమీ మాట్లాడదు.

బ్రం॥ శేషయ్యగారు (నాన్నగారి తాతగారు) : ఓహో మా మనుమరాలు వున్నదే. యిదే సమయం యిప్పుడే పెళ్లికూడ చేసేద్దామా?

బ్రం॥ రత్తమ్మగారు (నాన్నగారి నాయనమ్మ) : ఆఁ చేసుకుందురుగాని పాపం మన్నవగారి పిల్లలు తేరగా వచ్చారు. (అమ్మ, అమ్మ అత్తగారు, అమ్మ అత్తగారి అత్తగారు, ముగ్గురు మన్ననవారి ఆడపడుచు).

బ్రం॥ శేషయ్యగారు : మన్నవ వారంతా బ్రహ్మాండంలోకి రావలసిందే. (అందరూ పకపకా నవ్వుతారు).

అమ్మ మాత్రము తలపంచుకుని నుంచుంటుంది.

లోకనాధం : (నాన్నగారి తమ్ముడు ఒక లడ్డు తీసుకొచ్చి) అనసూయా! యిదిగో ఆడుకుందాం రా. చెరికాస్త తీసుకుందాం.

కనకమ్మగారు (అమ్మ) : యింతలో ఒక లడ్డు తెచ్చి అమ్మ చేతిలో పెడుతుంది. పెట్టి ఆడుకో పో లోకనాధం నీవు ఆడుకోండి అంటుంది.

అమ్మ, లోకనాధం కలసి చెరువుకట్ట దగ్గరకు వెళ్లి ఆడుకో బోతారు.

లోకనాధం : చెర్లో దిగుతా అనసూయా?

అమ్మ : నాకు చేతగాదు లోకం. నీవు దిగుతావా?

లోకనాథం : నేనూ దిగలేను.

అమ్మ : మరి పూలు యెట్లా వస్తయ్ మన యిద్దరి లడ్లు యెవరికైనా పెట్టి, తను దిగమని తెచ్చుకుందాం లోకం.

లోకనాథం : లడ్లెందుకు? మన జీగాడు తెచ్చి పెడతాడులే.

అమ్మ : మన జీతగాళ్లు లడ్లు తినే వుంటారు యింట్లో. తినని కొత్తవాళ్లకు యిచ్చి కోయించుకుందాం.

లోకనాథం : సరేలె. కాదులె అనసూయ చెరో అణా యిచ్చి కోయించుకుందాం. లడ్లెందుకులే.

అమ్మ : మనమిచ్చే అణాకు లడ్లు యివ్వరుగా. యివి మంచి లడ్లు వాళ్లు యెప్పుడూ తిని వుండరు. మనకు యింటిదగ్గర యిస్తారు.

లోకనాథం : యింతకూ యెవరిని పిలుద్దాం?

అమ్మ : యెవరు రావాలో వాళ్లే వస్తారు. మనం తొందరపడితే రారుగా? యింతలో యెవరో అడక్కుండానేకుర్రవాడొచ్చి తన సొంత నీళ్ల కోసరం చెర్లో దిగి అమ్మను లోకనాధానిని జూచి ముద్దొచ్చి చెరి నాలుగు పూలు కోసి యిస్తాడు. అమ్మ చేతిలో వున్న లడ్డు అతని చేతిలో పెడుతుంది.

అబ్బాయి : నాకు వొద్దులే అమ్మా, వుంచుకో అంటాడు.

అమ్మ : కాదులే నాయనా, తీసుకో.

అబ్బాయి వొద్దని చెప్పి వెళ్లిపోతాడు.

అమ్మ, లోకనాథం పువ్వులు తీసుకుని యింటికి వెళ్లి పోతారు. యింటికి వెళ్లగానె నాన్నగారి మేనత్తలు, పిన తండ్రులు అంతా యెదురుగుండా వచ్చి, "యెక్కడికెళ్లావమ్మా?" అంటారు.

అమ్మ : యిదిగో నా చేతిలో వున్న పూలు కోసుకొచ్చు కొందామని వెళ్లా.

సీతాపతి గారు : నాకు తెలియదు. చిదంబర్రావు గారిని అడుగు.

కనకమ్మ గారు : ఆయన పొద్దున్నే వెళ్లాడు. యింకా యెవరినడిగేది?

సీతాపతి గారు : అక్కయ్యనడుగు.

కనకమ్మ గారు : యెవరినడగటమెందుకులే. మీ పిల్లలను మీరు తీసుకెళ్లండి. నీ పిల్లను ఇష్టం లేకుండా వారిని వీరిని అడగటమేమిటి?

రాఘవరావు గారు : అమ్మా పెందలాడి స్నానం చేసి అన్నాలు తినండి నీవు లోకం. అమ్మ లోపలకు వెళ్లి "అత్తయ్యా నాకు ఆకలి కావటం లేదు నేను పెందలాడి పడుకుంటాను, యెక్కడ పడుకోమంటావు? "

కనకమ్మగారు : యెక్కడో పడకో, తరువాత నేను వొచ్చి దగ్గర పడుకోబెట్టుకుంటా.

అమ్మ పోయి యెక్కడో గొడ్ల చావిట్లో ఆవుల దగ్గరలో పడుకుంటుంది.యెవరూ చూడరు. అక్కడే తెల్లవార్లు పడు కుంటుంది. ఒక జీతగాడు మాత్రము జూచి తెల్ల వారు ఝాము యింట్లో పడుకోబెట్టి వెళతాడు. తెల్లవారి, "యీ అమ్మయి గొడ్ల చావిట్లో పడుకున్నదండీ" అని చెపుతాడు. యెవరూ దానిని ఆలకించరు. ప్రొద్దున్నే మొఖము కడుక్కుని వెళ్లి వాళ్ల అత్తయ్యకు కనపడుతుంది.

కనకమ్మ గారు : యెక్కడ పడుకున్నా అమ్మా తెల్లవార్లు యెంత వెతికినా కనపడలేదు?

అమ్మ : రాత్రి యెక్కడోక్కడ పడుకో నేను తీసుకొచ్చి పడుకోబెట్టు కుంటానంటె వెళ్లి గొడ్ల చావిట్లో పడుకోవాలనిపించి పడుకున్నా.

కన : సరే మొఖము కడుక్కున్నావా?

అమ్మ : కడుక్కున్నా.

కన : కొంచెం పెరుగేసి అన్నం పెడతా, రా అని కూర్చోబెట్టి అన్నం పెడుతుంది.

అమ్మ పెరుగు వేసుకుని అన్నం తింటుండగా యింట్లో వాళ్లు చూచి 'చుచావా! కోడలికి తెల్లవారకముందే పెరుగులు పోసి అన్నం పెడుతూంది. అందుకే అట్టే పెట్టుకుంది. తతిమ్మా పిల్లల్ని యిట్లా చూచిందీ?

రత్తమ్మ గారు : (కనకమ్మ బామ్మ గారి అత్తగారు) యెందుకు చూస్తుందిలే? కాబోయే కోడలు, మేనగోడలు.

అన్నపూర్ణమ్మ గారు : (నాన్నగారి మేనత్త) నిన్న లడ్లు కూడ పెట్టిందటే.

యివన్నీ అనుకోవటం అమ్మ వింటూనే వుంటుంది. విస్తట్లో అన్నం కదలదు. యిట్లా తినటం అలవాటు లేని కారణంచేత.

అమ్మ అందుకే అన్నం తినలేదని కూడా బామ్మ అనుకుంటుంది. 'తల్లి లేని పిల్లని తీసుకొచ్చి యెన్ని మాటలు అనిపిస్తున్నానమ్మా తిన్నది లేదు పెట్టింది లేదు. అమ్మా లేచి చేయి కడుక్కో' భర్తగారైన సుబ్బారావు గారి దగ్గరకు వెళ్లి "వాళ్ల అన్నయ్య

పదహారు రోజుల పండుగ మూడు రోజులలో వస్తుంది. ఒక చొక్కా, పరికిణీ కుట్టించి తీసుకెళ్లి పంపించి రండి వున్నంతవరకు చాల్లే.

సుబ్బారావు : యేం? యెవరన్నా యేమన్నా అనుకుంటున్నారా?

కనకమ్మ : యెవరూ యేమనుకోటంలా. అయినా మన హస్తంతో మనం పాడుచేసుకుని వచ్చి యిక్కడుంటే మనకేమి స్థానముంటుంది? యివన్నీ యెందుకు అనవసరం. వెళ్తానంటూంది. పంపిద్దాం మీరు వెళ్లినా సరే లేక అబ్బాయిచేత పంపినా సరే.

సుబ్బా : నేనే దిగిడ్చి వస్తానులే అబ్బాయి వచ్చినా, నేను కూడా వెళతాను.

బామ్మ : (లోపలకు వచ్చి) పరికిణీ అది మూటలో పెట్టుకో అమ్మాః యింతలో నాన్నగారితో) నాగూ! నీవు కూడా వెళతావా? బాపట్ల?

నాన్నగారు (నాగేశ్వరావు గారు) : స్కూలుకెళ్లి కనపడి రావాలమ్మా నేనూ వెళ్లి రావాలి.

బామ్మ : నాన్నగారు కూడా వస్తారు. అమ్మాయిని తీసుకుని జాగర్తగాచేర్చండి నాన్నా.

నాగేశ్వరరావు (నాన్నగారు) మొఖం కడుక్కుని లోపలకు వస్తూ గుడ్డలు మూట కట్టుకుంటున్న అమ్మను చూచి "నా చొక్కా లాగు కూడా నీ మూటలో వేయి అక్కడకు వెళ్లిన తర్వాత తీసుకుంటాను".

అమ్మ అన్నీ మూటలు కట్టి సవరిస్తుంది.

అందరూ మొఖాలు కడుక్కుని కాఫీలు తాగి బయలుదేరి నాన్నగారు, తాతగారు, అమ్మ అందరూ బాపట్ల వెళతారు.

11. జ్ఞాన దర్శనం

విచికిత్స :

బాపట్ల వూరు ముందుకు రాగానే బ్ర. వెంకటసుబ్బారావు తాతగారు "నీ పరికిణి చొక్కా యియ్యమ్మా నే బజారుకెళ్లి యింటికి వస్తాను. తరువాత మీరు యిద్దరూ యింటికి వెళ్లండమ్మా-(నాన్నగారితో) నాన్నా అమ్మాయిని జాగ్రత్తగా తీసుకెళ్లు".

అమ్మ, నాన్నగారు యింటికి వస్తారు. తాతగారు బజారుకు వెళతారు.

నాన్న గారు (నాగేశ్వరరావు), అమ్మ యింటికి రాగానే చిదంబర్రావు గారు యెదురుగా వచ్చి " మూట అది తీసుకురావలెనా, నీవు తీసుకు రాగూడదూ నాగూ!".

అమ్మ : యెవరి మూట వారు మొయ్యద్దూ తాతగారూ?

చిదంబర్రావు తాతగారు : ఆ గుడ్డలన్నీ నీ మూటేనా?

అమ్మ : ఒక జత బావవి కూడా వున్నై .

చిదంబర్రావు గారు : నీవి వేసుకునేవి కూడా అమ్మాయి చేతనే మోయిస్తున్నావా?

యింతలో పకపకా నవ్వుతూ బారతాంబ గారు వస్తుంది.

భారతి : ఓహో దంపత సమేతంగా వచ్చారే? యెవరి కోసం మోస్తుంది నాన్నా! అట్లా అంటారు. యిదే మొదలు మొయ్యటానికి మూలం.

చిదంబర్రావు గారు : అందరూ చేసుకునేవారే మోయటం లేదు దానికెందుకో అంటూ లోపలకు వెళతారు. అమ్మా, నాన్న, చిదంబర్రావు గారు యింట్లోకి వెళ్లగానే, యింట్లో వున్న బంధువులందరూ 'దంపతులు వచ్చారు, దంపతులు వచ్చారు' అని నవ్వుతారు.

వంటమనిషి : మీ యిద్దరేనా వచ్చింది. అప్పుడే ఒంటరిగా తీసుకొచ్చావేమయ్యా? పెళ్లిగూడా చేసుకునే వచ్చావా?

అమ్మ : చెంచమ్మ గారూ, మీరన్నమాటలో చాలా పొరపాటున్నదే. పెళ్లి కాలేదన్న అనుమానం దగ్గర పెట్టుకుని దంపతులనటం పొరపాటు కాదూ?

చెంచమ్మ : కాబోయే దంపతులన్నానమ్మా.

చిదంబర్రావు గారు అమ్మను తీసుకుని మేడమీదకు వెళతారు. "రేటూరులో యేం జరిగింది, యేమిట"ని సంగతులన్నీ అడుగుతారు.

అమ్మ : యేమీలేదు. వున్న కాసేపు ఆనందంగా వెళ్లిపోయింది. ముగ్గురం బ్రహ్మానందంగా కలిసొచ్చాం.

చిదంబర్రావు గారు : ముగ్గురెవరు?

అమ్మ : నేను, మామయ్య, బావ కలిసొచ్చాం.

చిదంబర్రావుగారు : సుబ్బారావు లోపలకు రాలేదేం?

అమ్మ : బజారుకెళ్లారు. నాకు చొక్కా పరికిణీ కొనుక్కురావటానికి.

చిదంబర్రావుగారు : రేపు పదహారు రోజుల పండుగ కాగానే మీనాన్నవాళ్లు మన్నవ వెళ్లాలనుకుంటున్నారు, నీవు కూడా వెళతావా?

అమ్మ : తీసుకెళతానంటే వెళతాను.

చిదంబర్రావుగారు : యెన్నాళ్లకొస్తావు?

అమ్మ : నాదేముంది? మీరు, నాన్న కలసి యెక్కడ వుంచితె అక్కడ వుంటా. యెప్పుడు రమ్మంటే అప్పుడు వస్తా.

చిదంబర్రావు గారు కోర్టుకు వెళ్లాలని కిందికి వస్తారు. యింతలో సుబ్బారావు గారు చొక్కా, పరికిణీ పట్టుకు వస్తారు.

సుబ్బారావు మేడమీదికి వచ్చి అమ్మ చేతిలో పెడతారు. "కట్టుకో అమ్మా" అంటారు.

అమ్మ చొక్కా పరికిణీ కట్టుకుని మేడమీద నుంచి క్రిందికి వస్తుంది. అందరూ పరికిణీ, చొక్కా చూచి మామగారు పెట్టిన గుడ్డలు కూడా కట్టుకుందని నవ్వుతారు. కళ్యాణమయిన పెళ్లికూతురులాగానే వుంది అనుకుంటారు. యీ అనుకునే మాటలు విని సుబ్బారావుగారు నిజంగా తన కోడలయినట్టే మురిసిపోతారు. కొడుకు

కోడలితో ప్రయాణము చేసానను కుంటారు. పైకి అనరుగాని వర్చస్సు అలా వుంటుంది. అందరూ భోజనాలు చేస్తారు.

సుబ్బారావుగారు : మధ్యాహ్నం నుంచి వెళ్లొస్తానంటారు.

అన్నపూర్ణమ్మగారు : పదహారు రోజుల పండుగ యెల్లుండేగా? యీ రెండు రోజులు వుండండి వెళుదురుగాని అంటారు.

సుబ్బారావు తాతగారు : నేను వున్నా, అబ్బాయి వెళ్లాలి. యీ పదహారు రోజులు పండుగ వరకైనా సంధ్య వార్చాలిగా?

అన్నపూర్ణమ్మగారు : అబ్బాయిని పంపి మీరు వుండండి.

సుబ్బారావుగారు సరేనని వుంటారు. మూడోరోజు పండుగ వస్తుంది. అమ్మకు - మామయ్యకు - కూర్చోబెట్టి హారతులు యిచ్చి, వేడుకలు చేసి వడుగు పెళ్లికొడుకు విస్తట్లో చెల్లెలు భోంచేయాలని, అమ్మ, రాఘవరావు మామయ్య యిద్దరూ కలసి భోంచేస్తారు. అమ్మకు, మామయ్యకు హారతి యిస్తారు. అమ్మ ఆ పళ్లెము పట్టుకుంటే మామయ్య పళ్లెములో డబ్బు వుంచుతారు. పదహారు రోజుల పండుగ ఆనందంగా జరిగిపోతుంది.

రెండు రోజులలో మన్నవ ప్రయాణము నిశ్చయించుకుంటారు.

సీతాపతి తాతగారు, మరిడమ్మ తాతమ్మను కూడ రమ్మని అడుగుతాను.

మరిడమ్మగారు : నీవు పెళ్లి చేసుకుంటే రావలసిందేకాని యెల్లకాలం నేను యీదలేను. రాలేను నాయనా.

సీతాపతి తాతగారు : నేను పెళ్లి చేసుకుంటాను అంటే నీకు ప్రస్తుతానికి రావటానికి వోపిక వుంటుందా. మాట తప్పని వాడినని మాట అంటే చాలనేగా నీ వుద్దేశం. అచ్చంగా నాకోసరమయితే యెవరూ అక్కర్లేదు. పిల్లలున్నారు. పిల్ల దిగులు పడుతుందని.

మరిడమ్మగారు : పిల్ల దిగులు కూడా ఒకనాటిది కాదుగా నాయనా?

అన్నపూర్ణమ్మగారు : అంత మూర్ఖమెందుకు. వొప్పుకో రాదుటరా నాయనా?

సీతాపతి : మీకేం చెపుతారు. రేపున్నాయి నా పాట్లు.

అన్నపూర్ణమ్మా : యెంత మంది చేసుకోలేదు, నీవేనా యేమిటి?

సీతాపతి : యెవరి మనసు వాళ్లదమ్మా. పెళ్లి చేసుకుని దానితో పడలేను. యీ అల్లరివాణ్ణి పెట్టుకుని, నోట్లో నాలుకలేని పిల్ల. పిల్లకు తిప్పలు వస్తయ్.

అన్నపూర్ణమ్మగారు : యెన్ని తిప్పలయినా యెన్నాళ్లు. ఆ పిల్ల బాధ్యత మేము తీసుకుంటాములె. మావుంటె అయిదారేళ్లు.

సీతాపతిగారు : కాదక్కయ్యా మన నాన్న పెళ్లిచేసుకోకుండా వుండి మరిడమ్మ గారిచేత మనందరికీ చేయించాడు కనుక పిల్లలకు యేబాధా లేకుండా చూచింది. నా ఒక్కడి సుఖం కోసం పెళ్లి చేసుకుంటే, రేపు యెన్ని బాధలు పడాలో దీర్ఘంగా ఆలోచించండి.

మరిడమ్మ గారు : యేమయినా సరే నేను రాలేను నాయనా!

చిదంబర్రావుగారు : సరే-యెక్కడోక్కడ మనం చూచి చేస్తే వాడు కాదంటాడటలే. బయలుదేరండి తొందరగా.

11 గంటలకల్లా భోంచేసుకుని తాతగారు, అమ్మ, మామయ్య, మన్నవ వెళతారు.

అమ్మ, వాళ్లు మన్నవ వెళ్లిన తరువాత ఆ రాత్రి భోజనాల సమస్య.

మంత్రిప్రగడ రాజమ్మగారు ఆ రాత్రి భోజనానికి పిలుస్తుంది.

యెదురుగుండా వున్న యిల్లు. అమ్మమ్మ స్నేహితురాలు. ఓ రెండు రోజులు అక్కడ తింటారు. తరువాత పూటకూళ్ల యింట్లో యేర్పాటు చేసుకుంటారు పులిపాక మాచమ్మ గారింట్లో. ఆమె చాల ఆదరణతో చూచింది.

యిట్లా వాళ్ల యింటికి వెళ్లి భోంచేసి వచ్చే రోజుల్లోనె అమ్మకు తడపర పోస్తుంది.

పత్యం పెట్టే సమయానికి బాపట్ల నుంచి తాతమ్మ గారు వస్తుంది.

అమ్మకు హొటలు నుంచి కాకుండా ప్రత్యేకం వంటచేసి పెడుతుంది.క్రమంగా అందరికి వంటచేసి పెట్టే యేర్పాటు అవుతుంది.

మరిడమ్మ తాతమ్మ గారు అమ్మను పొత్తిళ్లల్లో పిల్లల్లే జాగర్తగా చూచి, ఒక్క పదిహేను రోజులు చేసి 'నీ పిల్లకు వోపిక వచ్చిన తరువాత నేను వెళ్లిపోతాను నాయనా' అంటుంది.

సీతాపతి తాతగారు : పదిహేను రోజులయినాక మాటగా చూద్దాములే.

అమ్మకు యీతడపర్లోనె చెక్కులన్నీ కురుపులుగా మారి పుళ్లవుతాయి.

మరిడమ్మ గారు వాటినన్నిటిని యెప్పుడూ వేప ఆకు రసంతో, నూనెతో తడుపుతూ, ఆమె కళ్ల నీళ్లతో తడుస్తూ సేవ చేస్తుంది."నాయనా సీతాపతీ రోజూ ఒక కానీ పెరుగు తెప్పించు అమ్మాయికి".

సీతాపతి తాతగారు అట్లాగె దొప్పలపూడి కబురుచేసి కుమ్మరి కనకమ్మ దగ్గర రోజూ ఒక అణా పెరుగు తెప్పించేవారు.క్రమంగా తడపర తగ్గి ఆరోగ్యం వచ్చింది అమ్మకు కోమటి హనుమంతును పిలిపించి "రోజూ సాయంత్రం అమ్మాయికి ఒక అణా కారప్పూస ఒక కడ్డీ యిచ్చి పో నాయనా" అని చెబుతారు.

హనుమంతు అదే విధంగా రోజూ పడమట బజారు నుంచి యీ తూర్పు బజారుకు వచ్చి అది ఆరాధనగా పెట్టుకుని యిచ్చిపోతూ వుండేవాడు.

అమ్మ అవి తీసుకుని మురుగు కాలవలో వున్న బల్లకట్టుమీదకు షికారుకు తీసుకెళ్లేవారు తాతగారు రోజూ. ఆ బల్లకట్టుమీద కూర్చుని -అమ్మ కాల్వ అవతలనున్న మాలపల్లి మాలపిల్లల నందరిని పోగుజేసి యీ తీసుకెళ్లిన కారప్పూస అందరికి పెడుతూ వుండేది.

కొంతకాలమయిన తరువాత అమ్మ- బల్లకట్టు మీద మానుకుని దేవస్థానానికి వెళుతుండేది.

అమ్మ కారప్పూస దేవాలయంలో నివేదన చేసి అర్చకుడికి కూడ పెడుతుండేది.

అతను నివేదన చేసిందని తినేవాడు కాదు యేదో కారప్పూస పెట్టిందని తినేవాడు. నివేదన అర్థంచేసుకుండేది కాదు గనుక ఆయన అర్చకుడయినా తన జీతం కోసం విగ్రహాల ముందు పెట్టటం తప్ప నివేదనంటేయేమిటో తెలియదుగా.

ఒకరోజు తాతగారు బాపట్ల వెళతారు. అమ్మ దేవస్థానములో పడుకుంటుంది. అర్చకుడు తన చీట్లపేక తొందరలో తలుపుకూడ వేయకుండా వెళతాడు. అమ్మ మెల్లగా గర్భగుడికి వెళ్లి తలుపులు వేసుకుంటుంది.

అలంకారము అంతా చూచి క్రమంగా ఒక్కొక్కటే తీసి వేస్తుంది విగ్రహానిది.అమ్మవారు- అంటే యెవరు అని తేల్చుకోటానికి.

ముందు మెళ్లో వున్న పూలదండలు తీసివేస్తుంది.తరువాత సొమ్ములన్నీ ఒక్కొక్కటే వలుస్తుంది.తరువాత చీరలు తీసేస్తుంది. తీసేసి బొట్లు చెరిపి వొట్టి విగ్రహాన్ని చేసి అక్కడ పెట్టి - వెండి కళ్లు చేయిస్తారు అమ్మవారికి - అవికూడ వూడబీకుతుంది అమ్మ. ఒక కొండరాయిని తెచ్చి దగ్గర పెట్టి వులులు తీసుకుని ఆ రాయిమీద ఆ బొమ్మను చూస్తూ అమ్మ గీస్తుంది.యివన్నీ తీసివేసినా ఆ రాయి అమ్మవారనే అనిపిస్తున్నది గదా.యిప్పుడు యీ రాయి అమ్మవారా?ఆ అలంకారము అమ్మవారా? అని అనుకుంటూ అమ్మ గీచిన రాయి చూచుకుని యిదీ అమ్మవారేగా

- అమ్మ చేతిలే వున్న వులులను, యినుప సుత్తి కూడా అక్కడే పెట్టి విడి కొండ రాయిని తెచ్చిపెట్టి అమ్మ మెడలో వున్న హారాల దగ్గర నుంచి 'యేది అమ్మవార'ని ఆలోచించి యివన్నీ అమ్మవారేగా! దారపుండ కత్తెర కూడ. పూలదండలు తెంచి చూచి అందులో వున్న దారం, నక్కి,అన్నీ అక్కడ పెట్టి అన్నింటిచుట్టూ తిరిగి ప్రదక్షిణం చేసి ప్రతి వస్తువుకు నమస్కారం చేసి, తను నివేదన చేసిన కారప్పూసను కూడ గుర్తు తెచ్చుకుని. శనగపిండి, నీళ్లూ, వుప్పూ, కారం, పళ్లెం, భాండి నూనే, చేసేవాడు, అమ్మేవాడు, కొనేవాడు, ఆరగించేవాడు, అన్నీ, ఆ అమ్మవారే (రాజరాజేశ్వరే) అనిపిస్తుంది. యీ వస్తువులన్నీ ఆ అమ్మవారి ఆకృతి ధరించటాని కాధారమే గదా యేదవును - యేదికాదు- అమ్మవారు. యీ వస్తువులున్నచోటల్లా అమ్మవారేగా - **"ఆ స్థితే భిన్నత్వము లేని మనస్తత్వము"**. ఆ రోజున-ఆ గుళ్లో ఆ సమయమున అనిపించింది ఆమాట. అమ్మ మళ్లీ యెక్కడ వస్తువులు అక్కడ సర్ది తెల్లవారేటప్పటికి తలుపులు అర్చకులెట్లా వేస్తారో అట్లావేసి యింటికి వచ్చేస్తుంది. తెల్లవారుఝాము నాలుగు ముప్పావు అవుతుంది. యింటికి వచ్చి అమ్మ మామూలుగా మొఖము కడుక్కుంటుంది. అమ్మ లోగడ రాజమ్మ గారింటికి వస్తూ పోతూ వున్న కారణంచేత అక్కడ వున్నదేమొ ననుకుని తాతమ్మగారు అమ్మను గురించి ఆరా తీసుకోరు.

సీతాపతి తాతగారు మరునాడు మధ్యాహ్నము బాపట్ల నుంచి తిరిగి వస్తారు.

అమ్మ మేనత్త వెంకటసుబ్బమ్మగారు సుస్తీగా వుండి గుంటూరు కాన్పుకు వెళతారు.

సీతాపతి తాతగారు మరిడమ్మ తాతమ్మతో వెంకటసుబ్బమమ్మ గార్కి సుస్తీగా వుందని గుంటూరు తీసుకు వెళ్లారని చెపుతారు.పెంచిన మమకారము చేత మరిడమ్మ గారు ఆ రోజంతా బాధపడి అన్నం తినకుండా యేడుస్తుంది

సీతాపతి తాతగారు : యెందుకు బాధపడతా అత్తయ్యా, నీవు వెళ్లిరా.

మరిడమ్మ : యిప్పుడు యెక్కడికి వెళ్లేది నాయనా. వెళ్లి చేసేదేముంది.

సీతాపతి తాతగారు : కాదులే నీవు వెళ్లు నేను యెవరినైనా తీసుకొచ్చి వండించుకు తింటా.

మరిడమ్మ గారు : యిప్పుడెవరు వస్తారు నాయనా వెళ్తాలె. యిప్పుడు తొందరేముంది.

సీతాపతి తాతగారు : కాదు తప్పకుండా వెళ్లి రావాలి. తరువాత యెందుకు? నేను కాకుమాను వెళ్లి మన్నవ భీమయ్య గారి భార్య రంగమ్మ గార్ని తీసుకొస్తాను.

పిల్లని తీసుకెళితే తీసుకు వెళుదువుగాని. లేకుంటే వుంటుంది. ఆమె వండి పెడుతుందిగా!

మరిడమ్మ గారు : నేనె వెళుతుంటె పిల్ల నన్ను వదిలిపెట్టి వుంటుంది?

సీతాపతి తాతగారు : తెనాలిలో వుండదు గాని యెక్కడయినా వుంటుంది.

మరిడమ్మ గారు : యెందుకు అవకాశమున్నప్పుడు వదిలిపెట్టి పోవటం. దాన్ని వదిలిపెట్టి నేవుండలేను, తీసుకు పోతాను. సరే నీవు కాకుమాను పోయి ఆమెను తీసుకురా. తరువాత వెళతాం.

సీతాపతి తాతగారు : సరే యెల్లుండి వెళతాను.

వెళ్లి ఆవెను తీసుకొచ్చి యింట్లోపెట్టి, అమ్మ, తాతమ్మగారు ప్రయాణమయ్యేసరికి పది రోజులు పడుతుంది.

రామునిగా అమ్మ - గుండేలురావుగారి అనుభూతి :

11వ రోజున అమ్మ, తాతమ్మ తెల్లవారు ఝామున బయలుదేరి రెండెద్దుల బండి కట్టుకుని తాటిపర్తి దగ్గరకు వెళతారు. అక్కడకు వెళ్లేసరికి తెల్లవారుతుంది. అక్కడికి ఒక ఘోషాయి ఆ వూళ్లోకి పోతూ పోతూ అమ్మ వాళ్లను సమీపించి తెలియకుండానె అమ్మకు నమస్కారము జేసి వెళ్లిపోలేక బయలుదేరుతూ వుంటాడు.

అమ్మ : నీదేవూరబ్బాయి?

ఘోషాయి మాట్లాడకుండా నవ్వుతూ వెళతాడు.అమ్మను తిరిగి తిరిగి చూస్తాడు.

తాతమ్మ గారు : యెవరు ఆ అబ్బాయి, తిరిగి తిరిగి చూస్తున్నాడు.యెరిగివున్న వాడల్లె.

అమ్మ : యెవరో నేను యిదే చూట్టం.

తాతమ్మ గారు : ఘోషాయి అయింది, స్వాముల వారయింది తెలియకుండా వున్నాడె.

అమ్మ : ఘోషాయికి స్వాముల వారికి భేదం తెలిస్తేగా అర్థం కావటానికి, గృహస్థుకు, స్వాములవారికి తేడా యేమిటి?

తాతమ్మ గారు : గృహస్థుకు పెళ్లాము, పిల్లలు, సంసారం. మొగవాడే కాదు ఆడదానికైనా అంతే పెనిమిటి, పిల్లలు.

అమ్మ : స్వాముల వారంటే యేమిటి?

తాతమ్మ : అదే సన్యాసాశ్రమము. సన్యాసాశ్రమమంటే గృహస్థుకు వున్న లక్షణాలు లేకుండా వుండటమే.

అమ్మ : కనపడేట్టుగానా?

తాతమ్మ : కనపడకుండా అసలు యెట్లా వుంటారు వుంటే?

అమ్మ : నేను నీ దగ్గర వున్నాననుకో, నీతో యేదో మాట్లాడుతున్నాను, మనసు యెక్కడో పనిచేస్తున్నది. యేమో తినాలనిపిస్తున్నది. యిక్కడ లేవుగా, మాను కున్నాను. మనసులో తినాలని వుండి పైకి తినకపోయినా అది తిన్నట్టు కాదా? తిన్నట్లంటె నోటికి, పొట్టకు కాకపోవచ్చు. మానసికంగా భావమొచ్చింది.

తాతమ్మ : అట్లా వచ్చేవాడు ఆ గుడ్డ కట్టుకోడు. గట్టివాడే కట్టుకుంటాడు.

అమ్మ : నాకు బయలుదేరేటప్పుడు అనిపించలా అన్నం తినాలని యిప్పుడు అనిపిస్తున్నది.అట్లాగే యెవరికయినా.

తాతమ్మ : అయినా నీకెందుకు యీ ఆలోచనలు? కారు యింకా రాలేదె.

అమ్మ : అదే మానవుడి అక్షణం. తనకు తగినవి, చేయకలిగినవే- అనగలిగినవే- వివకలిగినవే తలంపుకు రావు. యేవేవొ కలుగుతుంటవి "ప్రేరణ". తనకు యేది అవసరమో అదే ప్రేరణ కలిగితే బాగుండును. ఆ అవసరానికి యేది అవసరమో యిదంతా.

తాతమ్మ : యివాళ నీ నోటివెంట అన్నీ చాలా పెద్ద పెద్ద మాటలొస్తున్నయ్యే.

అమ్మ : యింతకూ ఆ పొయ్యే ఆయన యెవరో సన్యాసా? గృహస్థా?

తాతమ్మ : అవి రెండూ కాదు ఘోషాయి. అది ఒక తెగ.

అమ్మ : వాళ్ల లక్షణాలేమిటి?

తాతమ్మ : సన్యాసులలో ఒకప్పుడు దెబ్బతిని పెళ్లి చేసుకుని పిల్లలు, భార్యా అందరూ వుంటారు.

అమ్మ : అంటె వాళ్లు గృహస్థ స్వాములవార్లా.

తాతమ్మ :నీ మొఖం గృహస్థస్వాములవారేంటి?

అమ్మ : సంకల్పం కలిగేవాడు అసలు ఆ గుడ్డే కట్టుకోడంటివే యిందాక.

తాతమ్మ : (పకపకా నవ్వి) ఆ తెగలు చెప్పాను.

అమ్మ : తెగలు యేర్పడ్డది నడిచేవాడుంటేనేగా? యింతకు అసలు అతను యెవరు అక్కడే నుంచుని తిరిగి తిరిగి చూస్తున్నాడు.

తాతమ్మ :యెవరో నాకు తెలియదు.

(ఒకప్పుడు బాపట్లలో అమ్మతో మాట్లాడిన ముగ్గురు పోలీసులలో ఒకరు అంకదాసు) యింతలో కారు వస్తుంది.అతను మళ్లా అమ్మతో కలుసుకోవాలని వెనక్కు తిరిగి చూస్తూ వుంటాడు.

కారు రాగానే కలుసుకోకుండానె అమ్మ, తాతమ్మ కారు ఎక్కుతారు. పది నిమిషాలు ఆగుతుంది కారు. అతను యిటే చూస్తూవుంటె, "ఘోషయిల్లో కూడా పెద్దవాళ్లు వుంటూ వుంటారు. అతను యేదో ఆ రకానికి చెందినవాడల్లే వుంది". అని తాతమ్మ అంటుంది.

అమ్మ (తల వూపుతూ) "నాకేమి తెలుసు చిన్న పిల్లకు?" అంటుంది.

తాతమ్మ : అయినా యీ ఆలోచనలు నీకెందుకొచ్చినయ్యమ్మా?

అమ్మ: నీ దగ్గర వున్నప్పుడు నీదగ్గర పెరిగేటప్పుడు అటువంటివే వస్తుంటయ్ పెద్ద పెద్దవి.

తాతమ్మ :నా దగ్గర యెంతమంది పెరగలేదు. ఆ ప్రహ్లాదుడు, ధృవుడల్లే అవుతావేమొలె.

అమ్మ : వాళ్లు అయిదోయేటనే గొప్ప స్థితిలో వున్నారు. నాకు మల్లె అనుమానాల్తో యిటువంటి అనుమానాల్తో అందరిని అడుగుతున్నారా? నాకు 7 సంవత్సరాలు వచ్చినాయి.

తాతమ్మ :అవుననుకో! ఒక సంవత్సరానికి, రెండు సంవత్సరాలకు కాదు.స్థితికి చెప్పాను. కారు పోతూ వుంటుంది.

ఘోషాయి అడుక్కోటానికి వచ్చినవాడు కాదు, అమ్మతో మాట్లాడాలని వచ్చినవాడు గనుక అవకాశము దొరకక తిరిగి వెళ్లి పోతాడు. వేషం యిందుకొరకు వేసుకున్నది మాత్రము కాదు. అతను ఘోషాయిల్లోనే కలిశాడు.

అమ్మ - తాతమ్మ - మధ్యలో మనిషి యెక్కుతారు. అందుచేత మాట్లాడకుండా కూర్చున్నా తాతమ్మ అమ్మ అన్న మాటలు ఆలోచిస్తూనే వుంటుంది. బస్సు స్టాండు దగ్గర నుంచి గుర్రపు బండి చేసుకుని బ్రాడీపేట మూడో లైనులో చింతపల్లి రామచంద్రరావుగారి యింటిదగ్గరకు వెళతారు. ఆ యింట్లో రామచంద్రరావు గారి

తమ్ముడయిన గుండేలురావు అనే ఆయన పక్షవాతంతో 20 సంవత్సరాల నుంచి బాధపడుతూ వుంటారు. ఆయనకు భార్యా పిల్లలు లేరు. తమ్ముడు భార్యా వాళ్లే చూస్తూ వుంటారు. తమ్ముడికి రెండో వివాహం కావటంచేత ఆయన్ను (రామచంద్రరావుగారు) చూట్టమే అంతంత మాత్రంగా వుంది. ఆమె పేరు గౌరమ్మ. లక్షణాన్నిబట్టి గయ్యాళి గౌరమ్మ అంటారు.అమ్మ వాకిట్లో బండి దిగి వెళ్లటమే సరాసరి గుండేలురావు గారి మంచం దగ్గరకు వెళుతుంది.అమ్మ, తాతమ్మ పోతూ నారింజ పళ్లు తీసుకు వెళతారు.అమ్మ అందులో ఒక పండు తీసి గుండేలురావు మాత్రము యిస్తుంది.చేతికి యిస్తే వల్చుకోలేనంటాడు. అమ్మ వల్చి నోట్లో పెడుతుంది. ఒంటేలుకు పోసిన గుడ్డలూ అవీ తీసి మంచి గుడ్డలు వేసి పడుకోబెడుతుంది అమ్మ. గుండేలురావు గారు మానసికంగా భక్త తుకారం లాంటివాడు.

ఆయన (గుండేలురావు గారు) తన భక్తి ఫలించింది, రాముడు యీ రూపంగా వచ్చి తనను రక్షిస్తున్నాడనుకుంటాడు. బహుశా వ్యాధి కూడా తగ్గవచ్చుననుకుని పైకి "నా బాధ నివారణ చేయటానికి వచ్చావా నాయనా రామచంద్రా?" అని నంగిమాటలతో అంటుంటాడు. యీ మాటలు విని తన అన్న అయిన రామచంద్రరావు గారు తనను పిలిచాడని వస్తాడు. "పిలిచావా?" అంటాడు.

గుండేలురావు : పిలువలేదు నాయనా, వూరికే అనుకున్నాను రామచంద్రా అని.

రామచంద్రరావు : యీ అమ్మాయి యెవరు?

గుండేలురావు : యెవరో నాకు తెలియదు. అమ్మై ఆదరిస్తోంది. రాముడై రక్షిస్తుందల్లే వుంది అని నంగి మాటల్తో అంటారు.

రామచంద్రరావు గారు : అసలు యీ అమ్మాయి యెవరు?

అమ్మ అందుకుని "మీ పక్క భాగంలో వున్న శేషగిరిరావు గారి బావమరిది కూతుర్ని".

రామచంద్రరావు గారు : యెప్పుడొచ్చావు?

అమ్మ : యిప్పుడే సరాసరి దొడ్లోకొచ్చాను కాళ్లు కడుకున్నా యింతలో వీరు కనపడ్డారు. యిక్కడికొచ్చా.

రామచంద్రరావు గారు : ఆ గుర్రపు బండి దిగి ముసలమ్మ గారూ నువ్వూనా వచ్చిందిప్పుడు.ఆ శేషగిరిరావు గారు మీకు యేమవుతారు?

అమ్మ : శేషగిరిరావు గారి భార్య నాకు మేనత్త, ఆ ముసలమ్మ గారికి మేనకోడలు.

రామచంద్రరావు గారు : ఓహో అట్లాగా! శేషగిరిరావు గారి చెల్లెలు నా మొదటి భార్య. మనమంతా బంధువులమే. నీవు పెద్ద బావమర్ది గారి కూతురువా? అంటేసీతాపతి గారి కుమార్తె వన్నమాట.

గుండేలురావు గారికి బాగా హిందీ వచ్చు. వారు బొంబాయిలో కొంతకాలం వుద్యోగం చేసి వచ్చారు. ఆయన పుట్టు బ్రహ్మచారి. తను వుద్యోగం చేసిన డబ్బు దగ్గర పెట్టుకుని రోజుకు ఆరు అణాల చొప్పున దానం చేసేవారు. అమ్మను "భోంచేసి రామ్మా" అంటారు.

అమ్మ యింట్లోకి వెళ్లి 'నాకు ఆకలిగా లేదు' అనిచెప్పి ఒక నారింజకాయ తెద్దామని వెళతుంది.

అమ్మ మేనత్త సుబ్బమ్మ గారు : వూళ్లోకొచ్చి యింతసేపయితే యెక్కడున్నా?

అమ్మ : గుండేలురావు గారి దగ్గరున్నా

సుబ్బమ్మ గారు : సుందరి, ఆదిలక్ష్మి బడినుంచి వచ్చి నీవు వచ్చావంటే అటు యెటో వెళ్లారు.

యిట్లా అనుకుంటూ వుండగానె సుందరి, ఆదిలక్ష్మి వస్తారు. 'యిందాకటి నుంచి యెక్కడికిపోయినావ'ని అమ్మ నడుగుతారు.

అమ్మ : గుండేలు రావు గారి దగ్గర కూర్చున్నా.

సుందరి : ఎబ్బే, ఆయన దగ్గర వాసన. అన్నీ మంచంలోనే. ఆయన దగ్గరకెందుకు వెళ్లా?

అమ్మ : నాకు ఆయన దగ్గరే కూర్చుందామనిపిస్తోంది.

సుందరి : అయితే నువుపో, మేం రాంలే, మేము ఆడు కుంటాములె.

అమ్మ : నాకు ఆకలిగా లేదు. నన్ను వెతకవద్దు.నేను గుండేలురావు గారి దగ్గరేవుంటా. నాకు యెప్పుడు ఆకలయితే అప్పుడు వస్తానని అత్తయ్యతో, తాతమ్మతో చెప్పి గుండేలురావు దగ్గరకు వెళుతుంది.

అమ్మ అక్కడకు వెళ్లిన తరువాత 15 రోజులు యెక్కువ కాలం గుండేలురావు గారి దగ్గరే కాలం గడుపుతుంది.

17వ రోజున ఆయన చచ్చిపోతారు. అమ్మ సన్నిధిలోనే వుంటుంది.

యీ పదిహేను రోజులు వారు చాలా హాయిగా, ఆనందంగా కాలం గడుపుతారు. పోయే సమయందాకా కూడా యే ఒడిదుడుకులు లేకుండా ప్రశాంతంగా వుంటారు. అమ్మ కనపడ్డ నాటినుంచి గుండేలురావుగారు తనలో నుంచి అమ్మలోకి యేదో చేరుతున్నట్టు అమ్మలో నుంచి దివ్య శక్తి తనలోకి వస్తున్నట్టు భావిస్తారు. పోయే సమయంలో అన్నను పిలిచి అమ్మను, అన్నను దగ్గరకు రమ్మని అమ్మ రెండు చేతులు తన మొఖము మీద పెట్టుకొని అన్నగారి చెయ్యి చేతిలో పెట్టుకుని, "నేను యీ అమ్మలో కలిసిపోతున్న. వచ్చినప్పటినుండి క్రమేపి కలుపుకుంటున్నది. నేనేదో అంటున్నా ననుకోవద్దు. సత్యం, అమ్మ సామాన్యురాలు కాదు. అసాధారణం, సాధారణమైన తత్వంగా వచింది.బంధువులెవరూ అర్థం చేసుకోలేదనుకుంటాను. అర్థం చేసుకోకపోతే మాల్లె. వ్యర్థురాలిగా కూడ చూడొచ్చు యిటువంటి వాళ్ల స్థితి యిట్లాగే వుంటుంది. నీవు యీ అమ్మను నమ్ముకో, వాళ్లు అంతా నమ్మినా నమ్మకపోయినా, నేను యిన్నేళ్ల నుంచి రామచంద్ర మూర్తిని నమ్ముకున్నందుకు యీ రూపంగా వచ్చాడు.అమ్మ యింకా నన్ను కొంతకాలం వుంచదల్చుకొంటే అమ్మను అందరకు అర్థమయ్యే టట్టు చెప్పి పోతాను.యీ పది పదిహేను రోజుల నుంచి అన్నానికి వేళకు పోకపోతే పిల్చిన వాళ్లుకూడా లేరు, తింటున్నట్టు కూడా లేదు.అక్కడ యెవరున్నారు.ముసలమ్మ గారు బంధువుల యిండ్లకు తిరుగుతున్నది. సుబ్బమ్మ గారు సుస్తీగా వుంది వంటమనిషేగా".

రామచంద్రరావు గారు : పోనీ నీకు తెచ్చే అన్నములో తినమన లేకపోయినావా?

గుండేలురావు : నాకు యెవరో ఆ పనిమనిషి తెస్తుంది.

యింతలో గుండేలురావు గారికి అన్నం వస్తుంది.

అమ్మ : అన్నం నేను కలిపి పెట్టనా నాయనా?

రామచంద్రరావు : చిన్నపిల్లవు నీవెందుకులే అమ్మా అంటారు.

గుండేలురావు గారు "అట్లా అనవద్దు. ఒక మెతుకు పెట్టనియ్యి.నీవు మాత్రం యెవరు నమ్మినా యెవరు నమ్మకపోయినా, అమ్మకు నీ మనస్సాక్షిగా బయటికి యెవరికి చెప్పకు. నీ జీవితమున్నంత వరకూ. అమ్మ పాదాలను నమ్ముకో నేనుయేదో అన్నాను అనుకోవద్దు. అనుభవంతో చెపుతున్నా. 'చిన్నపిల్ల యేదో పిచ్చివాడు చెపుతున్నాడులె' అనుకోవద్దు. బ్రతికి వుంటే కొంతకాలానికి నీవే వింటావు. అటువంటి అనుభవాన్ని అనుభవించాను. బహుశా నాకు కాలం కూడా తీరిపోయిందనుకుంటా.

అందుకే అమ్మ వచ్చింది.అమ్మని గురించి యింకా చెప్పాలనిపిస్తున్నది కాని మాట రావటంలా. నీవు బయటకు చెప్పక్కర్లా. బయటకు వచ్చేనాడు వస్తుంది. యెవడికి మంచి తరుణం వస్తే వాడు నమ్ముతాడు". యీమధ్య మాట్లాడే సమయంలోనె అమ్మ కొంచెం అన్నం కలిపి నోట్లో వేస్తుంది. తినలేక మింగుతాడు. "మంచితరుణం వచ్చినవారు నమ్ముతారు". అని కన్నుమూస్తాడు. అమ్మలో కలుస్తాడు. 20యేండ్ల నుంచి బాధలో వున్న రామచంద్రరావు గారు అన్నగారి కొసం పెద్దగా యేడుస్తాడు. అందరూ యిరుగూ, పొరుగూ, పరుగెత్తుకొచ్చి. "యేం యెక్కువయిందా" అంటారు.

అమ్మ : యేమీ లేదు సమయమొచ్చింది.

యింట్లో వాళ్లంతా 'పాపం వచ్చినప్పటనుంచి యీ అమ్మాయి ఇక్కడే కూర్చుంటోంది'.

అందులో ఒకరు : ఆ అమ్మాయి వచ్చిన వేళా విశేషమేమిటో ఆయన బాధ తొందరగా తీరింది. నేను రోజూ బావిదగ్గర కొచ్చి నప్పుడల్లా యీ అమ్మాయి ఇక్కడే కూర్చుని వుండేది.

తతిమ్మా కర్మకాండలన్నీ జరిగిపోతాయి. గుండేలురావు గారు పోయినా రామచంద్రరావు గారు అమ్మమీద అమిత ప్రేమతో, అభిమానంతోనే వుంటున్నారు.

యదార్థ స్థితి :

ఆయన పోయిన కొద్ది రోజుల నుంచి అమ్మ రోజూ బంధువుల యిళ్లకు వెళ్లటం ప్రారంభిస్తుంది.ఒక రోజు అకస్మాత్తుగా కళ్యాణానంద భారతి ఆశ్రమం మీదుగా బంధువుల యిళ్లకు పోతూ వుండగా ఆశ్రమంలో నుంచి చదువు వినపడుతుంది.ఆరోజే అక్కడ ఆమె వింటుంది. ఆరోజు నుంచి ప్రతిరోజూ సాయంకాలం నాలుగు గంటలకు ఆశ్రమానికి వెళుతూ వుండేది అమ్మ.

తాతమ్మ గారు యింతకుముందే ఒకరోజు వెళ్లి వచ్చింది. యింతకు [illegible] ఆమెకు వారు తెలుసు. బంధువుల యిళ్ళకు వెళ్లివచ్చినప్పుడే వారిని కూడ చూ[illegible]. సుబ్బమ్మ గారికి జబ్బు యెక్కువ కావటంతో ఆమెను కని పెట్టుకుని వుండవలసి వచ్చింది.

అమ్మ నెల రోజులు ప్రతిరోజూ కళ్యాణానంద భారతి ఆశ్రమానికెళ్లటం. తరువాత మూడు రోజుల సంభాషణ.

అమ్మ వయస్సు యేడవ సంవత్సరము.

అమ్మ-కళ్యాణానంద భారతి సంభాషణ

30 రోజులు గడచిన తరువాత 1వ రోజున శ్రీ కళ్యాణానంద భారతి స్వామి అమ్మను దగ్గరకు పిలిచి

కళ్యాణానంద : అమ్మా, నీవెవరు?

అమ్మ : నేను యెవరో నాకు తెలియకనే తెలుసుకుందామని వచ్చా.

కళ్యాణాంద : మీదే కులమూ.

అమ్మ : శుక్ల శోణితాల కేదో అది.

కళ్యాణానంద : అయితే నీవు నాదగ్గర వుంటావా అమ్మా?

అమ్మ : మీరు యెవరో స్వాములవారు. మావూరు, మానాన్న, మా తాతమ్మ నాకు వున్నారు. వాళ్లను వదిలిపెట్టి వుండలేను. వాళ్ల గుర్తు లేనప్పుడు వస్తా. వాళ్ల గుర్తు లేనప్పుడు మీ దగ్గరకు వచ్చే పనీ లేదు.

కళ్యాణానంద : ఇందాక నేను యెవరో తెలుసు కుందామని వచ్చానంటివే

అమ్మ : అంటే -దానికి మంత్రమే కావలెనా?

కళ్యాణానంద : కావద్దూ మరి.

అమ్మ : అసలు మంత్రమంటే యేమిటి?

కళ్యాణానంద : కొన్ని పవరు గల అక్షరాలు కలిపి కొన్ని వాక్యాలు చేసి వాటికి కొంత శక్తి యిచ్చి అది మా బోటివారు రహస్యంగా మీకు చెప్పేది మంత్రము.

అమ్మ : అక్షరములలో యే యే అక్షరములు పవరు గలవి.

కళ్యాణానంద : అక్షరములకు శక్తి మేము యిస్తాము.

అమ్మ : ఇందాక మీరు పవరు గల అక్షరములంటిరే. మీకే యిచ్చే శక్తి వున్నప్పుడు, గడ్డిపోచకు కూడా యివ్వవచ్చు.

కళ్యాణానంద : ఇవన్నీ నీకెందుకమ్మా, చిన్నపిల్లవు.నీవు చెప్పించుకో

అమ్మ : చెప్పేది వింటా. చెప్పించుకోలేను. చెప్పించుకోవట మంటే మీరన్నదల్లా అనాలి. చెప్పేది వింటా.

కళ్యాణానంద స్వామి మౌనముగా కూర్చుని కొంతసేపటికి స్నానానికి లేచి, "ఇంక నీవు వెళ్లమ్మా" అంటారు.

అమ్మ వెళ్లిపోతుంది.

మరుసటి రోజు.

మరుసటి రోజు అమ్మ శ్రీ కళ్యాణానంద భారతీ స్వామి దర్శనార్థమై వెళుతుంది. గులాబి పుష్పములు, సంపెంగ పువ్వులు తీసుకుని వెళ్లుచుండగా, దారిలో సైడు కాలువలు కడుగుతున్నారు. చేతిలో పుష్పములు వున్నను దగ్గర వున్న పుష్పముల సువాసన నశించి, దూరాన వున్న దుర్వాసన వచ్చెను. అని యీ రెండూ ఆలోచించుచూ స్వామి దగ్గరకు చేరుసరికి అందరూ అప్పుడే ప్రసాదములూ అవీ తీసుకుని బయటకు వస్తారు.

అందరు ఒకరు, యే అమ్మాయి "ఫో" "ఫో" ఇక్కడ యేమి లేదిప్పుడు.

అమ్మ : లేని దాని కొరకు రాలేదు. వున్న దాని కొరకే వచ్చాను.

ఒకరు : యేమిటీ, నీకు వున్నదిక్కడ?

అమ్మ : మీకు లేనిది, నాకు వున్నదీ.

ఒకరు : ఎవరదీ ? తలపొగరు సమాధానం.

అమ్మ : ఎవరిదీ?

కళ్యాణానంద (లోపలనుండి): ఎవరు?

ఒకరు : యెవరో ఒక అమ్మాయండీ (అంటూ చెంప చెళ్లున కొట్టును).

కళ్యాణానంద : రానియ్యి లోపలకు. (అమ్మతో) యేమిటమ్మా మోత మోగినది.

అమ్మ : రెండు కలిసిన మోత.

కళ్యాణానంద : అంటే?

అమ్మ తన చెంపమీద తన చేతితో తానే కొట్టుకొని చూపించుతారు.

కళ్యాణానంద : ఆ మోత నీవు కొట్టుకొనినదా? యెవరయినా కొట్టినదా అమ్మా?

అమ్మ : మీరు చూడక విన్నది యెవరో కొట్టినది. చూస్తూ విన్నది, కొట్టుకున్నది.

కళ్యాణానంద : నాకు సమాధానం చెప్పినవాడేనా నిన్ను కొట్టినది?

అమ్మ : మీకు చెప్పటం విన్నాను కాని మనిషిని చూడలా (అని అమ్మ అబద్దము చెపుతుంది)

నిలుచుని సంభాషణ అయిన తరువాత, పూలు స్వామికిచ్చి నమస్కరించి కూర్చుంటుంది అమ్మ.

తరువాత

కళ్యాణానంద : అమ్మా! అన్నింటిలోకి యేది యెక్కువ వాసన ?

అమ్మ : సైడు కాలువ స్వామీ.

కళ్యాణానంద : యెందువల్ల?

అమ్మ తను వచ్చేటప్పుడు జరిగిన సంగతులు చెప్పాను.

కళ్యాణానంద : పూలల్లో నమ్మా.

అమ్మ : పూలని అడుగలేదుగా యేది యెక్కువ అని అడిగారు. అందువల్ల నా అనుభవాన్ని చెప్పాను.

కళ్యాణానంద : అన్ని పూలల్లో యేది మంచి వాసనో చెప్పమ్మా?

అమ్మ : యేది యిష్టమయిన వారికి అది మంచి వాసన.

కళ్యాణానంద : మధ్యాహ్నమునుండిరాలేదేమమ్మా ?

అమ్మ : అప్పుడు వచ్చే తరుణం రాలేదు. యిప్పుడు వొచ్చి వచ్చాను

కళ్యాణానంద : తరుణమంటే యేమిటమ్మా?

అమ్మ : తప్పించుకుందామన్నా తప్పనిది. చేద్దామన్నా చేయలేనిది వీటినన్నింటిని నడిపించేది నాయనా!

కళ్యాణానంద : నాయనా -అంటున్నావెందుకు నన్ను ?

అమ్మ : అది నా విధి.

కళ్యాణానంద : నా విధి అంటే?

అమ్మ : "విధానమే విధి - విధే విధానము".

కళ్యాణానంద : అంటే యేమిటమ్మా ?

అమ్మ : "విధి కర్త -విధానము కర్మ".

కళ్యాణానంద : సరే! యింతకూ మంత్రం చెప్పుకుంటావా లేదా

అమ్మ : ఆ మంత్రాన్ని గురించి మీరు వివరించటం చాలలేదు. చాలితే చెప్పుకునేదాన్ని.

కళ్యాణానంద : పోనీ నీవు చెప్పు.

అమ్మ : అయితే ఆ మంత్రము చెప్పేదా, వివరించేదా?

కళ్యాణానంద : నీ యిష్టము, యేమిచేసినా సరేనమ్మా. రెండూ అవసరముగానే వున్నది.

అమ్మ : అయితే నేనెవరై చేయాలి?

కళ్యాణానంద స్వామి (అమ్మను ముద్దు పెట్టుకుని): నీవు అమ్మా యివేగాని, అమ్మగా వున్నావమ్మా.

అమ్మ : మాయీ అంటే అమ్మే కదా?

కళ్యాణానంద : యింతకూ నీవు యేమి చదువు కున్నావమ్మా ?

అమ్మ : బళ్లోకి పోవటం లేదు యీ బడికే వచ్చా. ఇది వుపాధ్యాయుడు లేని బడిగా వున్నది. కాని వుపాధ్యాయుడు లేనిదానిని బడి అనటం నాదే తప్పు.

కళ్యాణానంద : సరేలే అమ్మా. (అని నవ్వుతూ)యేమన్నా పెడితే తింటావా అమ్మ?

అమ్మ : చివాట్లుపెడితే తినను. కొడితే పడను. అదీ నన్నడిగి చేస్తే.

(ప్రొద్దు కూకినది. స్వామి పండు చేతిలో పెట్టుకుని)

కళ్యాణానంద : యే పండు యిష్టమమ్మా నీకు ?

అమ్మ : తింటే తరగని పండు యెప్పుడు తినే పండు తలపండు.

కళ్యాణానంద : అమ్మా! (చేతికి ఒక పండు యిచ్చి) వెళ్లిరా అమ్మా అన్నారు.

3వ రోజు

అమ్మ క్రిందటి రోజు వేళకే వెళ్లటం. వెళ్లేటప్పటికి జరుగుతూ వున్నది పురాణం. వెళ్లిన అరగంటకు యెచటి వారు అచటికి వెళ్లిన తరువాత ఒక పంపర పనాస పండు అమ్మ స్వామికి యిచ్చి నమస్కారము చేయబోగా స్వామి అన్నారు.

కళ్యాణానంద : మొత్తము మీద తలపండంత పండు యిచ్చావమ్మా.

అమ్మ : దేనికి మొత్తము మీద?

కళ్యాణానంద : అబ్బా! సరే కాని నేను అడిగింది చెపుతావా అమ్మా

అమ్మ : మీరడిగింది చెప్పలేను. మీరడిగేది నాకు అర్థమయిన దానిని బట్టి చెప్పగలను.

కళ్యాణానంద : యెందుకు అర్థము చేసుకోలేవు?

అమ్మ : నేను మీరు కాలేదు గనుక.

కళ్యాణానంద : యెప్పుడు అవుతావు ?

అమ్మ : నేను మీరయినప్పుడు సర్వము అవుతా.

కళ్యాణానంద స్వామి అమ్మను దగ్గరకు తీసుకుని తల గుండెలకు హత్తుకుని, నీవెవరవు తల్లీ? నీవు తప్పకుండా నా దగ్గర వుండాలమ్మా!

అమ్మ : నేనుండలేను కాని మీరుంచుకోండి నాయనా.

కళ్యాణానంద : మంత్రమంటే యేమిటో నీవు నిజముగా చెప్పవూ?

అమ్మ : నాచేత నీవు మంత్రము చెప్పించుకునే వాడవు, నాకెట్లా చెపుతానన్నావు?

కళ్యాణానంద : నా మంత్రాలు వేరు, నీ మంత్రం వేరు.

అమ్మ : నిజంగా చెప్పించుకుంటావా? అప్పుడు నీవెవరవయి చెప్పించుకుంటావు?

కళ్యాణానంద : నీవు యెవరిని చేస్తే. వారినవుతా.

అమ్మ : నీవు నిజంగా యెవరి ననుకుంటున్నావు చెప్పవూ?

కళ్యాణానంద : నీవు నిజంగా బాలా రాజరాజేశ్వరి వమ్మా.

అమ్మ : బాలా రాజరాజేశ్వరీ అంటే, చిన్న రాజేశ్వరనా?

కళ్యాణానంద : కాదమ్మా, అన్నీ ఆమె.

అమ్మ : అప్పుడు రెండు మాటలెందుకు?

కళ్యాణానంద : (నవ్వు) ఒకే వస్తువు అన్ని రూపాలు అయింది గనుక.

అమ్మ : యెట్లా.సరే అయితే యిట్లాగా? అన్ని భాషలకు అన్ని అక్షరాలకు మొట్టమొదట కాగితం మీద కలం పెట్టగానే పడె చుక్క. ఆ చుక్కయే అక్షరం, యే భాష యెందుకు ఆధారమైంది?

కళ్యాణానంద : అదే అన్ని అక్షరాలకు పునాది. అదే పాయింటు అంటారు యింగ్లీషులో?

అమ్మ : అదే అన్నిటికి ఆధారమా? (అని కాసేపు ఆపి) అదే ఆధారమయితే కలం, కాగితం ఘర్షణ కదా? అదే శాస్త్రమని నీ వుద్దేశమా నాయనా? మంత్రమంటే మనస్సు. బీజాక్షరములు అంటే శబ్దము. శబ్దము యొక్కస్థాయికే అక్షరాలు.

కళ్యాణానంద : యిటువంటి నీ మంత్ర శాస్త్రానికి పీఠికంటూ వున్నదా ?

అమ్మ : లేకేమి వున్నది నాయనా అ, ఆ, ఇ, ఈ, అం, అః యిదే పీఠిక.

కళ్యాణానంద స్వామి అమ్మకు తియ్యని పాయసము తెప్పించి పెట్టును. సగము త్రాగిన తరువాత 'నాకు యివ్వవూ' అని అడుగుతారు.

అమ్మ : ఇయ్యటానికి యిచ్చావా? త్రాగటానికి ఇచ్చావా?

కళ్యాణానంద : త్రాగటానికే యిచ్చాను గాని నాకు మళ్లీ త్రాగబుద్ధి అవుతున్నదమ్మా.

అమ్మ : మీరు నాకు యెక్కడ తెప్పించి యిచ్చారో చెప్పండి మళ్లీ తెచ్చిస్తా.

కళ్యాణానంద : నేను గ్లాసు యిస్తే నీవు సగము యివ్వలేవు ?

అమ్మ : యింత చిన్నపిల్లకే యిది చాలకపోతే, అంత పెద్ద పొట్టకు అది చాలుతుందా? అందుకని తెచ్చి పెడతానన్నాను.

కళ్యాణానంద : నీకెందుకు. నేను సరిపుచ్చు కుంటాగా.

అమ్మ : తృప్తి గల మనస్సా. లేక కొద్ది దానిని యెక్కువ చేస్తావా?

కళ్యాణానంద : తృప్తి అంటే యేమిటమ్మా?

అమ్మ : **"యింతకంటే మరొకటి లేదనే స్థితి"**.

కళ్యాణానంద : అబ్బా! యేమమ్మవమ్మా. నీవు యెందుకొచ్చావో చెప్పు. వూరేమిటి తల్లీ, నీ తల్లి పేరేమిటి?

అమ్మ : **"మా అమ్మ పేరు ఆధారం. మా నాన్నపేరు అవకాశం"**.

కళ్యాణానంద : ఆధారం, అవకాశమంటివే. వాళ్లకు వేరే రూపం లేదా అమ్మా?

అమ్మ : ఆధారమనేది పేరే గదా రూపమెందుకు లేదు?

కళ్యాణానంద : యెట్లా వుందో చెప్పమ్మా.

అమ్మ : "ఉయ్యాల బల్ల వున్నదనుకోండి. బల్లకి గొలుసాధారం గొలుసుకు దూలమాధారం. దూలానికి భూమి ఆధారం యింకా చెప్పదలచుకుంటే చాలా ఆధారాలున్నాయి. సర్వము ఆధారము మీదనే ఆధారపడి వున్నది గనుక ఆధారము సర్వసాధారణ మయినది".

కళ్యాణానంద : అయితే విశేషము లేదా?

అమ్మ : ఆ శక్తికి విశేషము లేదు.

కళ్యాణానంద భారత స్వామి షుమారు రెండు గంటల సేపు ఆలోచించి, కళ్ల వెంబడి నీరు కారుస్తూ పడుకున్నారు. రెండు గంటల అయిదు నిమిషములకు 'యథార్థ స్థితి చెప్పమ్మా' అన్నారు.

అమ్మ :"యదార్థమే నా స్థితి"

కళ్యాణానంద : అమ్మా! తప్పకుండా...... (కొంత సేపటికి) నిన్ను మీవాళ్లంతా యెట్లా చూస్తూ వ్వంటారమ్మా?

అమ్మ : వాళ్లకు కనపడ్డట్లు చూస్తారు.

కళ్యాణానంద : అందరమూ ఒకేరకంగా కనపడతామా?

అమ్మ : అందరికి ఒకేరకం తరువాత చూద్దాం. నీవు చూచిన రోజు నుంచి ఒకటిగానే తోస్తున్నానా? రూపం ఒకటిగానె వ్వంది గాని తోచడంలో మార్పులున్నవి గదా? అయినా అసలు అందరికి ఒకటిగానే యెట్లా కనపడుతారు నాయనా? వారి వారి స్థితిని బట్టి మనస్సు కొలతబద్ద కదా. ఆ బద్ద కందినంత కొలుస్తారు.

గజములో అంగుళాలు వున్నవి గాని, అంగుళములో గజము లేదు.

కళ్యాణానంద : అమ్మను దగ్గరకు తీసుకుని మొత్తం మీద మీవాళ్లకు నీ స్థితి చెప్పి నిన్ను అట్టేపెట్టు కుంటానమ్మా.

అమ్మ : నా స్థితి అన్నారు కదా. నా స్థితి తెలిసిందా యేమిటి?

కళ్యాణానంద : స్థితి తెలియకపోయినా, సంభాషణ వల్ల నేనొక స్థితి నిర్ణయించుకున్నా. అది నీవే చెప్పావుగా, మనస్సు కొలతబద్ద అని.

అమ్మ బయలుదేరి వెళ్లి వస్తానని అనగా -

కళ్యాణానంద : నీవు ఒంటరిగా వెళ్లవద్దమ్మా ఒకరిని నీకు తోడుగా పంపుతా?

అమ్మ : నాకు తోడు వద్దు.

కళ్యాణానంద : కాదమ్మా, నీవు ఒక్కదానవు పోలేవు. నీవు చిన్నపిల్లవు అని ఒక పిల్లవానిని తోడు పంపుతారు.

అమ్మ : చిన్నపిల్లను రోజూనా, యీరోజేనా చిన్నపిల్లను?

కళ్యాణానంద : సరే పోనీలే అమ్మా నీ యిష్టం. పంపనులే.

అమ్మ నమస్కారము చేయబోగా చేయనీయ లేదు. చేయి పట్టుకుంటాడు. "చేయిపట్టుకుంటే నమస్కారము ఆగలేదు. చేతుల కలయికే గాదు నమస్కారము".

కళ్యాణానంద : ఆ మాటకు యేమి అస్కారము?

అమ్మ : సంస్కారమే ఆస్కారము. ఆ సంస్కారమే మీకు నమస్కారము. (అని బయలుదేరి) ఆశీర్వదించండి బాబూ! అని, ఆశీర్వచనము అడిగేది చెప్పేది కాదు. పరిభాష కోసం సంప్రదాయం ప్రకారం అడిగాను. వెళ్లి వస్తాను.

కళ్యాణానంద : నేను యెవరినీ పంపను పో.

అమ్మ "అంటే పంపుతారని స్ఫురిస్తున్నదే" అని బయలుదేరుతుంది.వెనుక మనిషిని పంపుతారు. 2 ఫర్లాంగులు వచ్చిన తర్వాత యెవరో వెనుక వస్తున్నట్లు అలికిడి అయింది. వెనుకకు తిరిగి చూడగా యెవరో మనిషి వస్తున్నాడు. తన కొరకైతే తాను నడిస్తే నడుస్తాడు. తను ఆగితే ఆగుతాడు అని మనస్సులో అనుకొని ఆగుతుంది. అతను అంతే చేస్తాడు. ఒక గంట నిలబడుతుంది. స్వామికుండే ఆదుర్దా అతనికుండదు గనుక అతను తిరిగిపోతాడు. అమ్మ వెనుతిరిగి యింటికి చేరుతుంది.

మూడు రోజులు కళ్యాణానంద భారతితో సంభాషణ అయిపోయిన తరువాత అమ్మ గుంటూరులో రెండు రోజులు వుండి 3వ రోజు సీతాపతి తాతయ్య వస్తే తాతయ్యతో కలిసి తెనాలి వస్తారు.

బ్రాహ్మణత్వం (అంటు లేక మైలకు విశ్లేషణ)

సీతాపతి తాతయ్య గారు : అమ్మను యెట్లయినా తెనాలిలో అలవాటు చేసి వెళదామనుకుంటారు. వారం రోజులుండి ఒక రాత్రివేళ చెప్పకుండా తాతగారు మన్నవ వెళతారు.

అమ్మ నిద్ర లేస్తూనె "మా నాన్న యేరి తాతయ్యా?" అని వెంకట సుబ్బయ్య గారి నడుగుతుంది.

వెంకట సుబ్బయ్య తాతగారు : యేమోనమ్మా నాకు తెలియదు. రాత్రి నీకివ్వమని ఒక రూపాయి యిచ్చాడు. యెటు వెళ్లాడో తెలియదు. బయటకు వెళ్లాడేమోలె.

అమ్మ యెవరినీ అడక్కుండా పాకిదొడ్లోనుంచి వచ్చే దారిలో వాకిట్లో కూర్చుంటుంది.

యెంతసేపు కూర్చున్నా సీతాపతి తాతగారు రారు.

యింట్లో నుంచి జానకమ్మ (అమ్మ అమ్మమ్మ గారు) వచ్చి "యెంతసేపు కూర్చుంటా, రా మీ నాయన వస్తాడ్లె, మీ నాయన్నీ యెవరూ పీక్కు తినరు".

అమ్మ లోపలికి రాదు, సమాధానము చెప్పదు. దాదాపు తొమ్మిది అవుతుంది. యెంతమంది పిల్చినా రాదు.

చివరకు వెంకట సుబ్బయ్యగారు వచ్చి అమాంతం భుజాన వేసుకుని తన గదిలోకి తీసుకు వెడతారు. "యెందుకమ్మా బాధపడతావు నా దగ్గర వుండకూడదు?"

అమ్మ : వుండకూడదని కాదు నాన్న కావాలని పిస్తున్నది.

వెంకట సుబ్బయ్య గారు : నాన్న కావాలంటె వస్తాడమ్మా, తొందరెందుకు? ఆయనకు అనేక పనులు కదా, మీ అమ్మ లేదా?అక్కడ పనులు చూచుకో వాలాయె.అక్కడ యెవరో పెడితె తినాలాయెగా అమ్మ. మీ అమ్మమ్మ అసలే బిడ్డ బోయి యెడుస్తుంది నిన్ను చూసుకుంటె తృప్తి పడుతుంది. వుండమ్మా.

అమ్మ : అప్పుడు అమ్మమ్మే మా దగ్గర వచ్చి వుండొచ్చుగా? యెవరో వండి పెట్టకుండా సరిపోతుంది.

వెంకట : నిజమే వుండొచ్చు అమ్మ యిక్కడ చూస్తున్నా వుగా? యిద్దరు పినతల్లులు వూరు కెళితే యిద్దరు పిన తల్లులు పురిటికి వస్తున్నారు యివాళ మన యింట్లో యెందరు వున్నారో లెక్కపెట్టు.

అమ్మ : యెందుకులే తాతగారు. యింతకు నేను మా నాన్నను వదిలిపెట్టి వుండలేను మా నాన్నను యిక్కడకు తీసుకోచ్చినా సరే, మీరు అక్కడకు వచ్చినా సరే.

వెంకట : సరే - ఏదో ఒకటి చేద్దాంలే. ముందు ముఖం కడుక్కో.

ఇంతలో అమ్మ పెద్ద తల్లి అన్నపూర్ణమ్మ గారు వస్తుంది.

అన్నపూర్ణమ్మ : వాళ్ల నాన్నగారు యిచ్చిన రూపాయి యివ్వక పోయినారా?

అమ్మ : రూపాయి నాన్న కాదుగా? రూపాయిలే అమ్మ నాన్న అయితే అమ్మ లేదనుకోవటమెందుకు?

వెంకట సుబ్బయ్య గారు : (పక్కున నవ్వి) అది కాదమ్మా, మీ నాన్న యిచ్చిన రూపాయి యివ్వమన్నది. రూపాయి నాన్నని కాదు. (అని) యీ మాట ఆ తల్లి వుండి వింటే యెంత సంతోషించేదో, లేక లేక యిద్దరు బ్రతికేటప్పటికి తనే లేకుండా పోయింది. బిడ్డల కోసం యేడ్చినన్నాళ్లు పట్టలా తన బ్రతుకు.

యింతలో అమ్మమ్మ వచ్చి-

జానకమ్మ గారు : బుద్ధులు భూములేలుతుంటే రాతలు గాడిదలు కాస్తున్నట్టు -తల్లి లేని దానికి తగినట్లుగా బాగా చూస్తామనే చోట వుండే గీత వుండొద్దు. యెట్లాగో బలవంతంగా యిదేవిధంగా రోజుకు 22 గంటలు వీధి వాకిట్లో గడుపుతూ, నెల రోజులు కాలం గడుస్తుంది. తరువాత అమ్మకు జ్వరము వస్తుంది.

అమ్మ జ్వరములో కూడా 'నాన్నా, తాతమ్మా' అని కలవరిస్తుండేది.

వెంకట సుబ్బయ్య గారు : సీతాపతి తాతగార్కి వుత్తరం వేస్తారు.

మూడోరోజు అమ్మకు జ్వరంజారుతుంది. జారగానే వచ్చి వాకిట్లో కూర్చుంటుంది.

ఒక పాకీ రేకుల బండి రోడ్లు చిమ్ముకుంటూ పాకీవాడు బండి తోలుకుంటూ వెంట పిల్లవాడితో పాకిది చిమ్ముకుంటూ పోతూ వుంటారు. పిల్లవానికి మూడేళ్లు వుంటాయి. బండి ముందు పరుగెత్తుతుంది. బండి పోతున్నదనే ఆదుర్దాతో తల్లి చిమ్ముకుంటూ పిల్లవాడు వెనుక వస్తున్నాడని పోతుంటారు. కొంచెం పరుగెత్తుతూ పిల్లవాడు పడతాడు . వాకిట్లో అరుగుమీద ఆ సమయంలో అమ్మ, అమ్మ పినతల్లి కూతురు సావిత్రమ్మ, పిన తల్లి కుమారుడు కృష్ణమూర్తి, సావిత్రమ్మ అన్న మధు, శాస్త్రి మామయ్య, వెంకట సుబ్బయ్య తాతగారు వుంటారు . పిల్లవాడు పడగానే 'అయ్యో పాపం' అంటారు. గాని యెవరూ పరుగెత్తురు. పై నుండి రెండు గేదెలు పరుగెత్తుకొస్తున్నాయి ఆ దారిని. అమ్మ పరుగెత్తుతుంది. గేదెలు పాపం పిల్లవాడిని తప్పుకు పరుగెత్తుతాయి. కన్ను మూసి కన్ను తెరిచే సరికి అమ్మ పిల్లవాని దగ్గరకు చేరి పిల్లవానిని లేవదీస్తుంది.

వెంకట సుబ్బయ్య గారు ఆశ్చర్యంతో, 'జ్వరముతో వుండి కూడ యెంత వుద్రేకంతో పరుగెత్తిందో జూడు. భూతదయ కనపడుతున్నది దీనిలో' అనుకుంటూ లోపలకు వెళ్లి కుమార్తెను, భార్యను పిలుచుకు వస్తారు.

అమ్మ పిల్లవాణ్ణి లేవదిసి భుజానేసుకుని గబగబా యింటికి తీసుకొస్తుంది. పిల్లవాణ్ణి పడ్డప్పుడు చూచినవాళ్లు పడ్డప్పుడు లేవదీయకుండా వెళ్లిన వాళ్లు పాకీదానితో మీ పిల్లవాడు పడ్డాడని చెపుతారు.

పాకీమనిషి వెనక్కు పరిగెత్తుకొస్తుంది.

అమ్మ పాకీది వచ్చేసరికే పిల్లవాణ్ణి తీసుకుని యిల్లు చేరుతుంది.

అంత దూరాన వుండగానే నోటిమీద చెయ్యివేసి తాతగారు పెదతల్లి అన్నపూర్ణమ్మ గారు, అమ్మమ్మ. ముగ్గురు లబలబా కొట్టుకుంటారు.

జానికమ్మ : యిటువంటిది గనుకనే యీ రాత రాసింది అంటుంది

అమ్మ సరాసరి గడపలు యెక్కబోతుంటె.

అన్నపూర్ణమ్మ గారు : దిగు దిగు అక్కడే వుండు ఆ పాడు పీడ భుజాన వేసుకొస్తావేం? స్నానం జేసి వొద్దువు గాని.

యివి అనుకుంటుండగానె పిల్లవాడి తల్లి పరుగెత్తు కోస్తుంది.

అమ్మ : (పరుగెత్తుకొస్తున్న ఆమెను చూచి) అదిగో సంఘమాత లాంటిది వస్తూన్నది.

వెంకట సుబ్బయ్య గారు యిదంతా యేమిటని యదా గుండె పడి చూస్తూ వుంటాడు.

అన్నపూర్ణమ్మ గారు : ఆఁ నీవూ సంఘమాతవే. మహా మాటలు నేర్చింది, చిన్నపిల్లకు పెద్ద శోకమని యేం మాటలవి ?

జానికమ్మ గారు : ఆఁ మరిడమ్మ గారి పెంపకం గాదూ ?

పాకిది వచ్చి బిడ్డను చేయిజాపి "దొరసాని నీవు యెత్తుకొచ్చావా? చెంత అదృష్టవంతుడమ్మా, బ్రాహ్మ లెత్తుకున్నారు".

జానికమ్మ గారు : మా బ్రాహ్మణత్వం మట్టిలో గలిసింది. యింకా యేం మాట్లాడతావులె నీ పిల్లవాడిని నీవు తీసుకుపో.

వెంకట సుబ్బయ్య గారు : యెందుకు యింత తొందర పడతావు? అయిపోయిందేమొ అయిపోయిందిగా రైల్లో ప్రయాణాలు చేయటంలా ?

అమ్మ : అవును బ్రాహ్మణత్వం మట్టిలో గలిసింది గనుకనే పిల్లవాణ్ణే యెత్తుకోలా.

ఆ మాట వాళ్లు వినిపించుకోరు.

వెంకట సుబ్బయ్య తాతగారు విని 'ఆమాట యెంత దూరం వేసిందో చూసారా? బ్రాహ్మణత్వం ఆమెకే పున్నట్టు తెల్పింది'.

అమ్మ : 'బ్రహ్మ తత్వమే బ్రాహ్మణత్వ' మని మరిడమ్మ తాతమ్మ అంటుంటే విన్నా.

అన్నపూర్ణమ్మ గారు : మహా బ్రాహ్మణత్వము నీకే కాగా వచ్చింది.

పిల్లవాడి తల్లి చెయ్యిజాచి 'రా అయ్యా' అని యెత్తుకోబోతుంది.పిల్లవాడు రాడు.

అమ్మ కంఠం వాటేసుకుంటాడు చేతుల్తో .

అందరూ ఆశ్చర్య పడతారు.

తల్లి పిల్లవాడినే కాకుండా అమ్మను కూడా వాటేసుకుని "నేను కాదమ్మా అమ్మను బిడ్డకు నీవే అమ్మవు. (తనకు తెలియకుండా) నాకు కూడా నీవే అమ్మవు" అంటుంది.

జానికమ్మ గారు, అన్నపూర్ణమ్మ గారు యీ దృశ్యము చూడలేక యింట్లోకి వెళ్లిపోతారు.

తాతగారు : బలంతంగానన్నా తీసెయ్యమ్మా పిల్లవాణ్ణి .

అమ్మ : నేను వద్దన్నానా? బలవంతంగా లాగే వోపిక నాకు లేదు. నన్ను విడిచిపిపెట్టి పొయ్యే వోపిక వాడికి లేదు .

జానికమ్మ గారు పనిజేసే మనిషితో కబురు యిలా జేస్తుంది.

'ఆ గౌను కూడా విప్పి పాకిదాని ముఖాన విసిరేసి దొడ్డి వాకిలిని రమ్మను. పంచామృతాలు తాగించి స్నానం చేయించుదాం.' అని కబురు చేస్తుంది.

అమ్మ : (ఆ మాట విని) గౌనువిప్పి వెళ్లటమెందుకు ? నేనుకూడా వెళతాను పాకీదాని వెంబడి. తాకింది నేను, గుడ్డ కాదు. మైలు పడ్డది నేను. గుడ్డ విప్పినా మైలు యెక్కడికి పోతుంది . పోనీ చెయ్యి వరకు తీసివేద్దామనుకున్నా భుజమ్మీద పడుకో బెట్టుకున్నా. పొట్ట తాకాడు. వాళ్ల అమ్మ వచ్చి మొత్తం తాకింది. అంతకుముందు వాణ్ణి యెత్తుకోవాలనే వుద్దేశంతో మనసే మైల పడ్డదిగా. అమ్మమ్మ అన్నట్లుగా, యిట్లాంటి రాత రాసిందన్నట్లుగా, రాత రాసినవాడు మైలపడ్డాడు. యిన్నిరకాల మైలలు కలిసి సంఘమాతను చేస్తున్నయ్.

వెంకట సుబ్బయ్య తాతగారు ఆనంద భాష్పాలు కారుస్తూ పిల్లవాణ్ణి తీసి వాళ్ల అమ్మకిచ్చి. గౌను విప్పి పాకిదానికిచ్చి, అమ్మను భుజాన వేసుకుని పొట్టకు హత్తుకుని

"అబ్బా! కడుపులో మంట, చిచ్చుపెట్టిపోయింది. యివన్నీ చూచుకుంటే యెంత తృప్తిపడేదో". అని వెనక్కు తిరుగుతారు. పాకి పిల్లవాణ్ణి యెత్తుకుని గౌను సవరించుకుని వెళుతూ అమ్మను చెక్కిళ్లు ముద్దుపెట్టుకోబాగా తాతగారి వీపుకు తగులుతుంది పాకిదాని చెయ్యి. తాతగారు వెనక్కు తిరిగి చూచి 'హు' అంటారు.

అమ్మ : అయ్యయ్యో తాతయ్య కూడ మైలపడ్డాడె. పాకిది తాకిన వాళ్లని తాకటం కాకుండా, పాకిదే తాకింది. తాతయ్య పూర్తిగా మైలపడ్డాడు. యింకా మైల యేమిటి పాకియే. అమ్మ యిట్లా అంటూంటుంది. పాకిది వెళ్లిపోతుంది. తాతగారు అమ్మను భుజము మీద పడుకోబెట్టుకుని దొడ్లోకి స్నానానికి బావి దగ్గరకు తీసుకు వెళతారు.

అన్నపూర్ణమ్మగారు ఆవు పాలు, ఆవు పంచితం తీసుకొనస్తుంది. పక్క యింటివారైన దుర్గమ్మ గారు వచ్చి అది కాదండి, దర్భ కాల్చి నాలుక మీద పెడతారు. ప్రాయశ్చిత్తం. చిన్నపిల్లకు అవన్నీ మనమెక్కడ చేస్తాం.

అమ్మ : పోనీలె మీ నాన్నగారికి పెట్టండి.

దుర్గమ్మ గారు మాట వినిపించుకోకుండా మళ్లీ ఆ సలహా యిస్తుంది.

అమ్మ : (దుర్గమ్మ గారి నుద్దేశించి) అమ్మమ్మగారు మొన్న మీరు ఆస్పత్రిలో చేరినప్పుడు మీకు మందులిచ్చింది. నీళ్లు పోసింది యెవరు? మీరు బయటకుబోతె బొచ్చ పట్టింది వాళ్లె. నోట్లో మందు పోసిందీ వాళ్లే!

దుర్గమ్మ గారు : బొచ్చ పట్టిన మనిషి వేరు, మందు వేసిన మనిషి వేరు.

అమ్మ : కాదు. వాళ్లు కడగా వుండి, కడగా వున్న వాళ్లకు చాకిరిని చేసి, వాళ్లకు పురుళ్లు చేసి బొచ్చెలు పట్టిన వాళ్లే నీకు మందు పోసారు. నువ్వు యేంపెట్టి కాల్చుకున్నా నాలుక, నీ రక్తం కూడ మైలపడ్డది.

దుర్గమ్మ గారు : భలే తగనిపిల్లే. ఆపత్కాలంలో మైలలేదు.

అమ్మ : తగని పిల్లను గనుకనే అన్నా.

దుర్గమ్మ : (ఒక్క ముక్కు ముక్కి) నా పీడాపోయె. ఒక్క పిల్ల బ్రతికినా బాణము వంటిది.

అన్నపూర్ణమ్మ గారు, జానికమ్మగారు, మునిపల్లె బుచ్చయ్య శాస్తుర్లు గారిని తీసుకొచ్చి సాలగ్రామ తీర్థం తీసుకొస్తారు.

అమ్మ : యీ సంగతి చెప్పితీసుకొచ్చారా, తీర్థం.

జానికమ్మ గారు : చెప్పలా!

అమ్మ : అయితే నేను తాగను.

జానికమ్మ : యిదేమి పిడ, మాయ పీడ కొనితెచ్చుకున్నట్లుగా వుంది. యింతకు చచ్చిన దాని రాత అట్లాంటిది, కొడుకు ఆ తీరు కూతురీ తీరు.

అమ్మ : చచ్చినవాళ్లకు యింకా రాతేమిటి?

జానికమ్మగారు : చచ్చినా రంగమ్మ కూతురనే అంటున్నారుగా?

దుర్గమ్మ : మూగమొద్దల్లే వుండేది, యేమిటి యివాళ యిట్లావిజృంభించింది?

వెంకట సుబ్బయ్య తాతగారు : యెప్పుడూ అనవసరంగా మాట్లాడదు. అవసరమొస్తే మాట్లాడకుండా వుండలేదు. యింతకూ జరగవలసిన పనులు కానీయండి. అనవసరంగా యెందుకు (అని జీతగాడిని పిలిచి నీళ్లు పోసుకుంటారు).

ఆవు పంచితం తీసుకొచ్చి యిస్తే తాగుతారు తాతగారు. మళ్లి స్నానం చేస్తారు. సాలిగ్రామ తీర్థం తాగుతారు.

అమ్మ : అట్లాగె మొండిమొలతో తల వంచుకుని అలాగె నిలబడి వుంటుంది. అరటి చెట్లలో.

వెంకట సుబ్బయ్య తాతగారు వొళ్లు తుడుచు కుంటూ పిల్లక్కూడా పొయ్యండి అంటారు.

అమ్మ : నాకొద్దులే అంటుంది.

వెంకట సుబ్బయ్య తాతగారు : తలయెత్తమ్మా అంటారు.

అమ్మ కంటివెంట నీరు వస్తాయి.

అందరూ అంతకుముందు కోపంగా వున్నా అమ్మ కంటి వెంట నీరు జూచి యెడ్పు వస్తుంది అందరికి.

జీతగాడు యెక్కువగా యేడుస్తూ "అమ్మ న్యాయంగా మాట్లాడింది. మీకు కోపమెందుకు. ఆమెకు కుల భేదము లేదు. మొన్న యిడ్లీ అరుగు మీదకు తీసుకెళితె మీరు పంపిస్తే నాకు బెట్టి తను తిన్నది నాకు నోట్లోనె పెట్టింది స్వయముగా".

జానికమ్మ : నీకు పెట్టిందే తిన్నదా?(అంటే సగం కొరికింది అని)

జీతగాడు మేదరి అంకాలు : అట్లా తినలేదు గాని అట్లా తినటంలో కూడా సందేహించేటట్లుగా లేదు. అందుకని కులభేదం లేదన్నా.

అమ్మ : కుల భేదం లేదు గనుక నోట్లో పెట్టానంటున్నావు. గుణ భేదం వుంటే వీళ్ల యింట్లోనే వుండేదాన్ని కాదు. గుణభేదము లేనప్పుడు కుల భేదం గొప్పేముంది?

జీతగాడికి అర్థం కాదు యీమాట.

వెంకట సుబ్బయ్య తాతగారు : ధోవతి కట్టుకుంటూ వచ్చి (అమ్మ కంటివెంట నీరు కారుతూనె వుంటాయి) యేం అమ్మా యింకా స్నానం చేయలా? యేమిటమ్మా కంటివెంట నీరు కారుతున్నాయి. మీ నాన్నకోసమా?

అమ్మ యేమీ మాట్లాడదు.

తాతగారు అట్లా ఒక అరగంట సేపు చూచి "అవన్నీ తాగదులే స్నానము చేయించు" అంటారు జానికమ్మతో "ఆ నుంచున్న చోటనే చెంబుడు పోసి తీసుకురండి".

జానికమ్మ గారు నీళ్ల పోసి వొళ్లు తుడిచి లోపలకు తీసుకెళుతుంది.

తాతగారు : (అమ్మను దగ్గరకు తీసుకుని) కొద్దిగా అన్నం తింటా ఇవాళ జ్వరం లేదుగా?

అమ్మ ఏమీ మాట్లాడదు.

దుర్గమ్మ, జానికమ్మ ప్రాయిశ్చిత్తం లేకుండా లోపలకు తీసుకు రావడంచే బాధపడతారు.

(ప్రాయశ్చిత్తము లేకుండా రావటంతో అమ్మకు ప్రాయశ్చిత్తము కాలేదు గాని, వాళ్లకు ప్రాయశ్చిత్తము అయింది.)

వెంకట సుబ్బయ్య తాతగారు : యేమిటి అనవసరంగా బాధవొద్దు చిన్న పిల్లకు దానికి మై లేమిటి?(దానికి మై లేమిటని యింట్లోకి తీసుకెళ్లి అన్నం తినమంటారు)

అమ్మ ఆకలి కావటం లేదంటుంది. కంటి వెంబడి నీళ్లు వస్తూనె వుంటాయి.

తాతగారు : అమ్మా! చెప్పవు యిప్పుడో యింకా కాసేపటికో మీ నాన్న వస్తాడు. వెళుదువు గాని.

అమ్మా అందుకూ మాట్లాడదు.

వెంకట సుబ్బయ్య తాతగారు : (బలవంతంగా విస్తరి వేసి కూర్చోబెడతారు) యెందుకు అట్లా యేడుస్తావు? మీ నాయన వస్తాడులే అని చెప్పినా, వెళుదువుగాని (అంటూ వుండగానే సీతాపతి తాతగారు వస్తారు యింట్లోకి. కళ్లల్లో నీళ్లు వస్తూనే వుంటాయి) మీ నాన్నగారు వచ్చిన తరువాత కూడ యెందుకు యేడుస్తున్నావు?

అమ్మ : పాకీదంటే యేమిటి. పనికిరాదనా?

వెంకట సుబ్బయ్య తాతగారు : (సమాధానం చెప్పరు) అంత దూరం ఆలోచించలా, పాకీ అని అనటం తప్పు.

సీతాపతి తాతయ్య : (అమ్మతో) ఇంటికి వెళదామా అమ్మా?

అమ్మ : నన్నడిగి వుంచిపోలేదుగా?

సీతాపతి తాతయ్య : దిగులు పడతావని చెప్పకుండా వదిలిపెట్టి పోయినానమ్మా అని భోంచేసి పడుకుంటారు.

అమ్మ : మనం కూర్చున్నది బాగుజేసి శుభ్ర పరిచినందుకే గదా దానికింత. రాయిమీద నీళ్లు పోసి ఆ నీళ్లు తీసుకొచ్చి సాలిగ్రామ మంటే అంత పవిత్రతా? ఆవు పంచితానికున్న పవిత్రత దానికి లేదు? కాకపోతే ఆవు పంచితం ఆరోగ్యం కావచ్చు. కొన్ని వుపయోగాలుండొచ్చు. మన కడుపులో వున్న అశుద్దానికి అంటు లేక పోయె. దాన్ని బాగు చేసిన ఆమేరకు అంటు వచ్చింది. అది బాగుచేసిన దొడ్లో మళ్లీ కూర్చుంటూనే వున్నాము గదా?అసలు అంటు. అంటే యేమిటో అంటు అంటే వదలనటువంటిదని నా వుద్దేశం.

యెవరూ మాట్లాడకుండా ఆలకిస్తూ వుంటారు.

వెంకట సుబ్బయ్య తాతగారు : యిందాక యేమిటమ్మా అంటూ అంటె అన్నావు?

అమ్మ : వదలనటువంటిది. దాదాపు ఒక మాటు లాంటిదని నా వుద్దేశం మాటు అంటె ఒక రంధ్రం వున్నదనుకో దానికే వెలిగారమో పూసి ఆ రంధ్రం కనపడుతూనే చేస్తాడు. ఆ వెసినంత లెక్క ప్రత్యేకత కనపడుతేనె వుంటుంది. గిన్నె వుపయోగపడుతూనే వుంటుంది. అట్లాగె ఒక లోపాన్ని మరొక దానిచేత మరుగుపెట్టి దాన్ని వుపయోగించుకుంటూ వుంటాము. వాళ్ల వుపయోగం కోసం కొన్ని యేర్పాట్లు చేసి యేనాటికి కొన్ని కొన్నిటికి విలువ లేకుండా ఒక అవుసరం అనే దానికే విలువ యిస్తూ వుంటాము. దూరము పోలేము. దగ్గరలో బైటికెళ్లాలి. నడువలేకనే యీ దొడ్లు నిర్ణయించింది. మనం నిర్ణయించుకున్న దానికి అనేక రకాల జీవనోపాధులున్నాయి. అందులో యిది ఒక వృత్తి కాబట్టి వాళ్లకు జీవనాన్ని కల్పించి.

వాళ్లను మనకు ఆధారమయి మనకు పనికివచ్చే పాకీతనానికి పనికిరాని తనాన్ని అంటకడుతున్నాము.

జానికమ్మ గారు, అన్నపూర్ణమ్మగారు యదా గుండెపడి వింటూ వుంటారు.

సుబ్బయ్య తాతగారు అమ్మ వీపుమీద చెయ్యివెసి కళ్లవెంట నీళ్లు కారుస్తూ వింటూ వుంటారు. అంత గట్టిగా వుండే అన్నపూర్ణమ్మగారు, జానికమ్మ గారు కూడ తాతగారు నీరు కారుస్తున్నారని, ఆ కంటివెంట నీళ్లు రావటం చూచి వాళ్లుకూడ కంటతడి పెట్టుకుంటారు.

సుబ్బయ్య తాతగారు : (అమ్మతో) జ్వరం జారిందిగా కొంచెం చారు రసం తాగుతావా? మీ నాన్నగారు వచ్చారుగా వెళుదువు గాని. యేమీ లేదమ్మా, నేను యిక్కడ వుంచుకుని తల్లిలేని కొరత లేకుండా చూచుకుని, ఆ పెళ్లి పెరంటం కూడా చేసి తృప్తిపడదామని. మీనాన్నగారు కూడ 'నాకొద్దు మీరే యీదండి' అని అన్నాడు. మీ బాధ్యతలు లేకపోతే ఆయన పెళ్లి చేసుకుంటాడట. మీ అన్నయ్యకు ముందు పెళ్లి చేస్తారుట. సంబంధాలు వచ్చినయ్యి.

అమ్మ యేమీ మాట్లాడకుండా వుంటుంది.

అన్నపూర్ణమ్మ గారు : తరువాత యేది యెట్లా వున్నా యిందాక యిది మాట్లాడిన మాటలు దీనికి యెక్కడనుండి వచ్చినాయి? ఆశ్చర్యంగా వుంది!

జానికమ్మ గారు : ఆశ్చర్యమేముందిలే చిదంబర్రావు గారి దగ్గర పెరగటం, కొంత మరిడమ్మ గారి సంస్కారం అయినా మరిడమ్మగారు మహా ఆచారము కలిగిన వ్యక్తి. దీనికి యెక్కడినుంచి వచ్చిందో. ప్రపంచములో కాఫీ హెూటళ్లు పుడుతున్నట్లే యిదొక విధానము.

అమ్మ : విధానము అనేది వ్యక్తికి సంబంధించిందేనా?

జానికమ్మ : నీతో మాట్లాడలేములే తల్లీ! మాటలు పుట్టి, నీవు పుట్టావు. పోనీ మాట్లాడుతుంది గదా అని మనము అడిగినప్పుడల్లా మాట్లాడదు తన కిష్టమయినప్పుడే మాట్లాడుతుంది.

సుబ్బయ్య తాత గారు : మొన్న చిదంబరం నాతో ఒక మాట చెప్పాడు అమ్మాయిని గురించి. అంటే యేమీ లేదనుకో మాట్లాడేదల్లా వింటూ అర్థం చెసుకో మన్నాడు. మనకుండే ప్రేమకొద్దీ మనదగ్గర వుండలేదనే విసుగుతో బాధపడుతూ వుంటాము అయినా మనకు వుండవలసిన ప్రేమ కూడా లేదుగదా దానిమీద. తల్లి పోయిన పదకొండో రోజున మనము యేమన్నాము? మేము తీసుకెళ్లము. ఆస్తివుంది.

బ్రహ్మచారి అయిన మరిడమ్మగారు వుంది. వాళ్లే చూసుకుంటారని మననడిగిన వారితో చెప్పి వచ్చేశాము గదా. నేను వాళ్ల అమ్మను సీతాపతి కివ్వటంతో తతిమ్మా పిల్లల మీద వున్నంత ప్రేమ వాళ్లఅమ్మ మీదనే లేదు.యిక పిల్లమీద యెముంటుంది నీకు ?

జానికమ్మ : ప్రేమ లేకకాదుగా. అక్కడ వాళ్లకు వసతులున్నాయి. మనము చూచినా చూడక పోయినా చూసేవాళ్లు వున్నారు.

అన్నపూర్ణమ్మ గారు : యేది యెట్లా వున్నా మనదగ్గర పెరిగితే ఆ వున్న బంగారం పోకుండా చూస్తాం.యే సంసారాల్లో పెరిగినా ఆకాస్త బంగారం వదిల్చేస్తారు.

అమ్మ : నా బంగారం యెక్కడున్నా పొయ్యేది కాదులే. యెవరూ వున్నది వదిలించలేరు. లేనిది తెచ్చిపెట్టలేరు. అది నాకేకాదు. యెవరికయినా అంతే.

సీతాపతి తాతగారు లేచి వస్తారు. రాంగానే యేదో ఫలహారం పెట్టి మంచినీళ్లు యిస్తారు. "యింకా రెండు రోజులలో తీసుకెళతాను" అని చెపుతారు తాతయ్య.

సుబ్బయ్య తాతగారు : యిట్లాగె అప్పుడప్పుడు తీసుకువచ్చి పదేసి రోజులు వుండి అలవాటు చేస్తే క్రమంగా అలవాటు అవుతుంది.

12. బంధుజన ప్రమోదం

మామయ్య వివాహం :

తాతగారు : పిల్లవాడికి పెళ్లి సంబంధాలు వస్తున్నాయి. అందరితో సరైనవాడు కాదు. అల్లరివాడని చెపుతూనే వున్నా. ఒక సంబంధం వచ్చింది. పిల్ల అదృష్టము వుంటే మారకూడదా అని. కొన్నేపాడు నుంచి వచ్చింది. 40 యకరాలు వున్నది గదా అని ఆశిస్తున్నట్లున్నారు బహాశా యివాళ యిక్కడికే వస్తారేమొ తెలుసుకోవటానికి. వాళు వస్తే యిక్కడ్నే నిశ్చయించుకుందాం.

సుబ్బయ్య తాతగారు : చిదంబరం లేకుండా యిక్కడెందుకు బాపట్ల నేనె వస్తాలె. యీలోగా వీలయితె సీతారాముడు వివాహము కూడా చెయ్యాలనుకుంటున్నాను. కాని దానితో వంతెందుకు. తటస్థపడితె యిది ముందు చేసేద్దాం.

సీతాపతి తాతగారు రెండు రోజులు వుండి, అమ్మను తీసుకుని బాపట్ల వెళతారు. వెళ్లేటప్పుడు సుబ్బయ్య తాతగారు, సీతాపతి తాతగారు, అమ్మ వెళతారు. వెళ్లిన మరునాడె సంబందం వస్తుంది. కట్నాలు, కానుకలు అన్నీ నిశ్చయించుకుని, ఆడబిడ్డ లాంచనాలతో సహా నిశ్చయించుకుని, లగ్నాలు పెట్టుకుని మన్నవ వెళతారు. పెళ్లి పనులు బాపట్లలో చెయ్యమని చెప్పి వెళతారు.

మరిడమ్మ తాతమ్మ గారు గుంటూరులో సుబ్బమ్మ గారికి పురుడు పోసి మన్నవ వస్తుంది. సీతాపతి తాతగారు పెళ్లి హడావుడిలో డబ్బుకోసం రోజూ దొప్పలపూడి, జూపూడి వెళ్లి వస్తూ వుంటారు. ప్రతివారూ రేపురా యిస్తామంటారు, యివ్వరు. పొలమయినా అమ్ముదామంటె బేరగాడు రాడు. వడ్లకు ధరలు తగ్గిపోవటం చేత యెక్కడ జూచినా ధాన్యం కనపడుతుంది గాని డబ్బు కనపడదు.

పెళ్లి లగ్నం దగ్గరకొచ్చింది. పోనీ వున్న బంగారమయినా అమ్మి చేద్దామంటే తల్లి బంగారం పిల్లకుండాలంటున్నారు. (రాఘవరావు) వాడు అసలే వొప్పుకోలేదు. తెనాలి వారు పెట్టింది అట్టేపెట్టి మనం పెట్టిందన్నా అమ్మి చేద్దామనుకుంటారు.

మరిడమ్మ తాతమ్మ దగ్గరకు వచ్చి సీతాపతి తాతగారు "యేం చేద్దాం డబ్బు దొరకలేదు. పెళ్లి మానుకోవలసి వచ్చేటట్లుగా" వుంది.

మరిడమ్మ తాతమ్మ : అమ్మి చేద్దాములే నాయనా. సగము అమ్మి చేద్దాం.

సీతాపతి తాతగారు : వాడిదేముందనుకో జానికమ్మ వాళ్లు తగాదాకు వస్తారు. ఆ రోజునే తల్లి సొమ్ము పిల్లకేనన్నారు. పోనీ అంతగా అయితే రెండు యకరాలు దాని పేర పెడతాను.

మరిడమ్మ గారు : బాపట్లకు వుత్తరం రాసి బంగారం అమ్మి పెళ్లి పనులను సాగించమను. యీ పనులన్నీ నెరవేర్చుకుని బాపట్ల పెళ్లికి వెళ్లేటప్పటికి నెలా పదిహేను రోజులు పడుతుంది. పెళ్లి రెండు రోజులుండనగా వెళదామనుకుంటారు.

అమ్మ యీ నెలా పదిహేను రోజులు గంగరాజు వున్నయ్య తోటలోనే యెక్కువ కాలం వుంటుంది. మధ్యమధ్యలో దేవస్థానం వెళుతూ వుంటుంది.

పెళ్లి సమయం సమీపిస్తుంది. రెండు మూడు రోజులుండనగా వెళదామనుకున్నవారికి, పది రోజులు ముందుగా వెళ్లవలసి వస్తుంది.

సీతాపతి తాతగారు అమ్మను చేతబట్టుకుని వూరంతా పిలుస్తారు.

అమ్మ : నాన్నా కొన్ని యిళ్లు వదిలి పెట్టావేం?

సీతాపతి తాతగారు : సాయిబులను, శూద్రులను, ముఖ్యమయిన వాళ్ళను పిలిచా. తక్కినవాళ్లను వదిలేసా.

అమ్మ : బ్రాహ్మల్లో అందరిని పిలనటమెందుకు?వాళ్లను సగము సగము పిలవటమెందుకు? పిల్చేదేదో అందరినీ పిలువు.

సీతాపతి తాతగారు : మనవాళ్లను పిలిస్తే చాల్లేమ్మా.

అమ్మ : మనవాళ్లంటే గుర్తు యేమిటి? మనము అనుకోవటమేగా?

తాతయ్య : సరే అందరికి శుభలేఖలు పంపుదాములే. యిల్లు యిల్లు తిరిగిన మట్టుకు చాల్లే.

అందరికి శుభలేఖలు పంపి బాపట్ల వెళతారు.

బాపట్ల వెళ్లిన మరునాడె మామయ్యను పెళ్లి కొడుకును చేస్తారు. దాదాపు మన్నవ నుండి యింటికి ఒకరు, యిద్దరు చొప్పున దాదాపు సగం జనం వస్తారు. అయిదారు వందల జనానికి కొంత మంది రైళ్లల్లో, కొంతమంది బస్సుల్లో వెళ్తారు. చిదంబర్రావు తాతగారి కుటుంబం, సీతాపతి తాతగారి కుటుంబం, సీతాపతి తాతగారి చెల్లెలు వెంకట సుబ్బమ్మ గారి కుటుంబం, సీతాపతి తాతగారి తమ్ముడు అంబారావు గారు అందరూ సరాసరి బస్సు చేసుకుని వెళ్లిపోతారు. సలక్షణంగా పెళ్లి చేసుకుని వస్తారు. పెమ్మరాజు పిచ్చయ్య గారు వర్షాలయినప్పటికి చాలా మర్యాదలతో, ఆదరాభిమానాలతో గౌరవనీయంగా 5 రోజులు పెళ్లిచేసి పంపుతారు.

అమ్మకు, అత్తగారి బదులు లాంఛనాలు కూడా యిచ్చి పంపిస్తారు బాపట్ల రాగానె పూసల పూల ఓడలతో వూరేగింపు జరిపి గృహ ప్రవేశమవుతారు. వూరంతా, 'యెంత అదృష్టంతుడు, అల్లరివానికి చక్కటి పిల్ల వచ్చింది. యికనైనా అల్లరి మానుకుంటావా ?' అని ప్రతి వాళ్లు వచ్చి అడిగి పోతుంటారు.

రాఘవరావు : నేను భార్య కోసము చేస్తేగా అల్లరి మాను కోవటానికి. అల్లరి మానుకుంటేగాని చేసుకోమని నన్నడగలేదుగా మానుకోవటానికి, అంతా నవ్వుతారు.

జానికమ్మ గారు తన కూతురు లేదనే బాధ ఒకటి రెండవది తన కొడుక్కు యింకా పెళ్లి కాలేదు. యింతకొంటెవానికి యింత తొందరగా పెళ్లి అయింది. మంచి సంబంధం, చక్కటి పిల్ల వచ్చింది. మాకు యింత ఆస్తివుండి ఒక్కగానొక్కడై బుద్ధిమంతుడయినా యింతవరకు పెళ్లి యోగ్యత కలగలా అని యేడుస్తుంది. మూడు నిద్రలు కాంగానే మేము వెళతామంటారు తెనాలివారు. యెక్కడివాళ్లు అక్కడ తాతయ్య మన్నవ వెళతారు. పదహారు రోజుల పండగ చేసుకొని అమ్మ, తాతయ్య మన్నవ వెళతారు. మరిడమ్మ తాతగారు, తాతగారికి పెళ్లి సంబంధాల కొరకై బాపట్లలోనె దిగడిపోతారు.

గుణ పాఠం :

అమ్మ, సీతాపతి తాతగారు మన్నవలో భోజన హోటల్లో భోజనాలు చేస్తూ కాలం గడుపుతారు.

హోటల్లో బోజనం పెట్టే ఆమె అమ్మకు జడ ,నీళ్లు కూడ చూస్తూ వుండేది.

సీతాపతి తాతగారు ప్రతిరోజూ తెల్లవారు ఝామున లేచి కృష్ణ కాలువకు స్నానానికి వెళ్లేవారు. ఒక్కొక్క రోజు ప్రొద్దు యెంతవున్నది తెలియక ఒంటిగంటకే లేచి వెళ్లేవారు. ఒక్కొక్క రోజు ఏదో యేదో ఆలోచించుకుంటూ 9గంటలకు

వచ్చేవారు. తాతగారి కోసము అమ్మ ఆయన వచ్చేదారిలో యెదురు చూస్తూ కూర్చుండేది. ఒక రోజు 12 గంటలదాకా రాలేదు. అమ్మగూడ కృష్ణ కాలవకట్టకు దారి అడుగుతూ వెళ్లింది. ఆరోజు దారిలో కోమటి నీలకంఠం (మన్నవ వాడే) కారప్పూస, పకోడిలు తట్ట నెత్తిన పెట్టుకుని వెళుతూ వుంటాడు. అమ్మ కూడ అతని పక్కనె వెళుతూ వుంటుంది. అతను అమ్మను గుర్తించక యెవరమ్మాయో అనుకుని 'పకోడిలు కావాలా?' అంటాడు.

అమ్మ మాట్లాడదు.

నీలకంఠం : యేం అమ్మాయి చెప్పవేం?

అమ్మ యెన్ని సార్లు పిలిచినా పలుకదు.

నీలకంఠం : యీ తట్ట నీనెత్తిన పెడితినా కుదురుతుంది.

అమ్మ అప్పుడూ మాట్లాడదు. పోతూనే వుంటారు యిద్దరు.

నీలకంఠం పక్కగుండా నడిచేవాడల్లా పలకమంటే పలకవేమని యెదురుగుండా వస్తాడు. నాలిక కొరుక్కొని ఆశ్చర్యపడి తట్ట కిందికి దించి అమ్మను యెత్తుకుంటాడు. అమ్మను భుజాన యెక్కించుకొని మళ్లీ తట్ట నెత్తిన పెట్టుకుని, అమ్మను తట్టలో కారప్పూస తింటూ కూర్చో అమ్మా అని నోట్లో కారప్పూస పెడుతూ తీసుకెళతాడు. దారిలో బాటసారులు అమ్మను నీలకంఠం యెత్తు కున్నట్టుగనే పిల్లను యెత్తుకుని యెదురు వస్తారు.

యింతవరకు నీలకంఠంతో అమ్మ యేమీ మాట్లాడలేదు. ఆ తండ్రీ, పిల్ల దగ్గరకు వస్తారు.

అమ్మ : నీలకంఠం ! నీవు నన్నెత్తుకున్నట్టు ఆ అమ్మాయి నెత్తుకున్నాడు గాని నెత్తిన కారప్పూస తట్ట లేదే కాస్త పెడదామా?

నీలకంఠం యేమీ మాట్లాడడు.

అమ్మ : నేను కొంచెం కిందికి దిగాలి దించుతా నీలకంఠం?

అమ్మ పది గజాలు లెక్క నడిచిన తరువాత కాస్త కారప్పూస తీసి అమ్మ వాళ్లో పోస్తాడు. కారప్పూస పెట్టగానే వెనక్కు తిరిగి నీవు వెళుతూ వుండు నేను వస్తాలె అనిచెప్పి పోయె మనుషుల దగ్గరకు వెళ్లి కారప్పూస పెట్టి వస్తుంది.

నీలకంఠం పోయెవాడు ఆగి అమ్మకోసం వచ్చిందాక వుండి తీసుకెళతాడు. భలే అమ్మవమ్మ అమ్మాయి! అంటాడు రాంగానె.

అమ్మ : నా పేరు అమ్మాయమ్మా? కాదు నా పేరు అనసూయమ్మ.

నీలకంఠం : నీపేరు కాదమ్మా నేననేది యెందుకో అమ్మా అని వచ్చింది. యెందుకేముందిలే పెట్టటం చూస్తే అమ్మవనిపించింది. వయున్సుకు అమ్మాయివనిపించింది. యింకాస్త పట్టు అంటూ వొళ్లో పోసి యెప్పుడూ కారప్పూసేనా పకోడిలు తింటావా?

అమ్మ : యేది పెట్టినా తింటా, తినటం యెట్లా వున్నా తీసుకుంటా.

నీలకంఠం : మళ్లీ యెవరికన్నా పెట్టటానికా?

అమ్మ : నీవు నాకు బెట్టుకుంటే యెంత తృప్తో, నాకు యెవరికన్నా పెట్టుకుంటే అంత తృప్తి.

నీలకంఠం : సరే పెట్టుకో అమ్మా, పెట్టుకో రాఘవరావు తెలివి గలవారనుకుంటే, వారికంటే తెలివి గలదానవు.

యింతలో లాకులు వస్తాయి.

అమ్మ అతను పెట్టిన కారప్పూస, పకోడిలు లాకు దగ్గర వున్న చిన్న చిన్న పిల్లలందరకు పెట్టి, సీతాపతి తాతగారిని చూస్తే అక్కడ కనపడరు. అమ్మ కూడ మధ్యాహ్నము నీలకంఠంతో వెళ్లవచ్చు లెమ్మని అక్కడే వుంటుంది.

సీతాపతి తాతగారు సాయంత్రం నాలుగయ్యేసనికి లాకులు మీదుగా తల వంచుకుని వస్తూ వుంటారు. అమ్మ కాల్వలో స్నానము చేస్తూ వుంటుంది. తాతగారు వస్తూ వుంటే నీలకంఠం చూచి, 'కరణం గారూ!' అని పెద్దగా కేక వేసి యిటు రండి అంటాడు.

సీతాపతి తాతగారు : అయ్యో ! ఒంటరిగా యెందుకు పంపావని పెద్దగా కోప్పడతారు. చూసిన వాడివి వొడ్డు కెక్కించకూడదు? అసలెందుకు వచ్చింది. అంటారు. అంటూ చెయ్యి అందిస్తారు యెక్కటానికి.

అమ్మ : నేను యెక్కుతాలె నాన్నా అంటూ చెయ్యి పట్టుకోకుండానె పైకెక్కుతుంది.

సీతాపతి తాతగారు : యెందుకొచ్చావు నీవు యిక్కడకు ఒంటరిగా?

అమ్మ : నీవు రాకపోతేను రోజూ వచ్చే వేళదాకా 12, 1 గంటల దాక చూచి నీకోసం వచ్చా.

సీతాపతి తాతగారు : యింతకు అన్నం తిన్నావా?

అమ్మ : నువ్వు లేకుండా వాళ్ల యింటికి పోవటం అలవాటుగా లేదుగా.

సీతాపతి తాతగారు : పోతె పెట్టకపోయినారా, అలవాటేమిటి? చేసుకొవాలి అలవాటు.

అమ్మ యేమి మాట్లాడకుండా వొళ్లు తుడుచుకుని ఆ గౌనే వేసుకుంటుంది.

సీతాపతి తాతగారు : తల చూడు నీళ్లు కారుతున్నాయి కాస్త కూస్త జుట్టు కాదు, యెందుకు తడుపుకున్నావు? యేంబెట్టి తుడిచేది అని తన తుండుగుడ్డ తీసి తలకు పిడి వేస్తారు. తలంటు పోసేవాళ్లు కూడా లేరు గదా అంటూ చేత బట్టుకుని తీసుకొస్తారు.

నీలకంఠం, తాతగారు, అమ్మ కలిసి వస్తారు. ముగ్గురూ కలిసి వూళ్లోకి వచ్చేటప్పటికి పొద్దెక్కుతుంది.

సీతాపతి తాతగారు : (అమ్మను) యిప్పుడు అన్నము పెట్టిస్తాను, తింటావా?

అమ్మ : నీతోనె తింటా నాన్నా.

తాతగారు, అమ్మ వీధిలో అరుగుమీద కూర్చుని వుంటారు. తాతగారు నిష్కామ కర్మ యోగము అనే పుస్తకము దగ్గరే పెట్టుకుని కూర్చుంటారు. రోజూ రెండు గంటల నుండి మన్నవ హనుమంతయ్య గారి దగ్గరకు వెళ్లి ఉపనిషనిత్తులు వింటూ వుండేవారు. వారికి జ్యోతిశ్శాస్త్రము కూడా తెలుసు. రోజూ పులిపాక చెల్లమ్మగారు, పులిపాక వెంకట్రామయ్య గారు, పోస్టుమాష్టరు గారు తప్పకుండా వెళ్లేవారు. యెప్పుడయినా ఆ ముగ్గురే వెళ్లేది. యీ రోజు ప్రొద్దు గూకింది. హనుమంతయ్య గారికి వూరికె వెళ్లి కనపడి వస్తాను. నీవు వెళ్లి అన్నంతిన్నా సరే యిక్కడ కూర్చున్నా సరే!

అమ్మ : నేను యిక్కడ కూర్చుంటాలే అన్నానికి పోను.

సీతాపతి తాతగారు ఒక అరగంటలో తిరిగి వస్తారు. యిద్దరూ కలిసి భోజనానికి వెళతారు.

మాచమ్మ గారు : యేం నాయనా పొద్దున యెవరింట్లోనయినా భోంచేసారా?

సీతాపతి గారు : చేయలేదు అని జరిగిందంతా చెబుతారు.

మాచమ్మ : పోనీ పిల్లయినా రాకూడదా కనీసం. నా పిల్లలై చూసుకుంటున్నాను కదా.

అమ్మ తలవంచుకుని ఏమీ మాట్లాడదు. మాచమ్మగారు అన్నం తింటున్న అమ్మ ముఖం పైకెత్తి "నేను నిన్ను బాగా చూడటంలా?"

అమ్మ : బాగా చూడనివారు అంటూ ఉంటేగా నీవు నన్ను బాగా చూడటానికి.

సీతాపతి తాతగారు తనలో తను నవ్వుకుంటూ, తల వూపుతారు.

మాచమ్మ : మరిడమ్మ గారు వచ్చిందాక నీవు వున్నా లేకపోయినా వచ్చి అన్నం తిని జడ వేసుకుని నీళ్ళు పోసుకుని పొమ్మను యిదే చెప్పటం. లేనిదాన్ని గనుక డబ్బు తీసుకోవటం, అదీ యేడుస్తూనే తీసుకుంటున్నాను. యెవరు యెన్ని రూపాయలిచ్చినా తరగనిది ఆదరణ. అదే యీనాడు కరువని పిస్తున్నది. మాచమ్మ గారు యీ మాటలు అంటూ పెరుగు తీసుకొచ్చి వేస్తుంది.

అమ్మ : పెరుగు విస్తట్లో వేయగానే "మాతోపాటు ఆదెయ్య తాతయ్యని భోజనానికి పిలవరాదు. రేపటినుంచి ఆయనతోటె తింటా, మా నాన్నతో తినను".

మాచమ్మ గారు : ఆయన యెప్పుడు పడితే అప్పుడు రాడమ్మా, మధ్యాహ్నం ఒంటిగంట దాకా తినడు.

తాతగారు అన్నం తిని లేస్తాడు. అమ్మ కంచంలో చెయ్యి పెట్టుకుని "రాత్రి యెన్నిగంటలకు తింటాడు?"

మాచమ్మ : పన్నెండు అవుతుంది.

అమ్మ : యింతసేపు నీవుకూడ అన్నం తినకుండా వుండి పెడతావా?

మాచమ్మ గారు : లేదమ్మా! అంతసేపు నేను యెక్కడ వుండేది. నేను తిన్న తరువాతనే ఆయన తింటాడు.

అమ్మ : ఆయన తిన్న తరువాత ఆయన విస్తట్లో మీరు తినాలనుకోండి. దాని బదులుగా జరుగుతుందా (నీ యిస్తట్లో ఆయన తింటారా అని).

సీతాపతి తాతగారు (చెయ్యి కడుక్కొని) "పోదాం పద తొందరగా" అంటారు.

అమ్మ : ఆదెయ్య తాతయ్య గార్కి పెరుగు యిష్టమేనా బామ్మా?

మాచమ్మ గారు : వేసుకోరు.

అమ్మ "నాకూ పెరుగు సహించదమ్మా" అని కంచం అవతలపెట్టి చెయ్యి కడుక్కుంటుంది.

మాచమ్మ : యెందుకమ్మా కంచం వదిలిపెట్టి పోతున్నావు?

అమ్మ యేమీ మాట్లాడకుండా గ్లాసు యింట్లోపెట్టి చెయ్యి తుడుచుకుంటూ ఆదెయ్య గారి దగ్గరకు వెళుతుంది.

సీతాపతి తాతగారు : ప్రొద్దుపోయింది. పోదాం పద, ఆదెయ్య తాత దగ్గర కూర్చుంటె యెట్లా! నాకు నిద్ర వస్తోంది.

అమ్మ : నేను (ఆదెయ్య) తాతయ్య దగ్గర పడుకుంటాలె.

అదెయ్య గారు ఆమాట అనగానే పొట్టమీద పడుకోబెట్టుకుని "పడుకో అమ్మా. యింతకన్నా కావలసిందేమిటి" అంటాడు. "సీతాపతీ నీవు పోయి పడుకో, అంతగా యేడిస్తే నేను తీసుకొచ్చిదించుతాలె".

సీతాపతి తాతగారు : నాకు మరీ నయం, వెళుతున్నా!

ఆదెయ్య గారు యెంత ప్రొద్దుపోయినా భోజనానికి లేవరు. ఆవిడ వచ్చి పిలవలేదు. ఒకరాత్రివేళ ఆయనే వెళ్లి కాసిని మజ్జిగ తాగి వచ్చి పడుకుంటారు.

ఆమె అన్నం తిని నిద్రపోతూ వుంటుంది.

అమ్మ : తాతగారు మీరు రెండోపూట భోంచేయరా? యెప్పుడూ తినరా, యివాళేనా?

అదెయ్య తాతగారు : రోజూ అంతే అమ్మా!

అమ్మ : యెన్ని సంవత్సరాల నుండి?

ఆదెయ్య : అవన్నీ యెందుకులే అమ్మా, యిప్పుడు నీవు నాదగ్గర పడుకుంటానంటివిగా పడుకుందాం పద.

అమ్మ : నాకు నిద్ర రావటంలా. యివన్నీ తెలుసుకుంటే హాయిగా పడుకుంటాను.

ఆదెయ్య : చిన్న పిల్లతో యెట్లా చెప్పేది చెప్పు.

అమ్మ : నేను చిన్నపిల్లగా అడగటంలా!

ఆదెయ్య : యేమన్నా తీరుస్తావా?

అమ్మ : యేమీ తీర్చలేకపోయినా మీ యింట్లో అన్నం తినటం తీర్చుకుంటాను.

ఆదెయ్య : రేపు చెపుతా. పడుకుందాంలె.

అమ్మ : నీవు చెప్పిందాక మా యింటికి పోను, అన్నం తినను.

ప్రొద్దుపోయిన తరువాత అమ్మ మాచమ్మ గారి దగ్గరకు వెళ్లి "పన్నెండు గంటలప్పుడు తింటారంటివే, పన్నెండు దాటింది తినలేదేం?"

మాచమ్మ : యెప్పుడన్నా ఒకరోజు తినరు గాని, తింటాడు.

అమ్మ : ఆ తిననిరోజు యేదైనా వారం పట్టింపా?

మాచమ్మ గారు : యేమీ లేదు.

అమ్మ : యే వారాలు దేముడికివ్వకుండ అన్నివారాలు నీకే యిచ్చాడన్న మాట. నీకు మొక్కుకున్నాడా తాతగారు?

మాచమ్మ గారు : యేం మాటలవి?

ఆమెతో మాట్లాడుతూ కూర్చున్న మన్నవ వెంకట సుబ్బయ్య గారు, "ఆ మాట్లాడే అమ్మాయి సీతాపతి గారి కూతురా? యేమిటి ఆ అమ్మాయి అనేది?"

మాచమ్మ : యేమీలేదు. వాళ్ల తాతగారు అన్నానికి రాలేదేం అంటున్నది? యివాళె యింత చనువుగా మాట్లాడుతున్నది.

అమ్మ : యీ రోజుతో నిన్నుచూస్తె వుండే భయం తీర్చేసావు. నేను తప్పకుండా యిక్కడే యెక్కువ కాలం వుంటూ వుంటా. కొద్ది రోజులు నీళ్లు పోస్తూ జడవేస్తూ వుందువు గాని. నీ పిల్లగా చూచుకుందువు గాని. యిక్కడ మాట్లాడుతూ కూర్చోకపోతె ఆయన పొలం తిరిగి తిరిగి వచ్చాడు కాళ్లు పిసకరాదు?

సుబ్బయ్య గారు : యెవరన్నా అట్లా పిసుకుతుంటె చూసావా?

అమ్మ : అందరూ చేస్తూనే వుంటారు. నా వుద్దేశంలో అందరూ పిసుకుతూనే వుంటారు. ఆపని యిక్కడ మాత్రం జరగటంలా.

సుబ్బయ్య గారు : మెడ బట్టుకుని అవతలకు నెట్టివేయి పిల్లని.

మాచమ్మ : అయ్యో అయ్యో అట్లా అనబోకు చిన్నపిల్లని. వాళ్ల యిళ్లల్లో యెవరో పిసుకుతుంటె చూచి వుంటుంది. అయినా అనటంలో తప్పులేదుగా!

వెంకట సుబ్బయ్య గారు : నెట్టు నెట్టు ముందు అవతలకు నెట్టు.

ఆదెయ్య గారు యివన్ని వింటుంట్గారు.

అమ్మ : (తల వూపుతూ) యెవరు నెట్టుతారోలె వుండుండు.

మాచమ్మ : వాళ్ల నాన్నకు చెబుతుందో యేంకుమ్మో అన్నానికి కూడా రాడు. మరిడమ్మ గారికి తెలిస్తే వాకిట్లోకి రానివ్వదు. యిప్పటికే ఆమె యేదో ఒకటి అంటుంటుంది.

వెంకట సుబ్బయ్య గారు : పోబోకు. యేమిటి నీకు వచ్చే నష్టం?

మాచమ్మ : అలవాటు, పోకుండా వుండలేను. ఆమెను చూడకుండా వుండలేను.

అమ్మ : పొరపాట్లకు అలవాటు పడ్డట్టె ఆమెను చూడకుండా వుండలేకపోవటానికి అలవాటు పడ్డది.

యింతలో వెంకట సుబ్బయ్య గారి కమతగాడు వచ్చి పొలములో గండిపడ్డది తొందరగా రమ్మని కేక వేస్తాడు. వెంటనే గబగబా లేచి, అమ్మాయి అన్నట్టే అయిందే! యెవరు ముందర పోతారో నన్నది. నేనే ముందు పోవలసి వచ్చింది.

అమ్మ : యిట్లా పోవటం కాదు. రాకుండా పోవటం జరగాలి. వచ్చి ఆదెయ్య గారికి బిడ్డవై ఆమెచేత ఆయనకు సేవ చేయించేట్టుగారా. యీ దృష్టితో రావద్దు అనిగాని నిన్ను రావద్దు అనిగాదు.

వెంకట సుబ్బయ్య గారు : అంతా మరిడమ్మ గారి బోధ. భలే భలే బాంబులు పేలుతున్నయ్యే!

అమ్మ : రేపు తాతమ్మ దగ్గరకు వస్తావుగా అప్పుడు.

సుబ్బయ్య గారు : ఆపని చేయబోకు.

అమ్మ : అంటే, నీవు యిప్పుడు యేదో. చేస్తున్నట్టు వొప్పుకున్నట్లేగా. నాకేం పని చెప్పటానికి. నీవు మంచిగా వుండు.

సుబ్బయ్య గారు వెళ్లిపోతారు.

అమ్మ మాచమ్మ గారితో : యేది యెట్లా వున్నా నాకేమి బాధలేదు, ఆయన్ను బాగా చూడు.

రాత్రి 2 గంటలు అవుతుంది.

వాకిట్లో వున్న ఆదెయ్య గారి మంచము మీదకొచ్చి అమ్మ పడుకుంటుంది.

ఆదెయ్య : చిట్టితల్లీ, యింకా నిద్రపోకుండా కూర్చున్నావా? పడుకో! ఆ రంగమ్మ తల్లికి నేనంటే యెంతో ప్రేమ. అటువంటివాళ్లు వూరుకు పదిమంది వుంటె యెంత బాగుంటుందో!

అమ్మ : అటువంటివాళ్లు యెక్కువ కాలం వుండరుగా!

ఆదెయ్య గారు : కంటినీరు కారుస్తూ, పొట్టమీద తలకాయ బెట్టి నీకెందుకమ్మా యింతసేపు నిద్ర లేకుండా!

అమ్మ : తాతగారు నీలాంటి సహనం కావాలండీ అందరికీ, "సహనమంటే బాధ వుంటేగా సహనం తెలిసేది. సహనమనే దేవతను ఆరాధనగా పెట్టుకుంటే బాధలనే పరికరాలు కావాలి, పూజా ద్రవ్యాలు కావాలి. సహనమనే దేవతను **ఆరాధించాలంటే బాధలనే పూజా ద్రవ్యాలు కావాలి**".

ఆదెయ్య గారు : యిట్లాగె తెల్లవారిందాక యిక్కడే పడుకుంటావా అమ్మా?

అమ్మ : తెల్లవారిందాకే కాదు కొన్ని రోజులపాటు మీదగ్గరే పడుకుంటా!

ప్రతిరోజూ ఆదెయ్య గారు, అమ్మా అన్నం పెట్టుకుని రెండువూటలా తింటూంటారు.

ఒకరోజున రాత్రిపూట నిద్రపోతూ వుండగా మాచమ్మ గారు వచ్చి ఆదెయ్య గారి కాళ్ల పక్కన కూర్చుని పాదము మీద చెయ్యివేసి వుంటుంది. ఆదెయ్య గారికి అప్పుడే మెలుకువ వచ్చి ఆమె పాదము పట్టుకున్నా ఆయనకు మంచి తోచదు. పక్కలో వున్న బిడ్డకు యేదో, ప్రమాదము జరుగబోతున్నదని, ఆనాటి పూతన కథ మనసులో తడుతుంది. ఆయన యెప్పుడు యిటువంటి అనుభవాన్ని పొందలేదు. కళ్లు తెరచి కూడ మళ్లీ మూసుకుంటాడు యెరగనట్టు. అమ్మ అంతకంటె యెక్కువ మెలుకువగా వుండి నిద్రపోతూ వున్నట్లుగా కనపడుతుంది. అక్కడ యెవరూ లేకపోయినా పక్కన సుబ్బయ్య వుండి యేమిటో చేయిస్తున్నాడనిపిస్తుంది. ఆమె పాదము పట్టుకున్నప్పుడు ఆయనకు ఆ పాదము మంటలనిపిస్తుంది. పక్కలో యీ తల్లి వుండటంతో యీ మాత్రముగా వున్నాననుకుంటాడు. అనుకొని నెమ్మదిగా యీమాట పైకి అంటాడు.

మాచమ్మ గారు రావటం దురుద్దేశంతో వచ్చినా, తరువాత సదుద్దేశం కలిగి అమ్మను మరిడమ్మ తాతమ్మగా భావించి. (అమ్మ మరిడమ్మ తాతమ్మగా కనుపిస్తుంది, అందుచేత) అమ్మకు, ఆదెయ్య గారికి నమస్కారము చేస్తుంది.

ఆదెయ్య గారు (అప్పటికి నమ్మక) "యెందుకో యీ యేత్తేమీటో" అంటాడు. ఆరోజే ఆమె యెదుట పైకి మాట్లాడిన రోజు అది. అంతకుముందు ఆయన యందు, ఆయన మాటలయందు లక్ష్యము లేని ఆమె ఆ మాటకు గడగడలాడుతుంది. ఆయన సామాన్యమైన బలస్తుడు కాదు. మానసికంగా సహనమూర్తి, సహనములో

యెంత గట్టివాడో, శారీరకంగా అంత గట్టివాడు. ఆమె అదివరకు యెంత నిర్లక్ష్యంగా వుండేదో ఆయనకు కోపమొస్తే యెట్లాగా అని అంత భయపడుతూ వుండేది. లక్ష్యంగా వుంటుంది. తెల్లవారు ఝూము నాలుగున్నర అయింది. ఆదెయ్య గారు ముఖము పుల్ల కోసము లోపలకు వెళతారు. లోపల వున్న సుబ్బయ్య గారు అమాంతము కాళ్లమీద పడి 'యీరోజు నుండి నేను మీ బిడ్డను' అనే గద్గద స్వరముతో యేడుస్తూ నా తప్పు క్షమించమని బొడ్లో వున్న కత్తి తీసి కింద పడేసి "యిటువంటి దృష్టితో వచ్చిన దౌర్భాగ్యుణ్ణి, యేతల్లి దయవల్లనో ఆ సమయంలో నీ ముఖములో కనీ వినీ యెరుగనటువంటి రూపాన్ని చూచాను". అని రెండు కాళ్లు వాటేసుకుని వదలడు. యీ భీముడు కదలడు. ఒక అరగంట అట్లా జరుగుతుంది. అమ్మ మంచము పైననే పడుకుని వుంటుంది. మాచమ్మ గారు మంచము దగ్గరనే నుంచుని చూస్తూ వుంటుంది.

అరగంట కాగానే కాళ్లు వొదిలిపెట్టి సొమ్మసిల్లి పడిపోతాడు సుబ్బయ్య గారు.

మాచమ్మ గారు యింట్లో పని చేసుకోటానికి పోతుంది.

ఆదెయ్య గారు : పుల్ల తీసుకుని మొఖము కడుక్కోటానికి వెళతారు.

అమ్మ : ఆదెయ్య గారి దగ్గరకు వెళ్లి తాతగారు, యీరోజు తాతమ్మ వస్తుందిట, యింటికి వెళతాను. రాకపోతే మామూలుగానే తిని వెళ్తాను. వెళ్లిరానా?

ఆదెయ్య : రామ్మా అని చెక్కిళ్లు పట్టుకుని ముద్దు పెట్టుకుంటారు.

అమ్మ కూడా ముఖము కడుక్కుని యింటికి వెళుతూ "బామ్మా నేను వెళుతున్నా, తాతమ్మ వస్తుందిట".

మాచమ్మ గారు : తాతమ్మ గారు వచ్చినా యిక్కడికే వస్తుంది భోజనానికి. యిల్లు బాగు జేసుకోవద్దు!

అమ్మ : వస్తే నేను వస్తాను అని అమ్మ యింటికి వెళుతుంది.

ఆదెయ్య గారు స్నానం చేసి పొలం వెళతారు.

సీతాపతి తాతగారి పునర్వివాహం :

అమ్మ యింటికి వెళ్లేసరికి ఉదయం ఆరున్నర అవుతుంది. మరిడమ్మ తాతమ్మగారు యింకా రాలేదు. సీతాపతి తాతయ్య స్నానానికి వెళ్లి వస్తారు. ఉదయం పది అయ్యేసరికి మరిడమ్మ తాతమ్మ గారు వస్తుంది. ఆరోజుకు మాచమ్మ గారింట్లో భోంచేసి మరురోజు నుండి యింటివద్ద పొయ్యి పెడతారు.

మరిడమ్మ తాతమ్మ గారు వస్తూనే సీతాపతి తాతగార్కి సంబంధం మాట్లాడుకుని వస్తుంది. ఒక వారం రోజుల పాటు అమ్మ, సీతాపతి తాతగారు, మరిడమ్మ గారు, మామయ్య యింట్లోనే వొండుకుని తింటూ వుంటారు. తరువాత బాపట్ల యిరుగు పొరుగుని పెండ్లికి పిలుచుకుని వెళతారు. వెళ్లిన మూడోరోజే చీరాల పెళ్లికి తరలి వెళతారు. బందా సీతాపతి గారి యింట్లో విడిది దిగుతారు. అమ్మను బాషికం చూడగూడదు, రావద్దని పెద్దవాళ్లంతా అంటారు. అమ్మ బిక్క మొఖము వేసుకుని తలవంచుకుని బొటన వ్రేలు భూమిమీద రాస్తూ నుంచుంటుంది. తాతగారు అమ్మను వదిలిపెట్టి పోలేక, పెద్దవాళ్ల మాటలు దాటలేక అసలే ఆ పెళ్లి పెళ్లిగా తోచదు. ఆ సమయంలో అమ్మమ్మ పోయిన రోజు గుర్తుకొచ్చి అమ్మను భూజాన వేసుకుని కళ్ల నీళ్లు కారుస్తూ లోపల కలిగిన భావాన్ని యిముడ్చుకోలేక బహిర్గతంగానె 'నన్నింత అన్యాయం చేసి పోయినావా? నువ్వుండి నేను పోతె యెంత బాగుండేది' అని పైకే అమ్మ వినేటట్టుగా అంటారు. అమ్మ యిది వినగానే "నాన్నా! నేను వుంటాలే నీవు పో !" యీమాట వినగానే యింకా యెక్కుబుట్టి యేడుస్తారు. "ఫరవాలేదులె, అమ్మా యేదయితే అది అవుతుంది పోదాం రా" అని కూడా బెట్టుకుని తీసుకెళతారు. మామయ్య బాపట్లలోనే వుంటాడు. బందా వెంకట నరుసు గారింట్లో రాత్రి 8.50 నిముషాలకు వివాహమవుతుంది. అమ్మ పోయిన టయిం, యిక్కడ పెళ్లి అయిన టయిం ఒకటే నెల, తారీఖు, కాలం, నక్షత్రం, అమ్మమ్మ పోయినటువంటిది యిక్కడ వివాహం అయినటువంటిది. పెళ్లయి యింటికి రాగానే చిదంబర్రావు గారి తల్లి నరసమ్మ గారు లోగడ మతిస్థిమితము లేకుండా వుండి ఒకరోజు అర్ధరాత్రి వేళ మంచమ్మీద నుండి లేచి బైటకు వెళుతుంది. అదే సమయంలో అమ్మకు మెళుకువ వచ్చి తాతమ్మ లేచిపోతున్నది, తాతమ్మ లేచిపోతున్నదని బయటకు పరుగెత్తుకు వస్తుంది. బయటకు వెళ్లిన నరసమ్మ గార్కి అమ్మ కేక వినపడగానే ఒక పెద్ద లైటు వెలిగినట్టుగా కనపడుతుంది. 'అబ్బో! యింతలైటు యిదేమిటి యిట్లా వచ్చాను' అని గుర్తు గలిగి గబగబా వచ్చి గడపలో పడిపోతుంది. రెండు చేతులు అమ్మ పాదాలమీద పడతాయి, నరసమ్మ గారి ప్రాణం పోతుంది.

పెళ్లి అయి యింటికి వస్తారు. యిటూ అటూ మూడు నిద్రలు కాగానె మన్నవ తాతగారు, మరిడమ్మగారు, అమ్మ, మామయ్య మన్నవ వెళతారు. 1930 సం॥ పెళ్లినాటికి అమ్మకు 8వ సంవత్సరము. 1930 సంవత్సరం ఏప్రిల్ నాటికి 7 సంవత్సరాలు గడిచి 8 వస్తుంది. యింటికి వెళ్లగానే ఆ సంవత్సరము నుండి వడ్ల ధరలు తగ్గి, పుట్టి ముప్పైదాకా దిగువాయికి వచ్చింది. రెండు పెళ్లిళ్లు కావటం, వుపనయనం కావటం, అమ్మమ్మ పోవటం, యిన్నింటితో తాతగారికి యెంత ధాన్యం వచ్చినా ధనం కనపడదు. చాల బాధపడుతూ వుంటారు. యీ పరిస్థితుల్లో తాతగారి

చెల్లెలు కనకమ్మ భర్తగారికి జబ్బుచేసి, నిజామా బాదు నుండి వారు బాపట్లకు వచ్చి వుంటారు. వారికే సహాయం చేయలేకపోగా తాతగారు చూచి రావటానికి రైలు ఛార్జీలకు కూడా ఆ నెలంతా బాధపడతారు. ఆ తరుణం జూపూడి గ్రామ కాపురస్తుడు గుండిమెడ జానకిరామయ్య గారని మన్నవ హనుమంతయ్య గారికి అన్న అల్లుడు, మన్నవ వారందరికీ రూపాయిన్నర వడ్డీల చొప్పున ధనమిచ్చి, ఆస్తి తాకట్టు పెట్టించుకుని పొయ్యిమీద యెసళ్లు కూడ దింపి అస్తులన్నీ కట్టుకు పొయ్యేవాడు. అయన దగ్గరకు తాతగారు వెళ్లి ఆస్తి అంతా తాకట్టు పెట్టి మూడువేల రూపాయలు తీసుకు వస్తారు. తాతగారికి మాత్రం తాకట్టు అనే మాటలేదు. గ్రామమంతా ఆశ్చర్యపడి యేమి అదృష్టమో యిది. ఈయనకు మాత్రం జానికి రామయ్య లొంగిపోయినాడు అని సాయంకాలం పూట అందరూ అరుగు మీద కూర్చున్నప్పుడు గ్రామములోని పెద్దలందరు తాతగారు, అమ్మ కూర్చుని వుండగానే చెప్పుకుంటారు.

అమ్మ ఆమాట విని "మానాన్న ఆయన కల్లుడుగాదు అందుకని అట్లా యిచ్చాడు" అని పకపకా నవ్వుతుంది.

అరుగుమీద కూర్చున్న వారంతా నవ్వుతారు. ఒక అరగంటసేపు నవ్విన తరువాత "ఈయన యెట్లా అల్లుడు?" అని ప్రశ్నిస్తారు అమ్మను.

ఒక గంట బ్రతిమిలాడినా చెప్పదు అమ్మ.

చివరకు జనక మహారాజుకు సీతాపతి అల్లుడేగా! అంటుంది.

"యిదా నీ అర్థం. యెంతదానివే" అంటారు మన్నవ చిన రామసుబ్బయ్య గారు.

మునసబు గారు : చాలా తెలివి గలది. మరిడమ్మ గారి పెంపకం. పురాణ గాథలన్నీ తెలిసినాయి అప్పుడే!

యింతలో పోష్టుమాష్టరు గారు అందుకుని "ఆమె యెంతమందిని పెంచలేదు. మనలను మాత్రము దగ్గరకు తీయలా. ఆ అమ్మ జన్మ సంస్కారము అది".

సీతాపతి తాతగారు : చిన్నప్పటి నుండి అది మాట్లాడదు. వుండి వుండి ఒక మాట అంటుంది.

ప్రొద్దుగూకుతుంది అందరూ యిళ్లకు లేచి వస్తారు.

తాతమ్మగారు వంట చేసుకుంటూ అందరకూ పాటలు చెపుతూ వుంటుంది. ఈనాటి పురాణ గాథలన్నీ ఆనాడు పాటలుగా పాడేవారు.

రోజూ మరిడమ్మ గారి దగ్గరకు గ్రామమంతా పాటలూ పద్యాలు నేర్చుకోవటానికి వచ్చేవారు. విసుగు పడక మాటలు పలకని వారికి కూడా పాటలు నేర్పేది. ఆమెకు యెప్పుడూ యెవరన్నా పుడుతున్నారన్నా, చచ్చిపోతున్నారన్నా వీళ్లకు పురిటినీళ్లు, వాళ్లకు దహనము కానిది యింటికి వచ్చేది కాదు. మహా సహనమూర్తి. యింటికి రాగానే అమ్మను వొళ్లో కూర్చోబెట్టుకుని, అమ్మా అని పిలుస్తుంది. అమ్మ పలకదు.

మరిడమ్మ : మాయమ్మ పలకదేం! పలుకమ్మా పలుకు.

అమ్మకు యీమాట వినపడుతున్నా యెక్కడో ఆలోచిస్తూ వుంటుంది. అమ్మ యెవరిని గురించి ఆలోచిస్తున్నదో తాతమ్మ వారిని గురించే ప్రశ్నిస్తున్నది.

మరిడమ్మ తాతమ్మ : కాబోయే మీ అత్తగారు. నిజామబాదు నుంచి బాపట్ల వచ్చిందట వెళ్లి చూసొద్దామా? మీ మామయ్యకు చాలా జబ్బుగా వున్నదట. అసలే నా గీత మంచిది కాదు. తల్లి తండ్రి లేని పిల్లలంతా నాపాల పడటమే నాగీత. వాళ్లదేముంది? నాకు చేస్తామన్నది వాళ్లిద్దరే (అంటే 1. అమ్మమ్మ, 2. అమ్మ మామ వెంకట సుబ్బారావుగారు యింటిపేరు బ్రహ్మాండం) మీ అమ్మ దాటిపోయింది. యితనికి యిటువంటి జబ్బువచ్చింది.

అమ్మ : యేం జబ్బు తాతమ్మా? బ్రతకడా?

మరిడమ్మ తాతమ్మ : యేం జబ్బు యే ముందమ్మా, రాగూడని జబ్బే!

అమ్మ : అంటే బ్రతకడనేగా?

మరిడమ్మ తాతమ్మ : అయినా నీవు చెప్పు. నీకెట్లా తోస్తుందో. బాలవాక్యం బ్రహ్మవాక్యం అంటారు.

అమ్మ : రాకూడంది వచ్చేది బ్రతక్కుండా వుండటానికేగా?

మరిడమ్మ తాతమ్మ : పలికావు, నేననుకున్నంతా అయింది.

అమ్మ : సరేగాని తాతమ్మా కాబోయే అత్తగా రన్నావేమిటి?

మరిడమ్మ తాతమ్మ : నీ బావను పెండ్లి చేసుకుంటావేమోనని అన్నాలె!

అమ్మ : నిశ్చయంగా అన్నావే కాబోయే అత్తగారని. అనుమానంగా అనలేదే!

పాటలు చెప్పకొనవచ్చినవారు అందరూ నవ్వుతారు. వారిలో మంత్రిప్రగడ విశాలమ్మ గారు "పెళ్లి అయిందాక అట్లా చెప్పకుని ముచ్చట పడతాం. మేనత్త, మేనమామ బిడ్డలున్నారంటె యెవరికో ఒకరికి పెళ్లయిందాక అనుకోవటం

జరుగుతూనే వుంటుంది". గంగరాజు పున్నమ్మ గారి భార్య, కుటుంబాలమ్మ గారు కూడా అందుకుని అదేమాట అంటుంది. యింతలో తాతగారు వచ్చి,

సీతాపతి తాతగారు : అత్తయ్యా! అన్నం పెడతావా?

మరిడమ్మ తాతమ్మ : రా నాయనా! పెడతా, కని పెట్టుకు కూర్చున్నాను.

తాతగారు : తడిగుడ్డ కట్టుకొచ్చి కొల్లాయి గుడ్డ యెక్కడుంది, పిల్లకు కూడ మడి అంగవస్త్రం యివ్వు అంటారు.

తాతగారు, అమ్మ ఒక విస్తట్లోనె భోంచేస్తారు.

అమ్మ : భోంచేస్తుండగా, నాన్నా అన్నయ్య అన్నానికి రాలేదేం?

తాతయ్య : యెక్కడ తిరుగుతున్నాడో వాడు. రోజూ వస్తున్నాడా?

మరిడమ్మ తాతమ్మ : చదువు లేదు సరే గడా వేళకు తిండి గూడా లేదు.

తాతయ్య : యేంజేస్తాం. వాళ్లందరూ పోయి వీడెందుకో బ్రతికాడు?

అమ్మ : అట్లా అనకు నాన్నా. వాళ్లు పోవటానికి పుట్టారు, వీడు యిట్లా చేయటానికి పుట్టాడు.

మరిడమ్మ తాతమ్మ : యెంత స్థిమితంగా అన్నదో చూడరా, సీతాపతీ!

తాతయ్య : నీ మాటలే!

మరిడమ్మ తాతమ్మ : మీ అందర్నీ పెంచానుగా. దాన్ని ఒక్కదాన్నే పెంచానా? మీకు రాలేదుగా ఆ మాటలు. అమ్మాయి అన్నట్టుగా యెవరెందుకొచ్చారో అది చేస్తారని అంటూనే వున్నదిగా?

అమ్మ, తాతగారు భోంచేసి చెయ్యి కడు క్కుంటారు.

తాతమ్మ భోజనానికి కూర్చోగానే మామయ్య బాపట్ల నుండి బ్రహ్మాండం వెంకట సుబ్బారావుగారికి ప్రమాదంగా వున్నట్టుగా వుత్తరం తీసుకు వస్తాడు. నాన్నా, మామయ్యకు జబ్బు జాస్తిగా వున్నది.

తాతగారు ఆ కబురు విని, అత్తయ్యా రేపు మనమిద్దరం వెళదామా?

మరిడమ్మ తాతమ్మ : పిల్లల్ని కూడా తీసుకెళదాం.

సీతాపతి తాతగారు : మీరు తరువాత వెళుదురుగాని. ముందు "నేను చూసొస్తా" అని సీతాపతి తాతగారు అంటారు.

మరిడమ్మ గారు : సరే! పోయిరా.

అప్పటికి తాతగారికి (సీతాపతి తాతగారికి) పెళ్లయి మూడు మాసములవుతుంది.

సీతాపతి తాతగారు : అన్నీ దెబ్బమీద దెబ్బలే, వాడు బ్రతికితే తప్ప యిదికూడ యీదవలసిందేగా నేను. అమ్మ : అదేమిటి నాన్నా అలా అనుకుంటావు. మనల్ని చిదంబర్రావు తాతయ్య భరించలా! మనం కూడ ఆయనకు బరువేగా?

మరిడమ్మ గారు : యెవరూ మోయక్కర్లా. నా బండి గింజలిస్తాను.

సీతాపతి తాతగారు : బండి గింజలతోనె అవుతుందా?

అమ్మ : అసలు యిన్ని ఆలోచనలెందుకు. "యెవరి అన్నము వారికున్నది".

అంతా అన్నాలు తిని పడుకుంటారు.

సీతాపతి తాతగారు తెల్లవారు ఝామున లేచి బాపట్ల వెళతారు.

సత్యమైన వ్రతం :

అమ్మ ప్రతిరోజు సాధ్యమైనంత వరకు దేవస్థానము లోనె కాలం గడుపుతుంది. దేవస్థానము కంటె గూడ గంగరాజు పున్నయ్య గారి తోటలో చింతచెట్టు క్రిందనే యెక్కువ కాలం గూర్చుని చింత చిగురు తింటూ రోజులు గడుపుతుంది. యింటిదగ్గరవారు అమ్మ యింటికి రాకపోయినా యే పినతండ్రి గారి యింట్లో వుందోలే అని వెతకరు. బహుశా యింటికి వచ్చినప్పుడు వారు అమ్మను అడిగినా యెక్కడో తిన్నానని అమ్మ సమాధానం చేప్పేది.

ఒకరోజున తురిమెళ్ల వెంకటప్పయ్య గారు అమ్మ చింతచెట్టు మీద కూర్చుని వుండగా ఆయన చింత చిగురు కోసుకోను వస్తారు.

అమ్మ యెక్కిన చెట్టువద్దనే నుంచుని పైకి తలయెత్తే సమయంలో ఆయన యింటికి వెళ్లి యేమైనా చెపుతాడేమొ నని అమ్మ ఆలోచిస్తుంది.

ఆయనకు అమ్మ అమ్మగా కనపడక నిత్యము ఆయన ఆరాధించే సత్యనారాయణ స్వామిగా కనపడి ఆ రూపము మారి యెవరో మాల పిల్లవాడు గొడ్లను కాయ టానికి వచ్చి చింతచెట్టు యెక్కినట్టుగా కనపడుతుంది.

తురిమెళ్ల వెంకటప్పయ్య గారు : నీవు యెవరబ్బాయివిరా? యిందాకటి నుంచి చెట్టుమీద వుంది నీవేనా?

పలకడు.

పలకవేంరా! పోనీలే మాలవెధవ పలికితే ఏం? పలక్కపోతే ఏం? నా స్వామి ప్రసన్నమవుతున్నాడు అని పక్కనున్న చెట్టు దగ్గరకు వెళ్లి చింత చిగురు కోసుకోవటం ప్రారంభిస్తాడు.

అమ్మ చెట్టుమీద నుంచి చివాలున దూకుతుంది మామూలు గౌనుతో.

వెంకటప్పయ్య గారు అమ్మ వంక చూస్తాడు.

అమ్మ దూకి గబగబా పరుగెత్తుతుంది.

ఆయన గూడ వెంబడిస్తారు. యిదేమిటి యిన్ని రకాలుగా కనపడ్డది. నాకేమయినా దయ్యం పట్టినదా? అనుకొని కోసిన చింతచిగురు కూడ పారబోసి యింటికి వెళతారు. ఈయన యింటికి వచ్చే సమయానికి అమ్మ వీరింట్లోనే గవ్వలాడుతుంటె చూస్తూ కూర్చుంటుంది.

వెంకటప్పయ్య గారు రొప్పుకుంటూ "నాకు దయ్యం పట్టిందే. ముందు చింతచెట్టు దగ్గరకు పోగానె మనం నిత్యం కొలుచుకునే సత్యనారాయణ స్వామి వలె కనపడి మనకు యేమి కీడు జరగనున్నదో చివరకు మాలప్లివాడుగా కనపడ్డాడు. కనపడి నేను యింకొక చెట్టుకు పోగానె ఆడపిల్లగా కనపడి పరుగెత్తుకొచ్చింది. చిక్కలేదు. కొద్దిగా యీ అమ్మాయి కవళికలున్నాయి. యీ అమ్మాయి వచ్చి యెంతసేపయింది?"

వెంకటప్పయ్యగారి భార్య రంగమ్మ గారు : మీరు వచ్చేటప్పుడే రొప్పుకుంటూ వచ్చింది.

వెంకటప్పయ్య : చెట్టు దూకింది నీవేనా అమ్మా?

అమ్మ : నేనె మామయ్యా!

వెంకటప్పయ్య : మాల పిల్లవాడికి యెటువైపున కూర్చున్నావు చెట్టుమీద?

అమ్మ : మాల పిల్లవాడిని నేను చూడలేదు.

వెంకటప్పయ్య : నన్నన్నా చూచావా?

అమ్మ : నిన్ను చూసాను.

వెంకటప్పయ్య గారు : నన్ను జూచినప్పుడు మాలపిల్లవాడు యెందుకు కనపడలేదు?

అమ్మ : వాడు మావాడు కావటంచేత మాలవాడుగా కనపడలా.

వెంకటప్పయ్య : మాలవాడు కాకపోతే మానె యింకొక పిల్లవాడి నన్నా చూసావా?

అమ్మ : యింకొకరుగా చూడలా! ఒకరిగానె చూచా.

వెంకటప్పయ్య "నిజం చెప్పు పిల్లా" అని చెవు పట్టుకుంటారు.

చేతిలో చెవి వుండగానె యిందాక చెట్టుమీద చూచిన దృశ్యం కనపడుతుంది. ఒయమ్మో! యీ తమాషా చూసావూ! - అని పెద్దగాకేక వేస్తారు.

భార్య పరుగెత్తుకొస్తుంది.

భార్య వచ్చేసరికి పడిపోతారు. పడిపోయి కళ్లు మూసుకుని "మన యిష్టదైవం కనపడ్డాడు. మన యిష్టదైవం కనపడ్డాడు. మామూలు పిల్ల కాదు" అని కేకలు పెడతారు.

యిరుగు పొరుగు అంతా పోగయి పైత్యపు భ్రమ అని కొంతమంది చెవులో శొంఠిపొడి, దూది పెడతారు. కొంతమంది, "అసలు యెందుకు వెళ్లావు మిట్ట మధ్యాహ్నమప్పుడు. దెయ్యాల తోట అది". యెవరికి తోచినట్టు వారు అంటారు.

"అసలు యేమి జరిగిందమ్మా" అని ఆయన భార్య రంగమ్మ గారు అమ్మ నడుగుతుంది.

అమ్మ : అసలు యేమిటో తెలిస్తేగా? అసలు తెలియదు. జరిగేది కనపడుతూనే వున్నది.

రంగమ్మ : కాదమ్మా చెట్టు దగ్గర యేమి జరిగింది? అప్పుడు నీవు యెక్కడున్నావు?

అమ్మ : నేను రోజూ వెళుతూనే వున్నాను తోటలోకి. ఆ చెట్టుమీద కూర్చుంటూనె వున్నాను. రోజూ నేను నా యిష్టమై నంతసేపు చెట్టుమీద కూర్చుని వెళుతూనె వుంటాను. యీ రోజు ప్రత్యేకత యేమీ లేదు. ఆయన అనుభవమేమిటో నాకు తెలియదు.

'అంతే అయి వుంటుందిలే. పగలు నడిజామున పోవటముచేత జడుసుకుని వుంటాడు. యీ అమ్మాయి యేదో మామూలుగా వస్తుంటే యీ అమ్మాయేనని భ్రమపడ్డాడు' అని మన్నవ లింగమ్మ గారు అంటుంది (అంటే క్రిష్టయ్య తాతయ్య గారి తల్లి)

అమ్మ దారిని అమ్మ వచ్చేస్తుంది యింటికి.

ఆయన అమ్మ వచ్చిన గంట సేపటికి లేచి మామూలు స్థితిలో వుంటాడు. ఆరోజు మొదలుకొని అమ్మ యెక్కడ కనపడ్డా తన యిష్టదైవం సత్యనారాయణమూర్తి అనుకుని తనకు తెలియకుండా చేతులు జోడించి నమస్కారం చేస్తూ వుంటాడు. చూచేవారందరు ఆరోజు తనకు దయ్యం పట్టిందని, ఆ దయ్యమే యీ అమ్మాయి రూపంగా తనకు కనుపించిందని 'నా జోలికి రావద్దమ్మా' అని నమస్కారము చేస్తున్నాడు అనుకుంటారు.

పాపం ఆ బ్రాహ్మణుడు చాలా పేదవాడు. నీళ్ల బిందెలు మోసుకుని బ్రతుకుతున్నాడు. ఆరోజు మొదలు జేసుకుని తనకు అన్నింట్లో కలుసుబాటు బాగా వుంటుంది. సత్యనారాయణ వ్రతము కథలో చెప్పినదంతా నిజమేనని. దానివలననే తనకు యిట్లా కలిగినదని, యెప్పుడయినా నోచుకునేవాడు ప్రతి యేకాదశి వ్రతము యేర్పాటు చేస్తాడు.

ఒకరోజు అమ్మ కూడా ఆ వ్రతము దగ్గరకు వెళుతుంది. నేను బుట్టింది ఏకాదశే నంటుంది నవ్వుతూ.

రంగమ్మ గారు : నీకు పుట్టినరోజు పండుగ చేయమంటావా?

అమ్మ : ఈ రోజు ఆశ్లేష నక్షత్రము కదా, మీరు చేసేది నా పూజేగా!

రంగమ్మ గారు : మేము చేసేది సత్యనారాయణ వ్రతమమ్మా అంటుంది.

అమ్మ : సత్యమైన వ్రతమంతా నాకే!

వెంకటప్పయ్యగారు : చిన్న పిల్లయినా పెద్ద పెద్ద మాటలు వేస్తున్నదే!

పోలంరాజు వెంకట సుబ్బయ్య గారు : ప్రొద్దు పోతున్నది యీ పోచికోలు మాటలకేమిలే రండి!

వెంకటప్పయ్య గారు పూజకు కూర్చుంటారు.

అమ్మ యింటికి వస్తుంది.

వాగ్దానం :

సీతాపతి తాతగారు చూసొస్తానని పోయి రెండు నెలలయింది. "యింత వరకు రాలేదు. బాపట్లలో లేడని మామయ్యకు యెక్కువయిందని కబురొచ్చింది. రేపు

మనం వెళదామా అమ్మా? యీ అప్పులకు తట్టుకోలేక పెళ్లయి అయిదు నెలలన్నా కాలేదు. యెటయినా పోయినాడేమొ" అని మరిడమ్మ తాతమ్మ అంటుంది.

అమ్మ : అప్పులకు భయపట్టమెందుకు? నా మెళ్లో 150 శవరలున్నయ్యిగా అవి అమ్మి అప్పు తీర్చుకోరాదు. ప్రొద్దునే వెళదాం బాపట్ల.

మరిడమ్మ తాతమ్మ, అమ్మ, మరునాడు తెల్లవారు గట్ట అన్నీ సర్దుకుని బాపట్ల వెళతారు.

అమ్మ, తాతమ్మ అక్కడకు వెళ్లేసరికి సీతాపతి తాతయ్య కూడ ఆ ప్రొద్దున్నే వచ్చి వుంటాడు.

బ్రహ్మాండం సుబ్బారావు గారి ఆరోగ్యము కోసమని వారికి అన్ని రకాల వైద్యము అయి చివరకు బాలాత్రిపురసుందరీ వుపాసకుడు పెమ్మరాజు సత్యనారాయణ మూర్తిగార్ని (అంటే చందుర్తి కరణంగారు) తీసుకొచ్చి ప్రతిరోజు చిదంబర్రావు తాతగారి యింట్లో వుంచి తీర్థమిచ్చి మెస్మరీజం చేసేవారు. కాని తగ్గలేదు. మధ్య మధ్యలో తగ్గినట్టుగా భ్రమ కలిగి, క్రమంగా వ్యాధి యెక్కువయింది. (మార్గశిర బహుళ పక్షం.)

అమ్మను సుబ్బారావు గారు బ్రతికి వున్నంత వరకు చాల ప్రేమతో దగ్గరకు పిలుస్తూ వుండేవారు. ప్రతిరోజూ తను తినబోయే పండు చేతిలో పెడుతూ 'పాపం తల్లిలేని పిల్లవు తినమ్మా, నీకెవరు పెడతారు' అని అంటూ వుండేవారు.

వారి చిన్న కుమారుడయిన (అమ్మ మరిది) లోకనాథం గారికి కొనుక్కు తినటానికి డబ్బులిస్తూ "నీవు ఒక్కడవే తినబోకురా నాన్నా, నీవు కొనుక్కున్నదల్లా అమ్మాయికి కూడ పెడుతూ వుండు. ఆ అమ్మాయి, మనయింటి అమ్మాయే!"

లోకనాథం "యింటి అమ్మాయి యేమిటి నాన్నా మన అమ్మాయి అనవేం?"

సుబ్బా : అంటే అదొక కారణం వుందిలే. తరువాత తెలుస్తుంది నీకు అయితే జరిగితె యిప్పుడు మేనమామ కూతురు అయిన వొదిన అప్పుడు అన్న భార్య వొదిన అవుతుంది. అంటె తల్లితో సమాన మయింది. (అమ్మను) యేవమ్మా! బావను చేసుకుంటావా?

అమ్మ నవ్వుతూ యేమీ మాట్లాడదు. దూరంగా వెళ్లి నుంచుంటుంది. చిదంబర్రావు తాతగారి యింట్లో దక్షిణపు వైపు గదిలో నేల భోషాణం మీద నుంచుంటుంది.

యింతలో కనకమ్మ బామ్మగారు యింట్లోనుంచి తాతగారికి జావ గ్లాసుతో పట్టుకు వస్తుంది. తాతగారు వుమ్మి వేసుకున్న వైపు చూచి 'కళ్లె మరీ యెక్కువయిందే' అని గ్లాసు చేతిలో పెట్టి దు:ఖపడుతూ లోపలకు వెళ్లిపోతుంది. అప్పటికి అయిదు మాసముల గర్భిణి.

లోకనాధం గార్కి తొమ్మిదో సంవత్సరం వచ్చింది.

కాళ్లు లేని కుంటి పిల్లవాడు నరసింహారావు అనేవాడు. చాల అందమైనవాడు, వుండేవాడు. తెలివి గలవాడు. అమ్మ అంటే చాల ప్రేమ. తండ్రి ప్రేమ యెక్కువ. తండ్రి యెంత జబ్బులో వున్నా పక్కలోనె పడుకునేవాడు.

సుబ్బారావు తాతగారు జావ తాగి "యెందుకమ్మా అక్కడే నుంచున్నావు, యిటురా, దగ్గరకురా. చెప్పు! తప్పకుండా చేసుకుంటావా బావను? నీకు మీ అమ్మలేదు. వాడికి నాన్న లేడు".

అమ్మ : మీరున్నారుగా, లేరంటారేం? తల్లి వున్నవాళ్లకు ఒక్కతే తల్లి. తల్లిలేని వాళ్లకు అందరూ తల్లులే!

సాయంకాలం షుమారు నాలుగు అవుతుంది. చిదంబర్రావు తాతగారు కోర్టునుంచి అప్పుడే వస్తారు. రాగానె గదిలోకి వచ్చి యీ మాట విని యీ తల్లి యెందరి తల్లులకో తల్లి, యింకా ఆమెకు తల్లెందుకు?

సుబ్బారావు తాతగారు : యిప్పుడన్న మాట మళ్లీ అనండి.

చిదంబర్రావు గారు : యేమున్నది యీ తల్లి యెందరి తల్లులకో తల్లి అన్నాను. అది అంటే తెలిసేది కాదు, కంటే తెలుస్తుంది.

సుబ్బారావు తాతగారు : యేమిటో నాకు అర్థం కావటంలా! కాని ఆ అమ్మాయి ప్రశాంతత వర్ణించటానికి వీలులేనంతగా వుంటుంది. మాటలు వచ్చినట్టు వుండదు. అంటే రావని కాదు.

"నీవొంట్లో యెట్లా వుంది" అని చిదంబర్రావు తాతగారు అడుగుతారు.

సుబ్బారావు తాతగారు : యింకా యెట్లా వుండే దేముంది. కాళ్లు వుబ్బు కూడా చూపినయిగా, రోజుల్లో కొచ్చా!

చిదంబర్రావు తాతగారు కాళ్లు వొత్తి చూస్తారు. గుంటలు బడతయి. బాధతో తల వూపుకుంటూ వెళ్లిపోతారు.

సుబ్బారావు తాతగారు : (అమ్మను మరొకసారి దగ్గరకు పిలిచి) యేవమ్మా తప్పక చేసుకుంటావా మీ బావను?

అమ్మ : చేసుకుండే యోగ్యత తప్పకుండా వుంటే చేసుకుంటా!

సుబ్బారావు తాతగారు : మీ అమ్మ వుంటే యెటూ యిచ్చేది కాదు.

వెంకట సుబ్బారావు తాతగారి పక్కలో వున్న నరసింహారావు అనే కుంటి అబ్బాయి "నాన్నా అంకోయి (అనసూయ అని పలకక) మంచిది నాన్నా. తప్పక చేసుకుందాం అన్నయ్యకి".

వెంకట సుబ్బారావు తాతగారు : చేసుకున్నా, చేసుకోకపోయినా ముందు యీ పిల్లలను అలవాటు చేసుకో అమ్మా. దిగులు పడకుండా. మీ అత్తయ్యకు సుఖమంటే యేమిటో తెలియదమ్మా. చిన్నప్పటి నుంచి కష్టాలే.

అమ్మ : సుఖపడటం తెలియని మనిషికి సుఖ పెట్టటం యేం తెలుస్తుంది? ఒకరకంగా ఆలోచిస్తే సుఖమనేది ఒకరు పెట్టేది కాదు. యెన్ని వున్నా సుఖపడలేరు. సుఖమనేది మనస్సుకు సంబంధించినది.

సుబ్బారావు తాతగారు : ఊఁ చాలా పెద్దమాటలు మాట్లాడుతున్నావే ? దగ్గరకురా. (అమ్మ వస్తుంది. తన పొట్టమీద పడుకోబెట్టుకుని) నీవు తప్పకుండా బ్రహ్మాండం వారి కోడలవు కావాలని వుంది. మీ అమ్మకు నేనంటే చాలా ప్రేమ.

అమ్మ : కావాలని వుంటే అవుతానుగా, అంటె కాను.

యింతలో భారతాంబగారు, నాన్నగారు వస్తారు.

సుబ్బారావు తాతగారు : అబ్బాయి, యీ అమ్మాయి చాలా తెలివిగలది. భారతీ యెప్పుడయినా అనసూయతో మాట్లాడి చూసావా? ఆశ్చర్యకరమైన సమాధానాలిస్తుంది.

భారతాంబ : యేమొ. యెప్పుడూ మాట్లాడదు, మొద్దల్లే వుంటుంది.

వెంకట సుబ్బారావు గారు : మన్నవ వారిలో అందరికి వున్న తెలివి అన్నిపాళ్లు వాళ్లకు మిగల్చకుండా లాక్కుంది. మంచితనం కూడా అట్లాగె వున్నట్టు వుంది.

అమ్మ : ఒకరి దగ్గర వున్న స్థితిని లాక్కునే శక్తి యెవరి కుంటుంది? నే లాక్కుంటాను, జబ్బు నయం చేస్తాను అని అనుకుంటున్న సత్యనారాయణ గారికే చేతకావటంలా. చేతనయితే మీ బాధ పోయెదేగా?

సుబ్బారావు తాతగారి ముఖవర్చస్సు మారి యేదో వింతయిన వస్తువును చూస్తున్నట్టుగా చూస్తారు. నాన్నగారు, భారతాంబగారు వీరి మాటలు ఆలకించకుండానే అలమరలో వున్న పుస్తకాలు సవరించుకుని వెళతారు.

వెంకట సుబ్బారావు తాతగారు : యివాళ నీవు యెక్కడికీ వెళ్లకమ్మా అంటారు. యింతలో బామ్మగారు మళ్లీ కొంచెం జావతెచ్చి యిస్తారు.

వెంకట సుబ్బారావు : యిదిగో యీ పాపతో యెప్పుడయినా మాట్లాడావు?

బామ్మ : యేం మాట్లాడుతాం. మాటలే రావు దానికి.

వెంకట సుబ్బారావు : యెవరన్నా అంటున్నారా నీవె అన్నావా?

బామ్మ : ఒకరు చేప్పేదేముంది. నేను రోజూ చూడటంలా.

వెంకట సుబ్బారావు తాతగారు : అసలు మీరు లాలనగా దగ్గరకు తీసి వుండరు.

బామ్మ : యెవరికి తీరుతుంది దగ్గరకు పిలవటానికి?

వెంకట సుబ్బారావు తాతగారు: యెక్కడికీ పోకమ్మా. యీ రాత్రంతా నా దగ్గరే వుండు.

సాయంకాలం ఆరుగంటలవుతుంది. కొద్దిగా ఆయాసము యెక్కువ అవుతుంది. అమ్మ తొందరగా దొడ్లోకి వెళ్లి తులసిదళాలు తెచ్చి యివి నమలండి కొంచెం తగ్గుతుంది.

వెంకట సుబ్బారావు : చాలా ఆర్తితో నోరు తెరుస్తారు. నీకీ వైద్యం యెవరు చెప్పారమ్మా?

అమ్మ : మీరు బాధగా వున్నారనే ఆవేదనే చెప్పింది.

వెంకట సుబ్బారావు తాతగారు : నీవు నాదగ్గరే వుండమ్మా! యేమిటో భయంగా వున్నది. మీ అత్తయ్యను ఒక్కసారి పిలిచిరామ్మా.

ముందు విరోచనాలు అవుతాయి. క్రమంగా యెక్కువయిపోయి కళ్లు పెద్ద పెద్దవిగా చేసి ముందు మాటపడిపోతుంది.

చిదంబర్రావు గారి తల్లి సంవత్సరీకాలు అవటంతో బంధువు లందరూ యింటినిండా వచ్చివుంటారు. తాతగారి బంధువులు తప్ప, బామ్మవైపు బంధువులందరు అక్కడే వున్నారు. చిదంబర్రావు తాతగార్ని దగ్గరకు బిలిచి "నేను పోతున్నా. మీ యిష్టం" అని అమ్మవైపు నాన్నగారివైపు చేయి చూపిస్తారు.

చిదంబర్రావు తాతగారికి అర్థమవుతుంది గాని మాట్లాడరు. మరిడమ్మ తాతమ్మ 'సరేలే నాయనా' అంటుంది. యింటినిండా బ్రతికి వుండగానే పెద్ద పెద్దగా యేడుపులు సాగిస్తారు.

వెంకట సుబ్బారావు తాతగారు నోటిమీద చేయి వేసుకుని యేడవొద్దని అంటారు. నరసింహారావు అనే కుంటి పిల్లవాడు వారికి ఆ స్థితి కలిగేవరకు పక్కలోనె వున్నాడు.వారి పక్క వదిలి యెరుగడు. పిల్లవానిని చంక వేసుకోవటము వారిని భూమాతకు అర్పించటము రెండు ఒకేసారి జరుగుతాయి. క్రిందబెటట్టినా కూడ కొనవూపిరి వుంటుంది. పిల్లలందరిని యెవరి తల్లులు వారు మేడపైకి తీసుకు వెళతారు.

అమ్మ వారిదగ్గరే తలవైపున నుంచుంటుంది. నాన్నగారు యేడుస్తూ వుంటారు. బాపట్ల వెంకటరావు గారు చెయ్యి పుచ్చుకుని పక్కకు తీసుకు వెళతారు. ఆ సమయంలో ఒక్క చిదంబర్రావు గారే దగ్గర వుంటారు.

అమ్మ ప్రాణం పోయే సమయానికి "మొందరగా గుడ్డ కప్పారెందుకు" అని ముసుగు తీసి చూస్తుంది.

చిదంబర్రావు తాతగారు : యిందాకనే పోయిందమ్మా ప్రాణం అంటారు.

ఆ సమయంలో ప్రాణమున్నట్లే కళ్లు తెరచి కొద్దిగా ముఖములో ముఖము పెట్టిన అమ్మవైపు చూచి కళ్లు మూస్తారు.

చిదంబర్రావు తాతగారు : అమ్మను దగ్గరకు తీసుకుని యీ దృశ్యం చూస్తే బ్రహ్మాండం వారి కోడలవు, బ్రహ్మాండానికి తల్లివి కాక తప్పదేమొ? దృశ్యమంటే తాతగారిలోని ప్రాణము పోగానె ఒక మెరుపు మెరిసినట్లుగా అది అమ్మలోకి వచ్చినట్లు కనపడుతుంది. రాత్రి 8 గంటలకు యిది జరుగుతుంది.

బాలా త్రిపురసుందరీ వుపాసకులు పెమ్మరాజు సత్యనారాయణమూర్తి గారు మేడమీదనుండి ముఖ్యంగా యేడిచే వారి యేడుపు లాలకిస్తూ ఆయుర్దాయం లేనివారికి యెంత శ్రమపడ్డా వట్టిదే కదా అని వారు కూడా దు:ఖ పడుతూ వుంటారు.

తెల్లవారింది. బంధువులందరూ వచ్చారు. తాతగారికి స్నానము చేయిస్తూ వుండగా, లోకనాధంగారు, అమ్మ మేడమీద నుండి చూస్తూ వుంటారు.

లోకనాధం "అనసూయా మా నాన్న యింక నాతో మాట్లాడరుగా" అంటూ యేడుస్తూ వుంటాడు.

లోకనాధం : అనసూయా మా నాన్న యింక నాతో మాట్లాడరుగా అంటూ యేడుస్తూ వుంటాడు.

అమ్మ : మాట్లాడకేం ? మాట్లాడుతాడులే దిగులు పడబోకు. పోయి నాన్నకు వినపడేటట్లుగా మనం పిలిస్తే మాట్లాడతాడు.

లోకనాధం : అయితే మా నాన్న యే లోకాలకు పోతాడు అనసూయా విష్ణులోకానికా? యమ లోకానికా?

అమ్మ : నీపేరు లోకమేగా? నీవు యేలోకానివి?

లోకనాధం : నేను యే లోకము కాదు. లోకనాదాన్ని.

అమ్మ : లోకానికి నాధుడవా? యింకా యేం నీలో వచ్చి వుంటారు.

లోకనాధం : నువ్వు యెన్ని చెపుతున్నా యేడుపు వస్తున్నదనసూయా, నాకు భలే కథలు తెలుసు కాని తరువాత చెబుతాను.

అమ్మ : నీది కాదు కాని లోకం, నరసింహారావును చూస్తే దిగులుగా వుంది నాన్నా. నీది లేదనికాదు. వాడిని యెవరూ యెత్తుకోలేరు. అంతా విసుక్కుంటారు. ఆయన మాదిరిగా చూడగలవారు యెవరు? నాకు వుద్దేశమున్నా యెత్తుకోలేనుగా? అని అంటూ నరసింహారవు దగ్గరకు వెళ్లి కూర్చుని, "నాన్నా లోకం నీవుకూడా రా తమ్ముడ్ని ఆడించుకుంటూ కూర్చుందాం".

లోకనాధం : (వచ్చి కూర్చుని) 'భలే దిగులు మనోభ్రమ' అనుకుంటారు. భ్రమ అనుకోగానే అమ్మ వర్చస్సులో కాదు అన్నట్టు తోస్తుంది. లోకనాధం వచ్చి కూర్చుని భలే దిగులు పుడుతుంది అనసూయా అంటూ యేడుస్తాడు.

నరసింహారావు : లోకం నీవు యేడవబోకురా.

లోకం : నీవెందుకు యేడుస్తావు మరి?

నరసింహారావు : మానాన్న గనుక.

లోకం : నాకు అందుకేరా దిగులు.

నరసింహారావు : నీవు యేడిస్తే నేను చూడలేనురా.

యింతలో, యెత్తుకెళ్లే సమయానికి, అందరూ కిందికి రండని నరసింహారావును యెత్తుకుని, లోకాన్ని, అమ్మను చేతులు పుచ్చుకుని బాపట్ల వెంకటరాఘ గారు కిందికి తీసుకెళ్లి అందరితో నమస్కారము చేయిస్తారు.

అమ్మ కూడా వెళ్లి చెప్పకుండానె నమస్కారము చేస్తుంది.

అందరు నమస్కారములు చేయుగానె గొల్లుమని అందరూ ఒకసారిగా యేడుస్తారు. పిల్లలను మేడపైకి తీసుకు వెళతారు. అమ్మ క్రిందే వుంటుంది. శవము తీసుకువెళ్లే వేళకు సత్యనారాయణ గారు (చెందుర్తి) పిట్టగోడమ్మటే తిరిగివచ్చి పెద్దగా యేడుస్తూ కిందివైపు చూస్తారు.

అమ్మ శవం తలవైపు నుంచుని వుంటుంది. ప్రక్కనే చిదంబర్రావు తాతగారు కూడ వుంటారు.

13. ఖేదోపశమనం

శిక్షాస్మృతి :

పెమ్మరాజు సత్యనారాయణ గారు కిందికి చూచినప్పుడు ఆ చూపు అమ్మవైపు పడుతుంది. ఆ సమయంలో అమ్మ తనవైపు చూచినట్లు తను గొలిచే బాలా త్రిపుర సుందరల్లేనే వుండి, పకపకా నవ్వుతూ చెయ్యి పైకెత్తి వస్తానని వూపుతూ, 'యేమిటి నీ ముఖం నీవు చేసింది, బ్రతికిస్తానని వస్తివే?' అని అన్నట్టు వుండి వెంటనే ఆ రూపము మారి లోగడ తను చేస్తున్న కృత్రిమమైన పనులన్నీ అమ్మ ముఖములో తనే చూస్తాడు.

అమ్మ కూడ శ్మశానానికి బయలుదేరుతుంది. పక్కనున్న పెద్దలందరు 'రాకూడదు, వద్దు వద్దని' కేకలు వేస్తారు. అమ్మను వొద్దు పొమ్మని కేకలు వేసే సమయంలో సత్యనారాయణ గార్కి ఆ రూపం దున్నపోతు మీద వున్న ధర్మరాజులా కనపడి మళ్లీ మామూలు అమ్మగా కనపడుతుంది. సత్యనారాయణ గారు యిదంతా నా మనోభ్రమ అనుకుంటారు. భ్రమ అనుకోగానె అమ్మ వర్చస్సులో కాదు అన్నట్టు తోస్తుంది.

అమ్మ పిల్లలు యేమి చేస్తున్నారోనని మేడమీదకు వస్తుంది. అమ్మ వచ్చే సమయానికి పిల్లల దగ్గర సత్యనారాయణమూర్తి గారు అటు తిరిగి వచ్చి కూర్చుంటారు.

అమ్మ మామూలుగా మేడమీదికి వచ్చి "నమస్తే స్వామీ" అంటుంది.

కాని బిత్తర బిత్తర చూపులు చూస్తూ అమ్మ దగ్గరకు సమీపించగా భయపడుతూ లేచిపోతారు పక్కగదిలోకి.

పిల్లలిద్దరూ యేడుస్తూ వుంటారు.

అమ్మ పిల్లల దగ్గర కూర్చుని "నాన్నా యేడవబోకండి నేను వున్నానుగా, లోకం, నీవు యిందాక నాన్నగారికి యేమని దణ్ణం పెట్టుకున్నా".

లోకం : నాతో మాట్లాడుతూ వుండు. చదువు చెప్పు నాన్నా అని పెట్టుకున్నా.

అమ్మ : నువ్వు యేమని పెట్టుకున్నా నరసింహం?

నరసింహం : నన్ను యెత్తుకోమని పెట్టా.

యిద్దరూ కలసి ఒకేసారి అమ్మను "నీవు యేమని పెట్టుకున్నావు" అని అంటారు.

అమ్మ : మీరు పొట్టమీద పడుకోబెట్టుకుని అడిగినప్పుడు చిదంబర్రావు గారు యేమన్నారో అదే చేస్తానని.

లోకనాధం : అంటే యేమిటి?

అమ్మ : చెప్పేదికాదు. ముందు గుర్తువుంటే మీకే తెలుస్తుంది.

నరసింహారావు : అయితే నాకు చెప్పవా?

అమ్మ : నేను కని పెట్టుకుంటాలె అని పెట్టుకున్నా నాన్నా.

నరసింహారావు : అంటే యేమిటి?

అమ్మ : మరే - మరే.... (కాసేపు ఆగి) మీ నాన్నగారు యెత్తుకుండే వారనుకో. యిప్పుడు యెవరూ యెత్తుకోనప్పుడు నేను యెత్తుకుంటా. లోకనాధానికి రోజూ డబ్బులు యిచ్చేవారనుకో. యెవ్వరూ యివ్వక పోతే కూలయినా చేసి యిస్తా. మీ నాన్నగారు లేని మీ కుటుంబానికి యేది తగిలినా మనిషిని చూపలేను కాని తక్కినవన్నీ చూస్తా (తీగ గులాబి చెట్టు క్రింద నుంచుని - ఆ తీగ గులాబి అమ్మ వేసినది).

లోకనాధం : (యేడుస్తూ) నీవు చిన్నదానివేగా, యెట్లా కూలిచేస్తా?

అమ్మ : అడుక్కొచ్చయినా పెడతా లోకం. యేడవవద్దు.

సత్యనారాయణ మూర్తి గారు పక్కగదిలో వుండి యివన్నీ ఆలకిస్తూ వుంటారు. 'యీ ధీమా గల మాటలు వింటే యేదో అసాధ్యంగానే వుంది' అని తనలో అనుకుంటారు. చిదంబర్రావు గారు వచ్చిన తర్వాత చెప్పాలి. ఒక్కళ్లూ గుర్తించినట్లు లేదు యీ పిల్ల విధానం. తల్లివుంటే చాలా ఆనందపడేది పాపం! అని అనుకుంటూ యిందాకటల్లే వుందో మార్పుగా వుందో వర్చస్సు చూద్దాం అని అనుకుని బయటకు వస్తారు.

అమ్మ మామూలు పిల్లగా కనపడుతుంది.

సత్య : తను చేసే ఉపాసనా లోపం చేత యిన్ని మార్పులుగా కనపడుతున్నది. ఆ అమ్మాయి సామాన్యం గానే వున్నది.

మన్నవ కృష్ణశర్మ గారి భార్య సుబ్బమ్మ గారు పిల్లల దగ్గరకు వచ్చి "అంతా స్నానాలు చేద్దురు గాని రండి నాయనా, మీ కర్మ యిట్లా వుంది. తండ్రి లేని బిడ్డలయినారు. ఆస్తి లేకపోయినా, యెక్కడో ఒకచోట మీ గంజి మీరు తాగుతున్నారనుకుంటె కొంప మునిగింది". అందరికంటె యెక్కువగా వెంకట సుబ్బారావు గారి తల్లి, తండ్రి క్రిందపడి యేడుస్తుంటారు.

బ్రహ్మాండం శేషయ్య గారు (నాన్నగారి తాతగారు, నాన్నగారి బామ్మ రత్తమ్మ గారు) 'కడుపుకు చిచ్చు పెట్టాడు. యీ బిడ్డల్ని, తల్లిని యెవరు యీదేట్టు. ఆస్తికూడ యేమీ లేదు' అని అల్లాడి పోతుంటారు.

కనకమ్మ బామ్మ గారు స్నానాలు చేసి అంత దు:ఖాన్ని మ్రింగి పిల్లల్ని దగ్గరకు తీసుకుంటుంది.

మరిడమ్మ తాతమ్మ గారు : అన్ని తరాల్లోను తల్లి తండ్రి లేని బిడ్డలు తప్పటంలా. అని బామ్మను దగ్గర కూర్చోబెట్టుకుని "యేడవకు అమ్మా, నా బండి గింజలు నీకేయిస్తా. రెండేళ్లు గడిస్తే నీ బిడ్డ నీకు అక్కరకు వస్తాడు". అని అన్నం కలిపి నోట్లో పెడుతుంది.

కనకమ్మ బామ్మ నోరు తెరవదు.

దహనానికి వెళ్లినవారు యింటికి వస్తారు. అందరూ స్నానాలు చేసి దీపారాధన చేస్తారు. దీపాలు పెట్టే వేళయింది. యింతవరకు యెవరు భోజనాలు చేయరు. పసి బిడ్డలకు కూడా అన్నాలు పెట్టలా. ప్రొద్దుకూకింది. అందరూ భోజనాలు చేసి పడుకుంటారు. 7 గంట లవుతుంది. యెక్కడివారు అక్కడ నిద్రపోతారు.

సత్యనారాయణ మూర్తి గార్కి నిద్రపట్టదు. అటు యిటు తిరుగుతూ వుంటారు. అమ్మ పడుకుని వుంటే ముఖములో ముఖముపెట్టి చూస్తాడు. నిద్రపోయింది గదా అని మెల్లగా పక్కలో కూర్చుంటారు. ఆయన కూర్చున్న కాసేపటికి చిదంబర్రావు గారు లేచి కూర్చుంటారు.

చిదంబర్రావు గారు : యెందుకు అమ్మాయి దగ్గర కూర్చున్నారు?

సత్య : అమ్మాయి కాళ్ల తీపులతో బాధపడుతుంటె మెస్మరీజము (అంటే మంత్రాలు) చేద్దామని కూర్చున్నా.

అమ్మ యేమీ మాట్లాడకుండా పడుకుని వుంటుంది.

సత్య : కాళ్లమీద చెయ్యి వేసి రుద్దుతూ వుంటారు.

నిద్రపోతున్న అమ్మ కాస్త లేచి "మీరు పెద్దవారు, నా కాళ్లు పుచ్చుకుంటారేం?"

సత్య : బాధగా వున్నదని పట్టుకున్నా అమ్మా!

అమ్మ : యెవరికి బాధ?

సత్య : నీకేనమ్మా!

అమ్మ : నాబాధ మీకు చెప్పుకోలేదుగా. అయినా మీరు పట్టుకుంటే బాధలు తగ్గుతయ్యేంటి?

సత్య : ఆ తల్లి దయవల్ల తగ్గుతుందమ్మా.

అమ్మ : మా మామగారికి తగ్గించలేదేం?

సత్య : ఆయుర్దాయం లేనివాళ్లకు తగ్గదు.

అమ్మ : ఆయుర్దాయం లేకపోతే చచ్చిపోతారు. మీరు చేసే మెస్మరీజము బాధ నివారణకు గదా? బ్రతికి వున్నంత వరకైనా బాధలు తగ్గలేదుగా?

సత్య : అమ్మబాబోయి! యిదేమిటి అసాధ్యపు పిడతలా వుంది.

చిదంబర్రావు గారు లేచి "యేమిటమ్మా! యేమిటా గొడవ?"

అమ్మ : యేముంది. ఈయన అడుక్కుండానె అందరి బాధలు అర్థం చేసుకుంటారట. యీ ఆవరణలో యెవరెవరు యేయే బాధలతో వున్నారో చెప్పమనండి కనీసం నివారణ యెట్లా వున్నా.

చిదంబర్రావు గారు : యింత గొడవ యెందు కొచ్చింది పెద్దవారితో?

అమ్మ : పెద్దవారు పెద్దవారు కాకపోవటంతో వస్తుంది. వీరు ఉపాసకులట. వుపాసకులు. ఉపాసనంటే యిదేనా? యేం మూర్తిగారు మాట్లాడరేం? బాల వుపాసన అంటే, చిన్న పిల్లల వుపాసనా? (గద్దించి) యిదేనా వుపాసన అంటే? పలకరేం? వచ్చేవాళ్లందరికి మీరు చేసే మెస్మరీజం యిట్లాగే వుంటుందేమొ. మీరు వుపాసన మానుకున్నా సరే, వివరించి చెప్పినా సరే. (మెల్లిగా) మర్యాదగా వుంటే వుండాలి లేకుంటే మేడదిగు. (తాతగారితో) యేమిటి తాతగారు యిట్లాంటి వారందరిని పోగు చేశారు?

సత్యనారాయణ గారు మంచానికి గజం దూరంగా రెండు చేతులు కట్టుకుని తల వంచుకుని మౌనంగా, దుఃఖ ముఖంతో నుంచుంటారు.

అమ్మ తాతగారి పక్కలోకి వెళ్లి పడుకుని. "అయ్యా, ఉపాసనంతా వూరుకెళ్లింది. దివాలాకోరు మొఖము వేసుకుని బిక్క మొఖముతో చూడు యెట్లా నుంచున్నాడో అయ్యా!".

చిదంబర్రావు గారు : అంతా మీ తాత వెంకయ్య గారల్లె మాట్లాడుతున్నావే? ఆ దర్పమూ నువ్వూ. అసలు యేమిటమ్మా యీ గొడవ? యేమి చేసాడేమిటి? నీకు కోపం రావటమంటే సామాన్యము కాదమ్మా! యేదో విలయముంటుంది.

అమ్మ : ఆఁ యేమన్నా చేస్తేనా!

చిదంబర్రావు తాత : అబ్బో! మాయమ్మగారు విజృంభించిందే!

అమ్మ : అవుసరమయితే యేదన్నా చేస్తా. నాకోసరమే కాదు యిట్లా యెంతమందిని వేధిస్తున్నాడో?

చిదంబర్రావు గారు : యిదా తిరుగుడు. యిందుకా కోప మొచ్చింది. నీ అగ్ని తత్వాన్ని యెవరేమి చేస్తారమ్మా?

అమ్మ : అయితే జలతత్వాన్ని చేస్తారన్నమాట.

చిదంబర్రావు గారు : అదికాదమ్మా నేనన్నది. నీ జోలికి యేమొస్తార్లే అంటున్నాను. వాళ్లను చెయ్యమని కాదు.

అమ్మ : యింతకూ ఈయన సంగతి తేల్చండి. మేడ దించండి ముందు.

చిదంబర్రావు గారు : తెల్లవారనియ్యి అమ్మా!

అమ్మ : నిలువున నుంచున్నాడు. పడుకోబెట్టండి. పడతాడేమో.

చిదంబర్రావు గారు : స్వామీ పడుకుంటారా?

సత్యనారాయణ గారు : కదలడు.

చిదంబర్రావు గారు : పడుకోండయ్యా, పడుకోండి.

అమ్మ : దిగండయ్యా మేడ దిగండి.

చిదంబర్రావు గారు : యేమిటమ్మా తెల్లవార నియ్యరాదూ? యేదో ఒకటి చేద్దాం.

అమ్మ : తాతగారూ ఆయన, నేను, నువ్వు కూర్చుని అసలు వుపాసన అంటే యేమిటో తేల్చుకుందాం. ఆలస్యం చేస్తే ఆయన బాగుపడటానికి అవకాశము లేదు.

చిదంబర్రావు గారు : యీపూటే బాగుపరచ దలచావా?

అమ్మ : బాగుపడే రోజు వస్తేనేగా ఆయనకు అటువంటి దుర్బుద్ధి పుట్టింది.

చిదంబర్రావు గారు : అయ్యా! మూర్తిగారు యిటు కూర్చుందాం రండి.

సత్యనారాయణ మూర్తి గారు మెల్లగా అడుగులో అడుగు వేసుకుంటూ వచ్చి కూర్చుంటారు. (అమ్మ. తాతగార్ల దగ్గర.)

చిదంబర్రావు గారు : యేమిటమ్మా మాట్లాడు.

అమ్మ : మాటలతో యేమి బాగుపడతారు. మాటలతో బాగుపడే స్థితి వుంటే శాస్త్రాలతో బాగు పడేవాడు. ఆయనకు అనుభవము కావాలి కాని మాటలు అక్కర్లేదు. మీరు వుండండి తాతగారు నేను అడుగుతాను. మూర్తిగారు, అసలు వుపాసన అంటే యేమటి?

సత్యనారాయణ మూర్తిగారు దాదాపు పావుగంటసేపు మాట్లాడరు. యీ పావుగంటలో ఆయన చేసినవన్నీ కళ్లకు తట్టుతూ వుంటాయి. ఒక్కో దృశ్యం కనపడ్డప్పుడల్లా వులిక్కిపడతాడు. పావుగంట అయిన తరువాత, అమ్మా భయమేస్తుంది అంటాడు. ఒక గంట తర్వాత 'అమ్మా భయము, అమ్మా భయము' అంటూనే వుంటాడు. చివరకు అమ్మ ఒడిలో తను పసివాడైనట్టుగా వుంటుంది. యిటువంటి పసిబిడ్డలను గదా నేను మోసము చేసానను కుంటాడు. వెక్కి వెక్కి యేడ్చి అమ్మ రెండు పాదాలు పట్టుకుంటాడు. పాదాల మీద పడగానె ప్రొద్దున్న శవము దగ్గర చూచిన బాలా త్రిపుర సుందరి రూపం మళ్లీ కనపడుతుంది. అమ్మా! జగన్మాతా నీవేనా? నిన్ను అర్థం చేసుకోలేక పోయినానమ్మా! కాని యింత ప్రత్యక్షంగా అనుభవాలు యివ్వటం కోసము యిన్ని లోపములు చేయించావా నాచేత?

అమ్మ : బాల త్రిపుర సుందరి అంటె బాల అంటే. "పుటక" - త్రిపుర సుందరి అంటె "బాల్య, యవ్వన, కౌమార" స్థితులు కలిసినటువంటిది యీ బాలా త్రిపుర సుందరి. సృష్టియొక్క స్థితిగతులు త్రికాలములు త్రిపుర సుందరి కాలము అయినప్పుడు కాళి - త్రికాలాలు ఆమె రూపమే! ఆమె అంటే చేతులు, కాళ్లు, చీరె, రవిక కలిగిన ఆమె కాదు. శక్తి. శక్తి అంటే ప్రతిదానిలో గర్భితమైన శక్తి. వస్తువుకు శక్తికి విడదీయలేని శక్తి, ఆ శక్తే ఆమె.

చిదంబర్రావు గారు : యిదివరకే అన్నావు గదమ్మా? వస్తు రూపము పురుషతత్వమనీ, దానిలో వున్నది శక్తి అని, రెండింటిని విడదీయని స్థితే శ్రీవిద్య యని పుస్తకాలు చెపుతానె వున్నాయి.

అమ్మ : "విడదీయలేని స్థితి గాదు. ఆ రెంటి సంయోగములో వుండే సంధికాలమే - అదే - అవాఙ్మానస గోచరము".

సత్యనారాయణ మూర్తి గారు మాట్లాడరు.

చిదంబర్రావు గారు : యేమి స్వామీ! పాదాల మీదనుంచి తలయెత్తుతారా? పాదాలు లేతవికదూ, నెప్పులు పుడతయ్యేమొ. నాకు అడుగడుగునా దైవత్వము కంటె పసితనమే గోచరిస్తుంది. యెప్పుడూ ఆమె యేబాధ లేకుండా వుండాలని నా

కోరిక. నా జీవితంలో నేననుకున్న కోర్కెలన్నీ వ్యతిరేకమే కనుక యిది కూడ వ్యతిరేకమే కావచ్చు!

తెల్లవారుఝాము మూడు ముప్పావు అయింది.

భారతాంబ గారు మేలు కొలుపులు పాడుతూ హార్మోనియం వాయించుతూ వుంటుంది.

5 గంటలకు రెండు యెడ్ల బళ్లు కట్టించుకుని అందరూ అంటే బామ్మ, నాన్నగారు వారికి సంబంధించిన వారందరూ రేటూరు వెళతారు.

అమ్మ, చిదంబర్రావు తాతగారితో "మీరు పదోరోజు వస్తారుగా, నేను వెళతాను. లోకనాథం దిగులుపడి యేడుస్తాడేమొ. నాతో ఆడుకుంటూ వుంటాడుగా".

చిదంబర్రావు గారు : యెంత దిగుల్లో వున్నా వాడు తిన్నాడా లేదా అని అడిగేవాళ్లు వున్నారు. నిన్ను అడిగేవాళ్లు కూడా లేరు.

అమ్మ : తిండి కోసము కాదు గదా పోతున్నది. వాళ్లు ఆపదలో వున్నారు. నరసింహారావు మరీ యేడుస్తున్నాడు.

చిదంబర్రావు గారు : యింకా రేపు వెళ్లే వాళ్లు వుంటారు. వాళ్లతో పోదువు. యివాళ యీ గొడవలో నీవొద్దు.

సత్యనారాయణ మూర్తి గారు మెల్లిగా పాదాల మీదనుండి తలయెత్తి కొత్త ప్రపంచాన్ని చూస్తున్నట్టు, మళ్లీ జన్మ యెత్తినట్టుగా వుంటాడు. ఆయన లేచి "నమస్తే మాతా అంటాడు".

అమ్మ : చిదంబర్రావు గారితో తాతగారు శిక్ష అంటే క్రమశిక్షణలో పెట్టటమేనా? అంతేనా?

చిదంబర్రావు గారు : నీకు తోచినదానికి తిరుగే ముంటుం దమ్మా? అదే అందరికి రక్ష. అమ్మా మునుపు లేదుగాని జరిగిపోయిన రోజులకంటె యిప్పుడు దిగులు యెక్కువ అవుతున్నది యెందుకమ్మా? నిన్ను చూస్తున్నకొద్దీ దిగులుగా వుందమ్మా?

అమ్మ : నా నడక దిగువాయి నడకగా వుందేమొ?

చిదంబర్రావు తాతగారు : కాదమ్మా అంటారు.

సత్యనారాయణమూర్తి గారు లేచి ముఖము కడుక్కుంటారు. అందరూ లేచి యెవరి పనులు వారు చూచు కుంటారు.

అమ్మ మేడమీద గదిలో పడుకుని అత్తయ్య యేడుపు యెట్లా మానేది అని ఆలోచిస్తూ వుంటుంది. యింతకంటె యెక్కువ ఆనందం కలిగినప్పుడు గాని, రోజులు గడిచిన తరువాత గాని, చేసేది యేమీ లేదని నిరాశ కలిగినప్పుడు గాని దానంతటదే క్రమేణా తగ్గిపోతుంది. "లేనిది కలిగినప్పుడు కలిగింది పోతుందిగా అది సహజం. నవ్వు యొక్క చరమదశ దు:ఖం దు:ఖం యొక్క చరమ దశ నవ్వు".

తెల్లవారి 7-30 గంటలు అవుతుంది.

అమ్మ లేచి ముఖము కడుక్కుని స్నానం చేసి మేడమీదకు వస్తుంది. చిదంబర్రావు తాతగారు ఆఫీసులో కూర్చుంటారు. సత్యనారాయణమూర్తి గారు కూడ స్నానం చేసి మేడమీదకు వచ్చి అమ్మకు సాష్టాంగ నమస్కారము చేసి గడగడా వణుకుతూ "యీ అల్పుని త్వరగా నీలో కలుపుకో తల్లీ జీవితమంతా తప్పులే".

అమ్మ : అల్పుడని కాదు. మీబోటివారే యిలా చేస్తే, మాబోటి చిన్నవాళ్లు చెడిపోతారని మీ తప్పును మీకు తెలియపరచి, మీరు శిక్ష అనుకోవద్దు. శిక్షణ యిచ్చి మీపేరు సార్థకం చేద్దామని ఈ రాత్రి బయటపడ్డాను. నాకు యిదివరకు యీ సంగతి తెలియకపోలా! నాకు యేదైనా ఒక ఆధారం లేనిది మాట్లాడను. మీరు బాగుపట్టం కూడా నాకోసరమనుకుని బాగుచేస్తున్నాను మానవుల్లో పొరపాట్లు లేనివారు లేరు. పొరపాట్లతో కూడిందే మానవత్వం. దైవము అనే పేరు పెట్టుకుని, వాడిపేరుతో అనేకమందిని యీరకమైన మోసం చేస్తే బాధ అనిపించింది గాని సామాన్యులు చేస్తే బాధలేదు.

సత్యనారాయణ మూర్తి యెన్నంటున్నా మాట్లాడకుండా నుంచుంటారు.

అమ్మ : నేను యెవరికీ చెప్పను లెండి.

సత్యనారాయణగారు : నేను యీపూట బయలు దేరి వెళదామనుకుంటున్నాను. వచ్చిన పని అయి పోయిందిగా!

అమ్మ : భూమిమీదకు వచ్చిన పనా, యిక్కడకు వచ్చిన పనా అయిపోయింది?

సత్యనారాయణ గారు : సుబ్బారావు గారికి సుస్తీగా వుందని తీసుకొచ్చారు గదా. ఆయుర్దాయము లేనివాడిని యెవరూ బ్రతికించలేరు గదా. వెళ్లొస్తానమ్మా. చచ్చేవాడిని యేమి చంపుతావు?

అమ్మ : నాకు మిమ్మల్ని చంపాలని లేదు. మీకున్నవి చావాలని మాత్రము వుంది.

సత్యనారాయణ మూర్తి : క్రిందకి వెళ్లి చిదంబర్రావు గారితో చెప్పి వెళతాను.

అమ్మ : సరే మంచిది పోయిరండి. పోయినచోట సరిగా వుండండి. మీకీ స్వభావము ప్రమాదము లేదుగాని, యీ పోలికే మీ అమ్మాయికి వస్తే?

సత్యనారాయణ గారు : నీ నోటిమీదుగా ఆ మాట అనకమ్మా (అని పాదాలమీద పడతారు). అరే శ్రీనివాసు, చిట్టి బయలుదేరండి. అలాగు నుంచుంటారేం? క్రిందకి వెళ్లి పెదనాన్నకు (అంటే చిదంబర్రావు గారు) చెప్పి వెళదాం!

ముగ్గురూ కలిసి కిందికి వెళతారు. చిదంబర్రావు గారి దగ్గరకు వెళ్లి, "అన్నగారు వెళ్లి వస్తాము. 10 గంటలకు భోంచేసి వెళతాము".

చిదంబర్రావు గారు : సరే పోయిరండి!

తాతగారు వుండమనకుండా సరాసరి పోయి రమ్మన్నందుకు మనసులో కొద్దిగా బాధపడతారు. వంటిమనిషి వంట చేస్తుంది. అన్నీ సర్దుకుని సత్యనారాయణ మూర్తి గారు అమ్మను దగ్గరకు పిలుస్తారు "అమ్మా బాలా త్రిపుర సుందరీ, రా" అని.

అమ్మ : నేను అయినా, కాకపోయినా మీరు ఆ పేరు వుచ్ఛరించటానికి కూడ మీకు అర్హత లేదు. నా దగ్గర కాకుండా యీ మార్పు ప్రతిచోట కలిగిననాడు నన్ను పిలుద్దురు గాని.

చిదంబర్రావు గారు లేచి స్నానం చేస్తారు. నేను త్వరగా వెళ్లాలి యివాళ కోర్టుకు.

సత్యనారాయణ : మేము వెళ్లిందాకా వుండండి అన్నగారు.

చిదంబర్రావు గారు : మీరు వెళ్లిందాకా వుండే అవకాశమే వుంటే రేటూరే వెళ్లేవాడిని.

సత్యనారాయణమూర్తి గారు : భోజనమన్నా అందరం కలిసి చేద్దాం రండి!

చిదంబర్రావు తాతగారు, అమ్మ, సత్యనారాయణ మూర్తి గారు, వారి కుమారుడు, కూతురు (చిట్టి, శ్రీనివాసు) అందరూ భోజనాలు చేస్తారు. తాతగారు కోర్టుకు వెళతారు. వారు వూరుకు వెళతారు. అమ్మ స్టేషను దాకా వెళ్లి పంపిస్తుంది.

రైలు యెక్కిన తరువాత రైలు సాగబోయే ముందుగా సత్యనారాయణ మూర్తి గారు "అమ్మా దయానిధీ వెళ్లొస్తాన"ని నమస్కారం చేస్తారు.

యింతలో రైలు కూత వేస్తుంది. జెండా వూపుతారు. యీల వేస్తారు. రైలు సాగింది.

నాగేంద్ర ప్రాభవం :

అమ్మ తిరిగి వచ్చేటప్పుడు స్టేషనులో గేటు దగ్గర టిక్కెట్టు కలెక్టరు - "యే అమ్మాయి, టిక్కట్టు యేది?" అంటాడు. అమ్మ టిక్కట్టు యిచ్చేలోగా పొడుగాటి మనిషిగా యెవరో తన స్నేహితుడుగా కనపడతాడు.

టిక్కట్టు మాష్టారు గారు : అయ్యో మీరా! పిల్ల అనుకున్నానె. పిల్ల అనుకుని టిక్కట్టు ఇయ్యమన్నాను.

ఒక మనిషి : నిజమే ఒక పిల్ల యిక్కడ నుంచున్న మాట నిజమే! నేను చూచాను. ఆ పిల్ల వెనకే నేనొచ్చాను.

యింతలో అటు తిరిగి రోడ్డువైపు చూస్తాడు. అటు అమ్మాయి కనపడుతుంది. గబగబా పరుగెత్తుకొచ్చి అమ్మాయిని పట్టుకోబోతాడు. పట్టుకోబోయేటప్పటికి అమ్మ చిక్కకుండా అదృశ్యమవుతుంది. స్టేషను మాష్టారు ఆశ్చర్యపోయి, యేమిటి యీ విచిత్రమని మనసు శంకిస్తుంది. తన స్నేహితుడయిన పొడుగాటి మనిషి దగ్గరకు పోయి. ఆ అమ్మాయి పరుగెత్తి నడుస్తుంటే నేను పరుగెత్తాను. అయినా అదేమీటో తెలుసుకుందామని, టిక్కట్టు కోసము కాదు. పోయి పట్టుకోబోతే అదృశ్యమయింది. వొళ్లు ఝల్లుమన్నది. యిదంతా చూడగా నాకు ఆశ్చర్యంగానె వుంది. నాకు విశ్వాసము వున్నా లేకపోయినా దయ్యాలు, భూతాలు అనుకునేది కూడా నమ్మటానికి అనుకూలంగా వుంది యీ పరిస్థితులు.

నాకలా తోచటం లేదు. మా తలిదండ్రులకు, తాత ముత్తాతలకు అనాదిగా త్రిపుర సుందరీ ఉపాసన శ్రీచక్రపూజ వుంది. నాకీ రూపంగా దర్శనమిచ్చిందేమో ననుకుంటున్నా!

అమ్మ నేరేడు చెట్ల గుండా సరాసరి యిల్లు చేరుతుంది. చిదంబర్రావు గారు అన్నీ వాయిదాలు వేయించుకుని కోర్టు నుండి యింటికి వస్తారు. యిలాగె తొమ్మిది రోజులు జరిగి పోతాయి. పదో రోజున అమ్మ, తాతగారు రేటూరు ప్రయాణమయి వెళతారు. పదో రోజు ఒంటిగంటకు జేర్తారు. అందరూ వెళ్లి ధర్మోదకాలు విడుస్తారు. అమ్మ కూడా వెళుతుంది.

బామ్మకు అయిదవ మాసము గర్భిణీ అవుటచేత శిరోజాలు తీసివేయరు. మంగళ సూత్రాల వరకే తీసివేస్తారు. పదమూడవ రోజు మధ్యాహ్నము వరకు అందరూ అక్కడే వుండి సాయంకాలం నాలుగు గంటల నుండి బయలుదేరి రాబోతూ వుండగా, నాన్నగారి తాత బ్రహ్మాండం శేషయ్య గారు "అందరూ కూర్చోండి అన్ని సంగతులు మాట్లాడుకున్న తరువాత వెళ్లుదురు గాని".

అందరూ కూర్చుంటారు.

సీతాపతి తాతగారు : మూడో నెల రాంగానే తీసుకెళతాను.

శేషయ్య గారు : యిప్పుడు ఆ సంగతి యేమొచ్చింది నే చెప్పినా, చెప్పక పోయినా మీ బాగు కోసరం యెట్లయినా తీసుకెళతారు. నేను చెప్పవచ్చింది యేమిటంటే, వాడి ఆస్తి, అప్పు మన్నవ కిష్టయ్యకు స్వాధీనము చేసిపోయాడు. అన్నీ పోగా పండని చవిటి భూమి 4 యకరాలు వున్నది. అది స్వాధీనము చేస్తాడేమొ కనుక్కోండి అని అంటారు చిదంబర్రావు తాతయ్యతో. నా ఘటమున్నంత వరకు తిండి బెడతాను. చదువులు, సంధ్యలు నా వల్లగాదు. యిట్లా ఒక యేడాది కష్టపడితే బిడ్డ అక్కరకు వస్తాడు. చిదంబర్రావు గారితో "మీరు తల్లి లేని పిల్లను పెంచుతున్నారుగా, ఆ పిల్లనిచ్చి పెళ్లిచేసి యేదో దారి చెయ్యండి".

చిదంబర్రావు గారు : యెవరు చెయ్యగలిగింది యేమీ కనపడలా. వాళ్ల విధిలో యేదివుంటె అదే జరుగుతుంది. కొంత ఫండు వస్తుందిగా? (అంటే స్కూలు తరవున డబ్బు) అది బెట్టి యీ క్లాసు పూర్తి చేసుకుంటే తరువాత యెక్కడో అక్కడ పది రూపాయలు తెచ్చుకుని వాళ్ల అమ్మను బ్రతికిస్తాడు. మన్నవ క్రిష్టయ్య గారికి సుబ్బారావు బ్రతికి వుండగానె పొలం స్వాధీనము చెయ్యమని నాచేత నోటిసులు యిప్పించాడు.

శేషయ్య గారు : అట్లాగా నాకు తెలియలేదు! అందుకే మా పెద్దమ్మాయి, యీ తల్లిని, పిల్లల్ని మనం భరించలేం అంటున్నది. తల్లితో బాగా పోట్లాడుతున్నది.

చిదంబర్రావు గారు : యివన్నీ సరే! యెట్లాగో అవుతాయి. పిల్లని యిప్పించే బాధ్యత మాత్రము నాది గాదు. కనకమ్మకు కనపడి మాట్లాడి వెళతాను, యేమంటుందో?

చిదంబర్రావు తాతగారు బామ్మ గారి దగ్గరకు వెళతారు.

"యేవమ్మా కనకం నేను వెళ్లి వస్తాను. మీ మామగారు యిలా అంటున్నారు" అని యివి అన్నీ చెపుతారు.

కనకమ్మ బామ్మగారు : యీ పదమూడు రోజుల నుంచి యింట్లో ఆడవాళ్లతో పడటం చాల బాధగా వున్నది. మరీ మా పిన్నత్తగారు పెద్ద ఆడబిడ్డ పూర్తిగా వెళ్లమని చెపుతున్నారు.

చిదంబర్రావు గారు : పెద్ద అబ్బాయిని నేను అట్టేపెట్టు కుంటాను. నెల మాసికంలోగా వస్తూ పోతూ వుంటానులె, జరగనియ్యి.

బామ్మ : లోకనాథాన్ని తీసుకు వెళ్లండి. అనసూయతోపాటు ఆడుకుంటూ వుంటాడు.

చిదంబర్రావు గారు : అనసూయ మన్నవ వెళుతుందేమొ బహుశా!

బామ్మ : పోనీ మన్నవే వెళతాడు. మరిడమ్మగారు వుందిగా!

చిదంబర్రావు గారు : సరే! ఆమెతో చెప్పు ఆ మాట. నేను త్వరగా వెళ్లాలి. మీ అక్కయ్య వాళ్లు వున్నారుగా. అని తాతగారు బయలుదేరి వెళతారు.

ఒక గంట ఆలస్యంగా అందరూ బయలుదేరి రేటూరు నుంచి పడవకు మరిడమ్మ తాతమ్మ, సీతాపతి తాతయ్య, అమ్మ, లోకనాథం, మామయ్య మన్నవ వెళతారు. నాన్నగారు, అన్నపూర్ణమ్మ గారు, భారతీదేవి గారు బాపట్ల వెళతారు. అమ్మా వాళ్లు మన్నవ సాయంకాలం 6 గంటలకు చేర్తారు.

మన్నవ పూరి ముందర సత్రం దగ్గర పెద్ద పాము పడగవిప్పి ఆడుతూ, యెదురుగుండా నుంచుంటుంది. అమ్మ తల వంచుకుని దాన్ని చూడకుండానె దానిమీదుగానే వచ్చేస్తుంది. పక్కన వున్న రాఘవరావు మామయ్య "ఓ మొద్దూ! పాము, చూడకుండానె నడుస్తావేం?" యింతలో పదిమంది పోగవుతారు కర్రలు తీసుకుని. ఆ పాముకూడ వుత్తరం వైపు ముఖం పెట్టినది దక్షిణపు వైపు ముఖము తిప్పి అమ్మవంక చూస్తూ అమ్మ నడిచినవైపూ నడుస్తూ వుంటుంది.

రాఘవరావు మామయ్య : యీ మొద్దుకు చెపుతూనె వున్నా, తోక తొక్కవద్దని. దున్నపోతు పుటక. పగ పట్టినట్టుంది.

కర్రలు మాత్రం తెచ్చారు గాని మాధవాచార్యుల గారిది జరిగినప్పటి నుండి పామును కొట్టటానికి యెవరికి ధైర్యము చాలదు. పాము అదృశ్యమైపోతుంది. అమ్మ వాళ్లు యింటికి చేరుతారు.

మాధవాచార్యులు గారి చరిత్ర చాలా విచిత్రమైంది.

మన్నవ శివాలయంలో ఒక ప్రమాణమైనటువంటి పుట్ట ధ్వజానికి వుత్తరపు వైపున వున్నది. అందులో ఒక ప్రమాణమైన పొడుగు, పొట్టి గాని నాగేంద్రుడుండేవాడు. వాడి ప్రతి నాగుల చవితికి పాలుపోస్తూ సంతానం లేనివారు, జబ్బులున్నవారు ప్రదక్షిణాలు చేస్తూ వుండేవారు. చెన్నకేశ్వరస్వామి ఆలయంలో అర్చకుడు, ఆయుర్వేద వైద్యుడు, పాముల మంత్రగాడు, యెటువంటి సర్పాన్నీ చేత్తో పట్టుకొని ఆడించగల శక్తి గలవాడు. యీ ప్రదక్షిణాలను చేసేవాళ్లను చూస్తే ఆయనకు (మాధవాచార్యుల వారికి) చాలా హాస్యాస్పదంగా వుండేది.

మన్నవ గోపాలకృష్ణయ్య గారి కూతురు ఒకామె చాలాకాలం నుండి కడుపునొప్పితో బాధపడుతూ వుంది. ఆమె ప్రదక్షిణాలు చేయటం మొదలుపెట్టిన తరువాత కడుపులో నొప్పి తగ్గింది. ఒకరోజున ఆ పుట్టలోనె రెండు పాములు కనపడ్డాయి. మాధవాచార్యులు గారు "నిజమైన నాగేంద్రుడయితే చంపితే నన్నేమన్నా చేస్తాడేమొ చూద్దాం. స్వామి అయితే నన్ను యేదో ఒకటి చెయ్యాలి గదా" అనిచెప్పి రెండు పాములున్న పుట్టను పగల గొట్టేసి రెండు పాములను రెండు చేతుల్లో పట్టుకొని నడి బజారుకొచ్చి "దేముడని మొక్కుతుంటిరే? నేను చూడండి లాక్కొచ్చాను. నన్నేమి చంపలేదు. మీ అందరి యెదుట నడిబజారులో చంపేస్తాను. మనుషుల్లో సాధుత్వము గలవాళ్లు వున్నట్టే, పాముల్లో కూడ వుండవచ్చు. అంత మాత్రంచేత పాములు దేవుళ్లవుతాయేం?"

యింతలో మన్నవ నరసింహం గారు అందుకుని, "నీవు గుళ్లో అర్చకుడివి గామాను. నీవు కొల్చే రాళ్లన్నీ దేముళ్లేనా? చైతన్యము లేని రాళ్లే దేముళ్లని నీవు పూజిస్తుంటె, చైతన్యముతో వున్న సాధుత్వము గల పాముల్ని దైవంగా భావించటంలో తప్పేముంది? యెవరిష్టం వాళ్లది" అనుకుంటూ కోరలు తీస్తుండగా, యేదో గుచ్చు కున్నట్టుగా వుంటుంది. వెంటనే పడిపోతారు. అరగంట సేపటికల్లా ప్రాణము పోతుంది. అందరూ గుచ్చుకొని ప్రాణము పోయిందనుకోరు. నాగేశ్వరస్వామిని చంపటంతో వీడి ప్రాణం పోయింది అని. యెవరికి తోచినట్టుగా వారు అనుకుంటారు.

రోజూ ప్రదక్షిణాలు చేసే ఆమె మామూలుగా ప్రదక్షిణాలు చేయటానికి బజారుకు వచ్చేసరికి యీ వార్త తెలుస్తుంది. యింటికి వెళ్లి పడుకుంటుంది, అట్లా వారం రోజులు అన్నం, నీళ్లు లేకుండా యేడుస్తూ కన్ను తెరవదు. ఆహారం తీసుకోదు. పది రోజులు అయిన తదుపరి పాము స్వప్నములో కనపడి "యెందుకు అట్లా యేడుస్తావు? నన్నెవరూ చంపలా! నేను నీ పొట్టలోనె వున్నాను" అని పలికేటప్పుడు పాము పక్కనే ఒక చిన్న అమ్మాయి యెవరో నాలుగు యేళ్ల పిల్లగా కనపడుతుంది. తను పుట్టలో పాలు పోసేటప్పుడు పాము మాదిరిగా కనపడి అది మళ్లీ యీ కనపడ్డ చిన్న అమ్మాయిలోకి చేరినట్టుగా అగపడుతుంది. "యీ రోజునుండి, పాము లేకపోయినా పుట్టలో పాలుపోసి పో, చాలా జంతువులు తింటాయి. నాగేంద్రుడు అంటే పాము అని కాదు. "నాగేంద్రుడంటె మన వెన్నంటి కాపాడేదే నాగేంద్రుడు". అని చెప్పి యీ పిల్లకూడ అదృశ్యమవుతుంది. అది ఆమెకు స్వప్నము గాను, మెళుకువగాను కాని వున్నట్టు వుండదు. యిది యేమిటి యీ స్థితి అని పాలు తీసుకుని ఆ పుట్ట ప్రదేశము దగ్గరకు వెళ్లి తూలిపోయే శరీరంతో మెల్లగా నడుచుకుంటూ పాలు పోస్తుంది. పుట్టలేని ప్రదేశము చూచి పెద్దగా యేడుస్తుంది.

ఆ యేడ్చేటప్పుడు మళ్లీ యిందాక కనపడ్డ పాప కనపడుతుంది. యీ పాప యెవరో చూద్దాం. యీవూరు పిల్ల అవునో కాదోనని చాలా ఆవేదన పడుతుంది. పాలు పోసి యింటికి వచ్చేస్తుంది. యిది జరిగిన తర్వాత ఒక నెలకు అమ్మను చూడటం తటస్థ పడుతుంది. అమ్మను చూచిన తరువాత కల్లో కనపడ్డ అమ్మాయి యీమేనని అనుకుంటుంది. రోజా పాలు మాత్రము పోసి వస్తుంది. ఒకరోజు అమ్మ ప్రత్యేకంగ వారి యింటికి వెళుతుంది. పాలగ్లాసు చేతుల్లో పట్టుకుని పాలు పొయ్యటానికి ప్రయాణము అవుతుంది. అమ్మను చూచి తను పాలు పొయ్యటానికి పొయ్యే నాగేంద్రుడే యిక్కడికి వచ్చాడన్నట్టు మనసులో ప్రేరణ కలిగి, నాగరాజా యిక్కడికే వచ్చావా? అని పెద్దగా అరచి అమ్మను కౌగలించుకుని "నాయందు యెంత దయ నాయనా, భక్తి లేని నాబోటి దానికి భక్తి కలిగించటానికి యీరూపంగా వచ్చావా నాయనా. ఆరోజున కలలో కనపడ్డ అమ్మాయివి నీవేనా?" అని భుజాన వేసుకుంటుంది. యెత్తి భుజాన వేసుకున్నప్పుడు అమ్మాయిగా తోచదు. నాగేంద్రుడు రూపంతో తన మెడకు చుట్టుకుని పడగ నెత్తిమీద వాలినట్టుగా వుండి చేతులు పైకెత్తి పాము తన తలమీద చెయ్యిపెట్టి వత్తినట్టు తన నోటిలోకి అమృతము జారినట్టు గుటక వేసి, "ఓ నాగరాజా, నాకోసము వచ్చావా? నన్ను నీలో కలుపుకుంటున్నావా?" అని పెద్దగా కేక పెడుతుంది. నాగరాజులో ఆమె ప్రాణము లీనమయిపోతుంది. యిరుగు పొరుగువారు పరుగెత్తుకు వస్తారు. వచ్చేటప్పటికే నుంచునే ప్రాణము పోయి వుంటుంది. ప్రాణము లీనము కాగానే అమ్మ భుజము మీద నుంచి కిందికి దిగుతుంది. తరువాత అయిదు నిమిషాలకు పడిపోతుంది. శిరసులో గుండా ప్రాణము పోయి కళ్లు తెరచి వస్తున్న వారిని చూస్తున్నట్టు వుంటాయి. గుడ్లు నిలబడి పోతాయి. వచ్చిన యిరుగు పొరుగు వారంతా ఆమె పుట్టలో పాలు పొయ్యటం, ఆ దుర్మార్గుడు పామును చంపటం. ఆ దిగులుతోనె ఆమె ప్రాణము పోయింది అని అనుకుంటారు. అమ్మ ఒక ప్రక్కన గోడ మొత్తనే నుంచుంటుంది. ఆ మహాజనములో అమ్మను గుర్తించరు. భర్త యింట్లో వుండేవాడు కాకపోవటంచేత యిరుగు పొరుగు వారే పుట్టింటి వారికి కబురుచేసి ఆసాయంకాలం వరకు శవాన్ని ఆపుతారు. మరిడమ్మ తాతమ్మగారు వచ్చి శవము దగ్గర కూర్చుని, "శిరస్సు చిట్లి వుంది. యిదే బ్రహ్మ కపాళం గుండా ప్రాణం పోవటమంటారు. యెంత ధన్యురాలో! అది మహా పవిత్రత గనుక నిజంగా భర్త చేతుల్లో ఆయన యే రూపంగా చంపినప్పటికి ఆయన చేతుల్లో పోవటం చేత బ్రహ్మ కపాలం గుండా ప్రాణం పోయిందేమో"నని అంటుంది. యిట్లా పోయిన తరువాత శవాన్ని నిల్వ వుంచగూడ దంటుంది. పక్కయింటి ఆమె, భర్త చేతుల్లో ప్రాణం పోలేదు. ఆయన వూరుకెళ్లి వారం రోజులయింది అని అంటుంది.

మన్నవ హనుమంతయ్య గారు : అయితే మరి యేది కారణమయి వుంటుంది. యిటువంటి చావు మహామహా యోగులనుకునే వారికే సాధ్యమవటంలా!

అమ్మ యెరగనట్టుగా వచ్చి తాతమ్మ భుజాలమీద చేతులు వేసుకుని వీపు వెనుక కూర్చుంటుంది.

మరిడమ్మ తాతమ్మ : నీవు యెందుకొచ్చావమ్మా? పెద్ద నాపసాని లాగ. నీవు లేకపోతే యిదంతా జరగదని వచ్చావా?

అమ్మ : నేను లేకపోతె జరగదుగా యిదంతా, జరిపింది నేనే. అంటే యేదో హాస్యాస్పదంగా మామూలు మాటలుగా తీసుకుని- "నీ ముఖం యింటికి పో" అంటుంది మరిడమ్మ తాతమ్మ.

పక్కన కూర్చున్నవాళ్లు యీ అమ్మ మరిడమ్మకు కంఠమాల అని చెపుతూ "దిగమంటే దిగవేం! నీవెందుకు చిన్నపిల్లవు పో బైటకు" అని చెయ్యి పట్టుకుని లాగి, బైటకు పంపిస్తారు. అందరు మాధవాచార్యులు గారే కారణంగా తీసుకుని యింకా యీ తతంగం, తిరిగే భర్త కోసం యెందుకు ఆపుతాం. ఒకచోట వున్నాడనే గుర్తు లేదుగదా. యెవరో ఒకరు తీసుకెళ్లి దహనం చెయ్యండి. అని నిశ్చయించుకున్న తరువాత తల్లి తండ్రి తెలిసి వస్తారు. భర్త తెలియకుండా వస్తాడు. దహనం జరిగిపోతుంది. చక్కగా పసుపు కుంకుమతో వూరేగింపుతో తీసుకు వెళతారు. పనులు పూర్తి అవుతాయి. యెవరి యిళ్లకు వారు వెళతారు.

బాంధవి :

సుబ్బారావు గారు పోయినారనే దిగులుతో సీతాపతి ఒక యింటివాడయినాడను కుంటె మళ్లా దీని కర్మ యిట్లా వచ్చిందని యేడుస్తూ ఆదరించటానికి వచ్చేవారందరికి సమాధానాలు చెపుతూ వండి పెడుతూ వుంటుంది మరిడమ్మ తాతమ్మ.

సీతపతి తాతగారు యీ సంసారము కూడ మన నెత్తిన పడ్డది. వడ్లకు ధర తగ్గిపోయింది. యెట్లాగా యీదటమని చాలా విచారంగా వుంటారు.

అమ్మ చెట్లకింద, పుట్లకింద, చెరువుల్లో, కాలవల్లో, కట్టమీద యెక్కడబడితే అక్కడ నిశ్చింతగా ఆడుకుంటూ వుంటుంది. యిట్లాగే రెండు మాసములు గడుస్తాయి. మూడోనెల ప్రవేశించగానే మరిడమ్మ తాతమ్మ గారు వెళ్లి పిల్లల్ని, బామ్మను రేటూరు నుంచి తీసుకొస్తుంది. నాన్నగారికి సెలవలు యిస్తారు. నాన్నగారు కూడ వస్తారు. బామ్మను యిక్కడే అట్టి పెట్టుకుంటారు. వచ్చిన రెండు మాసములకు ప్రసవించుతుంది. చైత్ర బహుళ యేకాదశి నాడు సాయంత్రం 4 గంటలకు ఆడపిల్ల.

పురుట్లోనె బామ్మను తాకి, పిల్ల నెత్తుకు మోస్తూ వుంటుంది. పాపత్తయ్యకు కూడా పురుడు పోసింది గొల్ల నాగమ్మే. యిరుగు పొరుగూ అందరూ జేరి ఆడపిల్ల పుట్టింది, ఆడపిల్ల కోసం కలవరించి చచ్చిపోయాడు. ఆడపిల్ల పుట్టేసరికి లేడుగదా అని అందరూ యేడుస్తారు. సుఖంగా 11 రోజులు గడుస్తాయి. స్నానం చేయిస్తారు.

అమ్మకు 9 సంవత్సరముల 15 రోజులు.

పాప పుట్టిన రోజు మొదలు జేసుకుని పాపకు 6వ నెల వచ్చిందాక, ఒక క్షణం కూడ వదిలిపెట్టి వుండదు అమ్మ.

లోకనాథం బాబాయిని మన్నవలో స్కూల్లో చేర్చారు.

అమ్మ పాపకు వుగ్గు పెట్టటం నేర్చి, పోతపాలు అలవాటు చేసి, అమ్మతో పోయిస్తూ తన కుంటి పిల్లవాడయిన నరసింహారావు పని చూస్తూ వుండేది. పాపత్తయ్యకి నీళ్లు మాత్రము బామ్మ పోసుకుంటూ వుండేది. అమ్మ రోజు రెండు మూడు యిళ్లు తిరిగి ఆవుపాలు తెచ్చి పాపకు పోస్తూ వుండేది.

నాన్నగారికి హైస్కూలు శలవలు అయిపోయి బాపట్ల వెళతారు. తరువాత సీతాపతి తాతగారు "యీ సంసారం నేను భరించలేను" అంటారు. సరాసరి బామ్మతో అనక, పులిపాక చల్లమ్మ గారితో అంటారు. ఆమె వచ్చి మరిడమ్మ తాతమ్మతో అంటుంది.

మరిడమ్మ గారు : అచ్చంగా తనే భరించనక్కర్లేదు, నా బండి వడ్లు వున్నాయి. అని యిద్దరు చెప్పుకుంటుండగా బామ్మ వింటుంది.

కనకమ్మ బామ్మ : (మరిడమ్మ తాతమ్మతో) నేను యెక్కడో అక్కడ పని చేసుకుని బ్రతుకుతాను, అన్నయ్యకు కష్టం కలిగించటం యెందుకు అని బయలుదేరి పిల్లల్ని తీసుకుని బాపట్ల పోతానని బెజవాడ వెళుతుంది.

బెజవాడ రైల్వే స్టేషను దగ్గర యెరిగి వున్నవాళ్లు కనపడతారు.

నాన్నగారు బాపట్ల నుండి మన్నవ వచ్చి, "నిజమాబాదు బంగళా నుండి సామాను తీసుకెళ్లమని కబురొచ్చింది. అమ్మ యేమి చెపుతుందో నేను పోదామంటే రైలు ఛార్జీకి డబ్బు లేదు. మామయ్యా! యేం చెయ్యాలో తోచటం లేదు".

సీతాపతి తాతగారు : నేను యేంచేసేది? నావల్ల యేంకాదు. వడ్లకు ధర తగ్గిపోయింది. పుట్టి రు. 28 లు కూడా అమ్ముతున్నది. వడ్ల ధర తగ్గినా ఖర్చులు తగ్గించుకోలేకుండా వున్నాం.

మరిడమ్మ తాతమ్మ : నాన్నా నాగేంద్రా! యిట్లా రా అన్ని విషయాలు చెప్పి మీ అమ్మకు కష్టం తోచి బాపట్ల వెళతానని వెళ్లింది. బాపట్లకు రాలేదా?

నాన్నగారు : రాలేదే!

అమ్మ : ఒకవేళ బెజవాడ వెళ్లిందేమొ. నిన్న నరసింహారావుతో చెపుతుంటె విన్నాను.

మరిడమ్మ తాతమ్మ : నరసింహారావుకు కూడ మీనాన్న జబ్బే ప్రారంభించి నట్టుంది నాన్నా.

నాన్నగారు : (కంటతడి పెడుతూ తల వంచుకు కూర్చుంటారు.) యేమీ చెయ్యటానికి తోచదు. అడుక్కొచ్చయినా ఆమెకు పెట్టి నేను తింటాను.

లోకనాథం, అమ్మ చిన్న చిన్న కథలు చెప్పుకుంటూ అరుగు మీద కూర్చుంటారు. రాత్రి 7-30 గంటలు అవుతుంది.

నాన్నగారు వాళ్లిద్దరూ కూర్చున్నచోటుకు వస్తారు. లోకనాథం చేతిలో ఒక అర్థ రూపాయి పెట్టి "యేమన్నా కొనుక్కు తిను. అమ్మ నీతోనన్నా చెప్పిపోలేదా" అంటారు.

లోకనాథం : చదువుకుంటూ అనసూయతో ఆడుకుంటూ వుండు మళ్లా వచ్చి తీసుకెళతాను. నరసిమ్మాయికి మందు యిప్పించి తీసుకొస్తానని వెళ్లింది.

నాన్నగారు : (లోకనాథాన్ని దగ్గరకు తీసుకుని) నీవు దిగులు పడబోకు నాన్నా. నాన్నగారు యెక్కడికి పోలా. నిజామబాదులో వుద్యోగం చేస్తున్నారు. మనం వెళదాం అంటారు.

మరిడమ్మ తాతమ్మ గారు భోజనాలకు పిలుస్తుంది. అందరూ భోజనాలు చేసి పడుకుంటారు.

అమ్మ ప్రొద్దుపోయిన తరువాత రోజూ పున్నయ్య గారి తోటలోకి వెళ్లేది మానుకుని, నాన్నగారు పడుకున్న మంచం దగ్గరకు వెళ్లి చేతి గాజు ఒకటి తీసి నాన్నగారి చేతిలో పెట్టి "యిదిగో బావా, ఒకటి అత్తయ్య తీసు కెళ్లింది. ఒకటి నీకివ్వమన్నది. నిజామాబాదు నుంచి వుత్తరం వస్తే వెళ్లి సామాను తీసుకు రమ్మన్నది. యెవరికీ చెప్పవద్దన్నది. దిగులు పడవద్దు. యే దిక్కు లేనివారికి దేముడే దిక్కని ఆమె వెళ్లింది".

నాన్నగారు : యివి మా నరసింహారావు మురుగులల్లే వున్నాయి. మా లోకనాథానికి వుండేవి. చిన్నప్పుడు నాకు వుండేవి. యివి యీట్లా ఖర్చు పెట్టుకోవలసి వచ్చింది. యివి (మురుగులు) అమ్మవే. నాన్నగారు గుర్తు తెలియక అంటమే.

అది జేబులో పెట్టుకుని నిద్రపోతారు. తెల్లవారుఝామున లేచి బెజవాడ వెళతారు. బెజవాడ స్టేషనంతా వెతికినా (బొమ్మ) కనపడదు. నాన్నగారు బెజవాడ నుండి నిజామాబాదుకు వెళ్లి సామాను తీసుకు వస్తారు. బాపట్లకు. సామాను దాచుకోను చోటులేక యెవరడిగితే వారికి యిస్తారు. ఒకరు బెంచి యివ్వమని, ఒకరు కుర్చీ యివ్వమని, తలోరకంగా అడిగి తీసుకుంటారు. నాన్నగారు ఆటల్లో గెలిచిన అద్దాలు రెండు భారతాంబ గారికిస్తారు.

14. భారతీ విలాసము

ప్రదక్షిణాలు :

బామ్మ బాపట్ల చేరిన వారం రోజులకే భారతాంబ గారికి యేదో గాలి బట్టిందని పడిపోయిందని కబురు వస్తుంది అత్తవారి యింటి దగ్గరనుంచి. (అత్తవారి యిల్లు వూళ్లోనె.) చిదంబర్రావు గారికి ఒక్కతే కూతురవటం చేత చాలా గారాబంగా వుంది. బామ్మకు తను రావటం చేత వచ్చిందని అంటారేమోనని బాధపడుతూనే వుంది. భారతాంబ గారి అత్తవారింట్లో మీ నాన్న యేదో హత్య చేసాడు. అదే చుట్టుకుందని అంటారు. పున్నమ్మ గారు రంగమ్మ తల్లి పట్టి యేడిపిస్తున్న దంటుంది. చిదంబర్రావు తాతగారు అత్తగారి యింట్లోని వరిపిడి వల్ల మనస్సు చెదిరి వచ్చి వుంటుందంటారు. యీ భయంతో పిల్లకు యిట్లా వచ్చిందని అందరూ బయలుదేరి రావలసిందని మన్నవకు కబురు చేస్తారు. కబురు చేయగానే మన్నవ నుంచి అందరూ వస్తారు. మన్నవ నుంచి అందరూ వచ్చేసరికి భారతాంబ గారిని పుట్టింటికి తీసుకు వస్తారు.

భూతవైద్యుల్ని తీసుకొచ్చి వైద్యాలు చేయ ప్రారంభిస్తారు.

అమ్మమ్మ పట్టిందనే కారణంతో అన్నపూర్ణమ్మ గారికి అమ్మ మీద ప్రేమ తగ్గుతుంది. గుంటూరు జిల్లాలో వున్న భూతవైద్యాలన్నీ అయిపోతాయి కాని వ్యాధి తగ్గదు.

భారతాంబ మామ దేశిరాజు రంగారావుగారు వచ్చి యిదియేదో వంశంలో వున్నటువంటి మహా హత్య చేసిన పాపము యేదో వుండి యిట్లా వచ్చిందని అంటారు. యెక్కడో ప్రశ్నకెళితే యిది చెప్పారు. యిది తండ్రి చేసినదని అంటారు.

అమ్మ : (తాతగారి కుర్చీ పక్కనే వుండి చెప్పేదంతా విని) మొన్న నేను అణా పెట్టి ప్రశ్న కెళితే దేశరాజు రంగారావు గారి రెండో కొడుకు. స్ఫోటకం పోసిన పిల్ల

చచ్చిపోయిన యిద్దరు కలిసి పట్టి పీక్కుతింటున్నారని చెప్పారు. కావలిస్తే మనం పోదాం రండి, చెప్పినవారిని చూపిస్తా.

చిదంబర్రావు తాతగారు : బల్లమీద చేయిబెట్టి కొట్టి పకపకా నవ్వి, బావగారూ బావగారూ అంటారు.

దేశిరాజు రంగారావు : (చిన్నబుచ్చుకుని కూర్చుని) పోదాం. రండి. యెవరీ అమ్మాయి అసలు.

చిదంబర్రావు గారు : అన్న మనమరాలు, బావమరిది కూతురు. రోజూ లోగడ మీ యింటికి వచ్చేదే.

యింతలో యీ చప్పుడు విని యింట్లోనుంచి అన్నపూర్ణమ్మ గారు, సీతాపతి తాతయ్య, మరిడమ్మ తాతమ్మ, తెనాలి వెంకట సుబ్బయ్య తాతగారు, అందరూ వస్తారు.

వెంకట సుబ్బయ్య తాతగారు కొంచెం బాధగా యింట్లో ప్రవేశించటమే చాలా పెద్ద జబ్బులో వున్నట్టుగా గాక ఎక్కువ ప్రమాద స్థితిలో వున్నట్టుగా వుంటుంది ఆయన వర్చస్సు.

అన్నపూర్ణమ్మ గారు విని యేమిటి పెద్దగా వినిపించింది యింట్లోకి?

చిదంబర్రావు గారు : ఆఁ యేమీలేదు. చిన్నపిల్లగాదూ! తెలిసి తెలియని మాటేదో అన్నది.

అన్నపూర్ణమ్మ : యేమిటి ఆమాట, నే చెపుతాను. యేమన్న దేమిటి పెద్దవారిని?

చిదంబర్రావు గారు : యేమీలేదు. యేదో మన తరపున హత్య జరగటంవల్ల అమ్మాయికి జబ్బు వచ్చిందని యెవరో చెప్పారట. ఆమాట అన్నారు వారు. అనగానే అమ్మాయి అందుకుని వారికి తప్పుడు సంతానం వున్నారని పోయినారని నాకుకూడ తెలియదు. అమ్మాయి యెక్కడ విన్నదో యేమొ వారికి యిద్దరు పిల్లలు పోయినారట. ఆ పిల్లలు యిద్దరు అమ్మాయికి పట్టినారని అన్నది.

అన్నపూర్ణమ్మ గారు : అబద్ధమేమున్నదీ? లక్ష్మణాచార్యులు గారు అన్నారు.

చిదంబర్రావు గారు : అట్లాగా! నాకు తెలియదుగా మరి. యివన్నీ అనవసరం, దాని విధి యెట్లా వున్నదో అట్లా జరుగుతుంది.

దేశిరాజు రంగారావు : యేది యెట్లా జరిగినా, మాయింట్లోను వద్దు, మీ యింట్లోను వద్దు. యెక్కడన్నా యిల్లు అద్దెకు తీసుకుని వుండండి, పిల్లకు తగ్గిందాక.

చిదంబర్రావు గారు : సరే ఆలోచిస్తాం. భోజనానికి లేవండి. భోంచేసి పోదురుగాని.

దేశరాజు రంగారావు : చేయనండి. త్వరగా వెళ్లాలి. స్కూలు వేళయింది.

అమ్మ : అన్నం తినే పని యెక్కడయినా వుందిగా?

దేశరాజు రంగారావు : యీ పిల్ల యెవరండి? చాల అసాధ్యంగా వుందే!

చిదంబర్రావు గారు : యిందాకే చెప్పాకదండి ఫలానా అని. చాలా (యింటలిజెంట్) తెలివిగలదే - యెవరు యెట్లా అనుకుంటే అట్లా అని మెల్లగా అనుకుంటారు.

దేశరాజు రంగారావు : వెళ్లొస్తాను బావగారు. త్వరగా యిల్లు ఖాళీ చేయండి. యింకా రెండు మూడు నెలలు చూసి, వాడికి వేరే పెళ్లి చేస్తాను. వాడూ చిన్నవాడు అని వెళ్లిపోతారు.

అన్నపూర్ణమ్మ గారు : యేమి సంబంధం. మొదట్లోనె చెప్పా, వద్దో అని, దేశరాజు వారి సంబంధం. వాళ్లు బాగ్యవంతులని భ్రమపడి అన్నివిధాల పిల్ల నోట మట్టికొట్టాం.

చిదంబర్రావు గారు : అబ్బా! అనవసరంగా మాట్లాడకుండా ఫో లోపలికి.

అమ్మ : అయితే తాతయ్యా, మన్నవ వెంకయ్య గారు మీకిచ్చి చేసి అత్తయ్య నోట్లో మన్ను కొట్టినట్టేగా?

చిదంబర్రావు గారు : అరవబోకమ్మా ! అందరూ నీమీద కోప్పడతారు. ఆయనకు చూడు యిందాక నీమీద యెంత కోపమొచ్చిందో?

అమ్మ : వచ్చేదేముంది తాతగారు ! వాళ్లకు వున్నదేగా!

అందరూ వెళ్లి భోంచేస్తారు.

సాయంకాలానికి యిల్లు ఖాళీచేసి రైలు అవతల యింట్లో చేరుతారు.

రైలు అవతలనే యింకో పూరి యిల్లు తీసుకుని బామ్మ, నరసింహారావు, లోకనాథం, నాన్నగారు వుంటారు. అమ్మ అక్కడా ఇక్కడా తిరుగుతూ వుంటుంది.

నరసింహారావుకు జబ్బు యెక్కువయింది. యిది క్షయ అని నిర్ణయించారు. సాల్వేభిక్ అనే డాక్టరు గారు మందు యిస్తున్నారు. వ్యాధి క్రమంగా హెచ్చిపోయింది. పాపకు తలనిండా వుళ్లు. అమ్మకు రొండంత వుండే పాపను యెప్పుడూ యెత్తుకోవటం వల్ల అట్లా వున్నా పుళ్లకు మందు రాస్తూ పెంచుతూనె వుంది. యిట్లా రెండు నెలలు జరిగిన తరువాత నరసింహారావు చచ్చిపోతాడు.

భారతమ్మ గారికి యెన్ని భూత వైద్యాలు చేయించినా వ్యాధి నయం కాలేదు (అంటే మూర్ఛలు తగ్గలేదు). చివరకు ఒకరోజు యింకొల్లు వారు యేవరో వచ్చి (నారవరాజు నల్లబ్బాయి గారు వచ్చి) యింకొల్లు, పావులూరు మధ్య ఆంజనేయస్వామి వున్నాడు. ఆయన చాలా మహత్యం కలవాడని, ఆ విగ్రహం వెలిసిందని అందరూ చెప్పుకుంటున్నారు. వారికి కావలసిన వస్తువులు మేము చూపిస్తాము అక్కడ సత్రము కూడ వున్నది పంపించండి అని చెప్పి వెళతారు.

చెప్పిన మరునాటి రాత్రి ఆంజనేయస్వామి కనపడ్డట్టుగా కల వచ్చి లేచికూర్చుని, "నాన్నగారు! కలం కాగితం యివ్వండి" అంటుంది. ఆయన తడువుకుంటూ వెళ్లి తెచ్చి యిస్తారు. దీపం వెలిగించే లోగానే అయిదారు పద్యాలు రాస్తుంది. దీపం లేకుండా రాసినా చక్కగా రాస్తుంది. ఆరాత్రి ఆ పద్యాలు తాతగారు చదువుకుని చాలా ఆనందపడి ఆయన చెప్పినదంతా నిజమే ఆ వర్ణన రాస్తేనే యింత బాగుంది, అక్కడకు వెళ్లి చూస్తే యెంత బాగుంటుందో. తప్పకుండా పంపించాలి అని అన్నపూర్ణమ్మ గారిని లేపి ఆ పద్యాలు చదివి వినిపిస్తారు. తప్పకుండా వెళ్లాల్సిందే అంటుంది ఆమె కూడా.

మూడో రోజు కాస్త తోడుగా వుంటుందని అమ్మను తీసుకుని భారతాంబ గారు, బిజుమెళ్ల రాఘవయ్య తాతగారు, అన్నపూర్ణమ్మ గారు కలిసి పొలిమేర అంజనేములు దగ్గరకు వెళ్లి అక్కడ సత్రములో కాపురముండి ప్రదక్షిణాలు ప్రారంభం చేస్తారు.

మిరియాలతో రెండుపూటలా 108 ప్రదక్షిణాలు చేసి పూటకు బిందెడు పానకం, 5 కొబ్బరికాయలు, తవ్వెడు అర సోలెడు వడపప్పు చేసి రెండు పూటలా సహస్ర నామార్చన పూజ యిద్దరు బ్రాహ్మలకు భోజనం పెడుతూ చేస్తూ వుంటారు. నివేదన చేసినా బ్రాహ్మలకు తప్ప యెవరికీ పెట్టేవారు కాదు.

అమ్మ రోజూ యీ వడపప్పుని అట్టేపెట్టి మధ్యాహ్నమప్పుడు అన్నీ కలిపి వంట బ్రాహ్మణుడు అయిన రాఘవయ్య గారినడిగి చింతపండు, పచ్చి మిరపకాయలు, ఉప్పు తీసుకుని పచ్చడి రుబ్బి, చెరువుకట్ట మీద చింతచెట్టు కింద కూర్చుని బాటసార్లకు, పావులూరి నుంచి గుడ్డలు వుతకటానికి వచ్చే చాకళ్లకు, అక్కడ పనిచేసే వాళ్లకు, అందరికీ యింకా అక్కడ వుండి ప్రదక్షిణాలు చేసే బీదవాళ్లకు కూడా పెడుతూ వుండేది అమ్మ రోజూ. ఒకరోజు అమ్మ భారతి పిన్నికి కాళ్లు పిసుకుతూ పచ్చడి రుబ్బటం మానేస్తుంది. ఆరోజు చాలామంది 'అమ్మాయిగారు వున్నారా? అమ్మాయిగారు వున్నారా' అని అడుగుతారు. ఆరోజు తాతగారు వస్తారు ఆరోజు ఆదివారము.

చిదంబర్రావు గారు : మా అమ్మాయికి పరపతి పెరిగి పోయిందే! పలుకుబడి యెక్కువగా వుంది యీ వూళ్లో! నాకుకూడా యింత వత్తిడి లేదు.

పావులూరి చాకలి రామన్న : అయ్యా! యీ పూట అమ్మగారు లేకపోతె బువ్వలోకి పచ్చడి లేదు. బువ్వలేదు. ఆ తల్లి రోజూ పళ్లెము అన్నము పెట్టేది. పోనీ వూరికే చూచన్నా పోతాము. యెక్కడున్నారో పిలవండి.

దగ్గర వేసున్న తలుపు తెరచి "అదిగో చూడండి" అంటారు తాతగారు.

రామన్న : కొంచెము బయటికి రామ్మా!

అమ్మ గబగబా లేచి వస్తూ తాతగారు తెచ్చిన అరటి పళ్లు తీసుకుని రామన్న వొళ్లో వేస్తుంది.

రామన్న (రెండు చేతులు పట్టుకుని దగ్గరకు తీసుకుని చెక్కిళ్లు పట్టుకుని) "యివాళ యెంతమంది అల్లాడి పోయినారమ్మా" అంటూ (చంక నెత్తుకుని బయటకు తీసుకెళ్లి), "నీ చేతులు నెప్పులు పుట్టటంలా అమ్మా, కాళ్లు పిసుకుతుంటె అంత లేత చేతులు చూడు యెట్లా కందిపోయినయ్యో" అని చేతులు తెరచి చూస్తాడు.

అమ్మ : నేను మీకోసం రుబ్బే పచ్చడో, దాని కోసరం చేతులు కందిపోవా?

రామన్న : నీవా అమ్మా పచ్చడి రుబ్బేది. అంత పచ్చడి నువ్వు రుబ్బుతావా? నువ్వేనా యేం తల్లి. నీవేనా రుబ్బేది చెప్పు. (అట్లా అంటూ వుండగానే అతని తమ్ముడు గోపన్న వస్తాడు).

గోపన్న : నిజమే అమ్మాయిగారే నూరటం.

రామన్న : అదిగాదురా. కాస్తో కూస్తో నూరొచ్చు. అంత పచ్చడి యెక్కడ రుబ్బుతుంది?

గోపన్న : చాలవుంది రోటి నిండ వుంది. పాత్రంతో కూడ అమ్మాయిగారు కూడ తిరుగుతా వుంది. అప్పుడు భలే ముద్దొచ్చింది నాకు!

యింతలో పనిచేసే అంకమ్మ అటొచ్చి "అమ్మా యివాళ బువ్వకు చంపావేం!"

రామన్న : నీకు అట్లాగె వుందీ! అందరికి అంట్లు తోముతావె, యెవరు అంత ముద్ద వెయ్యరు నీకు? నీవుకూడ అట్లాగె అనుకోవాలీ!

అంకమ్మ : పొరుగూళ్లనుంచి బియ్యం తెచ్చు కొనటం కాదు. అణా డబ్బులిస్తారు గాని అన్నం పెట్టరు. అన్నం మిగిలితె రాత్రిళ్లు వారే తింటారు.

రామన్న : మా తల్లి యెంతమంది కడుపులో మంట చల్లారుస్తున్నది అన్నపూర్ణమ్మ తల్లి!

గోపన్న "యిప్పుడే యిట్లా వుంది. ముందు యెట్లా వుంటుందో" అంటాడు.

రామన్న : ముందు ముందు చూడము గదా. పెద్దవాళ్లము అయిపోతిమి.

అన్నపూర్ణమ్మ గారు : యెక్కడికి వెళ్లావు, భారతి పిన్ని కాళ్లు పిసకమంటే! యేమిటి అక్కడ నువ్వు నుంచుని చేసే పని?

చిదంబర్రావు గారు అందుకుని "స్నానము చేసి ప్రదక్షిణాలకు వెళ్లే వేళయిందిగా. యిందాకట నుంచి పిసికిందిగా, పిసికితే తగ్గుతాయా? అన్నం తిన్నావా లేదా అని మాత్రము అడిగేది లేదు. కాళ్లు పసికావా లేదా అని మాత్రము అడుగుతారు. చెట్టును కోసుకు వచ్చినట్టుగా వుంది".

రాఘవయ్య గారు "బాగా చెప్పారు" అంటాడు మెల్లగా తాతగారికి వినపడేటట్టు, అన్నపూర్ణమ్మ గారికి వినపడకుండా.

అమ్మ గబగబా వచ్చి భారతమ్మ గారి కాళ్ల దగ్గర కూర్చుంటుంది. అందరూ కాఫిలు తాగుతూ అమ్మకు యివ్వరు.

చిదంబర్రావు తాతగారు : యేవమ్మా నీవుకూడ తాగు అంటారు.

అమ్మ : నాకు అలవాటు లేదు తాతగారూ, కాఫీ సహించదు.

చిదంబర్రావు తాతగారు : నీకు సహించవా, వాళ్లు యివ్వరా?

అమ్మ : ఒకరోజు యివ్వవస్తే వద్దన్నట్టున్నాను. అప్పటినుంచి వాళ్లు అడగరల్లే వుంది.

చిదంబర్రావు తాతగారు గ్లాసులో వున్న కాఫీ చింది పోయేటట్లుగా నవ్వుతారు. "రెండూ సందిగ్ధంగానే వున్నయ్యి గనుక యిప్పుడు నేను యిస్తా తాగు."

తాతగారు గ్లాసులో పోసియిస్తారు, అమ్మ తాగుతుంది.

అన్నపూర్ణమ్మ గారు : దీనికి అంతా చంద్రమౌళి వారి పోలికలు వచ్చినాయి.

భారతమ్మ గారందుకుని : ఆఁ ఆ పోలికలు వస్తే బాగుపడేది.

అన్నపూర్ణమ్మగారు, భారతమ్మగారు యిద్దరు చర్చ చేసుకుంటారు. మన్నవ వారి పోలికని భారతమ్మగారు, చంద్రమౌళి వారి పోలికని అన్నపూర్ణమ్మ గారు తరచుకుంటారు.

అమ్మ : (విని విని) నాకు యెవ్వరి పోలికలు రాలా, మా అమ్మ, నాన్న యిద్దరి పోలికలు వచ్చినాయి.

చిదంబర్రావు తాతగారు : పకపకా నవ్వి, పిట్టపోరు పిట్టపోరు పిల్లి తీర్చిందంటారు యిదే కాబోలు! యిది అట్లా లేదు పిల్లి పోరు పిల్లి పోరు పిట్ట తీర్చింది. రెండువైపులా పిల్లుల్ని చేసింది.

దౌష్ట్య వారిణి ః

ప్రొద్దుగూకింది. రామాచార్లు గారు వస్తారు.

"భారతమ్మా! త్వరగా స్నానము చేసి రావమ్మా, పూజ చేస్తాను" అని అమ్మవంక చూచి "యీ అమ్మాయిని గురించి చాలా యెక్కువగా చెప్పుకుంటారండి, యీ అమ్మాయి అందరికి పచ్చళ్లు, అన్నాలూ దానం చేస్తుందట. మావూరు చాకళ్లు చాలా ఆప్యాయతగా చెప్పుకుంటారు. అదీగాక అమ్మాయి వర్చస్సులో చక్కటి ప్రశాంతత, ఆదరణ మూర్తీభవిస్తుంది. బీదలంటే చాలా ప్రేమ!".

భారతమ్మ గారు స్నానానికి వెళుతుంది.

చిదంబర్రావు తాతగారు : యెవరు యెట్లా గుర్తిస్తే అట్లా మూర్తీభవిస్తుంది ఆ తేజస్సు. మొన్నటివారం నేను వచ్చినప్పుడు కొండారెడ్డి అనే కుర్రవాడు యిక్క డున్నాడు. యిప్పుడు లేనట్టున్నాడు. వాడు నాతో 'నేను ప్రదక్షిణం చేసే ఆంజనేయ స్వామి యీ అమ్మాయిలా కనపడుతూ వుంటుందండీ' అని అన్నాడు. ఆ అబ్బాయి చెప్పిన మాటలు నమ్మటానికి అనేక కారణాలున్నాయి.

రామాచార్లు గారు : అదంతా యేమొ కానీండి. ఆ అమ్మాయి దగ్గర చిన్నపిల్లల లక్షణాలు యేమీ వుండవు. మొన్న క్షయరోగపు అతను చేతిలో డబ్బు లేక చాలా దూరం నుండి నడిచి వచ్చాడు. ఆ రోజు అతని చరిత్ర అంతా విని, అతని దగ్గర ఒంటరిగా చాలాసేపు కూర్చుంది. తరువాత విచారిస్తే తన మెడలో వున్న కాసులు రెండు తీసి యిచ్చిందని తెలిసింది. అతను కంసాలి బత్తుడు. యివి దొరికినవి అంతే చాలని ప్రదక్షిణాలు కూడా మానుకుని వెళ్లాడు. చిన్నతనం కాదు. పాత్ర యెరిగి దానం చేయటం తెలియదు.

అమ్మ : మీకు రోజూ యిక్కడ భోజనం పెట్టటం పాత్ర తెలిసిన దానమేనా? అసలే నాకు వైష్ణవులన్నా, నంబివారన్నా గిట్టదు. మీకంటె మాదిగవాళ్లు చాలా నయం. అందులో యిక్కడ మీ పాత్రత యెట్లా వుందంటే తోమని రాగిచెంబులా (చిలుము) వుంది. నీకు యెవడు రూపాయలు ఇవ్వకపోతె వాడల్లా చెడ్డవాడె. అయినా మీ

యింట్లో నీ అమ్మ, నీ అక్కయ్య, నీ చెల్లెలు, నీ కూతురు లేదూ. నీ నడక యిట్లా వుండకూడదు యిక్కడ. యిక్కడ మీ పాత్రత యేమిటి? యిక్కడ పనికిరాదంటే యెక్కడన్నా చెయ్యమని కాదు. యెక్కడయినా మీ అమ్మగానె చూచుకోవాలి అందర్ని. యింకా తతిమ్మా కులాల్లో, తతిమ్మా శాఖల్లో చెడ్డవాళ్లు లేరని కాదు. మీరంటే, సాక్షాత్తు భగవంతుడ్ని అర్చించేవారని, అంశ కలవారని, మీద్వారా తీర్థ ప్రసాదాలు వస్తే ఆ భగవంతుడే పెట్టినట్టు భావించి తీసుకుంటారు. మీకు కొంత ఆస్తి యిచ్చి మిమ్మల్ని అర్చించే వారుగా నిర్ణయించే అధికార ముద్ర వేసి గర్భాలయాల్లోకి పంపించి మీచేత శటారి పెట్టించుకుని, శటారి పెట్టించు కోవటమంటే దేవుని పాదాలు నెత్తిన పెట్టించుకోవటం. దానికి బదులుగా మీ కాళ్లు మా నెత్తిన పెట్టించుకుంటున్నాం. తిరునాళ్లు అనే వంక బెట్టుకుని భరతనాట్యం కొరకై కళావంతుల్ని తీసుకు వచ్చి వాళ్ల భరతం చూడకుండా వాళ్లని భరతం పడుతున్నారు. విగ్రహాలను చాటు చేసుకుని నిగ్రహం లేకుండా ప్రవర్తిస్తున్నారు.

చిదంబర్రావు గారు : యేమిటమ్మా యింత విచ్చలవిడిగా మాట్లాడుతున్నావు?

అమ్మ : వీళ్లేగా ఆయన్ను చంపింది, నిన్ను జైల్లో పెట్టించింది. యివే కారణాలు నేనన్నవే కారణాలు. చిన్న పిల్లలు యేడిస్తే మారామంటారు. పెద్దవాళ్లు యేడిస్తే కుళ్లుమోతు తనం అంటారు. యేమీ తెలియని వాళ్లు చేసేదానికి, అన్నీ తెలిసిన వాళ్లు చేసే దానికి, యేడుపులు ఒకటయినా తేడా యింతగా వుంటుంది.

రామాచార్యులు గారు : నేను వెళ్లివస్తానండి. డొక్కలో నెప్పి యెక్కువగా వుంది. అమ్మాయి గారిని నామాలు చెప్పుకుని పూజ చేసుకోమనండి.

అమ్మ : శుభం!

తాతగారు : సరే నాయనా, పోయిరా!

భారతమ్మ గారు : స్నానం చేసొచ్చి పూజ ఆమె చేసుకుంటుంది. యిప్పటికి 25 రోజులవుతుంది. వచ్చి నప్పటికంటె సుగుణంగానె వుంది. యెట్లాగో యీ పదిహేను రోజులు అయిపోతె వెళదాం అని అంటారు అన్నపూర్ణమ్మ గారితో తాతగారు.

తెల్లవారి తాతగారు వూరుకు వెళతారు.

రామాచార్యులు గారు ఆరోజు యెందుకో రారు.

భారతమ్మ దురుసుతనం :

ఆరోజు భారతాంబగారు కడగా వుంటుంది. యీ ప్రాంతాల్లో వుండకూడదు, పక్కవూళ్లకు వెళ్లమంటారు అక్కడున్నవారు. వర్షము కురుస్తూ వుంటుంది. నుంచో

టానికి తావులేదు. యేవూరు పోదామంటె, యేవూరు పోదామనుకుని పావులూరు పోవటానికి నిశ్చయించుకుంటారు. వర్షంలోనె నుంచునుంటుంది.

అన్నపూర్ణమ్మ గారు యేడుస్తుంది 'యెంత కష్టమొచ్చింది అని'.

అమ్మ : యెందుకు అత్తయ్యా యేడుస్తావు. పిన్నిని లోపలకు వచ్చి కూర్చోమను. నిజంగా భారతి పిన్నికే దేముడిని మైలపడేసే శక్తి వున్నప్పుడు, ఆ దేముడికి ప్రదక్షిణాలెందుకు?

అన్నపూర్ణమ్మ గారు : యేడ్చినట్టే వుంది!

అమ్మ : యెవరు యేడ్చినట్లు. యిందాక భారత పిన్ని రోడ్డుపైని పడిపోయినపుడు యేడిస్తివె - అట్లాగా?

రాఘవయ్య గారు : నేను వంటచేసి తీసుకొస్తాను. అన్నీ సర్దుకుని పావులూరు వెళ్లండి. పావులూరు ఇక్కడకు మైలున్నర ఉంటుంది. అక్కడ రామాచార్లు గారు కూడా సాయపడతారు.

అమ్మ : పడే సహాయము చాల్లా! యింకా యేమిటి ఆయన సహాయము - అయినా ఆయన్ను అన్నా లాభమేమిటి?

రాఘవయ్య గారు : సరేగాని అమ్మాయి నేను వండేది రోజు ప్రమాణంగానె వండుతున్నా గదా - నీవు తీసుకు వెళ్లేది ప్లేటు అన్నమే గదా యింతమందికి యెట్లా పెడుతున్నావు?

భారతమ్మ గారు రోడ్డుమీద నుంచునుంటుంది.

అమ్మ : యిక్కడ వుండే వాళ్ల అందరి యిళ్లల్లో కాస్త కాస్త అడిగి తీసుకెళ్లి పెడుతున్నా.

అన్నపూర్ణమ్మ గారు సామాను సర్దుతూ 'నాకు ఒక్కగా నొక్క పిల్ల పుడితే యీ రాత వచ్చింద'ని యేడుస్తూ వుంటుంది.

రాఘవయ్య గారు : అంట్లు తోమేవాళ్లకే యింత అన్నము యివ్వరే - నీకు పళ్లాలతో యెవరు అందిస్తున్నారు?

అమ్మ : నేను పోయి అడగంగానె నన్ను చూస్తే వాళ్లకు యివ్వాలనిపిస్తున్నది.

రాఘవయ్య గారు : అయినా కనుక్కుంటూ పద.

అమ్మ : నీవు బిజబిళ్ల రాఘవయ్యలే లేవు. గుదిబండ రాఘవయ్యలే వున్నావు!

రాఘవయ్య గారు : నేను నీకు గుదిబండనా?

అమ్మ, రాఘవయ్య గారు, అన్నపూర్ణమ్మ గారు, భారతమ్మ గారు పావులూరు నడిచి వెళుతుంటారు.

దారిలో పొలాల్లో ఆగుతూ, పెసరకాయలు కోసుకుంటూ వాళ్లు ముందు, అమ్మ వెనక మెల్లిగా రెండు గంటలకు పావులూరు చేరుతారు.

వెళుతూనె రామాచార్లు గారింటి ముందు నుంచుని రామాచార్లు గారు వున్నారా? అని అడుతుతారు.

యింట్లో లేరని యింటివారు చెపుతూ, మీరు యెవరు? బాపట్లవారా? అని అడుగుతారు.

అన్నపూర్ణమ్మ : అవునండి!

"అక్కడ నుంచున్నారేం లోపలకు రండి" అని రామాచార్లు గారి అక్కగారు పిలుస్తారు.

అన్నపూర్ణమ్మ గారు : రావటానికి పిల్ల కడగా వుంది. యీ మూడు రోజులు యెక్కడయినా తల దాచుకోవాలి. యిల్లు వాకిలి లేక రాలేదు. కష్టకాలమొచ్చి వచ్చాం.

యింతలో రామాచార్లు గారు వస్తారు.

పాపం ఆయన చీట్లపేక ఆడి ఆడి చమట తీసివేసి, దివాలాకోరు మొఖము వేసుకుని, వుల్లిపాయ పకోడిలు పొట్లం చేత్తో పట్టుకుని, పాపం అర్చకుడు వస్తుంటాడు యెదురుగుండా. వీళ్లను చూచేసరికి ఆయన ప్రాణం లేచివచ్చి వొళ్లు తెలియకుండాపోయి, యెప్పుడొచ్చారంటాడు. చేతిలో పకోడీల పొట్లాం కింద పడుతుంది. కాకులు ముసిరి పకోడిలన్నీ యెత్తుకుపోతాయి.

అమ్మ : చాలా మంచి శకునం రామాచార్లు గారి రాకడ కాకులు రాకడ ఒకేసారి జరిగింది. పిండం వేస్తే కాకులు ముసిరినట్టుగా ముసిరి యెత్తుకు పోయినయి కాకులు.

అన్నపూర్ణమ్మ గారు : అపశకునపు మాటలు వస్తున్నయ్యి దీని నోటివెంట. అపశకునపు పక్షిలా వుంది. కొని తెచ్చుకున్నాం వెంట.

"యిక్కడ నుంచున్నా రెందుకు పోదాం రండి. కలిదేశయ్య గారు వున్నారు. పెద్ద యిల్లు. వారికి సంతానం లేదు. మంచివారు. మీవారే నియోగులు".

అమ్మ : యెవరయితే మనకేం వినియోగపడితే సరి!

దేశయ్య గారింటికి వెళతారు.

రామాచార్లు గారు యింట్లోకి వెళ్లి, ఫలానావారు వచ్చారని చెపుతారు. దేశయ్యగారు వాకిట్లోకి వస్తారు. రాగానే అమ్మను చంకనేసుకుని లోపలకు రండమ్మా అంటూ అమ్మను లోపలకు తీసుకు వెళతారు.

దేశయ్య గారు : యేమె! యీ అమ్మాయిని చూచావు, అంతా బాలా త్రిపుర సుందరల్లే వుంది!

చేస్తున్న పని మానుకుని చేతులు కడుక్కుని గబగబా వచ్చి, దేశయ్య గారి చంకలో వున్న అమ్మను తను యెత్తుకుంటుంది. ఆమె అమ్మను విపరీతంగా ముద్దులు పెట్టుకుంటూ "యీ అలంకారం యీ అందం అంతా అమ్మవారల్లేనె వుంది!"

యింతలో రాఘవయ్య గారు వచ్చి. "అమ్మా పదార్థాలన్నీ తెచ్చుకున్నాం, వంట చేసుకుంటాం. వంట చేసుకునే చోటు చూపించండి" అని దేశయ్య గారి భార్య రుక్మిణమ్మ గారిని అడుగుతాడు.

దేశయ్య గారు : యెంతమంది మీరు?

రాఘవయ్య గారు : నలుగురము.

రుక్మిణమ్మ గారు : చేసిన వంటే వుంది. చాకళ్లకు, జీతగాళ్లకు, కావటివాళ్లకు వండుతాం గదా. ఆ వంటే వున్నది. ముందు భోజనము చేయండి. తరువాత అందరికీ కలిపి మీరే వండుదురు గాని రాత్రికి. తెచ్చిన పదార్థాలు మూట విప్పబోకండి.

రాఘవయ్య గారు : మా అమ్మగారితో చెప్పి వస్తాను.

దేశయ్య గారు : మీరు యెందుకు. నేను చెప్పి వస్తాను. (అని వెళ్లి) అమ్మా భోజనాలకు లేవండి. మనమందరం బంధువులమే. యీ రూపంగా వచ్చారు. కడగా వున్న అమ్మాయి గది ఖాళీ చేసాము. అందులో వుంచండి. ముందు ఆ అమ్మాయికి అన్నం పెట్టించండి. చిదంబర్రావు గారు మాకు బాగా తెలుసు. యెవరెట్లా వున్నాయీ అమ్మాయి రావటం మాకు చాల కన్నుల పండువగా వున్నది. మా ఆవిడ శ్రావణ శుక్రవారము వ్రతము చేసినప్పుడు అమ్మవారు యిట్లాగె అలంకరించి వుంటుంది. యివాళ మా యింటికి సాక్షాత్ అమ్మవారు వచ్చినట్టుగా పిల్లలు లేని కొరత తీర్చేటట్టుగా కన్నుల పండుగ్గా వున్నది. మీ అమ్మాయికి జబ్బు యిందుకోసమే వచ్చిందనుకుంటాను. యీ పాపను మాకు దత్తత యివ్వండి.

అన్నపూర్ణమ్మ : నాదేముంది నాయనా. వాళ్ల నాయన వేరే వున్నాడంటుంది.

రాఘవయ్య గారు భారతమ్మ గారికి గదిలోకి తీసుకొచ్చి అన్నం పెడతారు.

అన్నపూర్ణమ్మ గారు స్నానం చేసి అన్నానికి వెళుతుంది.

రామాచార్లు గారు భారతాంబ గారితో మాట్లాడి వెళతారు.

ఆమెకు మళ్లీ మూర్ఛలు ప్రారంభమవుతాయి.తెంపు లేనన్ని మూర్ఛలొస్తాయి. మూర్ఛ తెలిసినప్పుడు మళ్లీ ఆహారం అదీ బాగానే తీసుకుంటుంది. బాగానే మాట్లాడుతుంది. మూర్ఛ వచ్చినప్పుడు మాత్రము కదలకుండా పడుకుంటుంది. యిది మినహా తతిమ్మాదంతా ఒక యింట్లో పెళ్లి మాదిరిగా చాలా ఆనందంగా, నిత్య కళ్యాణం పచ్చ తోరణంగా జరిగిపోతుంది. మూడు రోజులనుకున్నందుకు పది రోజులు జరిగిపోతుంది. కాని అన్నపూర్ణమ్మగారు ఆమెకు మూర్ఛలు రావటంతో చాలా జిజ్ఞాసగా వుంటుంది. బయలుదేరి వచ్చేటప్పుడు అందరికి బట్టలు పెడతారు. వచ్చే రోజున మరీ మూర్ఛలు యెక్కువగా కనపడతాయి. యెన్ని దేముళ్లకు మొక్కినా, యేమీ కనబడలేదనుకుంటుంది అన్నపూర్ణమ్మ గారు.

అమ్మ : అత్తయ్యా! నేను ఒక మాట చెపుతా వింటా? పిన్నికి మూర్ఛలు తగ్గిపోతాయి. నూరు కొబ్బరి కాయలు కొడతానని దణ్ణం పెట్టుకో! ఒక వెయ్యిమంది బీదలకు అన్నదానం చేస్తాననుకో తగ్గిపోతుంది.

అన్నపూర్ణమ్మ గారు : నేను పెట్టుకోవటమెందుకు? ఆ దణ్ణం నీవే పెట్టుకో. తగ్గితే చేద్దాం. బాల వాక్యం, బ్రహ్మవాక్యమని ఒకవేళ తగ్గుతుందేమొ.

దేశయ్య గారు : పకపకా నవ్వుతూ, యింతకూ యే దేముడికి దణ్ణం పెట్టుకున్నావమ్మా. యే దేముడయింది చెప్పలేదేం?

అమ్మ : యేదో దేముడన్నాను గాని. యింతమంది దేముళ్లుంటారని నాకు తెలియదు. అదేదొ మనకు మించింది. మనకు అర్థం కానిది. ఆ శక్తికి కొట్టమన్నా కొబ్బరికాయలు.

అన్నపూర్ణమ్మ గారు : సరే అట్లాగె. యీపూట నుంచి ఆగిపోతె కొడదాం.

ఆపూటనుండి మూర్ఛలు రావు భారతాంబ గారికి. రెండెద్దుల బండి మాట్లాడి బండిమీద అందర్ని పంపించేస్తారు. యీ పదిరోజులు కూడ కలుపుకుని మండలం నమస్కారాలు చేస్తుంది.

అమ్మకు ఒకరోజున మధ్యాహ్నమప్పుడు ప్రదక్షిణాలు చేద్దామనిపిస్తుంది. యెందుకంటె రామాచార్లు గారు అక్కడున్నవారు ఆ విగ్రహాన్ని గురించి చాలా మహత్యమున్నదని చెపుతారు. ప్రదక్షిణాలు చెయ్యగానే చాలా దృష్టాంతరాలు కనపడతాయని చెపుతారు. అదేమిటో చూద్దాం. అయినా నాకు మిరియాలు లేవు ప్రసాదానికి పడపప్పు లేవు యేం పెట్టి చేసేది? అందుకు చాలాసేపు ఆలోచించి, రాఘవయ్యగారి నడిగి పెసరపప్పు పెట్టించుకుని చేద్దాం అని అనుకుని రాఘవయ్య గారి దగ్గరకు వెళ్లి "రాఘవయ్య గారూ కొంచెం పెసరపప్పు పెడతారూ?"

రాఘవయ్య గారు : యెందుకమ్మా? మొన్న పావులూరు వెళ్లి వచ్చినప్పటినుండి మీ అత్తయ్య గారు నామీద చాలా కోపంగా వున్నారు.

అమ్మ : యెందుకు?

రాఘవయ్య : అక్కడ చాకళ్లు నీవు చాలా బాగా పెడతావని చెప్పారట. అవేమొ నేను నీకు యింట్లో వస్తువులు యిస్తున్నానని అనుకుంటూ వున్నారు. అదిగాక రామాచార్లు గారి విషయంలో నీవు మాట్లాడింది భారతాంబ గారికి చాల బాధగా వుంది.

అమ్మ : వున్న యదార్థమేగా నేన్నది. ఆమె సంబంధమేమీ లేదె!

రాఘవయ్య : యేమొమరి. చాలా బాధగా వున్నారు. నిన్నేమొ యెక్కువగా చూచారని పావులూరు నుంచి వచ్చినప్పటినుండి.

అమ్మ : సరే వెళ్లమంటారా, యేమన్నా పెడతారా!

రాఘవయ్య : సరే పట్టు (అని యింత బెల్లము, కాసిని పెసరపప్పు వొళ్లో పోసి) వాళ్లు నిద్రలు పోతున్నారు దొడ్డిదారిని పో.

అమ్మ గబగబా మూట కట్టుకుని పరుగెత్తు తుంటుంది.

భారతాంబగారు నిద్రలేచి యెదురు వస్తూ "యెక్కడికి పరుగెత్తుతున్నావు? యిటురా" అని చెయ్యి పట్టుకుంటుంది.

అమ్మ ధైర్యంగా నుంచుని వొడి చూపిస్తుంది.

భారతాంబ : యెక్కడికి తీసుకెళుతున్నావు? యెవరు పెట్టారు? బుద్ధిలేదా? అని చెంపమీద కొడుతుంది.

కొట్టగానే రాఘవయ్య గారి మనస్సు చివుక్కు మంటుంది.

ఆయన వచ్చి నుంచోగానె రెండో చెంపమీద గూడ వేస్తుంది.

రాఘవయ్య : తల్లిలేని పిల్ల యెందుకు అట్టా కొట్టుకుంటారు యేమి తప్పు చేసిందని. ఆపాపం నేనే మూట కట్టుకున్నాను. (అంటున్నకొద్ది జడ పట్టుకుని వంగదీసి వీపుమీదకూడ కొడుతుంది).

యింతలో అన్నపూర్ణమ్మ గారు లేచి యేమిటి యీ చప్పుడు అని వస్తుంది.

భారతమ్మ : యేమిటా? తెచ్చిపెట్టుకున్నావు మిడి మేళాన్ని. చూడు ఆ పెసరపప్పు చూడు. రోజూ యెన్ని పోసుకు పోతున్నదో (అని బుగ్గ మెలిపెడుతుంది).

"ఊరుకో భారతి" అని చెయ్యి లాగేస్తుంది అన్నపూర్ణమ్మ గారు. "అసలే మైదాపిండి లాంటి వళ్లు. చూడు యెట్లా కందిందో!"

రాఘవయ్య గారు : ఒక దెబ్బకాదు. మీరు లేవకముందు చాలా కొట్టింది.

అన్నపూర్ణమ్మ గారు : యేవమ్మా యెన్ని కొట్టావు? అంటూ అమ్మను వొళ్లోకి తీసుకుని. తల తడువుతూ కళ్లనీళ్లు పెట్టుకుంటుంది. వాడికి పోయి పోయి యీ రెండు నలుసులు బ్రతికాయి. బ్రతకొచ్చే సరికి తల్లి లేకుండా పోయింది. మన పాలబడ్డారు.

అంటుండగానే, "యెక్కించుకో నెత్తిన" అంటూ తలమీద ఒక దెబ్బ వేస్తుంది భారతాంబ.

అన్నపూర్ణమ్మ : (చెయ్యి లాగేసి) యెందుకే అట్లా కొట్టుకుంటావు? నిన్నల్లా కొట్టే పెంచామా? అని భారతమ్మ గారిని కోప్పడి, నీవెళ్లి ఆడుకో అమ్మా, పో! అంటుంది.

భారతాంబ గారు అమ్మ దగ్గర పప్పు యిల్లంతా వెదజల్లుతుంది.

భేద రహిత :

అమ్మ బయటకు వెళ్లి స్వామి దగ్గరకు పోయి 'యేమిపెట్టి ప్రదక్షిణము చేయనా' అని ఆలోచిస్తుంటుంది.

చేలోకి వెళ్లి వేరుశనక్కాయలు కోసుకొచ్చు కుందామని లోపలగా వెళ్లి కాయలు కోయటం ప్రారంభం చేస్తుంది. వొళ్లోకి ఒక గిద్దెడు కాయలు కోసుకుంటుంది. దూరాన్నుంచి ఒక మనిషి కర్ర భుజాన పెట్టుకుని కేక వేస్తాడు. అమ్మ తనను కాదన్నట్టు యింకా కోస్తూనే వుంటుంది. ఆ కేక ఒకసారి పెద్ద కేకవేసి కర్ర విసిరివేస్తాడు. అమ్మకు తగలకుండా ఒక జాన యెడంలో పడుతుంది. అమ్మ అతనివంక చూస్తూ

కోస్తున్నాననే మాట మర్చేపోయి, "కర్మ యివాళ అందరికి నన్ను కొట్టాలనే అనిపిస్తున్నదే యేమిటి విశేషం" అని ఆలోచిస్తూ కొమ్మ లాగుతుంది. చెట్టు చెట్టు వూడి వస్తుంది.

యింతలో అతను అమ్మను సమీపిస్తాడు. అమ్మ అతన్ని చూసి వొళ్లో కాయలుయివే కోసుకున్నా నన్నట్టుగా కింద పోస్తుంది. అమ్మ ముఖము వంక అతను తీక్షణంగా చూస్తాడు. అమ్మ కాయలు కిందపోసి చెట్టునున్న మట్టిగడ్డలు అన్నీ వొల్చుకుని వొళ్లో వేసుకుని వెళ్లటానికి లేస్తుంది. అతను కన్ను ఆర్పకుండా అమ్మవంక అట్లాగె చూస్తూ వుంటాడు.

అమ్మ నాలుగు గజాలు ముందుకు సాగుతుంది. అమ్మ తలమీద పిట్టల కోసం చెట్లమీద కట్టే గిలకలా కనుపిస్తుంది. అతను "నాచేనుకు రక్షణ కోసం వచ్చిన అమ్మాయిగా వుంది. అది తెలుసుకోలేక కొట్టాను" అని గబగబా అమ్మ దగ్గరకు వచ్చి మట్టిగడ్డలు వొళ్లో పోసుకుపోతున్న అమ్మను వెనక్కు తిప్పి "ఆ మట్టిగడ్డలు పారబొయ్యమ్మా, వేరు శనక్కాయలు అడ్డెడు కోసిపెడతాను. దుర్మార్గుణ్ణి కర్ర తీసుకు కొట్టాను తగల్లేదు గనుక సరిపోయింది."

అమ్మ : నేను మట్టిగడ్డలు పారబోయను, వేరుశనక్కాయులు వద్దు. మట్టిగడ్డల్లో వుండే గుణం తెలియక వేరశనక్కాయల కొచ్చాను. మట్టిగడ్డలు నివేదన చేస్తే యిక్కడ పండే పంటలన్నీ నివేదన చేసినట్టే. నాకు అక్కర్లేదు నీ వేరుశనక్కాయలు.

అతను : ఛీ! తప్పమ్మా, మట్టిగడ్డలు నివేదన చేయగూడదు. అసలు నివేదనకు తీసుకెళుతున్నావేమిటి నీవు. వేరుశనక్కాయులకు అందుకోసము వచ్చావని తెలియదమ్మా. యిదేనా మొదలు యిదివరకు యెప్పుడన్నా వచ్చావా?

అమ్మ : నేను యెప్పుడూ రాలేదు. అన్నింటికి యిదే మొదలు.

అతను : అన్నీ అంటే?

అమ్మ : పూజ చెయ్యాలనేది యీరోజే కలిగింది. చేనుకు రావటం, దెబ్బలు తింటం. మట్టిగడ్డలే నివేదన చేద్దామనుకోవటం యివాళ మొదలు.

అతను : వొద్దులే అమ్మాయిగారు మట్టిగడ్డలు అక్కడ పోసి వేరుశనక్కాయలు తీసుకుపోమ్మా.

అమ్మ గబగబా అతని మాటలు వినకుండా మట్టిగడ్డలు తీసుకుని పరుగెత్తుతుంది. అమ్మ పరుగెత్తుతుంటే, అమ్మ వెనుక భాగము ఆయనకు యిదివరకు భాగవతంలో చెప్పిన కృష్ణుడు పరుగెత్తినట్టుగా వుంటుంది. కానియ్యి రోజూ సత్రం దగ్గరకు వెళ్లి చూస్తూ వుందాం యీ అమ్మాయిని.

అమ్మ వెళ్లి మట్టిగడ్డలు ఆంజనేయస్వామి దగ్గర పెట్టి అక్కడ కొన్ని మట్టిగడ్డలు పోగు చేసుకుని 108 ప్రదక్షిణాలు చేసి, మట్టిగడ్డలు నివేదన చేసి, తలాకాస్తా మట్టిగడ్డలు ప్రసాదంగా పెడుతుంది. మట్టి చేతుల్లో పెట్టినప్పుడు నవ్వుతారు. తినేటప్పుడు ఆ తీపికి వాసనకు ఆశ్చర్యపోతారు. కొండారెడ్డి ఆ మట్టి తిని "యెక్కడ తెచ్చా అమ్మాయి యీ మట్టి" అంటాడు.

అమ్మ : ఆ మట్టి వున్నచోటనుండే.

యింతలో వేరుశనగ చేలో వున్న అబ్బాయి కూడా వస్తాడు. అతనికి కూడ అమ్మ ప్రసాదము పెడుతుంది. అందులో ఒకరిద్దరు తీసుకువచ్చి "యిదుగో మీ అమ్మాయి గారు పెట్టిన ప్రసాదము, చూడండి" అని భారతమ్మ గారికి ఆ యింట్లో అందరికి పెడతారు.

భారతమ్మ : అందులో యేమున్నది? సెంటు బెల్లం పూసింది.

అందులో ఒకరు : మా యెదుటే మట్టి తీసుకొచ్చి ప్రదక్షిణాలు చేసిందండీ.

భారతమ్మ : యివన్నీ బూటకాలు. యెవరూ నమ్మరు. యింట్లో దొంగను ఈశ్వరుడన్నా పట్టలేడని - అట్లాంటిది యీపిల్ల.

రాఘవయ్య గారు : మట్టి, విభూతి తింటం అలవాటు కనుక నాకు బాగున్నది. ఒకరి మాటెందుకు, యెవరి యిష్టం వారిది.

వచ్చినవాళ్లు : యింట్లోవాళ్లు, యింట్లోవాళ్లకి నమ్మకముండదు అనుకుంటూ వెళ్లిపోతారు.

యెవరి దారిన వారు వెళ్లిపోతారు. అమ్మ యింటికి వస్తుంది.

భారతాంబ : యింతసేపు యెక్కడకు వెళ్లావు అని రెక్క పట్టుకుని లాగి అడుగుతుంది.

అమ్మ మాట్లాడదు.

భారతాంబ : మాట్లాడవేం మొద్దు - (అని బుగ్గలు బుగ్గలు పొడుస్తూ) బూటకాలు నేర్చుకుంటున్నావు బూటకాలు. అందర్నీ మోసం చేయటం యిట్లా ప్రపంచాన్ని మోసం చేసే పనులు నేర్చుకోకు. చిన్నప్పుడే యిట్లాంటి పనులయితే పెద్దయితే యెట్లా వుంటయ్యో.

అమ్మ : నేను వొచ్చింది అటువంటి నాటకం కోసమే.

భారతాంబ : యెదురు సమాధానం కూడ చెబు తున్నావే? యెదురు సమాధానం చెప్పవుగద, చెప్పవుగద! అని పది నిమిషాలు తొడపాశం పెడుతుంది. అక్కడ యెవరూ లేరు. అన్నపూర్ణమ్మ గారు స్నానానికి వెళుతుంది. రాఘవయ్యగారు వంటచేస్తూ వుంటారు. "పద స్నానం చేసి పోయి అన్నం తిను పో" అని నెత్తిమీద కొట్టి ముందుకు నెట్టుతుంది. ఆ నెట్టినప్పుడు ముందరున్న గోడ మొఖానికి కొట్టుకుంటుంది. రాఘవయ్య గారు 'యేమిటా చప్పుడు' అని వస్తారు.

అమ్మ గోడకు మొఖము కొట్టుకుని యివతలకు వస్తుంది. మొఖము బొప్పికట్టి కొద్దిగా నెత్తురు చమర్చి వుంటుంది. బొప్పి చూచి "యెందుకమ్మా అంత దెబ్బ తగిలిందంటారు రాఘవయ్యగారు".

అమ్మ : గోడ కొట్టుకుంది.

రాఘవయ్యగారు : కాస్త చూచి నడవకూడదూ.

అమ్మ యేమీ మాట్లాడదు.

రాఘవయ్య గారు : నీరు సున్నం తెచ్చి రాస్తారు.

యింతలో అన్నపూర్ణమ్మ గారు స్నానం చేసి వస్తారు.

అన్నపూర్ణమ్మ గారు ప్రొద్దుననంగా వెళ్లావు, యింటికి రాలేదు. యేమిటి ముఖాన పట్టి?

రాఘవయ్య గారు : గోడ కొట్టుకుందిలే!

అన్నపూర్ణమ్మ గారు : సరే పెద్ద దెబ్బే తగిలినట్టు వుంది. రా అన్నం తిను.

యింతలో బాపట్ల నుండి నాన్నగారు వస్తారు. "భారతిని చూచి చాలాకాలమయింది, చూచిపోదామని వచ్చా. పెదనాన్న చూచి రమ్మన్నారు. చూచి వీలుగా వుంటె మండలమయింది గదా తీసుకు రమ్మని కూడ అన్నారు".

పున్నమ్మ గారు : మీయమ్మ యెక్కడ వుందిరా నాయనా?

నాన్నగారు : (నాగేశ్వరరావు) అందరూ మన్నవ వెళ్లారు.

అందరూ అన్నాలకు కూర్చుంటారు.

అమ్మ కంచంలో చెయ్యి పెట్టుకుని అట్లాగె కూర్చుంటుంది.

భారతమ్మ : తినవేం తిను. ముచ్చు మొఖమేసుకుని అట్లా కూర్చుంటావేం? భలే ముచ్చుదిరా, అన్నయ్యా కనపడదు. లోపల స్వయంపాకం యెన్నంటున్నా మాట్లాడదు చూడు. నే కొప్పడ్డానని.

అమ్మ : ఆకలి కావటంలా!

నాన్నగారు : యివాళ అనుకుంటున్నావా నాకు యిదివరకే తెలుసు. మన్నవ వాళ్లంతా అంతే. ఆరోజు మనం మాట్లాడేటప్పుడు నిద్రపోతున్నట్టుగా వుండి విన్నది చూడు.

భారతమ్మ గారు : వినందయితే నేనెరగనని అనేదేగా నీవంటున్నా, వూరుకున్నదంటే విన్నట్టేగా?

అమ్మ యేమీ మాట్లాడదు.

నాన్నగారు : రాఘవాయి పైకి అల్లరి, యిది లోపల అల్లరి.

అన్నపూర్ణమ్మ గారు : అన్న, చెల్లెలు కలిసి తీవ్రంగా అంటున్నారే.

రాఘవయ్య గారు : చాలా మంచి అమ్మాయి, నిదానస్తురాలిని యిట్లా పట్టుకు అంటున్నారు. సరే యివన్నీ యెందుకులే అన్నాలు తిని లేవండి.

అమ్మ అందరూ తినేదాక కంచంలో చెయ్యి పెట్టుకు కూర్చుని అందరితోపాటు చెయ్యి కడు క్కుంటుంది. అన్నం తినకుండా.

అన్నపూర్ణమ్మ గారు : యేం తిన్నావమ్మా ఆకలి కాకపోవటానికి?

రాఘవయ్య గారు : తినేవన్నీ ఏమిటి?

అమ్మ : చింతాకు తిన్నా!

అన్నపూర్ణమ్మ గారు : నీకు యెవరు కోసిపెట్టారు?

అమ్మ : భూమిమీదకు వచ్చేటప్పుడే తెచ్చుకున్నా. రాఘవయ్య, అన్నపూర్ణమ్మ ఇద్దరూ : అంటే అర్థం కావటంలా.

అమ్మ యేమీ సమాధానము చెప్పదు.

రాఘవయ్య గారు : అంతేలెండి. దాని అర్థం బాల్యంలో అమ్మ లేకపోవటం కూడ చింతేగా.

నాన్నగారు : అందరూ రేపు ప్రయాణాలు కండి. వస్తే అందర్నీ కలిసి తీసుకు రమ్మన్నారు. లేకపోతే పాపదిగులు పడుతుందిట. అనసూయను తీసుకు రమ్మన్నారు.

భారతమ్మ : యింకా బాపట్ల వారిని వెళ్లమని చెప్పలేదట. ఆజ్ఞ అయితే రామాచార్లు గారికే చెపుతారట. మేము నాలుగు రోజులుండి వస్తాం.

అన్నపూర్ణమ్మ గారు : మేము పోయి వస్తాం నువ్వు వుండు వంట బ్రాహ్మణుడు ఉన్నాడు గదా. మీ నాయనకు మనం పోకపోవట మల్లా మంచిదే.

రాఘవయ్య గారు : అదీ వద్దు, యిదీ వద్దు. అమ్మాయి గారిని ఒక్కదాన్నే వుంచటమెందుకు? మీరు లేకుండా మండలం రోజులు అయిపోయినయిగా. అందరం కలిసే వెళదాం. సామాను యెంతలోకి సర్దుతాం. ఒక గంటలోకి సర్దివేస్తా. ప్రొద్దున్నే కాఫీలు తాగి బయలుదేరి వెళ్లిపోదాం అని సామానులు సర్దుతుంటారు. తెల్లవారి అందరూ కలిసి వెళతారు కాని బారతమ్మ గారికి యిష్టముండదు.

బాపట్ల చేరగానే నాన్నగారు మన్నవ వెళ్లి బామ్మను, పిల్లలను తీసుకు వస్తారు.

భారతమ్మను అత్తవారింటికి పంపిస్తారు. పదిరోజులు కాగానే మళ్లీ మూర్ఛలు వస్తాయి. మళ్లీ తీసుకొస్తారు.

యీసారి చందలూరు మహలక్ష్మమ్మ దగ్గరకు తీసుకు వెళదామనుకుంటారు.

అక్కడ ఎక్కువ సేపు వుండక్కర్లా, ప్రొద్దున్నే పోయి సాయంకాలానికి రావచ్చు అని వెళతారు. అమ్మ, చిదంబర్రావు తాతగారు, పున్నమ్మ గారు, భారతమ్మ గారు అందరూ వెళతారు.

అక్కడకు పోగానె చందలూరు మహాలక్ష్మమ్మ మూతి దగ్గర చల్లా లక్ష్మీనారాయణ గారు చెవిబెట్టి ప్రతీదీ ఆమె చెపుతున్నట్టు ప్రశ్నలు చెపుతారు. గ్రహ వీక్షణ వున్నట్టు, యీ బిడ్డ చాలా పెంకి తత్వమని, అమ్మణ్ణి చెపుతున్నది అంటాడు. అత్తవారింటిలో వత్తిడి వల్ల బిడ్డకు పోవటం యిష్టం లేదని అమ్మణ్ణి చెపుతున్నది అంటాడు.

చిదంబర్రావు గారు : దానికి నివారణ యేమైనా వున్నదా?

లక్ష్మినారాయణ : యెందుకు లేదు. కొన్ని క్రమశిక్షణలు చెప్తాను అట్లా పాటించండి. కొన్ని నియమాలు చెప్తాను అట్లా చేయండి. కొన్ని నియమాలు చెపుతారు. ప్రతి శుక్రవారం తలంటి పోసుకోవటం. ఉదయం పూట పొంగలి చద్ది పెట్టటం, సహస్ర నామార్చన రెండు పూటలా. క్రింద పడుకోవటం. ఆ పిల్ల, తల్లి, తండ్రి కూడా అట్లాగె చేయవలసింది. యిట్లా రెండు నెలలు చేసిన తరువాత యెట్లా వున్నది మళ్లీ వచ్చి చెప్పవలసినది.

చిదంబర్రావు : యీ చిన్నమ్మాయిని గురించి కూడ యేమన్నా చెపుతుందా అమ్మణ్ణి?

లక్షినారాయణగారు : అమ్మణ్ణికి యేమి వాక్కు రావటంలా!

తాతగారు అడగటంలో అమ్మ సంగతి వీళ్ల యిద్దరకు వినిపించాలనే వుద్దేశంతో అడుగుతారు. చిదంబర్రావు గారు పొంగిపోతారు. "విన్నారా అమ్మణ్ణి అయి అమ్మణ్ణికి యేం వాక్కు వస్తుంది" అని అన్నపూర్ణమ్మ, భారతమ్మ గార్లతో అంటారు. అందరూ భోంచేసి సాయంకాలానికి బాపట్ల చేర్తారు. ఆరోజు నుండి అన్ని నియమాలు పాటిస్తారు.

భారతీదేవితో నాన్నగారి సమాలోచన :

సీతాపతి తాతగారు వచ్చి తెనాలి పోదామమ్మా అని ప్రయాణం చేస్తారు అమ్మను.

అమ్మ : పాప దిగులు పడుతుంది రాలేను.

అన్నపూర్ణమ్మ గారు : పోనీ వుంచరాదూ. పిల్ల దిగులు పడు తుందందిగా!

సీతాపతి తాతగారు : యీ బెడద తప్పించు కుందామని. తీసికెళ్లి వాళ్లకు అలవాటు చేస్తే వాళ్ల తిప్పలు వాళ్లు పడతారు. తెనాలి గాని, నంబూరు గాని పంపిస్తా.

అమ్మ : నేను పాపను, లోకాన్ని వదిలిపెట్టి వుండలేను నాన్నా.

సీతపతి గారు : వదిలిపెట్టి వుండకపోతె యెట్లాగు, నీతోపాటు నేను వుంటాను. నాలుగు రోజులు వుండి వద్దువుగాని పద.

చిదంబర్రావు గారు : పోనీ యివాళ కాకపోతె నాలుగు రోజులుండి తీసుకెళ్లగూడదా? నీకు బెడద వదిలించుకోవటమేనా అవసరం?

నాన్నగారు స్కూలు ఫైనల్ ప్యాసయ్యి యింటర్‌లో చేరబోతారు. నాన్నగారు అమ్మను దొడ్లోకి పిల్చి "యిటురా అమ్మాయి" అంటారు. అమ్మ దొడ్లో బాదం చెట్టు కిందకు వెళుతుంది. రాత్రి షుమారు 9.30 గంటలు అవుతుంది. అక్కడ భారతమ్మ గారు కూడ కూర్చునే వుంటుంది. "అడుగు భారతి నువ్వడుగు" అంటారు నాన్నగారు.

భారతి "అన్నయ్య చదువుకోబోతున్నాడు. నీ మెళ్లో వున్న నానుతాడు తీసియ్యి. వాళ్ల యిబ్బందులు తీరిన తరువాత మళ్లీ యిస్తారు."

అమ్మ తీసి నాన్నగారి చేతులో పెడుతుంది.

నాన్నగారు : "యెవరితోనన్నా చెపుతావా జాగర్త! నీ యిష్టం యిబ్బందులు తీరిన తరువాత మళ్లీ చేయించి యిస్తాం. చెప్పవుగద?" అమ్మ యేమీ మాట్లాడదు.

భారతమ్మ "అదేరా అదే దీని దగ్గరున్న గుణం" అంటుంది.

నాన్న : యేం మాట్లాడవేం?

భారతమ్మ : యేమన్నాయ్ యింతవరకు సరి పోతుందా, యింకా కావాలా అయితే గియితే నీకిస్తే కట్నము లేకుండా చేసుకోవచ్చు.

అమ్మతో "యిక నీవు పోయి పడుకో" అంటుంది.

ఆ గొలుసు తూకం 11 శవరలు. యిదిసరకు యిచ్చిన గాజు 4 శవరులు, బామ్మ కిచ్చినది 4 శవరులు, భారతమ్మ గారు తీసుకున్నది 6 శవరులు.

అమ్మ పోయి పడుకుంటుంది. చాల ప్రొద్దుపోయిన తరువాత రెండు గంటలకు నాన్నగారు, భారతి వచ్చి మంచాలమీద పడుకుంటారు.

నాన్నగారు : యెవరికీ చెప్పదు కదా కుమ్ము. నాకు దీని స్వభావం బాగా తెలుసు. ఎవ్వరికి చెప్పదు. తనకై తనే యిచ్చింది.

భారతీదేవి : వాళ్ల అన్నయ్యకు మెళ్లో కాసులు దండ యివ్వలా, వాళ్ల నాన్న కొడుతుంటె అడ్డం కూడ పోయింది అనసూయ.

నాన్నగారు : మనము అట్లా తీసుకోలేదుగా!

భారతి : స్వభావము మంచిదిగానె కనపడుతుంది. పెద్ద పెద్ద ఆలోచనలు వున్నట్టుగానె కనపడుతయ్యి. మెళ్లో బిళ్ల గజ్జలు బాపట్ల వెంకట్రావు తీసుకుంటే యేమి చెప్పింది! చెప్పలా.

నాన్నగారు : ఆయన తీసుకున్నాడని యెలా గుర్తు?

భారతి : మేడమీద కూర్చున్నప్పుడు వున్నది. ఆయన యెత్తుకొచ్చేటప్పుడు లేదు. యెవరు తీసుకున్నారంటె యెవరో ఒక అబ్బాయిలె అన్నది. యెక్కడ వుంటాడు ఆ అబ్బాయి అని అడిగితె యిక్కడ లేడని చెప్పింది.

అమ్మ యివన్నీ వింటూనే కళ్లు మూసుకుని పడుకుంటుంది.

అమ్మకు 10వ సంవత్సరము వచ్చింది (9+)

నాన్నగారు : మా అమ్మ దీని విషయంలో పట్టుదల పట్టేట్టుంది చేసుకోమని. నన్ను ఒక సర్కిలు యినస్పెకరు గారు యిల్లటం అడిగారు. పిల్ల బాగుంటుంది. బాగా సహాయం చేస్తాడు. మా చెల్లెలు, తమ్ముడు, అమ్మ వున్నారని కూడ చెప్పాను. 'నీకు మంచి వుద్యోగం యిప్పిస్తాను. ఆ డబ్బు బెట్టి వాళ్లను చూదువుగాని, నీవు మాదగ్గరే వుందువుగాని' అన్నారు ఆయన.

భారతి : యివన్నీ పిన్నితో చెప్పావా అన్నయ్యా!

నాన్నగారు : యివన్నీ చెప్పలేదు గాని ఒకవేళ వస్తే వెళ్లమంటావా అని అడిగా అమ్మను. 'మా అబ్బాయి వున్నాడా మీ యింట్లో అని అడగాల్సిందేగా' అని అన్నది అమ్మ. పైగా యింకొక మాట అంది భారతి. ఆయన మరిది పేర 6 ఎకరాలు రాసి నీ యిష్టమొచ్చినట్టు వూరేగు అన్నది. ఆమె ప్రాణానికి నేను వెళ్లినట్టుగానే వున్నది.

భారతి : యేదైనా అనసూయ అయితే మనకు వీలు, చెప్పినట్టు వింటుంది. వాళ్ల తాత ముత్తవలు ఒప్పుకుంటారో లేదో వాళ్లకు కొంచెం భాగ్యమంతులకు యిచ్చుకోవాలని వుంది. వాళ్ల అమ్మ వున్నట్టయితే యెటూ యిచ్చేది కాదు. వాళ్ల నాయనదేమిటిలే, మా అమ్మ యెట్లా చెపితే అట్లా వింటాడు. మరిడమ్మ గారికి యెటూ యిష్టమే కదా. ఒకరోజు నేను తమాషాగా అడిగారా యెవర్ని చేసుకుంటావని, బావనే అన్నది.

నాన్నగారు : యేది యెట్లా వున్నా, ఆ పిల్ల చాల చక్కనిది భారతి. యెవరి మాట యెట్లా వున్నా, పెదనాన్న చెప్పినట్టు వినాలి గదా. మొన్న నేను అమ్మను తీసుకు రావటానికి మన్నవ వెళ్లేటప్పటికి, మామయ్య చాల గొడవలు చేస్తున్నారు, నేను భరించలేను. వెళ్లి పొమ్మని సరాసరి అమ్మతో అనడు. పులిపాక చల్లమ్మ గారితో అంటుంటాడు. మధ్యలో నాయనమ్మ వరిపిడి పడుతున్నది.

భాతతి : యేదైనా పాపను, లోకాన్ని చూడాలంటే యీ పిల్లయితేనే వీలన్నయ్యా, మనం కూర్చోమంటే కూర్చుంటుంది. నుంచోమంటే నుంచుంటుంది. తొందరపడి మాట యివ్వ వద్దన్నయ్యా.

నాన్నగారు : యేది యెట్లా వున్నా మా అమ్మ మాట తప్పను.

చిదంబర్రావు తాతగారు : చాలా ప్రొద్దుపోయింది, యేమిటా మాటలు నిద్రపోరాదూ!

తెల్లవారి నప్పటినుంచి సీతాపతి తాతగారు అమ్మను తొందర చేస్తూ వుంటారు. తెనాలి తీసుకు వెళ్లటానికి. యీ తొందరకు తగినట్టుగా తెనాలి నుంచి వీరి అమ్మమ్మ జానికమ్మ గారు కూడా వస్తుంది. గడపెక్కుతూనే అమ్మను యెత్తుకో వస్తుంది.

ఆమెను చూడగానె అమ్మకు గుండె జల్లుమని పాప నెత్తుకుని లోకనాథాన్ని చేతపట్టుకుని దొడ్లోకి వెళ్లి కూర్చుని. "లోకం రోజూ నీకు అణా యెవరు యిస్తారు. పాపనేమొ అత్తయ్య కొడుతుంది, పాలు సరిగా పొయ్యదు."

లోకం : మామీద యెందుకు అనసూయా యింత ప్రేమ?

అమ్మ : ప్రేమ నాకు సహజం లోకం. యెవరు కష్టపడుతున్నా నాకు అట్లాగె వుంటుంది. (కాసేపు కూర్చోగానే అన్నాలకు పిలుస్తారు) "లోకం నాకోసం దిగులు పడవద్దు. దిగులు పడతావా, చెప్పు నాకెట్లాగూ పోక తప్పేటట్టు లేదు. పాప దిగులు పడుతుందేమోనని నా అనుమానం. ఈయన త్వరగా తీసుకురాడు."

యీరోజే కామేశ్వరమ్మ గారు (అమ్మ మారుటమ్మ) రజస్వలయినట్టు, శాంతి వున్నట్టు శుభలేఖ బ్రాహ్మడు తీసుకొచ్చి యిస్తాడు. శాంతి 25 రోజున నిశ్చయిస్తారు. యీ యిరవై రోజులు జానికమ్మ గారినికూడ వుండ మంటారు. "అసలే చచ్చి నేనేడుస్తుంటే నాకేమి పేరంటం?" అంటుంది.

అమ్మ : చక్కగా మా పిన్ని పెద్దమనిషయింది. మా యింటి కొస్తుంది. మా యిల్లు నిండుతుంది. మేము ఆడుకుంటాం.

జానికమ్మ గారు : దీనికి తల్లి లేదనే దిగులు కూడ లేదు. సిపాయి తిరిగినట్టు తిరుగుతుంది. నేను వెళతా నాయనా. వస్తే తీసుకెళతాను. యిరవై రోజులు వుంచుకుని శాంతికి పంపిస్తా.

సీతాపతి తాతగారు : సరే తీసుకెళ్లు రాకపోతె మాత్రమే యేమి పోయింది. శాంతికి రాకపోతె మాత్రమేమిలే? ఆగిపోయేది మాత్రము యేముందిలే?

అమ్మను తీసుకుని జానికమ్మగారు, సీతాపతి తాతగారు తెనాలి వెళతారు.

15. మహితాన్విత పర్యటన పరంపర

నంబూరు మజిలీ :

నాలుగు రోజులు వుండి తాతగారు బాపట్లకు వచ్చేస్తారు. వచ్చేటప్పుడు "వున్నంతకాలం యిక్కడ వుంచండి. యేడిస్తే నంబూరు పంపండి. పిల్లల్తో ఆడుకుంటుంది."

సుబ్బయ్య గారు : దాని మనస్సంతా చిదంబర్రావు, నీవు, మరిడమ్మ గారి మీదనే వుంటుంది గదా. అంత వత్తిడి పెట్టి యిక్కడ వుంచటమెందుకు? అది చిదంబర్రావును వదిలిపెట్టి అసలు వుండలేదు. వాడు తనను వదిలిపెట్టి వుండలేడు.

జానికమ్మ : యెంతవరకు యీ వుండలేక పోవటాలు? తల్లి చస్తే వుండటల్లా, తల్లితోపాటు పోయిందా? యిది పోయినా అది బ్రతికేదేమొ! చిన్నబుచ్చుకుని తాతగారు అవతలకు వెళ్ళిపోతారు. అమ్మను తెనాలిలో పది రోజులు వుంచుకుని నంబూరు తీసుకెళతారు పినతల్లి భాగ్యమ్మ గారు. నంబూరులో మామూలుగా వున్న అమ్మను యేదో విశేషమున్నట్టుగా చూట్టానికి వస్తారు.

భాగ్యమ్మ గారు : ప్రొద్దుగూకింది, యింటికి వెళ్లండమ్మా!

వచ్చినవారు : యేమి లేదు విడిచిపెట్టి వెళ్లలేకుండా వున్నాం.

భాగ్యమ్మ : యెందుకు అంత వెళ్లలేకపోవటం?

యేమీలేదమ్మా. తల్లిలేని పిల్ల అవటం జాలి, మొఖములో యేదో వదిలిపెట్టలేని శక్తి లాగుతున్నదమ్మా.

గోపరాజు గారు (నంబూరు కరణం గారు) తల్లీ సూరయ్యా యిట్లారా! యింతమంది పిల్లల్లో అమ్మా అని దగ్గరికి పోవటానికి లేని పిల్లగదా - యేమి

భాగ్యా, అమ్మాయిని యెట్లా చూస్తావో. నేనెక్కడికి రాను, యిక్కడే వుంటాననేట్టుగ చూడాలి. నేనిక్కడ వుండను గదా, అటూ యిటూ తిరుగుతూ వుండేవాడిని యెట చూస్తావో. గుడ్డలున్నయ్యా అమ్మా కట్టుకోటానికి సూరయ్యా!

అమ్మ : కట్టుకునే వున్నాగా? లేకపోతె యెట్లా కట్టుకుంటాను.

గోపరాజు గారు : యిది గాదమ్మా. యివి విడిస్తే కట్టుకోను గుడ్డలున్నయ్యా?

అమ్మ : ఆఁ వున్నయ్యి.

గోపరాజు గారు : యేమొ - అమ్మాయికి గుడ్డలు యెన్ని వున్నయ్యో తెలుసునా?

భాగ్యమ్మ గారు : ఆఁ చూస్తాను, నాకు తెలియదు.

గోపరాజు గారు : మీకు యెన్ని గుడ్డలుంటయ్యో నీకు తెలియదు. అట్లానే చూసుకోవాలి.

భాగ్యమ్మ గారు : ఆఁ చూస్తాను. (అని సంచి తీసి చూస్తుంది) యెక్కువ లేవుగాని. మంచివి రెండే వున్నాయి.

గోపరాజు గారు : రెండు వుంటే యేమి చాలతాయి అరడజను కుట్టించి పంపుతా, జాగర్తగా చూడు. మన గుఱ్రం మీద యెక్కించి రోజూ సాయంకాలం షికారుకు పంపించు. మన మస్తానుకు చెపుతాను.

చెప్పి భోంచేసి వారు వూరుకు వెళతారు. గుంటూరు నుంచి గుడ్డలు కుట్టించి పంపిస్తారు.

భాగ్యమ్మ గారు వారు చెప్పినట్టే చూస్తూ వుంటుంది. పది రోజులపాటు ప్రతిరోజూ గుఱ్రం మీద యెక్కించి షికారుకు పంపుతుంది. ఒకరోజున సావిత్రి అనే వారి అమ్మాయిని (అమ్మకు చెల్లెలు వరుస) అమ్మ తనతోపాటు గుఱ్రం యెక్కించుకుని కంతేరు వరకు గుఱ్రముపై స్వయముగా స్వారీ చేస్తుంది. మస్తాను గుఱ్రము వెంట పరుగెత్తుతూ వుంటాడు.

అమ్మకు జ్వరము తగులుతుంది. వొళ్లంతా పెద్ద పెద్ద దద్దుర్లు (దాగర) యెక్కుతాయి. డాక్టర్లు నంబూరు పానయ్య గారిని పిలిచి యీ పిల్లని చూడండి. లేనిపోంది నేను తీసుకొచ్చాను. యెప్పుడు వాళ్ల నాన్నను, తాతను వదిలిపెట్టి వుండలేదు. ఆ దిగులో యేమొ?

పానయ్య : యేదైనా - ముందు చింతపండు పులుసు రాసి కొంచెంసేపు వుంచి కడిగి యిచ్చట వెలుబూడిద రాసి గొంగడి కప్పి పడుకోబెట్టండి. యేదో

ఆలోచిస్తూనే వుంటుంది. యెప్పుడు చూచినా ఆ పైత్యం చేతనయినా యిట్లా రావచ్చు. జ్వరం కూడా వున్నది, విరోచనాలకు వేద్దామంటె. విరోచనాలకు వేస్తె బాధ కలుగుతుంది. యిట్లాగె చేస్తుండండి తగ్గుతుంది.

భాగ్యమ్మ గారు డాక్టరు గారు చెప్పినట్టుగానె చేస్తుంటుంది. నాలుగు రోజులకు దాగర తగ్గిపోతుంది. జ్వరం అట్లాగె వుంటుంది. యీ జ్వరం రెండు నెలలు దాకా వుంటుంది. అది జారటమంటూ వుండదు (నార్మల్‌కు రాదు) సన్నిపాత జ్వరమని కణికలన్నీ చాది పోస్తారు. మందులు బెట్టజేసి నోరంతా పూస్తుంది. యెన్ని మందులు పోసినా తగ్గదు. కంఠం కూడా వాస్తుంది. నాభి దగ్గర నుంచి గొంతు వరకు ఒకటే పుండయిపోతుంది. చివరకు కంతేటిలో అమ్మ పినతండ్రి అంబారావు గారు స్కూలు మాష్టరుగా వుంటే వారికి కబురు చేస్తారు. ఆయన రాడు.

ఒకరోజున గోపరాజు గారికి గుంటూరులో రాఘవరావు మామయ్య కనపడతాడు. యిట్లా వున్నదని చెపుతారు.

రాఘవరావు : నాన్న కోసం తాతమ్మ కోసం దిగులు పడ్డదేమె అది జబ్బు కాదేమొ. వాళ్లను వొదిలిపెట్టి యింతకాలము యెప్పుడూ వుండలా. మూడో నెలకూడ వచ్చింది. నేను యింటికి వెళ్లి నాన్నను పంపిస్తాను. మందులు వాడబోకండి. వెళ్లిన ఒక వారం రోజులకు సీతాపతి తాతగార్ని పంపుతాడు.

సీతాపతి తాతగారు రాగానే అమ్మ లేచి కూర్చుంటుంది. జ్వరం జారకపోయినా జారినంత తేలిగ్గా వుంటుంది. వెళ్లి తాతగారి పొట్టను కౌగిలించుకుని కూర్చుంటుంది. యింటికి వెళదాం వస్తావా?

అమ్మ : ఆఁ వస్తా! తీసికెళితే వస్తా!

భాగ్యమ్మ గారు బావగారిని చూచి చెంబుతో నీళ్లు పట్టుకు వస్తుంది.

సీతాపతి తాతగారు కాళ్లు కడుక్కుని మంచినీళ్లు తాగి. "యెప్పటి నుండి దీనికీ జ్వరం భాగ్యం?" అని అడుగుతారు.

భాగ్యమ్మ గారు : వచ్చినాకయే పది రోజులు బాగున్నదో, అప్పటి నుంచి జ్వరమే. వచ్చి యిప్పటికి రెండు నెలల పదిహేను రోజులు.

సీతాపతి తాతగారు : మీ అక్కయ్యను కాపరానికి తీసుకురావాలి. అమ్మాయిని రేపు తీసుకెళతాను. మీకేమయినా అలవాటయిందా పది రోజులు వుంచుకు పంపిస్తాను.

భాగ్యమ్మ : అలవాటు యేం తెలుస్తుంది. వచ్చినప్పటినుండి జ్వరంతోనె వుండెనుగా.

సీతాపతి తాతగారు : సరే తీసుకెళతాను. దాని యోగ్యత యెట్లా వుంటె అట్లా అవుతుంది. మీవైపున అలవాటయితే మంచి సంబంధం చూచి చేసుకుంటారు. నాకు బాధ్యత లేకుండా పోతుందని అనుకున్నాను.

భాగ్యమ్మ గారు : వారుగూడ వూళ్లో లేరు. నడిచి పోవటం కష్టం. వోపిక లేని పిల్ల లంకణాలు, జ్వరం.

సుబ్బారావు : (వారి అబ్బాయి) నేను బండి పిల్చుకొస్తాలె.

సీతాపతి గారు : వాడేం బండి పిల్చుకొస్తాడు గాని మోతాదును పిలిపించు యెత్తుకుని తీసుకొస్తాడు.

అమ్మ : నే నడుస్తాలే మోతాదెందుకు? అతనికి మాత్రము బరువు గాదు నేను.

ఆమాట అనగానె భాగ్యమ్మ గారు యేడుస్తుంది.

సీతాపతి గారు : కూడా వుంటె అసలు యెత్తుకుంటే యెత్తుకుంటాడుగా కొంచెం సేపు నడిస్తే నడుస్తుంది.

భాగ్యమ్మ గారు మోతాదును పిలిచి చెపుతుంది. తెల్లవారు ఝామున ప్రయాణము నిశ్చయించుకుంటారు.

అందరికీ ఆరున్నరకే మెళుకువ వస్తుంది. తెల్లగ తెల్లవారి యేడింటికే బయలుదేరి వెళుతుంటె యిరుగు పొరుగు అంతా యెవరో పెద్దవారు వూరుకెళుతుంటె వచ్చినట్టుగా వస్తారు.

అందరు : యింత జ్వరము యిన్నాళ్లనుంచి అన్నం లేక పోయినా ఆ ముఖం చూడు యెట్లా వుందో. కళకళలాడుతూ వుంది. నోటి పుండు గొంతువాపుపైకి కనపడుతూనే వున్నది. అసలు జబ్బు ఒకటి మందు యింకొకటి అయిందల్లే వుంది డాక్టరు గారికి అర్థం కాలా.

భాగ్యమ్మ గారు అమ్మ ప్రయాణమయ్యేటప్పటకి. "తల్లిలేని పిల్లను బాగు చేద్దామని తీసుకొస్తే యిట్లా అయిపోయింది" అని కంటనీరు పెడుతుంది.

అమ్మ పోతూ పోతూ భాగ్యమ్మ పిన్నికి నమస్కారము చేసి బయలుదేరి పోతుంది.

మోతాదు యెత్తుకోకుండా అమ్మే నడిచి స్టేషనుకు వెళుతుంది. పోగానే రైలు వస్తుంది. రైలు యెక్కి, వచ్చిన మోతాదును దగ్గరకు పిలిచి భాగ్యమ్మ పిన్ని గారిచ్చిన అయిదు రూపాయలు అతని చేతిలో పెట్టి "యేమన్నా కొనుక్కో నాయనా" అంటుంది. యెవరికి చెప్పవు కద!

మోతాదు : నాకొద్దు అమ్మాయిగారు. నేను నీ చేతిలో పెట్లాల్సింది. నాకెందుకమ్మా?

అమ్మ : అరవకుండా తీసుకో, మోతాదు పెద్దగా అరవబోకు!

సీతపతి తాతగారు : యేమిటిది?

అమ్మ : యేమి లేదు నాన్నా. బాగ్యం పిన్ని యేదో యిస్తేను అది అతనికిస్తున్నా. యేమీ లేదు.

రైలు కూతవేసి బయలుదేరుతుంది. అతను అయిదు రూపాయలు తీసుకుని వెనక్కు తగ్గుతాడు. తెనాలి దిగకుండా స్టేషనుగుండా బాపట్ల చేరుతారు.

మానవత్వము - మాధవత్వము :

బాపట్లలో దిగేటప్పటికే తాతగారు రోడ్డుమీదకు యెదురు వస్తారు. అమ్మ ముఖము చూస్తే ఆయనకు దు:ఖము ఆగదు.

అమ్మ నోటి పుండుకు అక్కడ మందు యిప్పిస్తారు. "నువ్వు వెళ్లు. పది రోజులున్నాక నేను పంపిస్తాన"ంటారు.

సీతపతి తాతగారు అమ్మను అక్కడ దిగిడ్చి సాయంకాలం బండికి వెళ్లిపోతారు.

అమ్మకు నోటిపుండుకు మందు యిప్పించటానికి తుర్లపాటి సాంబయ్య గారిని పిలిపిస్తారు.

అమ్మతో చిదంబర్రావు తాతగారు "యీ పుండు యేం పుండమ్మా?"

అమ్మ : మిమ్మల్ని వదిలిపెట్టి నంబూరులో వుండవలసి వచ్చేనే అనే పుండు.

చిదంబర్రావు గారు : మమ్మల్ని వదిలిపెడితే నీక్కూడ దిగులటమ్మా?

అమ్మ : నాకంత వాత్సల్యం లేకపోతె మీదగ్గర యెట్లా వుంటాను?

చిదంబర్రావు గారు : నీకు వాత్సల్యం కొంతమంది మీద వుండి, కొంతమంది మీద వుండదా యేమిటి? అక్కడున్నా ఒకటే, యిక్కడున్నా ఒకటే కద నీకు?

అమ్మ : అట్టాలేదు తాతగారు. మానాన్నే యెక్కువనిపిస్తుంది మీ అందరికంటె. తరువాత తాతమ్మ, ఆ తరువాత కాస్త మీరు, మీమీద వాత్సల్యం అట్టేలేదు. సహవాసము బాగుంటుంది.

చిదంబర్రావు గారు : నేనేం పసివాడినా? సహవాసం చేయటానికి. ఒకటి చెప్పి ఒకటి చేస్తావు కదమ్మా. మీ నాన్నా నేను కూడా వున్నప్పుడు న మీదనే యెక్కువ వాత్సల్యం చూపిస్తావు. అయినా వాత్సల్యమంటే ఒక్క తల్లికే వర్తిస్తుంది. నీవు పసిపిల్లవు (కదా) అమ్మాయివి కదా? వాత్సల్యము వుపయోగిస్తున్నావేమిటి? నీవు అమ్మవా యేమిటి చెప్పు?

అమ్మ : మాయి - అంటే అమ్మే!

చిదంబర్రావు గారు : యీ పుండు కూడా అట్లాంటిదేనా!

అమ్మ : కాదు.

చిదంబర్రావు గారు : పోనీ అంత దిగులుగా వుంటే వచ్చెయ్య కూడదు. ఆ పాడు మందులన్నీ మింగకపోతె.

అమ్మ : మింగవలసిన విధి వుంటె యెట్లా? అప్పుడే యేమయింది నా పని.

యింతలో పిలిపించిన సాంబయ్య గారు వస్తారు.

సాంబయ్య గారు : నమస్తే పంతులు గారు.

చిదంబర్రావు తాతగారు : నమస్తే! నమస్తే!

సాంబయ్య గారు : మీరు మనిషిని పంపినప్పుడు యిక్కడ లేను. చీరాల మౌనస్వామి వారు వచ్చారు. వారిని దర్శించటానికి వెళ్లాను. ఆయన మా గురువుగారండి.

చిదంబర్రావు గారు : వారిని నేనెరుగుదును. వారిప్పుడు చీరాల్లో వున్నారా? యెవరింట్లో వున్నారు?

సాంబయ్య గారు : నూనె పానకాలు తోటలో వున్నారు.

చిదంబర్రావు గారు : యింకా యెంతకాల ముంటారు?

సాంబయ్య : చాలాకాలముంటారట.

అమ్మ : అయితే వారు మాట్లాడరా తాతగారు?

చిదంబర్రావు గారు : మాట్లాడరమ్మా!

అమ్మ : మనతో సంభాషణ యెట్లా జరుగుతుంది.

చిదంబర్రావు గారు : కాగితం మీద రాసిస్తారు.

అమ్మ : మనమనేవి వినపడతయ్యా?

చిదంబర్రావు గారు : వినపడతయ్యి

అమ్మ : మనం అనేవి వినపడి మనకు సమాధానం రాసి యిచ్చేటప్పుడు యింకా మౌనమేమిటి?

సాంబయ్య : నీకేమి తెలుసమ్మాయి, నీవు మాట్లాడమాకు.

అమ్మ : నన్నుకూడ మౌనంగా వుండమంటారా. నాకు చదువురాదు వ్రాయటానికి.

సాంబయ్య : యెవరండి యీ అమ్మాయి?

చిదంబర్రావు తాతయ్య : మా అమ్మాయే'

సాంబయ్య : యెందుకు మీరు నన్ను పిలిపించింది.

చిదంబర్రావు తాతగారు : అమ్మాయి నోరు చూచారు?

సాంబయ్య : చూచా నోరు కనపడుతూనె వున్నది.

అమ్మ : నోరు కనపడుతున్నదా? వినపడుతున్నదా?

సాంబయ్య : అది కాదమ్మా! పుండు కనపడుతూనే వున్నదన్నా. యేమిటి యీ అమ్మాయి యింత వ్యాఖ్యానంగా మాట్లాడుతుంది.

అమ్మ : వ్యాఖ్యానమంటె వివరించటమేగా. నేను వివరిస్తున్నాను మీరు విమర్శిస్తున్నారు.

సాంబయ్య : చాల లెక్క వున్నదే! యీ అమ్మాయి మీకుమల్లె కవిత్వం కూడ నేర్చుకుంటుందా పంతులుగారు.

అమ్మ : నా గొంతులో అంగిట్లో వున్న పుండు కూడ చూచారా మీరు?

సాంబయ్య : మీరు నోరు తెరచి చూపిస్తేనేగా!

అమ్మ : యిందాక యేమిటి మీరు చూచానన్నది?

సాంబయ్య : పెదిమల మీద పక్కనున్న పుళ్లు చూచి చూచానన్నా.

అమ్మ : యీ పుళ్లను బట్టి లోపల వున్న పుళ్లు కూడ అర్థం చేసుకుంటారా?

సాంబయ్య : పుండుయొక్క స్థానాలు వేరు కావచ్చు. యీ పుండు స్వభావము ఆ పుండు స్వభావము ఒకటే. రససంబంధమైన మందులేవో వాడి వుంటారు వ్యాధి అర్థం కాక.

అమ్మ : సహజంగా ఒక డాక్టరు చేసిన వైద్యాన్ని మరొక డాక్టరు యేదో రకంగా అంటూనె వుంటాడు.

సాంబయ్య : వున్న యదార్థం చెప్పానమ్మా! నేనేమి ఆ డాక్టర్ని చేతకానివాడని అనలేదు. అర్థంకాక రస సంబంధం వాడారన్నాను. యెవరయినా అంతే అర్థం కానప్పుడు.

సరే అని అమ్మ నోరు తెరుస్తుంది. నోరు తెరవంగానె చాల గులాబిరంగున గులాబి రేకులంత వెడల్పున అంగిలి, నోట్లోను, అంతా పుళ్లు కనిపిస్తాయి.

సాంబయ్య : పంతులుగారు గర్భంలో కూడ వుండి వుంటుంది పుండు.

చిదంబర్రావు తాతగారు : దీనికేమైనా మందు వండి వున్నదా?

సాంబయ్య : అక్కర్లేదండి. ముందు యింజక్షన్లు యిప్పించండి. తరువాత మందు యిప్పిద్దాం.

చిదంబర్రావు తాతగారు : అయితే రేపు యింజక్షన్లు మొదలు పెట్టిస్తాను.

సాంబయ్య : సరే నేను వెళ్లి వస్తానండి.

ఆరాత్రి భోజనాలు చేసి పడుకుంటారు.

తెల్లవారేటప్పటికి అమ్మకు కాళ్లు చేతులు వుబ్బి వుంటాయి.

చిదంబర్రావు తాతగారు చూచి యిదేమిటమ్మా అని గుండెల్లో చెయ్యి వేసి ఆదుర్దాగా కొట్టుకుని కాళ్లు వత్తి చూస్తారు.

అమ్మ : నెత్తురు లేనిమీదట వుబ్బినయ్యిలే. కాసేపటికి అవ్వే తగ్గుతాయి. యెందుకు మీరట్లా గాభరా పడతారు. యిప్పు డప్పుడే నేనెక్కడికి పోతాను తాతగారు. చేయవలసిన పనులు చాలా వున్నాయి. పడవలసినవి చాలా వున్నయ్యి.

చిదంబర్రావు గారు : యెదురుగుండా కనపడే బాధను జూచి మనస్సు నిబ్బరించుకోలేక పోతున్నాను. స్థితి యెక్కువదని తెలిసినకొద్ది, బాధకూడ యెక్కువగా

కనిపిస్తుంది. ప్రత్యక్షంగా కనపడేదాన్ని గురించి బాధ లేకుండా వుండలేక పోతున్నానమ్మా.

అమ్మ : దీనికే బాధపడితే ముందు ముందు వున్నదంతా అదే.

చిదంబర్రావు గారు : అస్పత్రికి వెళదామా అమ్మా!

అమ్మ : నేను రాలేను తాతగారు. కీళ్లు పట్టు కుంటున్నాయి, యెక్కడికి రాలేను.

రోజూ ఒక రకంగా వ్యాధులు పెరుగుతూ అట్లాగె మంచంలో నెలా పదిహేను రోజులు వుంటుంది. తల వెంట్రుకలు అడసకట్టిపోయి వుంటాయి. ఒకరోజున చాలా తీవ్రంగా వుంటుంది వ్యాధి. ఆ రోజు అమ్మమ్మ పోయినరోజు.

చిదంబర్రావు తాతగార్కి అన్నీ కళ్లకు కట్టినట్టుగా కనపడుతూ వుంటాయి. యెంత దేముడని గుర్తించినా యీ మమకారము మాధవత్వము కంటె మానవత్వమే గుర్తింప చేస్తూ వుంటుంది. ఆ మమకారము కూడ తీసివెయ్యవలసింది నీవేగదా అమ్మా.

అమ్మ : నా ఒక్కదానియందు వుండే మమకారము మానవత్వాన్ని గుర్తింప చేస్తుంది. సర్వత్రా వుండే మమకారము మాధవత్వాన్ని గుర్తింప జేస్తుంది.

చిదంబర్రావు గారు : యేదమ్మా మళ్లీ అను.

అమ్మ : **"ఒకచోటనే వుండే మమకారము మానవత్వాన్ని, సర్వత్రా వుండే మమకారము మాధవత్వాన్ని గుర్తింప జేస్తుంది".**

('మమతలు ఎండిన'... రాజు పాట.)

చిదంబర్రావు తాతగారు : పొట్టమీద పడుకుని మీ నాన్న వాళ్లకు కబురు చేస్తానమ్మా. యిరోజు రంగమ్మ తల్లి నిన్ను నా చేతిలో పెట్టిన రోజు కాని నీకు నయమయితే నన్నే నీ చేతిలో పెట్టిన రోజమ్మా.

అమ్మ : పిచ్చి తాతగారు నాకు నయం కాదను కుంటున్నారా? యెంతమందిని నవ్వించాలో, యెంత మందిని యేడ్పించాలో.

చిదంబర్రావు గారు : డాక్టరును పిలుచుకొచ్చేదా అమ్మా?

అమ్మ : పిలుచుకు రండి.

తాతగారు వెళ్లి డాక్టరు గారిని పిలుచుకు వస్తారు.

డాక్టరుగారు చూచి చాలాకాలం నుంచి వున్నట్టుంది యీ జబ్బు అని ముందు మనిషిని శుభ్రతగా వుంచండి. ఆ తల దువ్వి జడ వెయ్యండి. యిది దీర్ఘవ్యాధి. తరుణ వ్యాధి కాదు. అని సంబంధం లేని క్వినైన్ యింజక్షను యిచ్చి పోతాడు.

అది గడ్డకట్టి చాల బాధగా తయారవుతుంది. చలి జ్వరాలకిచ్చేది యీ వ్యాధికిచ్చినందువల్ల అమ్మకు మలేరియా జ్వరముందని అనుకుంటారు వీళ్లంతా. డాక్టరు గుర్తించింది లోపమని యెవరనుకుంటారు? ఆరోజు కారోజుకు బాధ యెక్కువవుతుంది. మన్నవ నుంచి తాతగారు, మరిడమ్మ తాతమ్మగారు వాళ్లు వస్తారు. తాతగారు వచ్చిన తరువాత చందలూరు మహలక్ష్మమ్మ దగ్గరకు వెళ్లి ప్రశ్న అడిగారా సమాధానం యేం చెపుతుందోనని తాతయ్యను అన్నపూర్ణమ్మ గారు పంపిస్తుంది. అక్కడకు బోయి ప్రశ్న అడగగా జడుసుకుందని. యెర్ర నీళ్లు దాటిందని సమాధానం చెప్పి పంపిస్తారు.

చిదంబర్రావు తాతగారు : యింజక్షను యెట్లా వుందో యీ ప్రశ్న గూడ అట్లాగె వుంది. 'యిదిగో యీ తాయెత్తు కట్టి సాంబ్రాణి పొగ వేయమన్నారు' అని సీతాపతి తాతయ్య కనకమ్మ బామ్మ కిస్తారు.

కనకమ్మ బామ్మ అమ్మకు తాయిత్తు కట్టి పొగ వేస్తుంది.

చిదంబర్రావు తాతగారు : యివన్నీ చేస్తున్నారు గాని తల శుభ్రత చేయమంటే చేయటం లేదే?

కనకమ్మ బామ్మ : యేంజేస్తాం. ఆ జుట్టు అలిమయ్యేట్టు లేదు. తల్లో రెండు అంగుళాల యెత్తున్నాయి పేలు.

తాతగారు ఒకరోజు కోర్టుకు వెళ్లిన తరువాత. తల జుట్టంతా కత్తిరించేస్తారు. హారతి కర్పూరం కొబ్బరినూనెలో కలిపి రాస్తారు.

అమ్మ యిట్లా ఒక నెలా పదిహేను రోజులు మంచంలో వున్న తరువాత క్రమంగా దానంతటదే తగ్గిపోతుంది.

మరిడమ్మ తాతమ్మ గారు చాల శ్రద్ధగా పథ్యంతో అమ్మకు చేసి పెడుతుంది.

సీతాపతి తాతగారు అమ్మమ్మను తీసుకుని మన్నవ వెళతారు. యిట్లా మూడు నెలలు జరిగిన తరఉవాత జుట్టు కొంచెం పెరుగుతుంది. కొంచెం వోపికొస్తుంది. సీతాపతి తాతయ్య వూరికి పోయేటప్పుడు చిదంబర్రావు తాతగారు యింకా యేదన్నా రెండు టానిక్కు సీసాలు తాగిస్తే బాగుండును అని అడుగుతారు. సీతాపతి తాతగారు

"దాని చేతి గాజులు అమ్మి కొనిపెట్టండి" అని వెళ్లిపోతారు. ఆ మాట అమ్మ విని అప్పుడు వూరుకుని.

అమ్మ : తాతగారు మా నాన్నగార్లు వూరుకెళ్లేటప్పుడు యేమిటి మీరడుగుతున్నారు.

చిదంబర్రావు తాతగారు : యేమి లేదమ్మా, నీకు తెలియని దేమున్నది?

అమ్మ : అవునులెండి నా కోసంగా యేదైనా చేయాలంటే మీరయినా చేసేపని అదేగా? అయితే ఆయన తండ్రి గనుక యెప్పటికయినా అడగటానికి అవకాశముందని ముందర్తిగా అడిగి తెలుసుకున్నారు. యెట్లయినా ప్లీడరు గారు కదూ. ఆయన పనులు బయట పడతాయి. మీ యెత్తులు బయటబడవు. బయటపడేదేముంది. మీ వృత్తే అది గదా?

చిదంబర్రావు గారు : పకపకా నవ్వి. మీవాళ్లు యెంత చేసినా వాళ్ల మీద అభిమానం పోదుగదా?

అమ్మ : నాకు యెవరిమీద దురభిమానం లేదు.

యింతలో చీరాల నుండి అమ్మకు పినతల్లి గారి భర్త నారాయణరావు గారనే ఆయన వస్తాడు.

నారాయణ రావు చిదంబర్రావు గారితో "మీ అమ్మాయి అనసూయను నాలుగు రోజులుపాటు అట్టే పెట్టుకు పంపిద్దాం తీసుకు రమ్మన్నది" అని అడుగుతారు.

చిదంబర్రావు గారు : యిప్పుడే కాస్త కాస్త వోపికొస్తున్నది. యింకా బలానికి మందులిప్పించాలి.

నారాయణరావు : యీ ఇప్పించే మందు అక్కడే యిప్పిస్తాం లెండి.

చిదంబర్రావు గారు : సరే మరిడమ్మ పిన్నితో చెప్పి అమ్మ వస్తానంటె తీసుకెళ్లండి.

నారాయణగారు : యింట్లోకి వెళ్లి అందర్ని అడుగుతాడు.

మరిడమ్మ తాతమ్మ : నేనుగూడ రావాల్సి వస్తుంది నాన్నా. దానికి చేసి పెట్టుకోటానికి.

నారాయణరావు గారు : అంతకన్నా కావలసిం దేముంది. ఆ మనుమరాలి దగ్గర గూడ నాలుగు రోజులున్న వారవుతారు. మా అందరికి కూడ చేసి పెట్టవచ్చు.

మరిడమ్మ గారు : సరే అట్లాగే వస్తాలె నాయనా.

నారాయణరావు గారు : గుడ్డలూ అవీ సర్దు కోండమ్మా. చాలా పిచ్చి రూపమైపోయింది. పిల్ల జుట్టు తీసేసారేమిటి?

కనకమ్మ బామ్మ అందుకుని : యేం జెయ్యమంటా నాయనా? అలిమిగాలా జుట్టు.

నారాయణ గారు : జబ్బు పడితే జుట్టు చిక్కు పడకుండా వుంటుందా? చిన్నపిల్ల కాబట్టి సరిపోయింది. యిది పెద్దవాళ్లకు జబ్బు జేస్తే కత్తిరిస్తారా?

కనకమ్మ గారు : చేస్తే తెలుస్తుంది, మాటలు కావు.

తాతమ్మ గారు : యెందుకు జరిగిపోయిందానికి ఘర్షణ?

అమ్మ : తాతగారి దగ్గరకు వెళ్లి "వాళ్లు యెవరో కొనిపెట్టట మెందుకు టానిక్కులు? చేసే పనిచేసి మీరు కొనివ్వండి. తీసుకెళ్లి తాగుతాను."

చిదంబర్రావు తాతగారు : నా దగ్గర మొన్నటి బాపతు అంటె మీ అమ్మ నా చేతికిచ్చిన తొమ్మిది శవరుల కడ్డీ తెగ్గొట్టి అమ్మాను. కొంత మీ నాన్నగారి అవుపోసనకు శాంతికి వాడాను. యింకా వున్నది. అదిబెట్టి తీసుకొస్తా.

అమ్మ : సరే తీసుకురండి. లేకపోయినా ఫరవాలేదు.

చిదంబర్రావు తాతగారు : నీ కోసము కాదమ్మా, మా కోసము.

అమ్మ : యెవరి కోసము, యెవరు చేసినా జరుగవలసిన పద్ధతి ఒకటేగా? సరే యీ మాటలు యెందుకులెండి, కొనుక్కు రండి.

చిదంబర్రావు తాతగారు బజారుకెళ్లి మందు కొనుక్కొస్తారు.

మరునాడు ప్రొద్దున్నే నారాయణరావు గారు, మరిడమ్మ గారు, అమ్మ ముగ్గురూ కలిసి చీరాల వెళతారు.

మౌన స్వామి సందర్శనం :

అమ్మ పినతల్లి శేషమ్మ గారు అమ్మను చూడగానే కౌగిలించుకొని యేడుస్తుంది. చంకనేసుకుని లోపలికి తీసుకెళ్లి కాసిని కాఫి యిచ్చి. అమ్మను తాగమంటుంది.

అమ్మ : నాకొద్దు అలవాటు లేదు అంటుంది.

శేషమ్మ గారు మరిడమ్మగారిని "నాయనమ్మా కాళ్లు కడుక్కుని లోపలికి రా" అంటుంది. మరిడమ్మ కడుక్కుని వస్తుంది. శేషమ్మ గారితో - "కాఫీ వొద్దులే అమ్మా! యింత అన్నం పెందలాడి వొండిపెట్టు."

శేషమ్మ గారు అన్నం పెందలాడి వండి అమ్మకు పెడుతుంది.

మరుసటిరోజు నుంచి మరిడమ్మ తాతమ్మగారె వండి అందరికి పెడుతుంది. యిట్లా పది రోజులు జరిగిపోతుంది. యింటికి తిరిగివద్దాం అనుకుంటుండగా యింటిపక్కవారు వచ్చి మౌనస్వామిని గురించి తాతమ్మ గారితో చెపుతారు. అది విని తాతమ్మగారు ఆ మధ్యాహ్నం నుంచి గుఱ్ఱబ్బండి కట్టించుకుని నూనె పానకాలతోట కెళతారు.

వారిచుట్టు చాలామంది కూర్చుని వుంటారు.

తాతమ్మగారు కూడ పది నిమిషాలు అట్లాగె కూర్చుని వచ్చేస్తారు.

అమ్మకు మరుసటిరోజు వెళ్లాలనిపిస్తుంది. అందరూ అన్నాలు తిని పడుకునే టయిములో ఆయన దగ్గర యెవరూ లేకుండా వెళ్లి కలుసుకోవాలనుకుని మరునాడు ఉదయం తొమ్మిది గంటలకు బయలుదేరి అమ్మ అక్కడకు పదకొండు గంటలకు చేరుతుంది. అందరు అప్పుడే భోజనాలకు వెళ్లటానికి సిద్ధంగా వుంటారు. అప్పుడు స్వామి చుట్టూ అమ్మేగాక పిల్లలు చాలామంది మూగి వుంటారు. ఆ ఆవరణం చుట్టూ కూడా వుంటారు.

బందా ఆదినారాయణ గారు వెండిగిన్నెతో స్వామికి పంచామృతాలు యిచ్చి యీ జనాన్ని అందరిని అవతలకు నెట్టి, వెళ్లమని పిల్లల్ని గదుముతారు. యెంత గదిమినా యే పిల్లలూ పోరు. నూనె పానకాలు భార్యకు పిల్లలు లేకపోవటంతో పిల్లలకు అడుగడుగునా యేవో ప్రసాదాలు పెడ్తూనే వుంటుంది. యీ రుచి మరిగి యెవరూ కదలనే కదలరు.

చీరాల వెంకట్రావు గారు బెత్తం తీసుకుని తరుముతారు అందర్ని. అమ్మ కదలకుండా నుంచుంటుంది.

వెంకట్రావు : ఏ అమ్మాయి నిన్నే మొద్దు నుంచున్నట్టు నుంచున్నావు, పోవేం?

అమ్మ అప్పుడూ కదలదు. తలవంచుకుని నుంచుంటుంది, విననట్టుగా.

వెంకట్రావు : నీవు యెన్ని చెప్పినా కదలవేం అని ఒకటి వేస్తాడు.

అమ్మ అప్పుడూ కదలదు.

నూనె పానకాలు "యెందుకూ అట్లా కొట్టు కుంటారు. వీపుమీద చూడు యెంత దెబ్బ పొంగిందో?"

అమ్మ మెదలకుండా నుంచుంటుంది. అందరూ అన్నాలకు వెళతారు. తలుపులన్నీ దగ్గరవేసి వుంటాయి. అమ్మ నూనె పానకాలు గారి అరుగుమీద కూర్చుంటుంది. అందర్ని పోనిచ్చి అమ్మ దొడ్డి వాకిలిగుండా లోపలకు ప్రవేశిస్తుంది. లోపలకు అమ్మ అడుగు పెట్టగానె.

మౌనస్వామి : లోపలకు రా అమ్మా! వాకిట్లో యెవరూ లేరా?

అమ్మ : యెవరూ లేరు.

మౌనస్వామి : దగ్గరకు రా!

అమ్మ : (దగ్గరకు వెళ్లి నుంచుని) అయ్యా మౌనమంటే యేమిటి?

స్వామి : అనవసరమైన మాటలు మాట్లాడకుండా వుండటానికి యీ మౌనం ఆధారం.

అమ్మ : మీరు మన్నవలో వేసిన యంత్రం రాజరాజేశ్వరా? రాజ్యలక్ష్మా?

స్వామి : నీకెందుకొచ్చిందమ్మా ఆ సందేహం?

అమ్మ : ఆ వూళ్లో అనుకుంటున్నారు ఒకరు రాజ్యలక్ష్మి అని. ఒకరు రాజరాజేశ్వరని.

స్వామి : రాజరాజేశ్వరీ యంత్రమే!

అమ్మ : మీరు అసలు మాట్లాడేతారో మాట్లాడరో అనుకుంటూ వచ్చాను.

స్వామి : నిన్ను చూడగానె మాట్లాడాలనిపించిందమ్మా! యింకొకటి గూడ అనిపిస్తుందమ్మా! నీవు దేదీప్యమానంగా వెలిగిపోతూ దర్శన మిస్తున్నావు. నేను యెవరికీ చెప్పను గాని-

అమ్మ : అది సరేగాని మీరు అందరికి బాల మంత్రం యిస్తూ వుంటారా?

స్వామి : నీ రాక చాల గోప్యంగా వుంచుకుంటా నమ్మా. నీతో మాట్లాడినట్టు తెలిస్తే, వీరంతా నా ప్రాణాలు తీస్తారు. నేను మౌనం ప్రత్యేక సాధనంగా పెట్టుకోలా, కొన్ని అవుసరాలు అట్లా కనుపించినయ్యి.

అమ్మ : మీరు బాల చెప్పినవాళ్లందరికి నేను అజపం చెపుతా.

స్వామి ఆశ్చర్యంగా అమ్మను చూస్తూ అక్కడున్న రుద్రాక్ష మాల యిటు నుంచి అటు తిప్పేస్తారు. 'ధన్యోస్మి ధన్యోస్మి' అంటారు. అజపం అంటే ఏమిటమ్మా?

అమ్మ : నోటితో ఉచ్ఛరించంది.

స్వామి : అటువంటిదాన్ని ఎట్లా చెపుతావు?

అమ్మ : చెప్పటమంటూ వచ్చినప్పుడు మాటలు లేకుండా యిట్లా వుంటాయి. చెప్పేటప్పుడు మాటలతో చెప్పినా చేసేటప్పుడు మాటలు లేకుండా చేసేది.

యింతలో ఎవరో వస్తున్నట్టుగా శబ్దం అవుతుంది.

స్వామి ఆశ్చర్యంగా అమ్మను చూస్తూ అక్కడున్న రుద్రాక్షమాల యిటునుంచి అటు తిప్పేస్తారు. 'ధన్యోస్మి ధన్యోస్మి' అంటారు. అజపమంటే యేమిటమ్మా?

అమ్మ : నోటితో వుచ్ఛరించంది.

స్వామి : అటువంటి దాన్ని యెట్లా చెపుతావు?

అమ్మ : చెప్పటమంటూ వచ్చినప్పుడు మాటలు లేకుండా యిట్లా వుంటాయి. చెప్పేటప్పుడు మాటలతో చెప్పినా చేసేటప్పుడు మాటలు లేకుండా చేసేది.

యింతలో యెవరో వస్తున్నట్టుగా శబ్దం అవుతుంది.

స్వామి : వెళ్లమ్మా వెళ్లు!

అమ్మ : యెందుకు వెళ్లటం? నన్నేమయినా అంటారా? నిన్నేమయినా అంటారా?

స్వామి : (కొంచెం మొఖం చిన్నబుచ్చుకుని), యెవరిని యేమి అనరుగాని నా నిష్ఠకు భంగం వస్తుంది.

అమ్మ : నిష్ఠ అంటే యేమిటి స్వామి?

స్వామి : అది నీకేమి తెలుస్తుందమ్మా!

అమ్మ : నిష్ఠదరిద్రులు అంటుంటారే అదేనా?

స్వామి : ఛీ! ఛీ!

అమ్మ : మీరు చెప్పనన్నా చెప్పాలి. నేను చెప్పిందన్నా వొప్పుకోవాలి.

స్వామి : నిష్ఠ అంటే అనుష్ఠానం.

అమ్మ : అంటే అనుష్ఠాన దరిద్రులా?

స్వామి : నీకు కొంత అమాయకత్వం కూడ వున్నట్టుంది.

యింతలో బందా ఆదినారాయణ గారు వచ్చి తలుపులు గట్టిగా నెడతారు. నెట్టి స్వామి యెప్పుడూ తలుపులు లోపల గడియ బెట్టలేదు అంటారు.

అమ్మ అటువైపు తిరిగి వెళ్లిపోతుంది. స్వామి గడియ తీస్తారు.

అమ్మ యింటికి వస్తోంది.

శేషమ్మగారు : యింతసేపు యెక్కడికి పోయినావు? యివాళ పొద్దుట నుంచి అన్నం కూడ తినలేదు.

అమ్మ : మౌనస్వామిని చూచి వద్దామని వెళ్లాను. అక్కడ ఆలస్యమైనది.

శేషమ్మగారు : యెట్లా నడిచి వెళ్లావు? యింత జబ్బు పడ్డదానివి?

అమ్మ : ఒక పాదం వేస్తూ ఒక పాదం తీస్తూ వెళ్లాను.

శేషమ్మగారు : అంతదూరం నడవగలిగావా?

అమ్మ : నడిచాను.

శేషమ్మగారు : నాయనమ్మ నీకోసం కనిపెట్టుకు కూర్చుని, కూర్చుని యిప్పుడే పడుకున్నది.

అమ్మ : భోంచేసి పడుకుందా?

శేషమ్మగారు : ఆ అందరం చేసాం.

అమ్మ : నేనూ తినేవచ్చా.

శేషమ్మ : నీకెవరు పెట్టారమ్మా అక్కడ?

అమ్మ : పెట్టగలిగినవాళ్లే పెట్టారు. తినగలిగిన వాళ్లే తిన్నారు. యింతలో తాతమ్మ గారు లేస్తుంది.

తాతమ్మ : అయ్యో యెక్కడికి పోయావమ్మా? నీకు సరిగా ఆహారం అందదని నేను రావటమేమిటి, నీవు యెక్కడికో పోయి కూర్చున్నావు. మీ బాబాయి పోలీసుల్ని పెట్టి వెతికిస్తానన్నాడు. అక్కడ యేమి జరిగిందేమిటి?

అమ్మ : యేమీ లేదు. నిన్న నీవు వెళ్ళినచోటుకే వెళ్లాను. వారిని చూద్దామనిపించి. యింతసేపు కూర్చుందామనిపించి కూర్చున్నాను.

తాతమ్మ : యింత అంటె యెంత?

అమ్మ : యెంతయినా.

తాతమ్మ : అన్నమయినా తినిపోగూడదూ?

అమ్మ : యిప్పుడు పెట్టరాదూ, తింటాను.

తాతమ్మ : పెడతా, రా అని విస్తరేసి అన్నం పెడుతుంది.

అమ్మ : (అన్నం తిని) యెప్పుడు మనం వెళ్లటం.

తాతమ్మ : యిప్పుడేముందమ్మా, రేపు.

శేషమ్మగారు అమ్మకు తలంటిపోసి పరికిణి చొక్కా కుట్టించినవి వుంటే తొడుగుతుంది. ఆ సాయంకాలం పూరీలు చేసి అమ్మకు, తాతమ్మకు పెడుతుంది శేషమ్మగారే.

అమ్మ : పిన్నీ నాకు పెట్టేబదులు ఆ విస్తళ్లలో ఏరుకు తింటారే వాళ్లకు పెట్టరాదు? వాళ్లకు విస్తళ్లలో గూడ అటువంటి పదార్థాన్ని పారవెయ్యం గదా. యేదో ఒకరకంగా తింటానికే ప్రయత్నిస్తాము గదా?

శేషమ్మగారు : యింట్లోవాళ్లకే చాలటం లేదు. వాళ్లదాకా యెక్కడ?

అమ్మ : పోనీ నాకు పెట్టినవి తీసుకెళ్లి యిచ్చుకొచ్చుకుంటాలే.

శేషమ్మగారు : యివి తిను. తరువాత యిస్తా, యిచ్చొద్దువుగాని.

అమ్మ : నాకు కడుపులో నొప్పి, నేను తినలేను.

శేషమ్మగారు సరే అని యింకా రెండు చేతికిచ్చి పెట్టుకొచ్చుకో పో అంటుంది.

అమ్మ గంతులేసుకుంటూ వెళ్లి అవి పెట్టివచ్చి మెల్లిగా యింట్లోవి తీసుకెళ్లి ఒక చొక్కా, పరికిణీ కూడా యిచ్చి వస్తుంది. యిదెవరూ చూడరు.

మరునాడు పొద్దున్నే తాతమ్మ, అమ్మ బాపట్లకు వచ్చేస్తారు.

అక్కడ ఒకరోజు వుండి మరునాడు తాతమ్మ, అమ్మ మన్నవ వెళ్లిపోతారు.

అపరాధ స్తవము :

వెళ్లిన రెండు రోజులకు ఆమెతో కూడ మంత్రోపదేశమయిన ఆమె సన్యాసి సుబ్బాయమ్మగారు, (చేబ్రోలు) చాలా తెలివయిన మనిషి, పదహారేళ్లకే భర్తబోయి విచార స్థితిలో వుండగా పాత గుంటూరు బంధువుల యింటికి వస్తుందామె. తాతమ్మ గారు చిదంబర్రావు గారికి చదువు చెప్పించుకుంటూ పాత గుంటూరులో

వుండేవారు. అక్కడ బాగా తెలిసిన ఒక ఆమె మల్లెల రత్తమ్మగారని అక్కడ వుండేవారు. అక్కడకు, సుబ్బాయమ్మ గారు, మరిడమ్మ గారు మంత్రోపదేశం కోసం వెళ్లారు. సుబ్బాయమ్మ గారికి బాగా సంస్కృతం వచ్చు. తాతమ్మగారికి చదువు రాదు.

ఈ సుబ్బాయమ్మగారు అన్నపూర్ణమ్మగారికి కూడ గురువుగారే. తరుచుగా బాపట్ల వస్తుండేవారు. అమ్మ అంటే చాల ప్రేమతో చూచేవారు. తల్లిలేని పిల్ల అనే దృష్టితో.

తాతమ్మ, అమ్మ మన్నవ చేరిన మరునాడే చేబ్రోలు నుంచి ఆమె పోయినట్టుగా కబురు వస్తుంది.

ఒక రోజు వుండి మరునాడు తాతమ్మ చేబ్రోలు వెళ్లాలనుకుంటుంది.

అమ్మ : తాతమ్మా ! నేనూ వస్తా.

తాతమ్మ : వద్దులే అమ్మా, తిరిగి తిరిగి వచ్చాం. జబ్బుచేసిందా?

అమ్మ : నేను యిక్కడ వుండను. నేనూ మీతోనే వస్తా.

తాతమ్మ : మీ పిన్ని చిన్నది. చేసుకోవటం చేతగాదు. యింటిదగ్గర వుండమ్మా.

అమ్మ : నేను వుండి మాత్రము యేమి చేస్తాను? అయినా సుబ్బాయమ్మ గారికి నేనంటే చాలా ప్రేమ. ఆరాధన అంటే యేమిటో చూచొస్తా.

తాతమ్మ : మీ నాన్నగారి నడుగుదాం యేమంటారో తాతగార్ని పిలిచి యిట్లా కబురొచ్చింది, నేను వెళుతున్నానని చెపుతుంది.

సీతాపతి తాతగారు : పిల్లను గూడ తీసుకెళ్లు అంటారు అడక్కుండానే!

తాతమ్మ : అమ్మాయికి తోడుగా వుంటుంది గదా వుంచుదామను కున్నాను. అది వస్తాననే అన్నది. నేను వుంచిపోదామనుకున్నా.

సీతాపతిగారు : సరే దాని యిష్టం వస్తానంటె తీసుకెళ్ళు, వుంటానంటె వుంచు.

తాతమ్మ : అడక్కుండానే తీసుకు వెళ్లమనేసరికి ఆమె కూడా కొంచెం కష్టం తగిలి అది మనసులోనే వుంచుకుని, యేవమ్మా పోదాం వస్తా నడవగల్దువా?

అమ్మ : నడుస్తా!

అమ్మ, తాతమ్మ మరునాడుదయం 8 గంటలకే భోంచేసి మూటలు కట్టుకుని నడుము వంగిపోయి కర్రపోటు చేసుకుంటూ ముందు తాతమ్మగారు, వెనకాల

అమ్మ తాతమ్మ కన్నా మెల్లగా రెండు ఫర్లాంగుల వెనుకగా కాలవల్ని, చెరువుల్ని, కట్టల్ని, చెట్లుల్ని చూచుకుంటూ ఒకదాన్ని గురించి ఒక పావుగంట ఆలోచించు కుంటూ "యిదంతా నేనే" అనుకుంటూ వెళ్లింది (లాకుల దగ్గరకు). అక్కడకు చేరేటప్పటికి పడవ కాస్త వెళ్లిపోతుంది. ఆ రోజు లాకుల దగ్గరే పడుకుని వెళదామను కుంటుండగా యింకొక పడవ కొత్తది ఆరోజే వర్కు ప్రారంభం చేస్తారు.

పడవ మనిషి : అమ్మాయి, మీరు యేవూరు వెళతారు?

అమ్మ : మేము అక్కడనుంచి వచ్చేలోగా పడవ కాస్తపోయింది. చేబ్రోలు వెళ్లాలనుకుంటున్నాం

పడవ మనిషి : మా పడవ చేబ్రోలే పోతుంది. యీరోజె మొదలు బెట్టాం. బోణీ కొడ్డువుగానిరా.

తాతమ్మ గారు వింటూ పడుకుంటుంది.

అమ్మ : నేనెక్కితేనె బోణా? యెవరెక్కినా బోణేగా?

పడవ మనిషి : యెవరెక్కినా బోణే అనుకో వెళ్లేవారు చాలామంది వున్నారు. అయినా నీవు యెక్కితే బాగుంటుందనిపిస్తున్నది.

అమ్మ : (తాతమ్మను లేపి) పడవతను పిలుస్తున్నాడు వెళదామా?

తాతమ్మ : యేదో ఒక రకంగా చేబ్రోలు చేరితే సరి వెళదాం. యీరోజుకే అయిదు రోజులయి పోయింది. యిద్దరూ పడవెక్కి చేబ్రోలు వంతెన దగ్గరికి చేర్తారు. వంతెన దగ్గరనుంచి నడిచి మెల్లగా రాత్రి యెనిమిదిన్నరకు యిల్లుచేర్తారు.

యింత తెలిసిన మరిడమ్మగారు కూడ సుబ్బాయమ్మగారి తల్లిని కౌగలించుకుని కళ్లనీళ్ళు పెట్టుకుంటుంది.

సుబ్బాయమ్మ గారి అక్క సుందరమ్మ గారు : యింతమంది పెద్దవారు వుండగా అందరికంటె చిన్నది యెంతమందో కావాలనుకునేది దాటిపోయింది.

అమ్మ, మరిడమ్మగారు వీళ్లు పోయిన ఒక గంటకు సుబ్బాయమ్మ గారి శిష్యురాలు హైదరాబాదు నుంచి 'చిన్నమ్మాయనే' ఆమె వస్తుంది. ప్రాణం పోయేటప్పుడు దగ్గర లేననే బాధతో ఫోటో ముందర కూర్చుని ప్రార్థన చేస్తూ యేడుస్తుంది. ఆ కూర్చోవటం పదిహేను గంటలు అట్లాగె కూర్చుని వుంటుంది. కళ్లవెంట నీళ్ళు కారుతూనె వుంటాయి.

సుబ్బాయమ్మగారితోపాటు సీతాయమ్మగారని ఒక ఆమె తపస్సు చేసుకుంటూ వుండేవారు. ఆమెను చాల ఉగ్రతపస్విని అనవచ్చు. 12 సంవత్సరాలు నేల భోషాణంలో వుండి లేపకుండా తపస్సు చేసారని అనుకుంటారు. కాని తీవ్రమైన కోపధారి. ప్రతిమాటకు ప్రత్యక్షంగా కనపడుతుంది. క్షుద్ర మంత్రాల యందు చాల ఆసక్తి కలిగిందట. యింతకుముందు సుబ్బాయమ్మ గారి శిష్యురాలు ఒక ఆమె హనుమాయమ్మని వుండేది. ఆమె యెప్పుడు గురువుగారికి జబ్బు చేసినప్పుడల్లా నీవుబోతెనేనుండను. నీతోగూడ వస్తానంటూ వుండేది. అన్నట్టుగానే సుబ్బాయమ్మ గారు పోతుందని మాట వినగానె పోయిందని అనుకుని గబగబా పరుగెత్తుకొస్తూ దారిలోనే పడి పెద్ద కేకబెట్టి ప్రాణము పోతుంది.

సుబ్బాయమ్మగారు వున్నచోటనే సందులో వండుకు తింటూ వుంటుంది. ఆ మఠము సందులోనే ఆమె ప్రాణము పోతుంది. సందులో హనుమాయమ్మ కూతురు "ఓ అమ్మ యీ అమ్మకూడ ఆ అమ్మలోకి వస్తున్నది" అని కేకవేసింది.

సుబ్బాయమ్మగారి దగ్గరున్నవారు యెవరు యిటురారు. సుబ్బాయమ్మ గారి చెవులో యీ మాట వినపడి, మాటలేని కారణంచేత చెయ్యి వూపుతుంది ఆటుపోయిరండని. ప్రాణము వదులుతుంది. దొడ్డి వాకిలిని సుబ్బాయమ్మ గారిని చూడటానికి వచ్చేవారంతా ముందు హనుమాయమ్మ గారిని చూచి 'నీమాట చెల్లించుకున్నావు. యెంత ధన్యురాలివే' అని అన్నారట.

చిన్నమ్మాయి పదిహేను గంటలు కూర్చున్న తరువాత కన్ను తెరవగానె చాలా జనం వుంటారు. అమ్మ దీపారాధనలో చమురు పోస్తూ యెదురుగా కూర్చుని వుంటుంది. కన్ను తెరచీ తెరవంగానె ఆమెకు వొళ్లు తెలియకుండా అమ్మను కౌగలించుకుని నాకు చెప్పకుండా పోయినావా, నన్ను వదిలిపెట్టి పోయినావా అని యేడుస్తుంది.

అందరూ మాట లేకుండా కళ్లు పెద్దవిజేసి నోరు తెరచి చూస్తూ వుంటారు.

సీతాయమ్మగారు: నా శక్తిచేత సుబ్బాయమ్మ గారిని యిక్కడ స్థాపించాను. కూర్చోబెట్టానన్న మాట యెదురుగుండా శరీరంతో. యీ అమ్మాయి కూర్చున్న చోట కూర్చో బెట్టడంతో అది యీ అమ్మాయినే కౌగలించుకుంది.

అమ్మ: అటువంటప్పుడు నన్ను కౌగలించుకున్నా స్పర్శ నాకు తగలకూడదుగా?

వరలక్ష్మమ్మగారు : (సుబ్బాయమ్మ గారి శిష్యురాలు) ఆమెకు కనపర్చినట్లుగా మా అందరకు కూడ కనపర్చవచ్చుగా? శరీరం కోసమేగా యీ దిగులంతా జీవాత్మ

యెంత గొప్పదైనా ప్రత్యగాత్మలో వున్న ఆనందం (ప్రత్యగాత్మ అంటే జీవుడుతో వున్న శరీరము, శరీరముతో వున్న ఆత్మ - ప్రత్యక్ష ప్రమాణమైన ఆత్మ స్వరూపం - రూపాన్ని ధరించిన ఆత్మ - ప్రత్యగాత్మను గురించి అమ్మ చెప్పినది.) జీవుడు ఆత్మ స్వరూపమైనప్పుడు అంటే శరీరం లేనప్పుడు లేదుగా.

సీతాయమ్మ : (మొఖమంతా చిట్లించుకుని కోపంతో లేచి నిలబడి) అందరూ నోళ్లు మూసుకోండి. అరవద్దు.

సుబ్బారావు : సుబ్బాయమ్మ గారు యింకా యేమి నోరు మూస్తారు. అయిందేదో అయింది.

సీతాయమ్మగారు, సుబ్బాయమ్మ గారికి చేతబడి చేసింది. అందువల్ల పోయిందని అనుమానంతో అందరు ఆమె అంటె కష్టంగా వుంటారు. సీతాయమ్మ గారు యేది మాట్లాడినా నమ్మరు. అందరు యెవరి దారిన వారు వెళ్లిపోతారు.

సీతాయమ్మ గారు, అమ్మ, మరిడమ్మ గారు, చిన్నమ్మగారు యింకా కొద్దిమంది వుంటారు.

అమ్మ : (మెల్లిగా) అమ్మా నేనొక సంగతి అడుగుతా చెపుతారూ? యిందాక మీరు విన్నట్టు లేదు. నాలో ఆమెను ఆరోపణ చేసి ఆ శక్తిపాతం చేసినప్పుడు, నేను నా శరీరం అనేది గుర్తులేకుండా వుండాలి. అప్పుడు నేను యెక్కడ వుంటాను. యెట్లా వుంటాను?

తాతమ్మగారు : చిన్నపిల్లకు నీకేమి తెలుస్తుంది, వాగబోకు,

అమ్మ : మీకు యెవరో క్షుద్ర మంత్రగాళ్లు కోపమనే గ్రహాన్ని పంపకం చేసినట్టు వున్నారు. అదీగాకపోతే యెవరో క్షుద్ర మంత్రగాళ్లు చచ్చిపోయి మీకు పట్టివుంటారు. అది మీకు నయం కాదు. పీల్చి పిప్పి చేస్తుంది. యే భూతవైద్యులవల్ల కాదు. యే డాక్టర్ల వల్లకాదు. ఆగ్రహాన్ని నయం చేయాలంటె నిగ్రహం కలవాళ్ల వల్లే కావాలి. కోపధారులను జయించాలంటె శాంతము గలవాళ్లే జయించాలి.

సీతాయమ్మ : యివన్నీ తెలిసిన మాటలా, తెలియని మాటలా?

అమ్మ : యెవరివి?

సీతాయమ్మ : నీకు తలతిక్క యెక్కువల్లే వుందే అమ్మాయి.

అమ్మ : నాకున్న అన్నిపాళ్లు నాకంటె కాస్త యెక్కువుంటె కాని నన్ను కనుక్కోలేరు.

మరిడమ్మగారు : (అమ్మ చేయి గీరుతూ) వూరుకో అమ్మా వూరుకో అసలే కోపధారి అని నెమ్మదిగా అంటుంది.

అమ్మ : (పెద్దగా) యేముంది అక్కడ సరుకు యేంలేదు. కోపం తప్ప, యేం చేస్తుందేం? నేనూ తేలుద్దామనే చూస్తున్నా.

సీతాయమ్మ కళ్ళు పెద్దవిజేసి చూస్తుంది. అమ్మ అంతకంటే పెద్దవిజేసి చూస్తుంది. కన్ను ఆర్పకుండా చూస్తుందామె. ఆమె కంటె యెక్కువగా అమ్మ కన్ను ఆర్పకుండా చూస్తుంది. చూసి చూసి విసుగుబుట్టి ఆమె వెళ్లిపోతుంది.

అమ్మ : ఆమెకు యిది "అపరాధ స్తవము" (అంటె యిక్కడ నుంచి వెళ్లిపోవడమే)

చిన్నమ్మాయికి కొంచెం వొళ్లు తెలిసి అందరిని గుర్తిస్తుంది. వొళ్లు తెలియంగానె మరిడమ్మ తాతమ్మకు నమస్కారము చేస్తుంది.

అందరూ లేచి యింట్లోకి వెళ్లి యివాళ యేమిటో అమ్మగారు లేనట్టుగా లేదు. అందరూ భోజనాలు చేస్తారు.

నిత్యము భజనలు, పారాయణ, సహస్రనామార్చన సమాధి దగ్గర జరుగుతూ వుంటాయి.

నిత్యము వెయ్యిమంది తింటూ వుంటారు.

అట్లా పదిరోజులు గడిచిపోతుంది. పదోరోజు సాయంకాలం అక్కడకొచ్చిన వారిలో కొంతమంది కాంతయ్యగారి ఆశ్రమానికి వెళ్దామనుకుంటారు.

సీతాయమ్మగారు ఆరోజంతా ఆహారము తీసుకోకుండా పడుకుంటారు.

అమ్మ : యేమమ్మా సన్యాసమ్మ గారు ఆహారం తీసుకోకుండా పడుకున్నారు?

సీతాయమ్మ : నేను సన్యాసిని గాదు.

అమ్మ : యేమనాలో తెలియక అన్నాను సన్నాసమ్మ గారనాలా?

సీతాయమ్మ : పో! అనవసరంగా మాట్లాడబోకు అవతలకు పో!

అమ్మ : యెవరు పోవాల్సి వస్తుందో?

సీతాయమ్మగార్కి ఒక్కతే శిష్యురాలు వుంటుంది. ఆమెది బాపట్ల కోనా వెంకట్రావు గారి భార్య సుభద్రమ్మ గారు,

సీతాయమ్మ : కడతేర్చాలంటే ఒక్కరే శిష్యులుండాలి. కడతేర్చకుండా ఆడంబరంగా ప్రోగు చేసుకొనే వాళ్లకు చాలామంది వుంటారు.

సుభద్రమ్మ గార్కి జబ్బు చేసినట్టుగా కబురు వస్తుంది.

ఈ కబురు రాగానె తట్ట బుట్ట కట్టుకుని ప్రయాణమవుతుంది. లోపల ప్రేమ వున్నా లేకపోయినా, 'అయ్యో! యీ సమయంలో వెళ్లవసి వచ్చిందే!' అని అంటారు.

సీతాయమ్మ గారు : (కంటతడి పెట్టుకుంటూ) సామాన్యమైన వ్యక్తి కాదు. నా బిడ్డ అని యేడుస్తూ వుంటె

అమ్మ : మీ యంతది!

సీతాయమ్మ గారు చల్లున వెనక్కు తిరిగి కోపంతో చూస్తుంది.

అమ్మ : (వెంటనే అంతకంటె పక్కగా కోరచూపు చూస్తూ) తప్పేదేముంది. యెవరయినా అనుభవించవలసిందేగా. రాబోయే సంగతి యెంతటి వారికయినా తెలియదు గదా. తెలియక పోతేనే యిట్లా వుంది. తెలిస్తే యింకా యెంత విర్రవీగుతామొ. గుర్రపుబండి వాకిట్లోకి వస్తుంది. బండివాడు సామాను బండిలో సర్దుతాడు. యివరికి చెప్పకుండానె వెళ్లి ఆమె బండిలో యెక్కుతుంది. అందరూ చెప్పకపోయినా వాకిట్లోకి వెళతారు.

అమ్మ : (బండి దగ్గరకు వెళ్లి బండిలోకి తలబెట్టి) యేడవ బోకండి, యెందుకు యేడుస్తారు? ఒకళ్లయితే త్వరగా కడతేర్చొచ్చుగా.

సీతాయమ్మ యేమీ మాట్లాడదు. పక్కకు తిరిగి కూర్చుంటుంది.

అందులో ఒకరు బొడ్డుపల్లి సుందరమ్మగారు: కడతేరట మంటె ప్రాణం పోవటమేనా?

అమ్మ : యిప్పుడు ఆమె బ్రతికే వుంది. ఆమాట యెవకన్నారు?

సీతాయమ్మ గారు యెవరెన్ని అన్నా మాట్లాడదు. కళ్లనీరు ధారగా కారతయ్యి.

అమ్మ : పాపం మళ్లీ రావాలనే దృష్టితో పోవటంలేదు సీతాయమ్మ గారు.

సీతాయమ్మ గారు యేమీ మాట్లాడదు. బండి సాగుతుంది. కనీసం మొఖం కూడ వీళ్లవైపుకు తిప్పదు. బండి సరాసరి వెళ్లిపోతుంది. తల తిరగదు. బండి ఆగదు.

అందరూ లోపలకు వస్తారు.

అందరి మాయను :

నిన్న అనుకున్న వాళ్లందరు పది పదిహేను మంది కలిసి రెడ్డిపాలెం కాంతయ్య గారి ఆశ్రమానికి వెళతారు. మరిడమ్మ తాతమ్మ. అమ్మ కూడ వెళతారు. దారి పొడుగూత ప్రహ్లాద చరిత్రము మరిడమ్మగారు పాడుతూ వుంటుంది. పాడుకుంటూ ఆశ్రమానికి చేరతారు. అంతా దూరంగా వుండి కాంతయ్య గారిని చూసన్తా కూర్చుంటారు.

అమ్మ కాంతయ్య బాబు గారి దగ్గరగా కూర్చుంటుంది.

కాంతయ్య గారు మొఖము యెత్తి అయినా చూడడు అమ్మను.

గంటసేపు కూర్చుంటారు.

కాంతయ్య గారు తంబుర తీసుకుని నామం ప్రారంభిస్తారు. చాల చక్కగా ఆనందంగా చేస్తారు.

అమ్మ కూడ ఆయనతో కలిపి పాడదామనుకుంటుంది. యేమను కుంటారోనని భయం.

అంతా భాగ్యమ్మ గారి దగ్గరకు వెళ్లి కూర్చుంటారు.

అమ్మ లోగడ ఆమె పాటలు వినటం, పాడటం, చదవటం జరిగింది గాని ఆమెను చూడలేదు. అయినా యీమెను చూద్దాం. పాటలు యింత బాగా రాసింది యెంత పెద్దదోనని అమ్మ గబగబా వెళ్లి దూరంగా వుండి నమస్కారం చేస్తుంది.

భాగ్యమ్మ గారు కన్నెత్తిగూడ చూడదు.

అమ్మ : ఆమెను కొంచెం మంచినీళ్లు యిస్తారు అని అడుగుతుంది.

భాగ్యమ్మగారు మాట్లాడదు.

అమ్మ : వీళ్ల అందరిలో మాట్లాడదేమో. యెవరూ లేనప్పుడు పలుకుతుందేమో. వీళ్లందరు వెళ్లినాక మాట్లాడుదామని, తాతమ్మా నేనటు పోయి వస్తాగాని నీవు వీళ్లతో వెళ్లితే వెళ్లు నేను తరువాత వస్తా, నాకు యింకా తోడువున్నారులే.

మరిడమ్మ : ప్రొద్దుగూకుతోంది, మాతోనేరా!

అమ్మ : నాకేమి ఫరవాలేదు. తరువాత వస్తానులే అని అక్కడ నుంచోకుండా పరుగెత్తుతుంది. తాతమ్మ మిగతా వారితో కలిసి వెళుతుంది. అమ్మ వూరంతా చూచివస్తుంది.

అంతా యిళ్లకు వెళ్లిపోతారు.

యెక్కడివాళ్లు అక్కడ వెళతారు. అమ్మ ఆశ్రమానికి వస్తుంది. ముగ్గురో నలుగురో అక్కడివారె భోంచేస్తూ వుంటారు. అమ్మపోయి కూర్చుంటుంది. యెవరూ అన్నానికి పిలువరు.

అమ్మ : నన్నేనా యెవరయినా పెద్దవాళ్లు వచ్చి కూర్చున్నా పిలవరా యీ ఆశ్రమంలో అని దేశరాజు శేషగిరిరావు గారిని అడుగుతుంది.

శేషగిరి లోగడ వస్తూ పోతూ వుండేవాడె అమ్మ అడిగినా సమాధానం చెప్పడు. అమ్మను గుర్తించడు.

అమ్మ : మొత్తంమీద యెవరికి గుర్తులు వుండవల్లే వుంది యీ ఆశ్రమంలో. (మళ్లా భాగ్యమ్మ గారి దగ్గరకు వెళ్లి) కాసిని మంచినీళ్లు యిస్తారూ?

భాగ్యమ్మ : ఆఁ యిస్తా అమ్మా అని గబగబా తెచ్చియిచ్చి యెవరమ్మాయివి?

అమ్మ : యిందాక వచ్చిపోయినారే వాళ్లల్లో వంగున్న ముసలమ్మ లేదూ, ఆమెతో వచ్చా.

భాగ్యమ్మ : ఆమెతో వచ్చానంటావు, వారి అమ్మాయివి కాదా?

అమ్మ : నేను అందరి "మాయను!"

భాగ్యమ్మ : బాబుగారు, యీ అమ్మాయిని చూచారూ?

కాంతయ్య : అనేకమంది వస్తూ వుంటారు, పోతూ వుంటారు అని చూడరు.

భాగ్యమ్మ "కూర్చో అమ్మా" అని అంటుంది.

అమ్మ "వెళతానమ్మా" అని చెప్పి బయలుదేరి వస్తుంది. వస్తూ వస్తూ [illegible]లు తుంచుతుంది.

కాంతయ్యగారు : అమ్మాయి, తులసిచెట్టు తాకబోకు.

అమ్మ : తులసిచెట్టు అంటె అంత అంటరానిదన్నమాట అంటూ పరుగెత్తుతుంది.

చేబ్రోలు యిల్లు చేరేటప్పటికి రాత్రి పది అవుతుంది. అంతా భోంచేసి పడుకుంటారు.

దురాచార శమనం :

ఆ మరునాడు అక్కడనుంచి బయలుదేరి అమ్మ, తాతమ్మ శ్రీరంగపురం ప్రయాణం. పదిన్నరకు భోంచేసి చేబ్రోలు వంతెన మీదకు వెళతారు. అక్కడ వారిని విచారిస్తే వడవలు వెళ్ళిపోయినవంటారు. ఒక అరగంట ఆలోచించి నడచిపోవటానికి నిశ్చయించుకుని బయలుదేరుతారు. గం॥ 11.30 అవుతుంది చిత్త యెండ. కొంతదూరం పోయిన తరువాత దాహం అవుతుంది అమ్మకు. మబ్బయినా అడ్డం పడదు. చింతచెట్లు వున్నాయి గాని కట్ట పొడుగూతా పల్లంలో వుంటాయి. ఆ నీడగూడ సోకదు.

మరిడమ్మ తాతమ్మ గారు : అమ్మా నిన్ను నడిపిస్తున్నానని చాల బాధ పడుతుంది. కాని ఆమె కూడ చాల నీరు కారిపోతూ వుంటుంది. నడవలేక యెండలో.

అమ్మ : తాతమ్మ, నేను యే బాటను నడిచినా చింతలు కనపడుతూనే వుంటయ్యేం? చింతలున్న బాటను నేను నడుస్తున్నానా, నేను నడిచే బాటలో అవి వుంటయ్యా? యేది తేలటంలా కాని నావెంట చింతలు తప్పవు!

మరిడమ్మగారు : ఆ మాట అనటంలో వుద్దేశం యేమిటి?

అమ్మ : యిప్పుడు జరిగేదాన్ని బట్టి యిదివరకు జరిగిన దాన్ని బట్టి, జరగబోయే దాన్ని బట్టి గూడ యిదే ఆలోచిస్తున్నా, యెట్లా అన్నా జరగనియ్యి. ముందు నాకు దాహమవుతున్నది తాతమ్మా!

తాతమ్మ : కూర్చోమ్మా చూస్తాను. కాసేపు కూర్చుంటే అలసట తీరుతుంది. తరువాత రేపు యెక్కడన్నా ఉంటే దిగి తాగుదాం. పొరపాటు చేసాను, మరచెంబులో మంచినీళ్ళ తీసుకొస్తే తాగేదానివి గదా. నడిపించటమే గాకుండా వెన్నపూస వంటి పాదాలు, మొఖము చూడు కుంకుమ రంగయిపోయింది. ఒక్కనారింజ పండు వుంది మూటలో అని తీసి చేతికిస్తుంది.

అమ్మ అది వలుస్తుండగా జారి క్రింద బడుతుంది. కట్టకిందకు దొర్లుతుంది. ఆ దొర్లటం దిగి తీసుకోటానికి వీలు లేనంత దూరంలో పోయి ఆగుతుంది. అది ఆగిన చోట కొండచిలువ అనే పాము వుంటుంది. చతుర్థంగా గజమున్నర వెడల్పున చుట్టుకుని పడుకుని వుంటుంది. "తాతమ్మా! పండు జారిపోయింది చూచావా? యెక్కడాగిందో చూచావా? అటుచూడు పెద్దపాము కనపడుతున్నది. నేనెప్పుడూ చూడలా. చూడ మచ్చలు మచ్చలుగా కనపడుతున్నది పాముమీద".

మరిడమ్మ తాతమ్మ : అది కొండచిలువమ్మా! కొండచిలువ అంటే అంత పెద్దదిగాదు, చిన్నది గాదు, చచ్చిపోయినట్టుంది.

అమ్మ : చావలా! చచ్చినట్టు పడివుంది.

తాతమ్మ : బ్రతికి వున్నా అది తొందరగా యేమి చేయదు. ఆ పండుగూడ జారిపోయిందిగా అమ్మా, దారేపోయేవాళ్లు యెవరయినా తాబేటి కాయలో మంచినీళ్ళు తీసుకెళతారేమో ననుకుంటే అట్లాంటి వాళ్లన్నా కనపడలేదే!

అమ్మ : యెందుకు కనపడతారమ్మా తాతమ్మా కనపడరు. యిట్లా అంటూండగానే పై నుంచి ఒక అబ్బాయి తాబేటి కాయలో మంచినీళ్లు పోసుకుని వస్తూ వుంటాడు. ఆ అబ్బాయి దగ్గరకు వస్తాడు.

తాతమ్మ : నాయనా మా అమ్మాయికి కాసిని మంచినీళ్లు పొయ్యండి.

అబ్బాయి : లేవు అవ్వా! యిప్పుడే తాగాను.

అమ్మ : వుండవమ్మా, వుండవు. యెందుకు వుంటాయి? కాలవ నిండా నీళ్లు వున్నా రేవులేదు. యింత కాలవలో నాకు కావలసిన చెంబుడు మంచినీళ్లు దొరకలా. నామీద ప్రేమ గలదానివి నీవు వున్నావు, కాలవ నిండా నీళ్లు వున్నాయి. నారింజ కాయ యిస్తే జారిపోయింది. పడవకొస్తే పడవ అందలా. ''యెంత ప్రేమ గలవాళ్లున్నా యెన్ని వున్నా బాధపడే యోగ్యత వున్ననాడు యెవరూ తప్పించలేరు''.

తాతమ్మ : ఫరే యేంచేద్దాం? నడిచిపోదాం పద. కాసేపు కూర్చున్నాంగా. యింకా కొంతదూరం నడిచినాక మళ్లీ కూర్చోవచ్చు అని మెల్లగా నడుచుకుంటూ రాత్రి యేడుగంటలకు వూరు ముందరకు జేర్తారు. కూర్చున్న చోటల్లా తాతమ్మ కాళ్లు అమ్మ వత్తటం, అమ్మ కాళ్లు తాతమ్మ వత్తటం జరుగుతుంది. మాగాటి గట్లను కాళ్లు జారుతూ వుంటాయి. పొలాల్లో వున్నవాళ్లందరిని బాటకనుక్కుంటూ యెనిమిదిన్నర అయ్యేసరికి పూళ్లోకి చేరుతారు. వూళ్లోకి చేరినప్పటి నుంచి బాహ్మలిల్లెక్కడ? అని తాతమ్మ అడుగుతుంటుంది కనపడ్డవారినల్లా.

అమ్మ : యెక్కడయితే యేమిటి తాతమ్మా! పడుకోటానికి.

తాతమ్మ : కాస్త నీకు మెతుకు పెడతారేమొ, అడుగుతా!

అమ్మ : నాకు అక్కర్లేదు. యివాళ రోజున మన బ్రతుక్కు మెతుకు కూడ యెవరూ పెట్టరు.

తాతమ్మ : కాసిని మంచినీళ్లయినా తాగుదామమ్మా!

అమ్మ : మంచినీళ్లు మాత్రం అక్కడ తాక్కూడదూ?

తాతమ్మ : వర్ణాశ్రమ ధర్మాలు కాపాడుకోవాలి అంటూ వుండగానె ఒక బ్రాహ్మడు యెదురొస్తాడు.

బ్రాహ్మడు : యేమిటవ్వా అడుగుతున్నారు?

తాతమ్మ : బ్రాహ్మణ యిల్లు నాయనా!

బ్రాహ్మడు : మీకు యెదురుగుండా వున్నది కరణంగారి యిల్లే.

యింతలో తలుపు తీసి వారు బయటకు వస్తారు. యేవూరు, యెక్కడ నుంచి వొచ్చారని వివరాలు అడుగుతారు తాతమ్మని. అన్నీ అడిగిన తరువాత యిదిగో యీ అరుగుమీద పడుకోండి అంటారు.

బ్రాహ్మడు యింతలో మీరు నియోగులా? వైదీకులా? అని అడుగుతాడు.

తాతమ్మ : ఆరువేల నియోగులం. బాపట్ల తాలూకా మన్నవ.

బ్రాహ్మడు : అయితే మీకు కృష్ణశర్మగారు తెలుసా?

తాతమ్మ : తెలియకేం మా తమ్ముడే!

బ్రాహ్మడు : చంద్రమౌళి చిదంబర్రావు గారు గూడ తెలుసునా?

తాతమ్మ : తెలియకేం? నా కొడుకే నాయనా!

బ్రాహ్మడు : అయితే మా యింటికి రండి అక్కడ పడుకుందురుగాని.

కరణంగారు : మా యింట్లో పడుకుంటారు లెండి అంటారు.

బ్రాహ్మడు : వీళ్లు మా వాళ్లె. మా బంధువులు. నేను నందిపాట్లో వుండగా చిదంబర్రావుగారు మా ప్లీడరుగారె.

యీ బ్రాహ్మడు అగ్రహారీకుల దగ్గర గుమస్తా. ఈయనకు పిల్లలు లేరు. ఈయన పేరు సంకాప్రకాశరావుగారు.

అమ్మను, తాతమ్మను వారింటికి తీసుకు వెళతారు. యింటికి తీసుకెళ్లి యెంతో గొప్పగా భార్యతో "యెన్నడూ అనుకోని పని మన యింటికి బంగారమంటి పిల్ల వచ్చింది". ఆరోజు వాళ్ల నాన్నగారి ఆబ్దికం. అమ్మను, తాతమ్మను మడి గుడ్డలున్నాయి భోంచేయమని అడుగుతారు.

తాతమ్మ భోంచేయదు. "నాకొద్దు నాయనా నేను ఒకపూటే భోంచేస్తాను. అమ్మాయికి పెట్టండి".

అమ్మకు విస్తరి వడ్డించి, ప్రకాశరావు గారి భార్య "యీ అమ్మాయి దగ్గర సొమ్ము చాలా వుందే! పదేళ్లు వుంటాయేమో ననుకుంటా. మనకు పెంపుడు యిస్తారేమొ అడుగుదాం".

ప్రకాశరావు గారి వొదినగారు : పెంపుడిస్తే యిచ్చినట్టు, లేకపోతే బంగారం వొలుచుకు పంపిద్దాం. పిల్లచూడు యెంత బొద్దుగా వుందో.

ప్రకాశరావు గారి భార్య : మనమనుకునేవన్ని అర్థమవుతాయి ఆ అమ్మాయికి వూరుకో!

ప్రకాశరావు గారి వొదిన: ఆఁచిన్న బొందేగా?

ప్రకాశరావు గారి భార్య : అయినా చాల చురుగ్గా కనపడుతున్నది. మనము అనుకునేవి అన్ని ఆలకిస్తున్నది.

ప్రకాశరావుగారి వొదిన : లేదులె వట్టి మొద్దు.

అమ్మ : చెయ్యి కడుక్కుని లేచిపోబోతుంది.

ప్రకాశరావుగారి భార్య : వుండమ్మాయి వుండు కొంచెం పరవాన్నము తిందువుగాని.

అమ్మ : వొద్దమ్మా!

ప్రకాశరావు గారి వొదినగారు : నేను యెందుకు బంగారం తీసుకుందా మంటున్నానో తెలుసునా? యిస్తే యీ అమ్మాయినిస్తారు. యివ్వకపోతె సొమ్ము తీసుకుంటె యెవరికయినా సొమ్ము చూపిస్తె యిస్తారు పెంపకం యివ్వకపోతె ఆ సొమ్ము పెట్టుకుని లేవలేని కాలంలో తిందాం.

ప్రకాశరావు గారి భార్య : యింతకు యెంత మహాపాపం చేసామొ యిట్లా అయినాము, మొగపిల్లలు లేకుండా. యిదివరకు కూడా రెండు యిట్లాగె చేసావు. అదే కొట్టిందేమొ?

ప్రకాశరావు గారి వొదినగారు : యీసారి చేస్తె అట్లా చేయముగా. అసలు వూరి బయటకు తీసుకెళ్లి రూపము లేకుండా చేస్తా.

ప్రకాశరావుగారి భార్యా : అబ్బా! ఆ మాట అనబోకు నేను వినలేను. ఆ అమ్మాయిని చూస్తే యేదో దేవతా కళగా వుంది. ఆ వొళ్లు చూచా యెట్లా మెరుస్తున్నదో మైదాపిండి మాదిరిగా వుంది ఆశరీరం పట్టుకుంటె. అసలు మీ మరిది సంగతి,తెలిస్తే యిక్కడికి వచ్చేవారు కాదేమొ. ఆ తల్లి. మీ యిద్దరి యిష్టానికి భిన్నంగా నడిస్తే నన్నయినా యిట్లాచేసే దానివి గదే అక్కయ్యా. తల్లి యెవరో తోడు యెవరో భార్య యెవరో, యేమి బ్రాహ్మలమో మనకు. యీ ప్రపంచము యెందుకు యిట్లా సృష్టించాడో నాకు పిల్లలక్కర్లేదు. అడుక్కు తింటానికి ఆర్డరిస్తే నీ మరిదిగారు హాయిగా వెళ్లిపోదును. లేకపోతె ఆ అమ్మాయితో వెళ్లమంటె హాయిగా వెళ్లిపోదును. యే దేవతన్నా అడ్డుపడి యీ బిడ్డను కాపాడితే బాగుండునని పైకి మెల్లగా అనుకుంటూ అమ్మకాళ్లు వత్తుతుంది.

ప్రకాశరావు గారి వొదినగారు పడుకుని నిద్రపోతుంది.

అమ్మ నిద్రపోతున్నదనుకుని 'బంగారు తల్లి చూడు యెంత ప్రశాంతంగా నిద్రపోతున్నదో, ముఖం పాలుగారుతున్నది. యీ చిట్టితల్లికి తల్లిలేదట. తల్లివుంటే యెంత మోజుపడేదో యీ బిడ్డను జూచుకుని'. మొఖము వంకచూస్తూ ప్రకాశరావు గారి భార్య కూర్చుంటుంది.

అమ్మ తలకు వెనక భాగంలో ఒక చక్రం తిరుగుతున్నట్లుగా కనపడుతుంది. చూస్తున్నకొద్ది సూర్య కిరణాలు మాదిరిగా ఆ చక్రంలో నుంచి తన హృదయంలోకి జొరవడిపోతుంటాయి.

ప్రకాశరావు గారి భార్య : యెంత దివ్యానుభూతి పొందుతున్నాను. "కాలచక్రం తిరిగిపోతున్నదని చెప్పటమా?" యేమి తెలియటంలా! యీ స్థితిలో యీమె యిక్కడ వుండగా, భర్త కాళ్లు పిసకాలి రా అని పిలుస్తాడు.

ఆమె లేచి ఆయన పిల్చినా వెళ్లకుండా అయిదు నిమిషాలు ఆలస్యం చేస్తుంది చూస్తున్నకొద్దీ చూడబుద్ది పుడుతుంది.

"పోమ్మా పో యెందుకు నుంచోవటం" అని అమ్మ అనగానే వొళ్ళు జల్లుమని నిద్రపోతున్నదనుకొన్నా, యెవరో పెద్దవాళ్లు మాట్లాడినట్లున్నది. కాని కాళ్ళు కదలవు వాళ్లు గూడా యీ దృశ్యం చూస్తే బాగుండును. వాళ్లకేమైనా మార్పు వస్తుందేమో ననుకొని ఆదుర్దాగా భర్తతో చెప్పబోతుంది.

ప్రకాశరావు : (చెప్పే మాట వినిపించుకోకుండా,) యేడ్చావులే పిసుకు అంటాడు.

ఆమె కాళ్లు పిసుకుతూ దగ్గర కూర్చుంటుంది. ఆనందంతో కళ్లనీళ్లు కారుతుంటాయి. నీకు యీ ఏడుపు పోదుగా అంటాడు. అని ఒక తన్ను తంతాడు.

ప్రకాశరావు గారి వొదినగారు లేచి అమ్మ దగ్గరకు పోతుంది. మెల్లిగా మెళ్లో చెయ్యిబెట్టి కంటి కొక్కెంతీస్తుంది.

అమ్మ చప్పున లేచి వున్న సొమ్మంతా తీసి ప్రకాశరావు గారి దగ్గరకు వెళ్లి ప్రకాశరావు గారి భార్య చేతిలో బెట్టి ఆయన చేతిలోబెట్టి నమస్కారం జేసి రామ్మా".

అమ్మ ప్రకాశరావు గారితో "నాకు అమ్మలేదు. ఆమెకు పిల్లల మోజు వున్నది. నాకు తల్లిమోజు వున్నది. నీకు వొదినగారి మోజు, ధనం మోజు వున్నది. అందరి కోర్కెలూ తీర్చుకుందాం."

తాతమ్మ గారు మెల్లగా కదులుతుంది.

ప్రకాశరావు గారి వొదినగారు లేచి, మరిది దగ్గరకు వస్తుంది.

అమ్మ : (ఆమెతో) నేను అడుగు బెట్టినప్పటి నుంచి యీ పిచ్చి సొమ్ము కొరకు ఆలోచిస్తున్నావు యెందుకు? వెధవ సొమ్ము కోసం యింత శ్రమ! నన్నడిగితే నేనివ్వక పోయినానా? పవిత్రమైన నటువంటి సుశీల లాంటి నీ చెల్లెలు కాపురాన్నే సునాయాసంగా పాడుజేసావె. యీ వెధవ బంగారం కోసం యెందుకమ్మా యింత శ్రమ. యిది ఒక లోహమే. ఇనుము, ఇత్తడి లాంటిదే యిదికూడ. ఆరువేలమని చెప్పుకుంటూ, బ్రాహ్మణ స్త్రీ నని చెప్పుకుంటూ, భారతదేశంలో పుట్టి, మానాభిమానాలు అమ్ముకున్న దానికంటె వెధవ బంగారపు విలువ అంతకంటె గొప్పది కాదు.

ప్రకాశరావు గారు యీ మాటలకు గడగడ వొణుక్కుంటూ బంగారం తీసి అమ్మ చేతిలో పెట్టబోతాడు.

అమ్మ : నాకీ బంగారం అక్కర్లేదు. నాతోకూడ రండి రెండింతల బంగారం యిస్తా. యిందాక మీరు ఆమెను తన్నారే దానికేమిచ్చి ఋణం తీర్చుకుంటారు? ఋణం కాదు పొరపాటు దానికి యేమి శిక్ష వేసుకుంటారు. ఆమెకు మీరు తన్నితే పడటము యెట్లా ధర్మమో, మీరు తన్నకుండా మీకు ధర్మాలు అనేకం వున్నాయి.

ప్రకాశరావుగారు యేమి మాట్లాడకుండా లేచి అమ్మ కాళ్లమీదపడి, 'నిన్నుచూస్తే ఆదిశక్తిలా కనపడుతున్నావమ్మా. నిజంగా పిల్లవేనా? నేను చేసిన పాపాలన్నిటికి ఫలితాలు యేమైనా యిట్లా పిశాచ రూపంలో యిట్లా వచ్చిందా' అని యేది తెలియక బాధపడుతూ వుంటాడు.

అమ్మ : దేముడయితేనేం? దెయ్యమయితేనేం? నీ తప్పును ఖండించటానికి?

ప్రకాశరావు గారు : నావంటి పాపాత్ముడికి దేముడు యెట్లా ప్రత్యక్షమవుతాడు?

అమ్మ : మీరు పాపాత్ములుగా, పూర్తిగా మీరు అర్థం చేసుకున్నారా?

ప్రకాశరావు : అనిపిస్తుందమ్మా. తప్పని తెలుసు. తెలిసిగూడ చేయాలని పిస్తున్నది.

అమ్మ : మీరు నీతోకూడ రండి. పెనుగుదలపాడు వెళదాం. నేను అక్కడ నాలుగు రోజులుంటాను.

అమ్మాయినిగూడ తీసుకురండి. అమ్మాయి యేమిటి అమ్మాయిగాదు పొరపాటు, అమ్మ! మీరు నాన్న, ఆమె అమ్మ, అమ్మ నాన్నగార్లతో యెప్పుడు ప్రయాణం అలవాటు లేదు. నన్ను యే కారణంచేత పెంచుకోవాలనుకున్నారో, యే కారణంచేత నగలు తీసుకోవాలనుకున్నారో, ఆ కొరత లేకుండా నేను మీ ముగ్గుర్ని పోషిస్తా, మీరు యీ రోజునుండి మీ వొదినగార్ని మీ తల్లిగా చూచుకోండి. యివన్నీ వొదినగారు వింటూనే వుంటుంది.

ప్రకాశరావుగారి వొదినగారు: మన అందర్ని భరించాల్సిన అవసరం యీ అమ్మాయికి యేం కలిగింది?

ప్రకాశరావుగారు : నోరు మూయి. నీవు మాట్లాడవద్దు.

ప్రకాశరావుగారు అమ్మతో : అమ్మా తరువాత యేది యెట్లా జరిగినా దురుద్దేశాలు మానుకుంటా గాని మా వొదినగారిని మాత్రము అమ్మగా చూచుకోలేను.

అమ్మ : మానుకుంటె చూచినట్లే!

ప్రకాశరావు గారు : తప్పకుండా మన్నవ వస్తానుగాని, యిప్పుడు ప్రస్తుతం రాలేనమ్మా!

అమ్మ "మీరు రావద్దుగాని, యిందాక ఆమెను తన్నటంలో మంగళసూత్రం పెరిగిందట. నేను గుచ్చి యిస్తాను. మీరు కట్టండి నా యెదుట". మహాలక్ష్మమ్మ గారు దారం తెచ్చి యిస్తుంది. అమ్మ పసుపు కూడ తీసుకురా అమ్మా అంటుంది. పసుపు తెచ్చి యిస్తుంది. అమ్మ దారం పేని, దానికి గుచ్చి పసుపు రాసి ప్రకాశరావు గారి చేతికిస్తుంది. అమ్మ యిద్దరికి బొట్లు పెడుతుంది. బొట్లుపెట్టి సూత్రం కట్టిస్తుంది. సూత్రం కట్టే సమయానికి గుళ్లో గంట మ్రోగుతుంది. మూడుముళ్లు

పడగానే "వారి పాదాలకు నమస్కారం చేయుమ్మా" అంటుంది. అనగానే నమస్కారం చేస్తుంది.

అమ్మ "నాయనా ఆమె నీకు దేవత. ఆమెకు నీవు దేముడివి." తన చేతిలోని కుంకం పొట్లాం విప్పి యిద్దరి నెత్తినా చల్లుతుంది. అరుణోదయం టయింలో ముడి పడుతుంది.

అమ్మ ప్రకాశరావు గారి వొదినతో : అమ్మా! వీళ్ళిద్దర్ని నీ బిడ్డలుగా జూచుకో!

ప్రకాశంగారి వొదిన : బిడ్డలా! గడ్డలా!

అమ్మ : యేదో ఒకటి అవుతారులే. పోనీ నీవే బిడ్డననుకో. సరే మేము పెనుగుదలపాడు వెళ్లొస్తాము. తిరిగి మీ యింటికి వచ్చే వెళతాం. మీ యిద్దరూ కులాసాగా వున్నట్లు తోస్తే.

సరే అమ్మా అని ప్రకాశరావు గారు బంగారమంతా అమ్మది అమ్మకు తనే అలంకరింప జేస్తారు.

తాతమ్మ నాలుగింటికి లేచి మేలుకొలుపుల పాటలు పాడుతూ మధ్యలో అమ్మను రెండుసార్లు కేక వేస్తుంది. అమ్మ వస్తున్నా లెమ్మని సమాధానం చెపుతుంది. యిక్కడ పని ముగించుకుని ముగ్గురూ కలిసి తాతమ్మ దగ్గరకు వెళతారు. ప్రకాశరావు గారి వొదినగారు రాదు.

అమ్మ, తాతమ్మ ముఖము కడుక్కుని ప్రయాణమై వెళతారు. భార్య, భర్తవూరు బయటదాకా పంపించటానికి వస్తారు. "అమ్మా తప్పకుండా రండి వచ్చేటప్పుడు" అని చెపుతారు.

అమ్మ : నాయనా మీ వొదినగారికి కొంచెం కోపము వచ్చి నేను వెళ్లిపోతా నంటుందేమొ. యిన్నాళ్ల నుంచి వుంచుకుని వెళ్లగొట్టాడని లోకులు అంటారేమోనని భయపడతావేమొ. భయపడకు. ఆమె యెక్కడికి పోదు. నాదగ్గరకే వస్తుంది. మన అందరికంటె బాగుపడుతుంది. వేమన చూడు

ప్రకాశరావు గారు : ఊఁ - వుంటాము. నమస్తే అమ్మా నమస్తే! వాళ్లు ఆగిపోతారు. తాతమ్మ. అమ్మ నడుస్తారు. బయలుదేరిన రెండు గంటలకు జేర్తారు.

పెనుగుదలపాటిలో తాతమ్మ గారికి శిష్యులు వుంటారు తాతమ్మ గారిని చూడగానే వారందరు కాళ్లు కడిగి హారతిస్తారు. ఆ హారతిచ్చేటప్పుడు అమ్మకు కూడ యిస్తారు. యెంత అదృష్టవంతురాలో. అమ్మగారితో గూడ యీ అమ్మాయి వున్నది

అని అనబోయి, అమ్మాయితో గూడ అమ్మగారు వుండగలిగింది అంటారు. యిద్దరికి హారతులిస్తారు.

యెక్కడికి పోయినా, యెవరింటికి పోయినా యెక్కడ నుంచున్నా ఆ నాలుగు రోజులు అద్వైతవిచారణే. చాల ఆనందంగా ఆ నాలుగు రోజులు జరిగిపోతాయి. వచ్చేటప్పుడు అమ్మకు పరికిణీ, చొక్కా కుట్టించి, తాతమ్మకు ధోవతులు పెట్టి వంద జనందాక వూరు బైటకు పంపిస్తారు.

వాళ్లల్లో వాళ్లు మన అమ్మగారి దగ్గరకంటె కూడ యీ అమ్మాయిలో యింకా యెక్కువ లక్షణాలు కనపడుతున్నాయి. వూరు బయట దాకా వచ్చి అందరూ నమస్తేలు చెప్పి ఆగిపోతారు. అమ్మ, తాతమ్మ నడచివస్తారు. గంటన్నరకల్లా శ్రీరంగపురం చేర్తారు.

అమ్మను చూడగానే ప్రకాశరావుగారు, ప్రకాశరావుగారి భార్య, ఒక దేవత వచ్చినట్టుగా చూస్తారు.

ప్రకాశరావుగారి భార్య : మా అక్కగారు కాస్తా వెళ్లిపోయింది, యివాళ తెల్లవారు ఝామున.

అమ్మ : పోనీలె యెక్కడికి పోతుంది? యెక్కడో అక్కడ నాకే కనిప్పిస్తుంది. నేనే బాగుజేసుకుంటాను. ఆమే బిడ్డే!

ప్రకాశరావు గారి భార్య : నా పెళ్లి అయిన తరువాత యీ నాలుగు రోజులు వంటిమీద దెబ్బ పడకుండా గడచిన రోజులు.

అమ్మ : యింతకంటె యెక్కువ రోజులు గడిపివుండవచ్చు దెబ్బలు తినకుండా. కాని నీకు యెక్కువ కాలం అయిష్టతగా జరిగి వుండవచ్చు. యీ నాలుగు రోజుల సుఖం నీకు గొప్పగా వున్నది. యిష్టంతో గూడిన రోజులు గనుక యివి ప్రత్యేకతగా కనపడుతున్నయ్యి.

ఆ పూటకు వుండి, భోంచేసి తాతమ్మ, అమ్మ వెళ్లిపోతారు. అమ్మకు చిన్న వుంగరం కూడ చేయించి పెడతారు. వచ్చేటప్పుడు పడవ అందుతుంది.

చేబ్రోలు వంతెన దగ్గర దిగి కారు మీద గుంటూరు వెళతారు. బ్రాడీపేట నాలుగో లైను. అక్కడ పదిరోజులు వుంటారు. సరాసరి పొన్నూరు వస్తారు.

16. తెరపైకి జిల్లెళ్ళమూడి ఆవిష్కరణ

రామ బ్రహ్మం :

తాతమ్మ అమ్మ మన్నవ పోదామని బండి కట్టించుకుంటుండగా మన్నవ నుంచి చాలామంది బళ్లు కట్టించుకుని బ్రాహ్మణ కోడూరు వాసుదాసు గారిని చూట్టానికి వస్తారు. అమ్మను, తాతమ్మను చూచి రమ్మని అడుగుతారు.

తాతమ్మ : నేను చాలా కాలమయింది యిల్లు బయలుదేరి. అమ్మాయిని తీసుకెళ్లండి, నేను యింటికి వెళతాను.

మన్నవ రామబ్రహ్మం అమ్మ పినతండ్రి "సరే పంపించు, ఉపేంద్రుడ్ని అన్నా యెత్తుకుంటుంది".

ఆయన భార్య పుల్లమ్మ గారు : సరే మరీ మంచిది రామ్మా! పిల్లల్ని యెత్తుకుందువు గాని.

తాతమ్మగారితో అమ్మ : వాళ్ళు అనేవి విన్నావా?

తాతమ్మ : వినలేదమ్మా! నేను వీళ్లతో మాట్లాడుతున్నా, అందరూ ఒకేసారి పలకరించటంతో వినేందుకు వీలులేక పోయింది.

అమ్మ : వినకపోతె యెందుకులే. వెళతాను వాళ్లతో

తాతమ్మ మన్నవ వెళుతుంది. అమ్మ బ్రాహ్మణ కోడూరు వెళుతుంది.

అమ్మను తీసుకు వెళతారేగాని అన్నం తిన్నది లేనిది యెవరు యేమీ చూడరు. ఒక బిడ్డను దించితె యింకో బిడ్డను యెత్తుకోటానికి అందిస్తారు. అట్లా మూడు రోజులు జరుగుతుంది. వచ్చేరోజున అందరూ నమస్కారాలు చేసి చెప్ప వస్తుండగా అమ్మ స్వామి పక్కన నుంచుంటుంది. అందరూ చేసిన తరువాత రామబ్రహ్మం గారు అమ్మను నమస్కారం చేయమంటారు.

అమ్మ నమస్కారం చేస్తుంది. కాళ్లమీద పడ్డ పదినిమిషాలదాకా లేవదు.

యెవరీ అమ్మాయి అంటూ తలమీద చెయ్యి పెట్టి తలపైకెత్తి మొఖము వంక చూస్తారు.

రామబ్రహ్మం గారు : మా అన్నగారి కుమార్తెండి తల్లిలేదు.

వాసుదాసు స్వామి : పాపం అని లేవదీసి కూర్చోబెట్టి తలకాయ గుండెల కానించి పెట్టుకుని యేవమ్మా నీకు అమ్మ లేదుగా అందరికి నీమీద ప్రేమ వుండేటట్టు ఆశీర్వదించేదా?

అమ్మ : ఆఁచ్ వద్దు నామీద యెవరికి వద్దు. నాకు అందరి మీద వుండేటట్టు ఆశీర్వదించండి.

వాసుదాసు : యెందుకమ్మా అందరికీ నీమీద అక్కర్లేక పోవటమేం? నీకు అందరిమీద వుండటమేమి?

అమ్మ : ప్రేమంటే యేమిటో తెలియాలంటే నాకు వుంటేగా తెలిసేది? యితర్లకు వుంటే నాకేమి అర్థమవుతుంది?

వాసుదాసు : పోనీ నీకేమి కావాలో చెప్పు?

అమ్మ : యేమన్నా కావాలనేది అక్కర్లేకుండా వుండేది కావాలి.

వాసుదాసు : యీ పండ్లు పట్టమ్మా. యే పండ్లు కావాలి నీకు?

అమ్మ : యే పండూ వద్దు.

వాసుదాసు : అంటే అన్ని పండ్లూ తింటావా?

అమ్మ : ఆఁఅందరి పళ్లు తింటాను.

వాసుదాసు : యెదురుగుండా వచ్చి నుంచో, పక్కగుండా వున్నావు అని కన్నార్పకుండా అయిదు నిమిషాలు చూచి, పెద్ద పెద్ద కళ్ళు జేసి నాభి దగ్గర నుంచి లాగి షడ్జమ స్థాయి అందుకునేట్టుగా పెద్దకేక వేస్తాడు. 'రామబ్రహ్మం' అని పిలుస్తాడు. ఆ పిలవంగానే కేకకు రామబ్రహ్మం గారు వచ్చి యెదురుగుండా నుంచుంటాడు.

వాసుదాసుగారు : నిన్నుగాదు నాయనా అంటారు.

రామబ్రహ్మం గారు : మన్నప రామబ్రహ్మం అని పిలిచినట్టు వుంటే వచ్చా!

వాసుదాసు : కాదు నాయనా, మన రామబ్రహ్మాన్ని

రామబ్రహ్మం గారు : అంటే యెవరు?

వాసుదాసు : మెళ్లో వున్న బిళ్లను జూపించి యీస్వామే నాయనా!

రామబ్రహ్మం గారు : వెంటనే, అమ్మాయిని చూడంగానే కేక వేసారెందుకు?

వాసుదాసుగారు : అది నేను చెప్పేదికాదు. మీరు వినేదికాదు, ముందు ముందు అనుభవంతో మీకే తెలుస్తుంది. (అమ్మను) యిటురా అమ్మాయి యిటురా (అని చేతులు చాచి పిలుస్తారు).

అమ్మ వెళ్లి చేతుల్లో వ్రాలుతుంది.

వాసుదాసు గారు పొట్టకు కరిపించుకుని నొసట ముద్దుపెట్టుకుంటారు.

అమ్మ కళ్లు తెరచి వుంటాయి. వారు నొసలు ముద్దు పెట్టుకున్నప్పుడు వారి బొట్టు చెదిరి కంటిలో పడుతుంది. అమ్మ వెంటనే కళ్లు మూసి చెయ్యి తీసుకుని నలుపుకుంటుంది.

వాసుదాసుగారు వెంటనే "కంటిలో నలక పడ్డదా అమ్మా?" అంటారు.

అమ్మ : కంటిలో నలకా లేదు, మనసులో కలకా లేదు వెళ్లొస్తా.

రామబ్రహ్మం గారు ముందు వెళతారు అమ్మ "నేను వెళ్లొస్తాన"ంటుంది.

వాసుదాసుగారు : నాలుగు రోజులు వుండరాదు?

అమ్మ : మా బాబాయి గారినడిగి వారు వుంటే నేను వుంటాను.

బళ్లు సాగంగానే పిల్లల్ని యెక్కించి వద్దామనుకున్నవాడల్లా మర్చేపోయి వెళ్లిపోతాడు.

అమ్మ లోపలకు వెళ్లి వాసుదాసుగారితో చెప్పి వెళ్లిపోదాం, బళ్లు వెళ్లిపోయి నాయి. వాసుదాసు గారితో "నాయనా! వెళ్లొస్తా వాళ్లు చెప్పకుండా వెళ్లిపోయినారు".

వాసుదాసు గారు : యెట్లా వెళతా అమ్మా . నడిచే వెళతావా?

అమ్మ : యెట్లా వుంటే అట్లా వెళతా

వాసుదాసుగారు : బళ్లు కనపడకపోతే వెనక్కు వచ్చేసేయి, నడిచి యేంపోతా?

అమ్మ : వాళ్ల బండే యెక్కాలనేముంది? యెవళ్లు యెక్కించుకున్నా యెక్కొచ్చు.

వాసుదాసుగారు : సరే అమ్మా పోయిరా అని కంటితో నమస్కారం చేస్తారు (కళ్లు మూసి)

అమ్మ గబగబా పరుగెత్తుతుంటే.

వాసుదాసుగారు : ఆ పరుగు జూడు రాముడే బాలుడయి వచ్చాడా అని అనుకుంటారు. బళ్లు చాలా దూరం వెళ్లిపోతాయి.

సర్వ రూపిణి :

అమ్మ అట్లాగె నడిచిపోతూ వుంటుంది. ప్రొద్దుగూకింది. దొప్పలపూడి కావూరి బ్రహ్మయ్యగారి బండి వెనకాల నడిచి వెళుతూ వుంటుంది అమ్మ.

ఆ బండిలో కూర్చున్నవాళ్ళు : యే అమ్మాయి! బండిలో చేయి బెట్టబోకు.

అమ్మవెంటనే చేయిదీసి వాళ్లకు కనపడేటట్టే వెనుకగా యెదురుగా నడుస్తూ వుంటుంది.

కొంతదూరము పోయినాక 'యీ అమ్మాయి యెవరో అట్లాగే నడుస్తూ వస్తున్నది' బండిలో కూర్చున్నవారు అనుకుంటారు. 'నిన్న వాసుదాసు గారి దగ్గర చూచా యెంత దగ్గర తీసుకున్నారో యింతే వున్నది ఆ అమ్మాయి. యెంత అదృష్టవంతురాలో ఆ అమ్మాయి. పెద్దవారి దృష్టిలో పడ్డదీ అంటే యింకా ఆ అమ్మాయికి జన్మేముంది?'

ఆ కూర్చున్నవారిలో ఒక చిన్నబ్బాయి : యీ అమ్మాయే నమ్మా ఆ అమ్మాయి అంటాడు.

యింకో ఒకరు : కాదు ఆ అమ్మాయి చక్కగా జామపండంటి రంగు, మంచి గిరజాలు, తెల్లవాళ్ల పిల్లల్లే వుంది.

బండితోలే అతను వెనక్కు తిరగిచూచి ఆ అమ్మాయి లాగవున్నది. అయినా పిలుద్దాం.

యింకొకరు : యీ అమ్మాయి యేడ? ఆ అమ్మాయి యేడ? అయినా పిలుద్దాం వుండండి అని బండి ఆపి 'యిటురా అమ్మాయి' అంటారు.

అమ్మ ఆ నడకకు హెచ్చు తగ్గు లేకుండా అట్లాగె నడచి వస్తూ వుంటుంది.

"బండి పోనిస్తూ వుండండి ఆ అమ్మాయి అందుకుంటుందిలే" అంటాడు బ్రహ్మయ్య గారి కొడుకు.

"ఆగనియ్యి చిన్నపిల్లగాదు" అంటారు బ్రహ్మయ్యగారు.

బ్రా॥ కొడుకు : పరుగెత్తు అమ్మాయి పరుగెత్తు అంటారు.

అమ్మ మామూలుగానె నడుస్తుంది.

బండికి అమ్మకు పదిహేను గజాల దూరముంటుంది.

బండి ఆగి వుంటుంది. అమ్మ వచ్చి కలుసుకుంటుంది.

బ్రహ్మయ్య : యే అమ్మాయి మీదేవూరు?

అమ్మ : మన్నవ.

బ్రహ్మయ్య : ఆఁయేమిటి సరిగా జెప్పు వినపడలా అంటారు.

అమ్మ : యెప్పుడు యెక్కడ వుంటే అది మావూరు.

బ్ర। కుమారుడు : యేమిటా సమాధానం?

అమ్మయేమీ మాట్లాడదు (బండిదగ్గర నుంచుని)

బ్రా॥ భార్య : నిన్న వాసుదాసు గారు పిల్చింది నిన్నేనా అమ్మాయి?

బ్రా॥ కుమారుడు : మనకే యిరుకుగా వుంటే వీళ్లు అందరూ యెందుకూ?

జీతగాడు : యెక్కనివ్వండి, తొట్లో నాదగ్గర కూర్చుంటుందిలే.

బ్రహ్మయ్య : అటురా అమ్మాయి.

అమ్మ : వొద్దండి నడుస్తాను. బండిలో యెక్కితే వికారం పుడుతుంది.

జీతగాడు యీ మాట వినంగానే దిగివచ్చి యెత్తుకుపోయి కూర్చోబెట్టుకుంటాడు. అమ్మను కూర్చోబెట్టుకుని చుట్ట తాగుతూ బండి తోలుతూ వుంటాడు.

బ్రహ్మయ్య : నేను అసలు మాట మర్చేపోయినా మన్నవలో యెవరమ్మాయొ అడగండిరా.

అమ్మ : యెవరమ్మాయంటే యేం జెప్పాలి?

బ్ర ॥ కుమారుడు : వొట్టి పిచ్చి అమ్మాయల్లే వుంది. అదిగూడ తెలియదూ?

బ్రహ్మయ్య : అది కాదమ్మాయి, మీ నాన్నగారి పేరేమిటి?

అమ్మ : మా నాన్నగారి పేరు ఆట్టే తెలియదండి నాన్న నాన్న అంటమే తప్ప పేరు అవుసరం కలగలా. నాన్న అంటమే తెలుసు.

బ్రహ్మయ్య : నీవన్నట్టుగా పిచ్చి అమ్మాయేరా. పోనీ నీపేరేమయినా నీకు తెలుసునా అమ్మాయి?

అమ్మ : పేరంటే అసలు యేమిటి?

బ్రహ్మయ్య : నిన్నేమని పిలుస్తారమ్మాయి?

అమ్మ : మీరు యేమని పిలిచారు యిందాక మీకేమయినా గుర్తు వున్నదా?

బ్రహ్మయ్య : యీ అమ్మాయి చాల అసాధ్యపు పిల్లల్లె వుందే!

అమ్మ : మీరప్పుడే రెండు పేర్లు పెట్టి పిలిచారు. అమ్మాయి, పిల్ల అని అట్లాగె యెవరికి వీలయినట్లు యెవరికి తోచినట్టు వాళ్లు పిలుస్తారు. నీపేరు యిది అని యెవరూ చెప్పలా. యెవరికి వీలయినట్టు వాళ్లు పిలుస్తారు.

బ్రహ్మయ్య : స్కూల్లో నీపేరు యేమని వ్రాశారు?

అమ్మ : మీరయినా కష్టపడి బండి యెక్కించుకున్నారు గాని ఎవరూ నన్ను బళ్లో వేయలా.

బ్రాాభార్య : యిందాక బండిలో యెక్కించమంటె తలోమాట మాట్లాడాంగాదు. అది కష్టపడి బండిలో యెక్కించుకోవటమంటె అర్థమయిందటరా అబ్బాయి?

బ్రాా కుమారుడు : అంత అర్థం చేసుకునే తెలివిలేదులే ఆ అమ్మాయికి యీ అమ్మాయి కాళ్లు చేతులు గుర్తుపడుతుందో అవికూడ తెలియదంటుందో లోపల కూర్చోబెట్టరా వెంకయ్యా.

వెంకయ్య : వొద్దులెండి ముద్దుగా వున్నది. యీ వెన్నెల్లో యీ అమ్మాయి వొంటి రంగు చూడండి యెంత చక్కగా వున్నదో.

బ్రాా కూతురు : ఆ ముద్దు మేము అనుభవిస్తాముగా!

వెంకయ్య అమ్మను బండిలో కూర్చోబెడతాడు.

బ్రహ్మయ్య : అమ్మాయి నీ పొట్టయేది?

అమ్మ : మట్లాడదు.

బ్రహ్మయ్య : నీ చేతులేవి?

అమ్మ : చేతులు దగ్గరే వున్నాయి.

బ్రహ్మయ్యగారు : నీ ముక్కు యేదమ్మాయి?

అమ్మ : యేవి వుండేచోట అవి వున్నాయి.

బ్రా॥ కుమారుడు : యీ అమ్మాయికి బుద్ధే లేదు.

అమ్మ : నీకుంటేగా తెలిసేది.

బ్రా॥ కూతురు : యింకా పిచ్చేముంది. యీ అమ్మాయే వాసుదాసు గారికి దణ్ణం పెట్టింది. ఆప్రశ్నలకు సమాధానాలు చూడు యెట్లా వున్నయ్యో.

బ్రా॥ భార్య : అమ్మాయి నిన్న దణ్ణం పెట్టింది నువ్వేనా?

అమ్మ : నిన్న దణ్ణం పెట్టటం చూచారా?

బ్రా॥ భార్య : ఆఁచూచాం.

అమ్మ : నిన్న చూచారు. యివాళ చూస్తున్నారు. యింకా నన్నడగటం దేనికి నువ్వేనా అని?

బ్రా॥కూతురు : నిన్నటి పిల్లలే వున్నావు, స్పష్టంగా అన్ని పోలికలు లేవు, పూర్తిగా లేకుండా లేవు. యిందాక నడిచేటప్పటికి తేడా కనపడుతున్నది. చూస్తున్నకొద్ది క్షణక్షణానికి మారిపోతున్నావు.

"తల్లితో యిదిగోచూడు యిప్పుడు చూడు, చూడమ్మా చూడవే తొందరగా చూడవే, ఆ అమ్మాయి మొఖం చూడు యెట్లా మారుతున్నదో? నేను పూజ చేసుకుంటానే పటము, ఆ పటములో పోలిక వున్నదో లేదో చూడు."

బ్రా॥భార్య: మార్పు కనపడుతున్నదిగాని నేను అంత గుర్తించలేకపోతున్నానమ్మా.

బ్రహ్మయ్య గారు : యేమిటో గొడవ. నాకంతగా అర్థం గావటం లేదు. యెవరి పటం అమ్మాయి నీవన్నది. యే పోలికమ్మాయి నీవన్నది. యిటు తిరుగు అమ్మాయి. ఆఁ నిజమేనమ్మా అమ్మా కనకదుర్గా నువ్వేనా? కొడుకుతో ఒరే దణ్ణం పెట్టరా యిప్పుడైనా నీకు మంచి రోజులు వస్తయ్యేమొ.

బ్రా॥ కుమారుడు : యేంది పెట్టెది. నాకు కనపడొద్దు?

బ్రహ్మయ్యగారు : తల్లీ ఒక్కసారి వాడివంక చూడు.

అమ్మ : అటుచూస్తుంది.

బ్రా॥ కుమారుడు : కాళ్లమీద పడతాడు

బ్రహ్మయ్య గారు : కనపడ్డదో కనపడలేదో ముందు వాడు పాదాలమీద పడ్డాడు. నాకు కావలసిన పని అయింది.

బ్రహ్మయ్యగారి భార్య నమస్కారం చేస్తుంది.

బ్ర॥ కూతురు : అమ్మను చూస్తూ ఆనంద భాష్పాలు కారుస్తూ వుంటుంది. ఆమె వొడిలోని మూడేళ్ల బిడ్డ అమ్మ పాదాల మీదకు వాల్తాడు.

అందరూ ఒకసారిగా 'అదిగో చూడండి చూడండి' అని అంటూ తలలు వంచి చూస్తారు. తొట్లో కూర్చున్న జీతగాడు లేచి నుంచుని బండి గూడు కిందగా తల లోపలకు రానిచ్చి చూస్తూ నుంచుంటాడు. యిట్లా పదిహేను నిమిషాలు అందరూ ఆనందంలో మునిగి వుంటారు. వాళ్ల యింటి సమీపానికి వెళ్లి బండి ఆగుతుంది. అమ్మనుగూడ దించటానికి ప్రయత్నిస్తారు.

అమ్మ : నేను దిగను నాయనా అంటుంది.

బ్రహ్మయ్య గారు : లోపలకు వచ్చి కాసిని మంచినీళ్లు తాగిపో అమ్మా.

అమ్మ దిగి మంచినీళ్లు తాగుతుంది.

బ్రహ్మయ్యగారు : బండి యెక్కు అమ్మా, బండి యెక్కిపో అంటారు.

అమ్మ : వద్దు నాయనా నడిచి వెళతాను వెన్నెల్లో బాగుంటుంది.

బ్రహ్మయ్య గారి పాలేరు : యేమిటమ్మా నీవు నడిచేది? బుల్లిపాపాయివి అని అమాంతం యెత్తుకుని వెళ్లి కూర్చోబెడతాడు.

అమ్మ : చూడటానికి పొట్టిగా వున్నాను గాని చాలా వయస్సుంది.

బ్ర॥ కూతురు : చాలా అంటే యెంతమ్మా నీ వయస్సు.

అమ్మ : యింత అని చెప్పలేను.

జీతగాడు : యేదీ చెప్పలేను, చెప్పలేను అంటావేమిటమ్మా?

అమ్మ : "చెప్పేది కాదు గనుక. చెప్పితే తెలుసు కుండేది కాదు నాయనా. తెలుసుకుంటే తెలిసేది".

బ్రహ్మయ్యగారు : యింట్లో మొక్కజొన్న కండెలు వున్నాయి. అవి దీసుకొచ్చి బండిలో పెట్టండి అమ్మాయిగారికి తీసుకెళతాడు. అమ్మను బండిలో కూర్చోబెట్టుకుని కండెల బుట్ట తొట్టిలో బెట్టుకుని అమ్మను గూడ ముందుకు తొట్టిలోనే వచ్చి కూర్చోమంటాడు.

అమ్మ వచ్చి కూర్చుంటుంది. బండి వెళుతూ వుంటుంది.

పరిశుద్ధాత్మ :

జీతగాడు : అమ్మా! అసలు నీవు యేవూరు నుంచి వస్తున్నా?

అమ్మ : మీకు తెలుసుగా బ్రాహ్మణ కోడూరు నుంచేగా నీతోపాటే వస్తున్నాగా. నా సంగతి సరేగాని మీదేవూరు నాయనా?

జీతగాడు : జడవల్లి అమ్మా మా బంధువులు యిక్కడ వుంటేను వాళ్లు తీసుకొచ్చి పెట్టారు. కమ్మవారి యింట్లో వుంటె పని బాగా అబ్బుతుందని వుంచారు.

అమ్మ : మీ అమ్మ నాన్న వున్నారా నాయనా?

జీతగాడు : జడవల్లిలోనే వున్నారు.

అమ్మ : వాళ్ల కమ్మవారంటున్నావు, నీవు యెవరివి?

జీతగాడు : నీకు తెలియదు?

అమ్మ : నాకేం తెలియదు నాయనా.

జీతగాడు : యిందాక బండిలో అన్ని మహత్యాలు చూపించావే. నీకు యెట్లా తెలియదమ్మా?

అమ్మ : నీకు కనపడ్డయ్యా నాయనా, వాళ్లు అనుకుంటుంటే విన్నావా?

జీతగాడు : వాళ్లు అనుకోవటం అన్నీ నాకు తెలియవు గాని బండివెంట నీవు నడుస్తుంటె చందమామ నడిచినట్టుందమ్మా! నీకు తెలియందేముంది?

అమ్మ : తేపా నీకు తెలియందేముంది అంటున్నావు. యేం జూసి అంటున్నావు, యేం తెలుసుకుని అంటున్నావు?

జీతగాడు : యేమొ తెలియదు గాని తల్లి అట్లా అనాలని పిస్తున్నది.

అమ్మ : అది సరేలే. నీకు అన్నము మూడుసార్లు పెడతారా యిక్కడ?

జీతగాడు : పెడతారు అమ్మా!

అమ్మ : జీతమెంత నాన్నా?

జీతగాడు : పదిహేను రూపాయలమ్మా!

అమ్మ : యీ పదిహేను రూపాయల్లో జీవనం సాగుతుందా మీ వాళ్లకు?

జీతగాడు : అందరూ తెచ్చుకుంటారుగా అమ్మా యెవరికూలి వాళ్లు. యీ పదిహేను రూపాయలు పెట్టి మా చెల్లిలికి పెళ్లి చేస్తారు ఈ యేడు. సరే మనవూరు కాలవ వచ్చేసిందమ్మా. బండి దిగి పోనిచ్చేదా?

అమ్మ : మనం కాసేపు కట్టమీద కూర్చుందాం.

జీతగాడు : నేను యెద్దులకు మేత తేలేదుగా అమ్మా, యేమైనా అంటారమ్మా. నిన్ను యింటిదగ్గర దిగిడ్చి ఆ యింటి ఆయన పేరు కనుక్కు రమ్మన్నారు. లేకుంటే యిల్లు గుర్తు పెట్టుకు రమ్మన్నారు.

అమ్మ : యిల్లు గుర్తు పెట్టుకు పోదువుగాని, నీవు అప్పుడప్పుడు వచ్చి కనపడి పోతుంటావు.

జీతగాడు : సరేలే అమ్మా! మేతకు వచ్చినప్పుడు వస్తూ వుంటాలె. మీ యింటికి వస్తే యేమైనా అంటారేమొ?

అమ్మ : మా యింటికి రావద్దు నాయనా, గంగరాజు పున్నయ్య గారి తోటలో గాని మురుగు కాల్వ కట్టమీద గాని, బల్లకట్టు వద్దగాని వుంటాను. మీ చెల్లెలు పెళ్లికి పదిహేను రూపాయలు యేం చాలతయ్యి గాని యీ వుంగరం పెట్టుకో అని అమ్మ వుంగరం యిస్తుంది.

జీతగాడు : నాకొద్దమ్మా! నీవు చిన్నపిల్లవు మా కామందులు వూరుకోరు.

అమ్మ : యిందాక నీకు తెలియందేముంది సర్వం తెలుసు మహత్యాలు చూపించావు అని యిప్పుడు చిన్నపిల్లవు అంటావేం?

జీతగాడు : రెండూ అనిపిస్తున్నాయి. చిన్నపిల్లవని అన్నీ తెలుసని అనిపిస్తూ వున్నాయి.

అమ్మ : రెండు అనిపిస్తున్నాయి గనుక తీసుకెళ్లు.

జీతగాడు : నాకు యెందుకో నీ పాదాల దగ్గరే పడి వుందామని పిస్తున్నదమ్మా.

అమ్మ : యివాళేనా పెద్దలంటే మొదటనుంచి భక్తి విశ్వాసాలున్నయ్యా?

జీతగాడు : మొదటనుంచి వున్నయి కాని అమ్మా నేను పుట్టిన వూళ్లో దొంగతనాలు, తాగుళ్లు, చాల తప్పుడు పనులు అలవాటు పడ్డానమ్మా. నాకు మొదటినుండి యెవరన్నా తినలేదంటే చూడగలిగేవాడిని కాదు. నేను మానుకునయినా పెట్టేవాడిని. అది ఒకటే మంచి పని. తక్కినవన్నీ చెడ్డవే. అబద్ధాలాడాలనిపించదు. తప్పుడు పనిచేసి, చేసానని చెపుతాను.

అమ్మ : నీవు పుట్టింది జడవల్లిలోనేనా?

జీతగాడు : అన్నీ రేపు వచ్చి చెపుతా అమ్మా (అని తొందరగా బండి తోలి) యిల్లు చూపించమ్మా అంటాడు.

అమ్మ : ఆ బాట సరాసరి పోనియ్యి. యీ వీధిచివర యిల్లు. నాలుగు బజారులకు కూడలి.

జీతగాడు బండి ఆవుతాడు, "యిదేనా" అంటాడు.

అమ్మ : యిదే నాయనా. నేను ఒకవేళ కట్టమీద గాని యెక్కడా కనపడకపోతే యింటికి వచ్చి కనపడి పో నాయనా!

జీతగాడు : యింటికి వస్తే యేమనరా?

అమ్మ : నిన్ను చూడంగానె నేను బయటకు వచ్చేస్తా నాయనా. నాకాళ్లు రెండు నీ రాకకొరకు వేచే వుంటాయి.

జీతగాడు : (అమ్మ రెండు మూడుసార్లు యీ మాట చెప్పిన తరువాత యెందుకో యిలా రమ్మంటున్నదని ఆలోచిస్తాడు) నాకు ఆమె మీద వున్న ప్రేమ గుర్తించిందా? లేక ఆమెకే నామీద ప్రేమ వున్నదా? అని ఆలోచిస్తాడు. సమాధానం దొరకదు.

అమ్మ : (అతను చెప్పకుండానె) నాయనా! యేమిటి ఆలోచిస్తున్నావు?

జీతగాడు : నా మీద నీకు యింత ప్రేమ యెందుకా? అని అలోచిస్తున్నా అమ్మా.

అమ్మ : నాకు ప్రేమ వుండటం సహజమే నాయనా! నా ప్రేమను నీవు గుర్తించటం విశేషం. తప్పకుండా వస్తావు గదూ నాన్నా. నాకు నిన్ను వదిలిపెట్టి బండి దిగాలంటే, పురిట్లో బిడ్డను వొదిలిపెట్టి నట్టుంది.

జీతగాడు : అయితే నీవు మరియవా?

అమ్మ "నీవు యేసయ్య వేనా?" ఆ మాట అని అతనివంక చూచినప్పుడు అమ్మవంక అతను చూస్తాడు. చూడగానే అతని కళ్లల్లో యేదో ఒక తేజస్సు కనపడుతుంది. వెంటనే అమ్మకు ముద్దు వచ్చి దగ్గరకు వెళ్లి 'నాన్నా' అని తలకాయ లాక్కుని గుండెల్లో పెట్టుకుని చెక్కిళ్లు సవరిస్తూ " 'పరిశుద్ధాత్మ' అంటే యిదే నాన్నా అంటే అర్థమయిందా?"

జీతగాడు : లేదు తల్లీ!

అమ్మ : నిన్ను నేను దగ్గరకు తీసుకున్నప్పుడు నీ మనసు యెట్లావుంది.

జీతగాడు : అమ్మ దగ్గర వుండట్టు వున్నదమ్మా!

అమ్మ : నేను మీ అమ్మనని అనిపించలేదా?

జీతగాడు : చెప్పటం చేతగాదమ్మా. అభావాన్ని వ్యక్తపరచలేను. చెప్పలేక యిట్లా అంటున్నా!

అమ్మ : నీకు మించిన భాష మాట్లాడుతున్నావు. యేమన్నా చదువుకున్నావా?

జీతగాడు : చదువుకోలేదమ్మా! నీ దగ్గర కూర్చుంటే ఆ మాటలు దొర్లుతున్నాయి. కాని భయం కూడ వుందమ్మా! నేను చేసే పాడు పనులన్నింటికి యేదైనా శిక్షవేసి మాన్పించు అమ్మా! యెద్దులు కదులుతాయి, గంటలు మోగుతాయి గంటల మోత విని యింట్లో పడుకున్న నల్లఖాసిం బయటకు వస్తాడు. అమ్మ బండి దిగుతుంది.

ఖాసిం "యిదేమిటి మా బంగారు తల్లి అర్థరాత్రి వేళ వచ్చింది" అని గుండెల్లో చెయ్యివేసి కొట్టుకుంటాడు. అమ్మను భుజాన వేసుకుని "నాకు యింకా రంగమ్మ తల్లిని పొన్నూరు నుంచి బండికట్టి తీసుకు వచ్చినట్టు, యెద్దు గంట మోగినట్టు అట్లాగె వున్నది. వుండయ్యా బండిఅపయ్యా" అని బుడ్డి తీసుకువచ్చి చూచి, "యివా కావూరి వారి తల్లే వుందే" అంటాడు.

జీతగాడు : అవునయ్యా!

ఖాసిం : మా అమ్మ మీకు యెక్కడ కనపడ్డది? బ్రాహ్మణ కోడూరు నుంచి బళ్లు అన్నీ వచ్చినాయి. పోయి అడిగి రమ్మన్నారు. పోదాంలే అనుకుంటూ కన్నుమూసాను. యెక్కడ వుంటే యేమిలే అని.

జీతగాడు : బ్రాహ్మణ కోడూరు వూరు ముందర కనపడ్డది.

ఖాసిం : అన్నీ మా అమ్మనడిగి తెలుసుకుంటానుగాని బ్రహ్మయ్యగారికి నల్ల ఖాసిం అడిగాడని చెప్పు.

జీతగాడు బండి తోలుకుని వెళ్లిపోతాడు.

వస్తు తత్వం :

ఖాసిం కండెలు తీసుకుని యింట్లో పెడతాడు.

తాతమ్మ గారు నిద్రపోతూ వుంటుంది.

అమ్మ వెళ్లి తాతమ్మ గారి పక్కలో పడుకుంటుంది.

మరిడమ్మ తాతమ్మ చూచి చూచి అప్పుడే కళ్లు మూస్తుంది. అమ్మ పక్కలో పడుకున్నా మెళుకువ రాలేదు.

అమ్మ నిద్రపోదు. మెళకువతోటే కూర్చుంటుంది.

నల్ల ఖాసిం వచ్చి మంచం దగ్గర కూర్చుని "అసలు యేం జరిగిందమ్మా, యీళ్ల బండి యెందుకు యెక్కావు?"

అమ్మ : వీళ్ల బళ్లు సాగేప్పుడు నేను యెక్కడికో వెళ్లాను. తొందరలో వీళ్లు మర్చేపోయి వచ్చారు. 'మన వూరి బళ్లు యింకా వున్నయ్యి గదా యెక్కి వస్తుందిలే' అని అనుకుని వుంటారు వీళ్లు. యే బండివాళ్లకు ఆ బండివాళ్లు అట్లాగే అనుకుని వచ్చి వుంటారు. యేవూరి వాళ్లయితే యేం నడిపించకుండా తీసుకు వచ్చారు గదా? మనం యేమి చెయ్యలేంగదా యెవరికి యేమీని, వాళ్లు చూడు యెంత ఆదరణ చూపించారో? వాళ్లు చూపించినంత ఆదరణ నీకు చెప్పటం కూడ చేతకావటంలా. ఖాసిం ఆ బుట్టలో వున్న కండె ఒకటి యిటు తీసుకురా పో.

ఖాసిం తీసుకు వస్తాడు.

అమ్మ కండె వలిచి, యిది ముదురుది. చక్కటి లేతకండె ఒకటి తీసుకురా.

ఖాసిం అప్పుడే పాలు పోసుకుంటున్న కండెను తీసుకు వస్తాడు.

అమ్మ : (కండె వలిచి) చూడు యీ గింజల కూర్పు యెంత బాగుందో ఖాసిం ఒక్కొక్క గింజ నవులుతూంటె పాలు నోట్లోకి వస్తున్నాయి, పిప్పి బయట పడుతున్నది. పాలు నాలిక మీద తగిలినప్పుడు రుచి వేరు. చర్మం కూడ పాలతో కలిపి నవిలినప్పుడు వేరు. కాల్చుకు తింటున్నప్పుడు రుచి వేరు. కాదు ఖాసిం?

తాతమ్మ గారు కొద్దిగా కదులుతుంది.

అమ్మ : గబగబా రెండు మూడు చోట్ల గింజలు కొరికి పాలవరకు లాక్కుంటుంది. (కండెనే గింజవుంచి) ఖాసిం! యీ గింజల్లో పాలు యెవరు పెట్టారు. గింజలు పెట్టినయ్యా, యీ చర్మం, పాలు కలిస్తేనేగా గింజ అయింది. ఆ గింజ మళ్లా బెండుకేగా ్టింది. గింజలు బెండు కలిసి కండె. అడుగుతుంటె మాట్లాడవేం ఖాసిం.

ఖాసిం : నాకేమి తెలుసమ్మా. నన్నడుగుతావు.

అమ్మ : నీవు రైతువేగా?

ఖాసిం : వున్నదాన్ని బట్టి పెద్దవాళ్లు చెప్పిన ప్రకారం చేసేవాణ్ణే గాని నాకేం తెలుసమ్మా? యెందులో యేది పుట్టిందో నాకేమి తెలుసమ్మా?

తాతమ్మకు బాగా మెళుకువ వస్తుంది. యేమిటో తత్వ విచారణ చేస్తున్నదే మా అమ్మ. వాసుదాసు గారి దగ్గర నుంచి వస్తున్నది గాదూ.

అమ్మ : తత్వమంటే యేమిటి?

తాతమ్మ : అదే వేదాంత విచారణ.

అమ్మ : వేదాంతం అంటే తత్వమా? నేను అట్లా అనుకోవటం లేదులే. నేను వస్తు తత్వాన్ని గురించి ఆలోచించుకుంటున్నా. తత్వమంటె గుణమేమెొ అనుకుంటున్నా.

తాతమ్మ : బ్రాహ్మణ కోడూరులో వాసుదాసు గారు యిట్లాగే చెప్పారా?

అమ్మ : అవన్నీ వినటానికి కాదుగా వాళ్లు తీసుకెళ్లింది. వాళ్లు వినటానికి తీసుకు వెళ్లారు.

తాతమ్మ : నీవు లేకపోతె వాళ్లు వినరు? వాళ్లు వినటానికి నీవెందుకు?

అమ్మ : వాళ్లు నిన్నడిగే తీసుకు వెళ్లారుగా. నన్ను తీసుకెళ్లటానికి యేమి కారణాలుంటాయి? వాళ్ల యిళ్లల్లో నాయీడు పిల్లలు వున్నారుగా. వాళ్లను తీసుకెళ్లకుండా నన్ను తీసుకెళ్లారంటే వాళ్లు చూడకూడదా వాసుదాసు గారిని.

ఖాసిం : కాదమ్మా! తప్పకుండా నీవే చూడాలి. చూడ తగిందానివని నిన్ను తీసుకు వెళ్లారు. మీరు లేచే ముందు కండెను గురించి చక్కగా చెప్పటం ప్రారంభించింది. మనసులో అర్థమయినట్టే వుంది మీరు చెప్పే మాటలల్లే వున్నాయి, చెప్పటం చేతకాదు. అసలు అక్కడ నుంచి అమ్మాయి యెట్లా వచ్చిందో చూచారా?

తాతమ్మ : సాయంకాలమే వొచ్చి ప్రొద్దుపోయింతరువాత మన యింటికి వచ్చిందేమొ అను కుంటున్నా.

ఖాసిం : లేదు తల్లీ లేదు. మన కావూరి వారి బండిమీద వచ్చింది.

తాతమ్మ : యెందువల్ల వారికి తెలిసి ఫలానా వారి అమ్మాయి అని యెక్కించుకున్నారా యేమిటి?

ఖాసిం: ఆ వివరాలు నాకు బాగా తెలియదు. అమ్మాయి దగ్గరే వున్నదిగా అడగండి.

తాతమ్మ : అమ్మా యేమిటి యెక్కడ కనపడ్డారు వీళ్లు?

అమ్మ : వీళ్లు యిక్కడ కనపడి పొన్నూరులో యెక్కించు కున్నట్లుగానే, బ్రాహ్మణ కోడూరులో కనపడి వాళ్లు అక్కడ యెక్కించుకున్నారు. అందరూ మన అమ్మాయనుకునే చేశారు.

తెల్లవారొచ్చింది. మూడున్నర, నాలుగు అయింది. ఆమె మేలుకొలుపు పాడుకుంటూ ప్రయాణాన్ని గురించి యిక తరచదు. ఖాసిం లేచి పనికి వెళతాడు. అమ్మ నిద్రపోతుంది.

మంత్రాయి చరిత్ర :

తెల్లవారి ఆరు గంటలవుతుంది. యీ లోగానే తాతగారు లేచి యిది యెప్పుడు వచ్చిందని అడిగి స్నానానికి వెళతారు. తాతమ్మ లేచి పని చేసుకుంటూ వుంటుంది. అమ్మ లేచి ముఖము కడుక్కుని చెంబుతీసుకుని మురుగు కాల్వ కట్టకు వెళ్లిపోతుంది. 10 గంటల దాకా చూచినా జీతగాడు కనపడడు అక్కడ. అప్పుడు యింటికి వస్తుంది. యింటికి వచ్చేటప్పటికి మంత్రి కిష్టయ్య గారు అమ్మమ్మ (కామేశ్వరమ్మ) వచ్చి వుంటారు.

అమ్మ గబగబా పోయి అమ్మమ్మ వొళ్లో కూర్చుంటుంది.

అమ్మమ్మ తను తెచ్చిన పళ్లు చేతిలో పెడుతుంది.

కిష్టయ్యగారు : (కామేశ్వరమ్మ అమ్మమ్మ తండ్రి) యే అమ్మాయ్! కులాసాగా వున్నావా?

అమ్మ : ఆఁఅని అమ్మమ్మ యిచ్చిన పళ్లు తీసుకుని కట్టకు పరుగెత్తుతుంది. అక్కడ జీతగాడి రాక యెక్కడా కనపడదు. అయినా బయలుదేరి వుంటాడులే కూర్చుందాం కాసేపు. కూర్చున్న కాసేపటికల్లా దూరాన యెక్కడో కనపడతాడు. క్రమంగా తొందర తొందరగా నడిచి పది నిమిషాల్లో వచ్చి అవతల కట్టమీద కనపడతాడు. అమ్మ ఆ చెట్టుకింద వుంటె తను కనపడతానో లేదోనని యివతలకు వచ్చి కూర్చుంటుంది.

జీతగాడు అమ్మను చూస్తాడు. ధోవతి పైకి కట్టుకుని కాల్వలోకి దిగి నడుస్తాడు. చేతిలో కొడవలి తాళ్లు, కర్ర వుంటాయి. అతను భుజం మీద కర్ర పెట్టుకుని రెండు చేతులు కర్రమీద బెట్టి మోకాటి లోతు నీటిలో నడుస్తూ వుంటె, నీళ్లు అమ్మా అమ్మా అని ఘోషిస్తున్నట్టు వుంటుంది. మంత్రాయి (అంటె జీతగాడు) మనస్సే కాకుండా, కాళ్లు, నడిచే ప్రదేశం కూడా అమ్మా అమ్మాఅని అలమటిస్తున్నాయి. యిదే మనోవాక్కాయ కర్మలు అంటారు. అయిదు నిమిషాల్లో అమ్మ దగ్గరకు వస్తాడు.

అమ్మ : నాయనా మంత్రాయి, యింతసేపు రాలేదేం?

మంత్రాయి 'మంత్రాయి' అనగానె రెండు పాదాలమీద పడతాడు.

అమ్మ : తలని నిమురుతూ, నాయనా ఆ తోటలోకి పోదాం పద. అన్నం తిన్నావా?

మంత్రాయి : తిన్నానమ్మా. యిక్కడనుండి వెళ్లినప్పటినుండి మోపులు మోస్తూనే వున్నా యిక్కడకు రావాలని.

లేచి యిద్దరూ కలసి పున్నయ్యగారి తోటలోకి వెళతారు. తీసుకెళ్లిన పళ్లు యివిగో నాన్నా తిను. యెప్పుడయినా తిని వుంటావా యీ పళ్లు (కమలాలు).

మంత్రాయి : తినలేదమ్మా. నారింజకాయలు తిన్నా కాని యర్రముక్కలు తినలేదమ్మా.

అమ్మ : నేను వలిచి నోట్లో పెట్టనా?

మంత్రాయి : వద్దమ్మా నేను వొలుచుకు తింటా. నీకు యెంగిలి అవుతుంది. మీరు బ్రాహ్మలు గదా యింత దగ్గరకు తీసుకుంటావేమ్మా?

అమ్మ : అడుగడుగునా నీ భావాలు మారిపోతుంటయ్యా నాయనా? ఒకసారి అమ్మ అంటావు, ఒకసారి బ్రాహ్మలు అంటావు.

మంత్రాయి : నాకు అనేకరకాలుగా తోస్తుంటుందమ్మా. యెప్పుడూ స్థిమితం తక్కువ రాత్రి యిక్కడనుండి తిరిగి వెళ్లేటప్పుడు నీవు దేముడువేమొ అనిపించింది. ఒకప్పుడున్నట్టు ఒకప్పుడుండదమ్మా. నిన్ను చూచేటప్పుడు ఒకరకంగా తోస్తుంది. నిన్ను గురించి ఆలోచించేటప్పుడు యింకొక రకంగా తోస్తుంది.

అమ్మ : అదిసరే గాని యిందాక మంత్రాయనగానె యెందుకు కాళ్లమీద పడ్డావు?

మంత్రాయి : వున్న సంగతంతా చెప్పుకుంటానీకు . మా అమ్మ, మా అయ్య, మేనత్త మేనమామ బిడ్డలు. ఒకరిది బాపట్ల, ఒకరిది జడవల్లి. చెప్పుకోమంటావా అమ్మా యిది అంతా నాకెందుకు అంటావా?

అమ్మ : నాకెందుకులే అనిపిస్తున్నది గాని, నిన్నుజూస్తె యెందుకు చెప్పుకుంటున్నావోలే విందామనిపిస్తున్నది. నీ మనస్సు వంటిదే నా మనస్సు. స్థిమితముండదు.

మంత్రాయి : భలే అమ్మవమ్మా. నాకు పోల్చుకుంటున్నావు.

అమ్మ : అదికాదయ్యా మనస్సు లక్షణం. సరే చెప్పుకో.

మంత్రాయి : బాపట్ల దగ్గర ఒక పల్లెటూళ్లో వుంటున్నాం. దొప్పలపూడిలో మా పెదతల్లి కుమారుడు జీతానికి వుండి జబ్బుచేసి ఆస్పత్రికి వెళ్లాడు. నేను నిండా యిక్కడికి వచ్చి నెలా పదిహేను రోజులు నేను నిన్ను చూడ్డం కోసమే అతనికి

జబ్బు వచ్చిందని రాత్రి యిక్కడనుండి వెళ్లినప్పటి నుండి అనుకున్నా. నేను రెండు మూడు సంవత్సరాల నుండి యెన్నో తప్పులు చేస్తున్నా. నాకు బుద్ధిపుట్టి చేయటం కాదు. చేయమంటే చేయటం. శరీరం ఒకరికి అమ్ముకున్న కారణం చేత వారు చెప్పినట్టు చేయాలి?

అమ్మ : నీవు చేయనంటే కొడతారా. నిజంగా అదే నిజమయితే నీకు బుద్ధిపుట్టి చేయనప్పుడు నీకేమి అంటదు.

మంత్రాయి : మావూరికల్లా ఒకడే ప్రభువు.

అమ్మ : ప్రభువు అంటే భగవంతుడనా?

మంత్రాయి : కాదమ్మా. మావూళ్లో ఒక్కడే ధనవంతుడు, మాటకు చాలినవాడు. గ్రామమంతా ఆయన చేతుల్లో వుంటుంది. ఆయనకంటె పైవాళ్లు ఆయన మాటే వింటారు. ఆయనకంటె చిన్నవాళ్లు ఆయన మాటే వింటారు.

అమ్మ : ఆవూరు పేరేమిటి? ఆయన పేరేమిటి?

మంత్రాయి : ఆ వూరు జిల్లేళ్లమూడి. ఆయన పేరు ఖగ్గా పున్నయ్యగారు. ఆ వూళ్లో పాతికోముప్పయ్యో యిళ్లు వుంటాయి.

అమ్మ : అయితే ఆయన్ను నేను యెరక్కేం, యెరుగుదును. ఆ వూరు తెలియదు గాని ఆయన తెలుసు. మా తాతగారి దగ్గరకు వస్తూ వుంటారు.

మంత్రాయి : ఆయనా అమ్మా, ఆయన అవునో కాదో యిట్లా యింత తెలివి తక్కువను పడతానేం, నీకు తెలియందేముంది.

అమ్మ : అయితే నీవు యిక్కడ యెంత కాలముంటావు నాయనా?

మంత్రాయి : వీలయితే యిక్కడే వుండటానికి ప్రయత్నిస్తానమ్మా. యెక్కడికి వెళ్లినా, నేను యేం చేసినా నే మర్చిపోయినా నీవు నన్ను వదిలిపెట్టవను కుంటున్నా అమ్మా. మా వూరుకు అగ్రహారీకులు వచ్చి అప్పుడప్పుడు రామాయణం చెప్పి పోతూ వుంటారు. అది వింటూ వుంటె నాకు సీతా అమ్మవారి లాంటి అమ్మ యెప్పుడయినా కనపడితె బాగుండునా అని అనుకునేవాడిని. మీరు మంత్రాయి అని పిలిచినప్పుడు మొదట ఆ పేరు నాకు పున్నయ్య గారు పెట్టారు. నేను మీతో ఆ పేరు చెప్పలేదు. కదా. మీరు 'మంత్రాయి' అనగానే మీవైపు చూసి నిండు రంగు ఆకుపచ్చని చీర, యర్రని రవిక ఆ చెట్టు కింద రెండు మోకాళ్లమీద చేతులు పెట్టి తల వంచుకుని జుట్టు విరబోసుకుని నా కోనముగా కూర్చున్న సీత అమ్మవారనిపించింది. కాళ్లమీద పడ్డతరువాత వుంగరం జ్ఞాపకం వచ్చింది.

అగ్రహారీకులు చెప్పిన ఆ కథ అంతా జ్ఞాపకం వచ్చింది. తలమీద చెయ్యి పెట్టినప్పుడు కూడ సీతమ్మ వారి లాగానే వున్నావు. లేచిచూస్తే మామూలు చిన్న అమ్మాయిలా కనుపించావు.

అమ్మ : అయితే నీవు ఆంజనేయుణ్ణనా నీ వుద్దేశం?

మంత్రాయి : కాదమ్మా. యేనాటికి అక్కరకు వస్తుందో యీ వుంగరం అనిపిస్తున్నది.

అమ్మ : నీవు యింకా కొన్ని చెప్పలేదు మంత్రాయి. వదిలేశావు. పెళ్లయిందిగాదు నీకు. నీ వయస్సు పదిహేను అని చెప్పావుగదూ.

మంత్రాయి : అయిందమ్మా.

అమ్మ : రాత్రి నీవు చెప్పిన వయస్సు కూడ పొరపాటే. దాదాపు యిప్పుడు నీకు 27 సంవత్సరాలు వయస్సు వుంటుంది.

మంత్రాయి : నాకు గుర్తు లేదమ్మా. వయస్సుతో మాకు లెక్క యేముంటుంది. నా తరువాత ముగ్గురు పుట్టారని, నలుగురు పుట్టారని అనుకుంటాము.

అమ్మ : నీకొక అమ్మాయి యేమయినా పుట్టిందా మంత్రాయి?

మంత్రాయి : ఊఁ మొన్న యీ మధ్యనే పుట్టి పోయిందమ్మా. నువ్వు యెవరో యేంటో చెప్పమ్మా. నేను చేసే ప్రతి పనిని చూస్తూనే వుంటావా?

అమ్మ : నువ్వొక్కడివేనా అందరూ నీవంటి వాళ్లేగా?

మంత్రాయి : అయితే యీ ప్రపంచంలో యెంతమంది మనుషులో, యేమేమి చేస్తుంటారో, యెవరికి యెంతమంది పిల్లలో, అన్నీ తెలుసుగా. యింతమందిని ఒక్కసారిగా యెట్లా చూస్తావమ్మా. నీకు రెండేగా కళ్లు. యింతింత కాళ్లు. యింతింత చేతులు. రబ్బరు బొమ్మల్లె వున్నావు. (యింతింత కాళ్లు చేతులు అన్నప్పుడు వేలు రెండంగుళాలు పొడుగు బెట్టి చూపిస్తాడు) యిక్కడ నుంచి వెళ్లకుండా వుండాలనే వుంది. దొప్పలపూడికే వెళ్లినా లోగడ చేసిన పనులు చేయకుండా నావెంట వుండి నన్ను కాపాడమ్మా.

అమ్మ : యెప్పుడూ చూస్తూనే వున్నా. చెప్పమంటావా యిప్పుడు యీ సంభాషణలో తెల్లా కనిపెట్టి వుండేది లేనిది?

మంత్రాయి : మా వూరి కాపును కూడ కనిపెట్టి వుండమ్మా? నా చేత ఆ పనులన్నీ చేయించకుండా.

అమ్మ : అది సరే కాని మంత్రాయి యింటికెళ్లగానే వారు యేమన్నారు. కోప్పడ్డారా?

మంత్రాయి : యేమి అనలేదమ్మా. వాళ్లకు అసలు కనుపించలేదు. బహుశా యీపూట అడుగుతారు వారమ్మాయి మాత్రము అడిగింది "జాగర్తగా దించి వచ్చావా" అని. సరే వెళ్లొస్తానమ్మా.

అమ్మ : రేపుగూడ రా పగలో రాత్రో నీకు యింత అన్నం పెట్టాలని వుంది పగలు గాని రాత్రిగాని వచ్చి తినిపో. నేను యీ తోటలోనె వుంటా.

మంత్రాయి వెళ్తాడు.

అమ్మ యింటికి వస్తుంది. సాయంత్రం 3 గంటలవుతుంది.

మంత్రాయి గడ్డికోసుకుని యింటికి వెళ్లిపోతాడు.

17. అన్నింటికీ అమ్మ

జీవ చైతన్యం :

తాతమ్మగారు : (అమ్మను) యింతసేపు యెక్కడికి పోయా అమ్మా? అన్నానికి రాకుండా

అమ్మ : మీరు నిద్రపోయేటప్పుడు వచ్చి తిన్నాలే.

తాతమ్మ : నేను యీపూట బాపట్ల పోయి వస్తా. కబురు వొచ్చింది. పదిరోజులు వుండి వస్తా.

అమ్మ : నేను వుంటాలే పోయిరా. పిన్ని యేది?

తాతమ్మ : పడుకుని నిద్రపోతున్నది.

అమ్మ : లోపలకు వెళ్లి గిన్నెలో నానపోసిన మినపప్పు చూచి తాతమ్మా ఆ పప్పు నే కడిగేది?

తాతమ్మ : నీకేమి చేతనవునమ్మా. చేతనయితే కడుగు.

అమ్మ : గిన్నె తీసుకెళ్లి దొడ్లో పెట్టుకుని మినపప్పు కడుగుతూ వుంటుంది. యింతలో సీతాపతి తాతగారు లేచివచ్చి "నువ్వేమిటమ్మా పనిచేస్తున్నావు?"

అమ్మ : యెందుకో యీ వేళ పప్పు కడగాలని బుద్ధి పుట్టింది. అందుకని కడుగుతున్నా. పప్పు పిసుకుతూ, తాతమ్మ! యీ నీరెందుకు పచ్చబడ్డది? పప్పు పిసకంగానె పొట్టు వూడుతున్నది. పొట్టుకున్న రంగు నీటికి వచ్చింది. సాంగత్య బలమంటే యిదేనా? నీరేగా పొట్టును, పప్పును విడదీసింది. విడదీయ కలిగింది గాని దాని సహజమైన రంగు మారక తప్పలా. ఒక దాని స్వభావము ఒకదాన్ని మార్చగల శక్తి వున్నప్పటికి ఆ శక్తిలో మరొక శక్తి కలవక తప్పదు. శక్తి రకరకాలుగా

వుంది. చివరకు అంతా శక్తే. యీ శక్తేనేమో భగవంతుడంటె! దీనికే తలొక పేరు పెట్టుకున్నారు. పేరుకు కూడ శక్తి వున్నది కదా? భావానికి రూపం వున్నది. రూపానికి పేరు వున్నది. ఆ రూపానికి శక్తి వున్నది. యిందులో యేదీ తక్కువది కాదు.

తాతమ్మ : యేమిటమ్మా యెవరో అడిగినట్టు చెప్పుకు పోతున్నావు?

అమ్మ : నీకు చెబితే నీవు సమాధానం యివ్వలేదు. అందుకని పప్పుతో. పొట్టుతో, నీటితో, గిన్నెతో మాట్లాడుకుంటున్నా. వాటికీ చైతన్యముందిగా, చైతన్యం లేకపోతే ఒకదానిని ఒకటి మార్చలేవుగా, వంపులు పెట్టిన కొద్ది పప్పులో పట్టుపోయింది. నీటికి తెలుపు వచ్చింది. పొట్టులో నీరు పోసినా నీటికి పచ్చదనం రాదు. ప్రతిదానికి పరిమితి గల శక్తి. చైతన్యం లేకపోలా. మాట్లాడాలంటే మనుషుల్తోనే అక్కర్లా. వాటితోకూడ మాట్లాడవచ్చు. మనుషుల్లో మాత్రం అందరి భాష భావాలు ఒకటిగా వున్నయ్యా. మనుషుల్లో యెట్లా తరతమ భేదాలున్నయ్యో అన్ని పదార్థాలకు అట్లాగే వున్నాయ్. వాటి భాష మనకు అర్థం కాకపోవచ్చు. ఒక చెట్టు దగ్గరకు పోతె వచ్చావా అన్నట్టు దగ్గరకు వచ్చి పలకరించి పోతుంటుంది. అది మనం గ్రహించలేం గద. తాతమ్మా మాట్లాడవేం? అందరికి చెపుతావు నాకు చెప్పకూడదా?

తాతమ్మ : చిదంబర్రావు తాతయ్య మాట్లాడుతున్నట్లుగా వుంటే వింటూ కూర్చున్నా. యెవరో పెద్దవాళ్లు వుపన్యాసమిస్తున్నట్టుగా వుందమ్మా.

అమ్మ : నేనడిగినదంతా నిజమేనా? సమాధానం చెప్పవేం?

తాతమ్మ : నీవు అడుగుతున్నట్టుగా లేదమ్మా. చెపుతున్నట్టుగా వుంది.

సీతాపతి తాతగారు : యేమిటి యిందాకట నుంచి మాట్లాడుతున్నది?

తాతమ్మ : యేదో నానపోసిన మినపప్పును గురించి అడుగుతున్నది. యేమీ లేదు అంతకంటె. (అమ్మతో) యీ రోజు ప్రయాణము ఆపుకున్నా నీ మాటలతో నీపిన్ని నాన్న వచ్చాడని మినపప్పు నానపోసా వొడిపెట్టి రేపు ప్రొద్దున వెళతా. మీ పిన్ని ఒక్కతి వుండలేదు. తోడుగా వుండు.

కామేశ్వరమ్మమ్మ గారు నిద్రలేచి దొడ్లోకి వస్తుంది.

తాతమ్మ పప్పు రుబ్బి, గారెలు వండుతుంది.

అమ్మ : నాకు పెట్టండి ముందు నాలుగు అని తీసి పొట్లాం కట్టి అట్టె పెడుతుంది.

వంట చేసుకుని అంతా భోంచేస్తారు. రాత్రి గడుస్తుంది. తాతమ్మ గారు తెల్లవారి బాపట్ల వెళుతుంది. తాతమ్మ మంత్రి కిష్టయ్య గారు కలిసి వెళతారు.

మమతామయి :

మరురోజు అమ్మమ్మ వంట చేస్తుంది అందరూ భోజనాలు అయిన తరువాత పిన్నీ నేను తరువాత వచ్చితింటాలె మీరు పడుకోండి అని చెప్పి కట్టకు వెళుతుంది అమ్మ. మంత్రాయి రాలేదు.

అమ్మ ఒక పావుగంట కూర్చుని ''నేను అన్నం కట్టుకు వచ్చేటప్పటికి రాకపోతాడటలే'' అని యింటికి వచ్చి తోటలోకి వెళ్లి కూర్చుంటుంది. వెళ్లిన ఒక పావుగంటకు మంత్రాయి వస్తాడు. కట్టమీద చూచి అక్కడ లేకపోతే సరాసరి తోటలోకి వస్తాడు. రాగానె కొడవలి కర్ర అక్కడ బెట్టి నమస్కారం చేస్తాడు.

అమ్మ : నాన్నా మంత్రాయి అన్నం తినవూ? అని గడ్డం పట్టుకుని అడుగుతుంది.

మంత్రాయి : యెందుకమ్మా యీ మాలముండాకొడుక్కి యింత ముద్దుపేరు?

అమ్మ : నీవు మావాడివి. మాలవాడివి కాదు.

మంత్రాయికి ఆనందంతో అతని కళ్లవెంట నీళ్లు వస్తుంటాయి.

అమ్మ అన్నం పొట్లాం విప్పి పొట్లకాయ పెరుగు పచ్చడి, వంకాయ కూర, గోంగూర పచ్చడి వెన్నపూస కలిపి ఒక్కొక్క ముద్దే నోట్లో పెడుతూ వెన్న పూస నంజుకోను పెడుతూ వుంటుంది.

మంత్రాయి ఒక్కొక్క ముద్ద తింటూ వెక్కుపట్టి ఏడుస్తూ వుంటాడు.

అమ్మ : యెందుకు నాయనా అట్లా యేడుస్తావు?

మంత్రాయి : యేం లేదమ్మా. దొప్పలపూడిలో వుంటా గదా. రోజా వచ్చి దర్శనం చేసుకుని వెళదామనుకున్నా అదీ తీరిపోయింది. అతని బదులు అతని తమ్ముడ్ని పంపిస్తారట.

అమ్మ : వెంటనే వెళ్లిపోతావా?

మంత్రాయి : అతను యెప్పుడు వస్తే అప్పుడు వెళ్లిపోతా.

అమ్మ : రేపు వస్తే రేపే వెళ్లిపోతావుగా?

మంత్రాయి : ఆఁ

అమ్మ : వచ్చి చెప్పిపోతావా?

మంత్రాయి : పోయేటప్పుడు చెప్పి పోలేనమ్మా. నాలుగు రోజులు వుంటాననుకుంటె వస్తా. రేపే వెళ్లేటట్టయితే రాను. అదీకాక వాళ్లు కొంచెం కొప్పడుతున్నారు. యీ వూళ్లోనే కూలి చేసుకు బ్రతికేటట్టు ప్రయత్నిస్తా.

అమ్మ : సరే మర్చిపోయినా వాళ్లు యిల్లెక్కడ అని గుర్తులు అడిగారా?

మంత్రాయి : అడిగారు, చెప్పాను. మీ వూరు ఆయన యెవరో వస్తే ఆయనకు మొన్న జరిగిందంతా చెపుతున్నారు. విన్నాను. ఆయన పేరు పులిపాక భావన్నారాయణగారట.

అమ్మ : మొన్న జరిగిందంతా చెప్పాడా నాయనా?

మంత్రాయి : ఆఁచెప్పాడమ్మా. అమ్మా నేను పుట్టి యింతకాలమయింది గాని యీ రకం భోజనం యెప్పుడూ చేయలేదు. యిక్కడకొస్తే యిక్కడా అట్లాగే వుంది. నాకోసం జొన్నలు దంపిస్తారు.

అమ్మ : పని చేయ్యవలసినవాడు బలంగా వుంటుందని జొన్న అన్నం పెడుతున్నారు నాన్నా. యీ వరి అన్నంలో బలమేముంది?

మంత్రాయి : అమ్మా అనుపాకాలు కూడా అంతేనా?

అమ్మ : అనుపాకాలా నాయనా, రెండు రకాలు చేస్తారు.

మంత్రాయి : ఆఁ

అమ్మ : నీకేమి తినాలని వుందో నాకు చెప్పు. నీకూరలేమైనా తినాలని వుందా?

మంత్రాయి : అవి అక్కర్లేదమ్మా. యిందాక మీరు పెట్టిన కూరలు చాలు. పెరుగు పచ్చడి యెప్పుడూ తినలేదమ్మా.

అమ్మ : వంకాయ కూర- అది యెట్లా వుంది?

మంత్రాయి : కాయలకు కాయలు చేశారు. యిది నేను యెప్పుడూ తినలేదె.

అమ్మ : రేపుకూడా రా యింకా ఒక వీశకు మా పిన్ని నడిగి చేయించుకొస్తా.

మంత్రాయి : వొద్దులే అమ్మా. వాళ్లు యేమన్నా అనుకోరూ? ఆ లేత చేతులు చూడు అన్నం కలిపితే యెట్లా కందిపోయినయ్యో. కలపటమే కాకుండా నోట్లో కూడ పెడుతుంటే వేళ్లు పళ్లకింద పడతయ్యేమో ననుకుంటా. యిక రానుగాని యెప్పుడన్నా వొచ్చి పోతూ వుంటా. ఆ అబ్బాయి బహుశా రాత్రికి రావచ్చు.

అమ్మ : అతను వస్తే యేవూరు వెళతావు నువ్వు?

మంత్రాయి : నేనా? బాపట్ల దగ్గర వున్న జిల్లెళ్లమూడి పోతానమ్మా.

అమ్మ : బాపట్ల వొస్తే నా అడ్రసు చెపుతాను మా తాతయ్యగారి యింట్లో నేను వుంటే చూసిపో అంటే యింట్లో వుండను బజారు వాకిట్లో వుంటా. అయినా నేను బాపట్ల వస్తే నీవు యెక్కడ వుంటావో నీ అడ్రసు చెప్పు నేను రావటం తేలిక, నీవు రావటంకంటె.

మంత్రాయి : చీరాల రోడ్డున మాలపల్లి వుంటుంది. పోలేరమ్మ గుడి దాటి రావాలి. దేశరాజు అప్పారావుగారి తోట.

అమ్మ : అడిగితే చెపుతారుగా?

మంత్రాయి : నీవు అడగటం యేమిటమ్మా?

అమ్మ : అడగాలి నాయనా తప్పదు.

మంత్రాయి : సరే వెళ్లొస్తా అమ్మా అని చెయ్యి తీసుకుని ముద్దు పెట్టుకుని నమస్కారం చేసి వెళతాడు.

అమ్మ యింటికి వెళుతుంది.

పక్షులతో అమ్మ :

అమ్మ యింటికి వచ్చిస్నానం చేసి మళ్లా తోటలోకి వెళుతుంది. సాయంకాలం 5 గంటలవుతుంది. చెట్టెక్కి చింత చిగురు కోసుకు తిని చెట్టు కొమ్మలమీద పడుకుని వుంటుంది. ఒక కోకిల అమ్మ పక్కనే కొమ్మమీద నుంచుని కూస్తూ వుంటుంది. కాకులు కూడ అమ్మ దగ్గర చేర్తాయి. అవి అమ్మవంక చూస్తూ వుంటాయి. అమ్మ నిద్రపోతూ వుంటుంది. నిద్ర లేచేటప్పటికి కోయిల ఒకటి, కాకులు చాల అరుస్తూ వుంటాయి. యేంటో అమ్మను గురించి చెప్పుకున్నట్టుగా ఒకసారి అమ్మవంక ఒకసారి తమతో తాము చూచుకుంటూ అరుస్తూ తలలు వూపుతూ చెప్పుకుంటూ వుంటాయి. అమ్మ కోయిల వంక చూస్తుంది. వెంటనే యింకా దగ్గరకు దిగివచ్చి చెవులో కూస్తుంది. కాకులు అమ్మ నిద్ర లేచిందనే సంతోషంతో రెక్కలు కొట్టుకుంటూ యింకా దగ్గరకు వస్తాయి. అందులో ఒక కాకికి కాలు కొంచెం అవుడుగా వుంటుంది. అది వచ్చి వొళ్లో కూర్చుంటుంది. అమ్మ కాకిని చెయ్యి పెట్టి తడువుతూ నీవు "కా" కోయిల "కూ" కాకి కొ రెండు కలిపి కాకూ అని వినపడుతూ వున్నాయి తరువాత నీవు నాకు అన్నట్టుగా వుంది. యేం బెట్టేది మీకు. నేనే మీకు నేను తప్ప మీకు బెట్టేది యేంలేదు నాదగ్గర. నన్నే తినండి. అన్నీ వచ్చి ఒకేసారిగా అమ్మ వొళ్లంతా వాల్తాయి మోకాళ్లమీద, పాదాలమీద రకరకాలుగా వాలను లేచిపోను. ముక్కులు వంటిమీద ముద్దు పెట్టుకున్నట్టు తాకించి లేచిపోతాయి. చిటారు కొమ్మను వున్న గూడు యే గాలి లేకుండానే అకస్మాత్తుగా అమ్మ వొళ్లో బడుతుంది. వొళ్లో కూర్చున్న కుంటికాకి చివాలున యెగిరిపోతుంది. ఆ గూట్లో వున్న కాకిపిల్ల అమ్మ పాదాలమీద వ్రాలుతుంది. అమ్మ పిల్లను తీసి ముద్దు పెట్టుకుని గూడులో పెడుతూ వుండగా పిల్ల తల్లి వస్తుంది. అమ్మ గూడు పెడుతుంటె కాకిగూడ గూడు పెడుతుంది. అమ్మ వొంటని వున్న

చొక్కా విప్పి పక్కవేసి కాకిపిల్లను అందులో పెడుతుంది. కాకి అమ్మకు తనుగా తోస్తుంది గాని అది కాకి అనిపించదు. కాకికూడ తన తల్లి దగ్గర వున్నాననిపిస్తుంది. కాకిపిల్ల అమ్మ చేతుల్లో నుంచి గూట్లో పెడుతుంటే అమ్మ చేతుల్లోనే వుంటానన్నట్లుగా గిలగిలా తన్నుకుంటుంది. ఆ తన్నుకునేటప్పుడు పెద్దకాకి అమ్మవంక చూచి 'చూడు అమ్మా యెట్లా తన్నుకుంటున్నదో మా యిద్దరిని నీ వొడిలోనే వుంచుకో'మని తన ముక్కు తన బిడ్డమీద వాల్చి బిడ్డను ముక్కుతో యెత్తి అమ్మ వొడిలోకి వాలుతుంది. యిద్దరం నీ వొడిలోనే వుంటామన్నట్టుగా అమ్మ రెండింటిని కలిపి ముద్దు పెట్టుకుంటుంది. యింతలో చింతచెట్టు కొమ్మ ఒకటి వచ్చి కాకులు మీదుగా అమ్మ తలమీద వాలుతుంది. మీకేగాదు నాకు అమ్మే అన్నట్లుగా. అమ్మ మీ ముగ్గురు నాకు బిడ్డలే అందరూ తలొకదానికి వుపయోగ పడుతున్నారు. యెంతసేపటికి కాకి లేవదు. దీపాలు పెట్టేవేళవుతున్నది. కాకులు మొత్తం అన్నీ ఆ చెట్టుమీదనే వాలినాయి. కోయిల కళ్లు మూసుకుని తల వంచకుండా నిద్రపోతున్నట్టు వుంటుంది. అమ్మకు అది నిద్రగా తోచదు. భగవంతుణ్ణి ధ్యానం చేస్తున్నది కాబోలునని అనుకొని రెండు కళ్లసందున వొత్తుతుంది యేమి నిద్ర అని. వొత్తగానె లేచి వచ్చి రెండు పాదాలమీద కూర్చుంటుంది. నీకోసమే చూస్తున్నా నన్నట్టుగా అమ్మవంక చూచి మళ్లీ తలవంచి నమస్కారం చేస్తుంది.

అమ్మ : వుండమ్మా ప్రొద్దుగూకింది నేను వెళ్లొస్తా. రేపు మీకేమైనా తెచ్చి పెడతా అని అనంగానె పాదాలమీద నుంచి యెగిరి కొమ్మ మీదికి వాలుతుంది. అమ్మ చెట్టు దిగంగానే కాకులన్నీ విపరీతంగా 'కాకా' అని అరుస్తాయి. కోయిల అమ్మతోపాటుగా దిగి అమ్మకన్నా కొంచెం యెత్తుగా యెగుర్తూ కట్ట చివరిదాకా వచ్చి అమ్మ భుజముమీద వాలి తలవంచి అమ్మవైపు చూచి యెగిరి చెట్టుమీదకు వాలి, వుంటా పోయిరా అమ్మా అంటుంది. అమ్మ యింటికి చేరుతుంది.

సీతాపతి తాతగారు అరుగు మీద కూర్చుని వుంటారు. అమ్మ గడపలోకి రాగానే "ప్రొద్దుటనుండి కనపడలేదు యెక్కడికి వెళ్లావు? మీ పిన్ని ఒక్కతే గదా యింట్లో వుండగూడదూ?"

అమ్మ యేమీ మాట్లాడకుండా నుంచుంటుంది.

సీతాపతి తాతగారు : యెందుకు అట్లా నుంచుంటావు? పో యింట్లోకి పో ప్రొద్దుటనుంచి అన్నం గూడ తిన్నట్టు లేదు.

అమ్మ మెల్లగా నడిచి వెళ్లిపోతుంది.

కామేశ్వరమ్మ వంటచేస్తూ వుంటుంది.

అమ్మ లోపలకు వెళ్లగానె.

కామేశ్వరమ్మ : రామ్మా రా యెక్కడికి వెళ్లా? అన్నం కదిలించి వుంది పెట్టుకు తిన్నావా?

అమ్మ : ఊఁ

కామేశ్వరమ్మ : యింతసేపు యెక్కడ ఆడుకుంటున్నావు?

అమ్మ : చాలాచోట్ల.

కామేశ్వరమ్మ : యెక్కడెక్కడ తిరిగావేంటి? చాలాచోట్ల అంటున్నావు.

అమ్మ : వీలయినంతవరకు, రానిచ్చినంత వరకు.

కమేశ్వరమ్మ : రానివ్వనివాళ్లు గూడా వున్నారా?

అమ్మ : వున్నారుగా.

కామేశ్వరమ్మ : యెవరు నిన్ను రానివ్వనివాళ్లు?

అమ్మ : నేను రావటం యిష్టం లేనివాళ్లు

కామేశ్వరమ్మ : యింతసేపా? దీపాలు పెట్టిందాక వుంటే యెట్లాగమ్మా. యింట్లో ఒక్కదాన్ని గద. నీవు యేమిపని చేయక్కర్లా తోడుగా వుంటేచాలు.

అమ్మ : రేపటినుంచి పోనులే. యెక్కడికి పోగూడదా? మీరు నిద్రపోయినప్పుడు పొమ్మంటారా?

కామేశ్వరమ్మ : నిద్రపోయినప్పుడు యెక్కడవున్నా ఫరవాలేదు.

అమ్మ : సరేలె. అన్నం పెడతా పిన్నీ? ఆకలి అవుతున్నది.

కామేశ్వరమ్మ : వుడుకుతున్నదిగా. కాసేపు వుండు. మీ నాన్నతోపాటు తిందువుగాని.

అమ్మ "సరేలే" అని అక్కడ వంటయింట్లో గుడ్డవేసి వుంటే అక్కడ పడుకుని నిద్రపోతుంది.

సీతాపతి తాతగారు అన్నానికి వచ్చి అమ్మను లేపుతారు.

అమ్మ : నువ్వు తిను నాన్నా నేను, పిన్ని కలిసి తింటాము.

సీతాపతి తాతగారు భోంచేస్తారు.

అమ్మ, అమ్మమ్మ కలిసి ఆ విస్తట్లో భోంచేస్తారు.

అమ్మ అన్నం తిని వాకిట్లో వున్న మహలక్ష్మమ్మ వారి పురంలోకి వెళ్లి భజన దగ్గర కూర్చుంటుంది. భజన, పూజ అయ్యేటప్పటికి రాత్రి ఒంటిగంట అవుతుంది. అమ్మ అక్కడే పడుకుని నిద్రపోతుంది. తెల్లవారి అమ్మ యింటికి వచ్చినా యెవరూ నిద్రలు లేవరు. పనిచేసే మనిషి వచ్చి పనంతా చేసి వెళుతుంది.

అమ్మ : మొఖము కడుక్కుని మా పిన్ని లేవలేదు గాని, బీబీ! లేస్తే నీకోసం కూర్చుని కూర్చుని పోయిందని చెప్పు

అమ్మ యిటు పోగానె అమ్మమ్మ, తాతయ్య లేస్తారు. బీబీ చెపుతుంది.

కామేశ్వరమ్మ : యింత తెల్లవారేటప్పటికి యెక్కడికి పోయిందో పిల్చిరా.

బీబీ ఆమె చెప్పిన యిళ్లకు వెళ్లి చూచొస్తుంది. అమ్మ కనపడదు. దారిలో కొల్లిమర్ల సూరయ్య గారిని అడుగుతుంది. 'కరణంగారి అమ్మాయి యిటు పోయిందా?' అని.

సూరయ్య : సత్రం వెనకమూల చెర్లో స్నానం చేస్తున్నది. బాతులు, కొంగల్ని పెట్టుకుని ఆడుకుంటున్నది.

బీబీ వస్తుంది చెరువు దగ్గరికి.

అమ్మ బీబీ వచ్చేటప్పటికి తామరాకులు, తామర పువ్వులు, బాతులు, కొంగలు అమ్మచుట్టూ మూగి వుంటాయి. అమ్మ వాటిమధ్యలో వుంటుంది. సత్రానికి దూరం, చెరువుకు వుత్తరపు భాగం చెర్లోకి వాలిపోయిన చింతచెట్టు కొమ్మకింద. స్నానం చేస్తూ కూర్చుని వుంటుంది. దూరానికి కనపడక బీబీ చెట్టుకిందకు వస్తుంది. బాతులు కొంగలు మూగిన దాన్ని బట్టి.

బీబీ రాంగానె అమ్మ తలనీళ్లల్లోకి ముంచేస్తుంది. యీ ముంచేటప్పుడు చప్పుడు విని 'నేను చూచాలే, రా తలెత్తు, పైకి రా నీళ్లు తాగేవు' అంటుంది. అన్నా తలెత్తదు అమ్మ. నీళ్లల్లోనే మునిగి వుంటుంది.

బీబీ చెర్లోకి దిగి 'నీళ్లు మింగిందా యేం కనపడలేదే' అని లోపలకు దిగి వెతుకుతుంది చెయ్యి పెట్టి.

అమ్మ యింకా లోతుకు పోతుంది.

బీబీ వెతికి 'పిల్ల కనపడలా యెటయినా కొట్టుకు పోయిందేమొ యింటికి వెళ్లి చెపుదా'మని కట్ట ఎక్కుతుంది. వెనక్కు తిరిగి చెరువు వంక చూస్తుంది.

అమ్మ తలెత్తి చెరువు మధ్యలో కూర్చుంటుంది. పడుకున్నట్టుగా కనపడుతుంది. కొంగలు, బాతులు అన్నీ అమ్మ దగ్గరకు వస్తాయి.

బీబీ : అమ్మ దొంగ! కనపడవేం! అంటూ వస్తుంది. బీబీని చూచి చింతచెట్టు కనుక్కోలేదన్నట్టు తల వూపుతుంది. తామరపువ్వు 'యింతేనా' అన్నట్టు అంటాయి. 'తామరాకుపై నీటిబొట్టు లాంటి ఆటలన్నీ యింతే' అని 'నీటిలో వున్నామె కాని మాకేమి నీరు అంటవు' అన్నట్టుగా కదులుతాయి ఆకులు. కొంగలు, బాతులు 'యింతేనా నీ తెలివి, లోపలికి రా చూద్దాం. మేం కనుకున్నాం అమ్మ దగ్గరే వున్నాం. యిదిగో మా అమ్మ' అని వూరించినట్టు అమ్మవంక చూచి బీబీ వంక చూస్తాయి.

బీబీ లోపలికి వచ్చి 'రా రా యింటికిరా! మీ పిన్ని, నాన్న రమ్మంటున్నారు. నేను వెళ్లి చెపుతాను. నిన్ను యేమంటారో చూడు'.

అమ్మ : నన్నేమనరులే, ఫో నేను వస్తున్నా.

బీబీ "నీళ్లల్లో చేప వున్నట్టు వున్నావు" అని వెళ్లిపోతుంది.

అమ్మ : నీళ్లల్లో చేప వున్నట్టు వుంటమే, నీళ్లల్లో పాచి వున్నట్టున్నా.

బీబి వినిపించుకోకుండా వెళ్లిపోతుంది.

అమ్మ యింటికి వెళదామని బయలుదేర బోతుంది.

యింతలో కాకులు, కోయిలా కూడ వచ్చి స్నానం చేస్తాయి. దారే పోయేవాళ్లందరు 'కాకులు స్నానం చేస్తున్నాయి. యేదో అపశకునం అనుకుంటారు. గంగను తాకటానికి కొన్నింటికే అర్హత వున్నదేమొ' అనుకుంటారు.

కోయిల, కాకులు, కొంగలు, బాతులు, పూలు, తామరాకులు, నీరు, చింతచెట్లు, అన్నింటినీ ఒకేసారి చూస్తూవుంటే భిన్నత్వం లేని మనస్తత్వం గుర్తు వచ్చింది అమ్మకు. కొంగ, కాకి ఆడుకుంటూ వుంటె ముద్దు వస్తూ వుంది. అమ్మవంక కొంగ అరమోడ్పు కన్నులతో, తదేక దృష్టితో చూస్తూ వుంటుంది. కాకి నాకు నేనే యేకాకి అన్నట్టు తలవంచి ఒక కంటితో చూస్తుంది.

అమ్మ "బయలుదేరి వస్తానమ్మా. నేను సాయంకాలం వస్తా. మళ్లీ సాయంకాలం ఆడుకుందాం". అనగానె బాతులు అమ్మచుట్టూ ప్రదక్షిణంగా తిరిగి అవన్నీ నమస్కారం చేసినట్టుగా తలలు వూపి వెళ్లిపోతాయి. తక్కినవి అన్నీగూడ అమ్మకు నమస్కార సూచనగా తలలు వూపి వెళ్లిపోతాయి.

అమ్మ యింటికి వచ్చేస్తుంది.

సత్కాలక్షేపం :

అమ్మమ్మ : తెల్లవారేటప్పటికల్లా యెక్కడికెళ్లావు చెప్పకుండా?

అమ్మ : వూరికే కట్టకు వెళ్లాను. అక్కడ యెవరో స్నానం చేస్తుంటే చేయాలనిపించింది. అందులో వున్న బాతులు నన్ను పిల్చినట్టుగా వున్నాయి.

అమ్మమ్మ: మనుషుల్ని మనుషులే పిల్చుకోవటం చేతకావటంలేదు, బాతులు పిలుస్తయ్యా యేమిటి? ఒకటి అడిగితే ఒకటి చెపుతావేమిటి సమాధానం.

అమ్మ : నాకేమన్నా పని చెప్పు పిన్నీ యిక్కడే వుంటాను.

అమ్మమ్మ : పని అక్కర్లా, యేమి అక్కర్లా యింట్లో వుండు మీ నాన్నగారు కట్టకు తోడులేకుండా వెళ్లద్దు. నిన్ను తోడు తీసుకు వెళ్లమంటున్నారు. నీకు యింట్లో కాళ్లు నిలవవు.

సీతాపతి తాతగారు యింతలో విని గదిలోనుండి బయటకు వచ్చి : యింట్లోనే కాదు, భూమి మీద గూడ నిల్చేటట్టు కనపట్టల్లా.

అమ్మ యేమి మాట్లాడకుండా చల్లగా గుంజనానుకొని నుంచునుంటుంది.

సీతాపతి తాతగారు (బాధగా) : వాడు ఆతీరు, నీవు యీతీరు. రేపటినుండి కక్కయ్య బడి పెడుతున్నాడు. యింటిలో వుండలేకపోతె బడిలోకి వెళ్లు. తప్పకుండా మీ పిన్నితోపాటుగా వుండు యెక్కడికి పోయినా (అని బయటకు వెళ్లిపోతారు).

అమ్మమ్మ గారు మంచినీళ్లకు బిందె తీసుకుంటుంది. వాకిట్లోకి వెళుతుంది. అమ్మమ్మ వాకిట్లోకి వెళ్లగానె తాతగారు లోపలకు వచ్చి అమ్మను నిన్నుకూడా వెళ్లమంటె వెళ్లలేదేం?

అమ్మ : పొయ్యిమీద పాలు వున్నయ్యి గదా అని వూరుకున్నాను. యీ సారి బిందెకు వెళతాలే.

సీతాపతి తాతగారు : అంతా నీ యిష్టమేనా? చెప్పినట్టు చేయక్కర్లా. నేను యిక్కడ వుంటా, నీవు ఫో !

అమ్మ కాసేపు వేళ్లు నలుచుకుంటూ ఆలస్యం చేస్తుంది.

సీతాపతి తాతగారు : చెప్పేది నీకే. నువ్వు పోయిరా అంటారు.

అమ్మ మాట్లాడకుండా వెళుతుంది. అమ్మ బావి దగ్గరకు వెళ్లేటప్పటికి అమ్మమ్మ బిందె అక్కడ బెట్టి బయటకు వెళుతుంది. అమ్మ ఆమె వచ్చిందాకా వుండి అమ్మమ్మ, అమ్మ కలిసి నీళ్లు తీసుకుని యింటికి వస్తారు.

తాతగారు వీధివైపు చూస్తూ వుంటారు. వాకిట ముందరకు రాగానే బొక్కెన దాని చేతికి యివ్వక పోయినావు?

అమ్మమ్మ : యేం మోస్తుంది చిన్నపిల్ల.

తాతగారు : దాన్ని పంపించింది అందుకుగాదు అచ్చగా ఒకదానిని మోయలేకపోతావనేగా?

లోపలకు వెళతారు. వెళ్లేటప్పటికి పాలు పొంగి వుంటాయి.

అమ్మమ్మ : నేను చెప్పి పోలా యింటి దగ్గర వుండమని. పాలుచూడు యెట్లా పొంగిపోయినయ్యో

అమ్మ : నీకు తోడు వుండమన్నారని ఒంటరిగా వెళితే వచ్చాను.

యీ సమాధానం విని తాతగారు పక్కనే వుండి వింటూ వుంటారు. సమాధానం బాగుందని నవ్వుకుంటూ తలవూపి తాతగారు బయటకు వెళ్లిపోతారు.

అమ్మ : నా అబద్ధాల్లో గూడ కొంతమందికి సంతోషం వుంది.

అమ్మమ్మ : యేం మీ నాన్నగారు వెళ్లమన్నారా నిన్ను?

అమ్మ : నీవు వద్దన్నా. నీవు వద్దన్నావని చెప్పానా మీ యిద్దరు చెప్పినట్టు నడుచుకోక తప్పదు. ఒకరు అన్నవి ఒకరికి తెలియకుండా వుండాలి. 'అమ్మ వంటయింట్లోనె కూర్చుంటుంది'.

అమ్మమ్మ "నేను వచ్చేటప్పటికి యీ తోటకూర తరుగు". ఆ మాట చెప్పి ఆమె బిందె తీసుకు వెళుతుంది.

ఆమెను కొంతదూరం పోనిచ్చి తాతగారు లోపలకు వస్తారు. లోపలకు వచ్చి కొంచెం పెద్ద పెద్ద కళ్లు చేసి "నీకు యెందాక చెప్పేది? బుద్ధిలేదు!"

అమ్మ : కూర తరిగి వెళతా నాన్నా.

తాతగారు : యేం - రావద్దన్నదా?

అమ్మ : అనలేదు. కూర తరిగి వెళదామని.

తాతగారు : తొందరగా వెళ్లు, లే అని రెక్క బట్టుకు లేవదీసి పంపిస్తారు.

అమ్మ రెక్క బట్టుకు బయటకు నెట్టేటప్పటికి గడప తగిలి పడుతుంది.

దొడ్లో పనిచేస్తున్న బీబీ గబగబా వచ్చి లేవదీసి, మోకాళ్లు కడిగి కొబ్బరినూనె రాస్తుంది.

తాతగారు : యేమిటి దెబ్బ తగిలిందా?

అమ్మ : తగల్లేదు.

బీబీ : తగలకేంలే తగిలింది. చెక్కు చూడు యెట్లా వూడిందో. కింద యిటుకరాయి వుంది గుచ్చుకుంది.

తాతగారు వచ్చి అమ్మను భుజాన వేసుకుని దించి, మెల్లిగా "పోయిరా అమ్మా, తగ్గిపోతుందిలే. యిదే చెప్పటం నీకు యెన్నిసార్లు బయటకు వెళ్లినాసరే కూడా వెళ్లు. వంకర చెప్పవద్దు. ఆపని యీపని".

అమ్మ వెళుతుంది.

అమ్మమ్మ నీళ్లు తోడుతూనే వుంటుంది.

అమ్మమ్మ : కూర యేంచేసి వచ్చావు?

అమ్మ : తరిగే వచ్చాను. యింకా యేమయినా వుంటే మళ్లీ వెళ్లి తరుక్కోవచ్చులే. బొక్కెన ఒక్కదానివి మోయవద్దు. (బొక్కెన అమ్మ తీసుకుంటుంది). బొక్కెనతో కాసిని నీళ్లకూడ తోడియ్యి.

అమ్మమ్మ : వొద్దులే, మొయ్యలేవు.

అమ్మ : చెంబుడు నీళ్లు యింతకంటె యెక్కువ బరువు వుంటయ్యా (అంటే యిద్దరి మధ్య నలిగిన దానికంటేనా) అని.

అట్లా ఒక నెలా, రెండు నెలలు గడుస్తాయి.

తాతమ్మ యింకా రాలేదు.

అమ్మకు 10 సంవత్సరాలు పూర్తి అయి 11వ సంవత్సరం ప్రారంభం అవుతుంది.

ప్రతిరోజు మహాలక్ష్మమ్మ వారి పురంలోకి వెళ్లటం, భజన చేయటం, మంత్రపుష్పం చెప్పటం. శుక్రవారం, శనివారం బ్రహ్మాండం భూషయ్యగారి యింటికి భజనకు వెళ్లేది. శనివారం రాత్రిపూట పులిపాక భావన్నారాయణ గారింటిలో వాసుదాసు గారి కీర్తనలతో, భజనలు చేస్తూ వుండేవారు. అమ్మ అక్కడకు వెళ్లి చెపుతూ, చేస్తూ వుండేది. అట్లా క్రమంగా వూరంతా ప్రతి యింట్లో భజనలు చేస్తూ వుండేవారు. ప్రతి యింటికి అమ్మ వెళుతూనే వుండేది. వెళ్లకపోయినా పిలిపించేవారు. యే కీర్తనయినా యెవరయినా మొదట చరణం చెప్పాక రెండో చరణం అమ్మ చెప్పుతుంటే అంతా ఆశ్చర్యపడేవారు. ఆశ్చర్యపడి 'యీ అమ్మాయి భలే ఆర్తితో చేస్తుంది' అనేవాళ్లు. యెన్ని గంటలయినా విసుగు లేదు, రాని పాటలేదు అని మురుసుకుని 'కాబోయే నా కోడలు గాదు' అని బ్రహ్మాండం వర్ధనమ్మ గారు అనేది. (నాన్నగారి పినతండ్రి భార్య) యెంత బాగా చేస్తున్నదో! యెంత ఆర్తితో చేస్తున్నదో అని అంతా అనుకుంటుంటె.

అమ్మ : యెవరి కోసం చేస్తాను, నాకోసం నేను చేస్తున్నా.

నగర సంకీర్తనకు కూడ వెళుతుండేది అమ్మ.

పోలంరాజు అక్ష్మీనారాయణగారు, అమ్మ, పులిపాక భావన్నారాయణ గారు, మన్నవ వెంకటేశ్వర్లు గారు, మన్నవ సీతయ్యగారు, మన్నవ రామచంద్రరావుగారు, మన్నవ రామబ్రహ్మం గారు యిట్లా దాదాపుగా 50 మంది నగర సంకీర్తన చేస్తూ వుండేవారు.

యింట్లో తాతమ్మ గారు సర్వకాల సర్వావస్థల యందు పాటలు, తత్వాలు, అద్వైత విచారణ చేస్తూ వుండేవారు.

వూరు ముందర మన్నవ హనుమంతయ్యగారు ఉపనిషత్తులు, భగవద్గీత, వేద ప్రమాణంగా యెప్పుడూ పురాణం జరుగుతూ వుండేది.

అమ్మ బాల్యావస్థలో మన్నవ స్థితి అది.

18. అద్వైత తరంగం

నాన్నగారి వివాహ ప్రస్తావన :

గంగరాజు చలపయ్యగారు చాల పాడుపనులు చేస్తూ వుండేవారు. చాలా మూఢుడు. అట్లాంటివాడు యీ నగర సంకీర్తన, యీ నామము విని తను హరిదాసు వేషము వేసుకుని ప్రతిరోజు మూడు గంటలకు లేచి తంబుర, భజన చెక్కలు పట్టుకుని గ్రామమంతా తిరుగుతూ సంకీర్తన చేసేవారు. యింటి దగ్గర వున్నప్పుడు తను, భార్య కలిసి యెప్పుడూ సంకీర్తన చేస్తూ వుండేవారు.

అమ్మ, మన్నవ కృష్ణశర్మ గారి కూతురు మహలక్ష్మమ్మ గారు, మునుపల్లి వెంకటేశ్వర్లు గారి కూతురు నాగరత్నమ్మగారు, తరుచుగా యీ ముగ్గురు యెక్కడయినా కలిసి పాడటం జరుగుతూ వుండేది.

మరిడమ్మ తాతమ్మ గారు వూరునుంచి వస్తారు. వస్తూ లోకనాధం బాబాయిని కూడ తీసుకు వస్తుంది.

అమ్మ, బాబాయి, బ్రహ్మాండం భూషయ్య గారి కుమారుడు సుబ్బారావు, పులిపాక శంకర్రావు, యీ నలుగురు కలిసి ఆడుకుంటూ వుండేవారు. యెక్కువగా లోకనాధం బాబాయి (నాన్నగారి తమ్ముడు) అమ్మ ఆడుకుంటూ వుండేవారు.

అమ్మ అంటే లోకనాధం చాల ప్రేమగా వుండేవాడు.

లోకనాధం : నీకు నేను చదువు చెపుతా, చెప్పించుకుంటా?

అమ్మ : చెప్పు లోకం.

లోకనాధం : నీకు ఓనమాలు అన్నా వచ్చునా?

అమ్మ : ఓం నమఃశివాయః వస్తే చదువంతా వచ్చినట్టే అంటే వూరికే రావటం కాదు: అర్ధంతో వస్తే!

లోకనాథం : అర్థం అంటే?

అమ్మ : అర్థమంటే అర్థం కానివాడికి, నాకేమి చదువు చెపుతా!

లోకనాథం : నీ కక్కయ్య (కక్కయ్య అంటే పినతండ్రి) గారి బళ్లోకన్నా వెళ్లి చదువుకో.

అంటూ వుండగానే అమ్మ పినతండ్రి గారు వచ్చి "మన బళ్లోకి రామ్మా! పిల్లలు తక్కువయినారు". అమ్మ సరే వస్తానని పదిరోజులపాటు బళ్లోకి వెళుతుంది. అక్కడ పది రోజుల పాటు చదువుకుంటుంది.

అ పది రోజుల పాటు చదువు చెప్పి రెండో క్లాసు అంటాడు. తరువాత స్కూలు గ్రాంటు రాకుండా పోతుంది.

అమ్మ తాతమ్మ మాఘస్నానాలు ప్రారంభిస్తారు. స్నానాలు చేసి యింటికి వచ్చేసరికి గుంటూరు నుంచి నాన్నగారు వచ్చి వుంటారు. యింటర్ రెండో సంవత్సరం పూర్తి చేస్తున్నారు.

"యీ చదువు పూర్తికాగానె నేను పూరికెళతాను. నాకు పైకం కావాలి చాలదు" అని తన బాధను గురించి చెప్పటంలో అన్నానికి కూడ యిబ్బంది పడుతున్నట్టుగా చెపుతారు. నాన్నగారు మాట్లాడి యివతలకు వచ్చిన తరువాత అమ్మ తాతమ్మ దగ్గరకు వెళ్లి, "తాతమ్మ, బావ చాల బాధలు పడుతున్నా నంటున్నాడుగా. నీ డబ్బు అయిపోయిందిగా, నా మెళ్లో వస్తువు యేదైనా ఒకటి తీసి యివ్వమంటావా?"

తాతమ్మ : సరే ఇయ్యి!

అమ్మ "నువ్వే ఇయ్యి" అని తాతమ్మ చేతికి యిస్తుంది గొలుసు.

తాతమ్మ నేను వొద్దులే అమ్మా నువ్వే ఇయ్యి.

అమ్మ : నాకు భయం.

తాతమ్మ : భయంలేదు, యేమీ లేదు, నేను పిలుస్తాను నీవు చేతిలో పెట్టు (అని పిలుస్తుంది).

నాన్నగారు వస్తారు నాన్నగారి చేతిలో పెట్టి "యేమన్నా చేసుకో కష్టపడకుండా వాడుకో" అని అమ్మ వెళ్ళిపోతుంది.

నాన్నగారు : నాకు యీ పరీక్షలు కాంగానే మామయ్యతో వచ్చి మాట్లాడుతాను అని తాతమ్మ గారితో చెపుతాడు.

తాతమ్మ : యిప్పుడే చెప్పి పో!

నాన్నగారు "సరే సాయంకాలం కూడ వుండి మాపిటికి చెపుతాను". సాయంకాలం దాకా వుండి సీతాపతి తాతయ్యను అడుగుతాడు. "నాకు పరీక్షలు కాంగానే సికిందరాబాదు పోతాను. అక్కడ "ములికీ సర్టిఫికెట్" సంపాయించు కోవాలి. పెళ్లి చేస్తానంటే అయిం తరువాతనే వెళతాను. వెళ్లిం తరువాత నీకు యెపుడెపుడు అవకాశముంటె అప్పుడు కబురు చేయి మామయ్యా" అంటారు.

సీతాపతి తాతగారు : నా చేతిలో యిప్పుడు డబ్బులేదు. యిప్పుడప్పుడే నాకు చెయ్యాలని లేదు.

నాన్నగారు: సరే వెళ్లొస్తాను. నా పరీక్షలు కూడా యింకా ఆరు మాసాలున్నాయి. యీ ఆరు నెల్లు కూడ సరిగా సాగుతుందో లేదో అనుమానంగా వున్నది. (తాతమ్మ గారి దగ్గరకు వచ్చి) మామయ్య నడిగితే యిట్లా అన్నారు అని అన్నవన్నీ చెపుతారు.

తాతమ్మ : పోనీలె నాయనా అసలు యిస్తానన్నాడు. గదా ! యివాళ కాకపోతే రేపు.

నాన్నగారు : నాకు అక్కడ సంబంధాలు యిల్లటం తీసుకెళతామని వస్తున్నాయి. అమ్మ వొప్పుకోటం లేదు.

తాతమ్మ : సరి, నీవా తండ్రి లేనివాడివి, అది తల్లి లేనిది. యేదో యిద్దర్ని పెంచాను. రాసిపెట్టి వుంటె అవుతుంది లేకపోతె లేదు.

నాన్నగారు : యేది యెట్లా వున్నా అనసూయ నన్నే చేసుకుంటా నన్నదని సుందరి, ఆదిలక్ష్మి చెప్పారు. భారతి కూడ అన్నది. అమ్మ యెవరిని వద్దనటం ఒక కారణం, అనసూయ చేసుకుంటా ననటం ఒక కారణం, ఆలోచన లేకపోతే నా స్థితికి మంచి సంబంధాలె వస్తాయి. చాలా చక్కని పిల్లలు కూడా యింతకంటె యెంతో బాగుంటారు. మన కుటుంబాన్ని కూడ భరిస్తా మంటున్నారు. అసలు అన్నదో లేదో కనుక్కో!

తాతమ్మ : సరే నాయనా మీ యిష్టం. నీకు చెప్పిన వాళ్లనే కనుక్కోమను. యిచ్చేవాడిది ఆయన యిష్టం. చేసుకునేవాడివి నీ యిష్టం. ఆ పిల్లని నీ చేతిలోనే పెడితే, నా చేతిలోని కాని నీ చేతిలో బెట్టి యిద్దరిని చూచుకుని బ్రతకాలని వుంది. సరే యెట్లా జరగవలెనని వుంటే అట్లా అవుతుంది.

ఈ యిద్దరు మాట్లాడుతుండగా సీతాపతి తాతగారు వస్తారు.

సీతాపతి తాతగారు : నీకు యిదివరకే చెప్పా. యింటర్ అంటే సామాన్యం గాదు కష్టం. డబ్బు లేదు. పొగాకు కంపెనీలో నన్నా చేరు. నెలకు ముప్పై

రూపాయలు వస్తాయి. లేకుండా కర్ణీకమన్నా చేసుకోమని చెప్పా. ఆ రోజుల్లో నామాట వినాలనిపించలా.

నాన్నగారు : అందరూ తలాకాస్త సహాయం చేస్తానంటె చేరా, లేకపోతే ఆపని చేసి వుండేవాడిని.

తాతమ్మ గారు : యేది ప్రాప్తమున్నదో. అది జరుగుతుందిలే, కొండలాంటి తండ్రి పోయాడు.

అమ్మ తాతమ్మతో లోపలకు వచ్చిన తరువాత "తాతమ్మా కొండలాంటి తండ్రి అంటావేమిటి? తండ్రే కొండ!"

సీతాపతి గారు "సరే నీ యిష్టం. నాకెందుక"ని విసుగుతో వెళ్లిపోతారు.

నాన్నగారు : ఆయన చాలా విసురుడుగా వున్నారు. నేను వెళ్లివస్తా నాయనమ్మా. బాబాయి గారింటికి వెళ్లి వారితో చెప్పి వెళతాను.

తాతమ్మ : (చిన్నబుచ్చుకుని) సరే పోయిరా నాయనా! యేం చేస్తాం?

తాతమ్మ : అమ్మా! నీవు రోజూ ఇంట్లో వుండటం లేదు ఎందుకని?

అమ్మ : ఇంట్లో వుంటే ఒక పిన్నికీ, నాన్నకీ తోడు, బయటకు వెళితే చెట్లకు, చేమలకు, పిట్టలకు అనేక వాటికి తోడుగా వుండవచ్చు!

తాతమ్మ : నీకు ఏం చెప్పిపోయినాను నేను?

అమ్మ : నాకు వున్నవే చేయగల్దును గాని, మీరు అన్నవన్నీ చేయలేను. అయినా నాకన్నా పెద్దవాళ్లకు నా తోడేమిటమ్మా. నాకే వారి తోడుండాలి. రెండూ ఒకటే అర్థం. నాతోటి వారున్నా సరే వారి తోటి నేనున్నా సరే!

తాతమ్మ : యేమిటో అన్నీ పెద్ద పెద్ద అర్థాలతో మాట్లాడుతావు.

అమ్మ : నన్ను పెంచేది యెవరు?

తాతమ్మ : భగవంతుడు పెంచుతున్నాడు.

అమ్మ : అట్లయితే నీవు భగవంతుడివా? అట్లయితే నేను భగవంతుడ్నని చెప్పరాదూ, పాటలు, పద్యాలు యెందుకు వాళ్లకు చెప్పావు?

తాతమ్మ : ఇందాక చెప్పావుగా నువ్వు చెప్పినవి చేయలేను. వున్నవి చేస్తాను అని.

అమ్మ : తాతమ్మా నీవు తలుపేసి చెపుతుంటావే యేమని చెప్తావు వాళ్లకి?

తాతమ్మ : తప్పమ్మా అట్లా అడుగకూడదు.

అమ్మ : నేనుగూడ లోపలకు వస్తే తలుపులు వేసి నాకుగూడ చెపుతావా?

తాతమ్మ : పెళ్లయిందాక పనికిరాదమ్మా!

అమ్మ : పెళ్లయింతర్వాత ఇంకా ఇవన్నీ ఎందుకు? పెళ్లిలో బ్రాహ్మణే చెపుతారుగా. వాళ్లు చెప్పినవన్నీ ఆచరించవద్దా?

తాతమ్మ : వేరే యేమీ అక్కర్లా. భర్తను దేముడుగా చూసుకుంటే చాలు!

అమ్మ : యీ ఫోటోలో వున్నట్లు చూడమంటావా? ఫోటోను చూచినట్లు చూడమంటావా? ఫోటోను చూచినట్లు చూస్తే గోడకు వెయ్యాల్సిందే. ఫోటోలో చూచినట్లు చూస్తే కిరీటాలు, బాణాలు, తప్పితే తొడమీద కూర్చొవటం, యెప్పుడూ తొడమీద కూర్చోవాల్సిందేగా?

తాతమ్మ : (పెద్దగా నవ్వుతూ) మలప సన్నాసి నేర్చుకున్నావు మాటలు! గాజు గోలీకాయల్లె. వుండి వుండి అట్లా ఒక అరగంట నవ్వుతుంది. నవ్వు ఆపుకుని నీకు యెట్లా తోస్తయి ఇటువంటి మాటలు.

అమ్మ : అవతల వారు అడిగే మాటలను బట్టి నాకు ఇటువంటివి వస్తుంటై.

ఇంతలో గరికపాడు నుండి మనిషి వస్తాడు వుత్తరం తీసుకుని, ఉత్తరం వాకిట్లో అందుకుని తాతగారు తీసుకొచ్చి తాతమ్మకు చదివి వినిపిస్తాడు. అందులో చిన్నత్తయ్య రెండో కూతురికి సుస్తీగా వున్నట్లుగా వుంటుంది. అందులో అమ్మమ్మను పంపించమని, తాతయ్యను రమ్మని, అవకాశముంటే తాతమ్మను గూడ రమ్మని వ్రాస్తారు.

తాతగారు : అది ఒక్కతే చేసుకోలేకుండ వుందేమొ. నేను, నాభార్య వెళతాము. నీవు ఇంటిదగ్గర వుండు. అని తాతమ్మతో అంటారు.

అమ్మమ్మ : అనసూయను గూడ తీసుకెళతాము.

తాతమ్మ: సరే తీసుకెళ్లండి. తోడుగా వుంటుంది నీకు.

చాకలి బుచ్చమ్మ అలౌకికానుభూతి :

పెందలాడి 9 గం॥కల్ల భోజనాలు చేసి, అమ్మమ్మ, తాతయ్య, అమ్మ ముగ్గురూ వూరుకెళతారు. సాయంకాలం 4 గం॥లకు గరికపాడు చేరుతారు. పోగానే అన్నం తినమంటారు. బిందె చేతికిస్తారు. మంచినీళ్లకు కృష్ణకాలువకు వెళ్తారు. కాలవ పోనూ, రానూ 4 మైళ్లు వుంటుంది. అమ్మమ్మ ఒక్కతే తేలేదని "నీవుకూడా

పోయి తీసుకురా" అని అందరూ అంటారు. అమ్మ మేనత్త కూతురు సుందరమ్మ అని అమ్మ యీడు పిల్ల వుటుంది. "ఆ అమ్మాయి చెల్లెలికి సుస్తీగా వుందని యేడుస్తున్నది. నువ్వున్నూ, మీ పిన్నీ పోయి తీసుకురండమ్మా" అంటారు సీతాపతి తాతగారు అమ్మతో.

అమ్మ యేమీ మాట్లాడకుండ బిందె చంకను బెట్టుకుని నీళ్లకు వెళ్తుంది. అట్లా పొద్దున రెండూ, సాయంత్రం రెండూ రోజుకు మనిషికొక్కరికి 4 బిందెలు నీళ్లు తెస్తారు. ఇంటికొచ్చిన తరువాత మళ్లీ చెరువుకెళ్లి నీళ్లన్నా తీసుకొస్తారు. ఇట్లా పది రోజులు జరిగిన తర్వాత అమ్మాయికి జబ్బు తగ్గుతుంది. ఒకరోజు మధ్యాహ్నమప్పుడు అమ్మ, అమ్మ మేనత్త కూతురు సుందరమ్మ బయటకు వెళతారు. ఆవూరి చివర చాకలి బుచ్చమ్మగారి మఠము వుంటుంది. ఆమె తమ్ముడు యెల్లమంద అనే అతను వేదాంతులమని, గురువులమని బ్రహ్మంగారి తత్వాలు పాడుతూ అన్నపూర్ణ కావిడితో మఠాన్ని వృద్ధిలోకి తీసుకొచ్చారు.

కోపదారిగా కనపడేది, చాలా నిజాయితీ గల మనిషి బుచ్చమ్మ. నోటివెంబడి యెప్పుడూ నీతి వాక్యాలు వస్తూ వుండేవి. రోజూ గుడ్డలకు వచ్చేటప్పుడల్లా యేవేవో వేదాంత విషయాలు చెప్పి, ఒక గంటసేపు కూర్చుని సూర్యనాడి, చంద్రనాడి నడకలని చెపుతూ జరగబోయేది చెపుతూ వుండేది. సూర్యనాడి చంద్రనాడి అంటే ముక్కు దగ్గర వేలు పెట్టుకుని గుర్తించి ఏవైపు శ్వాస వస్తే ఆ నాడి అనేవాళ్లు. కుడివైపు సూర్యనాడి అని, ఎడమవైపు చంద్రనాడి అని అనేవాళ్లు. దాన్నే స్వర శాస్త్రమంటారు. గుడ్డల కొచ్చినప్పుడల్లా అమ్మను మా మఠానికి రామ్మా, ఒకసారి చూచి పోదువుగాని అనేది.

అమ్మ యెటూ వూరు బయటకు వచ్చాం గదా అని ఆరోజు ఆ మఠానికి వెళతారు. అక్కడికి పోగానే సుందరమ్మ "యేం బుచ్చమ్మా ఇంతకాలం నుంచి నేను యీ వూళ్లో వుంటుంటే నన్ను పిలవలేదేం" అంటుంది.

బుచ్చమ్మ : యెందుకోనమ్మా ఆ అమ్మాయిని చూడగానే పిలవాలనిపించింది. ఆ పిలుపులో చూడు నీవు బుచ్చాం అంటావు. ఆ అమ్మాయి అమ్మ అంటుంది. లేకపోతే బుచ్చమ్మ అంటుంది. చాకళ్లుగా చూడదు. అయినా మీరు చాకలిళ్లకు వస్తారా?

"మా యెక్కువేం? ఆమె తక్కువేం? ఆమె రాంగా మేమెందుకురాము?" అంటుంది సుందరి.

బుచ్చమ్మ : అసలు మాట చెప్పమంటావా? ఆమె గుడ్డలు విప్పి వేస్తే ఆ గుడ్డలు ముడుచుకుంటుంటే యెంత పరిమళమో వచ్చింది. (బుచ్చమ్మ

అనసూయను చూపిస్తూ) యేవన్నా అత్తర్లు రాసుకుందేమో ననుకున్నాను. పోనీ రాచుకున్నది యెంతసేపు వుంటుంది. యెన్నాళ్లుంటుంది. అని నాకు తెలియదూ. గుడ్డలు వుతుకుతుంటే చెరువంతా వాసన వచ్చింది. చెరువులో ఆ నీళ్లు పడే ఆవాసన వచ్చిందే అనుకోండి. వాసనే రకరకాలు (సువాసన్లే) ఒక్కొక్కసారి మరీ ముక్కుదగ్గర పెట్టనంతగా సంపెంగ వాసన వచ్చింది. గుడ్డలిచ్చి ఇంటికొచ్చిన తరువాత నేను యోగంలో కూర్చుంటే మొగలిపూల వాసనతో నేను వుతికిన పరికిణీ, చొక్కా మడతబెట్టి నాముందర బెట్టినట్లు, ఆ గజ్జల పట్టాలతో గల్లు గల్లు అనుకుంటూ వచ్చి చొక్కా పరికిణీ తొడుక్కుంటున్నట్లు కనిపించింది. వెంటనే నేను చెయ్యి జాచినట్లు జడ కుప్పెల జడ అమ్మవారి నలంకరించినట్లుగా అలంకరణ గిరగిరా తిరుగుతూ తనతో పాటుగా తన జడ తిరుగుతుంటె అ పరికిణీ గుమ్మటాలు మల్లే లేచి, ఆ చిన్ని చిన్ని చేతులు ఆ చక్కని పాదాలు భూమిమీద తిరుగుతుంటే అసలు ఆ పాదాలే వేరు. ముఖముకంటె గూడ ఆ పాదాలు చూడ ఎంత బాగుంటయ్యో. ఆ పాదాల్లో నానీడ కనపడ్డది. చివరకు వచ్చి అమాంతంగా నా ఒళ్లో కూర్చున్నట్లుగా స్పర్శ తగిలింది. కళ్లు తెరిచాను. అదికాగానే మన ఇంటికి రావాలనిపించింది. రాత్రికి మీ యింటికి వచ్చిన కారణం అదే వచ్చేటప్పటికి మీరు చీకట్లోనే కూర్చున్నారు గదా సుందరమ్మ గారు. మీరు ఇద్దరూ కలిసి కూర్చున్నప్పటికీ అమ్మ ముఖంలో కాంతి కనపడింది. ఇక్కడ యే రూపంలో చూశానో, అక్కడ ఆ రూపంతో దర్శనమిచ్చింది. అటువంటి తల్లిని ఇంటికి తీసుకొచ్చి కూర్చోబెడదామనుకున్నా. అసలు నే పిలవటమేమిటి? అదివరకే వచ్చి వున్నదిగా. రాకపోతే పిలవాలనిపించేది గాదు. తనువచ్చి పిలిపించుకున్నది.

అమ్మ యేమీ మాట్లాడకుండా కూర్చుంటుంది. సుందరమ్మకు అన్ని మాటలు అర్థం కావు. అమ్మను యేదో తనకంటె యెక్కువగా చూస్తున్నదని బాధగా వుంటుంది.

బుచ్చమ్మ (అమ్మతో) : అమ్మా! యీ ఆవరణంలో యీ ప్రదేశమంతా తొక్కి చూడమ్మా. నేను తాటకం చూట్టం మా గురువుగారు నేర్పారమ్మా.

అమ్మ : తాటకం అంటే ఏమిటమ్మా?

బుచ్చమ్మ : ఏమీలేదమ్మా ! తన కంటిలో తనను చూచుకోవటం. (సుందరమ్మను రమ్మనదు అమ్మను చెట్ల చాటుకు తీసుకెళ్లి) నాకు "సోహం" భావం కూడ తెలుసమ్మా.

అమ్మ : "సోహం భావం" తెలిసేదేమిటి? 'సోహం' అంటే ఏమిటి?

బుచ్చమ్మ : మా గురువుగారు యెవరికీ చెప్పద్దన్నారమ్మా! నిన్ను చూస్తూ చెప్పుకోవాలనిపిస్తున్న దమ్మా. గురువుకు గురువేమో అనికూడ అనిపిస్తున్నది. యీ చాకలిముండకు అటువంటి గురువు దొరకటమే కాకుండా ఆ గురువు కటాక్షం వల్ల యీ తల్లి దర్శనమయింది అని రెండుపాదాల మీద పడుతుంది. అరగంటసేపు లేవదు. లేచిన తరువాత కూర్చుని మాట్లాడకుండ అమ్మవంక తదేకదృష్టితో గంటసేపు కూర్చుంటుంది.

సుందరమ్మ అమ్మను పేరుబెట్టి రెండుసార్లు పిలిచి, "నేను వెళ్లిపోతున్నా పో. వుండు ఇంటికి పోయి చెపుతాలె" అని కోపంగా వెళ్లిపోతుంది.

అమ్మ బుచ్చమ్మ బాగా మాట్లాడినదాక వుండి సుందరమ్మ వెళ్లిన గంటకు వెళ్లటానికి బయలు దేరుతుంది. కూడా బుచ్చమ్మ వస్తూ "అమ్మా ఇంకా ఏవేవో మంత్రాలను గురించి అడుగుదామను కున్నాను. కాని వద్దనిపిస్తున్నది. సందేహాలు తీరిపోయినయ్. యెందుకంటె నీకు దీన్ని గురించి (అంటె మంత్రాలను గురించి) చెప్పేటప్పుడు నీ మొఖం చుట్టూ చక్రం కోణాలతో తిరుగుతున్నట్లు, ఆ చక్రం లోపల సర్వము ఇమిడి వున్నట్లు కనపడింది. ఇంకా సందేహాలకు తావేదమ్మా? యేది మంత్రాలవల్ల పొందుదామను కున్నానో అది పొందాను. ఇంకా ఇక్కడ యెన్నాళ్లుంటా అమ్మా నీవు?"

అమ్మ : పెద్దవాళ్లు వుంచినన్నాళ్లూ.

బుచ్చమ్మ : నీకంటే పెద్దవాళ్లు ఎవరమ్మా? బ్రహ్మంగారు చెప్పినట్లుగా అన్నీ నీ కుక్షిలోనే వున్నై. చూచుకోరా అన్నారు. మా కుక్షిలో మేము యెటూ చూడలేము. అయినా బ్రహ్మంగారు చెప్పిన దానికంటె యెక్కువగా తోస్తున్నదమ్మా. యెవరి కుక్షిలో వారిని చూచుకోమన్నాడు గాని ఆయన అందరి కుక్షిలోనే నీవున్నావని ఋజువు చేయలా.

అమ్మ యేమీ మాట్లాడదు.

బుచ్చమ్మ : యేమీ మాట్లాడవేం అమ్మా! యెన్ని అడుగుతున్నా చెప్పవు?

అమ్మ : నేను చెప్పేదేముంది. అన్నీ నీవే చెబుతున్నావు. చెప్పినవన్నీ నిజమే. అందరిలో వున్నది నేననేదేగా! ఆ నేను "బ్రహ్మ!" నే చెప్పేది నేను బ్రహ్మ అనిగాదు. ప్రతివాడు సామాన్యంగా అం - నేనే - అంటారే ఆ 'నేనే' -బ్రహ్మ ఆ-నేనే - నేను. అం అంటాడే అది అహం. ఆ అహం లేకపోతే, 'హం' బ్రహ్మాస్మి కాలేదు. అహం చేతనే అహంకారాన్ని పోగొట్టుకుంటాడు. నేను భగవంతుడ్ని అయివుండి, నేను భగవంతుడ్ని తెలుసుకోవటమేమిటి అన్నదే అహాన్ని తెలుసుకోవటం! తన్ను తాను

గుర్తించిననాడు సర్వాన్ని గుర్తిస్తాడు. వున్నన్నాళ్లు వుంటాను. వున్నన్నాళ్లూ కనపడతాను. "నేను, నీవు" అని వున్నన్నాళ్లు కనపడతాను యీ గరికపాట్లోనే అనిగాదు.

బుచ్చమ్మ : యేది మాట్లాడినా కొండకి నాగలి పట్టించినట్లే!

అమ్మను బుచ్చమ్మ ఇంటిదాకా పంపించి వెళ్లిపోతుంది.

నిష్కార ప్రహసనం :

అమ్మ ఇంట్లోకి రాగానే అమ్మమ్మ దొడ్లోకి పిలిచి యెందుకు సుందర్ని కొట్టావట. అని అడుగుతుంది.

అమ్మ : నేను కొట్టలేదు పిన్నీ. అసలు యేమి చెప్పిందేమిటి?

అమ్మమ్మ : సుందరమ్మ చెప్పిన మాటలు - 'ఇంట్లో పడుకున్నదాన్ని యెక్కడికన్నా వెళ్లొద్దాం రమ్మని తీసుకెళ్లింది. వూరు బయటకు వెళ్లిన తరువాత అదిగో ఆ మఠంలోకి పోదామన్నది. అక్కడకు వెళ్లిన తరువాత ఇద్దరం కాసేపు కూర్చున్నాం. ఇంటికి పోదాం రమ్మంటే నేను రాను నువ్వు ఫో అన్నది. నన్నేమన్నా అంటారు ఇంటిదగ్గర. కొత్తమ్మాయిని యెట్లా వదిలిపెట్టావని, రమ్మని అన్నాను. అంటే కొట్టి, జుట్టంతా పీకింది అమ్మా' అని వాళ్లమ్మ దగ్గరకు వచ్చి యేడ్చింది. జుట్టు కూడ రేగివుంది. నిజంగా యేమి జరిగిందో చెప్పు.

అమ్మ : వాళ్లు నమ్మారా? ఆమాట?

అమ్మమ్మ : ఆఁ వాళ్లమ్మ, నాన్న మీ కనకమ్మత్తయ్య గూడ నమ్మింది. కొంచెం అనుమానంగా 'యే పిల్లల్ని కొట్టదే' అన్నది కనకమ్మ గారు. మీ సుబ్బమ్మత్తయ్య పెనిమిటి మాత్రం కొని తెచ్చుకున్నాం మా పీడ అన్నాడు. అత్తయ్య (సుబ్బమ్మగారు) పైకి యేమీ అనలేదు గాని అసలే ఒక బిడ్డకు జబ్బొచ్చి యేడుస్తున్నాం. దానికి యెట్లా చేతులొచ్చినాయి అన్నది. కనకమ్మత్తయ్య 'లోకం అదీ ఎన్నాళ్లనుండో ఆడుకుంటున్నారు. ఒక్కనాడు కూడ కొట్టలేదు' అన్నది. "కాబోయే నీ కోడలనా యీ మోజు. అయిన తరువాతగాని తెలియదు నీ పాట్లు" అన్నది దెప్పుతూ, సుబ్బమ్మత్తయ్య. నీవు వాకిట్లోకి రాగానే అసలు కొడతాడేమో ననుకున్నా మీ మామయ్య.

అమ్మ : కొట్టనియ్యి. యేమన్నా లోపాలుంటే దిద్దుకోవచ్చు. నాకు తెలియకుండా ఎన్ని తప్పులు చేస్తున్నానో. నన్నెంత కొడతాడో అందులో పదోవంతన్నా ఆ చేతికి తగలదూ?

అమ్మమ్మ : ఆయనకేం మొద్దు చేతులు. కొడతాడు. ఆయన్ను చూస్తేనే భయంగా వున్నది. ఆ అమ్మాయికి కొంచెం తగ్గిందిగా మనం వెళదామా?

అమ్మ : ఏమో మా నాన్న నడుగు.

అమ్మమ్మ : నాన్న నడిగినా వాళ్ల ఇష్ట ప్రకారం చేస్తారు.

అమ్మ : నువ్వు నాన్న ఇష్ట ప్రకారం చెయ్యి. నేను అందరి ఇష్ట ప్రకారం చేస్తాను. అంటే యెవరి ఇష్టప్రకారం చెయ్యనన్నమాట!

వీళ్లిద్దరూ దానిమ్మ చెట్టు క్రింద దొడ్లో మాట్లాడుకుంటారు. సుందరివిని "చూడు చూడు వాళ్లు తల్లి కూతురు యేంటో చెప్పు కుంటున్నారు చూడు నాన్నా".

శేషగిరిరావు గారు : (సుందరమ్మ గారి తండ్రి తొంగి చూస్తారు) యేమిటి మీరు చేసేది? దొడ్లో ఎక్కడా ఒక్క చుక్క నీళ్లు లేవు.

అమ్మమ్మ : (గడగడ లాడుతూ) పోదామమ్మా నీళ్లకు అని ఇద్దరూ చెరొక బిందె తీసుకుని నీళ్లకు బయలు దేరుతారు.

కనకమ్మ బామ్మ : చూచి, యిప్పుడేమి, నీళ్లమ్మా, పొద్దుబోయి భోజనాలు కూడ అయిపోతే.

అమ్మమ్మ : అన్నయ్య పోయి రమ్మంటున్నారు నీళ్లకు.

బామ్మ : వద్దులేమ్మా. ఆపు! రేపు ప్రొద్దున్న తెచ్చుకుందాం యెంత పెద్దవాడ్ని చేసుకున్నా అది చిన్నపిల్లే అనుకోవాలి. ఏళ్లకు చిన్నది, వ్యవహారానికి పెద్దది.

పడుకున్న తాతగారు లేచిపోయి తేనియ్యి నీళ్లు లేవేమొ. తాతగారు కూడ ఆ పదిరోజులు కొంచెం కష్టంగానే వుంటారు అమ్మమ్మ గారంటే. యెందుకటే పెట్టిన సొమ్మంతా తీసుకు రాలేదని పుట్టింటివారు అన్నారని పదే పదే సుబ్బమ్మ గారనటంతో అమ్మమ్మంటే కష్టంగా వుంటారు.

నీళ్ల బిందెలు ఆపేస్తారు.

సుబ్బమ్మగారు : ఒరే అన్నయ్యా యీ దండా, కంటె కూడ అమ్మేసి రెండు యకరాలు పొలం కొను. ఇవికూడ యే నువ్వు జీడీలు, వేరుశనగ కాయలు కొనుక్కోటానికి వాళ్ల నాయనల్లేనే అమ్ముకుంటుందేమొ. ఇంత నన్న చీరలెందుకన్నయ్యా. నేను నేయిస్తాను. ఇక్కడ సాలెవాళ్ల చేత. రెండు చీరలయితే సంవత్సరం గడుస్తాయి. యెప్పుడు యెవరు యేది చెప్తే నమ్మే స్వభావము సీతాపతి తాతగారిది. అందుచేత సుబ్బమ్మ గారి మాటలు నమ్మి అవి అమ్మి పొలం కొన్నదాకా కొంత చికాకుగా వుంటారు.

కొంచెం అమ్మమ్మ నోటి తొందర కావటంతో "మా నాన్నే తింటమే, మీలోగూడ వున్నారు" అంటుంది.

సుబ్బమ్మ గారు : మాలో యెవరూ చెయ్యలా.

అమ్మమ్మ : చిదంబర్రావన్నయ్య చేయలా! (ఆయన కూతురు సామ్ము)

సుబ్బమ్మగారు : చేసాడు మొత్తం వారికే పెట్టాడు.

అమ్మ : వూరుకో పిన్నీ, పెద్దవాళ్లకు యెదురు తిరిగితే అనేక రూపాల్లో వస్తుంది.

యీ సంభాషణ జరుగుతుండగానే మన్నవ నుండి సీతాపతి తాతగారి పినతండ్రి భార్య పోయినట్లు కబురు వస్తుంది.

మెప్పుకోరని నొప్పి :

తెల్లవారి అమ్మ, తాతగారు, అమ్మమ్మ, బామ్మపిల్లకు పథ్యం పెట్టారు గదా అని మన్నవకు బయలుదేరి వస్తారు. బామ్మ యీ పదిరోజులు మన్నవలో వుండి బాపట్ల వెళుతూ అమ్మను గూడ తీసుకెళ్తుంది. చిదంబర్రావు గారు యీ యిల్లు వదిలిపెట్టి రైలు అవతల వుంటారు. భారతాంబ గార్కి పూర్తిగా నయం కాలేదు.

అమ్మ - రోజూ ప్రొద్దున్నే 6 గంటలకు శేషగిరిరావు గారి హొటలుకి వెళ్లి ఇడ్లీ, కాఫీ తీసుకు రావటం 8 గం॥ లకు మార్కెట్టుకు వెళ్లి కూరలు కొనుక్కురావటం. మళ్లీ 2 గం॥లకు వెళ్లి అరటికాయ బజ్జీలు కాఫీ తీసుకురావటం. మధ్యకాలంలో పాపత్తయ్యను యెత్తుకోవటం. భారతి పిన్నికి కాళ్లు పిసకటం.

ఒకరోజు మధ్యాహ్నమప్పుడు కాఫీ, బజ్జీలు తెస్తూ వుండగా రైలు వచ్చి ఆగింది. పట్టాలు దాటటం ఆలస్యమవుతుంది. రైలు పోగానే తొందర, తొందరగా ఆలస్యమైందనే భయంతో పట్టా దాటబోయి తీగ తగిలి పడి ఫ్లాస్కో పగులుతుంది. చేతిలో వున్న బజ్జీల పొట్లాం యెగిరి రెండు గజాల దూరంలో పడుతుంది. అది కాస్తా కుక్క యెత్తుకుపోతుంది. మోకాళ్లన్నీ కొట్టుకు పోతై. గాజులన్నీ వంకరబోతే యెవరో వచ్చి 'అరె అరె పెద్ద దెబ్బ తగిలింది పాపం' అని లేవదీసి మోకాళ్లు సవరిస్తారు. అమ్మ లేచి మెల్లి మెల్లిగా పట్టాలు దాటి అక్కడే ఒక ఇసుక దిబ్బమీద కూర్చుంటుంది. రాత్రి 7 గం॥లయింది. ఇంటికి పోలేదు.

చిదంబర్రావు గారు యేమయిందోనని బయలుదేరి వస్తారు. వస్తారుగాని అమ్మ కూర్చున్న చోటికి రాక స్టేషన్‌లో గుండ బజారుకెళ్లి రెండు మూడు హొటళ్లల్లో విచారిస్తారు. అక్కడ కనుపించలేదు. చివరకు పుత్తే శేషగిరిరావు హొటల్‌కి వస్తాడు.

శేషగిరిరావు : మీ అమ్మాయి అని తెలియదు గాని రోజూ ఒకమ్మాయి వచ్చి వెళ్తూ వుంది. ఆ అమ్మాయి ఈ రోజు గూడ వచ్చి వెళ్లింది.

చిదంబర్రావు : ఎంతసేపయింది ఇక్కడకు వచ్చి వెళ్లి?

శేషగిరిరావు : మామూలుగా రెండున్నరకు వస్తుంది. అయినా ఎందుకు ఆ అమ్మాయికి అంత సొమ్ము పెట్టి తిప్పుతారు?

చిదంబర్రావు గారు అతనికేమీ సమాధానం చెప్పకుండా తిరిగి వచ్చేస్తారు. యీ లోగా తాతగారి దగ్గర వుండే గుమాస్తా ముక్తినూతలపాటి శ్రీరాములు గారు అమ్మ దగ్గరకు వచ్చి "యేమమ్మా ఒక్కదానివి కూర్చున్నావు. ఇంటికి పోదామా. ఒంటరిగా కూర్చుందామని వచ్చావా యేమిటి?" ఆయనగారికి పిల్లలు లేరు. అమ్మ అంటే ప్రేమగా వుండేవారు. అవకాశమున్నప్పుడల్లా ఎత్తుకునేవారు. కానీ, అర్ధనా ఇస్తుండేవారు. అది తీసుకెళ్లి అమ్మ యే కుంటివాళ్లకో, గుడ్డివాళ్లకో ఇచ్చుకుంటుండేది.

అమ్మ వంటరిగా కూర్చోవడం చాలా ఆశ్చర్యపడి "యేవమ్మా, యేమిటి చాలా దిగులుగా వున్నావ్".

అమ్మ : యేం లేదు. నేను తీసుకెళ్లే వస్తువులు భారతి పిన్ని గొంతన్నా దిగలేదని దిగులుగా ఉంది.

శ్రీరాములు : యేం జరిగిందేమిటి అసలు?

అమ్మ ఫ్లాస్కు పగిలిపోయిన ముక్కలన్నీ దగ్గరపెట్టుకుని వుంటుంది. ఆ కుప్ప చూపించి "బాబాయ్ నేనొక్క పనిచెప్తా. చేసిపెడతా?"

శ్రీరాములు : నీవు చెప్పటం, చేయక పోవటమూనా? యేమిటమ్మా చెప్పు

అమ్మ : యేమీలేదు. నన్నేమీ అనకుండా ఉంటే చెపుతా. (గాజు తీసి చేతులో పెట్టి) నాకు కొత్త ఫ్లాస్కు కావాలి. అది యెఱ్ఱని యెరుపుగా వుండాలి.)అని అమ్మ చేతి గాజు తీసి చేతిలో పెట్టి) మాట తప్పనన్నావుగా తీసుకో. ఇది తీసుకుని ఒక ఫ్లాస్కు కొనిపెట్టు.

శ్రీరాములు : అన్నీ వింటాను గాని, ఇది విననమ్మా.

అమ్మ : నేనడిగిందే ఇది. నేను మధ్యాహ్నం మూడు గంటలకు ఇల్లు చేరవలసిన దానను. ఇంతసేపు ఇక్కడ కూర్చున్నానంటే మళ్లీ ఇంటికి ఎట్లా వెళ్లాలో తెలియటంలా.

శ్రీరాములు : ఫ్లాస్కులు ఈ వూళ్లో ఏ షాపులవాళ్లు తెప్పించరు. తెప్పిస్తే ఒక రాఘవరావు తెప్పించాలి. పోయి కనుక్కొస్తాను ఇక్కడ కూర్చో (అని వెళ్లి కనుక్కుంటాడు).

రాఘవరావు : షాపుకని తెప్పించ లేదండి. ఇంట్లోకని తెప్పించాను (అని ఇస్తాడు. అది యెరుపు రంగుదే అవుతుంది).

శ్రీరాములు గారు ఫ్లాస్కు తీసుకుని అమ్మ దగ్గరకు వస్తాడు.

అమ్మ : ఇందులో కాఫీ పోయించుకురండి. ఇంటికి తీసుకెళ్తా.

శ్రీరాములు : ఈ పూటకాదమ్మా. యీపూట మా యింటికి వచ్చి పడుకుని రేప్రొద్దున కాఫీ పోసుకుని, ఇడ్లీ తీసుకుని ఇంటికి వెళ్దువుగాని. నేనుగూడ వచ్చి దిగవిడిచి వస్తా.

అమ్మ : ఆ దించేది ఈ పూటే దించండి.

శ్రీరాములు : మీ పిన్ని ఎన్నాళ్లనుండో నిన్ను తీసుకు రమ్మంటున్నది. ఇదొక కారణంగా నన్నా మా యింటికి తీసుకు వెళ్లటం జరుగుతుంది. మా యింటికి పోదాం రా.

అమ్మ : మరోసారి తాతగార్ని అడిగి నాలుగు రోజులు అట్టే పెట్టుకుంటానని తీసుకెళుదువుగాని ఇప్పుడుగాదు.

శ్రీరాములు : సరే నీ ఇష్టం!

అమ్మ : కోపంగా అంటున్నారా?

శ్రీరాములు : నేను చెప్పిందాక ఇక్కడే వుంటావా? అట్లాయెందుకు? ఇద్దరం ఇంటికివెళ్లి తాతగారికి చెప్పి తీసుకెళ్లమంటే తీసుకెళతాను. పద ఇంటికి వెళదాం.

శ్రీరాములు గారు, అమ్మ కలిసి తాతగారి ఇంటికి వెళతారు. అమ్మ సరాసరి లోపలకు వెళ్తుంది.

శ్రీరాములు గారు హాల్లోకి తాతగారి దగ్గరకు వెళ్లి నుంచుంటారు.

అమ్మ లోపలకు వెళ్లి ఫ్లాస్కు భారతి పిన్ని చేతికిస్తుంది.

భారతాంబగారు ఫ్లాస్కు ఎడమచేత్తో తీసుకుని కుడిచేత్తో చెంపమీద కొడుతుంది. అది ఒకటిగా కొట్టదు. ఆ చెంప, ఈ చెంప కొడుతుంది. ఫ్లాస్కు క్రిందబెట్టి రెండు చేతులతోను ఆదవడ, ఈ దవడ పగల గొడుతుంది. ఆ శబ్దము విని ఇంట్లోనుంచి తాతగారు, పున్నమ్మగారు భారతాంబగారున్న చోటకు వస్తారు.

పున్నమ్మగారు : యేమిటి ఆ మోత భారతీ?

భారతి : యేమిటో నోరు మూసుకుని ఫో అవతలకి.

తాతగారు : యేంటి కొట్టావా ఏంటి?

భారతి : కొట్టానేమో దాన్నే అడగండి.

తాతగారు : చెప్పవే పిల్లా!

భారతి : అంత నంగనాచా?

తాతగారు "రామ్మా రా" అని వెళ్లి శ్రీరాములుగారితో మాట్లాడుతూ వుంటారు.

శ్రీరాములు గారు జరిగిందంతా చెపుతారు.

తాతగారు అవతలకు వెళ్లగానే భారతమ్మ గారు "బజ్జీలన్నీ నీ పొట్టపగల గొట్టుకున్నవా?"

అమ్మ ఏమీ సమాధానామివ్వలేదు.

భారతి : గబ్బిచేసే పని చేసి వూరుకుంటుంది. మాట్లాడనే మాట్లాడదు. నిర్లక్ష్యం.

దొడ్లో నుండి బామ్మ లేచి వస్తుంది.

బామ్మ : యేమిటి? గొడవ గొడవగా వున్నా రేమిటి? భారతి కేమైనా తెర వచ్చిందా?

పున్నమ్మగారు : ఏమీలేదు. 2 గం॥లకు పోయిన పిల్లఇప్పుడు వచ్చింది గదూ! అందుకని కేకలేస్తున్నది భారతి.

భారతి : ఇంకా ఎందుకు ఎదురుగుండా నుంచుంటావు పో (అని ఒక్క నెట్టు నెడుతుంది).

అమ్మ పోయి మొఖం గోడకు కొట్టుకుంటుంది. కొట్టుకున్న సమయంలో బామ్మ గదిలోకి వస్తుంది.

బామ్మ : యేఁమిటి? ఇంతచేటు నీకు ఇంత దుర్బుద్ధి ఇంత దెబ్బ కొట్టుకున్నావేమిటి?

తాతగారు వస్తారు. అమ్మను దగ్గరకు తీసుకుని ముఖం వంక చూస్తే మొఖాన పెద్ద బొప్పి వుంటుంది. బొప్పికి సున్నం రాసి భుజాన వేసుకుని తీసుకెళతారు.

తాతగారు భారతితో "నిన్నల్లా కొట్టి పెంచామా? నీకెట్లా చెతులొస్తున్నాయి."

భారతి మాట్లాడకుండా వూరుకుంటుంది.

తాతగారు : (పున్నమ్మ) గారితో శ్రీరాములు గారు అనసూయను తీసుకెళతా మంటున్నారు. పంపిద్దామా?

పున్నమ్మగారు : యేమో మీ ఇష్టం నాకు తెలియదు.

భారతి : నాదగ్గర యెవరూ లేకుండ యెట్లా? నాలుగు రోజుల్లో పంపిద్దాములె.

తాతగారు : సరే నీవు పోయిరా నాయనా! నాలుగు రోజుల్లో వస్తుందిలే. నీవు రోజూ ఆఫీసుకు వస్తావుగా?

శ్రీరాములు గారు : అమ్మాయి అన్నంతా అయింది. అమ్మాయిని అక్కడ వుంచి వచ్చి అడిగి తీసుకెళితే బాగుండేది. వద్దంటున్న కొద్దీ ఫ్లాస్కుకు డబ్బులుగూడ యిస్తారు తాతగారు.

తాతగారు లోపలకు వచ్చి అమ్మను అన్నంతిని పడుకో అంటారు.

భారతి : నాన్నా! ఇవాళ కాసేపు భారతం చదవండి.

తాతగారు : యే పర్వం చదవమంటావ్?

భారతి : మీ యిష్టమొచ్చింది చదవండి కాసేపు.

తాతగారు మెల్లిగా అమ్మను అడుగుతారు, "యేం చదవమంటా అమ్మా?" అని.

అమ్మ : ఆదిపర్వం, అంత్యపర్వం చదవండి.

తాతగారు : రెండూ యెక్కడ చదివేదమ్మా?

అమ్మ : మొదటి పర్వంలో మొదటి పది పద్యాలు, అంత్య పర్వంలో అంత్యం పది పద్యాలు చదవండి.

తాతగారు అట్లాగే చదువుతుంటారు.

భారతి : అక్కడేం కూర్చుంటావు ఇక్కడికి వినపడుతున్నైలే రా కూర్చుని కాళ్ల పిసుకుదువుగాని

అమ్మ వచ్చి కాళ్లు పిసుకుతూ కూర్చుంటుంది.

తాతగారు పది పద్యాలు చదివి ఆపివేస్తారు. అమ్మ కాళ్లు పిసుకుతున్నదని పద్యాలు ఆపివేసి "పడుకుందాం రామ్మా" అంటారు.

భారతి : ఇంకా పది పద్యాలు చదువు నాన్నా!

తాతగారు : చదవలేనమ్మా. ఈ వేళ ఓపిక లేదమ్మా.

భారతి : సరే మీరు పోయి పడుకోండి.

తాతగారు : అనసూయను గూడ రమ్మను పడుకోటానికి

భారతి : కాసేపు కాళ్లు పిసికి వస్తుందిలే!

తాతగారు : మరీ మూర్ఖురాలివిగా వున్నావు. ఆ లేత చేతులతో యెందాక పిసుకుతుంది దీనికి మరీ జబ్బు కోపం ఎక్కువైపోయింది అని భారతాంబ గారిపై విసుక్కుంటూ అమ్మను ఎత్తుకుని మేడపైకి తీసుకువెళతారు. తాతగారు తన

ప్రక్కలో పడుకోబెట్టుకుని అమ్మచేతులు రాస్తూ (పిసుకుతూ) వుంటారు. ఏవమ్మా చేతులు నొప్పులుగ వున్నయ్యా?

అమ్మ : అందరికి తలొక నొప్పి. భారతి పిన్నికి కాళ్లు నొప్పులు, నాకు చేతులు నొప్పులు, మీకు మనసు నొప్పి అందరి నొప్పులకంటే మీ నొప్పి పెద్దది తాతగారూ! ప్రపంచంలో మానవుడు ప్రపంచాన్ని మెప్పిస్తాడా? తనకు తానే మెప్పించు కుంటాడా? లేక తనకు తాను మెప్పించుకున్నప్పుడే ప్రపంచాన్ని కూడ మెప్పిస్తున్నా ననుకుంటాడా? అట్లా లేకపోతే జగత్తు నడక ఇట్లా వుండదు గదూ!

నేను నేనైన నేను :

తాతగారు : (అమ్మను పొట్టమీదకు లాక్కుని) జగత్తుకు నేనేమి సమాధానం చెప్పేదమ్మా? నీవే జగత్తయితే!

అమ్మ : అయితే జగుత్తులో వుండే కష్టసుఖాలన్నీ నాకే వుంటాయన్నమాట!

తాతగారు అనగానే అమ్మ తలకాయ తన గుండెలకేసి వత్తుకుంటారు. పది నిముషాలు అట్లా వుంచుకుని కళ్లవెంట నీళ్లు కారుస్తూ గుండెలమీద వున్న అమ్మ తల అవతల దించుతారు.

అమ్మ : బాధలన్నీ నాకే వచ్చినా, 'నాకేం' అని అనుభవించే స్థితి వుంటే బాధలు బాధలని అనిపించవేమోలే!

తాతగారు : నీకు అనిపించకపోయినా, మాకు అనిపిస్తూనే వుంటయిగా అమ్మా.నీవు భారతికి కాళ్లు పిసుకుతుంటే నా ప్రాణం పోయినట్లుగా వుంది.

అమ్మ : మీరు నాతో అట్లా చెప్పకూడదు. ఇంకా పిసుకమ్మా. ముందుముందు అందరికీ సేవ చేయుమమ్మా అని చెప్పాలి. భారతి పిన్ని నాచేత కాళ్లు పిసికించుకున్నదంటే నాకు ఓర్పు నేర్పుతున్నదన్నమాట. నాకు నేర్పుగల ఓర్పు అక్కర్లా. సహజమైన ఓర్పు కావాలి.

తాతగారు : యేమిటమ్మా ఇట్లా మాట్లాడుతున్నావు? నా హృదయాన్ని కదిలిస్తున్నావా?

అమ్మ : కదిలేదే హృదయం. హృదయాన్ని కదిలించటం కాదు. హృదయమంటే చైతన్యం. యెక్కడ యేది జరిగినా గుర్తించేదే హృదయం. జరగటానికి హేతువైనది చైతన్యం. రెంటికి భిన్నం లేదు. అవయవాలు మనకు తెలియకుండానే వాటంతట అవి ఆడుతుంటాయి. ఆ ఆడటం చైతన్యమే. ఆ ఆడినప్పుడు కలిగే స్పర్శలో, విశేషమైన కష్టమో. విశేషమైన సుఖమో కలిగినప్పుడు గుర్తిస్తాము. ఆ గుర్తించేది హృదయం.

తాతగారు : (అమ్మ గుండెల్లో తలబెట్టి రుద్దుతూ), నువ్వు బ్రహ్మపదార్థానివా, బ్రహ్మతత్వానివా, బ్రహ్మవా?

అమ్మ : **నేను మూటికి మూలమై మూడు అయినా!**

తాతగారు : ఆ మూడూ యేమిటమ్మా?

అమ్మ : యేమూడు అయినా సరే. నేను బ్రహ్మనై, నీవు అనే వస్తువును ఏర్పరచుకుని. నీవు, నేను మధ్యలో వుండే సంధి బ్రహ్మ పదార్థం.

తాతగారు : అంటే ?

అమ్మ : నేను నేనై నేను అంటే బ్రహ్మనై నేను నీవై, ఆ నేను నీవె బ్రహ్మతత్వం. ఆ రెంటికి సంధే బ్రహ్మ పదార్థం. అదే నిర్గుణం. యీ మూటికి భిన్నం లేదు.

తాతగారు ఇవి వింటూ అమ్మ గుండెలమీదనె కళ్లు మూస్తారు.

అమ్మ : తాతగారి చెక్కిళ్లు తడువుతూ నిద్ర పోయావా నాన్నా! (అనగానే),

తాతగారు : లేదమ్మా! కళ్లు మూసుకున్నాను.

అమ్మ : నిద్రపట్టిందేమో అనుకున్నాను.

తాతగారు : పట్టింది గాని, నాన్నా అనేసరికి నా శరీరమంతా చెవులు పుట్టినాయమ్మా.

అమ్మ : నా గుండెల్లో పడుకుంటే మీరు తాతగారు అనిపించలా అయిదు నెలల పిల్లలు అత్త, తాత అన్నట్టుగా వున్నావు.

తాతగారు : ఎంత బరువు పుట్టిందో యీ గుండెలకు?

అమ్మ : "నాది కండగల నిండుగుండె. నాకేమి బరువు? నీ గుండెలు అన్నీ ఎముకలు. నాగుండె చూడు యెంత మెత్తగా వుంటుందో"

తాతగారు : నీది ఒక గుండే యేమమ్మా? నీవు అంతా మెత్తనే!

అమ్మ : **యీ నా మెత్తదనాన్ని ప్రపంచం అర్థం చేసుకోలేక వత్తేస్తుందేమో?**

తాతగారు : కనవడుతూనే వున్నది గదా! లేకపోతే నిన్ను కాళ్లు పిసకమనటమేమిటి? మరిచి పోయినా సరే కాని ఇంతకుముందు భారతి నిన్ను కొట్టిందా?

అమ్మ : భారతి నన్ను కొట్టలా! భారతి చెయ్యి నా చెంపను కొట్టింది. నాచెంప ఆమె చేతిని కొట్టింది. భారతి నన్ను కొట్టటమేమిటి?

తాతగారు : (పకపకా నవ్వి మళ్లా కళ్ల నీళ్లు కార్చి) కొట్టనే కొట్టింది. అబ్బా నీ విధానం యేమి విధానమమ్మా?

అమ్మ : ప్రతీది మరుగు పరచటమే నాకు ప్రధానం!

తాతగారు : అయితే జీవితంలో ఏది బయటకు రానివ్వవన్నమాట!

అమ్మ : జీవితంలోనివి రానియ్యకపోయినా జీవితం బయటకు వచ్చింది గదా! జీవితం వచ్చిన తరువాత జీవనం వుంది. (జీవనం అంటే నడక) యీ రెండూ కలిసి బ్రతుకు అవుతాయి. యెంత వద్దనుకుంటున్నా వీడి బ్రతుకుతోపాటు జీవన, జీవితాల తేడా అర్థమవుతూనే వుంటుంది.

తాతగారు నిద్రపోతారు. అమ్మ వీపుమీద చెయ్యి వేసుకుని బోర్లాగా అటు తిరిగి పడుకుంటుంది. తాతగారు కొంతసేపటికి అమ్మ చెయ్యి తీసి క్రిందబెట్టి క్రిందికి దిగి భారతాంబ గారి దగ్గరకు వెళ్లి "యేమమ్మా నిద్రపట్టిందా? కాళ్లు తీపులు తగ్గినయ్యా?"

భారతీదేవి వకాల్త :

భారతి : తగ్గితే తగ్గుతాయి లేకపోతే లేదు. యెప్పుడూ పీక్కు తినేదాన్ని గురించి ఆలోచనేమిటి అంటుంది.

నాగేశ్వరరావు గారు (నాన్నగారు) ఇంతలో తలుపు తట్టి "పెదనాన్నా" అంటారు.

తాతగారు : (తలుపు తీసి) ఇదేంటి? ఇప్పుడొచ్చావ్! ఇప్పుడేం ట్రైనుంది?

నాన్నగారు : సాయంకాలం వచ్చాను. కోనప్రభాకరరావు గారింటికి. యీ తెల్లవారుఝామున వారి చెల్లెలి పెళ్లి. అందుకని వొచ్చాను.

తాతగారు : భోజనం అయిందీ?

నాన్నగారు : పెళ్లికొచ్చి భోంచేయకుండా వస్తానా?

తలుపు తీయగానే మాట్లాడుకుంటూ లోపలకు వచ్చి భారతాంబ గారి దగ్గరకు వెళతారు నాన్నగారు.

తాతగారు అమ్మ దగ్గరకు మేడమీదకు వస్తారు.

అమ్మ లేచి తాతగారి వంక చూస్తుంది.

తాతగారు : ఇంకా నిద్రపోలేదటమ్మా?

అమ్మ : ఇప్పుడే మెళకువ వచ్చింది. కింద యేదో తలుపు ధ్వని అయితే!

తాతగారు : అంత గాఢనిద్ర పోతుంటావన్నమాట!

అమ్మ : నేను పోయే నిద్ర గాఢమైనదే గాని, ఆ తలుపు దగ్గర ధ్వని గాఢత్వాన్ని తొలగిస్తుంది.

తాత : ఒకరకంగా గాఢత్వమంటే హాయి అనిగూడ వుందేమో !

అమ్మ : యెందుకు. అనుభవించేటప్పుడు సుఖదుఃఖాలు రెండూ తెలియకుండా అనుభవించే స్థితి అనా! అనుభవించేటప్పుడు తెలియనిది, తెలిసిన తరువాత హాయిగా వున్నాననుకునేది, అటువంటి స్థితి అనిగూడ మెళకువ తెప్పించే ధ్వని.

తాతగారు : సరే! నేను ఒకటంటే నీవు ఒకటంటావు. తలుపు ధ్వనా, కంఠధ్వనా?

అమ్మ : యేదో నాకు తెలియదు గాని, తలుపు తీయటానికి కారణమైన ధ్వని.

తాతగారు అర్థం కానట్లు ఆలోచిస్తున్నట్లు అమ్మవంక చూస్తారు.

అమ్మ : అదేలే తాతగారూ! తలుపు, కంఠధ్వనుల సమ్మేళన, ద్వంద్వాల సమ్మేళనే!

తాతగారు : యేదో సరిపుచ్చుతుంటావు.

అమ్మ : నేను ఒక్కసారి క్రిందకు వెళ్లి వస్తా తాతగారూ!

తాతగారు : యెందుకమ్మా ఇప్పుడు?

అమ్మ ఇప్పుడే వస్తానని మేడ దిగుతుంది. మేడదిగి భారతమ్మ గారు పడుకున్న గది ముందుకు వస్తుంది. మెల్లగా లోపలకు వస్తుంది. ఇద్దరూ పలకరించరు. "భారతి పిన్నీ కాళ్లు నొప్పులు తగ్గినయ్యా?" అంటుంది అమ్మ.

భారతి మాట్లాడదు.

నాన్నగారు : మెల్లిగా వచ్చినట్లు వుంది. మేడ దిగివచ్చి చాలాసేపయినట్లుంది. మనం యేం చెప్పుకుంటున్నామోనని వినటం కొఱకు (అని భారతాంబగారితో అంటారు).

భారతి : రాగానే లోపలికి వచ్చిందనుకుంటానే. వస్తుతా ముచ్చురకం.

నాన్నగారు : అదే నాకూ అనుమానం. ఇందాకే దిగి వచ్చిందనుకుంటా!

భారతి : అయినా పిల్చి కనుక్కుందాం! (అమ్మ నుద్దేశించి) రా దగ్గరకు రా!

అమ్మ వెళ్లి దగ్గర నుంచుంటుంది.

భారతి : మేడదిగి రాగానే లోపలకు వచ్చావా? గోడ ప్రక్కన నుంచున్నావా?

అమ్మ : గోడ ప్రక్కన నుంచోలేదు. మెల్లిగా నడిచాను. నా నడక మీకు తెలుసుగా! ధ్వని వుండదని.

నాన్నగారు : చాలా పెద్దమాట మాట్లాడుతున్నదే భారతీ!

భారతి : మాట్లాడకేం? ఎప్పుడూ మాటకారే. వాళ్లు అందరూ మాటకార్లే.

నాన్నగారు : గోడ ప్రక్కనే నుంచోటమే అయితే నాకు చెడ్డకోపమే వస్తుంది. అని అమ్మవంక కళ్లు వురిమిచూస్తారు.

అమ్మ మాత్రం క్రిందవంకనే చూస్తూ వుంటుంది.

భారతి : చాల్లే ఇకపోయి పడుకో ! అంటుంది.

అమ్మ వెళ్లి మేడమీద పడుకుంటుంది.

తాతగారు నిద్రపోతుంటారు. తాతగారి పక్కలోనే అమ్మ పడుకుంటుంది. అమ్మ వెళ్లి పడుకున్న పది నిమిషాలకు తాతగారు లేస్తారు.

తాతగారు : యేమమ్మా యెంతసేపయింది వచ్చి పడుకుని?

అమ్మ : ఇప్పుడే పది నిమిషాలు.

తాతగారు : భారతి నిద్రపోతున్నదా?

అమ్మ : పోతున్నట్లు లేదు.

సితారు మీద యెక్కడో పాట పాడుతున్నట్లు వినపడుతుంది. "ఆపాట ఆలకించు యెంత బాగుందో" అని అమ్మ తాతగారితో అంటుంది.

తాతగారు : వినపడుతున్నది గాని అమ్మా, వివరంగా తెలియటంలా!

అమ్మ : నాకూ తెలియటంలా ఒక ముక్క మాత్రం తెలుస్తున్నది. యెవరేమన్నారు అనిన్నీ, గూటిలో వుండే రామచిలుక అని.

తాతగారు : అయితే మధుసూదనరావు గారు కావచ్చు. ఆనాదం అదే. మర్చిపోయినా వారి గురువు గారు కూడ వచ్చారని విన్నా. బాగా భజనలు, నామం చేస్తారు.

అమ్మ : ఒకరోజు వెళ్లి విన్దాం నామం.

తాతగారు : ఒక రోజు ఎందుకు? తెల్లవారనీ తరువాత రేపు సాయంకాలం వెళదాం.

లేచి ముఖాలు కడుక్కుని అన్ని పనులూ తీర్చుకుంటారు. ఆరోజు ఆదివారం.

భారతాంబ గారు : (అమ్మను పిలిచి) మీబావ చదువు అయిపోయి వచ్చాడు. పెళ్లి చేసుకుంటావా?

అమ్మ : చేసుకోను. మా నాన్న ఇష్టం.

భారతి : మీ నాన్న ఇష్టం సరే, అసలు నీ వుద్దేశ్యం చెప్పు?

అమ్మ : పెద్దవాళ్ల వుద్దేశమే నా వుద్దేశం.

భారతి : లోగడ సుందరితో నువ్వు అన్నావటగా?

అమ్మ : నేను అనలేదు. ఒక రోజు సుందరే అన్నది నాతో. 'మా అన్నయ్య నిన్నే చేసుకుంటానంటున్నాడు' అని అప్పుడు కూడ నేను వినిపించుకోలేదు. ఇప్పుడేం పోయింది. సుందరి వచ్చినప్పుడు అడుగుదాంలే.

భారతి : ఆ అడగడం కోసం కాదు. నీ వుద్దేశ్యం చెప్పమని. అన్నయ్య అడిగాడు నన్ను.

అమ్మ : ఇందాకనే చెప్పాను గదా! ఎవరడిగినా ఒకటేమాట. పెద్దవాళ్ల ఇష్టం.

భారతి : వాడికి చాలా మంచి సంబంధాలు వస్తున్నాయట. చాలా చక్కని పిల్లలు, భాగ్యమంతులు వస్తున్నారట. నువ్వు చేసుకుంటానని అన్నావని ఆలోచనలో పడ్డాడు. లేకపోతే యేమీ లేదు. ఒకమ్మాయి ఇట్లాగే ఒకతన్ని చేసుకుంటానంటే, చేసుకోకపోతే బావిలో పడ్డదట. అందుకని నిజంగా నీకు ఆ వుద్దేశముంటే నిన్నే తప్పక చేసుకుంటాడు. మీ యమ్మ వుంటే ఎటూ ఇవ్వనిచ్చేది కాదు. ఇప్పుడు మీ అన్నయ్యకు కూడ ఇష్టంలేదు. వాడు బహుశా ఇవ్వనివ్వడు మీ అమ్మమ్మ వాళ్లకు ఇష్టం లేదట. నే చెప్తున్నా, నామాట విను. నీకాతల్లి లేదు. మీ నాన్న రెండో పెళ్లి చేసుకున్నాడు. ముందు ముందు ఈ మాత్రం కూడ చూడడు. యీామె మేనత్త, రక్త స్పర్శ. అన్నయ్య చాలా యోగ్యుడు. చదువుకున్నవాడు. పది రూపాయలు తెచ్చుకోగలడు. వింటున్నావా? నే చెప్పేవన్నీ, మీ అన్నయ్య వచ్చి చెప్పగానే మారిపోతావేమో?

అమ్మ మాట్లాడకుండ వింటూ వుంటూ వుంటుంది.

భారతాంబ గారు : నాకు ఇష్టం మీ తాత చిదంబర్రావు గారికి ఇష్టం. నిన్ను పెంచిన మీ తాతమ్మకు ఇష్టం. పేర్లెందుకు మీ అన్నయ్యకు, తెనాలి వారికి తప్ప ఇటువారికి అందరికీ ఇష్టమే. చదువు అయిపోయింది. పది రోజుల్లో వచ్చి మీ నాన్నను అడిగి సికిందరాబాదో, నిజామాబాదో వెళ్లి వుద్యోగము చూచుకుంటాడు.

ఇచ్చేది, లేనిది తేల్చుకునే వెళతాడులే. ఒకరి సంగతెందుకు? నువ్వు తేల్చి చెపితే యెంతమంది యిష్టం లేకపోయినా మేము చేసేపని మేము చేస్తాం.

అమ్మ : యెవరి పని వాళ్లు చేసుకోండి. మీ అందరి ఇష్టం.

భారతాంబగారు : అది సరేగాని నీ మెళ్లో వున్న కంటె ఇటుతే.

అమ్మ తీసి ఇస్తుంది.

భారతాంబ గారు : ఇక వెళ్లి నేను అడిగిన దానికి సమాధానం ఆలోచించుకు రా సాయంత్రంలోగా.

చిదంబ్రరావు తాతగారు : యేమిటమ్మా భారతీ అనసూయతో మాట్లాడు తున్నావు?

భారతి : యేం లేదు నాన్నగారు. అన్నయ్య వుద్యోగానికి వెళతాడట. అందుకని పెళ్లి విషయం ఆలోచించమన్నాడు.

చిదంబ్రరావు తాతగారు : అది చిన్నపిల్లతో ఆలోచిస్తే యేం తేలుతుంది?

భారతి : అచ్చగా అదేకాదు. వాడికి రైలుఛార్జీలకు లేకపోతేను దాని చేతిలోవాళ్లు ఒక కాని, వాళ్లు ఒక కానిపెట్టి పోతారు కదూ. అదేమైనా అట్టేపెట్టిందేమో అని అడుగుతున్నా.

చిదంబ్రరావు తాతగారు : యెవరిస్తున్నారు? అది యెవరి నడుగుతుంది. కనీసం మనం తెప్పించుకున్న ఇడ్లీలో ఇంత ఇడ్లీ ముక్క పెట్టవే. యెన్నడయినా పెట్టివున్నావా? నీ చేతిలో "కంటె" ఏమిటి?

భారతి : అటూ ఇటూ తిరుగుతుంటుందని నేనే తీసుకున్నా.

చిదంబర్రావు తాతగారు : అట్లాగేగా మనమంతా తలోకాస్త తీసుకున్నది. తల్లి 200 శెవర్ల బంగారం ఇచ్చి పోతే యెవరికి తగినట్లు వాళ్లు చేసాం. యెందుకు అనవసరం. ఆ కంటె దాన్ని, దానికిచ్చేసెయ్యి అని తాతగారు అవతలకు వెళతారు.

భారతి అమ్మను దగ్గరకు పిల్చి కంటె మెడలో పెట్టి గుర్తుపట్టలేరని చేతి గాజు తీసుకుంటుంది.

తాతగారు వాకిట్లో నుంచుని 'అమ్మా అనసూయా' అని పిలుస్తారు.

అమ్మ : వెళ్లివస్తా పిన్నీ, తాతగారు ఎందుకో పిలుస్తున్నారు అంటూ తాతగారి దగ్గరకు వస్తుంది.

తాతగారు : యేమమ్మా కంభంమెట్టు మధుసూదనరావు గారింట్లో సప్తాహం జరుగుతున్నదట. వెళ్లి వద్దామా?

అమ్మ : భోజనం చేసి వెళ్తే సాయంత్రం దాకా వుండొచ్చు. బాగా చేస్తుంటే మరి రావాలనిపించదుగా?

తాతగారు : సరే నీవు చెప్పినట్లే చేద్దాంలే! వంట అయిందేమో చూచిరా!

అమ్మ : అయ్యేదేమిటి. అయినంతవరకు తిందాం రండి.

19. మహిమాన్విత ప్రకాశిని

ఆనంద తరంగం :

అమ్మ తాతగారు లోపలకు వెళ్లి భోంచేసి, సప్తాహం దగ్గరకు వెళతారు. అక్కడకు వెళ్లేసరికి సప్తాహం కాకుండా తరంగ కాలక్షేపంతో భజన జరుగుతూ వుంటుంది. ఉదయం గం॥ 10.30 ని॥ అవుతుంది. అమ్మ వారిలోపోయి కూర్చుని మెల్లిగా పాడుతూ వుంటే దూరంగా వున్న తాతగారు అమ్మ ప్రక్కనే చేరి, అమ్మ దొంగ! పాటలు కూడ వచ్చునే!

అమ్మ : పాటలేమి? తరంగాలే వస్తే!

పక్కన కూర్చున్న ప్లీడరు మల్లాది యజ్ఞనారాయణ గారు " అమ్మాయి దగ్గర యెటువంటి ధ్వని వస్తున్నదో వింటున్నారా పంతులుగారు? యీ వయస్సుకు తరంగాలు పాడుతున్నదంటె యెంత చక్కగా యింతమంది గొంతుల్లో కలిసి వేరై వినపడుతున్నది"

చిదంబర్రావు తాతగారు : ఆ గొంతు యెప్పుడూ అందరిలో కలిసి వుంటుంది. వేరుగానూ వుంటుంది.

అమ్మ : "పాడటం యేంలేదు. అది తరంగం కనుక అందులోనే పుట్టి, అందులోనే ప్రజ్వరిల్లి అందర్నీ ముంచి అందులోనే కలుస్తుంది".

తాతగారు : వింటున్నారా ఇచ్చిన సమాధానం. యజ్ఞనారాయణగారూ.

యజ్ఞనారాయణ : అందుగ్గాదూ రోజూ కోర్టుకు పోతూ పోతూ కాసేపు యెత్తుకుని వెళుతుండే వాడిని. చిన్నప్పటినుండి మాటకారె. అతి సునిశితమైన ప్రశ్నలు వేస్తుండేది.

ఇంతలో గురువుగారు లేచి నృత్యం ప్రారంభిస్తారు.

చిదంబర్రావు తాతగారు : చాల బ్రహ్మానందంగా చేస్తున్నారు నృత్యం.

అమ్మ : బ్రహ్మానందాలు అనేకముంటాయా, ఒకటేనా? యేది నచ్చినా బ్రహ్మానందంగా వుందంటాము.

యజ్ఞనారాయణ గారు : అయితే యేమంటావమ్మా?

అమ్మ: "తనకు నచ్చింది ఆనందం. ఆ ఆనందమే బ్రహ్మానందం. బ్రహ్మానందం అనేమాట ప్రతిదానికీ వాడుతున్నాం గనుక".

యజ్ఞనారాయణ : అంటే తృప్తేగా?

అమ్మ : తృప్తి అంటే యేమిటి?

యజ్ఞనారాయణ : మనం వేరే కూర్చుని చెప్పుకుందాంరా. ఇక్కడ మన గోలెందుకు?

అమ్మ : వాళ్లు చేసేది మనగోలే. మనం దేన్ని గురించి చెప్పుకోవాలనుకుంటున్నామో ఆ మాటల్ని వాళ్లు పాటలుగా పాడుతున్నారు. అందుకే నాకు ఇంకొకటి గూడ ఆలోచనకు వస్తుంది. "అన్నీ బ్రహ్మానందంలో నుంచి వచ్చినవే గనుక ప్రతిదానికి ఆ ముక్క తనకు తెలియకుండానే పడుతుంది. ఒకడు దొంగతనం చేసి తను అనుకున్నట్లుగా జరిగితే బ్రహ్మానందంగా వుందంటాడు. తనకు కష్టమైనవాడ్ని కొట్టిగూడ బ్రహ్మానందాన్ని అనుభవించా నంటాడు. తన నోటికి కొంచెం రుచిగల కూర తగిలినా, బ్రహ్మానందంగా వుంది కూర అంటాడు. సర్వం బ్రహ్మానందమేగా. సర్వకాలం కూడ బ్రహ్మానందంకాదా. సర్వకాలం బ్రహ్మానందమైనదే బ్రహ్మానందం. తాత్కాలికంగా కలిగే ఆనందం దాని ఛాయ".

యజ్ఞనారాయణ అమ్మ వంకనే కన్నార్పకుండా చూస్తూ చెవులు నిక్కబొడుచుకుని వింటూ వుంటాడు. చిదంబ్రరావు గారు వచ్చి "నన్ను అక్కడే వదిలి పెట్టి వచ్చేశారు. యెప్పుడు వచ్చారు?" "మన అమ్మాయి ఒక నెల ఉపాధ్యాయుడిగా చేస్తే గోడలకు, కిటికీలకు కూడ చదువు వస్తుందండి" అని- యజ్ఞనారాయణ గారంటారు.

తాతగారు : అందుకే అఖ్లర్లా, కోర్టులో జడ్జీ అయినా, గవర్నమెంటు నిర్ణయించిన 'లా'కు బుద్ధి వస్తుంది. అన్ని చట్టాలూ తల్లక్రిందవుతాయి.

అమ్మ : మొన్నటి వర్షాలకు చపటాలే తల్లక్రిందులైనాయి.

తాతగారు : అదేనమ్మా. మేమన్నదీ అదే. పిచ్చి వర్షానికే ఇంత శక్తి వుంటే సర్వాన్నీ వర్షించే దానికి ఎంత శక్తి వున్నదో?

యజ్ఞనారాయణ: సర్వాన్ని ఆకర్షింపబడుతున్నది. అప్పుడు.

తాతగారు అమ్మను రెండు చేతులతో వాటేసుకుని "యేమమ్మా ఆయన నోటిమీదగా కూడా వచ్చింది. ఆరోజు యెప్పుడు వస్తుంది? అందరూ నిన్ను ఆకర్షించే రోజు వస్తుందా. నేను చూస్తానా?"

అమ్మ : ఆఁ వింటారు.

యజ్ఞనారాయణ గారు అమ్మ తలమీద చెయ్యి పెట్టి గడ్డం పుచ్చుకుని దగ్గరకు తీసుకుని ముద్దుపెట్టుకుంటారు.

వారు ముద్దు పెట్టుకోగానే రెండో చెంప తాతగారు ముద్దు పెట్టుకుంటారు.

అమ్మ : ఇదొక భజనా!

ఇద్దరూ పకపకా నవ్వుతారు.

"అమ్మా! ఇంటికి వెళదామా?" అని తాతగారు అడుగుతారు.

అమ్మ : మీరు వెళ్లండి. నేను కాసేపు వుండి వస్తా!

తాతగారు : నేను వచ్చి తీసుకెళ్లేదా?

అమ్మ : మీరు రావద్దు నేనే వస్తా.

చాలామంది ప్లీడర్లు వస్తూ వుంటారు భజన దగ్గరకు.

అమ్మ : యీరోజు ఆదివారం గదూ చాలామంది వస్తున్నారు తాతగారూ!

వచ్చిన వారితోనల్లా మాట్లాడుతూ దీపాలు పెట్టిందాకా చిదంబర్రావు తాతగారు కూడ అక్కడే వుంటారు.

అమ్మను దీపాలు బెట్టిన కాసేపటికి "వెళదామా" అని తాతయ్య అడుగుతారు.

అమ్మ కర స్పర్శ మహత్వం :

అమ్మ : నేను యీ రాత్రికి వుంటాగా. మీరు వెళ్లిరండి అంటుంది.

యీలోగా ఇంటి దగ్గర్నుంచి భారతమ్మ గారికి మూర్ఛలు వస్తున్నాయి. రమ్మని మనిషి వస్తాడు.

తాతగారు : నీవు ఇక్కడే వుండులే అమ్మా! అక్కడ తెల్లవార్లూ కాళ్లు పిసుకుతూ కూర్చోవాలి. నేను వెళతాను.

అమ్మ : పీసపాటి సీతారామయ్య గారు వస్తున్నారు తాతగారూ!

తాతగారు : ఆయన పిచ్చివాడమ్మా! ఆయన్ను నీవేమీ పలకరించబోకు.

అమ్మ : నే పలకరిస్తే ఎక్కువవుతుందా? తగ్గిపోతుందా?

తాతగారు : (పకపకా నవ్వి) యెక్కువా కావచ్చు, తక్కువా కావచ్చు. నీవు యేదనుకుంటే అది అవుతుంది. యెంత "సర్వం" నీవనుకుంటున్నా చిన్నమ్మాయివి. మనమరాలివలే తోస్తూంటుంది. ఆ మాయను అట్లా కప్పివేస్తుంటావా?

అమ్మ : ఆ మాయ వేరే లేదు. యీ మాయే!

తాతగారు : మాయ వేరు కాదుగాని, ఆయీ అనేది మాత్రం వేరు.

అమ్మ : అదీ శబ్దం ఒకటేగా! ధ్వనులు వేరు.

తాతగారు : అన్నీ ఒకటే. అనేకమయిందని అడుగడుగునా చెప్తూనే వున్నావు. ఆ ఒకటే గుర్తించక అనేకం గుర్తిస్తున్నాం. గనుక ఆ ఒకటి గుర్తుకు రాక అనేక బాధలు పడుతున్నాం. (చిటిక వేసి) అమ్మ వంక చూస్తూ చెయ్యి చాచి చిటిక వేస్తూ, నీవు తల్చుకుంటే క్షణంలో అయిపోతుంది.

ఇంతలో పీసపాటి సీతారామయ్య గారు దగ్గరకు వస్తారు.

అమ్మ "యేం బాబూ కోర్టుకు వెళ్లలా?" అంటుంది అమ్మ.

సీతారామయ్య ఆయన మామూలు పిచ్చి ధోరణిలో మాట్లాడతాడు.

అమ్మ : (దగ్గరకు వెళ్లి పొట్టమీద చెయ్యివేసి) యేం బాబు భోంచేసారా?

సీతారామయ్య : చేశానమ్మా!

తాతగారి ఒళ్లు జలదరించినట్లు అవుతుంది, అమ్మ చేయి ఆయన మీద వేయగానే. ప్రశాంతతగా సీతారామయ్య గారు ఇచ్చిన సమాధానానికి, అమ్మ అడిగిన ప్రశ్నకు ఆ సమాధానానికి చిదంబర్రావు తాతగారికి ఆయనకు నయమవుతున్నదనే ఆశ వుదయిస్తుంది.

అమ్మ సీతారామయ్య గారి పొట్టమీద చెయ్యివేసి యేవేవో ప్రశ్నలు వేస్తూ, ప్రశ్నకు తగిన సమాధానాలు వస్తూ వుంటే మాటద్వారా వ్యక్త పరచుకోకుండా మనస్సుతో సమాధానం చెప్పుకుంటున్నట్లుగా ఆనందాన్ని గడుపుతూ వుంటారు తాతగారు.

సీతారామయ్య గారు యే ఆలోచనా లేకుండా అమ్మ పాదాల మీద పడి నమస్కారం చేస్తారు. పిచ్చి నయమయిపోతుంది.

తాతగారు : యెందుకురా? యేం కనిపించి నమస్కారం చేశావు సీతారాముడూ?

సీతారామయ్య : మా ఇలవేల్పు కుమారస్వామిలా కనపడ్డది.

తాతగారు : నీవు అమ్మాయి దగ్గరకు వచ్చేటప్పటికి గుర్తుతో వచ్చావా? అప్పటికి, ఇప్పటికి తేడా వున్నదా?

సీతారామయ్య : వచ్చేటప్పుడు యెట్లా వచ్చానో తెలియదు గాని, యిప్పుడు నా తల్లోనుంచి బరువు తీసివేసినట్టు వుంది. (అని అమ్మవైపు చూస్తాడు). 'ఇంత చిన్నపిల్ల యెవరు?' అని అమ్మను యెత్తుకుని ముద్దు పెట్టుకుంటాడు.

తాతగారు : ఇందాకటినుంచి మాట్లాడింది యీ చిన్నపిల్లతో కాదట్రా?

సీతారామయ్య : యీ పిల్లకాదు. యెక్కడా పోలిక లేకపోతే!

తాతగారు : (అమ్మతో) యేమిటమ్మా యీ గొడవ నిజమేనా?

అమ్మ : నేను మీ యెదుటే నిల్చున్నాను గదా! ఆ సందేహం మీకెందుకు? ఇంతకు ముందు ఆయన మనస్సుకు, ఇప్పటి మనస్సుకు తేడా వున్నదికాదూ! అందుకనే నేను అట్లా కనిపించా ఆయనకు. నాలో మార్పయితే ఇద్దరూ గుర్తించేవాళ్ళే.

తాతగారు : యెదోకటి చెప్తావు అడ్డు. అర్థం చేసుకోనివ్వకుండ ఎన్నాళ్లీ తెర?

అమ్మ : నాకీ ప్రపంచంతో అవసరమున్నంతవరకు.

తాతగారు : హుఁహూఁ అంటారు. నేను వెళ్లివస్తాను. నీవు ఇక్కడే వుంటానన్నావుగా ఈ రాత్రి?

సీతారామయ్యగారు, తాతగారు ఇంటికి వెళతారు. తాతగారు ఇంటికి వెళ్లేసరికి ఇల్లు ఖాళీ చెయ్యమని వార్త వస్తుంది. వెంటనే ఇల్లు ఖాళీచేసి సొంత ఇంటికి వస్తారు.

అమ్మ భజన దగ్గరకు వెళుతుంది.

కాకి జపం :

సీతారామయ్య గారు ఆరోజు నుండి మామూలుగా కోర్టుకు వెళ్లి వస్తూ వుంటారు.

అందరూ నృత్యం చేస్తూ భజనలు చేస్తారు. రాగము, తాళం, భావం కలిసిపోతుంది.

అమ్మ లేచి దొడ్డి గడపలో కూర్చుని యీ మూడు యేకమయిన స్థితి, వేరే భజన చేస్తున్నారు. నేను వింటున్నాననేది లేకుండా అమ్మలోకి వాళ్లు లీనమైనట్లు

వుంటుంది. అమ్మ కళ్లు మూసుకుని గోడ కానుకుని అట్లాగే కూర్చుంటుంది. భజన అయిపోయిన తరువాత మధుసూదనరావు గారి గురువు గారు, ఆంజనేయులు గారు (గురు నాన్నగారు) దొడ్లోకి వస్తూ అమ్మ కూర్చున్న దృశ్యం చూచి, "యెవరో వచ్చిన పిల్ల నిద్రపోతున్నది. యెవరు అమ్మాయి, కొంగజపం చేసేది (అని చెంపమీద ఛళ్లున కొడతారు). ఇంటికిపోయి పడుకోరాదూ! కొంగజపం చేస్తున్నావేం?

అమ్మ : (లేచి కూర్చుని) కొంగ జపం కాదండీ, కాకిజపం.

ఆంజనేయులు : యేకాకి! మాలకాకా?

అమ్మ : కాదండీ బ్రాహ్మణ కాకే!

ఆంజనేయులు : బ్రాహ్మణ కాకి వుంటుందా యేమిటి?

అమ్మ : మాల కాకి వున్నవప్పుడు, బ్రాహ్మణ కాకి వుండదూ? యేకాకి కావటానికే కాకి జపం. అసలు కొంగ జపమంటే యేమిటి?

ఆంజనేయులు : యేదో వాడుక పదం. నాకు అట్టే తెలియదు.

అమ్మ : వాడుకలో వుండేవన్నీ అర్థం లేనివా? అర్థం కానివా?

ఆంజనేయులు : మధూ! యీ అమ్మాయి యెవరు?

మధు : మన యింటిపక్క మేడలోవారు వారి అమ్మాయి.

ఆంజనేయులు : చాలా గలది. మంచి జ్ఞాని కావచ్చు. తేజస్సు చాలా గొప్పగా వున్నది.

మధుసూదనరావు : యేదో పాపం మనకవన్నీ తెలియవుగాని, ఆ అమ్మాయిని యెవరూ పట్టించుకున్నట్టు వుండరు. పిచ్చిదానికి మల్లే వుంటుంది. అమ్మను "నీపేరేమమ్మా"! ఇంతలో కాంతమ్మ గారి కోడలు వర లక్ష్మమ్మగారొచ్చి "యీ అమ్మాయి పేరు అనసూయండి. భూదేవతలాంటి బిడ్డ. తల్లిలేదు. యెవరు ఎట్లా చెప్తే అట్లా వింటుంది. పిల్లలందరి మాదిరిగా నాకు ఇవి కావాలి, తింటాను అని లేదు. వద్దు అని లేదు".

ఆంజనేయులు : అందుకనే ఆ లక్షణాలు వర్చస్సులోనే కనపడుతున్నాయి. నాకు ఇంతకు ముందు భలే సమాధానమిచ్చింది. రేపు చెప్తాను మీకు.

వరలక్ష్మమ్మ : అవును నిజమే! చిన్నపిల్లప్పుడు మా కృష్ణుడితో ఆడుకోను వస్తుండేది.

ఆంజనేయులు గారు : నీవు రోజూ వస్తుండమ్మా! యీ వూళ్లోనే వుంటావా?

అమ్మ : చెప్పలేను. ఇంతకుముందు మీరు వచ్చినాతో మాట్లాడుతారను కున్నామా? మీరు నా దగ్గరకు రాగానే ఇంతసేపు కూర్చుందామనుకున్నారా? ఒక లెంపకాయ లాగిపోదామనుకోలా? అప్పుడు ఈ వుద్దేశ్యముంటే లెంపకాయ లాగరుగా? అందరూ నవ్వుతారు. అక్కడ పక్కన నుంచున్నవాళ్లు అంతా. నవ్వుతూ "మనము గురు నాన్నగారితో మాట్లాడాలంటే అదిరిపోతున్నాం. ఆ అమ్మాయి చూడు యెట్లా మాట్లాడుతుందో!"

అందులో ఒకామె : చిన్నపిల్లగాదూ, విషయం తెలియక, భయం లేక.

ఇంకొక ఆమె : తెలియకపోతే ఇంత సూటిగా సమాధానాలు ఎట్లా వస్తాయి?

వీళ్లల్లో వీళ్లు మెల్లిగా అనుకుంటున్నప్పుడు, గురు నాన్నగారి చెవుల్లో పడతాయి యీ మాటలు.

గురు : (కళ్లు పెద్దవిచేసి) 'యేమిటి మీ బొంద. జరిగే సంభాషణ వింటూ అర్థం చేసుకోండి.'

ఇంతలో కొంచెం ధైర్యం గల ఒకామె లేచి: చిన్నపిల్ల ధైర్యంగా మాట్లాడుతుంటే అనుకుంటున్నాం లెండి.

గురు : ఆ అమ్మాయి దగ్గర తెలుసుకోవాల్సినవి యెన్నో వున్నాయి. అంతలో కనకమ్మ బామ్మగారు అటు వస్తుంది. "భజన ముగించినట్లున్నారే. పగలు రావటానికి తీరదని ఇప్పుడు చూచి పోదామని వచ్చాను. తెల్లవారితే తీరదు".

"ఈ అమ్మాయి వీరమ్మాయే"నంటుంది వరలక్ష్మమ్మ గారు. అంటే వీరి మేనకోడలు. అయితే కోడలుకూడ కావచ్చు.

గురు : యెంత అదృష్టమమ్మా! యే పూజాఫలమో. ఇటువంటి పిల్ల కోడలు కావటమంటే మాటలా?

అమ్మ యెవరేమనుకుంటున్నా మాట్లాడకుండా కూర్చుంటుంది.

గురు గోడకానుకుని కూర్చున్న అమ్మను రెక్క పట్టుకుని యెత్తుకుని భుజముమీద పడుకోబెట్టుకుని వీపు నవరిస్తూ, మంచి యోచన తల్లికి గొప్ప హృదయం. చల్లనిమూర్తి అని అంటారు. అని అంటూ కన్నీటి బిందువులు విడుస్తారు.

బామ్మ : (అమ్మను) తెల్లవారింది ఇంటికి వెళదాం వస్తావా? యెక్కడికో రైలు పట్టాలు దాటి పోవాలి.

గురు : ఇక్కడ వుంచమ్మా! ఇవాళ.

బామ్మ : నాదేముంది వాళ్ల తాతగారి ఇష్టం.

అమ్మ గురువుగారి భుజము మీదనుంచి లేచి నమస్కారం చేసి "వెళ్లొస్తాను బాబు" అమ్మ నమస్కారం చేసినప్పుడు గురువుగారికి మొయ్యలేని బరువు మోస్తున్నట్టు, ప్రపంచాన్నంతా మోస్తున్నానను కుంటారు. ఆయనకు క్రమంగా శరీరమంతా బరువెక్కుతుంది. 'యెందుకు ఇట్లా వున్నది. యెవరు నమస్కారం చేసినా ఇట్లా వుండదే. జ్ఞాని అయినవారి నమస్కారం ఇట్లాగే వుంటుందేమో ! అప్పుడు పెట్టించుకోవటానికి నాకే అర్హత లేదు' అని తనలో తాను అనుకుంటారు.

వెళ్లి వస్తానని చెప్పి బామ్మ, అమ్మ బయలుదేరి వెళతారు.

ఆయన అట్లాగే కూర్చుంటారు మైకంగా. భజనకు వచ్చిన వాళ్లంతా వెళ్లిపోతారు. తెల్లవారి 6 గంటలు అవుతుంది.

మధు : యెందుకు నాన్నగారూ అలా కూర్చున్నారు?

గురు : తెల్లవార్లూ నిద్రలేదుగాదూ, వొళ్లు బడలికై నిద్ర వస్తున్నది.

ఆరోజంతా గురు నాన్నగారు మైకంతోనే వుంటారు. స్నానం చేసినా, చేస్తున్నా, యేది తింటున్నా ప్రొద్దున్న అమ్మను భుజముమీద పడుకోబెట్టుకుని వీపు నిమురుతూ వున్న ఆ దృశ్యమే గుర్తు వస్తూ వుంటుంది.

మధు : యేమిటీ ఇంత పరాకుగా వుంటున్నారు?

గరు : యేమీ లేదు ! తెల్లవారు ఝామున ఆ అమ్మాయిని చెంపమ్మటి కొట్టాను. అదే జ్ఞాపకం వస్తూ వుంది.

మధు : అదేమిటి మీరు యీ స్వల్ప విషయానికి భాదపడతారు? ఆ అమ్మాయి మంచికి కొట్టారులే!

గరు : ఆ అమ్మాయి మంచికో, మన మంచికో? అంటే కొట్టకపోతే ఇన్ని విషయాలు బయటకు రావు గదా! అది తరువాత సంగతి. అంటూనే ఆ దృశ్యం మనసులో పెట్టుకుని మంచం మీద వారు నిద్రిస్తారు. సుమారు ఉదయం 10 గంటలు అవుతుంది.

శాస్త్రిగారి ఉత్సుకత :

అమ్మ ఇంటికి చేరి తాతగారు వూళ్లో లేని కారణంచేత మేడమీదకు వెళ్లి ఒంటరిగా కూర్చుంటుంది. యెక్కువగా పలకరించేవారు యెవరూ వుండరు. 11 గంటల తరువాత బామ్మ మేడమీదకు వచ్చి "యేం అమ్మా! యెక్కడికి వెళ్లా? అన్నానికి రాలేదేం?"

అమ్మ : వంట కాలేదనుకున్నా అత్తయ్యా! తాతగారు యెక్కడికి వెళ్లారు?

బామ్మ : గుంటూరు వెళ్లారమ్మా! ఇప్పుడయినా అన్నం పెడతాను.

అమ్మ : ఆకలి కావటం లేదత్తయ్యా! కడుపులో నొప్పిగా వున్నది.

బామ్మ : మీ తాతగారు లేకపోతే భోంచెయ్యవా?

అమ్మ : తాతగారున్న రోజుల్లో అనేకం భోజనం చెయ్యని రోజులున్నైగా?

నాన్నగారు (నాగేశ్వరరావు గారు) బజారునుండి ఇంటికి వస్తారు. భోంచేసి మేడమీద గదిలో పడుకుంటారు.

బామ్మ అమ్మను తీసుకుని కిందికి వెళుతుంది.

అమ్మ కిందికి వెళ్లి హాల్లో తాతగారు కూర్చునే కుర్చీలో కూర్చుంటుంది. ఇంతలో నాన్నగారి స్నేహితుడు మంత్రవాది సుబ్రహ్మణ్య శాస్త్రి గారు వచ్చి నాన్నగారి పేరుతో పిలుస్తారు.

అమ్మ తలుపు దగ్గరకు వెళ్లి గడియ తీస్తుంది. గడియ తీసి 'యేమిటండీ?' అని అడుగుతుంది.

శాస్త్రిగారు : నువ్వు యెవరమ్మాయివి?

అమ్మ : నేను యెవరమ్మాయినయితే యేంలే మీరు వచ్చిన పని చెప్పండి?

శాస్త్రి : నేను వచ్చిన పని చెప్పాను. నీవు యెవరమ్మాయివో చెప్పు.

అమ్మ : నేను యెవరమ్మాయినో అయితే వీళ్లయింట్లో ఎందుకు వుంటాను?

శాస్త్రి : వాళ్ల బంధువులమ్మాయి వుండగూడదూ. బంధువులైనా వుండొచ్చుగా వాళ్లఇంట్లో.

అమ్మ : బంధువులయితే వాళ్లకు నంబంధించినవాళ్లు కాదా? యెవరమ్మాయివని అడిగింది యే దృష్టితో?

శాస్త్రి : ఈ యింటివారి కూతురువేమోనని అడిగాను.

అమ్మ : కూతురువా? అని అడగలేదుగా. యెవరమ్మాయి వన్నావు.

శాస్త్రి : అమ్మాయివనటంలో నా వుద్దేశం అదే!

అమ్మ : నీ ఉద్దేశం వారి బంధువా అని అడిగారేమో అనుకున్నా.

శాస్రి : నీ పేరేమిటమ్మాయి?

అమ్మ : నాపేరు అనసూయంటారండి.

శాస్త్రి : ఏం చదువుకున్నావు?

అమ్మ : ఫలాన్ది చదవమని మా పెద్దవాళ్లు చెప్పలేదు. యేం చదవాలో నాకు తెలియదు.

శాస్త్రి : మీ బావ వున్నాడా ఇంట్లో?

అమ్మ : నాకు బావ యెవరో తెలిసినప్పుడు నేను యెవరి అమ్మాయినో తెలియదూ?

శాస్త్రి : (పకపకా నవ్వి!) భలే పిల్లవు. నువ్వు మీ బావను చేసుకుంటావా?

అమ్మ : చేసుకోవటమంటే ఏమిటో తెలియాలిగా అసలు!

శాస్త్రి : నీ బావ నిన్ను చేసుకుంటానంటున్నాడు.

అమ్మ : మా బావ మిమ్మల్ని, నన్ను అడగమని చెప్పాడా?

శాస్త్రి : ఆఁ

అమ్మ : వారు అడగమనటమే నిజమయితే ఆ సమాధానం మీ కొచ్చినట్లే!

శాస్త్రి : యేది సమాధానం?

అమ్మ : వెనక్కు తిరిగి మాట్లాడినదంతా జ్ఞాపకం చేసుకోండి!

శాస్త్రి : గుర్తురావటం లేదమ్మా! నీవు చెప్పు.

అమ్మ : చేసుకోవటమంటేనే తెలియదని చెప్తినే. అదే నా సమాధానం.

శాస్త్రి : ఇంతకూ నీకు నీ బావను చేసుకోవాలని వుందన్నమాట.

అమ్మ : అని నేను అన్నానా?

శాస్త్రి : స్పష్టంగా అన్నావు. మీ బావ వస్తే చెప్తా వుండు (అని నెత్తిమీద కొడతాడు ముద్దుగా)

ఇంతలో నాన్నగారు వస్తారు.

నాన్నగారు : యేమిరో యెప్పుడు వచ్చావు?

శాస్త్రి : నేను వచ్చి ఒక అరగంట అయింది. కాబోయే నీ భార్యతో మాట్లాడుతున్నారా.

నాన్న : ఛా అరవబోకు నాకు అంత ఇష్టం లేదురా బహుశా మనకు ఇవ్వరు.

శాస్త్రి : ఇస్తే చేసుకుందామనే గదరా. యేమో ఆ అమ్మాయి మా బావనే చేసుకుంటానని చెప్పింది. యేది? ఆ అమ్మాయి యెటో వెళ్లిందే!

అమ్మ పక్క గదిలో వుండి వింటూనే వున్నది.

నాన్న : మా పెద్దతల్లి కూతురుతోగూడా అన్నదట. బావనే చేసుకుంటానని. నీవు యెగతాళికి అంటున్నావా? నిజంగా అన్నదిరా.

శాస్త్రి : నిజంగా అన్నది. నేనడిగితే యెవర్ని చేసుకుంటావని? బజారుకు పోదాంరా.

నిగ్రహం గల విగ్రహం :

మన్నవ నుంచి సీతాపతి తాతగారు వస్తారు. అదే బండిలో గుంటూరు నుండి బిదంబర్రావు తాతగారు వస్తారు.

అమ్మ సీతాపతి తాతగారు రాగానే గబగబా వెళ్లి కాళ్లకు చుట్టేసుకుని "నాన్నా నన్ను తీసుకెళ్లటానికి వచ్చావా?"

సీతాపతి తాతగారు మాట్లాడరు.

అమ్మ : నాన్నా! మా పిన్ని కులాసేనా?

సీతాపతి తాతగారు : మీ పిన్నీ, నేను కలిసి నిన్ననే వచ్చాం వూళ్లోకి.

అమ్మ : అయితే మా పిన్ని దగ్గరకు తీసుకెళ్లు నాన్నా నన్ను

సీతాపతి తాతగారు : నేను వెళ్లేటప్పుడు తీసుకెళతానులే.

అమ్మ సరే అంటూనే సీతాపతి తాతగారి చెయ్యి వదిలిపెట్టి మేడమీదకు చిదంబర్రావు తాతగారి దగ్గరకు వెళుతుంది.

చిదంబర్రావు తాతగారు : (అమ్మను చూడగానే నవ్వుముఖంతో) యేమమ్మా మీ నాన్నగారితో ఇష్టాగోష్టి మాట్లాడుకొస్తున్నావేమిటి?

అమ్మ : ఊఁ, ఊఁ..... నాకు ఇష్టమైంది, ఆయనకు అయిష్టమైన గోష్టి మాట్లాడుకొస్తున్నా.

చిదంబర్రావు తాతగారు : యేమిటమ్మా కొత్త సమాధానం.

అమ్మ : యే క్షణానికా క్షణం కొత్తే గద.

చిదంబర్రావు తాతగారు : అంతేగా!

అమ్మ : నాన్నగారు మీ బండిలో దిగారనుకున్నా నేను.

చిదంబర్రావు తాతగారు : నేను ఇల్లు వదిలితే యెక్కడా భోంచెయ్యను గద. నీవు భోంచేశావుటమ్మా?

అమ్మ : నాకు మీరు వూళ్లో లేకపోవటమే వుపవాసం. అంతేకాని వేరే భోజనమేముంది?

చిదంబర్రావు తాతగారు : స్నానం చేసి ఇద్దరం భోంచేద్దామా?

అమ్మ : ఇది యెటూ కాని సమయం. రాత్రికే చేద్దాం తాతగారూ. నేను ఇంతవరకు భారతి పిన్నికి కనపడలా ఈ రోజు.

చిదంబర్రావు తాతగారు : యెక్కడున్నావ్ మరి?

ఇంతలో పున్నమ్మ గారు తాతగారితో మాట్లాడడానికి మేడమీదకు వస్తుంది.

అమ్మ : తెల్లవారు ఝామున (అని పున్నమ్మగారిని చూచి సరిపెడుతుంది).

పున్నమ్మ గారు తాతగారితో "మీరు ప్రొద్దుట్నుంచి భోంచెయ్యలేదుగా మరి రెండు గారెలన్నా తినొద్దురుగాని రండి".

యెటూ అమ్మకు పెట్టరు. పెట్టకపోతే తాతగారు తినరనే వుద్దేశ్యంతో అమ్మ క్రిందకు వెళ్లిపోతుంది.

చిదంబర్రావు తాతగారు అది గ్రహించుతారు. గ్రహించి, నాకు, అనసూయకు ఇద్దరకూ పెట్టు

పున్నమ్మ గారు : ప్రొద్దుట్నుంచి యెక్కడా కనపడలా. ఇప్పుడు ఇక్కడ చూస్తున్నా యెక్కడ తిరుగుతున్నదో దేశదిమ్మరి.

చిదంబర్రావు తాతగారు : యెక్కడుంటుంది? యేగదిలో కూర్చుందో.

పున్నమ్మ గారు : మర్చేపోయినా అబ్బాయి సీతాపతి వచ్చాడు. మీరు చూచారా?

చిదంబర్రావు తాతగారు : ఇద్దరం కలిసే లోపలకు వచ్చాం. వాడు నిన్ననే వచ్చాడు వాళ్ల అత్తవారింటికి చెప్పాడా?

పున్నమ్మ గారు : అట్లాగా యీ గడప తొక్కకుండా ఇంకో గడపలో కాలు పెట్టాడూ అని యేమోలే. ఇవన్నీ నాకెందుకు గాని నాకు బాలా త్రిపుర సుందరి విగ్రహం ఒకటి పెద్దది చేయించి పెట్టండి.

చిదంబర్రావు తాతగారు : అంటే యెంతది?

పున్నమ్మ గారు : మూడు అడుగుల్ది.

చిదంబర్రావు తాతగారు : మనకు వేరే మూడు అడుగుల విగ్రహమెందుకు? మూటికి మూలమైందీ, త్రిమూర్తుల కాధారమైందీ, త్రిలోకముల లేందీ త్రిపుటిని రహితం చేసేటువంటి బాలా త్రిపుర సుందరీ నిగ్రహంగల విగ్రహం ఇంట్లోనే తిరుగుతున్నది. ఆ విగ్రహానికి వేళకు అన్నం నీళ్లు చూస్తేచాలు.

పున్నమ్మ గారు : అంటే యెవరో చెప్పండి. నిగ్రహం గల విగ్రహమంటిరి. అంత గొప్ప స్థితి గల విగ్రహమెవరో చెప్పండి. అటువంటి విగ్రహానికి ఆకలిదప్పులుండవుగా?

చిదంబర్రావు తాతగారు : యే సాయిబులో చెక్కిన రాతిబొమ్మఅనుకున్నావా? ఆకలిదప్పు లెందుకుండవు? వాటిని జయించగలరు గాని.

పున్నమ్మ : అన్నిటికీ ఆధారమైతే ఇంకా జయించే దేమిటి?

చిదంబర్రావు తాతగారు : అన్నింటికీ ఆధారమై తన ప్రత్యేక స్వరూన్ని ధరించి వున్నది గాదూ, ఆ శరీరానికి కావలసినవన్నీ వుండవలసిందే. అటువంటివాళ్లు వాళ్లకై వాళ్లు కావాలని వస్తారు గనుక మనతోపాటు అతి సహజంగా వుంటారు. వాళ్లను గుర్తించటం మహా కష్టం. వాళ్లే కారణజన్ములు.

పున్నమ్మ : ఇంతకూ ఎవరంటారు?

చిదంబర్రావు తాతగారు : అది నేనిప్పుడు చెప్పినా మీకు చాలదు. ఇన్ని చెప్పి నాకే నిలవటంలా ఆ భావం.

పున్నమ్మ : పోనీ నిలిస్తే నిలుస్తుంది, లేకపోతే మీతోపాటు అనుకుంటాగా చెప్పండీ?

చిదంబర్రావు తాతగారు : పిచ్చిదానా యెవరూ లేరులే తమాషాగా అన్నా.

పున్నమ్మ : కాదులే చెప్పండి!

చిదంబర్రావు తాతగారు : మన యింట్లో మూడు అడుగుల పిల్లెవరు చెప్పు? గుండ్రటి చేతులు, ఆ పొట్టి, పొట్టి పరికిణీలు, ఆ బంగారపు ఛాయ, వంటినిండా బంగారం. పెద్ద జడ, ఎఱ్ఱగా పల్చటి పెదాలు, పొడవైన కోల కళ్లు, చక్కటి చిట్టి ముక్కు, పిచ్చిక పొట్లకాయల్లాంటి చేతులు, తామరపువ్వు లాంటి హస్తాలు, పారిజాత పూలకన్నా మించిన మెత్తదనం గల పాదాలు యెవరికి వున్నయ్యో చెప్పు మన ఇంట్లో?

పున్నమ్మ : మీరు చెప్పినవన్నీ లేకపోయినా, కొన్ని లక్షణాలు అనసూయ దగ్గర కనపడుతున్నాయి.

చిదంబర్రావు తాతగారు : కొన్నేగాదు, చెప్పిన లక్షణాలు అన్నీ వుంటాయి. గుర్తించు. ఇంకా నే చెప్పటం మర్చేపోయినా. యింత చిన్నతనంలో కుంకుమ బొట్టు కనుబొమ్మల మధ్య యెవరు పెట్టుకుంటారు? అమ్మాయి నడుస్తుంటే చూచా? యెంత సువాసన వస్తుందో? యెప్పుడైనా దగ్గరకు పిల్చి తీసి కూర్చోబెట్టుకుంటేగా తెలిసేది.

పున్నమ్మ : పలకరించుతాగాని యెప్పుడూ దగ్గర కూర్చోబెట్టుకోలేదు. దూరంగా వుండి పలకరిస్తా.

చిదంబర్రావు తాతగారు : చెప్పానుగా యీరోజున అన్నీ చూడు. నీ అనుభవాన్ని బట్టి నమ్ముదువుగాని.

పున్నమ్మ : ఇంతకూ మీరు చెప్పేది యేమిటి? మీరు చెప్పినవన్నీ అనసూయనేనా?

చిదంబర్రావు తాతగారు : యెబ్బే కాదు కాదు. చిన్నప్పట్నుంచి పెంచుతున్నారు గనుక యెంత వరకు గ్రహించారో విందామని.

పున్నమ్మ : మీరు అనుకున్నవన్నీ నమ్మనుగాని నాకు తెలిసినంత వరకు చెప్పమంటారా?

చిదంబర్రావు తాతగారు : బుద్ధిమంతురాలివి!

పున్నమ్మగారు : నాకు ఇది కావాలి. ఒద్దు అనేది లేదు, ఓర్పు కలిగింది.

చిదంబర్రావు తాతగారు : అప్పుడు నేను చెప్పిందంతా ఏమిటో ఆలోచించుకో. నాకంటే నీవే యెక్కువ గుర్తించావు. నేను రూపాన్నే వర్ణించి చెప్పాను. నీవు మనసునే గుర్తించావు. నీవు మనసును గుర్తించిన దానవు. గనుక యీ రోజు నుండి నీకు కలిగే అనుభవాలు నాకు చెప్తూ వుండు. ఇది మళ్లీ ఆంధ్రపత్రిక మాదిరిగా అందరికీ చెప్పబోకు.

పున్నమ్మ గారు : ఇది తేలిందాక నాకు విగ్రహం చేయించనంటారా?

చిదంబర్రావు తాతగారు : యెబ్బే యెందుకు చేయించను. చేయిస్తా. నల్లరాయి తెచ్చి సాయిబును పిలిస్తే వాడే చెక్కుతాడు.

పున్నమ్మ : అయితే ఆ రాయి దేముడు కాదంటారా?

చిదంబర్రావు తాతగారు : దేముడు కాదని అనను. చైతన్యం గల స్వరూపమైన దైవం ప్రత్యక్షంగా వుందని నేనన్నా.

పున్నమ్మ : నేను, మీరు యెంతగా చెప్పినా ఆ భాగం నేను నమ్మలేను.

చిదంబర్రావు తాతగారు : యీసారి చెప్పటం నా పొరపాటే!

పున్నమ్మ : యెవరి పొరపాటో ఒకరి పొరపాటు. అడగటం నా పొరపాటు.

చిదంబర్రావు తాతగారు : యెవరి పొరపాటైతే యేంలే పద కిందికి. ఇందాక యేదో పెడతానంటివే అని ఇద్దరూ కిందికి వస్తారు.

20. అమ్మ కళ్యాణ పర్వం-1

మౌలాలి రంగప్రవేశం :

అమ్మ సీతాపతి తాతగారితో మాట్లాడుతూ వుంటుంది. అమ్మ, తాతగారూ మాట్లాడేటప్పుడు భారతాంబ గారు కూడా వస్తుంది. చిదంబర్రావు తాతగారు స్నానానికి వెళతారు.

సాయంకాలం 5.30 గంటలు అవుతుంది.

భారతాంబ : (అమ్మను) పొద్దుట్నుంచి కనపడలేదేం. యెక్కడికి వెళ్లావు? (అని అడుగుతుంది).

అమ్మ : మేడమీదనే వున్నా, యెక్కడికీ పోలా.

భారతి : నాకు కనపడి ఇవాల్టికి మూడు రోజులు.

అమ్మ యేమీ మాట్లాడకుండా తలవంచుకు కూర్చుంటుంది.

సీతాపతి తాతగారు : యేం! ఇంట్లో వుండకుండా తిరుగుతున్నదా యేమిటి?

భారతి : దానికీ, వాళ్ల తాతగారికి తెలియాలి.

ఇంతలో చిదంబర్రావు తాతగారు స్నానం చేసి వస్తారు. అమ్మను లోపలకు పిలుస్తారు. అమ్మ లోపలకు వెళుతుంది. ఇద్దరూ గారెలు తింటూ కూర్చుంటారు.

చిదంబర్రావు తాతగారు : యేమిటమ్మా మధుసూధనరావు గారింట్లో కబుర్లు.

జరిగిందంతా చెపుతుంది అమ్మ.

చిదంబర్రావు తాతగారు అన్నీ విని, కాకి దగ్గరకు వచ్చేసరికి పకపకా నవ్వుతారు.

"ఊఁ ఇంతేనా. ఇంకా యేమన్నా జరిగినయ్యా".

అమ్మ : ఇంకా యేమీ లేదు తాతగారు. నాకు ఇటువంటి తిండి నేర్పుతున్నా రెందుకూ?

చిదంబర్రావు తాతగారు : యేమమ్మా........ (కాసేపాగి) యెందుకు అంతమాట అడిగావు?

అమ్మ : ఒకరోజు తింటే మరొక రోజుకు ఇంకా జిహ్వ చాపల్యం పెరగదూ. అందనప్పుడు ఏదయినా చేయాలనిపిస్తుంది. (ఇంతలో భారతాంబగారు వస్తుంది).

అమ్మకు ఇచ్చిన రెండు గారెల్లో ఒకటి తిని ఇంకొకటి చేతుల్లో పెట్టుకు కూచుంటుంది.

భారతాంబ గారు : అప్పటినుండి తింటూనే వున్నది. యెన్ని తిన్నదేం? అజీర్తి చేయదూ?

అమ్మ చేతిలో వున్న గారె ఆకులో పెట్టి తీసుకెళ్లి కుక్కలకు వేస్తుంది.

తాతగారు లేచి బయటకు వెళతారు. తినే గారెలు వదిలిపెట్టి లోపల వున్న భారతాంబగారు దొడ్లోకి వచ్చి "నీకు కాకుండా, కుక్కలకు గూడ యెక్కడ తెమ్మంటావు" అని నెత్తిమీద ఒకటి వేస్తుంది. అమ్మ యేమీ మాట్లాడకుండా వాకిట్లోకి వెళ్లి పోతుంది.

వంటమనిషి : యేమమ్మా! భారతీదేవి గారు యీ అమ్మాయి బాగా అల్లరి చేసిందేమిటి? సామాన్యంగా మీరు కొట్టరే. అమ్మాయి అల్లరి చేసినట్లుగా కూడ కనబడలేదు.

భారతాంబ : నీకనవసరం. నీవు వూరుకో.

అమ్మ వాకిట్లోకి వేళ్లేసరికి సీతాపతి తాతగారు చెప్పకుండా అత్తవారింటికి వెళ్లిపోతారు.

అమ్మ చిదంబర్రావు తాతగారి దగ్గరకు వెళ్లి "మా నాన్న తీసుకు వెళతానని చెప్పకుండా వెళ్లాడు తాతగారూ!"

చిదంబర్రావు తాతగారి కళ్ల వెంబడి నీళ్లు తిరుగుతాయి.

అమ్మ "నేను వెళ్లిరానా" అంటుంది.

చిదంబర్రావు తాతగారు : ఒద్దమ్మా చాలాదూరం.

అమ్మ : నాన్న నాకు చాలా దూరాన ఉన్నాడన్న మాట!

చిదంబర్రావు తాతగారు : అబ్బ యేమిటమ్మా! ఏది మాట్లాడినా కడుపు తరుక్కుపోయే మాట మాట్లాడతావు?

అమ్మ : నాకు మీ కడుపు తరుక్కుపోవాలని యేమీలేదు. నాకెప్పుడూ ఏదితోస్తే అది మాట్లాడుతాను.

ఇంతలో తాతగారిని యెవరో పార్టీలవారు వచ్చి పిలుస్తారు.

చిదంబర్రావు తాతగారు పార్టీతో మాట్లాడుకుంటూ అటు వెళ్లిపోతారు.

అమ్మ మెల్లిగా బయలుదేరి నడిచిపోతూ వుంటుంది.

భావన్నారాయణ స్వామి దేవాలయం వద్ద చింపిరి గుడ్డలతో ఒక సాయిబు ఎదురు వస్తాడు. చాలా సుస్తీగా వుంటాడు. అమ్మను జూచి అమ్మ యెటు నడుస్తుంటే అటు తల తిప్పుతూ కన్ను ఆర్పకుండా అమ్మవంకనే చూస్తాడు. అమ్మ గూడ అతని వంకనే చూస్తుంది. 'పాపం నాకోసమే చూస్తున్నాడు గాబోలు' అనుకుని అమ్మ దగ్గరకు వెళ్లి "యేం నాయనా" అని అనగానే చేతులు చాచి అమ్మను తన పొట్టలోకి తీసుకుని తలను గుండెలకు అదిమి పట్టుకుని ముద్దు పెట్టుకుంటాడు. దగ్గరకు వచ్చేటప్పటికి "యెంత చిన్నపిల్ల వయినావమ్మా. ఇందాక చాలా భారీ మనిషిలాగ కనిపించావు. యెందుకమ్మా ఇంత త్వరగా మారిపోయావు" అంటాడు.

అమ్మ : నీకు యేం కావాలో చెప్పు నాయనా?

సాయిబు : నాకు నీవే కావాలమ్మా.

అమ్మ : నేను వచ్చానుగా దగ్గరకు యెందుకు యేడుస్తావు?

సాయిబు : యేడుపు కాదమ్మా ఆనందం. నేను పుట్టటం సాయిబు ఇంట్లో పుట్టినా ఒక కోమటింట్లో పెరిగాను. ఆ యింట్లో అందరూ బ్రహ్మం గారి భక్తులు. అందువల్ల నాకు ఈశ్వరమ్మ అంటే చాలా ఇష్టం. ఈశ్వరమ్మను గురించి చదివేటప్పుడు ఒక రూపాన్ని నిర్ణయించుకున్నాను. నేను నిర్ణయించుకున్న రూపమే మీలో చూచాను. మీలో చూట్టం యేమిటి? మీరే ననుకున్నాను. మీ రూపం చూస్తుంటే క్షణక్షణేపి జరిగే మార్పు చాలా చిత్రంగా వుంది. మీ బస యెక్కడమ్మా?

అమ్మ : బస అంటే సభ అనా?

సాయిబు : కాదమ్మా నీవు చదువుకోలా?

అమ్మ : ఈశ్వరమ్మను అంటివిగా. ఇంకా చదువెందుకు?

సాయిబు : అవుననుకోవమ్మా! మామూలుగా అడిగాను. మీ ఇంటికి తీసుకెళ్లమ్మా. అసలు మీ ఇల్లెక్కడ?

అమ్మ : స్టేషను దగ్గర ఆస్పత్రికి ఎదురుగుండా.

సాయిబు : ఇప్పుడు నీవు యెక్కడికి పోతున్నావమ్మా?

అమ్మ : చదలవాడ సుబ్బారావు గారి ఇళ్లవైపు వెళుతున్నా.

సాయిబు : మా యిల్లుగూడ అటేనమ్మా. మీరు యెవరింటికి వెళతావమ్మా?

అమ్మ : మంత్రి కిష్టయ్యగారింటికి.

సాయిబు : ఓహూ ఆయన ఇంటికా? ఆయన నాకు చాలా కాలన్నుండి తెలుసు. ఆయన మీకు యేమవుతారమ్మా?

అమ్మ : నాకు తాతగారు అవుతారు.

సాయిబు : ఆయనకు యెవరూ అంత పెద్ద, కూతుళ్లు, కొడుకులు లేరే. తాతగారయ్యేందుకు.

అమ్మ : వున్నా లేకపోయినా, నాకు తాతగారయినాడు.

సాయిబు : యెటువంటి తల్లి ఆయనకు మనుమరాలయింది. తిరిగి మీ ఇంటికే వెళదాం రేపు వెళదాం తాతగారింటికి.

అమ్మ : సరేలే! నీవు ఇక్కడే వుండు. నేను వెళ్లి వస్తా అని అమ్మ ఒక అణా పెట్టి అరటి పళ్లు తీసుకుని వెళ్లిపోతుంది.

అమ్మ వెళ్లేప్పటికి తాతగారు భోంచేస్తూ ఉంటారు. అమ్మ వాకిట్లో నుంచుని "నాన్నా" అంటుంది.

'యెవరు? లోపలికి రామ్మా' అంటారు ఇంట్లోవాళ్లు. తాతగారి గొంతు మాత్రం కాదు. తలుపు తీస్తారు. అమ్మ లోపలకు వెళుతుంది. సీతాపతి తాతగారు, వారి మామగారు ఇద్దరూ భోంచేస్తూ వుంటారు. అమ్మ తీసుకువెళ్లిన అరటిపళ్లు వలిచి ఇద్దరకూ అన్నాల్లో వేస్తుంది.

సీతాపతి తాతగారు : ఇంత పొద్దుబోయి వచ్చేవెందుకు?

అమ్మ : నిన్ను వెతుక్కుంటూ వాకిట్లోకి వచ్చాను తీసుకెళతానన్నావని. ఇంకా ఎక్కడ దొరుకుతావు. ఇక్కడ దొరుకుతావని వెతుకుతూ వచ్చాను. చివరకు ఇల్లు చేరాను. సరే చూచానుగా వస్తా!

సీతాపతి తాతగారు : అన్నం తిని పోమ్మా.

కామేశ్వరమ్మమ్మ : ఇంత పొద్దుబోయి ఏం పోతావులే, ఇక్కడ పడుకో?

అమ్మ : వస్తా! తాతగారితో చెప్పకుండా వచ్చాను.

ఒకేసారిగా "ఇప్పుడేం పోతావులే వుండు" అంటారు అందరూ.

సీతాపతి తాతగారు : చెప్పకుండా వచ్చి వుంటుంది. వారు వెతుక్కోరూ?

అమ్మ : మీరు యెంత తీసుకొచ్చారో వాళ్లంత వెతుక్కుంటారు అంటూ బయటకొచ్చేస్తుంది. అమ్మ గుడి దగ్గర వున్న సాయిబును కలుసుకుని ఇల్లు చేరుతుంది.

అమ్మ సాయిబును చిటికేశ్వరపు చెట్టుక్రింద కూర్చోబెట్టి ఇంట్లోకి వెళ్తుంది.

నాన్నగారు, భారతాంబగారు, తాతగారు అంతా భోంచేస్తూ వుంటారు.

అమ్మ సరాసరి పైకి వెళ్లి పడుకుంటుంది.

చిదంబర్రావు తాతగారు భోంచేసి భారతం చదువుతూ కూర్చుంటారు.

భారతాంబగారు, నాన్నగారు మాట్లాడుతూ గదిలో కూర్చుంటారు.

అమ్మ మేడమీదనుంచి దిగివచ్చి వంటమనిషినడిగి ఒక మనిషి అన్నం పెట్టించుకుని తీసుకువచ్చి సాయిబుకు పెడుతుంది. "నాయనా! నీవు ఇక్కడే వుండు. అందరూ పడుకున్న తరువాత వచ్చి మాట్లాడుతా"నని అమ్మ తాతగారి దగ్గరకు వచ్చి కూర్చుంటుంది.

చిదంబ్రావు తాతగారు : భారతం ఆపి, యే భాగవతం నడిపి వచ్చావు?

అమ్మ : నడిచేదంతా భాగవతమే!

చిదంబర్రావు తాతగారు : అదే నీవు నడిపేదేగా?

అమ్మ : వెళ్లి నాన్నను చూసొచ్చా. వెళ్లేటప్పుడు దారిలో భలే విచిత్రమైన ఘట్టం జరిగింది తాతగారూ!

చిదంబర్రావు తాతగారు : నీకు విచిత్రమైన దేమిటమ్మా?

అమ్మ : యెవరో ఒక ముసలివాడు కట్టుకోవటానికి గుడ్డలు లేకుండ చినిగిపోయిన బట్టలు, శుష్కించిపోయిన శరీరం. మహా ఆర్తిగల మనస్సు. తిండికి గూడ లేనట్టు వుంది. యేమయినా ఇద్దామంటే నాదగ్గిర యేమీ లేదు.

చిదంబర్రావు తాతగారు : మన ఇంటికి తీసుకురాకపోయినా?

అమ్మ : తీసుకొస్తే ఏం చేస్తారు?

చిదంబ్రావు తాతగారు : మనతోపాటు పట్టెడన్నం తినేవాడు.

అమ్మ : మీరందుకు సిద్ధపడితే ఇప్పుడు మాత్రం రాడూ?

చిదంబర్రావు తాతగారు : అడుక్కోటానికి వస్తే రోజూ ఇంతన్నం తీసుకెళ్లి పెట్టు.

అమ్మ : అతను అడుక్కునేవాడు కాదు. అతని పరిస్థితి నాకు బాగా తెలియదు. కలిసి మాట్లాడలేదు బాగా.

చిదంబర్రావు తాతగారు : నీకు యెట్లా వుత్సాహంగా అట్లా చేద్దాం అతన్ని కనుక్కో.

అమ్మ : గుర్తులు చెప్పి వచ్చాను. వచ్చేడేమో వాకిట్లోకి వెళ్లి చూసొస్తా.

అమ్మ వాకిట్లోకి వెళ్లేటప్పటికి సాయిబు అమ్మనే ధ్యానం చేస్తూ వుంటాడు. అమ్మ వెళ్లి దగ్గర కూర్చున్నా గమనించడు.

అమ్మ : నాయనా!)సాయిబు పలకకుండా ధ్యానం చేస్తూవుంటాడు).

అమ్మ : (అతను లేచిందాకా వుండి) నాయనా ఇల్లు చూపించానుగా. నీకు యెప్పుడు వీలైతే అప్పుడు వస్తూ వుండు అన్నం కోసం బాధపడకు. ఇక్కడికేరా. తరువాత నేను వూరికి వెళ్లేటప్పుడు తాతగారికి చెప్పి పోతా. ఇంకా ఇక్కడ నేను నాలుగు రోజులుంటా.

సాయిబు "సరే వెళ్లొస్తానమ్మా" అని పై గుడ్డ దులిపి భుజాన వేసుకుని అమ్మకు సాష్టాంగ నమస్కారము చేసి వెళతాడు.

చిదంబర్రావు తాతగారు వాళ్లు పడుకుంటారు.

నాన్నగారికి భారతీదేవి సలహా :

అమ్మ పైకి వెళ్లబోయే సమయంలో నాన్నగారు, గదిలో నుంచి బయటకు వస్తారు.

నాన్నగారు : యెవరా మేడ యెక్కేది?

అమ్మ : నేనే. నేను అనసూయను బావా!

నాన్నగారు : యెక్కడనుంచి వస్తున్నా?

అమ్మ : వాకిట్లోకి వెళ్లి వస్తున్నా.

నాన్నగారు : ఇంత అర్ధరాత్రివేళ యెందుకు కిందికి దిగు. నువ్వేమి మాట్లాడావు శాస్త్రితో?

అమ్మ యేం మాట్లాడకుండ తలవంచుకుని నుంచుంటుంది.

నాన్న : పలకవేం? నీక్కాదూ చెప్పేది. అంత పెద్దమాటలా?

భారతాంబగారు : పచ్చి ముచ్చు రకం. పలుకుతుందేమో చూడు. (అని చెయ్యి పుచ్చుకుని వాళ్లు కూర్చున్న గదిలోకి తీసుకెళుతుంది).

నాన్నగారు లోపలకు వస్తారు. "నిజంగా బయటకు వెళ్లి వస్తున్నదో యీ గోడ మెత్తనవుందో అడుగు భారతీ. నాకు మొన్నటినుండి అనుమానమే!"

భారతి : యేం చెప్పవేం? గుడ్లు మిటకరించి నుంచున్నావ్.

అమ్మ మాట్లాడకుండ నేలమీద వేలుతో రాస్తూ నుంచుంటుంది.

భారతి : చెయ్యి పుచ్చుకు లాగి పలకమంటే పలకవేం (అని మెల్లగా చెంపమీద వేస్తుంది).

నాన్నగారు : యేవమ్మాయి చెప్పు.

అమ్మ : నేను గోడప్రక్కన నుంచోలా, నిజంగా వాకిట్లోనుంచే వస్తున్నా.

చిదంబర్రావు తాతగారు మేడమీదనుంచి అమ్మ ఇంకా పైకి రాలేదని క్రిందకి దిగుతూ వీరి ముగ్గురి సమావేశం చూసి గబగబా దిగుతారు.

"యేమిటిది భారతీ!" అంటారు.

భారతి : యేమీలేదు వాకిట్లోనుంచి వస్తూ గడప తగిలి పడ్డది.

చిదంబర్రావు తాతగారు : దెబ్బతగిలిందా అమ్మా?

అమ్మ : తగల్లా!

చిదంబర్రావు తాతగారు : ఇందాకట్నుంచి నీవు యెక్కడున్నావురా? (అని నాన్నగార్ని అడుగుతారు).

నాన్నగారు : నేను, నా చెల్లెలు మాట్లాడుకుంటున్నాం.

చిదంబర్రావు తాతగారు : ఇంత పొద్దుపోయిందాకా మాట్లాడు తున్నారేం? మీ ముఖాల్లో వర్చస్సు చూస్తే జరిగింది ఇదై వుండదు. అమ్మా పైకి పోదాం రా. వీళ్లిద్దరూ ఇక్కడ కూర్చుని మాట్లాడుకుంటారు. (భారతి అమ్మను కొట్టటం చూశారేమోనని భయపడుతుంది).

నాన్నగారు : ఆయన చూస్తే ఇంతమాత్రం ఓర్పుగా వుండొచ్చాడూ?

భారతి : అదీ నిజమే!

నాన్నగారు : అడిగితే చెప్తుందా?

భారతి : పగలగోసినా వూఁ అఁఅనదు. కడుపులో మాట బైటికి చెప్పదు. అందుకే మీ కాపరానికి తగిపోతుందనే నిన్ను చేసుకోమంటున్నా. లోకనాథాన్ని బాగా ప్రేమగా చూస్తుంది. కొంచెం అయోమయం పుటకేగాని పోషణ వుండి క్రమశిక్షణ చెప్పేవాళ్లుంటే, బాగానే వుంటుంది.

నాన్నగారు : యీ ముచ్చుతరహా జూస్తే అసహ్యంగా వుంది.

భారతి : అదేమిటిలే అన్నయ్యా. మనం యెన్ని తీసుకున్నా, యెన్ని అన్నా బయటపెట్టకుండా వుండటం యెప్పుడయితే వున్నదో, ముచ్చుతనం అప్పుడే వున్నది. ముచ్చుతనమంటే వేరే యేమున్నది? మాట్లాడక పోవటమేగా. మాట్లాడితే అన్నీ చెప్తుందిగా.

నాన్నగారు : మా అమ్మ పట్టుదల లేకపోతే నాకు చాలా మంచి సంబంధాలు వస్తాయి. మనకు ఆర్థికంగా సహాయము చేసేవాళ్లు. అమ్మకు యీ సంవత్సరమే చేతికి అక్కరకు వచ్చే పిల్లలున్నారు. ఆమె ఇల్లటం వద్దంటున్నదిగాని నీవైనా చెప్పి వొప్పించు భారతి. నీ ఇష్టం వచ్చిన పిల్లను వేరే చేసుకుంటానంటే కాదనదుగాని, ఇల్లటం మాత్రం వద్దంటున్నది.

భారతాంబగారు : ఆర్థిక పరిస్థితులు ఇక్కడైనా ఫర్వాలేదు. ఒక్కగానొక్కపిల్ల వాళ్ల తాతగారు గూడ కొంత ఆస్తి ఇస్తారు. పిల్ల మనం అందరం చెప్పినట్టు వింటుంది. చదువు సంధ్య లేకపోయినా, ఒకచోట కుదురుగా వుండి, చెప్పిస్తే చదువు మాత్రం ఎందుకు రాదు? యేది యెట్లా వున్నా అది నిన్ను గట్టిగా చేసుకుంటానని అంటున్నది గదా!

నాన్నగారు : ఆమాటే నన్నుగూడ కాస్త లాగుతున్నది. అది నిజమే అయితే అలోచించదగ్గ విషయమే. నీవు చెప్పింది నిజమే కావచ్చు. లోకనాథంతో ఆడుకుంటుంటే యేమిటి అల్లరని రెండుసార్లు కొట్టాను. పైకి యేడవలేదు. వాడు వచ్చి మా అమ్మతో చెప్పాడుగాని ఆ అమ్మాయి ఎవరితోనూ చెప్పలేదు.

భారతి : అదే నేను చెప్పేదీ! మన కుటుంబానికి చాలా అనుకూలమయిన పిల్ల అనే అనిపిస్తున్నది. ఇప్పుడు నువ్వు చేసుకోకపోతే మనం చాలా డబ్బు ఇవ్వవలసి వుంటాం. నాన్నగారు చాలా బంగారం వాడుకున్నారు. రంగక్కయ్య చచ్చిపోయేటప్పుడు ఆమె ఇచ్చిపోయిన బంగారం అంతా నాకోసం వాడారు నాన్నగారు. ఇదంతా రేపు తెనాలి వారికి అప్పగించాలి.

నాన్నగారు : సరే నీ యిష్టం ఎట్లా వీలో అట్లా చేసెయ్యి భారతీ. అసలు నా యెదుటికి పిల్చి అడుగు ఆ అమ్మాయిని.

భారతి : నీ యెదుట భయం కదన్నయ్యా ఎట్లా చెప్తుంది?

నాన్నగారు : అసలు మామయ్య ఏమంటాడో? మామయ్య కిష్టమేనా?

భారతి : యేమొ. రేపు వుద్యోగానికి వెళ్లేటప్పుడు 'నేను వుద్యోగానికి వెళతాను మామయ్యా, ఎప్పుడు చేస్తావు పెళ్లి' అని అడిగి వెళ్లు. వుద్దేశం తేలిపోతుందిగా.

నాన్నగారు : యెప్పుడు వెళ్లమంటావు అయితే?

భారతి : వారం రోజుల్లో వెళుదువుగాని

యివన్నీ మేడ మెట్లమీద నుంచుని తాతగారు వింటూ ఉంటారు. వారి సంభాషణ ముగించగానే తాతగారు అమ్మ దగ్గరకు వచ్చి "అమ్మా పిచ్చితల్లీ, నిద్రపోతున్నావా" అని గుండెల్లో తలపెట్టి పడుకుంటారు. "దెబ్బలు తిన్నావా అమ్మా ఆ పాపిష్టి చేతులతో నిన్ను కొట్టారా?"

అమ్మ యేమీ మాట్లాడకుండా పడుకుంటుంది.

విద్యలకు విద్య :

చిదంబర్రావు తాతగారు చెక్కిళ్లమీద రుద్దుతూ మొఖంలో మొఖం పెట్టి కళ్లనీళ్లు కారుస్తారు. "నీవు యెంతో శక్తి గలదానివని మనసుకు తోస్తున్నా, దాని పక్కనే యేకాస్త బాధపడ్డా వనుకున్నా యెంతో బాధ కలుగుతున్నది. కింద సంభాషణ వింటే ముందు యెంతో కథ వుంటేగాని యీ వివాహం జరగదని తోస్తున్నది".

అమ్మ : (అటు యిటు మసిలి) యేమిటి తాతగారు, అట్లా బాధపడతారు?

చిదంబర్రావు తాతగారు : అసలు నీకు వివాహం యెందుకమ్మా?

అమ్మ : కావలసిన యోగ్యత వుంటే జరుగుతుంది. నీకు పెళ్లెందుకు అంటారే? అందరికీ యెందుకో నాకూ అందుకే!

చిదంబర్రావు తాతగారు : నీవు, అందరూ ఒకటేనా అమ్మా?

అమ్మ : అందరికీ జరిగినట్లే జరుగుతాయి చూస్తారుగా.

చిదంబర్రావు తాతగారు : అందరికీ జరిగినట్టు జరిగినా ఫరవాలా. యెందుకంటే నీ విధానం నుంచోపెట్టి నరుకుతున్నా సమాధానం చెప్పవాయె.

అమ్మ : ఇప్పుడు పెళ్లి మాటెందుకు తాతగారూ?

చిదంబర్రావు తాతగారు : కింద భారతి, వాడు మాట్లాడుకుంటుంటే విన్నానమ్మా! రేపు ఉద్యోగానికి పోయేటప్పుడు మీ నాన్నగారిని అడిగి తెల్సుకు

పోతాడట. ఒకరకంగా పెళ్లి అంటూ చేయదలిస్తే మంచిదేననుకో. మేనత్త కడుపులో పెట్టకుంటుంది. నాలుగు యకరాలు కొ(డుంది. యేదో చదువు నాలుగు అక్షరాలు చదువు కున్నాడు. పదిడబ్బులు తెచ్చుకోగలడు. కొద్దిగా కుఙ్ఞతనపు లక్షణాలు ఉన్నా తిప్పుకోవచ్చు.

అమ్మ : అందరికీ నీకు పోలికేమిటంటూ, మళ్లా అట్లాంటివే ఆలోచిస్తారేం తాతగారు?

చిదంబర్రావు తాతగారు : అదేగా అమ్మా మానవత్వం.

అమ్మ : యేది జరగాలో అది జరుగుతుందిలే పడుకోండి.

చిదంబర్రావు తాతగారు : తెల్లవారింది, యింకా యేం పడుకునేది? యీ రోజు ఒంగోలు వెళ్లాలి.

అమ్మ, తాతగారు యిద్దరూ లేచి ముఖం కడుక్కుంటారు.

ఇంకా భారతాంబగారు నాన్నగారు మాట్లాడ్తూనే వుంటారు.

చిదంబర్రావు తాతగారు : వీళ్లకు యింకా సోది తెగలేదే?

అమ్మ : మనం మాట్లాడుకోవటంలా, అట్లాగే వాళ్లు మాట్లాడుకుంటారు.

చిదంబర్రావు తాతగారు : మనం వాళ్లలాగా మాట్లాడు కుంటున్నామా? ఒకళ్లను గురించి, మాట్లాడుకోవటం లేదుగా?

అమ్మ : యిప్పుడు మాట్లాడింది అదేగా. వాళ్లను చూడు యెట్లా మాట్లాడుతున్నారో. అంటే యింకొకళ్లను గురించి మాట్లాడు కున్నట్లేగా.

చిదంబర్రావు తాతగారు : లా అన్నా చదువు కోవమ్మా. యేమిటి నా మొహం చదువుకోమంటం. ఇప్పుడు లాయర్ కాకపోతేగా. (అని లేచి స్నానం చేసివచ్చి హాల్లో కూర్చుని పేపరు చదువుతూ వుంటారు).

అమ్మ : తాతగారూ! పేపరు పేరేమిటి?

చిదంబర్రావు తాతగారు : ఆంధ్రపత్రికమ్మా!

అమ్మ : ఆంధ్రపత్రిక దీనిపేరు. అంటూ పై కాగితం అమ్మ చేతిలోని తీసుకుని ప్రతి అక్షరాన్ని తాతగారికి చూపించి, ఇది ఫలాని అక్షరం కాదూ అంటూ క్రమంగా కాగితమంతా చదువుతుంది.

చిదంబర్రావు తాతగారు : మా అమ్మ సరస్వతి. విద్యలకు విద్య. ఇంకా నీకు బడెందుకమ్మా?

అమ్మ : మన్నవలో ఇదివరకు పోలంరాజు రాఘవయ్య గారి బళ్లోకి వెళ్లాను తాతగారు మూడు రోజులు. అక్కడ 'శ్రీ' చుక్క పెట్టేవాళ్లు. ప్రతిరోజూ శ్రీ నాకే వచ్చేది. అయితే ఓనమాలు కూడ రుద్దిపెట్టలా.

చిదంబర్రావు తాతగారు : నాకు బండిటయిమయింది. నేను ఒంగోలు వెళ్లాలి. నీకు చదివి వినిపించడ మెందుకమ్మా. చదువు రాదనా! నీవు తల్చుకుంటే యీరోజు పద్యాలు రాయలేవూ?

అమ్మ : పద్యాలు రాయలేను, గద్యాలు వ్రాయలేను.

చిదంబర్రావు తాతగారు : యేంరాస్తా. అనసూయోపనిషత్తులు వ్రాస్తావా?

అమ్మ : అనసూయోపనిషత్తులు కావాలి గాని, అనసూయోపనిషత్తులు వ్రాయటమేమిటి?

చిదంబర్రావు తాతగారు : ఒహూ! అవునమ్మా నాకు కనీసం ఆ భావన కూడా రాలేదు. నాకు టయిమయింది. నీ దగ్గర కూర్చుంటే కాలం గూడ గుర్తించలేం అంటూ లేచి లోపలకు వెళ్లి కోటు వేసుకుని వూరికి వెళ్లారు.

మౌలాలి పరిచయం :

అమ్మ మెల్లగా తాతగారు వూరికి వెళ్లగానే సీతాపతి తాతగారున్న చోటుకు వెళ్లటానికి ప్రయాణమవుతుంది. నిన్న కనపడ్డ సాయిబు కనపడతాడేమోనని బజారు వెంట వెతుక్కుంటూ వెళుతుంది. యెక్కడా కనపడడు. సీతాపతి తాతగారి ఇంటికి సమీపంలోకి వెళ్లగానే పైనుంచి వస్తూ వుంటాడు. అతన్ని చూచి అమ్మ అక్కడే నుంచుంటుంది. అతను అమ్మను చూడడు. తల వంచుకు వస్తూ వుంటాడు. అమ్మ గబగబా అతని దగ్గరకెళ్లి నుంచుంటుంది. సాయిబుకు కొద్దిగా కంటి మసక వున్నది. "అసలు నీపేరేమిటి నాయనా?" అని అమ్మ అడుగుతుంది.

సాయిబు : నాపేరు మౌలాలి.

అమ్మ : అసలు నీ వుద్దేశ్యమేమిటో చెప్పు నాయనా! ఏం కావాలి యేమిటి?

మౌలాలి : నాకేమి వద్దమ్మా! నీవు కావాలి.

అమ్మ : నేనున్నా అన్నీ కావలసినదేగా?

మౌలాలి : నీ దగ్గరే వుంచుకోమ్మా!

అమ్మ : నేను ఒకచోట వుండను గదా! యెట్లా వుంచుకోను. వుంచుకోవటం అట్లా వుంచి నీకేదైనా జీవనానికి వుందా?

మౌలాలి : యేమీ లేదు తల్లీ!

అమ్మ : నేను ఏదైనా ఇస్తా తీసుకుని ఇదిబెట్టి చీరాల ఆస్పత్రి దగ్గర నాను రొట్టె బసకట్టు. అమ్ముకుంటూ వుండు. బాగా ఖర్చు అవుతుంది. (అని జడ కుప్పెలు తీసి ఇస్తుంది. చేతిలో పెట్టి) బాధపడబోకు నాయనా. మళ్లీ నీవు సంపాయించిం తరువాత నాకు ఇద్దువుగానిలే!

మౌలాలి : నిన్నేమనరా అమ్మా మీ ఇంట్లో వాళ్లు? ఇంట్లోవాళ్లు అనేదేమిటి చిట్టితల్లీ! చక్కగా వున్నావు ఇవి వేసుకుంటే. నాకీ బంగారపు వస్తువులు ఎందుకమ్మా! నీ దగ్గర అట్టేపెట్టుకుని పట్టెడన్నం పెట్టు.

అమ్మ : నేను యీ వూళ్లో వుండనుగా, యెల్లుండి వెళ్లిపోతున్నా.

మౌలాలి : నీవు యెక్కడికి వెళితే అక్కడకు వస్తా అమ్మా.

అమ్మ : అక్కడ వాళ్లు నీకు అన్నం పెడ్తుంటే వూరుకోవద్దా?

మౌలాలి : వూళ్లో అడుక్కు తిని నీదగ్గర వుంటా అమ్మా!

అమ్మ : సరే అట్లా అయితే రా. ఇట్లా సంపాయించుకుంటే రేపు లేవలేని రోజులొస్తే నాలుగు రూపాయలుంటై.

మౌలాలి : నేను లేవలేని రోజు నీవే వున్నావుగా అమ్మా.

అమ్మ : నేను యెప్పుడూ అక్కడే వుంటానని నమ్మక మేమిటి?

మౌలాలి : నిన్ను బాధించకుండ నువ్వు వున్న వూళ్లో వుండి దూరంగా వుండే నమస్కారం చేసుకుంటానమ్మా!

అమ్మ : సరే పోదాంరా! నీకు భార్యా పిల్లలే లేరా?

మౌలాలి : లేరమ్మా! తల్లి, తోడు నీడ, అన్నీ నీవే.

అమ్మ : సరే ! ఇక్కడే కూర్చో, నేవెళ్లి మా నాన్నగారితో ప్రయాణ మెప్పుడో అడిగివచ్చి నిన్ను తీసుకు వెళతాను. (అమ్మ తాతగారి దగ్గరకు వెళ్లి) నాన్నా యెప్పుడు వెళదిం మన్నవ?

సీతాపతి తాతగారు : యెప్పుడో అప్పుడు వెళదాం, తొందరేం?

అమ్మ : తాతమ్మ ఒక్కతే వున్నదిగా!

సీతాపతి తాతగారు : ఫర్వాలేదు వెళదాంలే! నేను వచ్చి చెపుతానులే యెప్పుడు వెళ్లేది.

అమ్మ : సరే అయితే నేను వస్తా! (తాతగారు మెదలకుండా వూరుకుంటారు).

అమ్మ వచ్చేస్తుంది. సాయిబు దగ్గరకు వచ్చి "నాయనా! నేను యెప్పుడు వెళితే అప్పుడు తీసుకు వెళతాను".

మౌలాలి : సరే నేను వాకిట్లోనే ఉంటానుగా పోదాం పద.

అమ్మ "నువ్వు మెల్లగా రా. నేను తాతగార్ని కలుసుకోవాలి పనుంది". అని అమ్మ ముందు నడిచి వెళ్తుంది. తాతగారు ఇంకా రాలేదు.

మౌలాలి మెల్లగా నడిచి వస్తుంటాడు.

అమ్మ అతని కోసం ఎదురు చూస్తూ కూచుంటుంది. అతను ఎంతసేపు చూసినా రాలేదు. ఉదయం 9.30 గంటలవుతుంది. వంటవుతుంటుంది. అమ్మ వంటమనిషి దగ్గరకి వెళ్లి "మీరు వెళ్లేలోగా ఒక మనిషి అన్నం నాచేతికిచ్చి మీరు వెళ్లండి".

వంటమనిషి "అట్లాగే అమ్మా!" అని విస్తట్లో పెట్టి (అమ్మకు) యిస్తుంది.

మౌలాలి వస్తాడు. అమ్మ అతనికి అన్నం పెడ్తుంది.

యింతలో సీతాపతి తాతగారు వచ్చి ఎల్లుండి ప్రయాణమని చెప్పారు అమ్మకు. మధ్యాహ్నం 1 గంటకల్లా చిదంబర్రావు తాతగారు వస్తారు. భోంచేయకుండానే వస్తారు.

అమ్మ : తాతగారూ! నేను అన్నం పెడ్తా తింటారూ?

చిదంబర్రావు తాతగారు : ఎందుకు తిననమ్మా? అంతకంటే కావలసినదేంటి?

అమ్మ : సరే రండి అయితే పెడ్తా !

అమ్మ అన్నం పెడ్తుంది తాతగారికి. అందరూ నిద్దర్లు పోతుంటారు.

చిదంబర్రావు తాతగారు : మళ్లీ ఎప్పుడు పెడ్తావు తల్లీ! బంగారపు చేతులతో?

అమ్మ : ఎప్పుడు నాకు నీకు పెట్టే యోగ్యత ఉంటే అప్పుడు. మా ప్రయాణం ఎల్లుండి. తెలిసిందా మీకు ?

చిదంబర్రావు తాతగారు : మొన్న ఎవరితోనో నీవంటుంటే విన్నాను. ఆ సాయిబు సంగతి ఏం తేలింది?

అమ్మ : సాయిబు తో జరిగిన సంభాషణంతా చెప్తుంది.

చిదంబర్రావు తాతగారు : మనకు బరువు లేకుండా అతను అడుక్కు తింటే, యిబ్బంది ఏముంది? ఒకప్పుడు మాత్రం బరువే ముందనుకో! ఒక మనిషికి అన్నం పెట్టడం బరువు కాదు. అది ఇంట్లోవాళ్ల యిష్టాయిష్టాల మీద ఉంటుంది. ఇటువంటివాటికి తాతమ్మ ఏమందుగా. తాతమ్మ అన్నం పెడ్తుంది. ఆమెకేం సందేహం లేదు. వచ్చేటప్పుడు మంచి గానే వస్తారు. తరువాత మళ్లీ బాధ్యతను వాళ్లు గుర్తుంచుకోరు మారిపోతారు.

అమ్మ : ప్రాప్తమున్నన్నాళ్లు ఉంటాడు. తరువాత అతని దారిన అతను వెళ్లిపోతాడు.

చిదంబర్రావు తాతగారు : అంతేననుకో! అతన్ని చూడలేదు. ఏడీ? అతను ఎక్కడ ఉన్నాడు?

అమ్మ వాకిట్లోకి వెళ్లి చిటికేశ్వరపు చెట్టు క్రింద ఉన్న సాయిబును లోపలకు పిల్చుకు వస్తుంది.

మౌలాలి చిదంబర్రావు తాతగార్కి నమస్కారం చేస్తాడు. చిదంబర్రావు తాతగారు కూడ చేస్తారు. ఇద్దరూ ఒకర్ని ఒకరు చూచుకొని, నవ్వుకుంటారు కానీ పలుక్కోరు.

అమ్మ : 10 రూపాయలిద్దాం! ఏదో తగిన వ్యాపారం చేసుకోమని చెప్పండి తాతగారూ మీరు.

చిదంబర్రావు తాతగారు : యేమిటి నాయనా? ఏమిటి నీ జీవనం?

మౌలాలి : ఏముంది నాయనా. నాకు మొదటినుండి బ్రాహ్మలతో స్నేహం. నాది అసలు నాగులపాడు. మా తాతలు ఎవరో ఈ వూరు వచ్చారు. తాతల దగ్గరనుండి మేము నమాజుకు వెళ్లేవాళ్లం కాదు. కుజాను చదివి ఎరుగం. మా నాన్నగారు కృష్ణభక్తుడు. నాకు చిన్నప్పటి నుండి బ్రహ్మం గారంటే చాలా యిష్టం. మా ఆస్తి అంతా పోయింది. బంధువులు అందరూ పోయినారు. నేను ఒక్కడ్నే మిగిలాను. తల్లిలేదు. తండ్రి లేడు తల్లి లేదంటున్నాను. దరిద్రుడ్ని. తల్లి తొరికింది ఆ బ్రహ్మం గారి మనమరాలు ఈశ్వరమ్మ. నాకు ఈ అమ్మగా కన్పించింది. యీమెకు, ఆమెకు భేదం లేదనుకున్నా. నేను సిద్ధయ్యంత కాకపోయినా, కనీసం "అమ్మను" గుర్తుపెట్టుకొనే స్థితన్నా ఉంటే చాలు. ఒదిలిపెడ్తే ఆ గుర్తుకూడా ఉండదుగా. అందుకని అమ్మను దగ్గర ఉంచుకొనే స్థితి లేదు కనుక దగ్గర ఉందామని, నా కోసం ఏడ్చేవారు ఎవ్వరూ లేరు. నన్ను చూచి, సంతోషించేవాళ్లూ లేరు. అందుకే అమ్మను కష్టపెట్టకుండా ఎక్కడైనా అడుక్కొచ్చుకుని తింటూ అమ్మను చూస్తూ యీ పంచలో ఉంటాను.

చిదంబర్రావు తాతగారు : సరే నీ యిష్టం. దూరమాలోచించుకో! అమ్మాయికి వివాహమైతే అత్తవారింటికి పోతుంది. అప్పుడు ఎక్కడ ఉంటావు?

మౌలాలి : అప్పుడు ఏవూరు వెళ్తే ఆవూళ్లో అడుక్కుంటా!

చిదంబర్రావు తాతగారు : సరే! నీ యిష్టం. అన్నింటికీ సిద్ధపడి ఉన్నావు కనుక ఒకరి సలహాతో ఏం పని ఉంది? రేపు ప్రయాణం. అన్నం తీసుకొచ్చి పెట్టు! (అంటారు అమ్మతో)

మౌలాలి : యిందాకనే పెట్టిందయ్యా !

చిదంబర్రావు తాతగారు : లోపలికి పోదాం పదమ్మా!

అమ్మకు భారతీదేవి ఉద్బోధ :

అమ్మతో లోపలికి పోంగానే భారతాంబగారు దగ్గరకు పిలుస్తుంది అమ్మను. "కూర్చో! ఏమిటి సంగతులు? మీ నాయనేమన్నాడు? నీ పెండ్లిమాట ఏమైన అంటున్నాడా?"

అమ్మ : ఏమో నాకు తెలియదు.

భారతాంబగారు : అన్నయ్యను చేసుకుంటావా? మరి బుద్ధిమంతుడు, చక్కనివాడు. చదువుకున్నవాడు. మేమంతా దగ్గర ఉంటాము. మీ బాపట్ల తాతయ్యను తేపా చూడచ్చు. కట్నాలిచ్చి యితరత్రా యిచ్చినా ఇప్పుడు హైమవతి పిన్ని గతిచూడు ఇప్పుడెల్లా ఉందో (హైమవతి అమ్మ పినతల్లి) ఇప్పుడు నన్ను ఎవరో పరాయివాళ్లకు యిచ్చారు. కాస్త జబ్బుచేస్తే వెళ్లగొట్టారు కద. మాట్లాడితే మళ్లీ పెండ్లి చేసుకుంటామంటారు. అదే నన్నుకూడా ఏ భావనారాయణ మామయ్యకో యిచ్చినట్లైతే (అమ్మ పినతండ్రి) యీ బెదిరింపులుండేవి కాదుగా! నీవా రోగిష్టి మారిదానివి, మీ నాన్న అంత తెలివి గలవాడు కాదు. పట్టించుకునేవాడూ కాదాయె. మీ అన్నయ్య చూస్తే ఒట్టి రౌడీ! వాడికి యీ అన్నయ్య కివ్వటం కూడా యిష్టం లేదనుకో ! వాడికి యీ కష్టసుఖాలు ఏం తెలుస్తయ్? ఎటుతిరిగీ మేనత్తకదా. నిన్ను పెంచిన తాతమ్మ. మీ అత్తయ్యను మీ ఇద్దర్నీ కాకుండా అన్నయ్యను (అంటే నాగేశ్వరరావు గారు) కూడా పెంచింది. ఆమెకు యిచ్చే మనోవర్తి మీ దగ్గరే పెట్టుకొని మీకు చేస్తూ మీదగ్గరే వుంటుంది. ఎన్నంటున్నా సమాధానం చెప్పవేం? వింటున్నావా! అందుకే వాడుకూడా ఒట్టి గబ్బిలం మొహం అంటాడు.

అమ్మ వింటున్నానని తల ఊపుతుంది.

భారతి : మాట్లాడవేం ! నోరు పోయిందా?

అమ్మ తల ఊపుతుంది.

భారతాంబ : ఏమిటి? అన్నింటికి ఒకేరకంగా ఊపుతావ్? నోరు పోయిందని ఊపుతున్నావా ఏంటి?

అమ్మ అప్పుడూ మాట్లాడదు.

భారతాంబ : (ఉంగరంచేత్తో మొట్టి) ఎందుకని మాట్లాడవ్? ఇష్టం లేకపోతే లేదని, ఉంటే ఉందని చెప్పు.

అమ్మ : చెప్పేది ఏమిటి పిన్నీ? నా శ్రేయస్సును గురించి ఆలోచించే మీ బోటివారంతా ఉండగా నా విషయాన్ని గురించి నేను ఆలోచించు కోవాల్సిన అవసరం ఏముంది?

భారతాంబ : మీ తెనాలి వారికి యిష్టముండదు. రేపు వాళ్ల చెయ్యబోయే దేమిటంటే వున్న బంగారం అంతా పెట్టి పదివేలు బోసి, యే భాగ్యవంతుణ్ణో చూసి ఇచ్చి మళ్లీ ముఖం చూడరు. పురుళ్లు, పుణ్యాలు యెవరు చేస్తారు. పరాయిచోటైతే తాతమ్మ రాదు. నేను పదే పదే చెప్తున్నాను అని విసుగ్గా వుందా? వాడికి చాలా మంచి సంబంధాలు వస్తున్నాయి. వాడికి నేను, సుందరీ వాళ్లు చెప్పిన మాటలవల్ల సందేహిస్తున్నాడు. యెవరు యెన్ని చెప్పినా నీకు అక్కరకు వచ్చేవాళ్లు యెవరూ లేరు. నీవు మారబోకు. నేను చెప్పినట్లు విను బాగుపడతావు.

అమ్మ భారతమ్మ గారి కాళ్లు పిసుకుతూ తల వంచుకుని కూర్చుంటుంది ఇంతసేపు.

21. అమ్మ కళ్యాణ పర్వం - 2

ఉత్తరం బట్వాడా :

చిదంబర్రావు తాతగారు : అమ్మా యేం చేస్తున్నావురా అని పిలుస్తారు.

అమ్మ : వస్తున్నా తాతగారూ ! పిన్నీ వెళ్లిరమ్మంటావా?

భారతాంబ : వెళ్లు త్వరగారా. బజారుకెళ్లి బజ్జీలు తేవాలి. వుత్తరం పోస్టాఫీసులో వేసిరావాలి.

అమ్మ చిదంబర్రావు తాతగారి దగ్గరకు వెళ్లి "యెందుకు తాతగారు పిలిచారూ?"

చిదంబర్రావు తాతగారు : యెందుకూ లేదమ్మా. రేపు వూరికెళతావు గదా!

అమ్మ : "బజారుకెళ్లి బజ్జీలు తెచ్చి", వుత్తరం రాస్తుందట. పోస్టాఫీసులో వేసివస్తా

చిదంబర్రావు తాతగారు : నీవు కాకపోతే యెవరిచేతనైనా చేయించుకో కూడదూ? వీరాస్వామిని పిలుస్తాలే.

అమ్మ : క్రిందకి వెళ్లి చెప్పివస్తా ఆ మాటైనా

చిదంబర్రావు తాతగారు : యేమిటి చెప్పి వచ్చేది? వద్దులే (అని కిందికి వెళ్లి మనిషిని పిలిచి), "నీక్కావలసింది యేమిటో చేయించుకో మనిషి వచ్చాడు". అని భారతాంబ గారితో చెప్పి పైకి వస్తాడు.

భారతి : నాకొద్దులే ఫో వీరాస్వామీ!

వీరాస్వామి పైకి వెళ్లి అమ్మాయిగారు వద్దంటున్నదండీ!

అమ్మ : నేను వెళ్లి కొని ఇచ్చివస్తాలే తాతగారూ! యెంతలోకి వస్తాను. మళ్లీ వచ్చి తెల్లవార్లూ మాట్లాడుకుందాం రేపు 11 గంటలకు గదా ప్రయాణం.

చిదంబర్రావు తాతగారు : అయినా దానికి అంత పట్టుదల యెందుకు? నీవు బజారుకు వెళ్లకు.

అమ్మ : మనకు కూడా అంత పట్టుదల వున్నట్లేగా. మనం వదిలి పెట్టింది యేముంది?

చిదంబర్రావు తాతగారు : యెక్కడ కక్కడ నోరు మూస్తావు. సరే నీ యిష్టం పోయిరా. రేపు యెవర్ని పంపుతుందో చూద్దాం. పరమ మూర్ఖురాలు. యెంత తెలివిగలదో అంత తెలివితక్కువ కొన్నింట్లో.

అమ్మ గబగబా మేడదిగివచ్చి భారతాంబ గారి దగ్గర నుంచుంటుంది.

భారతాంబ : యెందుకని రానన్నావట? ఇక్కడే చెప్పక పోయినావ్. ప్రతీదీ ఆయనకు చెప్పటం బాగా నేర్చావు. అది పోష్టాఫీసులో వెయ్యటానికి వీరాస్వామికి ఇవ్వటానికి వీలైన వుత్తరం కాదు. నువ్వు తీసుకెళ్లి మా అత్తవారింటికెళ్లి మీ బాబాయి వున్నారేమో చూసి ఇచ్చిరా. వస్తూ వస్తూ బజ్జీలు కొనుక్కురా.

చిదంబర్రావు తాతగారు కోటు వేసుకుని బజార్లోకి వస్తారు. పక్క బజార్లో అమ్మను కలుసుకుంటారు. అమ్మతో "ఆ వుత్తరం నాచేతికి ఇస్తే నేను పోస్టులో వేస్తాను. నువ్వు బజ్జీలు కొనుక్కెళ్లు. దగ్గరలో హొటలుంది".

అమ్మ : పోస్టులోది కాదులెండి. ఇది రామచంద్రరావు బాబాయి గార్కి.

చిదంబర్రావు తాతగారు : అయినప్పటికి చూచి ఇస్తానులే.

అమ్మ : అట్లా ఇవ్వను. వాళ్లది వాళ్లకే ఇస్తాను. లేకపోతే భారతి పిన్నికయినా ఇచ్చేస్తాను కాని అని ఆపివేస్తుంది.

చిదంబర్రావు తాతగారు : అంటే నీకివ్వను అనా?

అమ్మ : మధ్యలో నాకెందుకు తాతగారూ? యెవళ్లకు ఇవ్వమన్నదో వాళ్లకు ఇస్తాను. మీరు యేదైనా వుత్తరం ఇస్తారనుకోండి అది యెవరికీ ఇవ్వద్దంటారు. యెవరికయినా ఇచ్చినప్పుడు మీకెలా వుంటుంది? ఇదిగూడ అటువంటిదేగదా!

చిదంబర్రావు తాతగారు : సరే మధ్యలో నిన్ను బాధించటమెందుకు పో (అని తాతగారు వెనక్కు తగ్గుతారు).

భారతాంబ గారు చెప్పిన పనులు చేసి అమ్మ ఇంటికి వస్తుంది.

సాయంకాలం 6 గం॥లు.

భారతి : ఇంతసేపు యేంచేశావు? పోయి గంటన్నరయింది.

అమ్మ : యేంచేసేది. బాబాయి ఇంట్లో నేనప్పుడు అందరూ అడుగుతారు గదా! వుత్తరం యేమిటని? అందుకని ఇంట్లో కూర్చోకుండ బజార్లో కూర్చుని బాబాయి వచ్చిన తరువాత ఇచ్చి వచ్చాను. అందువల్ల ఆలస్యమైంది.

భారతి : యేమన్నారు?

అమ్మ : వారేమి చెప్పలేదు. నేను అడగలేదు.

భారతి : యేడ్చావు ఫో, అవతలకు ఫో.

అమ్మ : అందుకే బ్రాహ్మల్లో చిన్న, బెస్తల్లో పెద్ద వుండగూడదని తాతమ్మ అంటూ వుండేది. ప్రతి పనికి చిన్నవాళ్లను వుపయోగించుకుంటూ వుంటారు.

చిదంబర్రావు తాతగారు : యేమిటమ్మా అంటూ వస్తున్నావు?

అమ్మ : యేమీ లేదు తాతగారూ! ఇందాక మీరు వుత్తరం అడిగినప్పుడు నేను ఇవ్వకపోవటం తప్పా? మీరు అడగటం తప్పా? అని ఆలోచించుకుంటు వస్తున్నా. తాతయ్య అడిగారు నేను ఇవ్వలేదని చెప్పలా. అప్పుడు యీమె ఏమనేదో?

చిదంబర్రావు తాతగారు : దెబ్బగొట్టావులేమ్మా. రామచంద్రరావు వున్నాడా ఇంట్లో?

అమ్మ : లేరు. వచ్చిందాక వుండి ఇచ్చివచ్చా

చిదంబర్రావు తాతగారు : యేమన్నాడు?

అమ్మ : యేమీ అనలా! నేనేమీ అడగలేదు.

చిదంబర్రావు తాతగారు : సరే పొద్దు త్వరగా నడిచిపోతున్నది. రేపు ప్రయాణం కాబోలు. యీసారి రావటంకూడా ఆలస్యమవుతుందేమో. ఇప్పట్లో రాలేవు.

అమ్మ : మా నాన్నగారు ఏమన్నా అన్నారా మీతో?

చిదంబర్రావు తాతగారు : నీవు లేకపోతే పొద్దుపోదమ్మా. అయోమయంగా వుంటుంది. కోర్టునుంచి వచ్చిన తరువాత చేసే పనేముంటుంది?

అమ్మ : మీకేం కవులు. యెట్లైనా పొద్దుపోతుంది.

భారతీదేవితో నాన్నగారి సమావేశం :

సీతాపతి తాతగారు వస్తారు "అన్నీ సర్దుకో రేపు ప్రొద్దున్న ప్రయాణం".

చిదంబర్రావు తాతగారు : రేపు ప్రొద్దున్న భోజనం చేసిన దగ్గర్నుండా ప్రయాణం సీతాపతీ?

సీతాపతి తాతగారు : యెట్లా వీలయితే అట్లా చేస్తా.

చిదంబర్రావు తాతగారు : పిల్ల సిద్ధంగా వుండటం కోసం అడుగుతున్నాను.

సీతాపతి తాతగారు : దానికి పెద్ద ప్రయత్న మేమిటి? గుడ్డలు మూట గట్టుకు వుండేదానికి.

చిదంబర్రావు తాతగారు : యేమీలేదు. ప్రొద్దుటైతే వంపిస్తాను. మధ్యాహ్నమయితే కోర్టుకు వెళ్లి వాయిదాలు వేయించి వస్తా.

సీతాపతి తాతగారు : అక్కడకు వెళ్లిన తరువాత వాళ్ల పిల్లను ప్రయాణం చేయటాన్ని బట్టి వుంటుంది.

చిదంబర్రావు తాతగారు : సరే కానియ్యి ఇన్నాళ్ల నుంచి కూడ వుండి చేసిన ఘనకార్యమేమిటి?

సీతాపతి తాతగారు వెళ్లి వాళ్ల అక్క అన్నపూర్ణమ్మ గారితో మాట్లాడుతూ వుంటారు.

నాన్నగారు వచ్చి "భారతీ యేం చేస్తున్నావ్. ఇవాళ సినిమాకు వెళదామా?"

భారతి : వెళదాం, నాన్నగారి నడిగి రేపు వూరికెళుతుంది అనసూయను గూడ తీసుకెళదాం

నాన్నగారు : అడిగి తేల్చుకున్నావా భారతీ?

భారతి : ఎందుకు ఇవ్వడూ ? వాళ్ల మేనమామకు చేసుకోలేదనే కోపం బాగా వుంది. యేదో మాటల సందర్భంలో ఇస్తానని గూడ అన్నాడట మా అమ్మ దగ్గర. నేను సలహా చెప్పానుగా వుద్యోగానికి పోతూ పోతూ తేల్చుకెళ్లమని.

నాన్నగారు : అయినా నా యెదటకి పిల్చి కనుక్కో!

భారతి : ఇంత పిచ్చన్నయ్యవేం? సరాసరి చెప్తుందా? నామాట నీకు నమ్మకం లేకనా అన్నయ్యా

నాన్నగారు : యెబ్బే అది కాదమ్మా. నోటి మాట విందామని. ఎప్పుడూ వినలా.

భారతి : నీ యెదుట భయం కాదూ?

నాన్నగారు : ఇంత భయమయింది యెట్లా చేసుకుంటుంది?

భారతి : అప్పటికి కాస్త పెద్దపిల్ల అవుతుంది. ధైర్యం వస్తుందిగా

నాన్నగారు : ధైర్యం లేకపోతే శాస్త్రి తో ఎట్లా అన్నది కొత్తవాడు కదా! నా మనస్ఫూర్తిగా వల్లూరి వెంకట్రామయ్య గారి అమ్మాయిని చేసుకోవాలని వుంది. ఆ అమ్మాయి నీకు స్నేహితులు గదా! వాళ్ల అన్నయ్యకూ నాకు చాలా స్నేహం.

భారతి : కాని వాళ్లు చాలా భాగ్యవంతులు అన్నయ్యా నీకు ఇస్తారా?

నాన్నగారు : సరే నీ ఇష్టం. నీవే ఆలోచించు. యీ రోజునుంచి అభిప్రాయం మార్చుకుంటాను. మేము రేపట్నించి వేరే వుండుకుంటాం. భారతి. నేను యఫ్.ఏ.చదివి వచ్చిందాకా మా ఇంట్లో వుండమన్నారు పెద్ద నాన్నగారు. అయిపోయిందిగా వేరే వుండటం భావ్యం.

భారతి: యేం బెట్టుకు తింటారన్నయ్యా?

నాన్నగారు : మా నాన్న స్నేహితులు బెల్లంకొండ సుబ్బారావు గారు, వారికేటి శ్రీమన్నారాయణమూర్తి మాధవపెద్ది, పులిపాటి అందరూ కలిసి నాటకం వేసి ఒక వంద ఇచ్చారు. ఇంకా రెండు వందలు ఇస్తామన్నారు. మరిడమ్మ నాయనమ్మ కూడా యీ ఏటి పంటకూడా యిస్తానన్నది. ఒక యాభై రూపాయలు పంపించింది, మొన్న యాభై రూపాయలు పెట్టి వెచ్చాలు కొని లోకనాథానికి జీతం కట్టి కరణీకం ఛార్జి నిన్ననే తీసుకున్నాను. అప్పికట్ల సుబ్బారావుగారి పేర రాసి నేను హైద్రాబాద్ వెళతాను. జీతం మనకే ఇస్తాడు. సుబ్బారావు అన్నయ్యే ఇట్లాంటి సలహా యిచ్చాడు. యేదైనా తక్కువయితే అమ్మకు నేను వాడుతాలే అన్నాడు. హైదరాబాద్ వెళ్లి ముల్కి (అక్కడ పుట్టినట్టుగా) సంపాదించుకొని మా నాన్నగారి స్నేహితుల్ని పట్టుకుని యేదయినా వుద్యోగం చూచుకుంటాను. కాని పద్ధతిలో కరణీకమే గతి.

భారతమ్మ : అనసూయను చేసుకుంటే యల్లంరాజు హరినారాయణ గారు యేదైనా వుద్యోగం చూపిస్తాడేమో.

నాన్నగారు : యేమిప్పిస్తాడు. ఆయన ఇప్పిస్తే ఇరిగేషను గుమాస్తా ఇప్పించాలి. ఓర్సీర్ కోర్సేమో చదువుకోలేదు. చదువుకుంటే వారు ఇప్పించే పని లేదు. యెట్లా జరగాలో అట్లా జరుగుతుందిలే. దీన్ని గురించి ఆలోచన యెందుకు? సరే! అప్పికట్ల సుబ్బారావన్నయ్యే చాలావరకు ఆదుకుంటారనుకుంటా.

అన్నపూర్ణమ్మ గారు వస్తారు. "చాలా ప్రొద్దుపోయింది అన్నాలకు లేవండి." అందరూ భోజనాలకు లేస్తారు. సీతాపతి తాతగారు కూడా ఆ రాత్రికి అక్కడే భోంచేస్తారు.

మౌలాలి వచ్చి చిటికేశ్వరపు చెట్టుక్రింద కూర్చుంటాడు.

అందరూ భోజనాలు చేస్తూ వుంటారు.

రంగారావుగారి బెదిరింపు :

చిదంబర్రావు తాతగారు : పున్నమ్మ గారితో చెట్టుక్రింద యెవరో అడుక్కునే వాడున్నాడు అన్నం పెట్టిరా. చీకట్లో నీవేం పోతావు. అనసూయ చేతికివ్వు అంటారు.

అన్నపూర్ణమ్మ గారు : విస్తట్లో అన్నం పెట్టుకు తీసుకొచ్చి అమ్మచేతికి ఇవ్వబోతూ నాలుగు ఇళ్లల్లో నాలుగు కాస్తలు తెచ్చుకోడూ? ఇవ్వమంటారా. కాస్త మధూకరం పెట్టమంటారా?

చిదంబర్రావు తాతగారు : తెచ్చావుగా. ఇన్ని సందేహాలు యెందుకు యిచ్చేసెయ్యి.

పున్నమ్మ గారు : బొత్తిగా నోరెత్తనివ్వరు.

చిదంబర్రావు తాతగారు : యెత్తాల్సిన అవసరం లేదు గనుక.

అమ్మ విస్తరి పట్టుకుంటుంది. తాతగారు కూడా వస్తారు. ఇద్దరూ కలిసి వాకిట్లోకి వెళ్లి మౌలాలీకి అన్నం పెడతారు.

సీతాపతి తాతగారు భోంచేసి అత్తవారింటికి వెళతారు.

అందరూ భోజనాలు చేసి పడుకుంటారు. షుమారు 9.30 గంటలు అవుతుంది. వాకిట్లో యెవరో కేకవేసినట్లు శబ్దమవుతుంది.

చిదంబ్రరావు తాతగారు వచ్చి తలుపు తీస్తారు.

దేశిరాజు రంగారావు గారు (భారతమ్మ గారి మామగారు) వస్తారు.

చిదంబర్రావు తాతగారు : యేమిటి ఇప్పుడు వచ్చారు? రండి లోపలకు అని కుర్చీ వేస్తారు.

రంగారావు గారు : పిల్లను తీసుకెళదామని వచ్చాను. ఇవాళ తప్పితే రెండు నెలల దాకా మంచి రోజులు కాదు. యీపూటే తీసుకెళతా.

చిదంబర్రావు తాతగారు : ఇంత ఆకస్మాత్తుగా యెట్లా పంపిస్తాం? ఆడపిల్ల గదా! మీకు తీసుకెళ్లటానికి యెట్లా మంచి రోజులు కావాలో, మాకు పంపటానికి అట్లా వసతులు కావద్దూ?

రంగారావు గారు : మీ అల్లుడు ఈ పూటే తీసుకురమ్మన్నాడు. తీసుకెళ్లి పది రోజులు వుంచుకుని నయమయితే వుంచుకుంటాం. లేకపోతే రెండో పెళ్లి చేసుకుంటానని అంటున్నాడు.

చిదంబర్రావు తాతగారు : యీ అర్ధరాత్రివేళ అందరూ నిద్రలు పోతూ వుంటే యెట్లా పంపిస్తాం? యెట్లా కావలసివుందో అట్లా అవుతుంది.

రంగారావుగారు కుర్చీ మీద నుంచి చివాలున లేచి వుత్తరీయం పైన వేసుకుని వెళ్లిపోతారు.

చిదంబర్రావు తాతగారు : (పైకి వచ్చి) యేమమ్మా నిద్రపోతున్నావా?

అమ్మ : యేమీ లేదు తాతగారు!

చిదంబర్రావు తాతగారు : యేమిటి దీర్ఘంగా ఆలోచిస్తున్నావా? ఇందాక నీవు తీసుకెళ్లిన వుత్తరం యెక్కడికమ్మా?

అమ్మ : ఆమె ఎక్కడ ఇవ్వమంటే అక్కడ ఇచ్చా.

చిదంబర్రావు తాతగారు : యెక్కడో నీకు తెలుసుగా?

అమ్మ : గుర్తు ప్రకారం వెళ్లాను. ఆమె చెప్పినట్లుగా ఇచ్చి వచ్చాను.

చిదంబర్రావు తాతగారు : రామచంద్రరావు కేనా?

అమ్మ : అవన్నీ నాకు తెలియదు. ఆమె ఇవ్వమన్నచోట ఆమెను అడిగి తెలుసుకోండి.

చిదంబర్రావు తాతగారు : క్రిందికి వెళ్లి భారతమ్మ గారిని అడుగుతారు. యెవరికమ్మా నీవు రాసిన వుత్తరం?

భారతి : మీ అల్లుడికి.

చిదంబర్రావు తాతగారు : మీ మామగారు వచ్చి వెళ్లారు. నిన్ను తీసుకెళతారట. అర్ధరాత్రి వేళ మద్దెల దరువల్లే వుంది ఇది. మీ అమ్మకు తెలిస్తే యేడుస్తుంది. చెప్పబోకు. యేమని రాశావు?

భారతి : ఇంతకుముందుగా వారు యేదో రాస్తేను. నాకు పూర్తిగా ఆరోగ్యం రాలేదు. ఒక్క నెల రోజులలో వస్తుందని ఆశిస్తున్నాను. తొందరపడి పెళ్లి చేసుకోవద్దని రాశా.

చిదంబర్రావు తాతగారు : ఇంతకుముందే నీకు పెళ్లి చేసుకుంటానని రాశాడా?

భారతి : నెలరోజుల టైం అసలాయన్ను కోరాను గదా!

చిదంబర్రావు తాతగారు : నీ ధైర్యమమ్మా!

అంతా పడుకుంటారు.

తెల్లవారేటప్పటికి సీతాపతి తాతగారు. అమ్మమ్మ. ప్రయాణమై వస్తారు. అమ్మ, అమ్మమ్మ, తాతయ్య, ప్రొద్దున్నే బస్సులో ప్రయాణమయి వెళ్లిపోతారు.

చిదంబర్రావు తాతగారు మౌలాలీని రెండు రోజులు అట్టేపెట్టుకుని అడ్రస్ చెప్పి నాలుగు రూపాయలు ధోవతులు, వుత్తరీయాలు, చొక్కాలు ఇచ్చి పంపుతారు.

అమ్మ మన్నవలో ఇల్లు చేరంగానే తాతమ్మ కౌగలించుకుని "ఇన్నాళ్లు వున్నావేమమ్మా నన్ను వదిలిపెట్టి. ఇంత చిక్కిపోయినావా".

అమ్మ : చిక్కడం ప్రారంభమైంది ఇంకా యెంత చిక్కాలో.

వారం రోజులు గడుస్తాయి.

అమ్మ మామూలుగా దేవాలయంలో పున్నయ్య గారి తోటలో కాలం గడుపుతూ వుంటుంది.

హైదరాబాద్ వుద్యోగానికి పోతూ నాన్నగారు వస్తారు. పెళ్లి మాట అడిగిపోదామని. వచ్చి రెండు రోజులుంటారు. వారి పినతండ్రి బ్రహ్మండం భూషయ్య గారింట్లో, మేనమామ మన్నవ అంబారావు గారింట్లో రెండు పూటలు వుండి వూరికి వెళ్తూ యేం మామయ్యా నేను వుద్యోగానికి వెళుతున్నాను. పెళ్లిచేసి పంపిస్తావా? వెళ్లింతర్వాత ఇప్పట్లో వస్తానో, రానో.

సీతాపతి తాతగారు : నా చేతిలో డబ్బు లేదు. నీకూ నాకు కూడా నేనే చూచుకోవాలి. యెప్పుడు దొరికితే అప్పుడు చేస్తాను.

నాన్నగారు : నాకు కూడా రైలు ఛార్జీలు మీరే ఇవ్వాలిగా!

తాతగారు : అందుకు సిద్ధపడేగదా ఇవ్వటం.

నాన్నగారు వెంటనే బయలుదేరి బాపట్ల వచ్చి భారతమ్మ గారితో ఆ కబురు చెప్తారు.

భారతి : ఇస్తానన్నట్లేగా?

నాన్నగారు : వుద్దేశం అదే.

భారతి : నీవు పోయిరా అన్నయ్యా. యేదన్నా కబురొస్తే నేను చేస్తాను. అప్పికట్ల సుబ్బారావన్నయ్యతో చెప్పు.

నాన్నగారు : చెప్పి వెళ్తాను అని బయలుదేరి వెళతారు.

అమ్మ వివాహంపై మల్లగుల్లాలు :

నాన్నగారు వూరికెల్లిన వారం రోజులకు సీతాపతి తాతగారికి 200 రూ. దొరుకుతాయి. వెంటనే తాతగారు బామ్మగారి దగ్గరకు పోయి, "అబ్బాయిని పిలిపించు లగ్నాలు పెట్టుకుందాం" అంటారు.

బామ్మ : మొన్ననేగదా వాడు వెళ్లింది. యెట్లా వస్తాడు? అప్పుడె వాడు రావాలి. పైకం చూచుకోవాలి.

సీతాపతి తాతగారు : నేను ఇస్తానుగా వందరూపాయలు.

బామ్మ : వందరూపాయలు యేం చాలతయ్యి అన్నయ్యా పిల్లకు ఒక వడ్రాణమన్నా చేయించి పెట్టుకోవాలి. ఇప్పుడు యేర్పడకపోతే మళ్లీ యేర్పడవు. రెండు పట్టుచీరలన్నా పెట్టుకోవాలి. గదా!

తాతగారు : యేం ఇవన్నీ లేకపోతే అంత గాకపోతే ఇంకో వంద యిస్తాలే. నేను యెక్కడయినా చూచుకుంటాను. తప్పకుండ టెలిగ్రాం ఇప్పించు. ఇవాల్టికి యెనిమిది రోజులుంది. యీ రోజు గాక మధ్య ఆరు రోజులు. గరికపాడు యీ రోజు చేశాను. వాళ్లుగూడ వచ్చి పనులు చేస్తున్నారు. పొన్నూరు నుంచి వెచ్చాలు కూడా యీరోజు వస్తాయి. నీకు కావలసిన పిండివంటలు కూడ అక్కడే చేయిస్తాను. యేంకావాలి?

బామ్మ : అదెట్లా? రేటూరు కబురుచేసి తాత, నాయనమ్మ వారున్నారు గదా! వాళ్లను కలుసుకుని వాళ్లేమయినా కొంత ఖర్చు పెట్టుకుంటామంటారేమో?

తాతగారు : సరే యేమన్నా చేసుకోండి. నా దగ్గర వున్నది ఆ రెండు ఫందల రూపాయలు తీసుకుని మీ ఇష్టమొచ్చినట్లు చేసుకో. పప్పో, పులుసో పెట్టి వెళ్లబుచ్చుతాను. నేనీపూట తెనాలివాళ్లను పిలవటానికి వెళుతున్నా. ఇక్కడ బావకు అక్కయ్యకు చెప్పాను. (అంటే చిదంబర్రావు గారు, అన్నపూర్ణమ్మగారు) తెనాలి వెళ్లి ఇటువస్తూ అక్కయ్యను తీసుకొస్తా. ఇదిగో పైకం తీసుకో.

బామ్మ : రేపు వచ్చినప్పుడు ఇద్దువుగానిలే. ఇప్పుడెందుకు తొందర? అసలు వాడిని రానియ్యి .

తాతగారు పైకం జేబులో పెట్టుకుని బయలుదేరి తెనాలి వెళతారు. తెనాలి వెళ్లి కబురు చెప్తారు.

సుబ్బయ్య : అట్లాగా మంచిది అంటారు.

జానికమ్మ : (సుబ్బయ్య తాతగారిని లోపలికి పిలిచి) యేమిటి? ఈ పెళ్లేమిటి? తల్లిలేని పిల్ల. వుండ ఇల్లులేదు. తింటానికి తిండి లేదు. ఇది యేమి సంబంధం?

సుబ్బయ్యగారు : సరే బాగుందే! అతని మేనల్లుడు సహాయం చెయ్యకపోతే మరి యెప్పుడు చేస్తాడు?

జానికమ్మ : పోనీలే మీరు చెయ్యాలా రంగమ్మ తల్లిని. యేం లేకపోయినా తల్లయినా వుంటే బిడ్డ తిన్న దో లేదోనని వున్నంతలో పంపిస్తుంది.

అన్నపూర్ణమ్మ గారు (అమ్మ పెద తల్లి) : అయినా అంత అన్యాయంగా చూస్తూ చూస్తూ గొంతు కోస్తారా?

సుబ్బయ్య గారు : ఛీ నోర్ముయ్! నీ ముఖం. గొంతు కోయటం ఏమిటి? వాడేం కుంటివాడా? గుడ్డివాడా? చదువుకున్నవాడు. అంతగా కాకపోతే వాడికి రెండు యకరాలు ఇవ్వొచ్చు. దాన్ని గురించి ఆలోచనేమిటి?

ఇంతలో అమ్మ పినతల్లి వరాలమ్మగారందుకుని "వాడికి గుండె జబ్బు వున్నది. (ఒకే కుటుంబంలో వారు కావటంతో వాడు అని స్వతంత్రంగా పిలవటం) గట్టిగా ఇవ్వద్దని చెప్పండి నాన్నా. నీకు భయమయితే బావతో నేనే అంటాను".

సుబ్బయ్య గారు : సరే ! నేను గూడ అని చూస్తాను.

సీతాపతి తాతగార్ని భోజనానికి లేవమంటారు. అంతా భోజనాలు కాగానే తాతగారు ప్రయాణమై వెళ్తూ లోపలకు వచ్చి వచ్చే శుక్రవారం రాత్రే పెళ్లి. మీ రందరూ వారం నాటికే రావాలి.

జానికమ్మ : నిశ్చయించారేమిటి అప్పుడు?

సీతాపతి తాతగారు : చెప్పేదంతా యేమిటి?

సుబ్బయ్య : యేమీలేదులే సీతాపతీ! అట్లా అడగటంలో వాళ్ల వుద్దేశం యేమిటంటే తల్లిలేని పిల్లగదా కాస్త యెక్కడయినా వున్న సంబంధం జూచి ఇస్తే బాగుంటుంది. ఆడవాళ్లు గదరా వాళ్లక్లోప వాళ్లది.

తాతగారు : నా చెల్లెలు సుబ్బమ్మను వున్నవాడికే ఇచ్చాం. గరికపాడు శేషగిరికి. ఇప్పుడు భారతిని ఇచ్చింది భాగ్యవంతులకు కాదు. యెత్తులు పెట్టక యేం తప్పింది?

ఇంతలో వరాలమ్మ గారందుకుని "ఆస్తిది దూరంగా పెట్టు బావా. గుండెజబ్బు కదా?"

తాతగారు : ఆరోగ్యం గలవాడు. ఒక్కగానొక్కడు గదా అని మీ పెద్దక్క గార్ని ఇస్తే రజస్వల కాకముందే చావలా? దానియోగ్యత యెట్లా వుందే అట్లా అవుతుంది.

సుబ్బయ్య గారు : ఛీ! ఇక మాట్లాడబోకండి. అప్రాచికంగా మాట్లాడుతున్నాడు. 'యెట్లా రాసివుంటే అట్లా అవుతుంది'. అని అన్న తరువాత ఇక మనం నోరెత్తకూడదు. అంతేలేరా నాయనా. సీతాపతీ నీ ఇష్టమొచ్చినట్లు చెసెయ్యి.

తాతగారు : సరే వెళ్లివస్తా. యేమన్నానో అన్నాను. ఇచ్చి చేయాల్సిందే 'అంటూ గడపలు దిగి వెళ్లిపోతాడు'. బాపట్ల చేరి బామ్మతో 'యేం కనకమ్మా? వాడికి కబురు చేశావా?'

బామ్మ : లేదన్నయ్యా సుబ్బారావు రాలేదు. నిన్ననేగా నీవు వెళ్లింది. యెవరి చేతనయినా టెలిగ్రాం ఇప్పిద్దాం అంటే అడ్రసు లేదు. సుబ్బారావు ఇవాళ వచ్చినా ఇప్పిస్తాను. ఆ టయిముకు వస్తే చాలుగదా వాడు.

తాతయ్య : నేను వెళ్లేటప్పటికి పందిరి గుంజలు కూడ పాతుతారు వాళ్లు. నాకీ లగ్నానికి తప్పితే ఇప్పట్లో చెయ్యటానికి వీలుగాదు.

బామ్మ : యీ లగ్నం తరువాత పది రోజుల్లో ఒక లగ్నం వుందిగా?

తాతగారు : అప్పుడు నా భార్యకు కడగా వుండే నెల.

బామ్మ : కడగా వుంటే బొడ్లో రవికబెట్టి చేసుకోవచ్చు.

తాతగారు : ఛీ ! నీ మొఖం చూడగూడదు. ఇకను. ఇంతమంది పుట్టి అందరూ పోయి పోయి ఇద్దరు బ్రతికితే భార్య పోయి పిల్లవాడి పెళ్లి, ఒడుగు కూడ చేసుకోలేదు. పిల్లకు కన్యధార పోద్దామనుకున్న నన్ను పట్టుకుని ఇంతమాట అడుగుతావా?

బామ్మ : నువ్వు చేసుకోవటమేం చాలామంది చేసుకున్నారిట్లా.

తాతగారు : ఇంకా పైగా పదే పదే ఆ మాటే మాట్లాడుతావేం? ఇష్టం లేకపోతే చేసుకోనని చెప్పు. ఇంతకూ మీ ఆడబిడ్డ కూతుర్ని చేసుకోవాలనుందిలే? ఇంతకు అది యీ యేడుపు. నేను ఇవ్వనే ఇవ్వను. వందలు ఇవ్వబోతే చేతపట్టుకోలేదు. అప్పుడు ఇదే వుద్దేశ్యమై వుంటుందని ఇప్పుడు తోస్తున్నది అని నీకు ఇవ్వనే ఇవ్వను (అంటూ లేచివస్తారు).

చిదంబర్రావు గారింటికి వచ్చి వారికి అన్నపూర్ణమ్మ గారికి జరిగిందంతా చెప్పి "నేను అన్నను గాదు. అది చెల్లెలు గాదు. చేసుకోకపోతే బాధలేదు. మభ్యపెట్టి నందుకు బాధగా వున్నది".

చిదంబర్రావుగారు : నీ ముఖంగాదూ. నీకంటే స్థితిపరురాలనని చేసుకోనంటుందా? ఇంతకంటే యోగ్యమైన పిల్లను తీసుకొచ్చుకో గలదా. యేమీలేదు. వాడు వచ్చినాక తీసుకోవచ్చులే అని పైకము తీసుకుని వుండదు. అడ్రసు లేక కబురు చేసి వుండదు. సామాన్యంగా ఇబ్బంది వస్తే బొడ్డులో రవికె బెట్టుకుని చేస్తూనే వుంటారు. దూరము ఆలోచించక అని వుంటుంది.

అన్నపూర్ణమ్మగారు : యీ మాట అర్థం తెలిసి అన్నా అనక పోయినా మొత్తంమీద అత్తవారివైపు అంటే అభిమానం.

చిదంబర్రావు గారు : నీవు సరే! కోతికి కల్లు బోసినట్లే మాట్లాడుతున్నావు. అత్తవారివైపు అనుకూలంగా వుండటం మంచిదేకదా!

బామ్మ చిదంబర్రావు గారింటికి వచ్చి పక్కనుండి అన్నీ వింటూనే వుంటుంది.

బామ్మ : అత్తవారు ఎక్కువని పుట్టింటివారు ఎక్కువని అత్తగారు అంటున్నారు. వుభయ మధ్యస్థంగా వున్నది నా పని.

చిదంబర్రావుగారు : అదేమిటి కనకమ్మా అల్లా అన్నావ్!. మొత్తంమీద ఆ తల్లిగన్న సంతానం అంతా అంతే. అయిదుగురు అయిదుగురే!

అన్నపూర్ణమ్మ : వున్నదేదో యెదటే అనుకుంటాం మేము. చంద్రమౌళి వారల్లే చాటున చేతగాదు మాకు.

చిదంబర్రావుగారు : సరే ! యేదో లగ్నాలు పెట్టుకుని చేసెయ్యండి. యెందుకు తగాదాలు?

సీతాపతి తాతగారు కూర్చున్న వాడల్లా సంచీ పట్టుకుని యీ రోజుతో యిద్దరికీ సరి అని వెళ్లిపోతాడు.

అన్నపూర్ణమ్మ గారు : వాడికి రానేరాదు వస్తే తిరగదు.

బామ్మ : యేనాడమ్మా ఆయనకు లేనిది. నీకు ఆయన యెక్కువ గనుక అట్లా అంటావు.

చిదంబర్రావుగారు : (అన్నపూర్ణమ్మ గారితో) అవును పాపం నీతమ్ముడు యెప్పుడూ కోపం ఎరగడు. సంవత్సరానికి 2 సార్లు వస్తుంది. వచ్చినప్పుడల్లా ఆరేసి నెలలు వుంటుంది. ఇంకా వచ్చేదెప్పుడు?

సీతాపతి తాతగారు బస్సెక్కి వెళ్తారు. ఇల్లు చేరేటప్పటికి రాత్రి 7.30 గంటలు అవుతుంది. అందరూ పరుగెత్తుకొస్తారు. యేమి సొమ్ములు చీరలు తెచ్చాడోనని. ముఖం చిట్లించుకుని "పొండి అవతలకు పొండి. విందురుగాన్లే. వినలేకపోతారూ".

"చూడటానికి వచ్చాం మామయ్యా. వినటానికి రాలా".

సీతాపతి : చూచేవితేలా, వినేవి తెచ్చా.

సుబ్బమ్మ గారు : యేదో కొంప మునిగిందే, యేం జరిగిందేమిటన్నయ్యా?

సీతాపతి : చెపుతా మరిడమ్మ గారిని గూడా రమ్మనండి. ఆమె ముద్దుల మేనకోడలు సంగతి చెప్తా. అందరూ కూర్చుంటారు. సభ తీర్చినట్లుగా తాతగారు జరిగిందంతా చెప్తారు.

మరిడమ్మ తాతమ్మ గారు కళ్లనీళ్లు పెట్టుకుంటుంది. "అయ్యో యోగ్యత లేదు కాబోలు వీళ్లిద్దరికి. ఇది తల్లిలేనిది, వాడు తండ్రి లేనివాడు. ఇద్దరూ బుద్ధిమంతులు. అయితే బాగుంటుంది. నేను వాళ్ల దగ్గర వుండవచ్చుగదా అనుకున్నాను".

సుబ్బమ్మగారు : ఎందుకు అంతలోనే ఇట్లా ఏడుస్తావు. వాడేమయినా ఇవ్వనన్నాడా?

సీతాపతి : అంటున్నదీ! నేను అనుకుంటునే వున్నా యీమె నన్నే అంటుందని నాకు తెల్సు అందర్నీ పెంచిందన్నమాటే గాని అది అంటే మహా యెక్కువ పక్షపాతం చూపిస్తుంది.

మరిడమ్మ : నేను ఆ మాట అన్నానుట్రా నాయనా. కనకమ్మ తల్లి ఆ మాట అనకపోతే నీకు ఇంత కోపం రాదుగదా! ఇట్లా యీ విధంగా 24 గంటలు పూరంతా పెళ్లని తెల్సిన కారణంచేత ప్రతివాళ్లు రావటం, అడగటం రాత్రిపూట యే మూడు గంటలో మినహా యెప్పుడూ యీ పోరాటంతో సరిపోతుంది.

సుబ్బమ్మగారి స్వభావం - ఇక్కడ మాటలు అక్కడ, అక్కడ మాటలు ఇక్కడ. "ఒరే అన్నయ్య మొదట్నుంచీ దానికి ఇష్టం లేదురా. నీ కూతురు చేసుకోవాలను కుంటున్నది గాని"

తాతగారు : అట్లాగా ఇదెప్పుడు? ఇది నాకు తెలియదే!

సుబ్బమ్మ : మొన్న సుందరీ వాళ్లతో అన్నదిటరా.

తాతగారు : అట్లాగా ఇది ఇంకా నాకు తెలియదే!

గరికపాటి శేషగిరిరావు గారు (సుబ్బమ్మ గారి భర్త) ఒరే! సీతయ్యా నీకెందుకు వూరుకో! నేను యెక్కడోక్కడ తీసుకొచ్చి చేస్తాను.

తెచ్చిన పెళ్లి సరుకంతా పెట్టుకు తింటూ, బాపట్ల నుండి మన్నవ. మన్నవ నుండి బాపట్లకు తిరుగుతూ. తగాదాను పెంపు చేస్తున్నారు. ఇట్లా 2 నెలలు జరుగుతాయి. మధ్యవర్తులకు మంచి అవకాశం. మరిడమ్మ తాతమ్మ యీ

దిగులుతో అమ్మ తిన్నదో లేదోనని గూడ విచారించదు. ఇది యెంతవరకు నిజమోనని బాపట్లకు వెళ్తుంది కనుక్కునేందుకు. జూన్ నెల్లో విపరీతమైన యెండలు, వడగాల్పులు. పక్షులు కూడ చెట్లమీద నిలువలేకుండ వున్నాయి. భూమిమీద చెట్లు మొలవలేక పోతున్నై. మొలిచినా చచ్చిపోతున్నై. యెక్కడనీరు అక్కడ భూమాత తాగేసింది. ఇళ్లలో మనుషులు వుండలేరు. వాకిట్లో వడ. ఇంట్లో ఆవిరి. మనుషుల్లో రక్తం కూడ పీల్చుకుపోతున్నది. యెక్కడ గొడ్లక్కడ పాలివ్వకుండా యెండిపోయినై. బావుల్లో నీళ్లు లేవు. చెరువుల్లో చెలమలు (గుంటలు) తవ్వుకుని, తలా వొకటి తవ్వుకుని యెవరి గుంట్లో నీళ్లు వాళ్లు తెచ్చుకుంటున్నారు. యెవరి గుంటమీద వాళ్లు వాళ్లు మంచాలు వేసుకుని పడుకుంటున్నారు. ఇటువంటి స్థితిలో అమ్మ రోజుకు 22 గంటలు అయినా పున్నయ్య గారి తోటలోనే కాలం గడుపుతుండేది. మరిడమ్మ తాతమ్మ గారు వున్నంత వరకు నాలుగు రోజుల కొకసారైనా అన్నం తినేది. తాతమ్మగారు వూరికెళ్లి పది రోజులైంది. అమ్మ ఇంటికి వెళ్లినప్పుడెల్లా "యెక్కడికి వెళ్లావు ఇంట్లో లేకుండ" అని సుబ్బమ్మగారు, తాతగారు వినేటట్లుగా కోప్పడుతుండేవారు. ఇంట్లో వున్నప్పుడల్లా యెప్పుడూ పెళ్లి సంగతులే యెత్తి (సుబ్బమ్మ గారు) మాట్లాడుతూ వుండేది. అమ్మ తల వంచుకుని కూర్చుండేది. 'నానుంచి ఇంతమంది కష్టపడుతున్నారు గదా' అని ఆలోచిస్తుంది.

సుబ్బమ్మగారు : చూడరా అన్నయ్యా. అక్కడ ఇవ్వటం లేదనే ముక్క వచ్చినప్పుడల్లా చూడు ఎట్లా పెట్టుకుంటుందో ముఖం. ఇస్తానన్నప్పుడు కొంచెం వికసిస్తున్నది. నీవు గమనించు.

ఆరోజు నుంచి ఆయన గమనించుతాడు. యీ మాట ఆయన మనస్సుకు పెనుభూతమైంది. ఆయన మనస్సుబట్టి అమ్మ వర్చస్సు గూడ ఆయనకు అట్లాగే కనపడుతుంది. ఆమె చేసుకోలేదనే కోపంకంటే అమ్మమీద కోపం పెరుగుతుంది క్రమంగా. అసలు యీ సుబ్బమ్మ గారి కోపానికి కారణం యేమిటంటే తన పెద్ద కూతురు సుందరమ్మ గారిని రాఘవరావు మామయ్యకు చేసుకోలేదని. సీతాపతి తాతగారు పెళ్లి చేసుకోకుండా వుండి, మామయ్యకు ఆ పిల్లనిచ్చి చేసుకుని ఇంట్లో వుండాలని చూచింది. ఒక రోజు అడిగింది: "రాఘవా నా పిల్లను జేసుకోవా" అని. నాకు వద్దన్నాడు. "అనసూయమ్మను కనకమ్మత్తయ్య కొడుక్కు ఇద్దాం రా నాయనా. నీవే సుందరిని చేసుకో. మీ మామయ్య మంచివారు కాదుగదా! నేను మీ దగ్గరే వుండి మీ నాన్నకు యేది ఇష్టమో అది చేసిపెట్టుకుంటా". అని యెంత చెప్పినా మామయ్య ఒప్పుకోలేదు. ఆమాట మనస్సులో పెట్టుకుని అప్పటినుండి యీ కుటుంబం మీద కోపం యేదో ఒకరకంగా విచ్ఛిత్తు వేయాలని చూస్తుంది. అమ్మను ఇలా అనటానికి కారణం ఇది. కొంత తగవులు పెట్టే స్వభావం.

తాతగారు అమ్మను పలకరించటం పూర్తిగా మానుకున్నారు. ప్రతివాళ్లచేత "యేమిటి నువ్వు యెవర్నీ చేసుకుంటావు" అని అడిగించటమే.

అమ్మ యెవరడిగినా యేమీ మాట్లాడదు. ప్రతివాళ్లు వచ్చి యేమీ సమాధానం చెప్పటంలేదని చెప్పినప్పుడల్లా, మౌనం అంగీకారమనుకుని తాతగారు, సుబ్బమ్మ గారిని పిలిచి "బావనే చేసుకుంటానని యెవరితో అన్నది" అమ్మాయి అని అడుగుతారు.

సుబ్బమ్మ గారు : ఒకరోజు పిల్లతో అన్నదిట. పెద్దవాళ్లతో యెట్లా అంటారు భయం కాదూ!

ఆరోజే అమ్మను చింతలపూడి నరసింహం గారి ఇంట్లో వుంటే పిలిపించి సుబ్బమ్మ గారు అడుగుతుంది. అమ్మయేమీ మాట్లాడదు.

సుబ్బమ్మ : యెంత కుట్రదానివే. యేమీ సమాధానం చెప్పవు. నా పిల్లలు ఇట్లాంటి వాళ్లు కారు. భారతితో అన్నావటగా బావనే చేసుకుంటానని. కనపడని ముచ్చు (అని నెత్తిమీద మొడుతుంది). ఫో ఇక పో నీ ఇష్టమొచ్చిన చోటికి (అని మెడబట్టి గెంటుతుంది).

అమ్మ : అత్తయ్యా! కొంచెం అన్నం పెడితే, తిని వెళ్తా ఒక్కసారే.

సుబ్బమ్మ: ఇంకా వుడకలా. వుడికింతర్వాత తిందువుగాని, మధ్యాహ్నం మూడు గంటలప్పుడు.

అమ్మ : సరేలే అని తోటలోకి వెళుతుంది.

22. అఖండ తేజోవిలాసం

తింత్రిణీ రసపిపాసిని (మౌలాలీకి అమ్మ విశ్వరూప దర్శనం) :

మౌలాలి యీ రెండు నెలలనుంచి దొప్పలపూడిలో అడుక్కుతింటూ అమ్మను వచ్చి చూచి పోతూ వుంటాడు. ఒకరోజున వాకిట్లోకి వస్తాడు. మధూకరం కోసం.

అమ్మ ముద్దవేయటానికి వాకిట్లోకి వెళ్తుంది.

మౌలాలి : యెందుకమ్మా అట్లావున్నావు?

సుబ్బమ్మ : (లోపలనుంచి కేక). యేమిటి అడక్కుండ, పెట్టకుండ మూతదీసి. (యీ కేక వాకిట్లోకి విన్పిస్తుంది. అతను అన్నం పెట్టించుకోవటానికి బాధపడతాడు). "నేను అన్నం కోసం రాలేదు. నిన్ను చూడటానికి వచ్చానమ్మా. అన్నం తీసుకెళ్లి గిన్నెలో వేసిరా అమ్మా".

అమ్మ : అట్లా వద్దు నాయనా! నీకు తెచ్చిన అన్నం ఇంట్లో వేస్తే పోట్లాడుతారు.

మౌలాలి: సరేలేమ్మా యీ రోజుకు పెట్టు.

అమ్మ, మౌలాలి మాట్లాడటం చూచి, "యెవరా అబ్బాయి? యెందుకు ఇంతసేపు మాట్లాడుతావు. అడుక్కునే వాళ్లతో యేమాలోచనలు. చిన్నప్పుడు లేనిది పెద్దప్పుడు వస్తుందా? యెందుకు మొగవాళ్లతో ఇంతసేపు ఆలోచన" అంటుంది సుబ్బమ్మ గారు. "జీవితంలో ఇదే ప్రారంభం అనుమానించటానికి" అనుకుంటుంది అమ్మ.

మౌలాలి : నేను రానులేమ్మా! యెప్పుడన్నా ప్రాప్తముంటే చూచిపోతూవుంటా.

అమ్మ అందుక్కూడా సమాధానం చెప్పకుండ లోపలకు వచ్చేస్తుంది. మరునాడే సుబ్బమ్మ గారు, పిల్లలు గరికపాడుకు వెళ్లాల్సొస్తుంది. రాఘవరావు మామయ్య

తెనాలిలో వున్నారు. మరిడమ్మ తాతమ్మ బాపట్లలో వుంది. అమ్మమ్మ గారు చిన్నది. ఆమె యెక్కడకు వెళ్లినా తోడు పొమ్మనేవారు తాతగారు. ఆమె రోజుకు పదిసార్లు బైటికి వెళ్లి పదిసార్లు తిరిగి రావాలి. అమ్మ తోడు వెళ్లకపోతే తాతగారికి కోపం. వెళ్లితే ఆమెకు కోపం. ఇప్పుడు మరీ యెక్కువ కోప్పడుతుంటారు. ఒకరోజు అమ్మమ్మ చేత అడిగిస్తారు.

అమ్మ : పిన్నీ నీవుకూడ అందరల్లె అడుగుతావేమిటి? నా సంగతి నీకు తెలియదూ! మొదట నన్నడి లగ్నాలు పెట్టారా? నేను వద్దంటే మానుకున్నారా? యెందుకు నన్ను ఇట్లా అడకత్తెరలో బెట్టి వత్తేస్తారు.

అమ్మమ్మ : ఇదివరకు చాలామందితో అన్నావటగా.

అమ్మ : అని నీకు కూడ నమ్మకమేగా. నేను చనువుగా మాట్లాడేది ఒక్క చిదంబర్రావు తాతగారితో ఆయన్ను అడగండి. ఇవన్నీ తాతగారితో చెప్తుంది. తాతగారు, అమ్మమ్మ గూడా బాగా మాట్లాడటం మానేస్తారు. అమ్మ ఇటు వస్తుంటే అటు పోతాడు. అమ్మ అచ్చగా ఆరోజు నుంచి తోటలోనే వుంటుంది. 11 రోజులు ఒకే చెట్టుక్రింద లేవకుండ కూర్చుంటుంది. ఈ పదకొండు రోజులు కూడ యేమయిందని కనుక్కోరు. 12వ రోజు కళ్లు తెరిచేటప్పటికి నాలుక విరుచుకు పోతుంటుంది. దగ్గరలో యెక్కడా మంచి నీళ్లు లేవు. ఆ చెట్టు మాను వంకనే ఒక అరగంట చూస్తూ కూర్చుంటుంది. మాను పగిలి పోతుంది. ఆ పగిలిన చప్పుడు వచ్చే ధ్వని 'ఓంకార' ధ్వనిగా, పెద్ద మోతగా పిడుగు పడినట్లుగా వూరంతా వినిపిస్తుంది. వెంటనే మేఘాలు పట్టి పెద్ద వర్షం కురుస్తుంది. వూరంతా చల్లబడుతుంది. చచ్చిపోయేవన్నీ బ్రతుకుతై. ఆ సంవత్సరం ఆ గ్రామానికి అదే తొలకరి వాన. అయిదు రోజుల కల్లా భూమి అంతా పచ్చబడుతుంది అమ్మ ఆ వానలో అక్కడే వుంటుంది. అది పగిలినప్పుడు దానిలోనుంచి నురుగు నురుగుగా కారుతూ వుంటుంది. అమ్మ పోయి దోసిళ్లతో రసం తాగుతూ వుంటుంది. అమ్మ దాహం తీరేదాకా కారుతుంది. దీనిని "తింత్రిణీ సుధ" అంటారు యెటు జూచినా నాగజెముడుమట్టలు, చింతలు. 'ఆ చింతల్లోని చింతే నా దాహాన్ని తీర్చింది' అనుకుంటుంది అమ్మ. 'యెప్పుడూ నాకు చింతలే కావాలి. చింతే నీడ ఇచ్చింది. చింత అండన, యెండ తీర్చుకున్నాను. చింత రసమే దాహం తీర్చింది. రేపు నేను ఈ వూరినుండి వెళ్లేటప్పుడు కూడ యీ చింతే తీసుకెళ్తా. యీ చింత నాచెంత నుండి నా మనసుకు యే చింతా లేకుండా చేస్తుంది'. ఒక పరికిణీ చొక్కాతో యెండకు యెండుతూ, వానకు తడుస్తూ అక్కడే ఇంకా పదకొండు రోజులు గడుస్తాయి.

మౌలాలి దొప్పలపూడిలో అడుక్కుతింటూ రోజూ తోటలోకి అమ్మ దగ్గరకు వచ్చి వెళుతూ వుంటాడు.

అన్ని రోజులు ఇంటికి రాకపోయినా అమ్మ యేమైందని ఇంటివద్దవారు ఆలోచించరు. 23 రోజులు ఇట్లాగే గడిచిపోతై చెట్టుక్రింద. మౌలాలి ఎక్కువ కాలం దొప్పలపూడి రాక మానుకుని తోటలోనే వుంటాడు. మౌలాలీకి యేవేవో కొత్త కొత్త అనుభవాలు కలుగుతూవుంటై ఏరోజుకు ఆరోజు. "ఈ తల్లి యీశ్వరమ్మ తల్లికంటే గొప్పది. ఈ తల్లి ఇట్లా లోపల్లోపల యెంతమందిని తరింప చేస్తున్నదో!" అమ్మతో "యేవమ్మా యేనాటికయినా బయటకు వస్తావా. నీకు తెలియకుండానే నీశక్తులే బయటకు రప్పిస్తాయిలే అమ్మా. నిన్ను గురించి యేవేవో వూహలు వస్తున్నాయి గాని వర్ణించుకుందామంటే చదువు రాదమ్మా."

"కూర్చుంటే యేదో మయికంగా వుంటుంది. ఆ మయికంతోనే మాట్లాడక పోయినా నీతో మాట్లాడుతున్నట్లు వుంటుంది. రకరకాల రూపాలు కనపడుతాయి. యెన్ని రూపాలు కనపడ్డా నీవే అనిపిస్తుందమ్మా. యెవరో, యేమిటోలే అనిపించదు. నీకంటె చిన్నపిల్లల్లే కనపడ్డా, నీవే అనిపిస్తుంది. ముసలివాళ్లల్లే కనిపించినా నీవనే అనిపిస్తుంది. పురుషులుగా కనుపించినా అట్లాగే. అదివరకు ఇంతలేదు. వారం రోజుల నుంచి జాస్తిగా అనిపిస్తున్నది. యెక్కడయినా చెడువాసన వచ్చి మూసుకుంటే వెంటనే అందులోనుంచి మంచి వాసన వస్తుంది. మంచి వాసన గల వస్తువు ముక్కుదగ్గర పెట్టుకుంటే దుర్వాసన వస్తుంది. తీసివేసినా ఆ వాసన పోదు. ఒక అనుభవమేటి? యేదని చెప్పేది. అన్నం బాగా పెడతారు అనుకున్న ఇంట్లో పెట్టరు. సరిపోతుంది అనుకున్ననాడు సరిపోదు. నా తిండి ప్రమాణం కూడ నాకు తెలియదు. ఆకలి లేదుకదా కొద్దిగా తిందామనుకున్ననాడు యెక్కువయి పోతుంది. ఆకలిగా వుంది తిందామనుకున్ననాడు పోదు. ఇందంతా యేమిటి? అదిసరే, నిన్ను వదిలి వెళ్లి అడుక్కుందా మనిపించటం లేదమ్మా. అన్నింటికి నిన్నే నమ్ముకున్నప్పుడు ఆకలి మాత్రం నీవు తీర్చవూ. ఇవన్నీ చూస్తే "నా ప్రయత్నం" లేదని స్పష్టంగా తేలిపోతుంది."

అమ్మ ఇవన్నీ వింటూ కళ్లు మూసుకుని తల వంచుకుని అట్లాగే కూర్చుంటుంది. ఆ కూర్చున్న కూర్చోవటం అయిదు రోజులు అట్లాగె కూర్చుంటుంది.

మౌలాలి అమ్మను చూస్తూ అమ్మలో కలిసిపోయినవాడిలా చైతన్యం లేనివాడిలాగ, కన్ను ఆర్పకుండ కూర్చుంటాడు.అమ్మ వొంటిమీద అనేక రకాల పక్షులు వాలిపోతున్నా కొట్టాలని అనుకుంటాడు కాని కొట్టలేడు. అనేక రకాల

పురుగులు పాకుతూ వుంటాయి తీసివేద్దామనుకుంటాడు చేతులు రావు. కాళ్లు కదలవు. కనురెప్ప కొట్టటానికి కూడ స్వాధీనం కాదు శరీరం. కనపడ్డది గుర్తిస్తాడే కాని యేమి సంకల్పాలు గూడ రావు. ఇట్లా అయిదు రోజులు గడిచిపోతాయి. ఆరోజు పౌర్ణమి అవుతుంది. నిండు పౌర్ణమి. ఆరోజు రాత్రి 12 గంటలప్పుడు అమ్మ చుట్టూరా చుట్టేసుకుని పైన గొడుగులాగ పడగ విప్పి లెక్క వెయ్యటానికి వీలులేనన్ని శిరస్సులతో అమ్మ తలకు అర్ధ గజం యెత్తున అనేక రంగులతో ఆ వెన్నెల కాంతిలో మెరిసిపోతూ ఆ కాంతిలో తలూపుతూ ఆడుకుంటున్నట్లు కనపడుతుంది. నా భ్రమా, నిజమేనా అని అమ్మ దగ్గరకు వెళ్లి చూస్తాడు. ఇంకా యెక్కువ కాంతిగా కనపడుతుంది. దగ్గరకు పోయిన కొలది గొడుగు ఆకారంగా ఒక్కొక్క శిరస్సు ఒక్కొక్క గొడుగు కడ్డీగా కనపడుతుంది. పాము చర్మము గొడుగు గుడ్డలా వుంటుంది. క్రిందివైపున పాము చర్మము గొడుగు కర్రలా వుంటుంది. పామును అమ్మ పట్టుకున్నట్లు, ఇంకా చూడగా చూడగా విష్ణుమూర్తి శేషశాయి మాదిరిగా అమ్మ పడుకుని కనపడుతుంది. అమ్మకు ఆదిశేషుడు గొడుగైయెండకు, వానకు కాపాడుతున్నా డనుకుంటాడు. ఇంకా చూస్తూ, చూస్తూ వుండగానే అనేక రూపాలు వస్తాయి.అమ్మను కాపాడుతున్నాడు అని అమ్మవంకనే చూస్తూ వుండగా, రూపాలన్నీ పోయి అమ్మ ఒక్కతే కిరీటం పెట్టుకుని వర్ణించటానికి వీల్లుకాని రూపంతో అనేకమయిన తలలతో ఒకే అమ్మ కనపడుతుంది. ఇన్నీపోయి అమ్మ ఒక్కటిగానే కనపడుతుంది. అప్పుడు అమ్మను కాపాడేదేమిటి? అన్నీ అమ్మ రూపాలే అయితే అనిపిస్తుంది. యెప్పుడూ యీ దృశ్యాలు చూడాలని వుండేది నాకు. ఇష్టమయినవే చూపించేదే అమ్మ. నా కోరిక తెల్సుగా. అమ్మ నన్ను తరింపచేసినది. ఇక నాకు జన్మలేదు. నా జన్మకు మూలమే అమ్మ నాకు కనుపించిన అవతారాలకు మూలం కూడా అమ్మే. అన్నింటికీ ఆమే మూలమని గుర్తించటమే జన్మ తరించటం", "గుర్తించటం అంటే మాటలతో కాదు. మనోవాక్కాయ కర్మల గుర్తించటం. అదే బ్రహ్మను తెలుసుకోవటం". బ్రహ్మం గారు చెప్పింది కూడ ఇదేగా. బ్రహ్మంగారు చెప్పారు, అమ్మ చూపించింది.

అమ్మ కళ్లు తుడుచుకుని మామూలుగా కూర్చుని "యేమిటి మౌలాలీ నీలో నీవు మాట్లాడుకుంటున్నావు".

మౌలాలి : యేమీలేదమ్మా! నేనుగూడ భగవంతుడ్నేనని గుర్తిస్తున్నాను. అదేగా బ్రహ్మం గారి తత్వాలలో చెప్పేది. నేనే బ్రహ్మనురా అనేగా?

అమ్మ : అయితే నీవు బ్రహ్మవై నావన్నమాట.